# అశోకుడు

## మౌర్యవంశ క్షీణత

ఆంగ్ల మూలం


డాక్టర్ రోమిల్లా థాపర్

ఆంధ్రానువాదం

డాక్టర్ బి.యస్.యల్. హనుమంతరావు



# అశోకుడు
# మౌర్యవంశ క్షీణత



ఆంగ్ల మూలం

**డాక్టర్ రోమిల్లా థాపర్**

ఆంధ్రానువాదం

**డాక్టర్ బి.యస్.యల్. హనుమంతరావు**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చి, న్యూఢిల్లీ

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజయవాడ

**ASHOKA AND THE DECLINE OF THE MAURYAS**
***Dr. Romilla Thapar,*** *Translated by : Dr. B.S.L. Hanumantharao*

ప్రచురణ నెం. : 2350/1370-2*R*
ప్రతులు : 1000
3వ ముద్రణ : అక్టోబర్, 2016
టైటిల్ డిజైన్ : గిరిధర్

**గత ముద్రణలు :**
1989, 1993

© రిజర్వ్‌డ్

**వెల : ₹ 220/-**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# ఆముఖము

**ఒ**క శతాబ్దంగా అశోకుని పాలన కాలం చరిత్రకారుల దృష్టిని ఆకర్షించ సాగింది. అశోకుని శాసనాలపై తన కృషిని వ్యాస రూపంలో ప్రిన్సెస్ 1837లో ప్రకటించినాడు. ఐనప్పటికీ 1901లో విన్సెంట్ స్మిత్ ఆ విషయాన్ని విపులంగా పరిశీలించే వరకు అశోకునిపై సమగ్రమైన గ్రంథం వెలువడలేదు.

స్మిత్ గ్రంథానికి తరచుగా పునర్ముద్రణలు రావడంతో ఆ విషయం మీద ప్రజలకు ఆసక్తి పెరిగింది. అశోకుని పాలన కాల చరిత్రపై తన కార్మైకేల్ ఉపన్యాసాలను గ్రంథ రూపంలో ఆర్.డి. బెనర్జీ 1925లో వెలువరించినాడు. దాన్ని అనుసరించి 1926లో జె.యమ్. మెక్ ఫయిల్ పరిశీలన వచ్చింది. 1928లో ఆర్. కె. ముఖర్జీ పరిశీలన గ్రంథం వెలువడింది. లూయీ డ డవాలీ వూసీ 1930లో మౌర్యులపై ఒక గ్రంథాన్ని వెలువరించినాడు. నాడు మొదలు 1946లో వచ్చిన బారువా గ్రంథాన్ని మినహాయించి 1950 వరకూ అశోకునిపై ఒక్క గ్రంథం కూడ వెలువడలేదు. అంటే భారతదేశ చరిత్రలో ఆ యుగంలో చరిత్రకారులపై ఆసక్తిపోయింది అని చెప్పడం కాదు. భిన్నంగా మౌర్యయుగంపై విశేష పరిశోధన జరుగుతూనే వుంది. కాని మౌర్య రాజ్యాంగము, మౌర్య నాణేలు, భాషాపరంగా శాసన పరిశోధన మొదలైన భిన్న అంశాలకు మాత్రమే ఆ పరిశోధన పరిమిత మవుతున్నది. ఈ పరిశోధనల సమన్వయ రూపంగానే బారువా గ్రంథం తయారయింది.

నీలకంఠశాస్త్రి, అతని సహాయకులు 1952లో "నందులు–మౌర్యులు" అనే శీర్షిక క్రింద సమర్థవంతమైన పరిశీలన వెలువరించినారు. బౌద్ధమతంలో అశోకునికి వున్న సంబంధాన్ని గురించిన బి.జి. గోఖలే పరిశీలన 1955లో వెలువడింది. ఈ విషయంపై 1956 నుండి పెక్కు గ్రంథాలు వెలువడినాయి. వీటన్నింటిలో ఎగ్గర్‌మన్‌ట్ గ్రంథం చాలా ప్రయోజనకారి. అదే సంవత్సరంలో యఫ్. కెరన్ పరిశీలన సైతం వెలువడింది. 2500ల బుద్ధ జయంతి ఉత్సవ సందర్భంలో ఎ.సి. సేన్ చేసిన పరిచయాత్మక పరిశీలన ప్రకటించడమయింది. ఇటీవల డి.సి.

సర్కార్ అశోకుని శాసనాలపై ఒక గ్రంథాన్ని ప్రచురించినాడు. ఈ విధంగా అశోకునిపై వెలువడిన గ్రంథాల జాబితాలో పెద్దదే అయినప్పటికీ మొదటి అధ్యాయంలో వివరించినట్లుగా ఉపలభ్య మవుతున్న విషయాన్ని పునః పరిశీలన చేయడానికి అవకాశం వుంది. అట్టి పునర్విమర్శయే ఈ పరిశీలనలో చేయడమయింది.

స్థల నామాలకు ఉచ్చారణ సూచికలను వాడడంలో అనురూప్యం లేకపోవడాన్ని పాఠకుడు గమనించవచ్చు. అంత ప్రసిద్ధములు కాని సంస్కృత భాషాపదాల విషయంలో సాధ్యమైనంత వరకు వాని సామాన్య రూపాల ఉచ్చారణ ప్రకారమే వ్రాయడానికే ప్రయత్నించినాను. ఆధునిక ప్రదేశాల పేర్ల విషయంలో ఉచ్చారణ సూచికలు విరుద్ధంగా ఉన్నప్పటికీ, గుర్తించడానికి సులభంగా ఉండే విధంగా ఆధునికము సర్వ సామాన్యమునైన వర్ణ క్రమాన్నే వాడినాను. ఉదాహరణకు Sanchi కి Sanci అని వ్రాయడం కేవలం పాండిత్య ప్రకర్షగా కన్పిస్తుంది. సంస్కృత పాళీ పదాలను ఏదో ఒకే భాషకు పరిమితం చేసి వ్రాయక ఆ పదాల మౌలిక రూపాలనే చాల వరకు అనుసరించినాను.

ఉపకార వేతనాల, విద్యార్థి వేతనాల రూపంలో వేరువేరు సంస్థలు నాకిచ్చిన ఆర్థిక సహాయంతో ఈ పరిశీలనను పూర్తిచేయగలిగినాను. క్రాస్బిహాల్ ఉపకార వేతనం ఇచ్చిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ విమెన్‌కి, చరిత్రలో విలియం లింకన్ షెల్లీ విద్యార్థి వేతనం ఇచ్చిన లండన్ యూనివర్సిటీ కాలేజీకి నా అభినందనలు తెలియచేస్తున్నాను.

నా పరిశోధనలో ఆధారాలను అనువదించడంలోను, చర్చల సందర్భంలోను పెక్కుమంది పండితులు నా సహాధ్యాయులు చాలా సహాయం చేసినారు. ముఖ్యంగా డాక్టర్ ఆల్‌చిన్, ఆచార్య దాలె, డాక్టర్ గూడకుంబర, డాక్టర్ మర్ లకు నా ప్రత్యేక అభినందనలు. టైప్ చేసిన గ్రంథపాఠాన్ని చదివి గ్రంథాన్ని మెరుగుపరచడానికి సూచనలిచ్చిన నా తల్లిదండ్రులకు, మిత్రులు ఆచార్య జె.డి. బెర్నాల్, డాక్టర్ సెర్జి హోర్విట్జ్, డాక్టర్ ఆంథోనీ మైకేలిస్ మిసెస్ గెర్‌ట్రూడ్ లెనీగ్రాఫ్‌లకు నా కృతజ్ఞతలు. ఈ పుస్తకానికి పటాలు వ్రాసిన సెస్టర్ జె.యఫ్. హోరాబిన్‌కు సంతోషపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. స్కూల్ ఆఫ్ ఓరియన్‌టల్ మరియు ఆఫ్రికన్ స్టడీస్ లైబ్రరీ, కామన్వెల్త్ రిలేషన్స్ ఆఫ్ లైబ్రరీ, బ్రిటీష్ మ్యూజియం లైబ్రరీల అధికారులకు ఉద్యోగి బృందాలకు నా కృతజ్ఞతలు. ఈ గ్రంథ రచన ఆద్యంతము సానుభూతిపరమైన సహాయం చేస్తూ మార్గదర్శిగా వున్న ఆచార్య ఎ.ఎల్. భాషామ్‌కు చాలా రుణపడి వున్నాను.

**– రోమిల్లా థాపర్**

# విషయ సూచిక

**1. మొదటి అధ్యాయము -**

నేపథ్యము - ఆధారాలు 1

**2. రెండో అధ్యాయము -**

బాల్య జీవితము - సింహాసనాక్రమణ కాల నిర్ణయము 22

**3. మూడో అధ్యాయము -**

సమాజము - ఆర్థిక కృషి 60

**4. నాలుగో అధ్యాయము -**

ఆంతరంగిక పాలన - విదేశ సంబంధాలు 100

**5. ఐదో అధ్యాయము -**

ధమ్మ విధానము 144

**6. ఆరో అధ్యాయము -**

తరువాతి మౌర్యులు 192


**7. ఏడో అధ్యాయము -**

మౌర్య వంశ క్షీణత 209

ఉపసంహారము 227

# అనుబంధాలు

1. అర్థశాస్త్ర రచనా కాలం 233
2. అశోకుని బిరుదులు 242
3. శాసనాలు దొరికిన స్థలాలు 244
4. మౌర్యయుగ మృణ్మయ పాత్రలు – నాణేలు 256
5. అశోకుని శాసనాలకు ఒక అనువాదము 271
6. మౌర్యయుగం నాటి కళ 291
7. ఆధారాలను గూర్చి మరోమాట 295


Ashoka's Empire
(250 B.C.)
SHAHBAZGARHI
MANSERA
ARACHOSIA
Vitasta
Asikni
Airavati
Sutudri
Sindhu
TOPRA
KALSI
INDRAPRASTHA
MIRATH
MATHURA
NIGLIVA
LALITA PATAN(KATHMANDU)
RAMPURWA
LAURIYA-NANDANGARH
LAURIYA ARARAJ
BAIRAT
(BHABRA)
Yamuna
Ganga
KASI
PRAYAGA
MAGADH
PATLIPUTRA
SANASRAM
CHAMPA
RUPNATH
SANCHI
SURASHTRA
GIRNAR
Narmada
Tapti
TAMRALIPTI
PULINDAS
SOPARA
PITIKAS
DHAULAI
(TOSALI)
Godavari
JAUGADA
RASHTRIKAS
KALINGA
ANDHRA
Krishna
MASKI
KOPBAL
SIDDAPURA
SATIYAPUTRA
KERALAPUTRA
CHOLAS
PANDYAS
Map not to Scale
Probable Boundary
Of Asoka's Empire
Pillar Edicts
Rock Edicts

## మొదటి అధ్యాయము

# నేపథ్యము - ఆధారాలు

**భా**రతదేశ చరిత్రలో క్రీ.పూ. నడిచిన 5 శతాబ్దాలలో విలక్షణము పరస్పర విరుద్ధమైన కార్యకలాపాలు పరిణామాలు జరిగినాయి. ఆ పరిణామాల నేపథ్యంలో కనిపించే సుప్రసిద్ధ వ్యక్తులలో అశోక చక్రవర్తి ప్రథముడు. భిన్న వ్యక్తులకు అశోకుడు విభిన్న రూపాలలో గోచరిస్తాడు. యుద్ధాల వల్ల ప్రజలనుభవించే కష్టనష్టాలను గుర్తించి విజయయాత్రలకు స్వస్తి చెప్పిన విజేత; మహాయోగి; మహారాజు; పరివ్రాజకుడు సమైక్యమై మూర్తిభవించిన మహనీయుడు; రాజనీతి విశారధుడు; మానవ స్వభావాన్ని అవగాహన చేసికొన్న చక్రవర్తి – అనేవి అశోకుని అనేక రూపాలలో కొన్ని మాత్రమే. నేడు మనకు లభ్యమౌతున్నది అశోకుని యథార్థ స్వరూపం కాదు. అతని నిజస్వరూపం శతాబ్దాల తరబడి పెరిగిన గాథా పరంపరల మరుగున పడిపోయింది. అందుచేత అశోకుని చరిత్రకు ఆధారాలను ఎన్నిక చేయడంలో చాలా అప్రమత్తత వహించవలె.

అశోకుడు తన యుగానికి ప్రతికూలుడుగా నిలిచినాడని కొందరి అభిప్రాయం. కాని వారిది వాస్తవిక దృష్టికాదు. నిజానికి తన యుగానికి యథార్థ ప్రతినిధియే అశోకుడు. భారతదేశ పరిస్థితుల కనుగుణంగా తన యుగ అవసరాలను గుర్తించడంలోనే

అశోకుని ఘనత ప్రతిఫలిస్తుంది. కొందరి దృష్టిలో అశోకుడు స్వీయ మత శాఖా దురభిమాని. ఇది కూడ యథార్థం కాదు. లౌకిక, పారలౌకిక ఆశయాలు రెండు అతని లక్ష్యాలైనట్లు తెలుస్తుంది. నేటివరకు అశోకుని గురించి వెలువడిన రచనలు సమీక్షించినపుడు ఒక విషయం స్పష్టమౌతుంది. బౌద్ధమతంపట్ల అతని శ్రద్ధాసక్తులను వివరించడంలో రచయితలందరు ఇంచుమించు ఒకే దృక్పథాన్ని ప్రదర్శించినారు. తన ఎనిమిదోపాలనా సంవత్సరంలో జరిపిన కళింగ యుద్ధ ఫలితంగా జరిగిన జన నష్టానికి పశ్చాత్తాపంతో కలిగిన హఠాత్పరిణామమే అశోకుని బౌద్ధమతాభిమానమని – ఆ తరువాత నీతి సూత్రాలను తూ.చ. తప్పక అనుసరించడమే అతని జీవిత లక్ష్యమని వర్ణించడం సర్వసామాన్యమైంది. మహారాజు పరివ్రాజకుడు సమైక్యమైన మహనీయుడంటూ విన్‌సెంట్ స్మిత్ అశోకుని వర్ణించినాడు. ఫ్రిడ్జ్‌కెరన్ పండితుడు మరొక ప్రయత్నం చేసినాడు. ఐహికా ముష్మికాలను గురించి నాటి భారతీయ భావాల నేపథ్యంలో అశోకుని చర్యలకు గల అంతర్ ప్రేరణలను పరిశీలించడమే అతని ప్రయత్నం. సర్వసంగ పరిత్యాగం మొదలైన విధానాల ద్వారా జీవిత బాధల నుండి విముక్తి సాధించాలన్నది నాటి భారతీయుల ఆకాంక్ష అని కెరన్ విశ్వాసం. అందుచేత సమాజం పట్ల, ప్రజలపట్ల రాజుగా తన బాధ్యతలను గుర్తించినప్పటికి ఐహిక బంధాల నుండి విముక్తి పొందడానికే అశోకుడు ప్రయత్నించినాడని, అశోకుని మనస్సులో ఈ రెంటికీ మధ్య తీవ్ర సంఘర్షణ జరిగిందని కెరన్ వివరించినాడు.

బౌద్ధమతం అశోకుని ఆకర్షించడం యథార్థమే. కాని అతనిలో అది విలక్షణము, అసాధారణమునైన హఠాత్పరిణామం కాదని మా విశ్వాసం. నాటి సామాజిక పరిస్థితులను దృష్టిలో నుంచుకొని ఆలోచించినపుడు బౌద్ధం అన్ని మతాల వంటిదికాదని స్పష్టమౌతుంది. వ్యక్తిగత విశ్వాసాలు మొదలు సాంఘిక శ్రేయస్సుల వరకు జీవితాన్ని బహుముఖంగా మార్చడానికి ప్రయత్నించిన విస్తృత మహోద్యమమే బౌద్ధం. అది సమకాలిక జీవితంలో ఆలోచనా రంగంలో వివిధ రూపాలలో ప్రతిఫలించిన సాంఘిక వైజ్ఞానిక ఉద్యమం. ఐనప్పుడు ఆలోచనాపరుడైన ఏ రాజైనా అట్టి ఉద్యమానికి సన్నిహితుడౌతాడు. ఒక అశోకుని వంటి ప్రతిభావంతుడైన చక్రవర్తికి అది ఆదర్శప్రాయమైన సాధనమే అవుతుంది. మతంపట్ల స్వీయాభిప్రాయము లేమైనప్పటికీ తన రాజకీయ ఆర్థిక అధికారం సుప్రతిష్ఠితం చేసికోవడానికి అట్టి ఉద్యమం రాజుకు బాగా ఉపకరిస్తుంది.

ప్రాచీన చారిత్రక పురుషుల జీవితాలను గురించి అనేక సమస్యలున్నాయి. వానిలో వారి వ్యక్తిగత జీవితాన్ని, వారి రాజనీతిని వేరువేరుగా నిరూపించే సమస్య చాలా జటిలమైంది. ఇటీవలి కాలంలోని రాజనీతివేత్తల జీవితాలలో ఈ రెండు విభాగాలు

విస్పష్టంగానే కన్పిస్తాయి. కాని ఉపలభ్యమౌతున్న ఆధారాలను ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానించడం వల్ల ప్రాచీన చారిత్రక వ్యక్తుల జీవిత సమస్యలకు పరిష్కారాలు అస్తవ్యస్తంగా తయారైనాయి.

ఈ సంక్షోభం అశోక చక్రవర్తిని గురించి గత అర్ధ శతాబ్దంలో వెలువడిన గ్రంథాలలో ఎక్కువగా కన్పిస్తుంది. అందుకు ముఖ్య కారణం – అశోకుని లేఖనాలకు పరిశిష్టంగా మత వాఙ్మయాధారాలు పూర్తి విశ్వాస యోగ్యాలు అని అంగీకరించడమే. ఇది చాల దురదృష్టం. మత వాఙ్మయాధారాలన్నింటిలోనూ బౌద్ధ సారస్వతం ప్రధానమైంది. అశోకుని బౌద్ధ మత స్వీకారం బౌద్ధులకు మహదవకాశం అయింది. అందుచేత బౌద్ధ రచయితలా చక్రవర్తిని అపూర్వ ఆదర్శ ధర్మమూర్తిగా చిత్రించినారు. కాని బౌద్ధ వాఙ్మయాంశాలను అశోకుని శాసనాలు పూర్తిగా బలపరచడం లేదు.

జాగ్రత్తగా పరిశీలించినప్పుడు అశోకుని శాసనాలలో రెండు రకాలున్నట్టు గ్రహిస్తాము. అందు మొదటిది : ఉపాసకుడుగా బౌద్ధ సంఘాన్నుద్దేశించి చేసిన ప్రకటనలు. ఇవి సంఖ్యలో చాలా తక్కువ. తాను బౌద్ధమతాన్ని స్వీకరించినట్లు ప్రకటిస్తూ తనకూ, బౌద్ధ సంఘానికి గల సంబంధాన్ని వివరిస్తూ అశోకుడి శాసనాలను వేయించినాడు. ఈ శాసనాలలో పరమత సహనంలేని విశ్వాసశీలి వలె అశోకుడు కనిపిస్తాడు. “భిన్న ఆచారాలను అనుసరించే పరివ్రాజకులు తపస్వినులు సంఘ బహిష్కృతులు” అని ఒక శాసనంలో స్పష్టంగా ప్రకటించినాడు. మరొక శాసనంలో ఇంతటి మత దురభిమానం కనిపించదు. ఆ శానసంలో బౌద్ధులకు ఆవశ్య పఠనీయములైన మత గ్రంథాలను నిర్దేశించినాడు.

ఇక రెండోరకం శాసనాలు సామాన్య ప్రజానీకానికి చేసిన ప్రభోధాలు. ఇవి చాలా ముఖ్యమైనవి. సంఖ్యలో చాలా ఎక్కువ. వీనిని ముఖ్య శిలాశాసనాలని, గౌణ (Minor) శిలా శాసనాలని, స్తంభశాసనాలని వర్గీకరిస్తారు. విశ్వవిఖ్యాతి గాంచిన అశోకుని ధమ్మ విధానానికి నిర్వచనం వీనిలో కన్పిస్తుంది. సంస్కృత భాషలోని “ధర్మ” అనే పదానికి ప్రాకృత రూపమే “ధమ్మ”. ఈ పదం భారతీయతకు విలక్షణమైనది. ఇతర భాషలలోనికి ఈ పదాన్ని అనువదించడం కష్టం. ఈ మాటను ఆంగ్లభాషలో నీతి అని, పుణ్యమని, సదాచారమని అనువదిస్తారు. మౌర్య యుగ పరిస్థితుల కనుగుణంగా ధర్మ విధానాన్ని రూపొందించడంలోనే అశోకుని గొప్పతనం కన్పిస్తుంది.

అశోకుని ధర్మం బౌద్ధానికి ఇంచుమించు పర్యాయపదంగా వ్యాఖ్యానించి బౌద్ధాన్ని ప్రభుత్వ మతం చేయడమే అతని కృషియైనట్లు పూర్వ చరిత్రకారులు సూచించినారు.

నిర్వాణానికి బౌద్ధమే ఏకైక మార్గమని అశోకుడు విశ్వసించినప్పటికీ బౌద్ధాన్ని ప్రభుత్వ మతం చేయడం అతని సంకల్పం కాదని నిరూపించడమే ఈ గ్రంథ ఉద్దేశం. ధర్మవిధానం సాంఘిక బాధ్యత విధానమే కాని ప్రజలందరు బౌద్ధాన్ని స్వీకరించాలనే ఆదేశం కాదు. సాంఘిక ప్రవర్తన అంటే ప్రజలలో పరస్పర స్నేహ సంబంధాలకు ప్రాధాన్యం ఇచ్చే మానసిక ప్రవృత్తిని కలిగించడమే ధర్మ విధాన లక్ష్యం. మానవుని ఔన్నత్యాన్ని గుర్తించడం ద్వారా సాంఘిక కార్యక్రమాలలో మానవతా దృష్టిని సాధించడానికి చేసిన ప్రబోధమే అశోకుని ధమ్మం.

ధమ్మ విధానాన్ని అవగాహన చేసికొనడానికి అందుకు కారణమైన పరిస్థితులను విశ్లేషణాత్మకంగా పరిశీలించడం అవసరం. నాటి సమస్యలకు పరిష్కారంగా ధమ్మం అశోక చక్రవర్తి మనస్సులోనే రూపొందింది అని చెప్పవచ్చు. అందుచే సమకాలిక స్థితి గతులను దృష్టిలో ఉంచుకొన్నప్పుడే అశోకుని విధానానికి గల పాశస్త్యాన్ని నిరూపించగలము.

ముఖ్యంగా ఆలోచించవలసింది నాటి రాజకీయ పరిస్థితి. అంటే పెక్కు చిన్న చిన్న రాజ్యాలను, గణ ప్రభుత్వాలను కలిపి సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించగా ఏర్పడిన క్రొత్త రాజకీయ పరిస్థితి. అశోకుడు సింహాసనమెక్కడానికి ఒక అర్ధ శతాబ్దం పూర్వమే అతని తాతయైన చంద్రగుప్తుడు మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించినాడు. నాటికి సామ్రాజ్య విధానం భారత రాజకీయాలకు క్రొత్త. మౌర్యులకు పూర్వం నందరాజులు సైతం సామ్రాజ్యాన్ని స్థాపించినారు. కాని నంద సామ్రాజ్యం మౌర్య సామ్రాజ్యమంత విస్తృతం కాదు. నంద సామ్రాజ్యంలో విభిన్న జాతులు కాని సంస్కృతులుగానీ లేవు. ఆ సామ్రాజ్యానికి మగధ కేంద్రం; గంగా మైదానానికి తత్పరిసర ప్రాంతాల ప్రజలకు మాత్రమే పరిమితం. సాంస్కృతికంగా ఆ ప్రజలందరిది ఆర్య నాగరికత. లేదా ఆర్య నాగరికతతో వారందరికి పరిచయముంది. మౌర్య సామ్రాజ్యం ఆర్య భారతానికి వెలపల విస్తరించింది. అందు భిన్న ఆచారాల ననుసరించే ప్రజలుండేవారు. అందువల్ల మౌర్య సామ్రాజ్యం అపూర్వమైన క్లిష్ట సమస్యలు సృష్టించింది.

పై పరిస్థితులను పేర్కొనడం ధమ్మ పరిణామంలో అశోకుని వ్యక్తిగత గుణాలను నిర్లక్ష్యం చేయడం కాదు. అశోకుని విశ్వాసాలతో పాటు సమకాలిక పరిస్థితులు సైతం ఆ విధాన నిరూపణలో తోడ్పడినవనడంలో సందేహం లేదు. మౌర్య వంశస్తులు ఏ ఒక్క మతంలోను స్థిర విశ్వాసంలేని ఉదార స్వభావులు. చంద్రగుప్తుడు జైన మతాన్ని అవలంభించినాడని అంటారు. అశోకుని తండ్రి బిందుసారుడు అజీవికులను అభిమానించినాడు. ఈ రెండు సనాతన మత శాఖలు కావు. బ్రాహ్మణ మత విశ్వాసాలకు

విరుద్ధమైనవి, కాబట్టి బ్రాహ్మణ మతాన్ని కాదని అశోకుడు బౌద్ధాన్ని పోషించడంలో వైపరీత్యం లేదు. ఇందుకు తోడు నాటి వైజ్ఞానిక సంచలనంలో గ్రీకు భావాల ప్రభావం కూడా ఉండి ఉంటుంది.

ప్రపంచ చరిత్రలో క్రీ.పూ. ఆరో శతాబ్దిని విశ్వ జిజ్ఞాసా యుగంగా పేర్కొంటారు. గ్రీసులో పైథాగరస్, చైనాలో కన్‌ఫ్యూషియస్ వంటి ప్రసిద్ధ దార్శనికులు ఆ యుగంలో అవతరించారు. వారిని పోలిన వారే భారతదేశంలో కూడా అవతరించారు. ఆ యుగంలోనే భారతదేశంలో తీవ్రమైన తాత్త్విక చర్చలు జరిగిన నిదర్శనలున్నాయి. భిన్న తాత్త్విక శాఖల ఉనికికి ఈ చర్చలు నిదర్శనం. ఆర్షములైన విలువలే కాక నూతన సిద్ధాంతాలు సహితం తీవ్రమైన సవాలుకు గురి ఐనాయి. ఉపనిషత్తుల విదగ్ధ ఆధ్యాత్మిక వాదంతో చార్వాకుల పదార్థ వాదం పోటీపడింది. సర్వత్ర సంశయాలు ప్రతిధ్వనించినాయి. వైదిక యుగ (క్రీ.పూ.900) బ్రాహ్మణ మతాధిక్యాన్ని నూతన శక్తులు ఎదిరించినాయి. పూజారుల ప్రత్యేకాధికారాలు, వారు జరిపే క్రతు కాండల సామర్థ్యం సవాలుకు గురి అయినాయి. వర్ణ వ్యవస్థలో కాఠిన్యం హెచ్చి విమర్శకు పాలయింది. న్యాయరీత్యా ద్విజన్ములే అయినప్పటికీ వైశ్యులు బ్రాహ్మణ క్షత్రియ వర్ణాల అధికారాలకు నోచుకోలేదు. అందుచేత క్రింది వర్ణాల వారు బ్రాహ్మణ మతంలో విశ్వాసం కోల్పోయి క్రొత్త మతాలను ఆదరించసాగినారు.

కరుడు గట్టిన సాంఘిక భావాలతో లౌకిక వ్యవహారాల పైని ఆధిపత్యంతో క్రీస్తు తర్వాత నాలుగో శతాబ్దంలో బ్రాహ్మణ మతం ఆధిక్యాన్ని సాధించింది. ఈ ఆధిక్యానికై క్రీ.పూ. ఆరో శతాబ్ధంలోనే ప్రయత్నాలు జరిగినాయి. కానీ నాడు విజృంభించిన వ్యతిరేక శక్తులు ఆ ప్రయత్నాలను ప్రతిఘటించినాయి. ఆ వర్గానికి బౌద్ధం నాయకత్వం వహించింది. అయితే వ్యతిరేక వర్గాలు బ్రాహ్మణ వర్గంపై పవిత్ర యుద్ధం వంటిదేమీ ప్రకటించలేదు. అందుకే ఉభయ వర్గాల మధ్య సంఘర్షణ హింసాత్మకంగా పరిణమించవలసిన పనిలేదు. కేవలం సాంఘిక అశాంతిగా రాజకీయ వ్యతిరేకతగా మాత్రమే బయల్పడగల అవకాశం వుంది.

మౌర్య యుగారంభంలో జరుగుతున్న మౌలిక ఆర్థిక పరిణామాలకు పైన పేర్కొన్న మత సాంఘిక ప్రవృత్తులకు సంబంధం వుంది. వేదయుగంలో ఆర్యులది సంచారక – పశుపాలక దశ. క్రమంగా వారు స్థిరమైన గ్రామీణ వ్యవసాయిక దశకు పరివర్తన చెందినారు. దానితో వ్యావసాయక ఆర్థిక విధానానికి లక్షణములైన భూమి శిస్తులు ఏర్పడినాయి. గ్రామాధికారులు తయారైనారు. వ్యవసాయాభివృద్ధితో వాణిజ్యం పెరిగింది.

వాణిజ్యాన్ని సాగించే వైశ్య వర్గానికి ప్రాధాన్యం హెచ్చింది. వాణిజ్యం ద్వారా ఆర్థిక ఔన్నత్యం సాధించిన వైశ్య వర్గంలో బ్రాహ్మణ క్షత్రియ వర్ణాల అన్యాయార్జితములైన ప్రత్యేక హక్కులపట్ల వ్యతిరేకత బలపడింది. నగరాలలో శ్రేణుల నిర్మాణం ఈ యుగంలో మరొక ముఖ్య పరిణామం. నగర జీవితం శ్రేణులపై ఆధార పడసాగింది. ఈ పరిణామాలవల్ల నాటి వరకు సమాజంలో గౌరవ స్థానాన్ని ఆక్రమించిన వర్గాలు తమ స్థానాన్ని రక్షించు కోవటానికి క్రొత్త శక్తులను ఎదుర్కొనవలసి వచ్చింది.

ఇక సాంస్కృతికంగా మౌర్య యుగ భారతీయ సమాజం బహుముఖాలతో ప్రత్యక్ష మౌతుంది. భిన్న వర్గాల ప్రజలు సాంస్కృతికంగా విభిన్న స్థాయిలలో ఉండేవారు. మత ఆర్థిక సాంఘిక శక్తులు ఒకదానితోనొకటి సంఘర్షణ పడుతుండేవి. అట్టి పరిస్థితులలో సామ్రాజ్య భద్రతకు – దేశంలో వాణిజ్యం మొదలైన కార్యక్రమాలు సాగటానికి ఉద్యోగుల విధి నిర్వహణ ద్వారా ప్రభుత్వ యంత్రాంగం సక్రమంగా నడవడానికి – ప్రజలను కూడగట్టగల సాధనం అవసరమని అందుకు సాంఘిక బాధ్యతలపై నొక్కిపెట్టిన ధమ్మ విధానమే మంచి సాధనమని బుద్ధి కుశలుడైన ప్రభువు గుర్తించి తీరుతాడు.

## ఆధారాలు

**శాసనాలు :**

మౌర్య యుగ భారత చరిత్రకు ఆధారాలు అపారంగా లభ్యమౌతున్నాయి. తత్పూర్వచరిత్రకుగల ఆధారాలు సమకాలికమైనవి కావు. సంఖ్యలో కూడా చాలా పరిమితం. వాని నుండి చారిత్రక సాక్ష్యాన్ని జాగ్రత్తగా సేకరించవలె. ఆ యుగాలతో పోల్చినపుడు మౌర్యయుగాన్ని గూర్చిన సమాచారం సమకాలిక రచనలలోనూ అనంతర రచనలలోనూ విస్తారంగా లభ్యమౌతూ ఉన్నది. ముఖ్యంగా అశోకయుగాన్ని గూర్చిన సమాచారం చాలా ఎక్కువ. మతసారస్వతం, నాణేలు మొదలైన అనాసక్త ఆధారాల నుండి లభ్యమయ్యే సమాచారం అటుంచి శిలలపై, శిలా స్తంభాలపై దేశ వ్యాప్తంగా అశోకుడు వేయించిన శాసనాలు అధికసంఖ్యలో లభ్యమవుతున్నాయి. ఈ శాసనాలను రెండు విభాగాలుగా చేయవచ్చు. మొదటిది ముఖ్య శిలా శాసనాలు – కాల్సీ, మాన్‌సేహరా, షెహ్‌బాజ్‌గరీ, గిర్నార్. సొపారా, ఎఱ్ఱగుడి, ధౌళి, జౌగడా అనేచోట్ల దొరికినాయి. రెండవది గౌణ శిలాశాసనాలు, ఇతర లేఖనాలు: బైరాట్, రూపనాథ్, సహస్రామ్, బ్రహ్మగిరి, గోవీమఠ్, జటింగ రామేశ్వర్, ఎఱ్ఱగుడి, మస్కీ, పాల్కిగుండు, రాజుల మందగిరి, సిద్ధపుర, ఝూన్సీ, గుజర్రా అనేచోట్ల గౌణ శిలాశాసనాలు దొరికినాయి. ఇవికాక అల్లహాబాద్, ఢిల్లీ, తోప్రా,

ఢిల్లీ, మీరట్, లౌరియా అరరాజ్, లౌరియా నందనఘర్, రామ్‌పూర్వా అనేచోట్ల స్తంభ శాసనాలు, బరాబర్, గుహలలోని మూడు లేఖనాలు, రుమ్మింగ్‌డై, నిగలీసాగర్, అల్లహాబాద్, సాంచీ, సారనాథ్, బైరాట్‌లలో మరికొన్ని శాసనాలు లభించినాయి. ఇటీవల గ్రీకు – అరమిక్ భాషలలో ఉన్న చిన్న శాసనం ఒకటి కాందహార్‌లో బయల్పడింది.

ఈ లేఖనాలు ఏ చక్రవర్తివో గ్రహించినప్పుడు మాత్రమే వాని ప్రాముఖ్యం గుర్తించడం సాధ్యమౌతుంది. వాని పైన పేర్కొన్న లేఖనాలు పెక్కింటిలో రాజు పేరుకు బదులు ప్రియదర్శి, దేవనాం ప్రియ అనే బిరుదులు మాత్రమే వున్నాయి. 1915లో బయలుపడిన మస్కీ శాసనంలో మాత్రమే చక్రవర్తి పేరుంది. అందుచేత చాలాకాలం వరకు పై లేఖనాల ప్రాముఖ్యాన్ని గుర్తించడం జరుగలేదు. వీనిని మొట్టమొదట చదివి ప్రకటించిన ప్రిన్‌సెప్ పండితుడు వానిలో బౌద్ధమత ప్రసక్తి ఉన్నందున దేవానాం ప్రియ ప్రియదర్శి రాజును సింహళాధీశుడుగా గుర్తించినాడు. ఈ విభావనలో కొన్ని లోపాలు లేకపోలేదు. ఈ శాసనకారుడు తాను బావులు త్రవ్వించినట్లు, బాటలు నిర్మించినట్లు వ్రాయించుకొన్నాడు. సింహళాధీశుడు భారతదేశంలో పై కార్యక్రమాలను నిర్వహించడం సాధ్యమా అనే ప్రశ్న ఉదయించి పై గుర్తింపునకు అభ్యంతరమేర్పడుతుంది. బౌద్ధ రచనలైన దీపవంశ, మహావంశ అనే సింహళ దేశ ఇతిహాసాలలో 1837 నుండి పరిశోధన జరిగింది. ఆ గ్రంథాలలో దేవానాం ప్రియ బిరుదం అశోకునకు మాత్రమే ఉన్నట్లు ప్రిన్‌సెప్‌కు తెలిసింది. అందువల్ల పై శాసనాలను అశోకుడే వేయించినట్లు నిర్ధారణ చేయడానికి సాక్ష్యం లభించింది. 1915లో దొరికిన మస్కీ శాసనం పై నిర్ధారణ యథార్థం అని రుజువు చేసింది.

సుప్రసిద్ధ స్థలాలలో అంటే మహానగరాలలోను, వాణిజ్యానికి జనసంచారానికి పేరొందిన రాజమార్గాలమీద, పుణ్యక్షేత్రాలలోనూ, మత ప్రాధాన్యం ఉన్న తావులలోను అశోకుడు శాసనాలు వేయించినాడు. ఆ విధంగా చేయడంలో శాసన విషయాలను సాధ్యమైనంత ఎక్కువ ప్రజా బాహుళ్యానికి పరిచయం చేయడమే అతని ఉద్దేశం. ముఖ్య శిలాశాసనాలను సాధారణంగా విశాల శిలాతలాలపై లిఖించినారు. శిలా స్తంభాలను ప్రముఖ చారిత్రక సంఘటనలు జరిగిన ప్రదేశాలలో స్మృతి చిహ్నాలుగా ప్రతిష్ఠించి ఉండవచ్చును. దురదృష్టవశాత్తు ఈ స్తంభాలలో కొన్నింటిని వాని సస్థలాల నుండి తరలించినారు. మీరట్‌లలోని స్తంభాలను ఫిరోజ్‌షా తుగ్లక్ కాలంలో ఢిల్లీకి తీసికొని పోయినారు. వానిపై నున్న లేఖనాలను చదవడం సాధ్యం కానందున ప్రజలు ఆ స్తంభాలను అత్యద్భుత వస్తువులుగా దర్శించేవారు. నేడు అలహాబాదులో నున్న స్తంభం కౌశాంబిలోనిదని అంటారు. బైరాట్ శాసనాన్ని కన్నింగ్‌హామ్ కలకత్తాకు తీసుకొని వెళ్ళినాడు. ఈ కారణం

వల్లనే పురావస్తు శాస్త్ర దృష్ట్యా ఆయా విషయాలను వాని స్వస్థలాలలో పరిశీలించడానికి సాధ్యం కావడంలేదు.

ఏడవ శతాబ్దిలో భారతదేశ పర్యటన సాగించిన చైనా యాత్రికుడైన యువాన్ చాంగ్ రాజగృహ, శావస్తి మొదలైన చోట్ల అశోకుని శిలాస్తంభాలున్నట్లు తన స్వీయ గాథలలో పేర్కొన్నాడు. వీనిలో శిల్ప ప్రధాన్యం ఉన్నవి కొన్ని. రాజశాసనాలున్నవి కొన్ని. వీనిలో ఒక్క స్తంభం కూడ నేటివరకు బయలుపడలేదు. ఫాహియాన్ అనే మరొక చైనా యాత్రికుడు బౌద్ధ గ్రంథాలను సేకరించే ఉద్దేశ్యంతో ఐదో శతాబ్దారంభంలో భారతదేశాన్ని దర్శించినాడు. సంకిసాలో సింహకిరీటం ఉన్న శిలాస్తంభము, పాటలీపుత్రం పొలిమేర్లలో రాజశాసనాలున్న స్తంభము ఉన్నట్లు ఫాహియాన్ వర్ణించినాడు. ఇవి కూడా బయల్పడలేదు. దీన్ని బట్టి మన దృష్టికిరాని అశోక స్తంభాలనేకం ఇంకా ఉండి యున్నట్లూహించడంలో పొరపాటు లేదు. ప్రజలకు ధర్మోపదేశమే ఈ శాసనాల ప్రయోజనమైనందున శిలలపైనే గాక దారువు మొదలైన ఇతర సాధనాలపై సైతము ఆ ఉపదేశ ప్రతులను అసంఖ్యాకంగా తయారు చేయించి తన సామ్రాజ్యం నలుమూలలకు అశోకుడు పంపినాడని భావించవచ్చు. కానీ సులభంగా శిథిలమయ్యే సాధనాలైనందున ఆ ప్రతులన్నీ నామరూపాల్లేకుండా నశించిపోయిన వనడంలో సందేహం లేదు.

ఉత్తర దేశంలోని మానసేహ్రా, షెహబాజ్ గరీలలోని ముఖ్య శిలా శాసనాలు ఖరోష్ఠీ లిపిలో ఉన్నాయి. ఖరోష్ఠీ లిపి పారసీక – అరమిక్ లిపి నుండి ఉద్భవించింది. ఇటీవల దొరికిన కాందహార్ శాసనం ద్విభాషా శాసనం, గ్రీక్ అరమిక్ లిపులలో వుంది. దక్షిణాపథంలోని శాసనాలలో సహా మిగిలిన శాసనాలన్నీ బ్రాహ్మీలిపిలో ఉన్నాయి. మనకు తెలిసినంతవరకు సంస్కృత, ప్రాకృత భాషలకు వాడిన లిపి బ్రాహ్మీ. తన ప్రజలలోని విద్యావంతులందరు తన శాసనాలను చదవాలనే ఆశయాన్ని స్థానిక లిపుల వాడకం సూచిస్తుంది. కాందహార్ శాసనం మినహా మిగిలిన శాసనాలన్నీ స్థూలంగా అశోకుని కాలంనాటి ప్రాకృత భాషలోనే ఉన్నాయి. అయితే ఈ భాషలో తూర్పు, పశ్చిమ ప్రాంతీయ భేదాలు లేకపోలేదు. సంస్కృత భాష అయిన ప్రాకృతాన్నే అశోకుడు వాడడం గమనించదగిన విశేషం.

అశోకునివి గాక మౌర్యయుగానికే చెందిన శాసనాలలో తక్షశిల ప్రియదర్శి శాసనాన్ని పేర్కొనవచ్చు. అరమిక్ లిపిలోనున్న ఈ శాసనం సిర్‌కాప్‌లో మౌర్యయుగానంతర అంతర్పు (Post - Mouryan Layer)లో ఒక ఇంటి గోడలో తాపడమైయుంది. ఈ శాసనాన్ని రోమేథోతో అనే ఉద్యోగి గౌరవార్థం ఇచ్చినారు. "రాజ ప్రతినిధి ప్రియ... సాయంతో

రోమేథోతో తన పదవిలో ఉన్నత స్థితిని పొందినాడు" అని శాసన సారాంశం. ఇందులో రాజ ప్రతినిధికి వాడిన బిరుదము అశోకుని ప్రియదర్శి పదాన్నే సూచిస్తుంది. కాని ఈ శాసనం అశోకుని ఉద్దేశించినదేనని నిర్ధారణ చేసి చెప్పలేము.

జలాలాబాద్ సమాపంలో కాబూల్ నది ఉత్తర తీరాన ఉన్న లంపక లేక లంఘన దగ్గర ఒక శాసన ఖండం బయల్పడింది. స్థానిక లిపులనేవాడిన అశోకుని విధానానికి అనుగుణంగా ఈ శాసనం అరమిక్ లిపిలోనే ఉంది. లిపిని బట్టి శాసన అవశిష్ట భాగంలోని మూడు వచనాలనుబట్టి లంఘన శాసనం అశోకునిదేనని నిర్ణయించవచ్చు.

గోరఖ్‌పూర్ జిల్లాలో దొరికిన సోహ్‌గౌరా తామ్రశాసనము. గోగ్రా జిల్లాలోని మహాస్థాన్ శాసనము క్షామ సమయంలో తీసుకోవలసిన నివారణ చర్యలను వివరిస్తున్నాయి. ఈ శాసనాలు క్రీ.పూ. 3వ శతాబ్దినాటి బ్రాహ్మీలిపిలో ఉన్నాయి. భాష అశోక ప్రాకృతము, అందుకే ఈ శాసనాలు మౌర్యయుగారంభంనాటివి. బహుశా చంద్రగుప్తుని పాలన కాలానికి చెందినవని చెప్పవచ్చు. చంద్రగుప్తుని కాలంలో క్షామం సంభవించిందనే అంశాన్ని జైన గ్రంథాలు బలపరుస్తున్నాయి. అంతేకాక సోహ్‌గౌరా తామ్రపత్రాలపైనున్న చిహ్నాలు నాటి విద్ధాంక నాణేల (Punch Marked Coins) పైని చిహ్నాలతో సరిపోతున్నాయి. ఈ నాణేలు మౌర్య వంశంలోని మొదటి రాజులవని భావిస్తున్నారు.

ఇవిగాక మౌర్యయుగ చరిత్రకు అశోకుని పౌత్రుడైన దశరథుని 'నాగార్జుని' పర్వతగుహా శాసనాలు, క్రీ.శ. 150 సంవత్సరం నాటి రుద్రదాముని 'జునాగర్' శాసనం ఉపకరిస్తున్నాయి. జునాగర్ శాసనంలో ప్రాసంగికంగా మౌర్యులను గూర్చిన ప్రస్తావన వుంది. ఈ శాసనాంశాలను ముందు ముందు విపులంగా చర్చిద్దాము.

**వాఙ్మయాధారాలు :**

మౌర్యయుగ చరిత్రకుపకరించే వాఙ్మయాధారాలలో బౌద్ధమత గ్రంథాలు చాల ముఖ్యమైనవి. భారతీయ బౌద్ధ గ్రంథాలలో జాతక కథలది ప్రథమ స్థానం. జాతక కథలు మౌర్యయుగంలో రచించినవి కావు. వానిలో బౌద్ధయుగం నాటి దేశ ఆర్థిక సాంఘిక పరిస్థితుల చిత్రణ కన్పిస్తుంది. స్థూలంగా ఈ పరిస్థితులే మౌర్య యుగంలో కొనసాగినాయి. నాటి రాజకీయ రంగంలో బౌద్ధ సిద్ధాంతాల ప్రభావ ప్రమాణాన్ని నిర్ణయించడానికి "దీఘనికాయ" వంటి బౌద్ధ గ్రంథ విభాగాలు తోడ్పడుతున్నాయి. ఇందుకు ఉదాహరణంగా 'చక్రవర్తి భావం' రాజకీయ సిద్ధాంతంగా రూపొందడాన్ని పేర్కొనవచ్చు. కాని ఇట్టి అంశాలను గురించి నిర్ణయాలు జరపడం పైకి కన్పించినంత సులభం కాదు. అది చాల జటిలమైన సమస్య. అందుకు కారణం ఈ గ్రంథాల రచనాకాలం సందేహాస్పదం కావడమే.

ఈ సత్యాన్ని సర్వదా గుర్తుంచుకొని నిర్ణయాలు చేయవలె. "చక్కవత్తి శిహానాదసుత్త"లో చక్రవర్తిని గూర్చిన వివరణము అశోకునకు పూర్వమే రూపొందినదా అనేది వివాదాగ్రస్తము. ఆ గ్రంథ రచన అశోకునికి పూర్వమే జరిగినచో అది అశోకునిలో చక్రవర్తి భావాన్ని కలిగించి సామ్రాజ్యాధికార సాధనకై అతణ్ణి పురికొల్పియుండవచ్చును. అశోకుని అనంతర రచనయే అయినచో అతడు సాధించిన రాజకీయాధికారమే బౌద్ధులు చర్చించిన చక్రవర్తి భావానికి ఆధారమై ఉంటుంది.

సింహళ దేశ ఇతిహాసాలైన దీపవంశ, మహావంశాలు బౌద్ధమత విస్తరణలో – ప్రధానంగా సింహళంలో బౌద్ధమతం ప్రవేశించడంలో – అశోకుని పాత్రను వర్ణిస్తున్నాయి. అందుచే ఆ గ్రంథాలను అశోకుని చరిత్రకు ఆధారాలుగా గ్రహించవచ్చు. కాని వీనిని ఉపయోగించడంలో కూడ జాగ్రత్త వహించవలె. ఈ గ్రంథ రచయితలు బౌద్ధ పరివ్రాజకులు. కేవలం సనాతన దృక్పథంతోనే అశోకుని చిత్రించినారు. క్రీ.పూ. రెండో శతాబ్దానికి కీ.శ. నాలుగో శతాబ్దానికి మధ్యకాలంలో దీపవంశ తయారైంది. దీపవంశకంటే మహావంశ చాల మెరుగైన గ్రంథం. మహావంశ సంకలనం క్రీస్తు అనంతరం ఐదో శతాబ్దంలో జరిగింది. పదో శతాబ్దంలో మహావంశంపై 'వంశత్థపకాశినీ' అనే వ్యాఖ్య తయారయింది. ఈ వ్యాఖ్యలో మౌర్య వంశాన్ని గురించిన గాథలనేకం ఉన్నాయి. ఇతర గ్రంథాలలో ఈ గాథలు కన్పించవు. ఈ గ్రంథాలేవీ మౌర్యయుగానికి సమకాలికములు కావు. అందుచేత ఇందలి గాథల వస్తువులో, రూపంలో, భావంలో మార్పులు రావటానికి అవకాశం ఉంది. కాని ఈ గ్రంథాలను సంతరించినవారు సింహళదేశ పరివ్రాజకులు. మౌర్యులకు సంబంధించిన గాథలు వారికి వైదేశికములు. వైదేశిక సాంప్రదాయాలను మార్చవలసిన సాంఘిక, రాజకీయ అవసరం స్థానికంగా సింహళ రచయితకుండదు. కాబట్టి భారతీయ గాథల యథార్థ స్వరూపం సింహళ రచనలలో సురక్షితంగా ఉందని భావింపవచ్చు.

ఇక 'దివ్యావదాన' వంటి గ్రంథాలు అశోకుని చుట్టూ పెరిగిన గాథల సంపుటాలు. విదేశాలలో ముఖ్యంగా చైనా, టిబెట్ దేశాల బౌద్ధ గ్రంథాలలో ఈ గాథలు భద్రంగా ఉన్నాయి. అశోకునిపై బౌద్ధమత ప్రభావాన్ని చాటే ఆశయంతో బౌద్ధ పరివ్రాజకులు చేసిన రచనలైనందున ఈ గాథలను సైతం అక్షరత: అంగీకరించడానికి వీలులేదు. ఈ సారస్వత విభాగంలోనిదే మరొక ముఖ్య గ్రంథం టిబెట్ చరిత్ర. దీనిని 16వ శతాబ్ది ఉత్తరార్థంలో లామాతారానాథుడు వ్రాసినాడు. దీనిలో మౌర్యులకు సంబంధించిన అనేక సంప్రదాయాలు నిగూఢంగా ఉన్నాయి.

మౌర్య యుగానికి చెందిన లౌకిక సారస్వతంలో ఏకైక ఆధారం అర్థశాస్త్రం. ఈ గ్రంథం క్రీ.శ. మూడో శతాబ్దికి చెందినదని కాబట్టి మౌర్యయుగ చరిత్రకాధారంగా

అంగీకరించరాదని ఒక వాదం వుంది. కాని మౌలికంగా అర్ధశాస్త్రం మౌర్యయుగ రచనయేనని విశ్వసించడానికి చాలా ఆధారాలున్నాయి. అర్ధశాస్త్రకారుడు మౌర్య చంద్రగుప్తుని ప్రధాని లేదా ఉపదేష్ట తరువాతి శతాబ్దాలలో అర్ధశాస్త్రం తరచు ప్రతిలేఖనానికి గురిఅయింది. అనేకమార్లు ఆ గ్రంథాన్ని సంకలనం చేసినారు అయినప్పటికీ అందలి మౌలికాంశము, మొదటి అధ్యాయాలు మాత్రం మౌర్య చంద్రగుప్తుని కాలానికో ఆ సమీప కాలానికో చెందినవనేది నిశ్చితాంశము.

అర్ధశాస్త్రంలోని మౌలికాంశాలను తదనంతర భాగాలతో వేరుచేయడం నేడు సాధ్యంగాదు. కాని అర్ధశాస్త్రంలోని పదాలకు అశోకుని శాసనాలలోని పదాలకు మధ్య కనిపించే సామ్యం మౌర్య చక్రవర్తులకు అర్ధశాస్త్రంతోటి పరిచయాన్ని సూచిస్తుంది. నాడు అమలులో వున్న రాజకీయ, ఆర్థిక భావాలను విశ్లేషణాత్మకంగా వివరించడంలోను. వానిని సమకాలిక పరిస్థితుల కన్వయించడంలోను అర్ధశాస్త్ర వైశిష్ట్యం ద్యోతకమవుతుంది. ఈ అన్వయానికి అశోకుని ఆలోచనలకు పాలన విధానానికి మధ్య సామ్యం వుంది.

పురాణాలలో మౌర్య చక్రవర్తుల పేర్ల పట్టికలున్నాయి. పురాణాలు మత బోధనలతో నిండిన గాథా సంపుటాలనడం నిజమే. అయినప్పటికీ ఆ గాథలలో అతి ప్రాచీన చారిత్రాకాంశాలు ఉన్నవనడంలో సందేహం లేదు. క్రీ.త. 4వ శతాబ్దం నుండి పురాణాల సంకలనం జరిగింది. అనంతరం తరచుగా జరిగిన ప్రతి లేఖనాలతో, ప్రక్షిప్తాలతో పురాణ పట్టికలలో రాజుల వరుసక్రమం తారుమారయింది.

ఇతర వాఙ్మయాధారాలలో ప్రాచీన, గ్రీక్, లాటిన్ భాషా గ్రంథాల నుండి గ్రహించిన విశేషాలు, మౌర్యయుగంలోను తత్సమీపకాలంలోను భారతదేశాన్ని సందర్శించిన విదేశ పర్యాటకుల అనుభవాలు పేర్కొనదగినవి. వీనిలో ముఖ్యమైనది మెగస్తనీస్ రచన. అలెగ్జాండర్ అనంతరం పర్షియా, బాబిలోనియాల నేలిన సెల్యూకస్ నికటార్‌కు మెగస్తనీస్ మిత్రుడు. ఇతడు చంద్రగుప్త మౌర్యుని ఆస్థానాన్ని దర్శించి రాజధాని పాటలీపుత్రంలో కొంతకాలం గడిపినాడు. అతని మూలగ్రంథం నశించడం చాలా దురదృష్టం. ఆ గ్రంథం నుండి గ్రహించిన ఉల్లేఖనాలు మాత్రమే, ఇతర ప్రాచీన గ్రీక్ గ్రంథాలలో మిగిలినాయి. క్రీ.పూ. మొదటి శతాబ్దిలోని ప్లినీ, రెండవ శతాబ్దివాడైన ఏరియన్ తమతమ గ్రంథాలలో మెగస్తనీస్ రచన నుండి తరచు ఉల్లేఖించినారు. ఈ ఉల్లేఖనాలలో రచయితల స్వీయభావాలు, దురభిమానాలు ప్రవేశించే అవకాశం ఉంది. అందుచేత భారతదేశ స్థితి గతులను గురించి మెగస్తనీస్ చెప్పినట్లున్న ఉల్లేఖనాలలోని అంశాలు ఎంతవరకు విశ్వాసయోగ్యాలు అనే అనుమానం కలగడం సహజం.

**వాఙ్మయాధారాల స్వభావం :**

వాఙ్మయాధారాలను చర్చించే సందర్భంలో వానిని ఉపయోగించే పద్ధతిని గురించి ఒకమాట చెప్పడం అవసరం. సమకాలిక వాఙ్మయాధారాలలో చాలా భాగం కాలగర్భంలో కలిసిపోయినవి. కొన్ని నేటికీ బయల్పడలేదనీ గుర్తుంచుకోవలె. లభ్యమైన ఆధారాలలో పెక్కు లోటుపాట్లున్నాయి. వీనిని పాండిత్యంతోగాని, క్రొత్త పరిశోధనలోగాని భర్తీ చేసుకోవలె. కొన్ని వాఙ్మయాధారాలశైలి కూడా పెక్కు సమస్యలకు కారణమౌతుంది. ఇందుకు అర్థశాస్త్రం చక్కని ఉదాహరణ. అర్థశాస్త్రం సూత్రాలలో వుంది. సాధ్యమైనంత తక్కువ పదాలను గుదిగుచ్చి ఒక సూత్రాన్ని రచిస్తారు. అందుచేత సూత్రానికి అర్థం చెప్పడం కష్టసాధ్యం.

ప్రాచీన రచనలను పరిశీలించే చరిత్రకారులను వేధించే మొదటి సమస్య సాంకేతిక పదాల భాషాంతరీకరణ. సందర్భాన్నిబట్టి మాటల అర్థాలు మారుతాయి. యుగయుగానికి, సమాజానికి సమాజానికి కూడ మాటల అర్థాలు మారుతాయి. ఉదాహరణకు ధర్మ పదానికి నిర్దిష్టమైన ఆంగ్ల పదంలేదు. క్రీ.పూ. మూడో శతాబ్ది నుండి ఆ పదానికి అర్థం మారుతూవచ్చింది.

ఒక రచన ఎంతవరకు ప్రామాణికమో గ్రహించడం కూడా ముఖ్యం. ఈ కృషిలో భాషా శాస్త్రవేత్త చారిత్రకునకు సహాయకారి కాగలడు. అంతేగాక సత్యనిరూపణకు భిన్నాధారాల నుండి లభ్యమౌతున్న ప్రతికూల సాక్ష్యాలను పరిశీలించి చూడవలె. పాటలీపుత్ర నగరాన్ని పర్యవేష్టించి దారుప్రాకారం ఉన్నట్లు మెగస్తనీస్ వర్ణించాడు. పురావస్తు త్రవ్వకాలు ఆ ప్రాకారం ఉనికిని ధ్రువపరచినాయి. పరస్పర ఆలంబనాలైన ఇట్టి సాక్ష్యాలు లభ్యం కానపుడు చరిత్రకారుడు సంభవాసంభవాలను చర్చించి సమాచారాన్ని సేకరించవలె.

ఏ ప్రయోజనాన్ని ఆశించి ఒక రచన జరిగిందో పరిశోధకుడు మనసులో ఉంచు కోవడం చాలా అవసరం. ఒక ప్రత్యేక దృక్పథాన్ని ప్రచారం చేయడమే ఆ రచన ఉద్దేశమైనపుడు ఆ ఉద్దేశాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. అశోకుని బౌద్ధ మతాభిమానాన్ని వివరిస్తూ బౌద్ధ గ్రంథాలు అతడు పూర్తిగా సంఘవశవర్తియైనట్లు చిత్రిస్తున్నాయి. కాని అశోకుని శాసనాల నుండి లభ్యమౌతున్న సాక్ష్యం అందుకు భిన్నంగా ఉంది.

గ్రీకు రచయితలు విదేశీయులని, భారతదేశాన్ని, భారతీయ ఆచారాలను వైదేశిక దృష్టితోనే పరిశీలించినారని గుర్తుంచుకోవలె. వారి రచనలలో భారతదేశం పట్ల నిగూఢంగా కనిపించే సంభ్రమాశ్చర్యాలను గౌరవభావంతో విశ్వసించకూడదు. వైదేశికములైన

అంశాలను గూర్చి వ్రాస్తున్నందున వ్యావహారికాంశాలను, కేవల కాల్పనికాలను గ్రీకు రచయితలు కలగాపులగంచేసి వ్రాసినారు.

**భౌతికావశేషాలు :**

మౌర్యయుగ భౌతికావశేషాలలో రెండు విభాగాలున్నాయి. అందు మొదటిది నాణేలు. వీనినుండి అధికంగానే సాక్ష్యం లభిస్తుంది. రెండోది పురావస్తు విశేషాలైన కళాత్మక వస్తువులు, శిల్పాలు. ఇవి పురావస్తు త్రవ్వకాలలో దొరికినాయి. నాణేలలో విద్ధాంక నాణేలు, రజతశలాక నాణేలు అని రెండు రకాలు. బాక్ట్రియన్ గ్రీకులు దండెత్తి వచ్చేటంత వరకు ఈ నాణేలు వాయువ్య భారతంలోను, గంగామైదానంలోను, దక్షిణ పీఠభూమి ఉత్తరపుటంచులలోను ప్రచారంలో వుండేవి. ఇవి భారతదేశంలో దొరికిన నాణేలన్నింటి లోను ప్రాచీనమైనవని, వీనిపై కనిపించే గుర్తులు అధికార లాంఛనాలని గట్టిగా చెప్పవచ్చు.

తక్షశిల త్రవ్వకాలు జరిగిన చాలాకాలానికి వాయువ్య భారతంలోను, గంగామైదానంలోను పురావస్తు త్రవ్వకాలు జరిగినాయి. గత పదునైదు సంవత్సరాలలో పెక్కు ప్రదేశాలలో మౌర్యయుగానికి పూర్వ అంతరువు వరకు త్రవ్వకాలు సాగించినారు. సాధారణంగా మృణ్మయ పాత్రలలోని రకాలనుబట్టి సంస్కృతీ పరిణామ దశలను నిర్ణయిస్తారు. మౌర్య యుగానికి సంబంధించినంతవరకు మృణ్మయ పాత్రలు ఒక ప్రత్యేక విశేషాన్ని సూచిస్తున్నాయి. దక్షిణ ప్రాంతం మినహాయించి మిగిలిన మౌర్య ప్రాంతాలన్నింటిలో ఉత్తరాది నల్ల మెరుగు ఉన్న (Northern black polished) కుండలు దొరికినాయి.

శిల్ప అవశేషాలు సైతం పురావస్తు సంబంధమైన ఆధారాలే. ఇవి చాల వరకు అశోక స్తంభంపై నుండే జంతు కిరీటాలు. అశోకస్తంభాలలో కొన్నింటిపై శాసనాలున్నాయి. వీనిలో ముఖ్యమైన వానిని పేర్కొందాము. రామ్ పూర్వా, బస్రాలలో శాసనాలు లేని స్తంభాలున్నాయి. రామ్‌పూర్వాలోనే మరొక స్తంభంపై ఏకసింహ కిరీటం వుంది. సాంచీ, సారనాథ్‌లలో చతుర్ముఖసింహ కిరీటాలున్నాయి. సంకిసాలో దొరికిన శిల్పంకూడ స్తంభ కిరీటమేనని భావిస్తున్నారు. ధౌళి, కాల్సీలలో శిలాతలాలపై చెక్కిన గజ శిల్పాలు సైతము మౌర్యయుగానివేనని పండితుల విశ్వాసం.

ఈ విధంగా బహువిధములైన ఆధారాలు విశేషంగా లభ్యమౌతున్నందున మౌర్యయుగం పెక్కుమంది చరిత్రకారులను ఆకర్షించింది. తత్ఫలితంగా మౌర్య చరిత్రలో విశేష పరిశోధన జరిగింది. అయినంతమాత్రాన క్రొత్త చరిత్రకారులు నిరుత్సాహ పడవలసిన పనిలేదు. మౌర్యుల చరిత్రలో అపరిష్కృతంగా వున్న సమస్యలు లేకపోలేదు. కొత్త

చరిత్రకారుల పరిశోధనలు, వ్యాఖ్యానాలు ఆ సమస్యలకు సరియైన సమాధానాల నీయవచ్చు. చారిత్రక దృక్పథంలో వచ్చే మార్పుల వల్ల పాత విషయాలకే సప్రమాణములైన కొత్త వ్యాఖ్యానాలు సాధ్యం కాగలవు. ఇట్టి మార్పులు కేవలం సాధ్యమే కాదు, అవసరం కూడాను. చరిత్ర సజీవమైన విజ్ఞానశాఖ. అందుచే సప్రమాణమైన విశ్లేషంవల్ల చారిత్రక పరిజ్ఞానం పెరుగుతూనే వుంటుంది. ఒకే చారిత్రక విధాన పరిధిలో సహితం భిన్నాంశాలకు ప్రాధాన్యం ఇస్తూ, విశ్లేషనాత్మకమైన పరిశీలన సాగించడం సాధ్యం అవుతుంది.

## పూర్వ చరిత్ర

అశోకుని చరిత్రకు నేపథ్యంగా అతనికి పూర్వం జరిగిన సంఘటనలను పునర్నిర్మించడం అవసరం. ఈ పునర్నిర్మాణం అశోకుని చరిత్రకు సంపూర్ణత్వాన్ని చేకూరుస్తుంది. బ్రాహ్మణ యువకుడైన కౌటిల్యుడు నంద వంశాన్ని నిర్మూలించినాడని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ సంఘటన అనంతరమే మౌర్యులు రంగస్థలంపై ప్రవేశించినారు. అజ్ఞాత దశ నుండి పైకి వచ్చిన కారణంగా మౌర్యుల జన్మవృత్తాంతాన్ని గురించి అనేక గాథలు ప్రచారమైనాయి. ఒక గాథ ననుసరించి మౌర్య పదం 'మురా' అనే పదం నుండి వచ్చింది. 'మురా' నందరాజు భార్య. మౌర్య వంశస్థాపనకు ఈమె తల్లి లేక ముత్తవ్వ కారణం. పురాణాలు మాత్రం నంద, మౌర్య వంశాలను ముడిపెట్టవు. అందుకు బహుశా నందులు శూద్రులు కావటమే కారణం కావచ్చు. కాని మౌర్యులను సయితం పురాణాలు "శూద్రప్రాయాస్త్వధార్మిక్యా" (శూద్రసములు, అధార్మికులు) అంటూనే వర్ణిస్తున్నాయి. ఈ వర్ణనలు మౌర్యుల సనాతరేతర సానుభూతులను సూచిస్తున్నవని చెప్పవచ్చు. ప్రాచీన గ్రీకు రచయితలకు చివరి నందుడైన 'అగ్రేమ్స్' సుపరిచితుడే. ఆ రచయితలు చంద్రగుప్తుని అజ్ఞాత జన్మను గూర్చి ముచ్చటించినారే కాని 'అగ్రేమ్స్'తో అతనికి సంబంధం ఉన్నట్లు చెప్పలేదు.

బౌద్ధ రచయితలు బుద్ధుని శాక్యజాతితో మౌర్యవంశాన్ని ముడిపెట్టటానికి ప్రయత్నించినారు. మౌర్యుల నివాసం మయూరాలకు ప్రసిద్ధియని, అచటి శిలలు సయితం మయూరకంఠ వర్ణం కలవని అందుచేతనే 'మోరియులు' (సంస్కృత 'మౌర్య')గా ప్రసిద్ధులైనారని వ్రాసినారు. శాక్యులతో మౌర్యులకు సంబంధం కలపటానికై చేసిన ప్రయత్నానికి చాల చిత్రమైన ప్రయోజనం వుంది. ఈ సంబంధంతో అశోకుని వంశానికి సాంఘిక ఔన్నత్యం చేకూరింది. అశోకుని కుమారుడైన మహేంద్రుడే సింహళానికి వెళ్ళిన మొట్ట మొదటి బౌద్ధమత ప్రచారకుడు. పై ప్రయత్నంవల్ల బుద్ధునకు మహేంద్రునకు సన్నిహిత సంబంధం నిరూపితమైంది.

చంద్రగుప్తుడు ఉత్తరాపథానికి, బహుశా గాంధార జనపథానికిగాని తక్షశిల ప్రాంతానికి గాని చెందినవాడని కొందరు సూచిస్తున్నారు. నిజానికి అతని విద్యాభ్యాసము, సైనిక శిక్షణ, బాంధవ్యాలు – అన్నీ ఆ ప్రాంతానివే. ఖరోష్ఠీ లిపికారులను 'అఖమీనిడ్' శిల్పులను మౌర్యులు నియమించడంకూడ పై సూచనను బలపరుస్తున్నది. కాని చంద్రగుప్తుడు నందవంశాన్ని నిర్మూలించినాడు. అందుకు అతనికి మగధతో సంబంధం ఉండి ఉండ వలెనని మా అభిప్రాయం.

క్రీ.శ. 150 నాటి రుద్రదాముని 'జునాగర్' శాసనంవల్ల పుష్యగుప్తుడనే వైశ్యుడు చంద్రగుప్తుని రాజ ప్రతినిధి అని తెలుస్తుంది. చంద్రగుప్తునకు పుష్యగుప్తుడు బావమరిది అనే వాదం కూడ వుంది. బావమరిదిని తన సామ్రాజ్య పశ్చిమ రాష్ట్రంపై అధికారిగా చంద్రగుప్తుడు నియమించడం అసంభవంకాదు. వైశ్యులు ధరించే గుప్తనామాంతంవల్ల చంద్రగుప్తుడు వైశ్యుడనే సూచన వుంది. మౌర్యులు హీనకులజులనే సంప్రదాయాన్ని ఈ సూచన బలపరుస్తుంది. కాని గుప్తనామాంతాన్ని బ్రాహ్మణ వైశ్య వర్ణాలవారు ఉభయులు వాడుకున్నారు.

చాణక్యుడనే కౌటిల్యుడు చంద్రగుప్తుని మూర్ధాభిషిక్తుని చేయునని పురాణాలు చాటుతున్నాయి. అనంతరం కౌటిల్యుడే చంద్రగుప్తుని ప్రధాని అయినాడు. మగధ సింహాసనాన్ని ఆక్రమించడానికి చంద్రగుప్తుడు చేసిన తొలి ప్రయత్నాలకు కౌటిల్యుడే ప్రేరణయని ఇతర ఆధారాలవల్ల సయితం తెలుస్తుంది. ఈ సంఘటనను గురించి శతాబ్దాలుగా అనేక గాథలు తయారయినాయి. చంద్రగుప్తుడు రాజకీయ ప్రాముఖ్యం వహించడానికి అలెగ్జాండర్ దండయాత్రకు సంబంధం వుంది. అలెగ్జాండర్ చంద్రగుప్తుల సమావేశాన్ని ప్రాచీన గ్రీకు రచనలు వర్ణిస్తున్నాయి. అలెగ్జాండర్ తిరోగమనంతో వాయువ్య సరిహద్దు భూములలో గ్రీకు అధికారం భగ్నమై ఆ ప్రాంతంలో చంద్రగుప్తుడు బలబడటానికి అవకాశం కలిగింది.

## కాలనిర్ణయము

మౌర్య వంశం మొత్తం 137 సంవత్సరాలు పరిపాలిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. చంద్రగుప్తుడు 24 సంవత్సరాలు, బిందుసార అశోకులు 25, 36 సంవత్సరాలు పరిపాలించిన తర్వాత దుర్బలులైన రాజులను పురాణాలు పేర్కొంటున్నాయి. 'మహావంశ' ప్రకారం చంద్రగుప్త బిందుసారులు క్రమంగా 24, 28 సంవత్సరాలు పాలించిన తదుపరి నాల్గు సంవత్సరాల అరాజకం జరిగిన అనంతరం 37 సంవత్సరాలు అశోకుడు రాజ్యమేలినాడు. ఇదే పట్టికను 'దీపవంశ' కూడా పేర్కొంటున్నది.

మౌర్యవంశ కాలనిర్ణయం బుద్ధుని మహాపరినిర్వాణంపై ఆధారపడి ఉంది. బౌద్ధ వాఙ్మయంప్రకారం, సింహళ ఇతిహాసాల ప్రకారం మహాపరి నిర్వాణానంతరం 218 సంవత్సరాలకు అశోకుడు సింహాసనం అధిష్టించినాడు. అయితే మహాపరి నిర్వాణానికి క్రీ.పూ. 544, 486, 483 అనే మూడు విభిన్న తేదీలున్నాయి. వీనిలో 544 అనేది ఇటీవలి కల్పన. ఇతర ఆధారాలేవీ ఈ తేదీని బలపరచడంలేదు. 11వ శతాబ్దంనాటి సింహళ ఇతిహాసాలు మాత్రం ఈ తేదీని అంగీకరించినాయి. అంతకు పూర్వ రచనలలో మిగిలిన రెండు తేదీలే కన్పిస్తున్నాయి. ఎక్కువగా క్రీ.పూ. 483వ తేదీనే అంగీకరించడం జరుగుతున్నది. ఈ తేదీ భారతీయమని, మహేంద్రుని రాకతో సింహళంలో ప్రవేశించినదని 'ఫ్లీట్' పండితుడు వ్రాసినాడు. క్రీ.పూ. 486 కాంటన్ చుక్కల గ్రంథంతో సరిపోతుంది. ఈ మూడు తేదీలేగాక మరికొన్ని కూడా ఉన్నాయికాని, వానికి బలమైన సాక్ష్యాధారాలు లేవు.

క్రీ.పూ. 544 తేదీని పూర్తిగా ఉపేక్షింపవచ్చు. ఆ తేదీ ననుసరించి లెక్కవేసినచో చంద్రగుప్తుని కాలం క్రీ.పూ. 388 అని నిర్ణయమౌతుంది. చంద్రగుప్త అలెగ్జాండర్ల సమావేశానికి, నికటార్ చంద్రగుప్తుల బాంధవ్యానికి ఆ తేదీ ఆటంకమౌతుంది. నికటార్‌తో చంద్రగుప్తుని బాంధవ్యాన్ని రుజువు చేసే నిర్దుష్టమైన సాక్ష్యం ఉంది. అంతేకాక పై తేదీవల్ల అశోకుని శిలాశాసనంలోని గ్రీకు రాజులతో అతని సమకాలీనతకు ప్రతిబంధక మేర్పడుతుంది. అందుచేత మౌర్యుల కాలాన్ని మిగిలిన రెండు తేదీలు ఆధారంగా నిర్ణయించవలసి ఉంది.

సింహళ ఇతిహాసాలు ఆధారంగా మౌర్య చక్రవర్తులకు ఈ క్రింది తేదీలను నిర్ణయిస్తున్నాము. మహాపరినిర్వాణము క్రీ.పూ. 483లో జరిగిందని గ్రహిస్తే చంద్రగుప్తుని పరిపాలన క్రీ.పూ. 321లో ప్రారంభమౌతుంది. 297లో బిందుసారుడు సింహాసనము అధిష్ఠిస్తాడు. బిందుసారుని మరణానంతరం నాలుగు సంవత్సరాల అరాచకము తరువాత 265లో అశోకుని పట్టాభిషేకం జరుగుతుంది. మహాపరి నిర్వాణానికి క్రీ.పూ. 486 అంగీకరిస్తే పై తేదీలను మూడు సంవత్సరాలు చొప్పున వెనుకకు జరుపవలె. ఈ లెక్క ప్రకారం చంద్రగుప్తుని సింహాసనాక్రమణకు 324, 321 అనే సబబైన రెండు తేదీలు. బిందుసారునకు 300, 297 అనే తేదీలు సాధిస్తున్నాము. కాని అశోకుని రాజ్యారంభానికి మాత్రం పెక్కు తేదీలున్నాయి. అందుకు కారణం బిందుసారుని పాలన కాలాన్ని గూర్చి భిన్న ఆధారాల మధ్య అంగీకారం లేకపోవడమే. అతని పాలన కాలం 28 సంవత్సరములని, 27 అని, 25 అని చెబుతున్నాయి. నాల్గు సంవత్సరాల అరాజకాన్ని మనస్సులో

ఉంచుకొని ఈ తేదీలు ఆధారంగా గుణించి అశోకుని రాజ్యారంభ కాలానికి క్రీ.పూ. 271, 269, 268, 265 అనే తేదీలను భిన్న రచయితలు సూచిస్తున్నారు.

ఈ తేదీలలో క్రీ.పూ. 271 పూర్తి అసంభవమైనదిగా కన్పిస్తున్నది. దాన్ని అంగీకరిస్తే అశోకుని పాలన కాలంలోని సంఘటనల మధ్య పరస్పర సమకాలీనతకు భంగం వాటిల్లుతుంది. ముఖ్యంగా పదమూడో శిలాశాసనం పేర్కొన్న గ్రీకు రాజులైదుగురితో అశోకుని సంబంధానికి ప్రతిబంధకమేర్పడుతుంది. ఇక ఇతర సంఘటనలను పరిశీలించే సందర్భంలో ఇటీవల 'ఎగర్మంట్' పండితుడు తన గ్రంథంలో పేర్కొన్న సాక్ష్యమును గుర్తుంచుకోవలె. అశోకుడు బౌద్ధ క్షేత్రాలను దర్శించినాడని ఆ తీర్థ యాత్రకు ముందు సూర్యగ్రహణం సంభవించినదని 'దివ్యావదాన' వల్ల తెలుస్తుంది. తన 21వ పాలన కాలంలో "రుమ్మిండై బౌద్ధ క్షేత్రాన్ని అశోకుడు దర్శించినాడని, 'రుమ్మిండై' శాసనంలో ఉంది. సూర్యగ్రహణం క్రీ.పూ. 249లో వచ్చిందని పండితులు గుణించినారు. చక్రవర్తి సాగించిన తీర్థయాత్రకు అవసర సన్నాహాలు చేయడానికి కొంత సమయం పట్టి ఉంటుంది. కాబట్టి ఈ సూర్యగ్రహణ సాక్ష్యం 266, 265 తేదీలను పరిహరిస్తున్నది. ఇక క్రీ.పూ. 269, 268లోనే అశోకుడు సింహాసనం అధిష్ఠించినట్లు నిర్ణయించవలె.

పై వివరణ ననుసరించి ఈ క్రింది కాలక్రమం ప్రస్తుతమౌతున్నది :

| | |
|---|---|
| చంద్రగుప్తుడు | క్రీ.పూ. 324 |
| బిందుసారుడు | క్రీ.పూ. 300 |
| (28 పాలన సంవత్సరములు - 272లో మరణించినాడు) | |
| అరాజకం | 4 సంవత్సరాలు |
| అశోకుడు | క్రీ.పూ. 269 - 268 |
| 13వ శిలాశాసనం | క్రీ.పూ. 256 - 255 |
| సూర్యగ్రహణం | క్రీ.పూ. 249 |

మహాపరి నిర్వాణం 483లో జరిగినట్లు గ్రహిస్తే ఈ క్రింది క్రమం వస్తుంది.

| | |
|---|---|
| చంద్రగుప్తుడు | క్రీ.పూ. 321 |
| బిందుసారుడు | క్రీ.పూ. 297 |
| (పాలనకాలం 25 సంవత్సరాలు. 272 లో మరణించినాడు) | |
| అరాజకం | 4 సంవత్సరాలు |
| అశోకుడు | క్రీ.పూ. 268 |

ఈ రెండు కాలక్రమాల ననుసరించి క్రీ.పూ. 269-68లో అశోకుడు సింహాసన మెక్కినట్లు స్పష్టమవుతుంది. ఆ సంవత్సరం మహాపరి నిర్వాణానంతరం 218 సంవత్సరాలకు

సరియైనచో మహాపరి నిర్వాణం 483లో కాక 486లో జరిగినదనడం ఎక్కువ సమంజసం. పౌరాణిక కాలక్రమాన్ని అనుసరించి బిందుసారుడు 25 సంవత్సరాలు పాలించినాడని గ్రహిస్తే చంద్రగుప్తుని తేదీ క్రీ. పూ. 321 అవుతుంది. ఇది మహాపరి నిర్వాణానికి 486 తేదీతో సరిపోతుంది. అయితే పురాణాలు నాలుగు సంవత్సరాల అరాజకాన్ని ప్రస్తావించడం లేదు. పురాణాలు వంశపాలనా కాలాన్ని పూర్తిగాను చక్రవర్తుల పాలన కాలాలను ఇస్తున్నవిగాని చక్రవర్తికి చక్రవర్తికి మధ్యనున్న కాల వ్యవధిని ఇవ్వడం లేదు. ఇది పురాణాలవల్ల లభిస్తున్న సమాచారంలోని పెద్దలోపం. చంద్రగుప్తుని జీవితంలోని సంఘటనలను పరిశీలిస్తే అతని పాలనారంభానికి క్రీ. పూ. 321 సరియైన తేదీగా కనిపిస్తుంది. నందవంశంపై తిరుగుబాటు సాగిస్తూనే చంద్రగుప్తుడు 326 – 325లో అలెగ్జాండరును కలిసినట్లు తెలుస్తుంది. అనంతరం ఒక్క సంవత్సరంలోనే పెద్ద సైన్యాన్ని సమకూర్చుకొనగలిగినాడనేది సంభవం కాదు. అందుకు నాలుగైదు సంవత్సరాల కాలం పట్టి ఉంటుందనడం సమంజసం కాగలదు.

## చంద్రగుప్తుడు

అలెగ్జాండర్ తిరోగమనంలో ప్రత్యేకించి క్రీ. పూ. 323లో అతడు సింధునదీ పరీవాహప్రాంతంలో గ్రీకు అధికారం దుర్భలమైంది. అచటి ప్రభువుల దృష్టి స్థానిక రాజకీయాలకు మాత్రమే పరిమితమైనందున తూర్పు భారతంలో చంద్రగుప్తుడు తన బలాన్ని పటిష్టం చేసుకోడానికి అవకాశం చిక్కింది. ఉత్తరప్రాంత రాజ్యాలు క్రమంగా విచ్ఛిన్న మవుతున్నందున ఆ రాజ్య భాగాలను సైతం ఆక్రమించటానికి వీలయింది. అటునుండి దక్షిణంగా మధ్య భారతానికి విస్తరించి క్రీ. పూ. 313 నాటికి చంద్రగుప్తుడు అవంతిని ఆక్రమించినాడు. తిరిగి క్రీ.పూ. 305 నాటికి సెల్యూకస్‌ను ప్రతిఘటించడానికయి ఉత్తరోన్ముఖుడైనాడు. క్రీ.పూ. 303లో జరిగిన సంధితో సెల్యూకసుతో యుద్ధం పరిసమాప్తమయింది. సరిహద్దు గ్రామాలపై దాడులతో చంద్రగుప్తుని మగధ రాజ్యాక్రమణ ప్రారంభమైంది. అతడనుసరించిన విధానాన్ని గురించి ఒక కథ వుంది. “వేడిరొట్టె అంచులను త్రుంచి తినడానికి బదులు మధ్యభాగాన్ని తినే ప్రయత్నంలో చేతులు కాల్చుకున్న తన దౌహిత్రునకు ఒక అవ్వ ఇచ్చిన సలహాతో ప్రభావితుడై చంద్రగుప్తుడు సామ్రాజ్య సరిహద్దు భాగాలను ముందుగా జయించి అనంతరం కేంద్ర భూములపై దాడిచేయ సంకల్పించినాడు.” అనేది ఆ కథలోని సారాంశము. సైనికబలంతోనే చంద్రగుప్తుడు సామ్రాజాన్ని సుస్థిరం చేసుకొన్నాడు. చంద్రగుప్తునకు గొప్ప సైనిక బలం ఉన్నట్లు గ్రీకు

రచనలు కూడా వర్ణిస్తున్నవి. మౌర్యుల సైనిక విజయాలను బట్టి ఆలోచిస్తే వారికి అపారమైన సైన్యం ఉన్నట్లు బోధపడుతుంది.

సెల్యూకసుతోడి సంధి ద్వారా చంద్రగుప్తునకు వాయువ్యప్రాంతంలో సంక్రమించిన భూభాగాలేమో స్పష్టంగా చెప్పలేము. అవి గ్రెడోషియా, ఆరకోషియా, ఏరియా, పెరోమిషదే ప్రాంతాలు కావచ్చునని సూచన మాత్రం లభిస్తున్నది.

చంద్రగుప్తుడు భారతదేశ సమైక్యాన్ని సాధించడానికి పూనుకొన్నాడని కొందరు చరిత్రకారులు చేస్తున్న సూచన కేవలం అపోహ మాత్రమే. భారత ఉపఖండాన్ని సమైక్యంగా దర్శించే జాతీయ భావం మౌర్యుల కాలానికి ఉదయించలేదు. అందుచే నాటికి సైనిక బలం, పరిపాలనా సామర్థ్యం మాత్రమే దేశసమైక్యానికి సాధనాలు. చంద్రగుప్తుడు నిశిత రాజకీయ వైదగ్ధ్యం వున్న వాడనటంలో సందేహం లేదు. రాజకీయ ఆశయాన్ని సాధించటంలో అసాధారణ బుద్ధికుశలుడు, అపరిమిత లౌక్యుడునైన కౌటిల్యుడు ఉపదేష్టగా లభించడం చంద్రగుప్తుని అదృష్టం.

చంద్రగుప్తుని ఆస్థానానికి పశ్చిమ రాజ్యాలకు మధ్య సన్నిహిత సంబంధాలున్నట్లు తెలుస్తుంది. క్రీ. పూ. 303లో సెల్యూకస్‌తో చేసుకొన్న సంధి ప్రకారం చంద్రగుప్తుడు అతని కుమార్తెను వివాహమాడినాడు. గ్రీకు రాకుమార్తె తన పరివారంతో మౌర్యాంతఃపురాన్ని చేరి వుంటుంది. మౌర్య ఆస్థానంలోని కొందరు ఉద్యోగులకు కూడ గ్రీకు భార్యలు ఉండి వుండవచ్చు. మెగస్తనీసు మౌర్య ఆస్థానంలో రాయబారిగా కొంతకాలం గడిపినాడు. గ్రీకు – మౌర్య రాజ్యాల మధ్య మరికొన్ని రాయబారాలు కూడ నడిచి వుంటాయి. వాజీకరణౌషధాలు మొదలైన కానుకలను పరస్పరం పంపుకున్నారు. పాటలీపుత్ర నగరపాలక సంఘంలో విదేశీకుల సంక్షేమానికై ఒక పంచాయితీ ప్రత్యేకంగా వుండేది. పాటలీపుత్రంలో నాడు విదేశీయులు అధికసంఖ్యలో వుండేవారని ఈ పంచాయితీ సూచిస్తుంది.

తన పాలనకాలం చివరలో చంద్రగుప్తుడు జైనమతం స్వీకరించినాడని పరిశిష్టపర్వం ద్వారా తెలుస్తుంది. మగధలో పండ్రెండు సంవత్సరాలపాటు క్షామం సంభవించినదని కూడ అదే గ్రంథం చెబుతున్నది. క్షామ నివారణోపాయాలను వివరిస్తున్న సోహ్‌గౌరా, మహాస్థాన్ శాసనాలు ఈ క్షామాన్ని ధృవపరుస్తున్నాయి. క్షామం సంభవించటంతో తన కుమారుడైన సింహసేనునకు రాజ్యం అప్పగించి జైనాచార్యుడైన భద్రబాహునితో శ్రావణబెళగొళచేరి సనాతన జైనసంప్రదాయం ప్రకారం ప్రాయోపవేశం చేసి చంద్రగుప్తుడు మరణించినాడని జైనగ్రంథాలు చెబుతున్నాయి. సింహసేనుడనేది బిందుసారుని నామాంతరమై ఉంటుంది.

## బిందుసారుడు

తండ్రి మరణానంతరం క్రీ. పూ. 297లో బిందుసారుడు సింహాసనమధిష్టించినాడు. బిందుసార అనే పేరు బౌద్ధ ఐతిహాసికుల ఊహాకల్పనలకు మంచి అవకాశం ఇచ్చింది. ఆ పేరులోని రెండు మాటలు (బిందు+సార) ఆధారంగా కథ ఒకటి బయలుదేరింది. ఆ కథ : చంద్రగుప్తునకు కౌటిల్యుడు ప్రతినిత్యము స్వల్పంగా విషసిక్తమైన భోజనం పెట్టించి క్రమంగా అతణ్ణి విషసిద్ధునిగా చేసినాడు. గర్భవతిగానున్న పట్టమహిషి ఒకనాడు చంద్రగుప్తునకుద్దేశించిన భోజనం నుండి ఒక ముద్ద తీసుకొని తినసాగింది. అది కంఠగతమవుతుండగా కౌటిల్యుడు చూచినాడు. గర్భస్థ శిశువును రక్షించడానికి మార్గాంతరం లేక మహారాణీ శిరస్సును ఖండించి పిండాన్ని మేక పొట్టలో భద్రపరచినాడు. నవమాసములు నిండి జన్మించిన బాలుని శరీరం నిండా మచ్చలు కన్పించినాయి. అందుచే అతను "బిందుసారు"డని ప్రసిద్ధుడైనాడు.

గ్రీకు గ్రంథాలు బిందుసారుని 'అమిత్ర ఖేట్సు' అని ప్రశంసిస్తున్నాయి. 'అమిత్ర ఖేట్సు' అనే మాట 'అమిత్ర ఖాద' (శత్రు భక్షకుడు లేక, 'అమిత ఘాత' (శత్రు విధ్వంసకుడు) అనే పదానికి గ్రీకు రూపం. శాంద్ర కొట్టోస్ కొడుకైన అమిత్ర ఖేట్సు ఆస్థానానికి సిరియా రాజైన మొదటి యాంటియోకస్ తన రాయబారిగా డీమేఖస్‌ను, ఈజిప్టు రాజైన ఫిలడల్ఫస్ రెండో టాలమీ (కీ. పూ. 285-267) ఒక రాయబారిని పంపినట్టు స్ట్రాబో' పేర్కొనినాడు. అయితే ఈజిప్టు రాయబారి బిందుసారుని ఆస్థానంగాని, అశోకుని ఆస్థానంగాని దర్శించి ఉండవచ్చు. మధువును, అత్తిపళ్ళను, ఒక దార్శనికుని తన వద్దకు పంపవలసిందిగా అమిత్ర ఖేట్సు మొదటి యాంటియోకస్‌ను కోరినట్లు 'హెగండర్' ఆధారముగా మూడో శతాబ్దివాడైన 'ఏథీనియన్' వ్రాసినాడు.

ప్రాచీన బౌద్ధ గ్రంథాలలో బిందుసారుని గూర్చిన ప్రస్తావన ఎక్కువగా లేదు. అందుకు కారణం బిందుసారునకు బౌద్ధ మతంపట్ల ఎక్కువ ఆసక్తి లేకపోవడమే. అతని ఆస్థానంలో ఆజీవిక దైవజ్ఞుడున్నట్లు తెలుస్తున్నది. దీనిని బట్టి ఆజీవికుల పట్ల బిందుసారుడెక్కువ శ్రద్ధ వహించినాడని స్పష్టమవుతున్నది. ఈ దైవజ్ఞుడే అశోకుడు జన్మించినపుడు అతను చక్రవర్తి కాగలడని జోస్యం చెప్పినాడు.

'అమిత్ర ఘాత' బిరుదం బిందుసారుడనేక విజయ యాత్రలను సాగించినాడని సూచిస్తుంది. సరియైన ఆధారాలు లేనందున కేవలం 'నేతి నేతి' విధానం ద్వారానే బిందుసారుని చరిత్రను గ్రహించవలె. దక్షిణా పథాన్ని మౌర్యులెప్పుడు జయించినది స్పష్టంగా చెప్పలేము. చంద్రగుప్తుడు దక్షిణా పథాన్ని జయించెనని చెప్పడానికి స్పష్టమైన

ఆధారాలు లేవు. తమిళ సారస్వతంలో మౌర్యుల దక్షిణ దేశ ఆక్రమణను గూర్చిన సూచన ఉంది. కాని అది ఏ రాజు కాలంలో జరిగినది చెప్పలేము. 'తగ బెణా' నదీ తీరంలో మెగస్తనీస్ యోగులను దర్శించినాడని ఒక ప్రాచీన క్రైస్తవ గ్రంథంలో ఉల్లేఖితమైంది. 'తగబెణా' నదిని తుంగభద్రా నదిగా 'మిక్రిన్ డిల్' పండితుడు గుర్తించినాడు. ఈ గుర్తింపు సరియైనదే అయినప్పటికీ చంద్రగుప్తుని సామ్రాజ్యం తుంగభద్రా నది వరకు విస్తరించినదని గ్రహింప నక్కరలేదు. ఫాహియాన్,యువాన్ చాంగ్‌లవలె దేశం నలుమూలల అంటే మౌర్య సామ్రాజ్యం వెలుపల సైతం మెగస్తనీస్ పర్యటించి యుండవచ్చును. యోగులను దర్శించాలనే ఉత్సుకత మెగస్తనీస్‌ను దేశాటనానికి పురికొల్పి ఉంటుంది. ఉత్తర దేశ వ్యవహారాలలో నిమగ్నుడైన చంద్రగుప్తునకు దక్షిణ దేశ దండయాత్ర సాగించటానికి అవకాశం ఉన్నట్లు కనిపించదు.

అశోకుడు ఒకే ఒక దండయాత్రను జరిపి కళింగ యుద్ధం చేసినట్లు శాసనాలలో చెప్పినాడు. దక్షిణ దేశంపై దండెత్తినచో చెప్పుకొని ఉండేవాడే. కాని అతని శాసనాలు మైసూరు వరకు విస్తరించి ఉన్నాయి. బిందుసారుడు పదునారు రాజ్యాలను జయించి ఉభయ సముద్రాల మధ్య తన సామ్రాజ్యాన్ని విస్తరింప జేసినట్లు తారానాధుడు వ్రాసినాడు. కాని దీనివల్ల బిందుసారు డాక్రమించింది దక్షిణాపథం ఎగువ భాగం మాత్రమేనని సూచిత మౌతుంది. చంద్రగుప్తుడు రాజ్య పరిత్యాగం చేసి జైన పరివ్రాజకుడైనాడనే గాధ యథార్థమే అయితే అతడు మౌర్య సామ్రాజ్యం వెలుపలనే పర్యటించినాడనటం సమంజసం. తన తండ్రి పరివ్రాజకుడై తన సామ్రాజ్యంలోనే పర్యటించడం బిందుసారునకు వ్యాకుల కారణమై ఉండేది.

క్రీ. పూ. 273–272 సంవత్సరంలో బిందుసారుడు మరణించి వారసత్వ యుద్ధం ప్రారంభమై నాలుగు సంవత్సరాలు జరిగింది. అనంతరం క్రీ. పూ. 269–68 లో బిందుసారుని వారసుడుగా అశోకుడు పట్టాభిషిక్తుడైనాడు.

## రెండో అధ్యాయము

# బాల్య జీవితము - సింహాసనాక్రమణ - కాలనిర్ణయం

అశోకుని జన్మ వృత్తాంతాన్ని గూర్చి అత్యద్భుత భావనలనేకం ఉన్నాయి. వాటన్నింటిలో అతని తల్లిగాని, మాతా మహిగాని గ్రీకు రాకుమారి అనే సూచన యథార్థానికి సన్నిహితంగా వుంటుంది. చంద్రగుప్త సెల్యూకస్‌ల మధ్య జరిగిన సంధిలో వైవాహిక సంబంధాన్ని గూర్చిన షరతు కల్పితంకాక వాస్తవమైనప్పుడే పై సూచన సంభవమౌతుంది. "సెల్యూకస్ చంద్రగుప్తునితో వైవాహిక సంబంధం జరుపుకున్నందున మౌర్యుల అంతఃపురంలో గ్రీకు రాకుమారి ప్రవేశించడంలో సందేహం లేదు", అంటూ శిల్‌వైన్ లెవీ వ్రాసినాడు. గ్రీకు రచనలు శాంద్ర కాంట్టోన్ అమిత్ర ఖేట్సులనే గాని అశోకుని పేర్కొనడం లేదు. పైన పేర్కొన్న వివాహం జరిగినా బిందుసారుడే గ్రీకు రాకుమారి పుత్రుడనీ, అశోకుడామె పౌత్రుడనీ నిరూపించడానికి కాని, బిందుసారుడు గ్రీకు రాకుమారిని వివాహ మాడినాడని ఆమె కొడుకే అశోకుడనీ నిరూపించడానికి కాని ఆధారాలు లేవు. ఏమైనా ఇది చాలా విశిష్టమైన భావన. ఆ గ్రీకు రాకుమారి సెల్యూకస్‌కు అతని పారశీక రాణియందు జన్మించిన సొంత కూతురని తలచినపుడు పై భావన మరింత విచిత్రంగా తోస్తుంది.

ఈ వైవాహిక సంబంధాన్ని గూర్చి ఆలోచించి సందర్భంలో సాధారణంగా మౌర్య కుటుంబానికి ఒక గ్రీకు రాకుమార్తెను సెల్యూకస్ ఇచ్చినాడనే సూచిస్తారు. కాని మౌర్యులు సైతం సెల్యూకస్ వంశానికి తమ రాకుమార్తెనివ్వడం కూడా సంభవమే. ఈ రెండింటిలో ఏ సంబంధం నిజమైనా అశోకునకు సెల్యూకస్ రాజులకు మధ్య సంబంధం సూచించవచ్చు. దీన్నిబట్టి క్రీ. పూ. 261లో మరణించిన మొదటి యాంటియోకస్ అశోకుని మాతా మహి సోదరుడై ఉంటాడు. అశోకుని మాతా మహి, ఆమె సోదరుడు ఇంచుమించు సమ వయస్కులు కాబట్టి ఆమె అశోకుని బాల్యంలో జీవించి ఉంటుంది; తన దౌహిత్రుడైన అశోకున కామె ప్రఖ్యాత విజేతలైన దరయస్, అలెగ్జాండర్ల విజయగాథలతో ఉత్సాహాన్ని కలిగించి ఉంటుంది. రెండవ యాంటియోకస్ అశోకులు రెండవ తరానికి చెందిన బంధువులై ఉంటారు. కాని ఈ బంధుత్వాలను గురించి అశోకుడు ప్రస్తావించడు. కనీసం తన శాసనాలలో యాంటియోకస్ ఆస్థానానికి రాయబారం పంపిన అంశాన్ని ముచ్చటించే సందర్భంలోనైన తమ మధ్యనున్న బంధుత్వాన్ని గురించి ప్రస్తావించి వుండవలసింది. గ్రీకు గ్రంథాలైనా ఈ సంబంధాన్ని గురించి ఏదో విధంగా ప్రస్తావించి ఉండవలసింది. అలాచేయనందున కొందరు చరిత్రకారులు ఈ సంబంధాన్ని తిరస్కరిస్తున్నారు. కాని పై ఆధారాలు సూచిస్తున్నంతటి సూటిగా కాకపోయినా ఉభయ వంశాల మధ్య బంధుత్వం ఉండే అవకాశాలు లేకపోలేదు. ఆ బంధుత్వమే అశోకుని ఉదార మత భావాలకు కొంతవరకు కారణమై ఉండవచ్చు.

అశోకుని తల్లిని గుర్తించడానికి మరింత స్పష్టమైన సూచనలు అశోకావదాన, దివ్యావదాన, వంశత్థపకాసినీ అనే గ్రంథాలలో లభిస్తున్నాయి. ఆమె పేరు 'సుభద్రాంగి' అని, చంపానగరవాసియైన బ్రాహ్మణుని కుమార్తె అని 'అశోకవదాన' వర్ణిస్తుంది. అంతఃపురం కుట్రవల్ల మహారాజు ఆమెను దూరంగా ఉంచినాడని కొంతకాలానికి ఆమె మహారాజు అభిమానాన్ని సంపాదించి, కుమారుణ్ణి ప్రసవించిందనీ ఆ సందర్భంలో "నేను శోక రహితనైనాను" (అశోకను) అని చెప్పినదని ఆ గ్రంథంలోని కథ. రెండో కుమారుడు కలిగినపుడు ఆ బిడ్డను "వీతాశోక" అంటే "శోక పరిసమాప్తి" అని పిలిచిందట.

సింహళ గ్రంథ మొకదానిలో మహారాణిపేరు 'ధర్మా' అని ఉంది. 'దివ్యావదాన' లోని కథ చాలావరకు 'అశోకావదాన' తో ఏకీభవిస్తుంది. 'దివ్యావదాన' కొన్ని ప్రతులలో మాత్రం ఆమె పేరు 'జనపద కల్యాణి' అని, మరికొన్ని ప్రతులలో మాత్రం ఆమె పేరు 'సుభద్రాంగి' అని కనిపిస్తుంది. ఈ గ్రంథం కూడా ఆమె చంపానగర బ్రాహ్మణ పుత్రి అనే చెపుతుంది.

అశోకుడు అందవికారి అనీ, అందుచే తండ్రి అతనిపట్ల విముఖంగా ఉండేవాడనీ ఒక కథ. కాని అశోకునిలోని ఇతర గుణాలు మాత్రం తండ్రిని బాగా ఆకర్షించినట్లు తెలుస్తుంది. అందుకు నిదర్శనం అశోక రాకుమారుని ఉజ్జయినిలో రాజప్రతినిధిగా ముఖ్యమైన పదవిలో నియమించడమే. చారిత్రక ఆధారాలలో చాలా వరకు అశోకుడు ఉజ్జయిని నుండి నేరుగా పాటలీపుత్రానికి వెళ్ళినట్లు చెపుతున్నాయి. అందుచే ఉజ్జయినిలో రాజప్రతినిధిగా నియామకానికి పూర్వమే అశోకుడు తక్షశిలలో ఉన్నట్లు తెలుస్తుంది. తక్షశిలలో సైతము అశోకుడు రాజప్రతినిధిగా ఉన్నాడని కొన్ని ఆధారాలు వర్ణిస్తున్నాయి. ఉజ్జయినిలో మాత్రమే అశోకుడు రాజప్రతినిధి పదవిని నిర్వహించినాడని 'మహావంశ' పేర్కొంటున్నది. కాని తరువాతి బౌద్ధ గ్రంథాలైన 'అశోక సూత్ర', 'కునాలసూత్ర'లు గాంధారంలో కూడా అశోకుడదే పదవిని నిర్వహించినట్లు చెపుతున్నాయి. దీనిని బట్టి ఒక ప్రత్యేక కార్యనిర్వహణకై అశోకుని తక్షశిలకు పంపినారని అది విజయవంతంగా నిర్వహించినందున అతని సామర్థ్యానికి గుర్తింపుగా ఉజ్జయిని రాజప్రతినిధిగా నియమించడం జరిగిందని మేము భావిస్తున్నాము.

బిందుసారుని కాలంలో ఉన్నతోద్యోగుల దౌర్జన్యానికి నిరసనగా తక్షశిల పౌరులు తిరుగుబాటు చేసినట్లు 'అశోకావదాన' చెపుతున్నది. ఈ తిరుగుబాటుకు ఒక కారణాన్ని ఊహించవచ్చు. మౌర్యయుగారంభం వరకు తక్షశిల ఇంచుమించు స్వతంత్రంగా ఉండేది. అందుచే క్రొత్తగా ఏర్పడిన పాటలీ పుత్రాధిపత్యం తక్షశిల పౌరులకు బాధాకరంగా ఉండి ఉంటుంది. సాంస్కృతికంగా పశ్చిమ ప్రాంతాలలో తక్షశిలకు సన్నిహిత సంబంధం ఉండేది. అందుచేత తక్షశిలలోని పారశీకుల బంధువులు మౌర్యుల నుండి విమోచనను కాంక్షించి సహాయార్థం ఇరాన్‌పై దృష్టిసారించి ఉంటారు. అంతేకాక అధికారాన్ని కేంద్రీకృతం చేసే విధానంలో సరిహద్దు సమీప నగరాలపట్ల మౌర్యులు కఠినంగా వ్యవహరించి ఉండవచ్చు. అందుకు వ్యతిరేకంగా తక్షశిల పౌరులు తిరుగుబాటు చేసియుండవచ్చు. ఈ తిరుగుబాటును అణచటానికి బిందుసారుడు అశోకుని పంపినాడని 'అశోకావదాన' కథనం. పౌరుల కెక్కువ కష్టం కలుగకుండా విజయవంతంగా అశోకుడు ఆ తిరుగుబాటును అణచివేసినాడు.

నేటికి తెలిసినంతవరకు ఈ సంప్రదాయంలోని యదార్థాన్ని బలపరచే ఏకైక ఆధారం తక్షశిలలో 'సిర్కాప్' ప్రాంతంలోని ఒక ఇంటిగోడలో కన్పించిన అరమిక్ శాసనం. ఈ శాసనం "రోమోదోతే" అను ఉన్నతోద్యోగికి సంబంధించినది. "రాజప్రముఖ్ లేదా రాజప్రతినిధి ప్రియదర్శిసాయంతో తన ఉద్యోగంలో "రామోదోతే" ఉన్నతిని సాధించినాడు"

అని ఈ శాసనాన్ని చదివినారు. ఇందలి ప్రియదర్శి పాఠం సందిగ్ధంగా ఉంది. 'ప్రియద' అనే అక్షరాల తర్వాత శాసనం కష్టమైంది. అందుచే ఆ అక్షరాలను 'ప్రియదర్శిని' అని ఊహిస్తున్నారు. ఈ శాసనం క్రీ. పూ. మూడో శతాబ్ది పూర్వార్ధానికి చెందిందని పండితుల అభిప్రాయం. ఒకప్పుడీ ప్రాంతానికి అఖనమీడల ఇరాన్‌కు మధ్య సన్నిహిత సంబంధాలు ఉండేవి. అరమిక్‌లో ఉన్న ఈ శాసనం ఈ ప్రాంతంలో ఇరాన్ సంస్కృతీ ప్రభావం కొనసాగిస్తున్నట్లు సూచిస్తుంది.

అశోకుని కుమారుడైన కునాలుని గురించి కూడ పై కథవంటిదే చెబుతారు. అందుచేత పై వృత్తాంతం జరిగింది బిందుసారుని కాలంలోనా, అశోకుని కాలంలోనా అనే అనుమానం కొందరికి కలిగింది. తక్షశిల శాసనంలోని మాట 'ప్రియదర్శి' అనేదే అయితే అది అశోకుని ఉద్దేశించినదే అనడంలో సందేహంలేదు. అశోకునకు కాక మౌర్యులెవ్వరికీ ఆ బిరుదం లేదని మనకు తెలుసు. అశోకుని కాలంలోనే ఈ సంఘటన జరిగిందనే వృత్తాంతం 'అశోకావదాన' రచయిత చేసిన పొరపాటనిగాని, అశోకుని కథ ననుసరించి బుద్ధిపూర్వకంగా చెప్పిన కథ అనిగాని గ్రహించవలె.

తక్షశిల పౌరుల ఆగ్రహావేశాలు చల్లారిన తరువాత ఉజ్జయిని బయలుదేరటానికి పూర్వం అశోకుడు తక్షశిలలో కొన్ని మాసాలు గడిపినాడని చెప్పవచ్చు. అశోకుని వంటి స్వభావము, అభిరుచులు ఉన్న యువకులకు నాటి తక్షశిల ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. కీలకస్థానంలో వుండి రాజకీయంగా రాజధానీ నగరంగా ఉండడమే కాదు; పశ్చిమ దేశాలకు వెళ్లే వాయవ్య రహదారిపై వివిధ సంస్కృతులకు సంగమమైన వాణిజ్య కేంద్రంగా కూడా తక్షశిల ప్రఖ్యాతి వహించింది. అన్నిటికంటే ముఖ్యంగా నాటి ప్రధాన విద్యాకేంద్రాలలో తక్షశిల ఒకటి.

ఉజ్జయినిలో రాజప్రతినిధిత్వాన్ని గురించి సింహళ గ్రంథాలలో చాలా సమాచారం లభ్యమవుతుంది. ఆ సమాచారంలో అధికభాగం అశోకుని వ్యక్తిగత జీవితాన్ని గురించినదే. దీనివల్ల విదిశానగరంలో ఒక వర్తకుని కూతురైన 'దేవి' అనే సుందరిని అశోకుడు ప్రేమించినట్లు తెలుస్తుంది. వీరికి మహేంద్ర, సంఘమిత్ర అనే సంతానం కలిగినట్లు మాత్రమే చెపుతుంది గాని వీరిద్దరి వివాహాన్ని గూర్చి 'మహావంశ' ప్రస్తావించడంలేదు. సింహళానికి మొదటి రాయబారాన్ని పంపిన అశోకుని గౌరవానికి దేవీ వృత్తాంతంవల్ల భంగం రాదు. అందుచే సింహళ రచనలలోని దేవీ వృత్తాంతం నిజమై ఉండవచ్చు.

మరొక సింహళ గ్రంథం దేవిని విదిశమహాదేవిగా, శాక్యానిగా పేర్కొంటున్నది. అదే గ్రంథం మరొకచోట ఆమెను శాక్యకుమారిగా వర్ణిస్తున్నది. విదిశానగరానికి వలసవెళ్లిన

శాక్యుని కుమార్తెగా దేవిని వర్ణించడం శాక్యుడైన బుద్ధుని కుటుంబంతో ఆమెకు సంబంధాన్ని కలిపే ప్రయత్నమే గాని వేరుగాదు. సింహళానికి ప్రథమ బౌద్ధరాయబారాన్ని నడిపిన మహేంద్రునకు బుద్ధుని కుటుంబంతో సంబంధాన్ని ముడిపెట్టే ఆశయంతో సింహళ ఐతిహాసికులు కల్పించిన కట్టుకథ ఇది. శాక్యులతో దేవికి గల సంబంధాన్ని కనుగొనే ప్రయత్నం కేవలం వృధా ప్రయాస. ఆమె విదిశానగర స్థానికుడైన వర్తకుని కూతురని అంగీకరించడమే ఉచితము.

అశోకుడు రాజైన తరువాత కూడా 'దేవి' విదిశా నగరంలోనే ఉండడానికి నిశ్చయించిందని సంప్రదాయక వృత్తాంతము. అట్టి నిర్ణయానికి ఆమె బౌద్ధ ధర్మపరాయణ కావడము విదిశా నగరం నాటికే ప్రసిద్ధ బౌద్ధ కేంద్రంగా రూపొందడము కారణమై ఉండవచ్చును. అశోకుడు బౌద్ధాన్ని అవలంబించడానికి మహేంద్రుడు భిక్షువు కావడానికి 'దేవి' యే కారణంగా సూచిస్తారు. దేవి విదిశా నగరంలోనే ఉండడానికి మరికొన్ని సబబైన కారణాలను సూచించవచ్చు. ఆమె వర్తకుని కూతురు. అందుచే ఆస్థాన రాజమండలానికి యోగ్యమైన సాంఘిక హోదా ఆమెకు లేదు. అశోకుడామెను శాస్త్రరీత్యా వివాహమాడనందున పట్టమహిషి విధులను ఆమె నిర్వహించడం నిషిద్ధం. అశోకుడు పట్టాభిషేకానంతరం ఉచితమైన ఉన్నత స్థాయికి చెందిన కుమార్తెను పట్టమహిషిగా వివాహమాడవలెనని ఆస్థాన రాజమండలం ఆపేక్షించి ఉంటుంది. ఆ ఆశయంతోనే 'అసంధిమిత్త' ను వివాహమాడి ఉంటాడు. 'అసంధిమిత్త' అనేది 'దేవి' అధికార నామంగా కనిపించదు. అదే నిజమైతే దేవీ అశోకుల సంబంధాలను సుదీర్ఘంగా వివరించిన సింహళ ఇతిహాసాలు ఆ విషయాన్ని సూచించి ఉండేవే.

మౌర్యయుగ బౌద్ధ వాఙ్మయంలో విదిశా నగరం ప్రసిద్ధ బౌద్ధ కేంద్రంగా కనిపిస్తుంది. సాంచీ భిల్సాలలోని అసంఖ్యాక నిర్మాణాలలో విదిశా గిరిపైని విహారం మొట్ట మొదటిదై ఉండవచ్చు. ఆ విహార నిర్మాణానికి 'దేవి' యే కారణమనే అభిప్రాయం ఉంది. ఈ ప్రాంతంలోని బౌద్ధ సంస్థలపై అశోకుడు ప్రత్యేక శ్రద్ధ వహించడానికి ఆ ప్రాంతంలో అతనికున్నసంబంధాలే కారణమని కూడా చెప్పవచ్చు.

దేవీ, అశోకుల కుమార్తెయైన 'సంఘమిత్త' యాథార్థ్యాన్ని కొందరు చరిత్రకారులు శంకిస్తారు. పద్దెనిమిది సంవత్సరాల ప్రాయంలోనే 'సంఘమిత్త' ఆశ్రమ స్వీకారం చేసిందని 'మహావంశ' చెపుతుంది. సింహళ మహారాణిని ఆశ్రమ స్వీకారం చేయించే ఆశయంతో 'సంఘమిత్త' సింహళానికి వెళ్ళిందనే గాధ నిజానికి అతిశయోక్తి. 'సంఘమిత్త' మహేంద్రుని సోదరి అయి ఉండవచ్చు. ధర్మ పరాయణయైన తల్లి ఆమెకు 'సంఘమిత్త' అనే పేరుపెట్టి

ఉండవచ్చు. అయినంత మాత్రాన మహేంద్రుడు భిక్షువైనంతనే 'సంఘమిత్త' బౌద్ధ సన్యాసిని అయినదని కాని, సింహళ మహిళాలోకంలో మత ప్రచారం చేయడంలో ప్రముఖ పాత్ర నిర్వహించినదని కాని చెప్పవలసిన అవసరం లేదు.

అశోకుని అన్నకొడుకైన అగ్నిబ్రహ్మను "సంఘమిత్త" పెండ్లాడినదని వారికి 'సుమన' అనే కుమారుడు కలిగినాడని ఒక కథ ఉంది. అశోకుని పెద్ద అన్న పేరు సుమన. అంటే పసివానికి పెదతాత పేరు పెట్టినారు. కాని ఈ గాథే సత్యమైనచో సగోత్ర వివాహాన్ని నిషేధించిన ధర్మానికి బద్ధురాలు కానపుడే 'సంఘమిత్త' పెదతండ్రి కొడుకును వివాహమాడి ఉంటుంది. అట్టిది అశోకున కామె అధర్మ సంతానమైనపుడే సంభవం. అశోకుని భ్రాతృ పుత్రుడు అశోకుని భార్యకు సైతము అదే వరుస బంధువౌతాడు. కాని అధర్మ సంతానమైన 'సంఘమిత్త' కు బంధువు కాడు. సంఘమిత్త వివాహగాథ పూర్తి అసంగతం; ఆమె సింహళ గాథకు ప్రతిబంధకం. పై గాథలోనే సంఘమిత్త, ఆమె భర్త, పుత్రుడు ముగ్గురూ ధర్మాన్ని స్వీకరించినారని ఉంది. కొన్ని శ్లోకాల తరువాత ఆశ్రమ స్వీకారం నాటికి ఆమె వయస్సు పద్దెనిమిది సంవత్సరాలని ఉంది. అయితే పదహారేండ్ల ప్రాయంలోనే ఆమె వివాహం జరిగే ఉండవలె. అంతటి పసికందుకు తల్లిగా ఆమె ఆశ్రమం స్వీకరించడానికి అంగీకరించి ఉండదు.

అశోకునితో మహేంద్రుని సంబంధాన్ని గురించి కొంత అభిప్రాయభేదం ఉంది. మహేంద్రుడు అశోకుని అధర్మ సంతానమని సింహళ గ్రంథాలు నొక్కి చెపుతున్నాయి. కాని చైనా యాత్రికుడైన హుయాన్‌సాంగ్ మహేంద్రుడు అశోకుని తమ్ముడని, అతణ్ణి వీతాశోక, విగతాశోక అనే పేర్లతో పిలిచేవారని వ్రాసినాడు. హుయాన్‌సాంగ్ వ్రాతనే విన్సెంటుస్మిత్ అంగీకరిస్తూ సింహళ రచనలు మహేంద్రునకు, తద్వారా సింహళానికి ప్రతిష్ఠ నినుమడింపజేసే ప్రయత్నమనీ తన విశ్వాసంగా వ్రాసినాడు. సింహళ అభిప్రాయం కూడా నిజమై ఉండవచ్చునని మా అభిప్రాయం. మహేంద్రుడు అశోకుని తమ్ముడైనా, కొడుకైనా సింహళ రాయబార వర్గానికి నాయకత్వం వహించడంలో అతని ప్రతిష్ఠకు మార్పు ఉండదు. అందుచే ప్రత్యేకించి కొడుకును కల్పించడంలో ప్రయోజనం కనిపించదు. అధర్మ సంతానమై పాటలీపుత్ర రాజాస్థానంలో చిన్నచూపుకు గురికావడం కంటే సంఘంలో చేరడానికే మహేంద్రుడు సుముఖుడై ఉండవచ్చు. అతణ్ణి సింహళం పంపండంలో కూడా అశోకునకు ఒక ప్రత్యేక ఆశయం ఉండి ఉంటుంది. సింహళరాజు "దేవానం ప్రియ తిస్స" కు అశోకునియందు అపారమైన అభిమానం ఉంది. అతనియందు తనకు కూడా ఉన్న ఆదరాభిమానాలకు నిదర్శనంగా సింహళ భారతదేశాల మధ్య నున్న స్నేహ భావాలను

పెంపొందించడానికి కాకపోయినా కనీసం రక్షించే ఉద్దేశంతో సాధారణ భిక్షువును పంపడం కంటె తన కుమారుడనే రాయబారిగా పంపడం ఉచితమని అశోకుడు భావించి ఉంటాడు.

అశోకుడు రాజప్రతినిధి ఉద్యోగంలో ఎన్ని సంవత్సరాలున్నదీ నిర్ణయించడానికి సింహళ చరిత్రలోని మహేంద్రుని కథలో సూచనలున్నాయి. అశోకుని పాలనకాలం ఆరో సంవత్సరంలో మహేంద్రుడు ఆశ్రమ స్వీకారం చేసినాడని, అప్పుడాతని వయస్సు ఇరవై సంవత్సరాలని మహావంశ కథనం. దీనిని బట్టి అశోకుడు పట్టాభిషేకం నాటికి మహేంద్రునకు పదునాల్గు సంవత్సరాలు. రాకుమారుల మధ్య వారసత్వ యుద్ధం ప్రారంభించు నాటికి పది సంవత్సరాలు. దీనినిబట్టి సుదీర్ఘమైన కాలమే అశోకుడు రాజ ప్రతినిధిగా ఉన్నాడని స్పష్టమౌతుంది. చిన్న వయస్సులోనే అంటే అశోకునకు ఇరవై సంవత్సరాల వయస్సప్పుడే మహేంద్రుడు జన్మించినాడని భావిస్తే సింహాసనం ఎక్కేనాటికి అశోకునకు ముప్పైనాలుగు సంవత్సరాలుంటాయి. ఈ వంశం అశోకుని తాత తండ్రుల పరిపాలనా కాలాలు సుదీర్ఘములు అనే విషయంతో ఏకీభవిస్తున్నాయి.

"సింహాసనాన్ని ఆక్రమించినాడు" అని విన్నందున అశోకుడు యువరాజు కాదని రాకుమారుల మధ్య సింహాసనానికై సంఘర్షణ జరిగిందని చరిత్రకారులలో ఏకాభిప్రాయం ఉంది. మరణ కాలంలో బిందుసారుడు తన కుమారుడైన సుశీముడే రాజు కావాలని కోరినాడట. అందుకు విరుద్ధంగా మంత్రులు అశోకుని సింహాసనం ఎక్కించినారని "దివ్యావదాన" చెబుతుంది. అదే కథ బిందుసారుని ప్రధానియైన రాధాగుప్తుని సహాయానుమోదాలు అశోకునికున్న వని సూచిస్తున్నది. బిందుసారుని మరణ కాలంలో అశోకుడు ఉత్తరా పథానికి రాజప్రతినిధిగా తక్షశిలలో ఉన్నట్లు తెలుస్తుంది. సుశీముడు అశోకుని అగ్రజుడు. తక్షశిలలో జరిగిన తిరుగుబాటును అతడు అణచలేకపోయాడు. అందుచేతనే సుశీముని తొలగించి అశోకుని నియమించారు. రాధాగుప్తుని సాయంతో ఖాళీ అయిన సింహాసనాన్ని అశోకుడాక్రమించినాడు. అయితే అశోకుడు రాజప్రతినిధిగా ఉన్న రాష్ట్రం పేరును భిన్న ఆధారాలు భిన్నంగా చెపుతున్నాయి. కాని బిందుసారుడు మరణించినప్పుడు అశోకుడు ఒక రాష్ట్రానికి రాజప్రతినిధి అనే విషయంలో ఆధారాల మధ్య అంగీకారం ఉంది. అశోకుడు తన పెద్ద అన్నను చంపినాడని మహావంశ చెబుతుంది. అదే గ్రంథంలో మరొకచోటను, 'దీపవంశ'లోను తన సోదరులు తొంబది తొమ్మిది మందిని అశోకుడు చంపినట్టు ఉంది. వీరు బిందుసారునకు వేరువేరు భార్యలయందు జన్మించినవారు. పై సమాచారాన్ని పర్యాలోకించినప్పుడు తొంభైతొమ్మిది మంది సోదరుల

అంశాన్ని ఊహాకల్పితమని త్రోసిపుచ్చవచ్చు. ఇక బిందుసారుని మరణానంతరంగాని, మరణానికి ఇంచుక పూర్వంగాని సింహాసనానికై రాజకుమారుల మధ్య జరిగిన సంఘర్షణలో అశోకుడు పాల్గొన్నాడని తన్ను వ్యతిరేకించిన వారిని అతడు తొలగించవలసి వచ్చిందని పై కథనంలో నిలిచే చారిత్రకాంశం. నాలుగు సంవత్సరాల కాలవ్యవధికి ఈ అంశం సరిపోతున్నది. ఈ వ్యవధిలోనే వారసత్వ సమస్య పరిష్కారమైంది. క్రీ. పూ. 269 వరకు అంటే సింహాసనంపై తన పదవి సురక్షితమనే విశ్వాసం కలిగే వరకు అశోకుడు యధావిధిగా పట్టాభిషేకం జరుపుకోలేదు.

తారానాథుని రచన ప్రకారం అశోకునకు సోదరులార్గురని, వారందరిని అతడు చంపినాడని తెలుస్తుంది. ఈ వృత్తాంతం చంపారణ రాజైన 'నిమిత'ను గూర్చి తారానాథుడు వ్రాసిన కథలో ఉంది. ఆ కథ చాల అస్తవ్యస్తంగా ఉంది. 'నిమిత'కు ఆర్గురు భార్యలున్నారు. వారందరు ధర్మబద్ధంగా పెండ్లాడినవారే. వారికి ఆర్గురు పుత్రులుదయించారు. అశోకుడు కూడా 'నిమిత' కుమారుడే. కాని ఒక వర్తకుని కూతురుతో 'నిమిత'కు ఉన్న అక్రమ సంబంధంవల్ల అశోకుడు పుట్టినాడు. 'నిమిత'పై నేపాల్, ఖాస్యా ప్రజలు తిరుగుబాటు చేశారు. అశోకుడా తిరుగుబాటు నణచి అందుకు బహూకృతిగా పాటలీపుత్ర రాజ్యాన్ని పొందినారు. 'నిమిత' హఠాత్తుగా మరణించడంతో ఆ స్థానంలోని ప్రముఖులు అశోకుని సింహాసనం ఎక్కించారు. ఆర్గురు సోదరులు అతనిని ప్రతిఘటించారు. వారందరిని వధించి అశోకుడు రాజ్యాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. వాస్తవానికి అశోకునకు తొంభైతొమ్మిది సోదరులనడంకంటె ఆర్గురు సోదరులనడమే సత్యానికి చేరువగా ఉంటుంది. సింహళ చరిత్రలు అశోకుని కనిష్ఠ సోదరుడు 'తిస్స' ఒకనికి మాత్రమే హాని జరుగలేదని వ్రాస్తున్నాయి. ఈతని గాథను తరువాత పరిశీలిద్దాము.

బిందుసారుని జీవితకాలంలోనే 'పింగళవత్స' అనే ఆజీవిక మహర్షి అతని పుత్రులందరిలో అశోకుడే సమర్థుడని సింహాసనాన్ని ఆక్రమించడంలో విజయం సాధించగలడని భవిష్యార్థాన్ని సూచించినాడని 'దివ్యావదాన' వ్రాసింది. అశోకునకు మంత్రుల సహకారం ఉన్నట్లు కన్పిస్తుంది. జైన యాత్రికుడైన 'ఇత్సింగ్' అశోకునకు మూడు శతాబ్దాల ముందు మగధ రాజ్యాన్ని ఏలిన బింబిసారుని గురించి ఒక కథ చెప్పినాడు. కలలో బింబిసారునకు ఒక గుడ్డపీలిక, పద్దెనిమిది కర్రముక్కలు కనిపించినవట. సమకాలీనులైన బుద్ధుడు ఆ కలను ఇట్లా వ్యాఖ్యానించినాడు. తన మరణానంతరం తన సిద్ధాంతం పద్దెనిమిది శాఖలుగా విడిపోతుందని, కర్రముక్కలా శాఖలను సూచిస్తాయని, తన పరి నిర్వాణం తరువాత నూరు సంవత్సరాలకు అశోకుడనే రాజు సింహాసన మధిష్టించి

జంబూ ద్వీపాన్ని ఏలుతూ ఆ శాఖలన్నింటిని సమైక్యం చేస్తాడు. అని బుద్ధుని వాఖ్యానం. ఈ కథ అశోకుని మరణానంతరం కొన్ని శతాబ్దాలకు బౌద్ధ ప్రపంచంలో ప్రచారమైందని స్పష్టమవుతున్నది.

అశోకుని సింహాస నాక్రమణను గురించిన కథకు సింహళ రచనలు మరికొంత మెరుగులు దిద్దినాయి. బిందుసారుని భార్య పేరు ధమ్మ. ఆమె అశోకుని తల్లి. ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు ఆమెకు సూర్యచంద్రులపై నడవాలని, నక్షత్రాలతో ఆడుకోవాలని, అరణ్యాలను తినివేయాలని కోరిక కలిగిందట. ఈ లక్షణాలను వ్యాఖ్యానించవలసినదిగా నగర వృద్ధులను కోరినారు. 'ధమ్మ' ఆజీవిక మతస్థురాలు. అందుచే ఆజీవిక మహర్షియే ఆమె కోర్కెల అర్థాన్ని వివరించడం సమంజసం. 'సూర్యచంద్రులపై నడవాలనే కోర్కె వల్ల ఆమెకు జన్మించనున్న కుమారుడు భారతదేశ ప్రజలను జయించి యావద్భారత భూభాగాన్ని పరిపాలిస్తాడనీ, ఇతర కోరికలు ఆ కుమారుడు తనకు అప్రియాన్ని కలిగించిన సోదరులను వధిస్తాడనీ సూచిస్తున్నవి'. ఆ గ్రంథమే అశోకునకు నూర్గురు సోదరులున్నారని, ఒక్కని మినహాయించి వారందరిని అతడు వధించినాడని చెబుతుంది. అశోకుడు తొంభై ఆరు అధార్మిక మతశాఖలను సైతం రూపుమాపి బౌద్ధమతానికి ఆసక్తితో సన్నిహితుడౌతాడని ఆజీవిక మహర్షియే జోస్యం చెప్పినాడు.

తక్షశిలలో తిరుగుబాటు నణచడంవల్ల ఉజ్జయినిలో రాజ ప్రతినిధిత్వాన్ని నిర్వహించడం వల్ల తన శక్తి సామర్థ్యములను అశోకుడు గుర్తించినాడు. ఆ ఆత్మవిశ్వాసమే సింహాసనం ఆక్రమించే ప్రయత్నానికి అతణ్ణి పురికొల్పింది. అశోకుని రాచరికాన్ని గురించి ఆజీవిక మహర్షి చెప్పిన జోస్యగాధ, అతని తల్లి సుభద్రాంగిని రాజు బహిష్కరించాడనే గాధ మొదలైన వాని వల్ల అశోకునకు సింహాసనంపై న్యాయబద్ధమైన హక్కులేదని తెలుస్తుంది. అన్నతో సహా సోదరులందరిని వధించినాడనే అంశంవల్ల బహుశా అంతఃపుర విప్లవం ఒకటి జరిగి ఉంటుందని భావింపవచ్చు. బౌద్ధ వాఙ్మయంలోని విభ్రాతృహత్యా వృత్తాంతానికి ఈ విప్లవమే కారణమై ఉంటుంది. సోదరుల సంఖ్యను గూర్చి బౌద్ధ వాఙ్మయంలోని అతిశయోక్తులను అర్థం చేసుకోవడం కష్టంకాదు. బౌద్ధమత స్వీకారానికి పూర్వం అశోకుడు నీతి నియమాలు లేని వ్యక్తి అని వర్ణించడమే ఆ వాఙ్మయ లక్ష్యం. ఐదో శాసనంలో పేర్కొన్న ఉద్యోగులకు వారి ఉద్యోగధర్మంతోపాటు తన సోదరీ సోదరుల, ఇతర బంధువుల శ్రేయస్సును పర్యాలోచన చేయవలసినదిగా అశోకుడు కోరినాడు. అశోకుని సోదరులు సజీవులై ఉన్నట్లు ఈ వాక్యం సూచిస్తుంది. ఈ వాక్యాన్ని కొందరు చరిత్రకారులు సోదరుల కుటుంబాల శ్రేయస్సునే కాని సోదరుల శ్రేయస్సును కాదని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయం అంతదూరం ఆలోచించవలసిన పనిలేదు.

అశోకుడు తొంభై తొమ్మిదిమంది సోదరులను వధించినప్పటికీ కనిష్ఠుడైన 'తిస్స'ను మాత్రం విడిచిపెట్టినాడని 'మహావంశ' చెబుతున్నది. 'తిస్స' అశోకుని సహోదరుడు. తరువాత అతణ్ణి ఉపరాజుగా నియమించినాడు. సింహళ గ్రంథా లీతణ్ణి 'తిస్స' అనీ ఇతర గ్రంథాలు "వీతాశోక" విగతాశోక, సుదత్త, సుగత్ర, అనే భిన్న నామాలతోను వ్యవహరిస్తున్నాయి. మొదట్లో ఈతడు తన పరిసర ప్రపంచంతో సంబంధం లేకుండా విలాసాలలో మునిగి తేలుతూ ఉండేవాడు. మృత్యు భీతిపై బౌద్ధ గ్రంథాలు అంత ఎక్కువగా నొక్కిపెట్టి వ్రాయడంలోని ఆంతర్యం ఆ రోజుల్లో అతనికి అర్థం కాలేదట. అందుచే అతనికి గుణపాఠం చెప్పే ఉద్దేశ్యంతో అశోకుడు అతణ్ణి కొద్ది రోజులు సింహాసనంపై కూర్చోపెట్టి, సింహాసనాన్ని ఆక్రమించే దురుద్దేశాన్ని ఆరోపించి, ఏడు రోజుల అనంతరం అతణ్ణి ఉరి తీయవలసిందిగా ఆజ్ఞాపించినాడట. ఈ ఏడు రోజుల కాలంలోనే 'తిస్స'కు జ్ఞానోదయమైంది. చావు తప్పదనే జ్ఞానంతోనే బౌద్ధ భిక్షువులు జీవిత సుఖాలను పరిత్యజిస్తున్నారని గుర్తించినవాడై తన పాత అలవాట్లనుమాని అంతఃపురాన్ని విడిచి 'అర్హతు' డైనాడట. ఈ అంశమే "మహావంశ" లో మరొక విధంగా ఉంది. అశోకుడు "తిస్స' ను ఉపరాజుగా నియమించినాడు గాని 'తిస్స' మహాధర్మ రక్షిత అనే బౌద్ధాచార్యుని ప్రభావంవల్ల ధర్మపరాయణమైన జీవితాన్ని ఆశ్రయించి "ఏక విహారిక" అనే పేరుతో ప్రసిద్ధుడైనాడట. అశోక తిస్సల మధ్య వ్యవహారం పై కథలలో చెప్పినంత సరళంగా నడిచి ఉండక పోవచ్చు. కాని అందలి మౌలికాంశం మాత్రం సత్యమే అయి ఉంటుంది. సాధారణంగా రాజులకు ముఖ్యంగా అశోకుని వంటి ఆత్మాశ్రయులైన వారికి తమ్ములు ప్రతిబంధకాలుగా తయారవుతూ ఉంటారు. ఈ సందర్భంలో సింహాసనంపై గల హక్కులను వదలుకొని విరాగియైనచో అశోకుని చేతులలో ప్రాణాలు దక్కించుకోవచ్చునని 'తిస్స' గమనించి ఆ విధంగా ప్రవర్తించి ఉంటాడు. ప్రపంచంలో ఇతర ప్రాంతాలలో కూడా ఇటువంటి పరిస్థితులలో సోదరులను భిక్షువులుగా మార్చే పద్ధతి ఉన్నట్లు తెలుస్తుంది.

'థేర'గాథలపైని వ్యాఖ్యానంలో పై కథ మరొక విధంగా ఉంది. కొంతకాలం 'తిస్స' పరిపూర్ణమైన జీవితం గడిపినాడు. ఒకనాడు హఠాత్తుగా తలపై నెరసిన వెంట్రుకను చూచి ఆసన్న వృద్ధాప్యాన్ని గుర్తించి బౌద్ధ విహారంలో చేరి చివరకు అర్హతుడైనాడట. ఇతర గ్రంథాలలో సైతం ఇటువంటి కథలే ఉన్నాయి. క్రీ.శ. నాలుగోశతాబ్దంలో ఫాహియాన్ మరొక కథ చెప్పినాడు. రెండు శతాబ్దాల అనంతరం యువాన్‌చంగ్ ఆ కథనే పునశ్చరణ చేసినాడు. ఆ కథ ప్రకారం తన తమ్ముడైన మహేంద్రుడు గడపుతున్న విశృంఖల జీవితాన్ని సహింపలేక అశోకుడాతణ్ణి మందలించాడు. మహేంద్రుడు సిగ్గుపడి అన్నను క్షమాపణ

కోరుకొనడమేగాక ఒక చీకటి గుహలో ప్రవేశించి ధ్యాన నిమగ్నుడై చివరకు అర్హతుడైనాడు. కుటుంబంలో తిరిగి చేరవలసిందిగా అశోకుడాతణ్ని కోరినాడు. అందుకంగీకరింపక మహేంద్రుడు పర్వత శిఖరంపై ఒంటరిగా నివసించడానికి సమ్మతించాడు. ఒంటరిగా ఉన్నప్పటికి తన చేరువలో ఉంటాడనే ఆశతో మహేంద్రుని కోసం పాటలీపుత్ర నగరంలోనే అశోకుడు ఒక పర్వతాన్ని నిర్మింప జేసినాడు.

అశోకుని తమ్ముని జీవితానికి సంబంధించిన మరొక సంఘటనను 'అశోకావదాన' పేర్కొంటున్నది. నిర్గంధులు ధర్మచ్యుతులనే భావంతో బౌద్ధవిహారాలలో నివసిస్తున్న నిర్గంధులందరిని వధింప వలసిందని అశోకుడాజ్ఞాపించినాడు. నిర్గంధుడనే భ్రమతో రాజభటులు అశోకుని తమ్మునికూడ వధించినారు. అశోకుడు తన తప్పిదాన్ని గుర్తించి తన ఆజ్ఞను ఉపసంహరించినాడు. ఈ కథలో మరొక ఆసక్తికరమైన అంశం కూడ ఉంది. బౌద్ధ మతంలో అశోకుని గాఢమైన అభిమానాన్ని చిత్రించడంలో బౌద్ధ మతేతరులను అశోకుడు సహించలేదంటూ సనాతన బౌద్ధులు ఈ కథను వ్రాసినట్లు స్పష్టమవుతుంది. భిన్న మార్గానువర్తులపట్ల అశోకుడు ప్రదర్శించిన ఈ ఆగ్రహానికి పరమతసహన ప్రాముఖ్యాన్ని గుర్తించి శాసనాలలో అతడు చేసిన విజ్ఞాపనకు పొత్తు కుదరటం లేదు. యౌవనంలో అశోకుడు చాల దుష్ప్రవర్తనుడనే విశ్వాసం కలిగించేటట్లు బౌద్ధగ్రంథాలు వ్రాసినాయి. అయినచో తన సోదరుని నిర్వాణ మార్గంలో ఉంచడమనేది అశోకుని స్వభావంలో తరువాత వచ్చిన మార్పు ఫలితమే అనిపిస్తుంది. 'నీవు స్పురద్రూపివి కావు' అని చెప్పిన కారణంగా 500 మంది అంతఃపుర స్త్రీలను మంటలలో త్రోయించి చండాశోకుడని పేరు పొందినాడని బౌద్ధ గ్రంథాలు చెబుతున్నాయి. ఇట్టి క్రూరకృత్యాలను రాజు స్వయంగా నిర్వహించరాదు. కాబట్టి ఒక ఉద్యోగ బృందాన్ని నియమించవలసినదిగా మంత్రి రాధాగుప్తుడు అశోకునకు సలహా యిచ్చినాడట. ఈ సూచనతోనే 'భూలోక నరక' నిర్మాణం ప్రారంభమైంది. అందుకై ఒక ప్రత్యేక స్థలాన్ని నిర్దేశించినారు. అమాయకులను వంచించి భూలోక నరకంలో చిత్రహింసకు గురిచేయడానికి మనుషులను, యంత్రాలను సేకరించినాడు. దీన్ని గూర్చి ప్రస్తావిస్తూ తరచు అశోకుడు ఈ నరకాన్ని దర్శించి కొత్త కొత్త చిత్రహింసా మార్గాలను స్వయంగా సృష్టించేవాడని ఫాహియాన్ వ్రాసినాడు. అశోకుని 'భూలోక నరక' స్థానంలో స్మృతి చిహ్నంగా నెలకొల్పిన స్తంభాన్ని కూడ తాను చూచినట్లు యువాన్‌చాంగ్ పేర్కొన్నాడు.

పెక్కు సంవత్సరాలు విలాస మార్గాలలో గడిపి కామాశోకుడని, అనంతరం దుర్మార్గ ప్రవృత్తిలో గడిపి చండాశోకుడని పేరు బడసినట్లు తారానాధుడు వ్రాసినాడు. చివరకు

బౌద్ధ మతం స్వీకరించి ధర్మాను సరణం వల్ల ధర్మాశోకుడైనాడు. భూలోక నరకంలో చిత్రహింసకు గురియౌతూ ఏమాత్రం చలించని ఒక బౌద్ధ భిక్షువు ప్రవర్తనవల్ల అశోకునిలో మార్పు వచ్చినట్లు మరొక గ్రంథం చెబుతున్నది. పంద్రెండవ శతాబ్దిలో తయారైన కాశ్మీరరాజుల చరిత్ర 'రాజతరంగిణి'లో ఈ కథలేవీ కనిపించవు. అశోకుడు జైన ధర్మాన్ని అనుసరించాడని, అనంతరం శోభాయ మానములైన చైత్యాలను, స్థూపాలను నిర్మించినాడని 'రాజతరంగిణి' పేర్కొంటున్నది. జినుడని బుద్ధునకు మరొక పేరు.

పరమ దుర్మార్గుడుగా ఉంటూ హఠాత్తుగా ధర్మపరాయణుడైనాడనే చిత్రణ బౌద్ధ రచయితల కల్పనగా అంగీకరింపవచ్చు. మతస్వీకారానికి పూర్వం దుర్మార్గుడని చిత్రించడం వల్ల తదనంతర ధర్మ పరత్వపు విలువ పెరుగుతుంది. అశోకుడు బౌద్ధుడుగా మారటానికి కారణమైన సంఘటనలను గురించి భిన్నాధారాల మధ్య ఏకీభావం లేదు. వాస్తవానికి దుర్మార్గ ప్రవృత్తి అశోకునిలో జీర్ణించి ఉంటే దాని ప్రస్తావన అతని బాల్యాన్ని గూర్చిన కథలలో కనీసం సూచనప్రాయంగానైనా కనిపించేది. ఈ దుర్మార్గం హఠాత్తుగా ప్రత్యక్షమౌతుంది. తొంభై తొమ్మిదిమంది సోదరులను వధించి సింహాసన మెక్కడం, అమాయక ప్రజలను హింసించే భూలోక నరకాన్ని నిర్మించడం అందుకు నిదర్శనాలు. కాని బౌద్ధ మత స్వీకారంతో అతనిలోని దుష్టత్వం తిరిగి హఠాత్తుగా అంతర్ధాన మౌతుంది.

వివిధ ఆధారాలు అశోకునకు సన్నిహితులైన కుటుంబ సభ్యులను పేర్కొంటున్నాయి. అతని రాజ్యకాలం చాలవరకు పట్ట మహిషిగా 'అసంధిమిత్రా' ఉన్నట్లు తెలుస్తుంది. ఈమె పట్ల 'మహావంశ' చాల అభిమానం ప్రదర్శించింది. అశోకునకు నాలుగు సంవత్సరాలు ముందుగా ఈమె మరణించింది. అనంతరం 'తిస్సరఖ్ఖ' పట్టమహిషి పదవి నలంకరించింది. ఈమె బోధి వృక్షానికి హాని కలిగించిందట. అందువల్ల తరువాతి బౌద్ధ వాఙ్మయంలో 'తిస్సరఖ్ఖా' ను గురించిన పరుషమైన మాటలు కనిపిస్తాయి. అశోకుడు 'తిస్సరఖ్ఖా' ప్రభావానికి లోబడిపోయినట్లు 'అవదాన' కథలు చెబుతున్నాయి. వాటిని బట్టి ఆమె నాతడు వయస్సు మళ్ళిన తరువాత పెండ్లి చేసుకున్నట్లు తెలుస్తుంది. అలహాబాదు శిలాస్తంభంమీది 'రాణి శాసనం' 'చారువాకీ' అనే మరొక రాణిని ప్రస్తావిస్తుంది. ఆ శాసనం చారువాకీ చేసిన దాన ధర్మాలను నమోదుచేస్తూ 'తీవర' రాకుమారుని తల్లిగా ఆమెను వర్ణిస్తున్నాయి. అశోకుని కుమారులలో శాసనాలు పేర్కొంటున్న రాకుమారుడు 'తీవరు' డొక్కడే. శిలాస్తంభంమీద శాసనం ఉన్న స్థానాన్ని బట్టి అశోకుని పాలనకాలం చివరలో ఆ శాసనాన్ని వ్రాసినారని తెలుస్తుంది. 'చారువాకీ' చేసిన దానధర్మాలన్నింటినీ నమోదు చేయవలసిందిగా మహామాత్తులను ఆ శాసనం ఆజ్ఞాపిస్తుంది. 'చారువాకీ' అనేది

వ్యక్తిగత నామమని, ఆమెయే పట్ట మహిషి అయిన తరువాత 'తిస్సరఖ్ఖా' నామం ధరించిందని కొందరు సూచిస్తున్నారు. చారువాకీని రెండవరాణి అని వ్యవహరించడం, తిస్సరఖ్ఖా రెండవ పట్ట మహిషి కావడం ఉభయులు ఒక్కరే అని సూచిస్తుంది. తన దాన ధర్మాలన్నీ నమోదు కావాలని ఆజ్ఞాపించడం తిస్సరఖ్ఖా స్వభావానికి చాల అనుగుణంగా ఉంది.

పద్మావతి అశోకుని మూడవ భార్యగా దివ్యావదాన పేర్కొంటున్నది. బౌద్ధమతంలో ఎంతటి ఆసక్తిపరుడైనా రాజు హక్కైన బహు భార్యాత్వాన్ని అశోకుడు వీడలేదని తెలుస్తుంది. పద్మావతి ఏనాడూ పట్టమహిషి కాలేదు. కాని ఆమెయే యువరాజైన కునాలుని తల్లి. కునాలునకే ధర్మవివర్ధనుడను మరో పేరు. అసంధిమిత్తాకు సంతానం లేనట్లు కనిపిస్తుంది. అందుచేతనే పద్మావతి కొడుకును యువరాజుగా ప్రకటించారు. ధర్మ వివర్ధనుడు అశోకుని కుమారుడని గాంధారలో రాజప్రతినిధియని పాహియాన్ వ్రాసినాడు. అశోకుని మరొక కుమారుడైన జలౌకుని రాజతరంగిణి పేర్కొంటున్నదిగాని అతని తల్లి పేరును చెప్పడం లేదు. అశోకునకు ఇద్దరు కుమార్తెలున్నట్లు తెలుస్తుంది. అందొకరు సింహళ ఇతిహాసాలు పేర్కొంటున్న 'సంఘమిత్త'. ఈమెను గురించి పైన ముచ్చటించాము. రెండో కుమార్తె చారుమతి. ఈమె క్షత్రియ దేవపాలుని పెండ్లియాడింది. అశోకుని పౌత్రులలో సంప్రతి, దశరథుడు తరచుగా కనిపిస్తారు. సంప్రతి కునాలుని కుమారుడు. ఇక ఇతర సభ్యులను, వారి ప్రాముఖ్యాన్ని తరువాత సముచిత స్థానాలలో వివరంగా చర్చిద్దాము.

## కాల నిర్ణయము

అశోకుని కాలము ఇంతవరకు అనిశ్చితంగా ఉండడం దురదృష్టకరము. ప్రాచీన భారతచరిత్రలోని మరికొన్ని యుగాలలో వలెనే అశోక చక్రవర్తి తన తేదీల నివ్వడంలో మరికొంత స్పష్టంగా ఉండి ఉంటే బాగుండేదని చరిత్రకారుడు ఆశిస్తాడు. అశోక శాసనాల తేదీలు నిర్ణయించడంలో ఉదయించే మొదటి ప్రశ్న అందు ఉదాహృతయులైన సంవత్సరాలు గడుస్తున్నవా లేక గడించినవా అనేది.

తేదీలకు సంబంధించిన "వసాభిసిత్తేన" అనే సమాసం పెక్కు శిలా శాసనాలలో కనిపిస్తుంది. దీనికి 'పట్టాభిషేక సంవత్సరాలు' అని అర్థం. పూర్తి వాక్యము మూడో శిలాశాసనంలో క్రింది విధంగా ఉంది.

'ద్వాదశ వస్సాభి సిత్తేన మయూ ఇదం ఆజ్ఞాపితమ్' – పట్టాభిషేకం అయిన పండ్రెండు సంవత్సరాలకు నేనీ విధంగా ఆజ్ఞాపిస్తున్నాను.

ఈ వాక్యాన్ని పండ్రెండు సంవత్సరాలు పూర్తి అయిన తరువాత అని, పండ్రెండో పట్టాభిషేక సంవత్సరంలో అంటే పట్టాభిషేక జయంతులు పదకొండు గడచిన తరువాత అని కాని అర్థం చెప్పవచ్చు. ఇందు మొదటి అర్థమే తర్క సమ్మతంగా కనిపిస్తుంది.'

"యావ సడువీ సతి వస్సాభి సిత్తే నమే ఏతాయే

అంతవికాయే పమ్నవీసతి బంధ మోఖ్ఖాని కట్టాని"

– ఇరవై ఆరు రాజ్య సంవత్సరాల కాలంలో ఇరవై అయిదుసార్లు నేరస్థుల బంధవిమోచనాన్ని ఆజ్ఞాపించినాను.

ఈ తర్జుమానుసరించి ఇరవైఐదు బంధ విమోచనాలు పట్టాభిషేకకాలం ఇరవైఐదు సంవత్సరాలకు పరివ్యాప్తమై ఇరవైఆరవ సంవత్సరం ప్రవేశించిన తరువాత ఈ శాసనం వేయించినట్లు తెలుస్తుంది. అందుచేత 'వస్సాభిసిత్తేన' సమాసానికి పట్టాభిషేక సంవత్సరం తరువాతి సంవత్సరంలో అని అర్థము. దీన్ని బట్టి శాసనస్థమైనవి గడుస్తున్న వర్షాలుగా కొందరు చరిత్రకారులు భావిస్తున్నారు. చక్రవర్తి జన్మదినము, పట్టాభిషేక దినము వంటి ముఖ్య సంఘటనల సంస్మరణ సూచనగా రాజ్య వర్షాలలో ఖైదీలను విడుదల చేయడం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. కాబట్టి అశోకుని ఇరవై ఆరవ రాజ్యకాలానికి ఇరవై ఐదు మారులు ఖైదీలను విడుదల చేయించినారని భావించడం సమంజసం.

ఐదో స్తంభ శాసనంలోని పై వాక్యానికి ఇటీవల మరొక అర్థం చెబుతున్నారు. "నా పట్టాభిషేకానికి ఇరవై ఆరో రాజ్యకాలం నాటి పట్టాభిషేక వార్షికోత్సవానికి మధ్యకాలంలో ఇరవై అయిదు మారులు ఖైదీల విడుదలను ఆజ్ఞాపించాను." ఈ వాక్యంలోని అర్థం స్వయంద్యోతకమే. ఈ స్తంభ శాసనాన్ని ఇరవై ఆరవ వార్షికోత్సవం అనంతరమే ఇచ్చినారని స్పష్టంగా తెలుస్తుంది. ఇక ఖైదీల విడుదలను గూర్చిన ఇరవై ఐదు అనే సంఖ్య కేవలము కాల్పనికము.

అశోక శాసనాలు నడుస్తున్న లేదా గడచిన సంవత్సరాలలో ఇచ్చినవా అనే సమస్యను కాందహార్‌లో ఇటీవల దొరికిన ద్విభాషా శాసనం పూర్తిగా పరిష్కరిస్తున్నది. ఈ శాసనం గ్రీకు ప్రతి క్రింది వాక్యంతో ప్రారంభమౌతుంది.

"పది సంవత్సరాలు ముగిసిన తరువాత ప్రియదర్శి రాజు మానవుల పట్ల ధర్మశీలాన్ని ప్రదర్శించినాడు" దీనికి సామ్యమైన వాక్యమే శాసనం అరమిక్ ప్రతిలో గూడ ఉంది. దీన్ని బట్టి అశోకుని శాసనం పేర్కొన్నవి గడచిన సంవత్సరాలే అన్నది స్పష్టమౌతుంది.

అశోకుని రాజ్యకాల విభాగ వివరణలో మొదటి సమస్య అతని పట్టాభిషేక సంవత్సరం. దీనికి సంబంధించినదే బిందుసారుని మరణానికి, అశోకుని పట్టాభిషేకానికి మధ్య

సుప్రసిద్ధమైన నాలుగు సంవత్సరాల అరాజకాన్ని గూర్చిన సమస్య. ఈ విషయంలో ఆధారాల మధ్య వైరుధ్యం ఉంది. సింహళ చరిత్రలు ఆ అరాజకాన్ని పేర్కొంటున్నాయి. కాని అరాజకం పట్ల పురాణాలు మూకీ భావం వహిస్తున్నాయి.

అశోకుడు సింహాసనానికి వారసుడుకాడనీ, బిందుసారుని మరణానంతరం సింహాసనానికై సోదరులతో అతనికి ఘర్షణ జరిగిందనే సంప్రదాయాన్నే అంగీకరిస్తే నాల్గు సంవత్సరాల అరాజకం సంభవమే అనడం తర్కసమ్మతమౌతుంది. తన పదవిని సుస్థిరం చేసుకొనడానికి నాల్గు సంవత్సరాలనేది ఎక్కువ కాలం కానే కాదు. సంప్రదాయాన్ని సందేహించి, అరాజకాన్ని అంగీకరించనక్కరలేదు అని వాదించే కొందరు చరిత్ర కారులున్నారు. అయినప్పటికీ బిందుసారుని కొడుకుల మధ్య వారసత్వ యుద్ధం జరిగిందనడానికి హేతువులను ఈ అధ్యాయం మొదట్లో వివరించాము.

"రాజ్యాధిపత్యాన్ని సాధించిన నాల్గు సంవత్సరాలకు కీర్తిమంతుడు (అశోకుడు) పాటలీపుత్ర నగరానికి చక్రవర్తిగా పట్టాభిషేకం జరుపుకొన్నాడు" – అని మహావంశ చెబుతుంది. ఎగర్‌మంట్ ఈ నాల్గు సంవత్సరాల కాలవ్యవధిని అంగీకరించాడు. బుద్ధుని అనంతరం రెండువందల పద్దెనిమిది సంవత్సరాలకు అశోకుని పట్టాభిషేకం జరిగిందనే సంప్రదాయాన్ని ఏదో విధంగా సమర్థించడమే సింహళ చరిత్రల ఉద్దేశమని అతని వాదం. బుద్ధుని మరణానంతరం 218 సంవత్సరాల సంప్రదాయాన్ని సమర్థించడానికై క్రొత్త రాజుల పేర్లను ఇరికించడం, రాజ్యాకాలాలను లేదా తగ్గించడం మొదలైన కల్పనల ద్వారా పట్టాభిషేకానికి పూర్వం నాల్గు సంవత్సరాల పాలనాకాలాన్ని అశోకునకు అంట కట్టడం అవసరమైంది అని అతడంటాడు.

ఏదో ఒక పద్ధతికి అనుకూలించే విధంగా తేదీలను తారుమారుచేసినట్టు సింహళ చరిత్రలను నిందిస్తే పురాణాలు సైతం తదనుగుణమైన మరొక దోషానికి పాల్పడినట్లు చెప్పవలసి వస్తుంది. నాల్గు సంవత్సరాల వ్యవధిని పూరించడమే లక్ష్యమైనట్లయితే ఆ కాలాన్ని ఇతర రాజ్యకాలాలకు సర్దుబాటు చేసి ఉండేవారు. ఆ పని ఇతరుల దృష్టిని ఆకర్షించేది కాదు. నాల్గు సంవత్సరాల వ్యవధి కేవలం తేదీలను అనుకూలంగా సర్దుబాటు చేయడానికై ఇరికించినదికాదని, అనాదిగా వస్తున్న సంప్రదాయమని, అశోకుడు రాజ్యానికి వచ్చిన పరిస్థితుల దృష్ట్యా అరాజకం యథార్థమైయుండ వచ్చునని మా అభిప్రాయం. బిందుసారుడు తన పట్టాభిషేక వార్షిక దినంనాడే మరణించి ఉండడు. బిందుసారుడు మరణించిన రోజుననే అశోకుడు సింహాసనం ఎక్కి ఉండడు. కాబట్టి వ్యవధికాలం మూడు సంవత్సరాల కొన్ని మాసాలని కాని, సరిగా నాల్గు సంవత్సరాలని గాని నిర్ణయించడం

కష్టం. మా లెక్క ప్రకారం అరాజకకాలం కొన్ని నెలలు తక్కువగా నాల్గు సంవత్సరాలు, ఈ సంప్రదాయం చారిత్రక సత్యంపైనే ఆధారపడి ఉంది. ఉపోద్ఘాతంలో క్రీ. పూ. 272లో బిందుసారుని మరణం వరకు చంద్రగుప్త బిందుసార రాజ్యకాలాలను నిర్ణయించినాము. అరాజకానికి నాల్గు సంవత్సరాల వ్యవధి నివ్వడం వల్ల అశోకుని పట్టాభిషేకానికి క్రీ.పూ. 269-68 తేదీ వస్తుంది.

అశోకుడు బౌద్ధమతం స్వీకరించిన సమస్యకు చరిత్రకారు లెక్కువ ప్రాధాన్యం ఇస్తూ ఉంటారు. కళింగ యుద్ధానంతరం మానవ జాతికి కల్పించిన దుర్భరక్లేశానికి ఖిన్నుడు కావడంవల్ల జరిగిన హఠాత్సంఘటన అని కొందరు చరిత్రకారుల అభిప్రాయము. కాని కళింగ యుద్ధానికి పూర్వమే అశోకుని పరివర్తన జరిగిందని నిరూపించడానికి ఎగ్గర్‌మంట్ ప్రయత్నించినాడు. అయితే ఈ వాదాన్ని గురించిన ఒక సందేహం రావడం సహజం. అహింసా సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన బౌద్ధమతంలోకి క్రొత్తగా మారిన అశోకుడు అంతటి ఘోర యుద్ధం చేయగలడా? అనేదే సందేహం. మధ్యమార్గానికి అశోకుడు స్వీయము, లోక విరుద్ధమునైన వ్యాఖ్యానం ఇచ్చుకున్నాడని గాని లేదా అతని హృదయపరివర్తనం చిత్త సంక్షోభంవల్ల జరిగిన హఠాత్పరిణామం కాదు అనే సూచన కాని ఎగ్గర్‌మంట్ వాదంలో కనిపిస్తుంది.

అశోకుని రాజ్యకాలంలో ఏదో ఒక ప్రత్యేత నిర్దుష్టక్షణంలో పరివర్తన జరిగిందని చెప్పడం వాస్తవాన్ని గోరంతలు కొండంతలు చేయడమే. మతం మార్చుకొన్న వ్యక్తి తన పాత మత విశ్వాసాలను పూర్తిగా త్యజించవలసినంత తీవ్రంగా నాటి భిన్నమత శాఖల మధ్య వైరం ఉన్నదనటానికి సమకాలికము, విశ్వాసయోగ్యమునైన సాక్ష్యం లేదు. ఉపలభ్యమౌతున్న ఏకైక సాక్ష్యం బౌద్ధ గ్రంథాలే. ఇవి దురభిమాన పూరితాలు. వీనిలోని వృత్తాంతాలు తరువాతి కాల పరిస్థితుల కనుగుణంగా రంగులు సంతరించుకొన్నాయి. హిందువులకు బౌద్ధులకు మధ్య కొంత వైరం ఉండి ఉండవలె. కాని తరువాతి శతాబ్దాలలో హిందువులకు, ముస్లిములకు ఉన్నంత తీవ్ర మతవైరం హైందవ భారత చరిత్రలో ఏ యుగంలోను లేనట్లు ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. ఇస్లాములోను, క్రైస్తవమతంలోను మత పరివర్తన సందర్భంలో ఉన్న తంతు బౌద్ధమతంలోలేదు. సంఘంలో చేరకుండా ఉపాసకులుగా ఉన్నవారికి పరివర్తన తంతు లేనందువల్ల పరివర్తన కార్యక్రమానికి బౌద్ధంలో ప్రాధాన్యం లేదని తెలుస్తుంది. ఉపాసకునకు బౌద్ధమతమంటే బౌద్ధజీవిత విధానాన్ని అంగీకరించడం, బౌద్ధభిక్షువులను ఆదరించడం మాత్రమే. ఇవి ప్రత్యేకించి ఉపాసకుని మత కార్యక్రమాలపై ఆంక్షలను విధించడం లేదు.

అశోకుని శాసనాల నుండి అతని మతాన్ని గురించి ఆసక్తికరమైన అంశం ఒకటి తెలుస్తుంది. బౌద్ధమతంలో అతని అభిమానం తరువాతి రోజులలో పెరిగింది. మొదటి శాసనాలలో క్రొత్తగా మతంలోనికి పరివర్తన చెందినాడనే భావాన్ని అశోకుడు కలిగించినాడు. సాధారణంగా క్రొత్తగా మతం స్వీకరించిన వారిలో కన్పించే గాఢమైన స్వమతాసక్తి, మతమౌఢ్యం ఆ శాసనాలలో కన్పించవు. అవి పరివర్తనానంతరం వచ్చిన శాసనాలే కాని అవి కేవల బౌద్ధ ధర్మ సూత్రాలు కావు. అశోకునిలోని విలక్షణమైన వ్యక్తిత్వము మానవతా దృక్పథము వానిలో ప్రతిఫలిస్తున్నాయి.

అశోకుని పరివర్తనానికి సంబంధించిన రెండు గాథలు బౌద్ధ గ్రంథాలలో కనిపిస్తున్నాయి. అందొకటి సింహళ గ్రంథాలలో ఉంది. ఈ కథకు అశోకుని పెద్దన్న అయిన సుమనుని కుమారుడు నిగ్రోధుని వ్యక్తిత్వము కేంద్రము. సింహాసనం కోసం జరిగిన పోరాటంలో అశోకుడు సుమనుని వధించినాడు. అశోకుడు సింహాసనం అధిష్ఠించిన సంవత్సరంలోనే అంటే తండ్రి మరణానంతరం నిగ్రోధుడు జన్మించినాడు. ప్రత్యేక అనుమతితో ఏడు సంవత్సరాల ప్రాయానికే నిగ్రోధుడు భిక్షువైనాడు. అతని మతబోధ హృదయంలో గాఢంగా నాటుకొన్నందున అశోకుడు బౌద్ధాన్ని స్వీకరించినాడని సింహళ గాథ. ఇందలి అతిశయోక్తి స్పష్టంగా తెలుస్తుంది. ఈ కథలోని నిగ్రోధుడు ఏడు సంవత్సరాల ప్రాయానికి ప్రత్యేక ప్రాముఖ్యం ఉన్నదని ఎగ్గర్‌మంట్ సూచిస్తున్నాడు. ఇది చాలా యుక్తికరమైన సూచన. పట్టాభిషేకానంతరం ఏడు సంవత్సరాలకు అశోకుడు పరివర్తన చెందినాడని స్పష్టంచేస్తుంది. కాని పైన చెప్పినట్లు అశోకుని చరిత్రలో పరివర్తనాకాలాన్ని నిర్ధిష్టంగా చెప్పవలసిన పనిలేదు. ఏడో రాజ్యకాలంలోనే అశోకుడు పరివర్తన చెందినాడని వ్రాయడమే అవసరమైతే చరిత్రకారులు నిగ్రోధుని చుట్టూ మరికొంత కల్పన చేసేవారు. తన సోదర పుత్రునితో అశోకుడు రాజీపడినట్లు మాత్రమే ఈ కథ సూచిస్తున్నందనడం సమంజసం. ఏడు సంవత్సరాలకు దాయాదులనుండి తన సింహాసనానికి ప్రమాదంలేదనే విశ్వాసంతో నిగ్రోధునిపై ఆంక్షలు సడలించి అతనికి అంత:పుర ప్రవేశం కలిగించి ఉంటాడు. సింహాసనంపై హక్కు లేనందున నిగ్రోధుడు వయసు వచ్చిన తరువాత బౌద్ధభిక్షువైనాడు.

అశోకుని పరివర్తనకు దారితీసిన సంఘటనలను గూర్చిన వేరొక కథను దివ్యావదాన చెబుతుంది. అదే కథను తిరిగి హుయాన్‌సాంగ్ ముచ్చటించినాడు. గిరిక ప్రేరణపై పాటలీపుత్రంలో అశోకుడొక కారాగారాన్ని నిర్మించి అందలి పరిజనాన్ని చిత్రహింసలకు గురిచేసినాడట. ఒక మారు సముద్రుడనే పరివ్రాజకుని కారాగారంలో నిర్బంధించినాడు.

పూర్వాశ్రమంలో అతడు శ్రావస్తి నగర వర్తకుడు. కారాగారంలో తన అద్భుత శక్తులతో సముద్రుడు తన్నుతాను రక్షించుకోగలిగాడు. ఇది విన్న అశోకుడు సముద్రుని కలుసుకొని అతడు ప్రదర్శించిన అద్భుత కృత్యాలు హృదయంలో హత్తుకోగా బౌద్ధమతాభిమానియైనాడట. సాధారణంగా మత పరివర్తన గాథలలో ఉండే అంశాలన్నీ అంటే మొదట దుర్మార్గ ప్రవృత్తి, అద్భుత పరంపరల ద్వారా జ్ఞానోదయము, చివరకు పరివర్తనము – ఈ కథలో కూడ ఉన్నాయి. ఈ కథ నుండి గ్రహించగల చారిత్రకాంశము శూన్యము.

కొన్ని మార్పులతో ఇవే కథలు అశోకావదానలో కూడ ఉన్నాయి. అందొక విభాగంలో వర్తకుని కుమారుడు అశోకుని పరివర్తనకు బాధ్యుడని అతడు పన్నెండు సంవత్సరాల ప్రాయంవాడని వాని పేరు సముద్రుడని ఉంది. ఇది పై రెండు కథల సంకీర్ణ పాఠమైనట్లు కన్పిస్తుంది. అశోకుని నరకంలో చిత్రహింసలకు హానిచెందని భిక్షువే సముద్రుడు. అతని లేత ప్రాయం నిగ్రోధుని కథయొక్క ప్రభావమై ఉంటుంది. ఆ – యూ – వాంగ్ – ఛూన్‌లో నమోదైన సంప్రదాయం ప్రకారం ఏడు సంవత్సరాల ప్రాయం ఉన్న శ్రమణకుడు రాజు పరివర్తనకు కారణం. ఆ కథ ప్రకారం అశోకునకు బౌద్ధమతంలో మొదటి నుండి ఆసక్తి ఉంది. కాని అతని చుట్టు ఐదువందల మంది బ్రాహ్మణులుచేరి వేధిస్తూ ఉండేవారు. శ్రమణుకుడు ఆ బ్రాహ్మణులందరిని దారుణంగా మ్రింగివేసి అనంతరం అశోకుని తన కుక్కుటారామ విహారానికి ఆహ్వానించినాడు. అచట భిక్షువుల రూపంలో ఐదువందలమంది బ్రాహ్మణులు కనిపించి అశోకునకు ఆశ్చర్యాన్ని కలిగించారు. ఈ గాథలో పౌరాణిక కట్టుకథల స్వభావం కనిపిస్తుంది. అందుచేత స్థానిక జానపదగాథల ప్రభావంవల్ల ఈ కథ తయారయిందని చెప్పవచ్చు.

అశోకుని రాజ్యకాలంలో స్పష్టంగా తేదీ నిర్ణయించగల మొదటి సంఘటన కళింగ యుద్ధము. కళింగదేశాక్రమణ. అశోకుని రాజ్యకాలం తొమ్మిదో సంవత్సరంలో అంటే క్రీ. పూ. 260లో అది జరిగిందని 13వ శిలాశాసనం చాటుతోంది. ఆ శాసనంలోనే కళింగలో సంభవించిన జనక్లేశంపట్ల అశోకుడు విచారాన్ని పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చినాడు. క్షణికమైన భావోద్వేగంతో చలించి చేసినదిగా గాక స్వయంకృతాపరాధంగా జరిపిన జనక్లేశాన్ని స్పష్టంగా గుర్తించిన వ్యక్తిలో కనిపించే అర్థవంతము, గాఢమునైన అనుతాపం ఆ శాసనంలో ధ్వనిస్తుంది.

కళింగ యుద్ధం జరిగిన తేదీకి, అశోకుడు బౌద్ధమతం స్వీకరించిన కాలానికి సంబంధం ఉంది. అశోకుడు బౌద్ధమతం స్వీకరించింది కళింగ యుద్ధానికి పూర్వమని

కొందరు, అనంతరమని కొందరు అంటున్నారు. మొదటి వాదాన్ని ఎగ్గర్‌మంట్ సమర్థిస్తున్నాడు. తారానాథుని సాక్ష్యమే తనవాదానికి ఆధారమని అతని విశ్వాసం. "సముద్ర భూతాలు అశోకుని ఆభరణాలు దొంగిలించి, అతనికి ఆగ్రహం కలిగించినాయి. తగిన పుణ్య సాధన ద్వారా అశోకుడు సముద్ర భూతాలను జయించినాడు" అని టిబెట్ చరిత్రకారుని కథనం. ఈ కథలోని సముద్ర భూతాలు లేదా నాగులు సముద్రయానంలో ఆరితేరిన కాళింగులని, పుణ్య సాధన అనేది బౌద్ధమత స్వీకారమని, నాగులను జయించటమే కళింగ యుద్ధమని ఎగ్గర్‌మెంట్ వ్యాఖ్యానము. కాని ఇందలి సంఘటనల క్రమాన్ని గూర్చి సందేహం ఉంది. ఈ యుద్ధంలో కళింగను మాత్రమే అశోకుడు జయించినాడు. కాని సమస్త జంబూ ద్వీపాన్ని జయించినాడని తారానాథుడు వ్రాసినందున పై వృత్తాంతంలోని సంఘటనల క్రమాన్ని సందేహించవలసి వస్తుంది. బౌద్ధమత స్వీకారాన్ని పుణ్య సాధనతో సమీకరించడంలో అతిశయోక్తి స్పష్టంగా కనిపిస్తుంది. అయితే టిబెటన్ గాథ యుద్ధానికి గల వాస్తవ కారణాన్ని సూచిస్తున్నదని మాత్రం చెప్పవచ్చు. దక్షిణ భారతాల మధ్య ఉన్న మెట్ట మార్గాలను, సముద్ర మార్గాలను స్వాధీనం చేసుకోవాలని అశోకుడు ఆశించినాడు. ఆ మార్గాల నటకాయించే శత్రువులను జయించాలనేదే కారణంగా కళింగయుద్ధం చేసినాడు. కళింగ యుద్ధానంతరమే అతని తొమ్మిదో రాజ్య కాలంలో బౌద్ధమతం లోనికి అశోకుని పరివర్తన జరిగిందని, పదకొండు సంవత్సరాల తరువాతనే అంటే అతడు సంఘంలో ప్రవేశించి, దేశయాత్ర చేసిన అనంతరమే బౌద్ధంలో ఉత్సాహం ప్రదర్శించినాడని థామస్‌వంటి చరిత్రకారుల అభిప్రాయం. కళింగ యుద్ధ పరిసమాప్తియే మత పరివర్తన కనుకూలమైన క్షణం. కాని మత పరివర్తన హఠాత్తుగా నాటక ఫక్కీలో జరగలేదనడం చాల వరకు యథార్థం. అంత విచిత్రంగా జరిగి ఉంటే సింహళ భిక్షువులు ఆ సంఘటనను కొండంతలు చేసి ఉండేవారు. సింహళ చరిత్రలలో కళింగ యుద్ధ ప్రస్తావనయే లేదు.

శాసనాల ఆధారంతో పరివర్తన సమస్యలో ఉన్న చిక్కులను విడదీయవచ్చు. గౌణ శిలాశాసనాలలో అశోకుడు తాను బౌద్ధ మతస్థుడనని అంగీకరించినట్లు భావిస్తున్నారు. అందులో ప్రస్తుతమైన భాగం :-

అధికాని అఢ్దాతియాని వస్సాని యా హకం
ఉపాసకే గో తం ఘెం బాఢం ప్రక్కంతే
హుశం ఏకం సవత్సరం సాతిరికె తొ ఖొ
సంవత్సరే యం మయా సంఘే ఉపయితె
బాఢం చ మే పఖ్ఖంతె.

'రెండున్నర సంవత్సరాలకు పైగా ఉపాసకునిగా ఉన్నాను. కాని ఒక సంవత్సరంగా నేను పురోగతిని సాధించలేక పోయినాను. ప్రస్తుతం సంవత్సరం పైగా భిక్షు సంఘానికి సన్నిహితుడను కావటంతో ఎక్కువ కుతూహలినైనాను.' అని పై వాక్యాలకు అర్థం.

అశోకునకు మొదట్లో బౌద్ధం పట్ల గాఢమైన ఆసక్తి లేదనే విషయాన్ని ఈ శాసనం అంగీకరిస్తున్నది. కాబట్టి ఇది ఎగ్గర్‌మంట్ సూచించే తారానాధుని సాక్ష్యానికి విరుద్ధంగా ఉండి బౌద్ధమతం లోనికి అశోకుని పరివర్తన క్రమ పద్ధతిలో జరిగిందని పైన నేను చెప్పిన అంశాన్ని బలపరుస్తున్నది. ఆ విధంగా గాక కళింగ యుద్ధానంతరం మూడు సంవత్సరాల కాలంలో ఏదో ఒక ప్రత్యేక క్షణంలో పరివర్తన జరిగినచో పదమూడవ శిలాశాసనంలో అశోకుడా విషయాన్ని తప్పక చెప్పి ఉండేవాడు. "సంఘానికి సన్నిహితుడనైనాను." అనే మాటలో బౌద్ధాచార్యుల వల్ల బౌద్ధ సిద్ధాంతాలలో శిక్షణ పొందినాడనే సూచన ఉన్నది. ఈ సందర్భంలో భిన్న మత శాఖల మధ్య పరస్పర అవగాహనతో అశోకుడు శ్రద్ధ వహించినాడని మనసులో ఉంచుకోవలె.

భాబ్రా శాసనంలో బౌద్ధ మత బోధనను గురించి మరింత స్పష్టమైన ప్రకటన ఉంది. దురదృష్టవశాత్తు భాబ్రా శాసనానికి తేదీ లేదు. రాజ్యకాలం ఉత్తర భాగంలో సంఘ విచ్ఛిన్న, సంఘ విభేద శాసనాలను ఇచ్చిన సమయంలోనే దాన్ని కూడా ఇచ్చినారని మా అభిప్రాయము. బుద్ధుడు, ధర్మము (బుద్ధ బోధనలు) సంఘములలో తన విశ్వాసాన్ని ప్రకటించి, బౌద్ధ ధర్మాన్ని తాను అంగీకరించినట్లు అశోకుడు భాబ్రా శాసనంలో చెప్పుకొన్నాడు. ఆ శాసనం ప్రత్యేకించి స్థానిక బౌద్ధ మతాచార్యులకై వ్రాయించినదే కాని ప్రజల నుద్దేశించినదీ, ప్రభుత్వ ఉద్యోగులను ఆదేశించినదీ కాదు. ఈ శాసనంలో మాత్రమే తనను మగధ రాజుగా అశోకుడు వర్ణించుకొన్నాడు. అశోకుని శాసనాలను పరిశీలించేటప్పుడు ప్రజలకు ఉద్దేశించిన వానిని వేరు చేయడం చాల ముఖ్యం – మొదటి రకం శాసనాలలో తన ప్రజల నుద్బోధించే మహారాజు పాత్రలో కనిపిస్తాడు. రెండో రకం శాసనాలు వ్యక్తిగతంగా చేసిన మత విజ్ఞాపనలు.

ఐరోపాలో క్రైస్తవ మతాధికారులు పవిత్ర రోమన్ చక్రవర్తిని గౌరవించినట్లే బౌద్ధాచార్యులు అశోకుని తమ యేలికగా లౌకిక అధినేతగా అంగీకరించి ఉంటారు. అందుచేతనే ధర్మంలో తన విశ్వాసాన్ని ప్రకటించడమే గాక మతాధికారులకు పరిచయం ఉండాలని తానాశించిన మత గ్రంథ భాగాలను ఉటంకిస్తాడు. అయితే ఈ ఆసక్తి కేవలం వ్యక్తిగతమైన ఆసక్తిగా మాత్రమే మనం గ్రహింపవచ్చు. పవిత్ర రోమన్ చక్రవర్తితో అశోకుని పోలికను పరిమితార్థంలో మాత్రమే గ్రహించవలె. నాడు ఐరోపాలో క్రైస్తవము అధికార మతము. అశోకుని కాలంలో బౌద్ధము అధికార మతం కాదు.

పట్టాభిషేకానంతరం పది సంవత్సరాలకు క్రీ. పూ. (259–258) అశోకుడు సంబోధికి వెళ్ళినట్లు తెలుస్తుంది. "అయాయ సంబోధిమ్" అనే మాటలను అశోకునకు జ్ఞానోదయమయినదని కొందరు, అశోకుడు బోధి వృక్షాన్ని దర్శించాడని కొందరు రెండు రకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల ఒక గ్రంథంలో 'దీపవంశ' సంబోధి పదాన్ని బోధి వృక్షానికే తరచుగా వాడినట్లు నిరూపితమైనది. అందుచేత భాబ్రా శాసన వాక్యానికి రెండో వ్యాఖ్యానమే సరియైనదని స్పష్టమౌతుంది. దేశ వ్యాప్తంగా అశోకుడు సాగించిన యాత్రలో బోధివృక్ష సందర్శనం ఒక భాగమై యుండవచ్చును. ఈ యాత్రనే పై శాసనం ధర్మ యాత్రగా వర్ణిస్తున్నది.

గౌణ శిలాశాసనం 256 రోజుల యాత్రను పేర్కొంటున్నది. "అయాయ సంబోధిమ్" అనే వాక్యానికిచ్చే అర్థానికి పై అంకెకు సంబంధం ఉంది. ఈ శాసన ప్రతులు పెక్కింటిలో పై సంఖ్య స్పష్టంగా లేదు. కాని సహస్రామ్ శాసనం మాత్రం ఈ సంఖ్యకు యాత్రేతరమైన ప్రాముఖ్యాన్ని స్పష్టం చేస్తున్నది:

ఈయంచ సవనే వివుద్ధేన సం పం న లార్తి

సతా విపుద్ధాతి 200 50 6

యాత్ర సాగిస్తూ ఈ ప్రకటన చేసినాను.

యాత్రలో 256 రాత్రులు గడిచినాయి.

యాత్ర నుండి రాజధానికి మరలిన అనంతరమే అశోకుడు ఈ శాసనాన్ని వేయించినాడని కొందరు రచయితలు వాదిస్తున్నారు. అయినచో యాత్రలో ఎన్ని రోజులు గడిచినదీ నిర్దిష్టంగా చెప్పవలసిన పనిలేదు. "యాత్ర నుండి మరలి వచ్చిన తరువాత" అనే చెప్పేవాడు. కాబట్టి యాత్ర సాగిస్తూనే శాసనాన్ని జారీ చేసినట్లు కనిపిస్తుంది. ఈ శాసనంలోని 256 అంకె పెద్ద చర్చనీయాంశమైనది. 'ఫిలియోజా' ఈ సంఖ్య నొకరకంగా వ్యాఖ్యానించినాడు. బ్రాహ్మణుల వలెనే అశోకుడు సయితము సంవత్సరాన్ని మూడు చాతుర్మాసాలుగా విభజించి అందు "వస్స" అంటే వర్షాకాలము అంతఃపురంలో గడిపి వర్షాలు తక్కువగా ఉండే మిగిలిన రెండు చాతుర్మాసాలను బౌద్ధ భిక్షువు వలె యాత్రలలో గడిపే వాడని అతని సూచన. జ్యోతిష వేదాంగ ప్రకారము ఒక్కొక్క నెలకు 27 రోజుల 6 గంటల 3 నిమిషాల 16 సెకండ్లుగా గుణిస్తారు. దీని ప్రకారం నాలుగు మాసాలకు 109 రోజుల 12 నిముషాల 16 సెకండ్లు. హిందూ పంచాంగం ప్రకారం సంవత్సరానికి 360 రోజులు. 360 నుండి పై సంఖ్యను తీసివేస్తే 256 రోజులు రావడం లేదు. సంవత్సరంలో మూడింట రెండు వంతులంటే 240 రోజులు మాత్రమే. అంటే 256

రోజులకు 15 రోజులు తక్కువ. ఇది భిక్షువులు భిక్షాటన చేయవలసిన రోజులని భావిస్తే నిర్ధేశితమైన కాలం పూర్తికాకుండ 15 రోజులు ముందుగానే అశోకుడు శాసనాన్ని ఇవ్వడం చిత్రంగా కనిపిస్తుంది. సంవత్సరానికి 13 నెలల ప్రాతిపదికపై గుణించిన సంవత్సరంలో మూడింట రెండోవంతు 256 రోజులకు సరిపోదు. జ్యోతిష వేదాంగ మిచ్చిన అహః ప్రమాణాన్ని బట్టి కాలాన్ని గుణించిన ఎనిమిది నెలలకు 218 రోజుల 24 నిముషాల 32 సెకండ్లు మాత్రమే అవుతుంది. ఇది అశోకుడు సాగించిన యాత్రా కాలానికి 36 రోజులు తక్కువ. 256 రోజులు అంటే అధిక మాస దివసాలను విడిచి సంవత్సరానికి 354 రోజులు చొప్పున గుణించినప్పటికీ సంవత్సరంలో రెండు వంతులంటే 256 రోజులు కావు. ఒక సంవత్సరం నుండి మరొక సంవత్సరానికి రోజుల సంఖ్య మారుతూ ఉంటుంది. ఏ విధంగా చూచినా ఈ సంఖ్య బౌద్ధ కర్మకాండలో నిర్దేశించిన కాలంగా పరిగణించడం దారి తప్పడమే అవుతుంది.

అందుచేత అశోకుని పర్యటన బౌద్ధ భిక్షువుగా మహారాజు సాగించిన తీర్థయాత్ర కానేరదు.[1] అయితే ఇది అశోకుడు రాజ్య త్యాగం చేసి భిక్షువైన తరువాత బుద్ధ పరినిర్వాణానంతరం 256వ సంవత్సరంలో అతడిచ్చిన శాసనమనీ, అతని శాసనంలో చివరిదని ఫ్లీట్ సూచిస్తున్నాడు. ఈ సూచనను విశ్వసించడానికి తగిన సాక్ష్యధారాలు లేవు. గౌణ శిలా శాసనం వేయించిన తరువాత చాలకాలం అశోకుడు రాజ్యం చేసినట్లు ఏడో స్తంభ శాసనంవల్ల తెలుస్తుంది. ఏడో స్తంభ శాసనాన్ని తన రాజ్యకాలం 28వ సంవత్సరంలో ఇచ్చినాడు. రాజుగా ఉన్నప్పుడు శాసనాలు ఇచ్చిన ధోరణిలోనే భిక్షువైన తరువాత కూడ శాసనాలు జారీ చేయడం సంభవంకాదు. రాజకీయోద్యోగులను అధికార పూర్వకంగా సంబోధించే ప్రతిపత్తి భిక్షువైన తరువాత ఉండదు. శాసనంలోని రాజుల సంఖ్య మహాపరి నిర్వాణానాంతర సంవత్సరాలనే భావానికి ఆస్కారం లేదు. అదే నిజమయితే అశోకుడా విషయాన్ని స్పష్టంగా చెప్పి అది శుభదినంగా ప్రకటించి ఉండేవాడు. తన పుణ్యకార్యాలను ప్రకటించుకొనడంలో అశోకుడు వినయాన్ని ప్రదర్శించలేదని అతని ఇతర శాసనాల వల్ల తెలుస్తుంది. కాబట్టి శాసనంలోని పదం

---

1. అశోకుడు సంబోధి నాశించి 256 రాత్రులు తపస్సు చేసినాడని 'కెరన్' మరొక సూచన చేసినాడు. 'వ్యుధ' అన్నమాటకు అతడిచ్చిన అర్థం మీద ఈ సూచన ఆధారపడి ఉంది. 256 రాత్రులు జ్ఞానార్జననాసించి తపస్సు చేసేటంత శ్రద్ధ అశోకునకు బౌద్ధ మతంలో ఉన్నట్లు కనిపించదు. తపస్సు చేయటానికిగాను దూర ప్రయాణం చేసి 'ఇసిలా'కు వెళ్ళవలసిన అవసరం లేదు.

వాస్తవాన్ని అంటే అశోకుడు సాగించిన 256 రోజుల యాత్రనుద్దేశించి ప్రకటించినదే. ఆ సంఖ్యకు మరొక ప్రాముఖ్యమేమీ లేదు.

ఈ శాసనం వేయించిన స్థలాలు – భౌగోళికంగా చాల ఆసక్తిదాయకమైనది. అందులో ఒక వర్గం మధ్య భారత ప్రాంతంలో కన్పించింది. మరొకటి సామ్రాజ్యం దక్షిణాగ్రాన ఉన్న ప్రదేశాలలో దొరికింది. సువర్ణగిరి, ఇస్సిలాల ప్రస్తావనతో ఈ శాసనం ప్రారంభమౌతుంది. ఈ ప్రదేశాలు మస్కీ దగ్గర ఉన్న కనకగిరి, సిద్ధాపురము అయి ఉంటాయి. ఈ శాసన ప్రారంభ వాక్యాలు :

సువంణ గిరీతే అయ్యపుత్తస్స మహా మాత్తా కాంచ
వచనేన ఇసిలస్సి మహామాత్తా ఆరోగ్యం వత్తవియ

సువర్ణగిరి నుండి ఆర్యపుత్రుని ఉద్యోగుల ఆజ్ఞపైన ఇసిలా ఉద్యోగులకు సదారోగ్యం.

పాటలీపుత్రం నుండే ఈ శాసనాన్ని జారీచేస్తే ఈ ప్రారంభవాక్యం ఉండవలసిన అవసరం లేదు. ఇందలి ఆర్యపుత్రుడు బహుశా స్థానిక రాష్ట్రాధిపతి అయి ఉంటాడు. అతని ప్రసక్తిని బట్టి ఇసిలా ఉద్యోగులకు శుభాకాంక్షలు చెప్పటాన్ని బట్టి ఈ శాసనం స్థానికంగానే జారీచేసినట్లు సూచిస్తున్నది. బహుశా అశోకుడు సామ్రాజ్యం దక్షిణ ప్రాంతాలలో పర్యటిస్తూ ఈ శాసనం ఇచ్చి ఉంటాడు. అయితే పాటలీపుత్రానికి సమీపంలోని సహస్రామ్, రూపనాథ్‌లలో కూడా ఈ శాసన ప్రతులున్నాయి. ఈ ప్రాంతాలగుండా అశోకుడు ప్రయాణం చేసి ఉండవచ్చునని తన పర్యటనలో తటస్థపడిన ముఖ్య స్థలాలన్నింటిలో ఈ శాసన ప్రతులను అతడు వేయించినాడని కొందరు సమర్థిస్తున్నారు. కాబట్టి 256 రాత్రులు అశోకుడు దేశ పర్యటనలో గడిపిన మొత్తం కాలం. ఇది కేవలం మతపరమైన పర్యటనే అయితే అశోకుడు బౌద్ధ పుణ్యక్షేత్రాలను దర్శించడంలోనే శ్రద్ధవహించి ఉండేవాడు. బౌద్ధక్షేత్రాలలోనే ఈ శాసనప్రతులు కన్పించి ఉండేవి. పదోరాజ్య సంవత్సరంలో అశోకుడు సాగించిన ధర్మయాత్రలో భాగమే ఈ పర్యటనగా 'ఎగ్గర్‌మంట్' సూచిస్తున్నాడు. కాని కళింగ యుద్ధానంతరమే అశోకుడు బౌద్ధమతంలో ఆసక్తి వహించినచో పదోరాజ్య సంవత్సరంలో ఈ యాత్ర చేయగలిగేవాడు కాదు.

కళింగయుద్ధం పట్టాభిషేకానంతరం ఎనిమిది సంవత్సరాలకు జరిగింది. యుద్ధానంతరం బౌద్ధమతంలో అశోకునకు గాఢమైన ఆసక్తి కలిగిందని భావించవచ్చు. తాను బౌద్ధమతాభిమాని కావడానికి రెండున్నర సంవత్సరాల కాలం పట్టిందని అశోకుడే చెప్పుకొన్నాడు. దీనినిబట్టి రాజ్యకాలం పంద్రెండో సంవత్సరం వస్తుంది. కాబట్టి గౌణశిలా శాసనాల కాలం క్రీ. పూ. 257-256గా నిర్ణయమౌతుంది.

పదమూడవ శిలాశాసనము నుండి లభ్యమౌతున్న సాక్ష్యం అశోకుని కాల నిర్ణయాలకున్న ఆధారాలన్నింటిలో ముఖ్యమైనది. అశోకునకు సమకాలికులైన ఐదుగురు యవనరాజులను ఆ శాసనం పేర్కొంటున్నది. వారిని గుర్తించినచో శాసనం తేదీని నిర్ణయించటానికి తగిన సాక్ష్యం లభిస్తుంది. శాసనంలోని ప్రస్తుతమైన భాగం :-

అత్త అంతియోగే నామ యోసలాజ పవలంచ

తేనా అంతియోగేనా చత్తాలి 4 లజానే

తులమయే నామ ఆన్తికి నే నామ మకానామ

ఆలిక్య సుదలే నామ... ... ... ... ... ... ...

యాంటియోకస్ నాముడైన యవనరాజు రాజ్యంలోను యాంటియోకస్ రాజ్యానికి ఆవల టాలెమీ, యాంటిగొనస్, మగస్, అలెగ్జాండర్ నామధారులైన రాజుల భూములలోను...... వీరిలో మొదటి నలుగురు రాజులను గుర్తించడం సాధ్యమే. వీరు సెల్యూకస్ నికటార్ పౌత్రుడు సిరియా రాజైన రెండో యాంటియోకస్ థియోస్ (క్రీ.పూ. 261-246), ఈజిప్టు రాజైన రెండోటాలెమీ ఫిలడల్ఫస్ (క్రీ.పూ. 285-247), మాసిడోనియా నేలుచుండిన యాంటిగొనస్ గొనతాస్ (క్రీ.పూ. 276-239), సైరీన్ రాజైన మగస్. ఈతడు మరణించిన తేది నిర్ధారణ కాలేదు. క్రీ.పూ. 258-250 మధ్య పెక్కు తేదీలను సూచిస్తున్నారు. ఇక చివరి రాజైన అలెగ్జాండర్ కొరింత్ పాలకుడైనా కావచ్చు. (క్రీ. పూ. 252-244) లేదా ఎపిరస్ రాజైనా కావచ్చు. (క్రీ. పూ. 272-255)

పదమూడో రాజ్య సంవత్సరం నుండి అశోకుడు ముఖ్య శిలా శాసనాలను జారీచేయ సాగినట్లు ఆరో స్తంభ శాసనం ద్వారా తెలుస్తుంది. ముఖ్య శిలా శాసనాల శైలిని, అందలి అంశాలను పోల్చి చూచినచో అది వెంటవెంటనే జారీ చేసినట్లు కన్పిస్తుంది. అందుచే పదమూడో శిలాశాసనం అశోకుని పదునాల్గో రాజ్యసంవత్సరం (అంటే క్రీ.పూ. 256-255)లో వ్రాసినట్లు గ్రహించవచ్చు. మగస్ కాలాన్ని నిర్ణయించినప్పుడు శాసనంలోని అలెగ్జాండరు ఎవరో నిర్ణయించవచ్చు. శాసనంలో పేర్కొన్న రాజుల జీవితకాలంలోనే పదమూడో శిలాశాసనం జారీచేసినట్లు కన్పిస్తుంది. ఈ రాజులలో ఎవరైనా మరణించి ఉంటే ఆ వార్త అశోకునకు చేరటానికి ఒక సంవత్సర కాలం పట్టవచ్చు.

శాసనం తేదీ క్రీ. పూ. 256-255 అయినప్పుడు అందు పేర్కొన్న అలెగ్జాండర్ కోరింత్ ప్రభువు కాజాలడు. కోరింత్‌నేలిన అలెగ్జాండరు క్రీ. పూ. 252 వరకు రాజ్యానికి రాలేదు. అందుచే శాసనం జారీచేసే నాటికి అశోకునకు అతడు తెలిసే అవకాశంలేదు. ఎపిరస్‌నేలిన అలెగ్జాండరు కాలము క్రీ. పూ. 272-255 అయినందున అతడు అశోకునకు

తెలిసి ఉండే అవకాశం ఉంది. అతని మరణవార్త శాసనం వ్రాసిన అనతికాలానికి చేరి ఉండవచ్చు. అందుచేత ఎపిరస్ అలెగ్జాండరే 'ఆలిక్స సుదల' అని మా అభిప్రాయము.

సైరీస్ రాజైన మగస్ కాలాన్ని ఎగ్గర్‌మంట్ సుదీర్ఘంగా చర్చించినారు. కొటల్లస్, ఎథినీయస్‌ల సాక్ష్యము సమకాలిక నాణెములు ఆధారంగా మగస్ మరణించింది క్రీ.పూ. 252–250లోనేగాని, అంతకు పూర్వం కానేకాదని ఇంచుమించుగా ఋజువు చేసినారు. ఈ తేదీ సర్వత్ర అంగీకారం కాదు. అయినప్పటికీ పై గ్రీకురాజులందరిలో ప్రథమంగా చనిపోయినవాడు ఎపిరస్ రాజైన అలెగ్జాండర్. అతడు క్రీ.పూ. 252లో చనిపోయి ఉంటాడు. కాబట్టి పదమూడో శిలాశాసనం వేసింది క్రీ.పూ. 254 అని సూచించవచ్చు. కాని క్రీ.పూ. 256–255 యథార్థమైన తేదీకి సన్నిహితంగా ఉంటుందని మా అభిప్రాయం.

తన సామ్రాజ్యం వెలుపల ధర్మ ప్రచారానికై రాయబారులను పంపే సందర్భంలో అశోకుడీ గ్రీకు రాజులను పేర్కొన్నాడు. ఈ రాయబారులనే మత ప్రచారకులని కూడ వ్యవహరిస్తారు. అదే కార్య నిర్వహణకై మహేంద్రుడు సింహళానికి వెళ్ళినాడు. ఈ రాయబారుల సమయ సందర్భాలకు సంబంధించిన ప్రశ్న కూడ ఉదయిస్తుంది. పాటలీపుత్రంలో జరిగిన మూడో బౌద్ధ సంగీతి ఈ రాయబారాలు పంపటానికీ ముందు ఏర్పాటయిందని, వీనికి సంగీతియే కారణమని చెబుతారు. ఇంతకు పూర్వం సంఘ సమావేశాలు రెండుమార్లు జరిగినాయి. మొదటి సమావేశం మగధలోని రాజగృహ నగర సమీపంలో జరిగింది. పిటకాలుగా సంతరించిన బుద్ధుని బోధనలను వ్యాఖ్యానించి క్రమబద్ధం చేసే ఉద్దేశంతో మొదటి సంగీతి బుద్ధుని మరణానంతరం అచిరకాలంలోనే సమావేశమయింది. బౌద్ధ తపస్వినులకు ప్రత్యేక సంఘ నిర్మాణాన్ని అనుమతించడం వంటి సనాతనేతర భావాలకు బుద్ధుని అభిమాన శిష్యుడైన ఆనందుణ్ణి మొదటి సంగీతిలోనే అభిశంసించారు. రెండవ సంగీతి వైశాలిలో జరిగిందని చెబుతారు.

కేవలం పాళీ గ్రంథాలలో మాత్రమే మూడో సంగీతి ప్రసక్తి ఉంది. అందుచే కొందరు ఈ సంగీతి యాథార్థ్యాన్ని శంకిస్తున్నారు. సంగీతిని సమావేశ పరచడంలోను అందు నిర్ణయాలు జరపడంలోను, అశోకుడు ప్రముఖ పాత్రను నిర్వహించాడని పాళీ గ్రంథాలు చెబుతున్నాయి. కాని తన శాసనాలలో అశోకుడా విషయాన్ని ప్రస్తావించక పోవడం చాల విచిత్రం. అయితే సంఘ సమైక్యాన్ని గురించి, విరుద్ధ భావాలు గల పరివ్రాజకుల, తపస్వినుల సంఘ బహిష్కారాన్ని గురించి అశోకుడు గట్టిగా మాట్లాడినాడు. సనాతన వాదులను, భిన్న మత వాదులను ప్రత్యేకించి చెప్పడం నాటికి ఆ అంశంపై కొంత వివరణ జరిగిందని, కొన్ని వ్యవహార సూత్రాలు రూపొందినాయని సూచిస్తున్నది.

పరినిర్వాణానంతరం 236 సంవత్సరాలకు, అశోకుని పట్టాభిషేకానంతరం 18 సంవత్సరాలకు బౌద్ధ విహారాలలో అధార్మిక మతశాఖలు ప్రవేశించడం వల్ల విశ్వాసాలలోను, ఆచారాలలోను ధర్మ శైథిల్యం ఏర్పడినట్లు 'దీపవంశ' వివరిస్తున్నది. ఈ పరిస్థితులు సనాతన బౌద్ధాచార్యులకు ఆగ్రహాన్ని కలిగించినాయి. అశోకుని మంత్రులలో ఒకరు 'పాతిమొఖ్ఖా' వ్రతాన్ని పునరుద్ధరించాలని ఆదేశించినాడు. బౌద్ధ భిక్షువులు నిర్వాణ ప్రాప్తికై ఆచరించే ప్రాయశ్చిత్త కార్యక్రమమే పాతిమొఖ్ఖా. విహారాలలో కొందరు స్థవిరులు సయితం పాతిమొఖ్ఖాను మానడం వల్ల మంత్రి కోపించి, వారిని చంపడం ప్రారంభించినాడు. ఇదే కథను మహావంశ సుదీర్ఘంగా వర్ణిస్తుంది. అశోకుని సోదరుడు సనాతన ధర్మపరుడునైన 'తిస్సా' స్థవిరుల మృతికి సంతాపం చెంది, ఆ విషయాన్ని మంత్రి ద్వారా అశోకునకు విన్నవించడంతో స్థవిరులను చంపడం ఆగినట్లు మహావంశలో ఉంది. ఉత్తరాది గ్రంథాలలో ఇదే కథ కొద్ది మార్పులతో కనిపిస్తుంది. నిర్గ్రంధులకు, బౌద్ధులకు మధ్య సంఘర్షణ జరిగిందని, అందు ధర్మపరుడైన మహారాజు సోదరుడు మరణించగా, మహారాజు జోక్యం కలిగించుకొని, ఉభయ మతముల మధ్య సామరస్యం నెలకొల్పినాడని ఉత్తరాది గ్రంథాలు చెబుతున్నాయి. అ-యూ-వాంగ్-చువాన్‌లో కూడ ఇదే కథ కన్పిస్తుంది. కాని అందులో నిర్గ్రంధుడని పొరబడి మహారాజు సోదరుని చంపినారని ఉంది. పై రెండు కథలకు సంఘక్షాళన వృత్తాంతాన్ని జతపరచి పాళీ గ్రంథాలు చెబుతున్నాయి. అశోకుడు పూజ్య స్థవిరుడు, బౌద్ధ ధర్మ ఆచార్యుడు నైన మొగ్గలిపుత్త తిస్సకు కబురంపి అశోకా రామమనే ప్రసిద్ధ విహారంలో బౌద్ధభిక్షువుల నందరను సమావేశ పరిచినాడు. ఈ సమావేశంలో విభాజ్యవాదాన్ని విశ్వసించిన వారినే యథార్థ బౌద్ధులుగా నిర్ణయించి, ఇతరులను సంఘం నుండి బహిష్కరించారు. ఈక్షాళనం తరువాతనే మొగ్గలిపుత్త తిస్స అధ్యక్షుడుగా మూడో బౌద్ధ సంగీతి పాటలీ పుత్రంలో జరిగింది. విభాజ్య వాదమే యథార్థ ధర్మంగా ప్రకటించారు. ఈ సందర్భంలో పాళీ గ్రంథాలలోని కథకు, ఉత్తరాది గాథకు ఒక భేదం ఉంది. బౌద్ధులకు, బౌద్ధేతరులకు మధ్య సంఘర్షణ మూడో సంగీతికి కారణం అని, అనంతరం బౌద్ధేతరులను సంఘం నుండి బహిష్కరించారని పాళీ గాథలు చెబుతున్నాయి. శ్రమణుల ప్రాణాలకు మహారాజు హామీ ఇవ్వడంతో సంఘర్షణ ముగిసినట్లు ఉత్తరాది గాథలలో ఉంది.

ఈ రెండు గాథలలోని వస్తువు మాత్రం యథార్థమై ఉండవచ్చు. బౌద్ధమత శాఖలకు, ఇతర మత శాఖలకు మధ్య తరచు సమావేశాలను అశోకుడు ప్రోత్సహించినట్లు అతని శాసనాల నుండి గ్రహిస్తున్నాము. అందుచే బౌద్ధ విహారాలలో ఆజీవికులు, నిర్గ్రంధులు

ఉండడంలో విశేషంలేదు. ఆ విధంగా నివసించడం స్నేహ పూర్వక చర్చలు సాగాలన్న అశోకుని ఆశయంలో ఒక భాగం మాత్రమే. ఒకే కేంద్రంలో నివసిస్తున్న భిన్న మత సమాజాల మధ్య సంఘర్షణకు గల అవకాశం అటుంచి వారి మధ్య వాదోపవాదాలు తీవ్రంగా జరిగేవని చెప్పవచ్చు. ఏదో ఒక సమయంలో చర్చలు సంఘర్షణకు దారి తీయడం కూడ సంభవమే. అట్టి సందర్భంలో స్నేహపూర్వక పరిష్కారావశ్యకతను గుర్తించి, కలహిస్తున్న మతశాఖల మధ్య శాంతి నెలకొల్పడానికై అశోకుడు తన మంత్రిని పంపియుండవచ్చు. అందుచేత చక్రవర్తి సోదరుని మరణాన్ని శంకింపవలసి వస్తుంది. ఈ వృత్తాంతాన్ని కరుణా రసభరితం చేసి, తద్వారా పాఠకులపై నైతిక ప్రభావం పెంచే ఉద్దేశంతో చేసిన కల్పనగా పై మరణ గాథ కన్పిస్తుంది.

ఈ సంఘటనలకు సింహళేతర గ్రంథాలు ప్రాధాన్యం ఇవ్వవు. అందుచేత సింహళంలో విభాజ్య వాదులకు, ఇతర బౌద్ధమత శాఖలకు మధ్య కలహాలు జరుగుతున్నందున విభాజ్యవాదానికి బలం చేకూర్చే ఆశయంతో సింహళ రచయితలు చేసిన కల్పనయే సంఘర్షణ కథ అని సవినాక్షదత్ సూచిస్తున్నాడు. అది కూడా నిజమే అయి ఉండవచ్చు.

వివిధ గ్రంథాలు పేర్కొంటున్న సంఘటనలన్నింటిలో సంఘ ప్రక్షాళణ అంశాన్ని మాత్రం అశోకుని శాసనాలు సమర్థిస్తున్నాయి. దీనితో సంఘ విభేదశాసనానికి సంబంధం కనిపిస్తున్నది. సంఘ ప్రక్షాళనం పూర్తయిందని, సంఘ సమైక్యము పునరుద్ధరింపబడిందని ఆ శాసనం సూచిస్తున్నది. సంఘ విచ్ఛిన్నానికి ప్రయత్నించే భిక్షువులు, తపస్వినులు కాషాయ వస్త్రాలకు బదులు, శ్వేతాంబరాలు ధరించి సంఘం నుండి వైదొలగాలని హెచ్చరిస్తున్నది. కాని ప్రక్షాళనానికి పూర్వం బౌద్ధ సంఘ సమావేశం జరిగినట్లు ఈ శాసనం ద్వారా ఋజువు లభించదు. అధార్మికాంశాల నుండి సంఘాన్ని శుద్ధి చేయాలని మాత్రమే చెబుతుంది. ఈ శుద్ధి కర్మ కేవలం స్థానిక సమస్య అయి ఉండవచ్చు. స్థానిక భిక్షు, భిక్షుకీ సమాజాలు మహాత్తుని పర్యవేక్షణలో ఆ కార్యక్రమాన్ని సాగించి యుండవచ్చు. పాటలీపుత్రంలోనే సంఘాన్ని సమావేశపరచి, క్షాళన కార్యక్రమాన్ని స్వయంగా అశోకుడే నిర్వహించి ఉన్నచో ఏదో ఒక శాసనంలో ఆ విషయాన్ని ప్రస్తావించి యుండేవాడనడంలో సందేహంలేదు.

సింహళ సంప్రదాయం ప్రకారం అశోకుడు నూటికి నూరుపాళ్లు బౌద్ధుడు. అదే అశోకుని స్వరూపం విభేద శాసనంలో కూడ కనిపిస్తుంది. అందుచేత ఆ శాసనాన్ని తన రాజ్య కాలం చివరిలో అశోకుడు వేయించినాడని ఒక సూచన. కాని దానిపట్ల మరొక దృక్పథం కూడ లేకపోలేదు. పాలకుడుగా సంఘంలోని స్పర్థలతో అశోకుడు తరచు

జోక్యం కలిగించుకొన్నాడు. అందుచే ఆ స్పర్థలతో పూర్తిగా విసుగెత్తిన పరిపాలకుని దృష్టి నుండి కూడా ఆ శాసనాన్ని వ్యాఖ్యానించవచ్చు. "ఆచంద్రార్కం సంఘం వర్థిల్లాలి" అంటూ శాసనం మొదటి భాగంలో కనిపించే ఆశయం అచంచల విశ్వాసం ఉన్న బౌద్ధుని ప్రసంగం అనడంలో సందేహం లేదు. ఇక రెండో భాగంలోని భిన్న మతావలంబులు సంఘ బహిష్కృతులౌతారనే బెదరింపు ప్రభుత్వోద్యోగుల విధి నిర్వహణకు మత కలహాలు కల్పిస్తున్న ఆటంకాన్ని గుర్తించిన పాలకుని హెచ్చరిక అయి ఉండవచ్చు. భిన్న మత శాఖల మధ్య శాంతి నెలకొల్పడం అంత సుకరమైన పని కాదు. బౌద్ధమతానికి అశోకుడిచ్చిన స్థాయి వేరు. బుద్ధుని బోధనలకు సంఘం ఇస్తున్న వ్యాఖ్యానం స్థాయి వేరు. ఈ రెంటికీ మధ్య పెద్ద అంతరం ఉండడం తథ్యం.

ఇంతకూ శాసనం తేదీ మాత్రం సందిగ్ధంగానే ఉండి పోయింది. పాళీ గ్రంథాలను బట్టి బుద్ధుని మరణానంతరం 263 సంవత్సరాలకు సంఘ క్షాళనము, బౌద్ధ సంఘ సమావేశము జరిగినాయి. పరినిర్వాణము క్రీ. పూ. 486లో జరిగిందని గుణిస్తే క్రీ. పూ. 250లో అశోకుని పందొమ్మిదవ రాజ్య సంవత్సరంలో సంఘ సమావేశం జరిగినట్లు తేలుతుంది. అలహాబాదు స్తంభంపై శాసనం ఉనికిని బట్టి క్రీ. పూ. 250 తరువాతనే శాసనం వేసినారని కొందరి సూచన. ఏడో స్తంభ శాసనం తరువాతనే అంటే అశోకుని 28వ రాజ్య సంవత్సరం తరువాతనే విభేద శాసనాన్ని ఇచ్చినాడని తెలుస్తుంది. ఏడు శాసనాలను అలహాబాదు స్తంభం మీద క్రమబద్ధంగా స్తంభ వృత్త స్థలం మీద ప్రతి అక్షరము ఎంతో శ్రద్ధగా అక్షరాలు సమదూరంలో ఉండునట్లు చెక్కినారు. విభేద శాసనం ఈ శాసనాలకు దిగువన ఉన్నది. దానికి బాగా దిగువన మహారాణి శాసనం ఉంది. స్తంభ శాసనాలకు పూర్వమే విభేద శాసనం చెక్కినట్లయితే అది శాసనాలన్నింటికి పైగా ఉండవలసింది.

ఈ కారణం వల్ల అశోకుని రాజ్యకాలం చివరలోనే విభేద శాసనం వ్రాయడమయింది. వివిధ కేంద్రాలలో బౌద్ధులు, బౌద్ధేతరులు నివసిస్తూ పరిస్థితులు పాళీ గ్రంథాలు వర్ణిస్తున్నంత అస్తవ్యస్తంగా ఉన్నట్లయితే పరిశుద్ధి కార్యక్రమం తన లక్ష్యాన్ని సాధించటానికి మరికొంత కాలం పట్టేది. భిన్న మతస్థులను సంఘం నుండి బహిష్కరించడంతో ఆ కార్యక్రమం పూర్తిగాదు. అశోకుని పందొమ్మిదో రాజ్య సంవత్సరంలోనే అది ప్రారంభమై మరొక పది సంవత్సరాలకు కాని సంఘం పూర్తిగా పరిశుద్ధమై ఉండదు. మత సంఘర్షణలు ముగిసి సనాతన బౌద్ధుల లక్షణాలను స్థిరంగా రూపొందించిన అనంతరమే అశోకుడా శాసనాన్ని జారీ చేసి ఉంటాడు. అందుచేత ఇతర శాసనాలలో అత్యవసరమని అశోకుడు ప్రకటించిన

మత సహిష్ణుతకు విభేద శాసనం విరుద్ధం కాదు. అది బౌద్ధ మతంలోని కలతలు పరిసమాప్తి చెందినవని సూచించే పత్రం మాత్రమే.

అశోకుని పోషణలో బౌద్ధ సంఘం సమావేశం జరగడం చరిత్ర సిద్ధమేనా అనే అంశం అనుమానాస్పదంగానే ఉంది. అశోకునితో ప్రమేయం లేకుండానే మొగ్గలి పుత్త తిస్స పాటలీపుత్రంలో స్థానిక బౌద్ధ సంఘాన్ని సమావేశపరచి ఉండవచ్చు. బౌద్ధ ప్రపంచం నలుమూలల సంఘాలను ప్రక్షాళన చేయాలనే నిర్ణయం మత కలహాల వల్ల ఏర్పడిన సమస్యకు పరిష్కారంగా రూపొంది ఉంటుంది. ఈ నిర్ణయాన్ని ప్రతి స్థానిక సంఘంలోను అమలు జరుపడానికి చాలా కాలం పట్టి ఉండవచ్చు. మత సహిష్ణుతను తీవ్రంగా ప్రచారం చేస్తున్న అశోకునకు సంఘ సమావేశం అంత ముఖ్యంకాదు. కాని మత ఆచార విధులకు అది చాల ముఖ్యం. అందుచేతనే పాళీ గ్రంథాలు సంఘ సమావేశానికి ఎంతో ప్రాముఖ్యాన్ని ఇస్తున్నవి. అదే కారణంగా సంఘ సమావేశంతో అశోకునకు సంబంధం కల్పించే ప్రయత్నం జరిగింది. విభాజ్యవాద బౌద్ధానికి చాల ముఖ్యం కాబట్టి స్థానిక సంఘ సమావేశాన్ని అతిశయోక్తులతో వర్ణించినారు.

జైన మత చరిత్ర కూడా ఇదేవిధంగా భిన్న జైన మత శాఖల సమావేశాన్ని వర్ణించడం చిత్రంగా కనిపిస్తుంది. జైన సంఘానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించిన 'చార్పింటర్' ఆ సంఘటనలను ఈ క్రింది విధంగా వర్ణిస్తున్నాడు.:- క్రీ. పూ. 300 సంవత్సరంలో క్షామం సంభవించింది. క్షామం చివరలో జైన సంఘానికి దురదృష్టం పట్టుకొంది. శ్వేతాంబర, దిగంబర శాఖలుగా జైనసంఘం విచ్ఛిన్నమైంది. దక్షిణ దేశానికి వలస వెళ్ళిన భిక్షువులు సనాతన విశ్వాసాలనే అనుసరించారు. వారు తిరిగి వచ్చి మగధలోని భిక్షువులు అనాచారపరులై ఉండడం చూచి సహించలేక పోయినారు. అందుచేత మత గ్రంథాలను సేకరించి పునర్విచారణ చేసే ఉద్దేశంతో మగధ భిక్షువులు సంఘాన్ని సమావేశ పరచినారు. ఈ విధంగా బౌద్ధ, జైన సంప్రదాయాల మధ్య సన్నిహితమైన పోలిక కన్పిస్తున్నది. ఈ సంప్రదాయాన్ని ఒకరు మరొకరి నుండి అనుసరించారా అనే అనుమానం సహజంగా వస్తుంది.

మూడో బౌద్ధ సంగీతితో మహీందుని సింహళ రాయబార గాథ ముడిపడి ఉంది. మహీందుడు విభాజ్యవాద శాఖీయుడని సింహళ గ్రంథాలు పేర్కొనడాన్ని మనం ఉపేక్షించ కూడదు. పాళీ ఇతిహాసాల ప్రకారం మహీందుని పరివర్తనకు మొగ్గలి పుత్త తిస్స బాధ్యుడు. ఈ పరివర్తన మహీందుడు 20 ఏండ్ల ప్రాయంలో అశోకుని ఆరో రాజ్యపాలనా సంవత్సరంలో జరిగింది. మూడో సంగీతి ముగిసిన తరువాత భారత

ఉపఖండంలోని వివిధ ప్రాంతాలకు, సవీప రాజ్యాలకు బౌద్ధ ప్రచారకులను పంపినారు. రాయబారాలను సంఘటిత పరచడానికి ఒక సంవత్సర కాలం పట్టిందని గ్రహిస్తే అశోకుని ఇరవయ్యో రాజ్య సంవత్సరం అంటే క్రీ. పూ. 249లో మహీంద సింహళం వెళ్ళినాడని భావింపవచ్చు. ఈ అంశాన్ని దీపవంశ బలపరుస్తుంది. దీపవంశ ప్రకారం పరి నిర్వాణం తరువాత 237 సంవత్సరాలకు మహీంద సింహళం చేరినాడు.

మహీంద సింహళం వెళ్ళక పూర్వమే అశోకునకు సింహళ రాజైన 'దేవానాం ప్రియతిస్స'కు మధ్య స్నేహ సంబంధాలుండేవి. పరస్పరం సందర్శించుకొనక పోయినా చిరకాలంగా ఇద్దరూ మిత్రులని "నా మిత్రుడు" అంటూ అశోకుని 'తిస్స' సంబోధించే వాడని అశోకునకు బహుమతులు పంపాలని ఉవ్విళ్ళూరుతూ ఉండేవాడని 'మహావంశ' పేర్కొంటూ ఉన్నది. అశోకుని శాసనాలలో సింహళాన్ని గూర్చిన ప్రసక్తి రెండు మార్లు కనిపిస్తుంది. ఈ రెండూ సంగీతికి పూర్వానివే.

అశోక తిస్సలకు మధ్య సూటి సంబంధాన్ని దీపవంశ పేర్కొంటున్నది. పరి నిర్వాణం తరువాత 236 సంవత్సరాలకు అశోకుని పందొమ్మిదవ రాజ్య సంవత్సరంలో 'తిస్స'కు మొదటిమారు పట్టాభిషేకం జరిగింది. వెంటనే అశోకుని ఆస్థానానికి తిస్స తన పితృవ్య పుత్రుడైన అరిత్థ నాయకత్వంలో ఒక రాయబారాన్ని పంపినాడు. ఈ రాయబారం సింహళం నుండి తామ్రలిప్తి మీదుగా పాటలీపుత్రం చేరింది. మౌర్య రాజధానిలో ఐదు వారాలు గడిపి అరిత్థ సింహళానికి మరలినాడు. బహుమతులతో పాటు తాను ఉపాసకుడనైనానని 'తిస్స' కూడా ఉపాసకుడు కావాలని కోరుతూ అశోకుడొక సందేశాన్ని పంపినాడు. కాని గౌణ శిలా శాసనాన్ని బట్టి అంతకు తొమ్మిదేండ్ల పూర్వమే అశోకుడు ఉపాసకుడైనాడు. అశోకుడు ఆ విషయం ముచ్చటించక పోవడం ఆశ్చర్యకరం కావడమే గాక అశోకుడు తిస్సకు పంపిన సందేశాన్ని అనుమానించటానికి అవకాశం కల్పిస్తున్నది. ఏమైనా అరిత్థ రాయబారం సింహళం చేరిన వెంటనే తిస్స రెండోమారు పట్టాభిషేకం జరుపుకొన్నాడు. ఒక నెల తరువాత మహీంద సింహళం చేరినాడు. నిశితంగా ఆలోచిస్తే అరిత్థ రాయబార వృత్తాంతము, మహీంద దౌత్య వృత్తాంతము ఒకే సంఘటనను సూచిస్తున్నట్లు కన్పిస్తాయి. అందలి రాయబారి రాకుమారుడైన మహీంద అనియే చెప్పవచ్చు. తిస్స అశోకునకు మిత్రుడు. పొరుగు దేశపు రాజు. అట్టివాని పట్టాభిషేకానికి తగినంత ఉన్నత హోదాగల రాయబారిని పంపడం మర్యాద. బౌద్ధ భిక్షువు హోదాలో మహీంద రెండు లక్ష్యాలను సాధించగలడు. ఆస్థానంలో రాయబారిగా ఉంటూ రాజుకు, ఆస్థానికులకు బౌద్ధాన్ని బోధించగలడు.

మరొక కథనంలో కూడ తిస్స దాయాదియైన అరిత్థ ప్రక్ష్యక్షమౌతాడు. ఈ కథ ప్రకారం సంఘమిత్తాను తీసుకొని రావడానికై అతణ్ణి పాటలీపుత్రం పంపినాడు. అంతఃపుర స్త్రీలతో పాటు సింహళ రాణి 'అనులా'కు బౌద్ధ ధర్మాన్ని ప్రసాదించడమే సంఘమిత్తా సింహళం రావడంలోని ఉద్దేశం. ఈ సందర్భంలోనే బోధివృక్ష శాఖను అశోకుడు సింహళానికి పంపినట్లు భావిస్తున్నారు. కొందరు దీని యథార్థాన్ని సందేహిస్తున్నారు. నిజానికి బోధివృక్ష శాఖను సింహళానికి ఎప్పుడు పంపిందీ ఇతిహాసాలు చెప్పడంలేదు. భారతదేశానికి రాయబారిని పంపి బోధివృక్ష బీజాలు సంపాదించి సింహళ రాజొకడు తన దేశంలో నాటినట్లు ఫాహియాన్ స్వీయ గాథలలో వ్రాసినాడు. కాని ఈతని యాత్రలను గూర్చిన గాథలన్నీ అత్యద్భుతమైన ఊహలతో నిండి ఉన్నాయి. సంఘమిత్త ఉదంతం మరొక చక్కని కల్పన కవకాశమిచ్చింది. అందుచే కథలోని ప్రధానాంశానికి రచయిత ఆ ఉదంతాన్ని చేర్చి ఉంటాడు. 'అనులా' మహారాణి అయినందున ఆమె మతం స్వీకరించడానికి 'తిస్స' అనుమతించేవాడు. బోధివృక్ష శాఖ కథలో కొంత సత్యం ఉండవచ్చు. బౌద్ధం పట్ల అభిమానంతో వృక్షాలను 'తిస్స' అశోకుని అడగడం సంభవమే. అతని కోర్కెను తీర్చడంలో అశోకునకు నష్టమేమీ లేదు. పైపెచ్చు తిస్స అభిమానాన్ని మరింత సంపాదించవచ్చు.

మూడో సంగతి ముగిసిన వెంటనే ప్రసిద్ధులైన బౌద్ధ భిక్షువులనెన్నిక చేసి వేరు వేరు ప్రాంతాలకు మత ప్రచారకులుగా పంపినట్లు తెలుస్తుంది. మర్ఝంతిక (కాశ్మీర్–గాంధారలకు), మహాదేవ (మహిష మండలానికి), రక్షిత (వనవాసకు), యోనధర్మ రక్షిత(అపరాంతకు), మహాధర్మ రక్షిత (మహా రట్టకు), మహారక్షిత(యోనకు), మఝ్ఝిమ (హిమాలయ ప్రాంతానికి), సోనా ఉత్తర (సువర్ణ భూమికి), మహీంద (లంకకు) అట్టి బౌద్ధ భిక్షువులలోని వారే.

హిమాలయ ప్రాంతానికి వెళ్ళిన రాయబారం పెద్దది. అది నలుగురు భిక్షువుల బృందము. అందులో కస్సవగొత్త, దూందిభిస్సర, సహదేవ, మూలక దేవులున్నారు. వీరిలో కొందరి పేర్లు సాంచీలో దొరికిన అవశిష్ట కరండకాలలో కనిపిస్తున్నవి. ధర్మరక్షిత ముందు యోనరక్షిత పేరుంది. ఆ పేరు అతడు భారతేతరుడని, బహుశా గ్రీకు లేక పారశీక భిక్షువని సూచిస్తున్నది. సాధారణంగా యోన (యవన) పదం గ్రీకుల నుద్దేశించి వాడేవారు. ఇతణ్ణి భారత పశ్చిమ తీరంలోని అపరాంతానికి పంపి మహారక్షితను యోన ప్రాంతానికి పంపడం విశేషం. యోన అనేది వాయవ్య భారతంలోని ఇండో–గ్రీకు స్థావరాల నుద్దేశించినదిగా కన్పిస్తుంది. కాని రుద్రదాముని జునాగర్ శాసనంలో తుషాస్పుని ప్రసక్తివల్ల

పశ్చిమ భారతంలో కూడ గ్రీకు లేదా పారశీక స్థావరం ఒకటి ఉన్నట్లు తోస్తుంది. మహావంశ తిరిగి వ్రాసే సందర్భంలో భిక్షుకుల పేర్లు తారుమారై యుండవచ్చు. ఈ మత ప్రచారకుల పేర్లలో ఉన్న సామ్యంవల్ల ఈ రాయబారాలు సందేహాస్పదంగా ధ్వనిస్తున్నాయి. కాని ఈ పేర్లు ఆయా భిక్షువులు సంఘంలో ప్రవేశించినప్పుడు పెట్టుకొన్నవై యుండవచ్చు. క్రైస్తవం వంటి కొన్ని మతాలలోవలె బౌద్ధంలో గూడా పరివర్తన సందర్భంలో పేరు మార్చుకొనే ఆచారం ఉన్నట్లు తెలుస్తుంది.

మూడో సంగీతి బౌద్ధ ప్రచారకులను పంపటానికి అశోకుని ధర్మ విజయ విధానానికి సంబంధం ఉందని చరిత్రకారుల అభిప్రాయం. ఈ అభిప్రాయానికి బలంగా పదమూడవ శిలా శాసనాన్ని ఉటంకిస్తారు. నీతి, ధార్మికత్వం ద్వారా స్థాపించినదే యథార్థ విజయమని చాటడమేగాక తన రాజ్యం సరిహద్దులకు ఆవలి ప్రజలు కూడా తన ధర్మ విధానాన్నే అనుసరిస్తున్నారు కాబట్టి తాను ధర్మ విజయాన్ని సాధించినట్లుగా అశోకుడా శాసనంలో ప్రకటించినాడు. కాని ఈ ప్రకటన ఆధారంగా బౌద్ధమత ప్రచారకులకు అశోకుని రాయబారాలకు సంబంధం ఉన్నదని చెప్పలేము. పదమూడో శిలా శాసనాన్ని క్రీ. పూ. 256-255లో జారీ చేసినారు. అందుచేత రాయబారులను అశోకుడంతకు పూర్వమే పంపించి ఉండవలె. తన పదునాలుగో రాజ్య సంవత్సరంలో అంటే బౌద్ధ ప్రచారకులు బయలుదేరక పూర్వమే ధర్మ మహామాత్తులను నియమించసాగినట్లు ఐదో శిలా శాసనంలో అశోకుడు పేర్కొన్నాడు. ధర్మాచరణతోను, ప్రచారంతోను సంబంధించిన విధులు ఉన్న ప్రత్యేక ఉద్యోగుల బృందం ధర్మ మహామాత్తులు.

అశోకుడు సాగించిన దౌత్య కార్యకలాపాలద్వారా ఒక విషయం గ్రహించవచ్చు. దౌత్య వర్గాలు బౌద్ధ మత ప్రచారకుల కంటే ఐదారేండ్లకు ముందుగా నడిచినాయి. బౌద్ధ ప్రచారక బృందాలు కేవలం మతపరమైనవి. వానిని పంపింది బౌద్ధ సంఘం, అశోకుడు కాదు. అశోకుని రాయబార వర్గాలకు, బౌద్ధ గణాలకు సంబంధం లేదు. అయితే ఈ దౌత్య వర్గాలు ఏదో విధంగా బౌద్ధ గణాలకు సాయంచేసి ఉండవచ్చు.

సంఘాన్ని క్షాళనం చేయాలన్న సంగీతి నిర్ణయాన్ని సర్వత్ర తెలియజేయడమే బౌద్ధ గణాల ప్రధాన కర్తవ్యం. ఇక రెండో కర్తవ్యం కొత్తవారిని బౌద్ధమతంలో చేర్చడం. అందుచేత బౌద్ధ గణాలు రాజ్యంలో కొన్ని ప్రాంతాల మీద, సరిహద్దు ప్రాంతాలపైన తమ దృష్టిని కేంద్రీకరించినాయనడం సమంజసం. బౌద్ధ గ్రంథాలలో పేర్కొన్న ప్రాంతాలకు ఇంతకు పూర్వమే ధర్మ మహామాత్తులు నియుక్తులైనారు. కాబట్టి బౌద్ధ గణాలను అశోకుడే పంపినట్లయితే తన ఉద్యోగులనుగాని, రాయబారులనుగాని పంపని దూర ప్రాంతాలకు మాత్రమే పంపి ఉండేవాడు.

బౌద్ధ ఇతిహాసాల సాక్ష్యాన్ని విచారించేటప్పుడు ఆ గ్రంథాలను వ్రాసింది బౌద్ధ భిక్షుక వర్గమని గుర్తుంచుకోవడం చాల ముఖ్యం. అశోకుని పాలనలోని సంఘటనలను వర్ణించినప్పటికీ బౌద్ధ మత వికాసంలో వారి కాసక్తి ఎక్కువ. అందుచేత బౌద్ధ మత వికాసానికి సంబంధించిన వరకే చారిత్రక సమాచారానికి, అందును బౌద్ధ మత చరిత్రలోని ముఖ్య సంఘటనలకు రచయితలు ప్రాధాన్యం ఇచ్చారు. కాబట్టి అశోకుడొక చారిత్రక పురుషుడుగా గాక బౌద్ధ మత వికాసంలో ప్రముఖ పాత్రను నిర్వహించిన రాజుగానే బౌద్ధ ఇతిహాసాలలో కన్పిస్తాడు. కాబట్టి అశోకుని పాలనలోని రాజకీయ సంఘటనలకు, మత సంఘటనలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సర్వదా గుర్తుంచుకోవలె.

అశోకుడు 21వ రాజ్య సంవత్సరంలో బుద్ధుని జన్మస్థలమైన లుంబినీ వనాన్ని దర్శించినాడు. ఇది క్రీ. పూ. 248లో జరిగింది. తానా స్థలాన్ని దర్శించినట్లు స్తంభంమీద శాసనం చెక్కవలసిందిగా అశోకుడాజ్ఞాపించినాడు. క్రీ. పూ. 248లో వచ్చిన గ్రహణానికి, అశోకుడు సాగించిన తీర్థయాత్రకు సంబంధం నిరూపించి ఎగ్గర్‌మంట్ చాల చక్కగా వ్యాఖ్యానించినాడు. అశోకుని కాలాన్ని నిర్ణయించడానికి ఈ సంఘటన చాల ముఖ్యం.

దివ్యవదానలోని కథను బట్టి అశోకుడొక రోజున ఒకే గడియలో 84000 స్థూపాలను నిర్మించాలని ఆశించినాడు. ఈ సంగతి గ్రహించిన 'తేరయశ' తన అరచేతిని సూర్యుని కడ్డుగా పెట్టి మహారాజు ఆశించిన అసంభవమైన కార్యక్రమం పూర్తికావటానికి తోడ్పడినాడు. ఇతర బౌద్ధ గ్రంథాలలో కూడా కొద్ది మార్పులతో ఈ కథ కన్పిస్తుంది. సూర్యుని దాచడాన్ని సూర్య గ్రహణంగా ఎగ్గర్‌మంట్ చేసిన వ్యాఖ్యానం చాల సమంజసంగా ఉంది. ఆ వ్యాఖ్యానానికి మరొక అర్థం చెప్పటానికీ వీలు లేదు. అశోకుని రాజ్యకాలంలో అటువంటి గ్రహణం వచ్చిందా అని లెక్కించి నిర్ణయించడం సులభమే. ఫ్లెజీ, సియర్‌స్కీల పరిశోధనల ఫలితంగా అశోకుని కాలంలో మూడు మార్లు అంటే క్రీ. పూ. 4-5-249, 15-6-242, 9-11-232 తేదీలలో సూర్యగ్రహణం వచ్చినట్లు తెలిసింది. సూర్యగ్రహణాన్ని నిర్ణయించిన తరువాత ఈ మూడు గ్రహణాలలో దివ్యావదాన పేర్కొన్నది ఏదో ఇతర సాక్ష్యంతో నిరూపణ చేయవలె.

సూర్యగ్రహణము, స్థూప నిర్మాణము పూర్తి అయిన అనంతరము స్థవిరుడు అశోకునకు దివ్యదృష్టి ప్రసాదించి బౌద్ధ పుణ్యక్షేత్రాలను దర్శింప చేసినాడు. వీనిలో కొన్ని అశోకుడు స్థూపాలు, చైత్యాలు నిర్మించిన స్థలాలే. వీనిలో బుద్ధుని జన్మభూమి కూడ ఉంది. తారానాథుని రచన ప్రకారం ఈ సంఘటనలన్నీ త్వరత్వరగా జరిగినాయి. దివ్యదృష్టితో పుణ్యక్షేత్రాలను దర్శించడం, స్థూప చైత్య నిర్మాణం అనే విషయాలు సూర్యగ్రహణానంతరం

అశోకుడు సాగించిన తీర్థయాత్రను సూచిస్తున్నట్లు తోస్తుంది. కానిచో వాస్తవానికి వానిని దర్శించడమెలా సాధ్యం. అశోకుని పాలన కాలంలో 20,27,37 సంవత్సరాలలో గ్రహణాలు వచ్చినట్లు కనుగొన్నాము. ఇందు ఏదో ఒక సంవత్సరంలో అశోకుడు దేశాటన లేదా తీర్థయాత్ర సాగించినాడనడంలో సందేహం లేదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 20 లేక 21 వ సంవత్సరంలోనే యాత్ర సాగించి నాడనడం సమంజసం. అందుకు ఆ మరు సంవత్సరమే జారీచేసిన రుమ్మిండై స్తంభ శాసనాన్ని నిదర్శనగా చెప్పవచ్చు. రుమ్మిండై అనేది లుంబినీకి నేటిపేరు. బుద్ధుని జన్మస్థలమైనందున అచట పూజ జరిపించినానని అశోకుడు చెప్పుకొన్నాడు. ఆ స్థలానికి గుర్తుగా ఒక శిల్పాశ్వాన్ని, శిలా స్తంభాన్ని ఎత్తించినాడు. లుంబినీని ప్రత్యేకంగా అశోకుడు గౌరవించినట్లు దివ్యావదాన పేర్కొంటున్నది. బౌద్ధులు దర్శింపవలసిన నాలుగు పుణ్యక్షేత్రాలలో లుంబినీ ఒకటి. అదే సంవత్సరంలో అశోకుడు కనకముని స్థూపాన్ని కూడ దర్శించినాడు. వీటిని బట్టి 21 వ సంవత్సరంలో సూర్యగ్రహణం తరువాత కొన్ని మాసాలకు అశోకుడు తీర్థయాత్ర చేసినట్లు కనిపిస్తుంది.

అశోకుని రాజ్యకాలం ఏడో సంవత్సరంలో క్రీ. పూ. 262–61 లో ఈ సంఘటనలు జరిగినట్లు సింహళ చరిత్రలు చెబుతున్నాయి. కాని సూర్యగ్రహణ సాక్ష్యాన్ని బట్టి ఇది తప్పు. ఏడో సంవత్సరంలో గ్రహణం పట్టలేదు. 21 వ సంవత్సరంలో జరిపిన తీర్థాటనాన్ని కూడ సూటిగా చెప్పడం లేదు. కాని పైన వివరించినట్లుగా అశోకుడా కాలంలో గంగానదిపై ప్రయాణంచేసి ఉండవలె. పాటలీపుత్రంలో మూడో బౌద్ధ సంగీతి అనంతరం మొగ్గలిపుత్త తిస్స గంగానదిపై పడవ ప్రయాణం చేసినాడట. ఈ ప్రయాణం ఏదో ఒక దశలో అశోకుడాతనిని దర్శించినాడని సింహళ గ్రంథాలు చెబుతున్నాయి. అందుచేత సూర్యుణ్ణి దాచడమనేది క్రీ. పూ. 249 మే నెల 4వ తేదీన వచ్చిన సూర్యగ్రహణమని, మరుసటి సంవత్సరం అశోకుడు బౌద్ధ పుణ్యక్షేత్రాలను దర్శించినాడని చెప్పవచ్చు.

అశోకుని పాలనకాలంలో తరువాతి ముఖ్య సంఘటన స్తంభ శాసనాలను జారీ చేయడం. 27,28 రాజ్య సంవత్సరాలలో వీనిని ఇచ్చినట్లు నిర్ణయిస్తున్నారు. ఇందు మొదటి ఆరు శాసనాలు చాలవరకు ధమ్మ సంబంధమైనవి; 27వ సంవత్సరంలో ఇచ్చినవి. మరుసటి సంవత్సరమే అశోకుని కృషిని సమీక్షిస్తూ ముఖ్యంగా ధర్మ వికాసాన్ని వివరిస్తూ చివరి శాసనం చెక్కినారు. అనంతరం క్రీ.పూ. 232లో అశోకుడు మరణించే వరకు ముఖ్యమైన శాసనాలు లేకపోవడం అశ్చర్యకరం. అంతటి అధిక సంఖ్యలో శాసనాలు వేయించిన అశోకుడు చివరి పది సంవత్సరాలు వహించిన మూకీ భావానికి అర్థం చెప్పడం కష్టం.

అశోకుని చివరిరోజులలో ప్రభుత్వ మాతని వశం తప్పిందని సూచించే కథలు బౌద్ధ గ్రంథాలలో చాలినన్ని కనిపిస్తున్నాయి. ఈ రోజులను గురించి మహావంశ ఈ క్రింది సంఘటనను వివరిస్తున్నది. 29వ రాజ్యవర్షంలో పట్టమహిషి అసంధిమిత్తా మరణించింది. తరువాత నాలుగు సంవత్సరాలకు క్రీ. పూ. 237లో తిస్సరఖ్ఖాకు అశోకుడు పట్టమహిషి హోదా ఇచ్చాడు. తరువాత రెండు సంవత్సరాలకు అశోకుని బౌద్ధమహాభిమానం పట్ల అసూయతో తిస్సరఖ్ఖా బోధి వృక్షానికి విషకంటకాన్ని గుచ్చి హాని కలిగించినది. బోధివృక్షం ఎండిపోసాగింది. అశోకునకు ఈ సంఘటన బాధ కలిగించింది. వృక్షం ఎండిపోని భాగాన్ని శ్రద్ధాసక్తులతో పోషించి రక్షించగలిగినాడు. తరువాత 33వ రాజ్య సంవత్సరంలో క్రీ. పూ. 233-32లో అశోకుడు మరణించాడు. ఫాహియాన్ ఈ కథనే వ్రాసినాడుకాని అందు మహారాణి కథలేదు. ఇతిహాసాలలోని ఈ సంఘటనను గురించిన వ్యాఖ్యానంలో కాపట్యం ఉండనక్కరలేదు. అసంధిమిత్తా సంఘంతో మైత్రి వహించినందున ఆమెను మంచి మహారాణి అంటూ వర్ణించారు. ఆలోచనాపరురాలై భర్త భావాలపట్ల అసంధిమిత్తా సానుభూతి వహించిందనే అభిప్రాయం కలుగుతుంది. ఇక తిస్సరఖ్ఖా స్వార్థం మూర్తీభవించినట్లుగా మూర్ఖురాలుగా కనిపిస్తుంది. అశోకుడు బౌద్ధమత వ్యవహారాలపట్ల ఎక్కువ శ్రద్ధ వహించడం, తాత్త్విక చర్చలలో ప్రొద్దుపుచ్చడం ఆమె సమ్మతించలేకపోయింది. కాని ఆధునిక వృక్షశాస్త్ర పరిజ్ఞానాన్ని బట్టి విషకంటకంతో బోధివృక్షానికి హాని కలిగించింది అనే గాథను నమ్మలేము. అయితే విష కంటకంద్వారా గాక మరొకవిధంగా ఆమె దానికి హాని కలిగించి ఉండవచ్చు.

బోధి వృక్షానికి హాని అనేది తన అసమ్మతిని వ్యక్తం చేయడానికి తిస్సరఖ్ఖా అనుసరించిన మార్గాలలో ఒకటి. బోధివృక్షం సహజ కారణాలవలన ఎండిపోయినదనడం సమంజసం. ఏమైనా బౌద్ధంపట్ల పూర్వపు పట్టమహిషివలె తిస్సరఖ్ఖా అభిమానం వహించలేదనడం స్పష్టం. ఆ విషయాన్ని ఇతిహాసాలు బౌద్ధంపట్ల ఆమెకున్న విద్వేషానికి అంటకట్టారు. వార్ధక్యంలో అసంధిమిత్తా పరిణత స్నేహాన్ని కోల్పోవడంచేత కొత్తరాణి మోజులకు లోనై అశోకుడు ఆమె ప్రభావానికి లోనైనాడని ఈ కథలు సూచిస్తున్నాయి.

తిస్సరఖ్ఖాను సంస్కృతంలో తిష్యరక్షితా అన్నారు. అశోకావదాన గాథలామె కాటిల్యాన్ని సమర్థిస్తున్నాయి. రాణి పద్మావతీ కుమారుడైన కునాలుడు సహజంగా రూపసి. అతని కన్నులు చాల అందంగా ఉండేవి. కాని అతణ్ని అంధునిగా చేస్తారని బాల్యంలోనే జోస్యం చెప్పారు. జోస్యం తిష్య రక్షిత కూట కల్పనలవల్ల ఫలించింది. అశోకుని భార్యగా ఉంటూ కునాలుని అందం చూచి అతనిపట్ల తిస్సరఖ్ఖా అనురక్త అయింది. ఆమె ప్రేమను,

ఆహ్వానాన్ని కునాలుడు తిరస్కరించడంతో అతనికి హానిచేయాలని ఆమె సంకల్పించింది. ఇంతలో అశోకుడు వ్యాధిగ్రస్తుడైనాడు. ఉపాయంతో తిష్యరక్షిత వ్యాధి కారణాన్ని కనుగొని నివారించగలుగుతుంది. కృతజ్ఞతతో మహారాజు ఆమె కోరికను తీరుస్తానని వాగ్దానం చేస్తాడు. ఈ వాగ్ధానాన్ని ఆమె ఉపయోగించుకొనడంతో కథ విషాదాంతంగా పరిణమిస్తుంది. తక్షశిలలో జరిగిన తిరుగుబాటు నణచటానికి కునాలుని పంపుతారు. పూర్వ వాగ్దానం పురస్కరించుకొని అశోకుని ముద్రికను సంపాదించి తిష్యరక్షిత తక్షశిల ఉద్యోగులకు కునాలుని గ్రుడ్లు పీకి చంపవలసిందిగా ఆజ్ఞలను జారీ చేస్తుంది. ఉద్యోగులు విభ్రాంతులై మహారాణి ఆజ్ఞలో మొదటిభాగం మాత్రం నిర్వర్తించి రాకుమారుని పట్ల వాత్సల్యంతో అతణ్ని వధింపక తక్షశిలను వీడిపొమ్మని సలహా యిస్తారు. ప్రియపత్ని కాంచనమాలతో కునాలుడు వీణపై పాడుకుంటూ దేశాటనం సాగించి పాటలీపుత్రం చేరుతాడు. ఒకనాడు అశోకచక్రవర్తి కంఠస్వరాన్ని బట్టి కునాలుని గుర్తించి జరిగినదంతా తెలుసుకొని శోకవివశు డై తిష్యరక్షితకు సజీవదహనం శిక్షగా విధించినాడు. పూర్వజన్మలో తాను చేసిన పాపానికి శిక్షగా కునాలుడు అంధుడైనాడని అశోకుడు విచారిస్తాడు. కథను నీతివంతంగా చేయడానికే పశ్చాత్తాప వృత్తాంతం ప్రవేశ పెట్టినాడని అర్థమౌతుంది.

చాలా వరకు ఈ కథ బౌద్ధ భిక్షువుల కల్పనగా కన్పిస్తుంది. బిందుసారుని కాలం చివర్లో అశోకుడు అణచిన తక్షశిల తిరుగుబాటును దగ్గరగా అనుకరిస్తూ చెప్పినదే ఈ తక్షశిల ఉదంతం. అశోకుని పాలనలో కూడ సరిగా అటువంటి సంఘటనే జరిగి ఉండదు. అందుచే నమ్మడం సాధ్యంకాదు. బహుశా మరేదో ప్రాంతానికి కునాలుని రాజ ప్రతినిధిగా పంపి ఉండవచ్చు. ఆ విషయాన్ని అశోక – బిందుసారుల కథతో పొరబడి అశోకావదాన సంపాదకుడు వ్రాసి ఉండవచ్చు. సిర్కాప్‌లో దొరికిన శాసనం నుండి లభిస్తున్న సాక్ష్యం వల్ల మొదటి తిరుగుబాటు యథార్థమని నమ్మడానికి అవకాశం ఉన్నట్లు పైన పేర్కొన్నాము. ఐతే కునాలుని కథకు మరొక అర్థం చెప్పవచ్చు. అశోకుని పాలన కాలం చివర్లో రాజ్యం వివిధ ప్రాంతాలలో తిరుగుబాట్ల నెదుర్కొనవలసి వచ్చిందని వ్యాఖ్యానించవచ్చు. తిరుగుబాట్లకు కారణం అతని శక్తియుక్తులు క్షీణించడం కాదు. అతడనుసరించిన ధర్మంలో క్లేశావహమైన అంశాలను పౌరజనులు వ్యతిరేకించడంవల్ల జరిగి ఉండవచ్చు. ఈ అభిప్రాయాన్ని గురించి చివరి అధ్యాయంలో వివరంగా చర్చిద్దాము.

రాజ కుటుంబంలో అంత ముఖ్యులుకాని సభ్యులు రాజ్య వ్యవహారాలలో జోక్యం కలిగించుకొనడంవల్ల ఏదో కుట్ర జరిగిందని అశోకుని వ్యాధి చికిత్సల గాథ సూచిస్తున్నది. ఈ కథలో తిస్సరఖ్ఖా అశోకుని వాగ్దానం పొందడమే ముఖ్యమైన అంశం. అట్టి వాగ్దానం

పొందడానికి క్లిష్ట పరిస్థితిలో రాజు ప్రాణం రక్షించడమే మార్గం. అసాధ్యమైన వ్యాధితో బాధపడుతున్నట్లు చెప్పడం ద్వారా పై ఆశయాన్ని సాధించడం సులభం. సర్వ సామాన్యం. ఇతర దేశ చరిత్రల్లో సైతం ఇంచుమించు ఇటువంటి గాథలే కన్పిస్తున్నాయి. ఇందులో ఏదైనా చారిత్రకాంశం ఉంటే అది తన చివరి రోజుల్లో అశోకునకు భార్యవల్ల కుటుంబ సభ్యుల వల్ల బాధలు వచ్చినాయనేదే.

అశోకుని చివరి రోజులను గురించి అశోకావదానలో ఉన్నదీ కథ ఒక్కటే కాదు. రాజ్యకాలం చివర్లో భిక్షువులకు దాన ధర్మాలు చేయలేని అతని దుస్థితిని గూర్చిన కథ ఒకటి ఉంది. తన కోశము సమస్తమూ అశోకుడు కుక్కుటారామానికి దానం చేసి అనంతరం కునాలుని కుమారుడైన సంప్రతిని తనకు వారసునిగా ప్రకటించినాడట. సంప్రతి నామమాత్రంగానే రాజైనాడు; అతడు మంత్రుల చేతి కీలుబొమ్మ అయినాడు. అశోకుడు బౌద్ధ సంఘానికి చేసిన దానధర్మాలను నిరసించిన మంత్రులు అతనిపై కుట్రలుపన్న సాగినారు. ఒకరోజున బౌద్ధ భిక్షువొకడు భిక్షార్థమై రాగా ఆ సమయంలో అశోకుడు దానం చేయగలిగిన యావదాస్తి ఒక మామిడిపండులో సగం మాత్రమే. అధికారం కోల్పోయి నిరాశోపహతుడై విషాదభారంతో క్రుంగి అశోకుడు మరణించినాడని ఈ కథ సూచిస్తున్నది.

బౌద్ధ గ్రంథాలలోని ఈ కథలు ఆధారంగా చివరి రోజుల్లో అశోకుని అధికారం క్షీణించడమేగాక ఉద్యోగుల దౌర్జన్యం మితిమీరి, బల ప్రయోగం కూడదని నేర్చుకున్న రాకుమారులు సామ్రాజ్య పాలనను నిర్వహించలేకపోయినారని కొందరు చరిత్రకారులు వ్రాస్తున్నారు. తన వారసునకు, తన విధానాలను వ్యతిరేకించిన మంత్రులకు అధికారాన్ని అప్పగించి వృద్ధాప్యంలో ప్రభుత్వ నిర్వహణ నుండి అశోకుడు విరమించినాడని మరికొందరి వాదన. బౌద్ధ గాథలను యథాతథంగా విశ్వసించడమే ఈ అభిప్రాయాలలోని ప్రధాన లోపం. రాజ్యకాలం చివర్లో అశోకుని అధికారం కొంత క్షీణించిందనడంలో సందేహంలేదు. అశోకుని వారసుని గూర్చి వివిధ ఆధారాల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం అశోకుని చివరి రోజుల్లో కొంత అలజడి జరిగినట్లు సూచిస్తుంది. మంత్రులు కుట్ర చేసినారనిగాని, అశోకుడు తన సర్వస్వం సంఘానికి దానం చేసినాడనిగాని చెప్పడానికి అవకాశం లేదు. ఆ గాథలలో రాధాగుప్తుడనే మంత్రియే కుట్రకు కారణం అని ఉన్నది. రాధాగుప్తుడు బిందుసారుని మంత్రి; సింహాసనం ఆక్రమించడంలో అశోకునకు సాయం చేసినవాడు; ఆ తరువాత ముప్పయి ఆరు సంవత్సరాల అశోకుని పాలనానంతరం రాధాగుప్తుడు ప్రభుత్వంపై కుట్ర పన్న గలిగినంత శక్తిమంతుడై యున్నాడనడం విశ్వసనీయం కాదు.

ఈ గాథలలోని సత్యాన్ని విచారించే ముందు అవి ఏ ఉద్దేశంతో వ్రాసినవో గుర్తుంచుకోవడం ముఖ్యం. అదీగాక అవి ఒక వ్యక్తి వ్రాసినవి కావు. వానిని వేరు వేరు ప్రాంతాల నుండి సేకరించడం జరిగింది; తరచుగా అవి మార్పులకు లోనైనాయి. సంప్రదాయాలు తలెత్తిన ప్రాంతంలోనే శతాబ్దాల తరబడి ప్రచారమైన భావాలవల్ల అవి రూపు మారిపోయినాయి. బౌద్ధ నీతికి అనుగుణంగా భిక్షువులే గాథలను మార్చినారనడంలో సందేహం లేదు. బౌద్ధుల దృష్టిలో సత్యమని విశ్వసించిన దానిని నిరూపించడమే ప్రతి కథకు లక్ష్యం. ప్రతి కథలోని నీతి బుద్ధుని బోధనలకు అనుగుణంగా ఉంటుంది. అదే ధోరణిలో అశోకుని కథను సైతం రూపొందించినారు. దుష్టుడుగా, మతద్వేషిగా జీవితం ప్రారంభించిన అశోకుడు బౌద్ధ మత స్వీకారంతో ధర్మ పరత్వానికి అవతార మూర్తియైనాడు. కాని ఎంతటి ధర్మపరుడైనా అతని చివరి రోజులు దుఃఖమయమైనాయి. అతని యావదాస్తిగా ఒక మామిడిపండులో సగం మాత్రమే మిగిలింది. కాబట్టి భూమిపై ప్రతి వ్యక్తి జీవితము దుఃఖ భాజనమే. ధర్మాత్ముడైన అశోకుడు సైతం తనవాటా బాధలను అనుభవించక తప్పలేదు. జీవితం చివర్లో వచ్చినందున బాధ లాతనికి దుర్భరమైనాయి. అందుచే సమకాలికుల దృష్టిలో అతడు పరాజితుడని నిరూపించడమే బౌద్ధ గాథల ఉద్దేశం.

## మూడో అధ్యాయము

# సమాజము - ఆర్థిక కృషి



ఉపోద్ఘాతంలో అంటే మొదటి అధ్యాయంలో చెప్పినట్లు అశోకుని విధానాలను అవగాహన చేసికోవడానికి మౌర్యయుగ భారతంలోని ఆర్థిక, సాంఘిక పరిస్థితుల పరిశీలన చాల అవసరం. మౌర్యులు ప్రత్యేకంగా కేంద్రీకృత పాలనా వ్యవస్థను రూపొందించి నారు. నాటి పరిస్థితులే ఆ పాలనావ్యవస్థ రూపొందటానికి సహాయకారులైనాయి. ఆర్థిక, సాంఘిక పరిస్థితుల పరస్పర ప్రభావాన్ని పరిశీలించడం కూడ అవసరం. మతశక్తిగాని, ఆర్థిక విధానం గాని, తాత్త్విక ఉద్యమంగాని ఏ ఒక్క శక్తి సమాజ వికాసానికి పూర్తిగా కారణం కాలేదు. ఈ శక్తులు పరస్పర సంబంధం కలిగి సమాజ వికాసంలో సమిష్టిగా ప్రముఖ పాత్రను నిర్వహిస్తాయి. అయినప్పటికీ కేవలం భౌతికమైన జీవన క్రమంలో ప్రాథమిక స్థాయిలో సంబంధం ఉన్నందున ఆర్థికాంశం సమాజ స్వరూపాన్ని మార్చగలుగుతుంది. చరిత్ర పరిశీలనకు సత్యాన్వేషణయే లక్ష్యమైనపుడు ఏ యుగ చరిత్రలోనైనా వివిధ శక్తులు నిర్వహించిన పాత్రలను తప్పనిసరిగా ఆలోచించవలె.

సమాజ స్వరూపాన్ని తీర్చిదిద్దే సాంఘికాంశాలకు, ఆర్థిక శక్తులకు మధ్య సన్నిహిత సంబంధం ఉంటుంది. అందుచే

విశ్లేషణాత్మకమైన పరిశీలనలో అవి పరస్పరం కలిసిపోతూ ఉంటవి. ఇక మౌర్యయుగ జీవితంలో ఆర్థిక, సాంఘిక శక్తులకు ప్రత్యేక ప్రాధాన్యముంది. సామ్రాజ్య నిర్మాణమంటే కొత్త ఆర్థిక విధానాన్ని అంగీకరించడమే. కొత్త ఆర్థిక పరిణామాలు సాంఘిక వ్యవస్థను ప్రభావితం చేసినాయి. మౌర్యయుగానికి పూర్వం ప్రాచీన పశుపాలక ఆర్థిక విధానం మారి వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణ ఆర్థిక విధానం రూపొందింది. ఈ విధానం గంగానది లోయలో అడవులను ఛేదించి గ్రామీణ వ్యావసాయక సంఘాలేర్పడడం వలన వచ్చిన సహజ పరిణామమే. ఇది గంగానది లోయలో సాధారణ విధానంగా ఏర్పడింది. ఇంచుమించు శాశ్వతమైన నివాసాలు ఏర్పడినందున వర్తకం వంటి ఇతర సౌకర్యాలు సమకూర్చుకునే అవకాశం కలిగింది. రవాణా సౌకర్యం కల్పించి వర్తకానికి కూడ గంగానది ఉపకరించింది. వర్తకాభివృద్ధి శ్రేణి వ్యవస్థ ద్వారా వణిక్సమాజ నిర్మాణానికి తోడ్పడింది. నగర జీవితంలో శ్రేణులు ప్రధానంశమై సమాజంలో కొత్తశక్తి ప్రవేశించింది. ఆర్థిక విధానంలోని ఈ మార్పులు గంగానది లోయ నుండి క్రమంగా ఇతర ప్రాంతాలకు విస్తరించడంవల్ల ఆ ప్రాంతాలన్నీ ఒక్క భౌగోళిక ప్రమాణంగా రూపొందినాయి. ఈ భౌగోళిక ప్రమాణం ఏకైక రాజకీయాధిపత్యం క్రిందికి రావడంతో పాలనావిధానం రూపొందించడం సాధ్యమయింది. సాధారణంగా పెక్కు ప్రాంతాలలో ఒకే విధానం అమలుజరగడం వల్ల పాలనా సూత్రాలను రూపొందించడం సులభమౌతుంది.

ఇలా వ్రాయడంవల్ల వ్యావసాయక-ఆర్థిక విధానం స్థిరపడడంతో ఇతర ఆర్థిక విధానాలు సాధ్యంకావని చెప్పడం కాదు. ఆర్థిక వ్యవస్థలో మార్పులు ఉంటూనే వచ్చినాయి. కాని ఈ మార్పులు వాని కనుకూలమైన ప్రాంతాలలోనే కేంద్రీకృతమైనాయి. వ్యావసాయిక ఆర్థిక విధానం విస్తరించడంలో దేశంలో ప్రధానంగా ఒకే ఆర్థిక విధానం ఏర్పడింది. ఇట్టి విధానంవల్ల పన్నులను విధించి వసూలుచేయడం సుకరమని గుర్తించడం జరిగింది. ఇందుకు తీరభూములు ఉదాహరణగా తీసికొందాము. తీరభూములు సముద్ర వాణిజ్యంపై ఆధారపడే ప్రాంతాలు. సమయానుకూలంగా వాణిజ్యం పెరగవచ్చు లేదా తరగవచ్చు. అంతేకాని ఆ భూములు వాణిజ్యాన్నే కొనసాగిస్తాయి. అందుచేత ఏకైక ఆర్థిక కృషి ఉన్న ప్రాంతాలుగా వానిని పరిగణించి పన్నులు విధించడానికి అవకాశం ఉంది. ఈ విధంగా స్థిరమైన ఆర్థిక విధానాన్ని కొనసాగించే ప్రాంతాల పాలకులకు మంచి లాభం ఉంది. ఇంచుమించు శాశ్వతమైన పన్నుల విధానాన్ని నెలకొల్పడానికి, పన్నుల ప్రమాణాలను నిర్ణయించడానికి వీలవుతుంది. అందుచేతనే మౌర్య రాజ్యానికి రాజకీయ, ఆర్థిక, మౌలిక సిద్ధాంతకారుడైన కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో పన్నులు వసూలుకు చాల ముఖ్యమైన

భాగాన్ని కేటాయించినాడు. పన్నులరూపంలో ప్రభుత్వ ఆదాయ ప్రమాణాన్ని ముందుగా గ్రహించగలగడం ఆర్థిక, సాంఘిక భద్రాతాభావాన్ని కలిగిస్తుంది. ప్రథమ దశలలో పాలనా యంత్రాంగం ముఖ్య కర్తవ్యం పన్నుల వసూలే కాబట్టి ఆ యంత్రాంగం పని సుకరమౌతుంది. సమాజంలోని వివిధ రంగాల శ్రేయస్సుకు అనుకూలమైన విధంగా సమాజాన్ని పునర్నిర్మించాలి. అనే ఆదర్శప్రాయమైన కోరిక సాంఘిక భద్రతాభావం వల్ల కలుగుతుంది.

వైదిక యుగంలోనే సామాజిక నిర్మాణం ప్రారంభమై సాంఘిక కృషి ఆధారంగా సమాజాన్ని నాల్గు కులాలుగా విభజించే పద్ధతి బయలుదేరింది. ఆ వ్యవస్థ మౌర్యయుగం వరకు అస్థిరంగానే ఉండిపోయింది. సుకరమైన సాంఘిక పరివర్తనకు నాడు అనేక ఉదాహరణలు చూపించవచ్చు. ఉదాహరణకు సమాజంలోని మొదటి రెండు వర్గాలు అంటే బ్రాహ్మణ క్షత్రియ వర్గాల స్థానం పరస్పరం మారుతూ వచ్చింది. బ్రాహ్మణునికంటే తరచు క్షత్రియుని అధికునిగా పరిగణించారు. కేవలం అర్చకుడుగా బ్రాహ్మణుడు అనేక సమయాల్లో అపహాస్యానికి గురియైనాడు. బౌద్ధ వాఙ్మయంలో క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య, శూద్ర అనే వర్ణక్రమం తరచుగా కన్పిస్తుంది. దీన్నిబట్టి క్షత్రియుని కంటె సాంఘికంగా బ్రాహ్మణునిది తక్కువ స్థానమని స్పష్టమౌతుంది. మౌర్యయుగం నాటికి బ్రాహ్మణునిది పైచేయి అయినట్లు కనిపిస్తుంది. తరువాతి కాలంలో వివిధ రూపాల్లో కన్పించే కాఠిన్యం లేకపోయినా మౌర్య యుగంలో వర్ణవ్యవస్థ ఘనీభవించడం ప్రారంభమయింది. కొన్ని విషయాలలో బ్రాహ్మణులు ప్రథమ స్థానము, వారి ప్రత్యేక హక్కులు అంగీకరించడం సాధారణమయింది. బ్రాహ్మణాలలో సూచనప్రాయంగా ఉన్న బ్రాహ్మణుల అగ్ర స్థానాన్ని అర్థశాస్త్రం బలపరుస్తున్నది. భారతీయ సమాజాన్ని గురించి మెగస్తనీసు వ్రాసిన దాన్నిబట్టి కూడ నాటికి వర్ణ వ్యవస్థకు ఉన్న సిద్ధాంత ప్రాతిపదిక పూర్తి ఆమోదం పొందినట్లు తెలుస్తున్నది. బ్రాహ్మణుల అధికారం పెరగకుండా బౌద్ధమతం ఆటంకమై ఉండవచ్చు. కాని బ్రాహ్మణ వ్యతిరేకతకు పటిష్టమైన సాధనంగా బౌద్ధాన్ని ఎన్నడూ ప్రయోగించలేదు. ఒకమారు విజయం సాధించిన తరువాత బ్రాహ్మణ శక్తులు వివిధ సాధనాల ద్వారా తమ స్థానాన్ని నిలదొక్కుకున్నాయి. ఈ విషయాన్ని మనువు ఋజువు చేసినాడు. వర్ణ వ్యవస్థ కాఠిన్యం శాశ్వతమైంది.

ప్రాచీన భారత సాంఘిక వ్యవస్థను విచారించడంలో సమకాలిక విదేశీయ అభ్యాగతుల రచనలను పరిశీలించడం చాల ప్రయోజనకరం. ముఖ్యంగా గ్రీకు లాటిన్ ఆధారాలు భారతదేశంలోని వర్ణ వ్యవస్థను గూర్చి ముచ్చటిస్తున్నాయి. ఈ ఉల్లేఖనాలలో చాలభాగం

మెగస్తనీసు రచనలలోనివని చెప్పవచ్చు. మెగస్తనీసు విమర్శనల ఈ చర్చకు ఆధారంగా స్వీకరిస్తాము. దేశీయ, విదేశీయ రచనలన్నింటికంటె మెగస్తనీసు రచన విశ్వాస యోగ్యమని నా ఉద్దేశం కాదు. పక్షపాతం లేకుండ మౌర్య సాంఘిక జీవనంలోని ప్రధానాంశాలను మెగస్తనీసు వర్ణించినాడు. ఆ రచనలు ఒక ప్రత్యేక దృక్పథాన్ని వర్ణిస్తున్నవి. కాని ఏదో ఒక దృక్పథాన్ని బలపరచడానికి వ్రాసినవి మాత్రంకాదు.

భారత సమాజంలో ఏడు వర్గాలున్నవని మెగస్తనీసు వ్రాసినాడు. వీరు దార్శనికులు, వ్యవసాయదారులు, సైనికులు, పశుపాలకులు, చేతిపనివారు, న్యాయాధీశులు, సలహాదార్లు, ఏరియన్ భారతదేశంలో సుమారు ఏడు వర్గాలున్నవని వ్రాసినాడుగాని వానిని స్పష్టంగా వివరించలేదు. మెగస్తనీసు రచన కొంతవరకు వాస్తవాంశం మీదనే ఆధారపడి ఉంది. సమాజం సంఘాలుగా విభజితమనేది నాడు ప్రసిద్ధంగా ఉన్న భావనే. ఆ విధానాన్ని స్థానిక బ్రాహ్మణులు మెగస్తనీసుకు వివరించి ఉంటారు. కాని ఈ వర్గాల సంఖ్య మెగస్తనీసు బుర్రలో వ్యత్యస్తమైనదని చెప్పవచ్చు. అతడు పేర్కొన్న విభాగాలు సాంఘిక విభాగాలుగాగాక ఆర్థిక విభాగాలుగా కన్పిస్తున్నవి. చాతుర్వర్ణ వ్యవస్థ ఆర్థిక విభజనపైనే ఆధారపడి బయలుదేరడం అందరికీ తెలిసినదే.

వివిధ వర్ణాలను గురించి మెగస్తనీసు చేసిన సాధారణ వ్యాఖ్యానాలలో ముఖ్యమైనది "తన వర్ణానికి వెలుపల వివాహం చేసుకోవడానికిగాని, తనవృత్తికి భిన్నమైన వృత్తి అవలంబించడానికిగాని అనుమతి యెవ్వరికి లేదు." కాని బ్రాహ్మణుడి సిద్ధాంతానికి అపవాదమని తన సద్గుణాలవల్ల బ్రాహ్మణుడు అట్టి ప్రత్యేక హక్కులు పొందినాడని మరొకచోట వ్రాసినాడు. ఈ మాటలు తరువాతి గ్రంథమైన మనుధర్మ శాస్త్రాన్ని గుర్తుకు తెస్తుంది. క్రింది వర్ణాల స్త్రీలతో బ్రాహ్మణుని వివాహాన్ని మనువు అనుమతించినాడు.

మెగస్తనీసు పేర్కొన్న మొదటివర్ణం దార్శనికులు. వీరు బ్రాహ్మణులకు ప్రతినిధులని సాధారణ విశ్వాసం. వీరినిగూర్చి మెగస్తనీసు వ్యాఖ్యానాన్ని పరిశీలించేముందు సాంప్రదాయక వాఙ్మయంలో వీరికి ఉన్న స్థానాన్ని ఆలోచించవలె. సమకాలిక సారస్వతం ఆధారంగా బ్రాహ్మణులను గురించి 'ఫిక్' పండితుడు విశ్వాసయోగ్యములైన సూచనలు చేసినాడు. బ్రాహ్మణులలో ఉదిచ్చ, సతకలఖ్ఖన అనే రెండు తెగలున్నట్లు అతని అభిప్రాయం. ఉదిచ్చ బ్రాహ్మణులు సనాతన ధర్మపరులు; అర్చకులు, ఉపాధ్యాయులు, సతకలఖ్ఖనులు లౌకికులు, అజ్ఞానులు, మూఢవిశ్వాసపరులు. జోస్యము, మంత్రవిద్యలు వీరి వృత్తులు. హోమం సర్వదోష నివారిణియని వీరి విశ్వాసం. హోమం చేసినప్పుడల్లా బ్రాహ్మణులు డబ్బుచేసికొనేవారు. బౌద్ధులు జంతుబలులు నిషేధించడం, మంగళాదికములైన ఉత్సవాలను

నిరర్థకమని అశోకుడు నిరాకరించడం బ్రాహ్మణులు నిరసించినారు. ఆర్థిక అవసరాల దృష్ట్యా సతకలక్షణులు బ్రాహ్మణేతర వృత్తులను అవలంబించవలసి వచ్చేది. ఉదాహరణకు: అరణ్య ప్రాంతాలలో అర్చకుల సంఖ్య అధికమైనపుడు అచటి బ్రాహ్మణులు కొందరు దారువృత్తిని స్వీకరించేవారు. ఆర్థికమైన ఇబ్బందుల ఫలితంగా ఒకే వర్ణంలో కొంత పరివర్తనాన్ని అనుమతించేవారు. ఏమైనా సవర్ణ వివాహ ధర్మాన్ని మాత్రం కఠినంగా అమలు జరిపారు. ఇతర ప్రజానీకంలో బ్రాహ్మణులు కలిసిపోవడాన్ని నిరోధించి ఈ వివాహ విధానం బ్రాహ్మణజాతిని రక్షించింది.

'ఫిక్' పండితుడు పురోహితులను ప్రత్యేకంగా పేర్కొంటాడు. రాజకీయ వ్యవహారాల్లో తరచు శ్రద్ధ వహించడంతో తృప్తిపడక శాశ్వతమైన అధికారాన్ని వీరు ఆశించినారు. వీరిదురాశ వినాశకర పరిణామాలకు దారితీసింది. దుర్బలుడు అంధ విశ్వాసి అయినరాజు పురోహితుని చేతి కీలుబొమ్మ అవుతాడు. జాతక కథలలో బ్రాహ్మణ వ్యతిరేకత గోచరిస్తుంది. కాని క్రింది వర్గాలవారు బ్రాహ్మణులపట్ల ప్రదర్శించే సద్భావంకూడ ప్రతిఫలిస్తుంది. జాతక కథలలో కంటె మెగస్తనీసు వర్ణనలలోనే బ్రాహ్మణులపట్ల యెక్కువ సానుభూతి ఉంది. బ్రాహ్మణ సిద్ధాంతాలను గురించి అతని విమర్శలు విశ్వాస యోగ్యాలైన పరిశీలనలని చెప్పవచ్చు. ఒకచోట బ్రాహ్మణులు మృతులకు శ్రాద్ధ కర్మలు చేస్తారని, జోస్యం చెబుతారని, సంఖ్యలో తక్కువైనప్పటికి బలవంతులని, చాల క్లుప్తంగా వర్ణించినాడు.

మరొక సుదీర్ఘమైన విభాగంలో దార్శనికులను రెండు వర్గాలుగా బ్రాహ్మణులని– శ్రమణులని వర్గీకరించినాడు. బ్రాహ్మణులు వివిక్త ప్రదేశంచేరి కఠినమైన క్రమశిక్షణతో 37 సంవత్సరాలు విద్యాభ్యాసం సాగిస్తారు. ఈ సంఖ్య మనువు ఇచ్చిన సంఖ్యకు సన్నిహితంగా ఉండడం ఆశ్చర్యకరం. మనిషి బ్రహ్మచర్యాన్ని అనుసరించవలసిన గరిష్టకాలం 36 సంవత్సరాలని మనువు నిర్ణయం. విద్యాభ్యాసం తరువాత బ్రాహ్మణులు గార్హస్థ్య జీవితానికి మరలుతారు. వారు మాంసాహారులే. కాని ఆవు, ఎద్దు, గుఱ్ఱం, ఏనుగు వంటి కృషి జంతువుల మాంసం తినరు. బహు భార్యాత్వానికి వారి ననుమతించినారు. అందుచే వారికి సంతానం కూడా ఎక్కువే. భారత సమాజంలో బానిసలు లేనందున పిల్లలే పనిపాటలన్నీ చేస్తారు. స్త్రీలకు తత్వశాస్త్రం బోధించరు. బ్రాహ్మణుల సిద్ధాంతాలపట్ల సయితం మెగస్తనీసు మంచి ఆసక్తిని ప్రదర్శించినాడు. జీవితం స్వప్న సమానమైన మిధ్య అని వారి అభిప్రాయంగా మెగస్తనీసు వ్రాసినాడు. ఈ మాట భారతీయ ఆలోచనలో ప్రచారమైన మాయావాదాన్ని ఉద్దేశించి వ్రాసినదై ఉంటుంది. మృత్యువుపట్ల వారికి భయాందోళనలు లేవు. మరణానంతరమే యథార్థ జీవితారంభమని విశ్వసించినందున

మృత్యువును నిరీక్షిస్తూ కాలం గడిపేవారు. భౌతిక విశ్వంపట్ల వారి భావాలు అనాగరికంగా ఉన్నాయి. కాని విశ్వాన్ని గురించిన వీరి సిద్ధాంతాలకు, గ్రీకు సిద్ధాంతాలకు సామ్యం ఉందని వ్రాశాడు.

శ్రమణులను ఇంకా చిన్న చిన్న వర్గాలుగా విభజించినాడు. వీరిలో "హైలోబియామ్" పూజ్యులు. యోగులుగా జీవించేవారు. రెండవ వర్గమువారు వైద్యులు. తరువాత దైవజ్ఞులు, భూతవైద్యులు. ఈ విభజన పైన పేర్కొన్న బ్రాహ్మణులలోని ఉదిచ్ఛ, నతకలఖ్ఖిన విభాగాలను సూచిస్తున్నదేగాని బౌద్ధ జైన శ్రమణుల వర్ణనలకు సరిపోవడంలేదు. మెగస్తనీసుకు మత సిద్ధాంతాలలో నిజమైన ఆసక్తే ఉన్నట్లయితే అతనికి బౌద్ధులను గురించిన స్పష్టమైన పరిజ్ఞానం ఉండేది. స్వదేశం మరలిన తరువాత ఉదిచ్ఛ, నతకలఖ్ఖిన బ్రాహ్మణ వర్గాలను తారుమారుచేసి సతకలఖ్ఖినులే శ్రమణులని పొరపడి ఉండవచ్చు. సనాతన హిందువులలోని నాల్గు ఆశ్రమాలలో వానప్రస్థులనే శ్రమణులుగా మెగస్తనీసు భ్రమించినాడని 'తిమ్మర్' పండితుని విశ్వాసం. కాని హిందుమత గ్రంథాలలో వానప్రస్థులను నిజమైన యతులుగా పరిగణింపరు. 37 సంవత్సరాల అనంతరం వివిక్త ప్రదేశాలను వీడి గృహస్థులౌతారనే వర్ణన బ్రహ్మచారులను సూచిస్తున్నది. నాల్గు ఆశ్రమాలు సిద్ధాంతరీత్యా చేసిన విభజన మాత్రమే. హిందూ ద్విజన్ములలో అధిక సంఖ్యాకులు ఆశ్రమ ధర్మాన్ని కఠినంగా పాటించినారని చెప్పలేము. యతి జీవితంలో శారీరక సుఖాలతోపాటు వ్యక్తిగతమైన సాంఘిక బాధ్యతలుండవు. అందుచేత వ్యవస్థాపిత సమాజంలో దైనందిన జీవిత భారం నుండి తప్పించుకు తిరగడమే యతులలో అధిక సంఖ్యాకుల కార్యక్రమమని భావించడం తప్పుకాదు.

మరొక విభాగంలో 'బ్రాక్మేన్స్' అనే దార్శనికులను గురించి మరింత అస్తవ్యస్తమైన కథనం కనిపిస్తుంది. క్రీ. శ 3 లేదా 4వ శతాబ్దికి చెందిన సూడో – ఓరిజన్ ఫిలోసోఫియా అనే క్రైస్తవ మత గ్రంథంలో ఈ కథనం ఉల్లేఖితమైంది. ఈ కథనంలో కన్పించే విభ్రాంతిపట్ల ఆశ్చర్యంపొందనక్కరలేదు. దీని ప్రకారం బ్రాహ్మణ వర్గంవారు రాలిన పండ్లను ప్రోగుచేసికొని జీవించేవారు. దక్షిణ భారతంలో తుంగభద్రా నదీతరం వీరి స్థావరం. దిగంబరులుగా సంచరించేవారు. శరీరం ఆత్మకు కేవలం ఆచ్ఛాదనమని వీరి విశ్వాసం. కఠిన బ్రహ్మచర్యాన్ని అవలంబించేవారు. బ్రాహ్మణులను గురించిన ఈ వర్ణన చాల అస్తవ్యస్తంగా ఉన్నదనడంలో సందేహంలేదు. తరచు భగవంతుని గూర్చిన ప్రస్తావనలున్నందున ఆది బ్రాహ్మణ యతుల స్థావరమై ఉండవచ్చు. కాని పూర్తి వర్ణన మాత్రం దాక్షిణాత్య జైనులకు సరిపోతుంది. అపక్వాహారాన్ని భుజించడం, ఫలాహారులై జీవించడం మొదలైనవి సనాతన

జైన ఆచారాలు. ఈ గుణం తుంగభద్రా నదిపై నున్నదనడం కూడ జైనులకే సూచిస్తుంది. వారి దిగంబరత్వం దిగంబర జైనుల విశ్వాసంతో ఏకీభవిస్తున్నది. చంద్రగుప్త మౌర్యుడు భద్రబాహునితో దక్షిణ దేశానికి వెళ్ళినాడని మనకు తెలుసు. ఆ ప్రాంతంలోనే తన చివరిరోజులు గడిపినాడని భావింపవచ్చు, యతులను దర్శించడానికే తాను స్వయంగా తుంగభద్రానది వరకు పయనించినాననిగాని, ఆ ప్రాంతం మౌర్య సామ్రాజ్యంలో చేరి ఉన్నదనికాని, ఆ యతులను గురించి తాను విన్న సమాచారం వ్రాస్తున్నాననిగాని చెప్పకపోవడం దురదృష్టం.

దార్శనికుల ప్రత్యేక హక్కులను గురించి మెగస్తనీసు చాల ఆసక్తిదాయకాలైన వాఖ్యానాలు చేసినాడు. వానిలో వారిపై పన్నులుండవనేది ఒకటి. వారు ఏవిధమైన ఊడిగము చేయనక్కరలేదని డియోడరస్ వ్రాసినాడు. ప్రభుత్వ యజ్ఞాలు నిర్వహించడం వినా మరేవిధులు వారికిలేవని 'ఏరియన్' వ్రాసినాడు. రాజ్యపరిషత్తుకు చెప్పిన జోస్యాలు ఫలించినప్పుడే వారికాహక్కులుండేవి. కాని జోస్యాలు విఫలమైనప్పుడు వారికి స్వాతంత్ర్యాన్ని నిరాకరించినారని చెప్పలేము. మౌర్యయుగంలో 'విష్టి' అనే వెట్టిచాకిరి అమలులో ఉండేది. దాన్ని గురించి తరువాత విపులంగా చర్చిద్దాము. ప్రభుత్వంపట్ల విధులు, సేవలు అని వ్రాయడంలో 'విష్టి'కి సూచన అయి ఉండవచ్చు. తప్పుడు జోస్యాలు చెప్పిన తాత్త్వికులు జీవితాంతం మూకీ భావం వహించాలని మెగస్తనీసు కూడ వ్రాసినాడు. కాని అట్టి తాత్త్వికులను జోస్యాలు చెప్పడం మాత్రం నిషేధించారో లేదా వారు పూర్తిగా జీవితాంతం నోరు కట్టేసుకోవాలో స్పష్టంగా చెప్పలేదు. డియోడరస్ ఉల్లేఖించిన దాన్ని బట్టి వంశానుగతంగా తాత్త్వికులవుతూ ఉంటారు. కాని 'ఏరియన్' ఉల్లేఖించిన భాగం దీన్ని ఖండిస్తుంది. ఏరియన్ వ్రాసిన దాన్ని బట్టి ఎవరైనా తాత్త్వికుడు కావచ్చు. కాని తాత్త్వికుడనుసరించవలసిన కఠిన జీవిత విధానం తాత్త్వికులుగా మారడాన్ని నిరుత్సాహ పరుస్తుంది.

ఈ ఉల్లేఖనాలనుబట్టి కేవలం వినికిడిపైగాక పరిశీలనమీదనే ఆధారపడి మెగస్తనీసు వర్ణ విభజన చేసినట్లు తిమ్మర్ అభిప్రాయపడినాడు. కొంత అస్తవ్యస్తంగా వ్రాసినప్పటికి భారతీయ వర్ణవ్యవస్థను గురించిన పరిజ్ఞానం మెగస్తనీసుకు ఉన్నదని మా అభిప్రాయం. అతని వ్యాఖ్యానాలలో సాధారణంగా అంగీకార యోగ్యములైన అంశాలే కనిపిస్తాయి. స్వల్ప సంఖ్యాకులైనప్పటికి సమాజంలో ప్రత్యేక హక్కులుగల విభాగం బ్రాహ్మణులనేది స్పష్టం. వారు వెట్టిచాకిరి చేయనక్కరలేదని, మొత్తం మీద పన్నులు చెల్లింపనక్కరలేదని తెలుస్తుంది. ఈ అమూల్యమైన హక్కు బ్రాహ్మణుల నొక విశిష్టమైన వర్గంగా ప్రత్యేకిస్తుంది.

భారతీయ ఆధారాలనుండి లభించే సమాచారాన్ని బట్టి నిర్ణయించినప్పటికీ బ్రాహ్మణుల ఈ స్థితికి తిరుగులేనట్లు కనిపిస్తుంది. బ్రాహ్మణ, శ్రమణులను గురించి అశోకుని శాసనాలలో తరచు కనిపించే ప్రస్తావన, వారు గౌరవార్హులని తన ప్రజలకాతడు నిరంతరం చేసిన విజ్ఞాపనలవల్ల వారికాతడు ప్రత్యేక గౌరవాన్ని యిచ్చినట్లు సమాజంలో వారు ఆదరయోగ్యమైన వర్గమైనట్లు స్పష్టమౌతుంది. వారిలోని ఉత్పాదక సామర్థ్యానికి బదులు ఆధ్యాత్మిక గుణ సంపదను గుర్తించే వారికి ప్రత్యేక గౌరవ స్థానాన్ని ఇచ్చినారు.

వ్యావసాయక, ఆర్థిక విధానం పెరగడంతో కర్షకుడు ఆర్థికంగా ప్రముఖ పాత్ర వహించసాగినాడు. సాంఘికంగా అతని హోదా తక్కువే. కాని ఆర్థికంగా మాత్రం నిర్లక్ష్యం చేయతగిందికాదు. భారతీయ కులాలలో రెండవవారు కర్షకులని మెగస్తనీసు వ్రాసినాడు. భూమికి అంకితమైన వీరు సంఖ్యాబలంలో అధికులు. యుద్ధభూమికి సమీపంలోని కర్షకులను సైతం సైనికులు బాధించారు. పంటపొలం యావత్తూ రాజుదనీ, రాజుపక్షాన కర్షకుడు సాగుచేస్తాడని మెగస్తనీసు వ్రాసినాడు. పంటలో నాలుగవవంతు కర్షకులు పన్నుగా చెల్లిస్తారు. పన్నుగాక మక్తాకూడ చెల్లిస్తారు. పన్ను విషయంలో తప్ప మెగస్తనీసు గ్రంథం నుండి స్ట్రాబో ఉల్లేఖించిన అంశం పై వివరాలతో ఏకీభవిస్తుంది. పంటలో నాల్గవ వంతుకు కర్షకుడు రాజు నుండి జీతంగా పొందుతాడని స్ట్రాబోవ్రాసినాడు. ఏరియన్ చేసిన ఉల్లేఖనంలో పన్ను మొత్తం స్పష్టంగాలేదు. కృషీవలులు పంటలు పండించి రాజులకు స్వతంత్ర నగరాలకు కప్పం చెల్లిస్తారని మాత్రమే వ్రాసినాడు.

భారతీయ జనాభాలో వ్యవసాయదారులే అధిక సంఖ్యాకులైనట్లు కన్పిస్తుంది. నేటికీ ఆ పరిస్థితిలో మార్పులేదు. సాక్ష్యాధారాలను బట్టి కర్షకులను నిరాయుధులుగా ఉంచేవారు. భూమిని సాగుచేయడమే వారి ఏకైక ధర్మం. కొన్ని గ్రామాలకు పన్ను మినహాయింపు వర్తించేది. అయితే సైనికులను సరఫరా చేసే గ్రామాలకు మాత్రమే ఆ మినహాయింపు వర్తించేది. యుద్ధ సమయాల్లో రైతులను బాధించేవారుకాదని మెగస్తనీసు గట్టిగా చెపుతున్నాడు. అది సిద్ధాంత పరమైన ఆదర్శమనడంలోను, ఆచరణలో అసాధ్యమనడం లోను సందేహం లేదు. యుద్ధకాలంలో తీవ్ర అవసరమేర్పడినప్పుడు స్థానిక కర్షక రూపంలో లభ్యంకాగల మానవశక్తిని రాజులుపయోగించుకొనలేదని గాని, శత్రుభూములలోని గ్రామాలపై దాడులు జరపలేదనిగాని నమ్మడం చాలకష్టం. కళింగ యుద్ధంలో మృతులను, క్షతగాత్రులను గురించి అశోకుడిచ్చిన సంఖ్యలలో అతిశయోక్తి ఉండవచ్చు. కాని అవి కేవలం సైనిక నష్టాలను మాత్రమే సూచించవు. కళింగదేశం నుండి దేశాంతరానికి పంపిన లక్ష ఏబదివేల ప్రజలలో అధిక శాతం కర్షకులై ఉంటారు. అరణ్యప్రాంతాలను

పరిశుభ్రం చేసి, కొత్త భూములను సాగుచేయడానికి వారిని వినియోగించి యుండవచ్చు. సైన్యంలో భోజన సదుపాయాల శాఖ స్థానిక సరఫరాలపైనే చాలవరకు ఆధారపడి ఉండేది. అటువంటప్పుడు అధికార, అనధికార రీతులలో బలాత్కారంగా కర్షకులు తమ సొంత సామగ్రిని రాజుకు సమర్పించి ఉంటారు.

మెగస్తనీసు పేర్కొన్న వర్ణాలను సంప్రదాయక భారతీయ సాంఘిక విభజనతో ముడిపెట్టే ప్రయత్నం జరిగింది. అందు కర్షకులే శూద్రులని జన సమ్మర్ధం అధికంగా ఉండే నగరాల నుండి, కొత్తగా జయించిన ప్రాంతాల నుండి శూద్రులను మరుభూములలో కొత్తగా నిర్మించిన గ్రామాలకు మరలించినారని సూచిస్తున్నారు.

వీరిని నిరాయుధులుగా ప్రభుత్వం ఆధీనంలో ఉంచేవారు. వారి చెంత ఉండే మిగులు సంపత్తిని ప్రభుత్వాధీనం చేసేవారు. శూద్ర బానిసవర్గం బలపడడంవల్ల దేశ ఆహార ఉత్పత్తిలో పెద్ద ఎత్తున బానిసత్వ విధానం అక్కరలేకపోయింది. విదేశీయుల వలసను ప్రోత్సహించడం ద్వారా (పరదేశావవాహనేన) గాని, జనసమ్మర్థం ఎక్కువగా ఉన్న కేంద్రాలనుండి అధిక జనాభాను కొత్త ప్రాంతాలకు వలస పంపిగాని (స్వదేశాభి స్యందవయనేనవా) క్రొత్త గ్రామాలు నిర్మించవలెనని అర్థశాస్త్రం సూచిస్తున్నది. ఇందులో పేర్కొన్న విదేశీయులు బహుశా క్రొత్తగా జయించిన ప్రాంతవాసులై ఉంటారు. జనసమ్మర్ధ ప్రాంతాల శూద్రులను సయితం క్రొత్తగ్రామాలకు పంపి ఉంటారు. కాని క్రొత్త గ్రామాలకు శూద్రులేగాక ఇతర వృత్తులవారు సయితం ముఖ్యంగా వడ్రంగులు, వర్తకులు కూడ అవసరం. అయితే శూద్రులకు, ఇతర వృత్తులవారికి ఒకతేడా ఉంది. శూద్రుల వలసను ప్రభుత్వం ఆదేశిస్తుంది. ఇతర వృత్తులవారు స్వచ్ఛందంగా ఆర్థికాభివృద్ధి అవకాశాలను గుర్తించి క్రొత్త గ్రామాలకు వలస వెళ్ళేవారు. మౌర్యుల పాలనలో ప్రతి గ్రామ ఆర్థిక విధానము సమిష్టి కృషికి ప్రాధాన్యం ఇచ్చింది. గ్రామస్థుల దైనందిన అవసరాలవరకు ప్రతి గ్రామము సంపూర్ణమైన ప్రమాణంగా రూపొందసాగింది. కాని గ్రామం ప్రభుత్వానికి లోబడి ఉండేది. గ్రామానికిపైన మండలం ప్రమాణము. ఆర్థికంగా గ్రామం మండలాంతర్గతంగా విలీనం కావడంలో ప్రభుత్వ ఉద్యోగులు పర్యవేక్షణ జరిపేవారు.

పంటపొలానికి రాజే యజమాని అన్న మెగస్తనీసు రచన వివాదగ్రస్తము. ఆమాట యథార్థంకాదని కొందరు చరిత్రకారులు భావిస్తున్నారు. తమ వాదానికి బలంగా వీరు ఉల్లేఖించే గ్రంథాలలోని వాక్యాలను “రాజు రక్షకుడే గాని యజమానికాదు” అని వాఖ్యానించవలసి ఉంటుంది. మౌర్య సామ్రాజ్యం చాల విశాలమైంది. అందలి భిన్న ప్రాంతాలు విభిన్న అభివృద్ధి దశలలో ఉన్నాయి. అందుచే భూమిలో ఒకేరకమైన

యాజమాన్యం ఉన్నదనడానికి వీలులేదు. ఈ విషయాన్ని గురించిన మనచర్చలో మెగస్తనీసుకు భారతీయ గ్రంథాలకు సుపరిచిత ప్రాంతమైన గంగామైదానానికి, ప్రత్యేకించి మగధ రాజ్యానికి మాత్రమే దృష్టిని పరిమితం చేస్తాను. మౌర్య సమాజంలో ఐదురకాల భూమి యాజమాన్యానికి అవకాశం ఉంది. రాజయాజమాన్యము, ప్రభుత్వ యాజమాన్యము, భూఖామందుల యాజమాన్యము, సమిష్టి యాజమాన్యము, కృషీవల యాజమాన్యము. మనకు లభ్యమౌతున్న ఆధారాలలో కర్షకుడే యజమాని అనే సూచన కన్పించదు. కర్షకులందరు శూద్రులే కాబట్టి ఇందులో ఆశ్చర్యపడవలసిన పనిలేదు. సమాజ యాజమాన్యం తరువాతి కాలానికి చెందిన సిద్ధాంతము. మౌర్యయుగానంతరం కొన్ని శతాబ్దాలకుగాని ఇది ప్రచారంలోకి రాలేదు.

జాతక కథలలో గహపతుల, గామభోజకుల ప్రస్తావన తరచుగా ఉన్న విషయం ఫిక్ పండితుడు మన దృష్టికి తెస్తున్నాడు. వీరివంశంలో పెద్ద పెద్ద భూములున్నట్లు, తమ భూములపై వీరు భృత్యులను నియమించినట్లు తెలుస్తుంది. భృత్యుల జీవన పరిస్థితి దీనంగానే ఉండేది. కాని దాసజీవితమంత నికృష్టంగా ఉండేదికాదు. ఈ యుగంలో గహపతుల కార్యకలాపాలను స్పష్టంగా చెప్పలేము. గహపతి అనేపదం కులీన భూస్వాములనైనా సూచించవలె లేదా నగర, ధనిక కుటుంబాలనైనా సూచించవలెనని ఫిక్ అభిప్రాయం. కులీన భూస్వాములనే సూచించినచో మొగలాయి భారతంలోవలె లేదా భూస్వామ్యయుగ ఐరోపాలోవలె వీరు సమాజంలో తమకున్న స్థానం ఆధారంగా ఒక విస్తృత రాజకీయ పద్ధతిని రూపొందించలేక పోవడం చాల విచిత్రం. ఈ యుగంలో మనకు తెలిసినంతవరకు ఏ సాంఘిక విభాగమూ పైన పేర్కొన్న (మొగల్) భూస్వామ్య కులీన వర్గంతో సరిపోవడంలేదు. వీరు కొత్తభూములలో కర్షకులకు, వర్తకులకు, డబ్బు మదుపు పెట్టి అచటి గ్రామాల వికాసానికి కారకులైన సాహసికులై ఉండవచ్చు. వీరు భూస్వాములనికాని, పన్ను వసూలు చేసే వారనికాని నిశ్చయంగా చెప్పలేము. వారిది పాక్షిక అధికార హోదా. వర్తకులుగా వీరు ధనికులు. కాబట్టి ప్రభుత్వ క్షేత్రాలకు భిన్నంగా వీరు సొంత భూములను సంపాదించి ఉండవచ్చు. కాని ఈ భూములు స్వతంత్ర ఆదాయ మార్గం కలిగినంతటి పెద్దవి కాకపోవచ్చు. పాళీ సారస్వతంలో గామభోజక పదం కూడ ఎక్కువగ కన్పిస్తున్నది. ఈ పదాన్ని భూస్వామి అని 'బోస్' వాఖ్యానించినాడు. భూములను సంపాదించి రాజుచే అధికారం పొందిన వాడనే అర్థంలోకాని, సేవలకు ప్రతిఫలంగా గ్రామాన్ని బహుమతిగా పొందినవాడనే అర్థంలోగాని ఈ పదాన్ని వాడి ఉండవచ్చు. ఇక్కడ కూడ భూమి యాజమాన్యంపైకాక, భూమి నుండి లభించే ఆదాయంపైని నొక్కు ఉన్నట్లు కన్పిస్తుంది.

భారతీయ గ్రంథాలలోని పదాలను కొన్నింటిని పరిశీలించడం ద్వారా పై సమస్యను స్పష్టీకరించవచ్చు. శతపథబ్రాహ్మణంలోని 'విశ్వకర్మభౌవన' అనే రాజు కథనుసరించి మొదట్లో రాజు భూమికే యజమానికాదు. ఈ కథలో భూమిని 'భౌవన' తనసొంత ఆస్తిగా పరిగణించినాడు. అప్పుడు భూదేవి అతణ్ణి మందలిస్తుంది. క్రమంగా పరిస్థితి మారింది. తరువాతి న్యాయశాస్త్రాలు రాజే భూమికి యజమాని అని స్పష్టంగా పేర్కొంటున్నాయి. రాజభూమికి మాత్రమేకాని మరే ఇతర సంపత్తికి యజమానికాదని, భూమి ఉత్పత్తిలో ఆరోవంతు రాజు గ్రహించవచ్చని కాత్యాయనుడు వ్రాసినాడు. ఒక ప్రామాణిక రచన దృష్టిలో వైదిక ధర్మ ప్రకారం భూమి యాజమాన్యానికి, భూమిని అనుభవించడానికి మధ్య చాల వ్యత్యాసం ఉంది. యాజమాన్యానికి 'స్వం' అనే మాటను, దాని తద్ధిత రూపాలైన స్వత్ర, స్వామ్య, స్వామిత్ర అనే మాటలను వాడేవారు. అనుభవానికి భోగ అనేపదాన్ని వాడేవాడు. కాబట్టి రాజక్షేత్రాలకు, ప్రభుత్వక్షేత్రాలకు మధ్య వ్యత్యాసం స్పష్టమౌతుంది. రాజ క్షేత్రాలను రాజు తన ఇష్టం వచ్చినట్లు వినియోగపరచవచ్చు. కాని రాజ్యానికి అధినేతగా ప్రభుత్వక్షేత్రాలపై పన్ను మాత్రం స్వీకరిస్తాడు. అంతేకాని ఆ భూములకాతడు యజమానికాడు. ఉత్పత్తిని మాత్రం అనుభవిస్తాడు. మతశాఖలకుగాని, మరెవరికైనాగాని, అనధికారక భూదానం చేయసంకల్పించినప్పుడు వ్యక్తి హోదాలో ప్రభుత్వక్షేత్రాల నుండిగాక తన సొంత భూములనుండి మాత్రమే దానం చేసేవాడు.

ఈ విధంగా అర్థశాస్త్రంలో రాజక్షేత్రాల ప్రసక్తి కనిపిస్తుంది. రాజక్షేత్రాలు రాజు సొంత భూములు. వానిపై వచ్చే ఆదాయం నేడు మనం సొంత బొక్కసం అని పిల్చేదానిలో చేరుతుంది. మిగిలిన భూమి సిద్ధాంతరీత్యా రాజ్యక్షేత్రం; ప్రభుత్వానికి చెందింది. కాని ఇక్కడ సాధారణంగా అచరణలో సిద్ధాంతం క్లిష్టతరం చేస్తుంది. మౌర్యయుగానికి రాజునే రాజ్యంగా పరిగణించడంవల్ల వ్యక్తిహోదాకు, రాజ్యాధినేత హోదాకు ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలించడం కష్టం. అర్థశాస్త్రం అదే అధికరణంలో వ్యవసాయాధ్యక్షుని విధులను వర్ణించే సందర్భంలో రాజ్యాధినేతగా రాజు యాజమాన్యం వహించే భూముల పాలనాప్రసక్తి ఉంది. నాటివరకు భారతీయ రాజనీతిలో రాజ్య సిద్ధాంతం పరిణితి పొందనందున రాజుహోదాకు, అధికారానికీ మధ్య తారతమ్యం రూపొందలేదు. భూఖామందుకాని దశ నుండి జరిగిన పరివర్తన చాల సూక్ష్మము; క్రమబద్ధమునైనది. ఈ మార్పు తరువాతి శాస్త్రకారుల రచనలలో కన్పిస్తుంది. గణస్వామ్యాలలో రైతులు చెల్లించే మొత్తాలే రాజ్యాల (Monarchies) లో కూడ చెల్లించే వారని ఈ విషయం తాను మెగస్తనీసు నుండి ఉల్లేఖిస్తున్నానని ఏరియన్ వ్రాసినాడు. రాజపాలిత క్షేత్రలలో రాజే రాజ్యానికి ప్రతినిధి, అందేచేత అతడే భూమికి యజమాని అని ఏరియన్ రచన స్పష్టం చేస్తున్నది.

భూముల విక్రయాన్ని, భవనాల విక్రయాన్ని గురించి అర్థశాస్త్రంలో ఒక చిన్న విభాగం ఉంది. ఈ తరహా భూములను వేలంపాట పాడటానికి సమ్మతమైనవారు కొనవచ్చు. "భూమి పూర్తిగా వ్యక్తి ఆస్తికాదు." అంటూ ఈ వాక్యానికి తిమ్మర్ అర్థం చెబుతూ ఉన్నాడు. పాశ్చాత్యుల సిద్ధాంతంలో ఆస్తి అనే భావం పూర్తి యాజమాన్యాన్ని సూచిస్తుంది. భారతీయ సిద్ధాంతమందుకు వ్యతిరేకము. దాని ప్రకారం వస్తువు ధర్మబద్ధ వినియోగం మీదనే ఆస్తి అనే భావం ఆధారపడి ఉంది. భూమి దానిపై ఉన్న భవనాలకు ఉపాంగం మాత్రమే అనే భావాన్ని అర్థశాస్త్రంలోని పై వాక్యం సూచిస్తున్నది. చిన్న చిన్న పంటపొలాలపై వ్యక్తుల యాజమాన్యానికి, భూమిపై ప్రభుత్వ యాజమాన్యం ఆటంకం కాదు. కొంత సహాయంతో వ్యక్తులు ఆ పొలాలను స్వయంగా సాగుచేయగలరు. ఈ పద్ధతి చిన్నతరహా భూమి యాజమాన్యం దేశ ఆర్థిక విధానంలో ముఖ్యమైన లక్షణం కాదని సూచిస్తున్నది.

భాట్టకానికి, కోశానికి చెల్లించే పన్నుకు మధ్య భేదం ఉందని డియోడరస్ సూచించినాడు. ఉత్పత్తిపై చెల్లించేది పన్ను, భూమిపై చెల్లించేది భాట్టకము అని అతని సూచనకు అర్థం చెప్పుకోవచ్చు. ఇందువల్ల నాడు పన్నుల భారం అధికంగా ఉన్నట్లు కన్పిస్తుంది. కాని పై అంశాన్ని డియోడరస్ ఒక్కడే పేర్కొన్నాడు. అందుచే తన సాక్ష్యాధారాన్ని వ్యాఖ్యానించడంలో అతడు పొరబడి ఉండవచ్చు. కొన్ని ప్రాంతాలలో 'భాట్టకము' మౌలికమైన రాజ్యస్వంగా ఉంటూ నాలుగోవంతు పన్ను నియమితమైన పంటలకు మాత్రమే వర్తించి ఉంటుంది. తరువాతి కాలంలో భూమి మీద పైరెండురకాల రాజ్యస్వాన్ని వసూలు చేసినారని 'ఘోషాల్' పేర్కొన్నాడు. వైదికయుగంలో పన్నును 'బలి' అనే వారు. ఈ భావం ఆధారంగా భాట్టకాన్ని 'భాగ' అనేవారు. దీన్నే 'హిరణ్య' అని వ్యవహరించారు; అంటే ప్రత్యేకమైన పంటలపై ధనరూపంలో చెల్లించేపన్ను. ప్రత్యేకమైన పరిస్థితులలో ఘోషాల్ చెప్పినట్లు ఒకే ప్రాంతంలో రెండురకాల రాజ్యస్వాన్ని వసూలుచేసి ఉండవచ్చు.

పన్నురూపంలో చెల్లించే మొత్తాన్ని ఏరియన్ చెప్పలేదు. కాని ఇతర రచయితలు మెగస్తనీసును ఉల్లేఖిస్తూ పంటలో నాల్గవవంతుగా పేర్కొన్నారు. కర్షకులు పంటలో నాల్గవవంతును తమ వేతనంగా పొందుతారని స్ట్రాబో వ్రాసినాడు. మిగిలిన పంట బహుశా రాజుకు చెందుతుందని అతడు భావించి ఉండవచ్చు. ఈతని రచనలో కన్పించే వ్యత్యాసం అతడు చేసిన తప్పుకాదు: అతడు తన సాక్ష్యానికి ఉపయోగించిన ఆధారంలోని దోషమూ కాదు. కర్షకులు రాజుకు పంటలో నాల్గవవంతు చెల్లిస్తారనడానికి బదులు వారు రాజు నుండి అదే మొత్తాన్ని గ్రహిస్తారని మాత్రం వ్రాసినాడు. ఇచట మరొకటికూడ సంభవమే. స్పష్టంగా చెప్పకపోయినప్పటికీ రాజ క్షేత్రాలపై కూలీలుగా పనిచేసే కర్షకుల నుద్దేశించి

స్ట్రాబో వ్రాసిఉండవచ్చు. తమ కూలిగా వీరు పంటలో నాల్గవవంతును పొందేవారు. మిగిలిన మూడు వంతులు రాజుకు చెందేవి. రాజుకు మంచి ఆదాయం సమకూరేది. అర్థశాస్త్రం అట్టి రాబడిని పేర్కొంటున్నది. ఇక నాల్గవవంతుగా రాజ్యస్వాన్ని నిర్ణయించడం సర్వసాధారణమై ఉండవచ్చు. లేదా మెగస్తనీసుకు బాగా పరిచయమున్న పాటలీపుత్ర పరిసరాలలోని సారవంతమైన భూములలో అయి ఉండవచ్చు. స్థానిక పరిస్థితులను బట్టి పన్ను మారుతూ ఉండేది. పన్నులలో మార్పులకు అర్థశాస్త్రంలోనే ఉదాహరణ కన్పిస్తుంది. రైతులు కల్పించుకున్న నీటివనరుల స్వభావాన్నిబట్టి నీటితీరువ అయిదోవంతు నుండి మూడోవంతు వరకు మారుతుందని అర్థశాస్త్రం చెబుతూఉంది. భూమిపై పన్నుల విషయంలోకూడ ఈ పద్ధతే వర్తించిందనడంలో సందేహించనవసరము లేదు. అయితే అందులో వ్యత్యాసాలు చాల తక్కువగా ఉండి ఉంటాయి. పంటలో ఆరోవంతు పన్నుగా ఇతర భారతీయ గ్రంథాలు చెబుతున్నాయి. దానితో పోలిస్తే నాలుగోవంతు చాల ఎక్కువే. ఎనిమిదోవంతు, పదోవంతు, పన్నెండవవంతుకూడ ఈ గ్రంథాలలో కనిపిస్తున్నాయి. అత్యయిక పరిస్థితులలో నాలుగోవంతును, మూడో వంతుకు పెంచవచ్చునని అర్థశాస్త్రం చెబుతున్నది. లేదా వర్షాధారమైన సారవంతాలైన భూములలో రెండు పంటల పద్ధతిని అనుసరించవచ్చు. నాల్గోవంతు పన్ను చాల భారమైనదని అందుచే ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు సమర్థనీయమని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. సాధారణరాజ్యస్వంగా పంటలో నాల్గవవంతు ఎక్కువే అని అంగీకరింపవచ్చు. కాని తరువాతి శతాబ్దాలలో రాజ్యస్వం దారుణంగా పెరిగిపోయింది. ఉదాహరణకు అక్బరుకాలంలో మూడో వంతు వసూలు చేసినారు.

అశోకుని శాసనాలలో రుమ్మిండై శాసనం ఒక్కటే పన్నుల విధింపుకు స్పష్టమైన సూచన చేస్తున్నది. లుంబినీగ్రామం బుద్ధుని జన్మస్థలం అయినందున మహారాజు ఆగ్రామానికి పన్నులు మినహాయింపు చేసినాడని, పంటలో ఎనిమిదోవంతు మాత్రమే ఆ గ్రామం పన్నుగా చెల్లిస్తున్నదని ఆ శాసనం చెబుతున్నది. శాసనస్థమైన మొదటి అంశానికి "ఉద్బలికే" అనే మాటను వాడినారు. ఒలి లేదా కప్పంనుండి విముక్తిని ఈ పదం సూచిస్తున్నది. బహుశా ఇది ప్రతి గ్రామము చెల్లించవలసిన భాట్టకం అయి ఉంటుంది. ఇక 'అట్టభాగీయ' ఎనిమిదో వంతు అనేమాట పంటలో భాగానికి సంబంధించినది. సాధారణంగా చెల్లించవలసిన నాలుగోవంతు నుండి తగ్గించిన మొత్తమో లేదా సంప్రదాయమైన ఎనిమిదోవంతును యధాతథంగా ఉంచడమో స్పష్టంగా చెప్పలేము. మామూలు పన్నును కొనసాగించడమే అయితే రాజు ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం

లేదు. ప్రస్తుతం గ్రామాన్ని భాట్టకం నుండి మినహాయించడంవల్ల రాజ్యస్వాన్ని సగానికిగాక స్వల్పంగా మాత్రమే తగ్గించి ఉండవచ్చు. లుంబినీ ప్రాంతంలో మామూలుపన్ను ఆరోవంతు మాత్రమే అయి ఉండవచ్చు. కాబట్టి పాటలీపుత్ర ప్రాంతంలోని నాలుగోవంతు పోలిస్తే 'రుమ్మిందై' ప్రాంతంలో పన్నులు తక్కువ అని తెలుస్తున్నది. గంగానది సమీపంలోని పంట పొలాలవలె ఉత్తరంగా విస్తరించినకొలదీ భూములు సారవంతం కాకపోవడమే అందుకు కారణమై ఉండవచ్చు. గంగానదీ మైదానంలోని సారవంతమైన భూములకు దూరంగా స్థావరాలు విస్తరించినకొద్దీ పన్నుల విధింపులో తారతమ్యాలు ప్రవేశించినాయి. కాబట్టి పంటలో నాల్గవవంతును పన్నుగా వసూలుచేశారన్న మెగస్తనీసు రచన రాజధాని భూములకు మాత్రమే వర్తించినదై ఉండవచ్చు. ఆ అంశాన్ని దేశానికంతటికీ వర్తింపచేసి మెగస్తనీసు వ్రాసినాడు.

'రుమ్మిందై' శాసనం నుండి మరొక ఆసక్తికరమైన అంశం తెలుస్తుంది. అది భాట్టకాన్ని రాజే స్వయంగా మినహాయించడం. భూ ఖామందులవంటి మధ్యవర్తి ఉన్నట్లయితే మినహాయింపువల్ల అతనికి ఆర్థికంగా నష్టం కలుగుతుంది. అందుచే మినహాయింపు జారీ చేయడానికి రాజుకు కొంత ఇబ్బంది కలిగేది. కాబట్టి భూస్వామ్య విధానం రూపొందించడానికి తగిన సాధనం ఉన్నట్లు కనిపించదు. సైనికోద్యోగులకు ధనరూపంలోనే జీతాలు చెల్లించేవారని మెగస్తనీసు వ్రాసినాడు. ఈ విధానంవల్ల తరువాతి భారతదేశంలో హిందూ-ముస్లిము ప్రభుత్వాలు చెల్లించినట్లు ఉద్యోగులకు జీతాలకుబదులు భూమిపై రాజ్యస్వాన్ని చెల్లించే అవసరం తప్పింది. రాజ్యస్వాన్ని మత సంస్థలకు దానం చేయడం భూమిపై యాజమాన్యాన్ని పరివర్తన చేయడం కాదు. మత శాఖీయులు జీవనానికై శ్రమించవలసిన అవసరం లేకుండ అది కేవలం రాజ్యస్వదానమే. భూ యాజమాన్యాన్ని పరివర్తన చేసినప్పుడు ఆ ధనాన్ని బ్రహ్మదేయంగా వ్యవహరించేవారు. రాజుకు ఉన్న హక్కులను అర్థశాస్త్రం వివరిస్తున్నది. ఈ వివరణ భూమిపై రాజుకుగల యాజమాన్యం సిద్ధాంతరీత్యా స్పష్టీకరించకపోయినా మానసికంగా అంగీకరించినట్లే. అవసర సమయాలలో రెండోపంట వేయించడం అట్టి హక్కులలో ఒకటి.

మౌర్యయుగంలో రాజ్య స్వగ్రాహకులవంటి ఉద్యోగులు నేరుగా పంటభూములపై రాజ్యస్వ నిర్ధారణ జరిపేవారని స్పష్టంగా తెలుస్తున్నది. గ్రామం మొత్తంమీద నిర్ధారణ జరిగేది కాదు. ప్రతి కర్షకుని గురించిన వివరాలు సేకరించి నిర్ధారణ జరిపేవారు. నిర్ధారణ క్రమంలో పంట పొలాన్ని ఉత్తమ, మధ్యమ, అధమ తరగతులుగా వర్గీకరించడం మొదటిదశ. తరువాత గ్రామాలను క్రింది వర్గాలుగా విభజించేవారు :

1. పరిహారక గ్రామాలు – పన్నుల నుండి మినహాయింపు ఉన్న గ్రామాలు. 2. ఆయుధీయ గ్రామాలు – సైనికులను సరఫరా చేసేవి. 3. హిరణ్య కుప్య గ్రామాలు – పన్నులను ధాన్యరూపంలో, పశురూపంలో, సువర్ణరూపంలో(హిరణ్య) ముడిపదార్థాల (కుడ్య) రూపంలో చెల్లించే గ్రామాలు. 4. విష్టి గ్రామాలు. శ్రమదానం చేసేవి. 5. పాలు, పెరుగువంటి పశు ఉత్పత్తులను చెల్లించే గ్రామాలు. దీనివల్ల రాజ్యస్వ నిర్ధారణకు పూర్వం స్థానిక ప్రత్యేకతలను ప్రభుత్వం గమనించేదని స్పష్టమౌతున్నది.

భారతదేశంలో కరువులు లేవని మెగస్తనీసు వ్రాసినాడు. కాని భారతీయ గ్రంథాలలో కరువుల ప్రస్తావన ఉన్నందున మెగస్తనీసు రచన కేవలం అతిశయోక్తి అని తెలుస్తుంది. చంద్రగుప్తమౌర్యుని కాలంలో క్షామం సంభవించిందని జైన సంప్రదాయం చాటుతున్నది. సొహ్‌గౌరా, మహాస్థాన్ మౌర్యశాసనాలనుండి కూడ క్షామ పరిస్థితులను గూర్చి సాక్ష్యం లభిస్తున్నది. గంగామైదానంలో క్షామ పరిస్థితులలో తీసుకోవలసిన నివారణ కార్యక్రమాలను గురించి ఈ శాసనాలు చెబుతున్నాయి. భారతదేశం ఐశ్వర్యవంతమైనదంటూ, కరువుల బాధలేదంటూ తన పాఠకులను నమ్మించేవిధంగా మెగస్తనీసు చేసిన ప్రయత్నమైనా అయి ఉండవలె. లేదా క్షామం సంభవించటానికి పూర్వమే మెగస్తనీసు భారతదేశం నుండి స్వదేశానికి మరలి ఉండవలె.

మౌర్యుల కాలంలో ముఖ్యంగా అశోకుని పాలనలో కేంద్రీకరణ అధికతరమయింది. అంటే ఆర్థికవిధానంపై ప్రభుత్వ అజమాయిషీ పెరిగిందని అర్థం. ఆర్థిక నిర్మాణంలో స్వల్పాంశాలను సయితము పరీక్షించి అదుపులో ఉంచగలిగినంతటి సమర్థంగా ప్రభుత్వ పద్ధతిని మౌర్యులు అభివృద్ధి చేసినారు. ఆ వ్యవస్థను సుసంఘటితంచేసి శాసించే వాడైనందున తదనుగుణంగా రాజు అధికారం పెరిగింది. దీనివల్ల కర్షకునకు పరిపాలనలో ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది. అతనికి పరిపాలన అంటే రాజ్యమే. రాజు పూర్వంకంటే దూరంగా ఉన్న చిహ్నమౌతాడు. ఉద్యోగులే అతనికి సన్నిహిత ప్రపంచం. ఈ పరిస్థితులే దేశంలో చాల శతాబ్దాలవరకు కొనసాగినాయి.

మెగస్తనీసు పేర్కొన్న మూడోకులం మేషపాలకులు లేదా గోపాలురు. వీరు సంచార జీవనులని, మృగాలను వేటాడటానికి అనుమతి ఉన్న ఏకైకవర్గమని పేర్కొన్నారు. ఒక ప్రాంతంలో అడవులు ఛేదించి అక్కడ మిగిలి ఉన్న క్రూరమృగాలను నిర్మూలించడానికి వీరిని పిలుస్తూ ఉండేవారు. వీరు సమాజంలో ప్రధానవర్గమైనట్లు భారతీయ గ్రంథాలనుండి సాక్ష్యం లభించదు. కాని గ్రంథాలలో కన్పించే ఆభీర, లేదా అహీర్ కులప్రసక్తినిబట్టి వారు చిన్న చిన్న గుంపులుగా లేదా ఉపవర్ణంగా ఉండేవారని తెలుస్తుంది. వీరు పశు

రూపంలో పన్ను చెల్లించేవారని కూడ మెగస్తనీసు వ్రాసినాడు. వ్యవసాయ వృత్తిలో స్థిరపడక బంజరుభూములపై ఆధారపడి సంచార జీవనులుగానే ఉంటున్న వీరు ప్రాచీన పశు పాలక ఆర్యజాతి అవశేషాలని చెప్పవచ్చు.

మేషగోపాలకులను గురించి సర్వసామాన్యంగా వ్యాఖ్యానించడమేగాని అర్థశాస్త్రం వీరిపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించలేదు. ఉదాహరణకు "సాగుకు యోగ్యంకాని భూములలో రాజు పచ్చికపొలాలకు అవకాశం కల్పించవలె" అని మాత్రం అర్థశాస్త్రం సూచిస్తున్నది. జంతుపోషణయే వృత్తిగాగల ప్రత్యేకవర్గం లేదనడానికి అందుకు వ్యతిరేకమైన సాక్ష్యాధారం లేకపోవడమే అవకాశమిస్తుంది. ఆర్థిక విభాగాల దృష్టిలో ఆలోచించినందువల్లనే మెగస్తనీసు వారినొక ప్రత్యేక కులంగా వర్ణించినాడు. సాంఘిక వ్యవస్థాక్రమంలో గోపాలకులు శూద్రులలో చేరి ఉండవచ్చు. పైన సూచించినట్లు ప్రస్తుత: వారు ఆర్యజాతీయులే అయినా వృత్తిస్వభావం వారిని అట్టడుగు విభాగంలో చేరుస్తున్నది. పెంపుడు జంతువులను పోషించినవారయితే బహుశా కర్షకులలో చేరుతారు. వేటకాండ్రై ఇంకా సంచారజీవనులైన వారిని స్థిరసమాజాలలో జీవించేవారు భ్రష్ట ఆర్యులుగా పరిగణిస్తారు.

గోపాలురు పోషించే మచ్చిక జంతువులలో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, గాడిదలు, ఒంటెలను పేర్కొన్నారు. గుర్రాలను, ఏనుగులను సైతము పోషించేవారు కాని వానిది ప్రత్యేక వర్గము. బహుశా సైనికావసరాలకు ఉపయోగపడినందున గుర్రాలను, ఏనుగులను పోషించడానికి ప్రత్యేకంగా ఉద్యోగులు ఉండేవారు. ఎడ్లప్రసక్తి కూడ ఉంది. అందుచే నాటి కర్షకులకు ఎడ్లులాగే కర్రనాగలి తెలిసి ఉండవలె. మచ్చిక జంతువులలో ఆవు చాల ముఖ్యమైనదనడంలో సందేహం లేదు. ఆవు విలువను గ్రహించారు కాని అది పవిత్ర జంతువు అన్న ప్రసక్తి నాడు కనిపించదు. పాడి దినుసులకోసం, చర్మాలకోసం ఆవును పెంచేవారని అర్థశాస్త్రం నిరూపిస్తున్నది. ఆలమందలో ఆ సంవత్సరమే మరణించిన ఆవు చర్మాలతోపాటు యజమానికి కొంతనేయికూడ గోపాలుడు ఇవ్వాలని అర్థశాస్త్రం చెబుతున్నది. ఆవును మాంసంకోసం వధించేవారు కాదు. కాని ఆవు మాంసం తినేవారే. మరణించిన ఆవుమాంసంగాని, శుష్కమాంసాన్నిగాని గోపాలురు అమ్మవచ్చు. గోవత్సము, వృషభము, పాడిఆవు మొదలైన పశువులను వధింపరాదని అర్థశాస్త్రంలోని మరొకవాక్యము ఇందుకు కారణం సుస్పష్టమే. పశువులు కృషి జంతువులు. వాటినుండి పాడిదినుసులు లభ్యమౌతాయి. అందుచే అవి చాల అమూల్యమైనవి. సహజంగా మరణించిన పశువుల మాంసం అమ్మవచ్చు. గోపాలురు పశురూపంలో కప్పం చెల్లిస్తారని మెగస్తనీసు వ్రాసినాడు. పశురూపంలోగాని, పాడిదినుసుల రూపంలోగాని చెల్లిస్తారని అర్థశాస్త్రం చెబుతుంది.

ఉత్పత్తిలో కొంతశాతం లేదా కొంతవాటాను పశువులమంద యజమానికిగాని, గవాధ్యక్షునకుగాని చెల్లించేవారు. యజమాని ప్రసక్తి పశువులలో సొంత ఆస్తిని సూచిస్తున్నది. అందుచేత కేవలం రాజ్యమేకాక ధనికులుకూడ ఆలమందలను పోషించేవారు. పన్నులు వసూలుచేయడం, పశువుల స్థితిగతులను గోపాలుర పనిపాటలను విచారించడం గవాధ్యక్షుని ధర్మాలు.

జంతువులపట్ల దయతో, శ్రద్ధతో వ్యవహరించాలని తన శాసనాలలో అశోకుడు పదేపదే కోరడమేగాక తనరాజ్యంలోను, పొరుగురాజ్యాలలోను జంతువుల ఔషధచికిత్సకు ఏర్పాటుచేసినట్లు ఒకచోట పేర్కొన్నాడు. మానవులకు, పశువులకు నీరు సులభంగా అందుబాటులో ఉండగలదని రహదారుల పొడవునా బావులు తవ్వించినాడు. చెట్ల చల్లని నీడలో బాటసారులు విశ్రమించగలరని రహదారుల పొడవునా చెట్లు నాటించినాడు. మరొక శాసనంలో జంతువులను చంపరాదని ప్రజలను కోరినాడు. రాజమహానసంలో చంపే జీవాలసంఖ్య రెండు నెమళ్ళు, ఒక లేడికిమాత్రం పరిమితంచేస్తూ, వాటి వధకూడా ఎంతోకాలం కొనసాగదని ప్రకటించినాడు. అదే భావంతో ప్రాచీన చక్రవర్తుల ఇష్టవినోదమైన మృగయా విహారాన్ని ఆపివేసినాడు. ముఖ్యంగా జంతుబలులు చాల ప్రమాదకరమైన ఆచారం. భగవంతుని పూర్తిగా తృప్తిపరచడంకోసం సాధారణంగా శ్రేష్టమైన జంతువును బలిపశువుగా నిర్ణయించడం జరుగుతుంది. వివేకరహితంగా జంతువులను వధించడంవల్ల దేశ పశుసంపదకు తీరని నష్టం వాటిల్లుతుందనే భయం అశోకునకు ఉండి ఉంటుంది. దానితోపాటు జంతువులపట్ల స్వచ్ఛందమైన ఆపేక్షవల్లకూడ అశోకుని అహింసావిధానం రూపొంది ఉంటుంది. జంతువధను నిషేధించడంలో కేవలం అహింసయే అతని ఆశయం అయితే రాజమహానసంలో తక్షణం మాంసాహారం నిలిపివేయడం చక్కని మార్గదర్శకంగా ఉండేది.

ఐదోస్తంభ శాసనంలో రెండు పట్టికలున్నాయి. అందు మొదటిది ఏ పరిస్థితులలోను చంపరాని జంతువులపట్టిక. రెండవది కొన్ని ప్రత్యేక దినాలలో చంపకూడని జంతువుల పట్టిక. అస్తవ్యస్తంగా ఉన్న ఈ పట్టికు అర్థం చెప్పడం చాలా కష్టం. బాతులను, రాణిచీమలను, తొండలను చంపరాని జంతువులుగా చెప్పడంలో అర్థం కనిపించదు. ఆహారయోగ్యంగాని, చతుష్పాదులను వధింపరాదంటూ ఆ పట్టికను ముగించినారు. ఇటువంటి అనవసర జంతువధను నిషేధించడం సమర్థనీయమే. ఈ శాసనంలోని జంతువుల పట్టికకు అర్థశాస్త్రం పదునాలుగో అధికరణంలోని పట్టికతో పోల్చిచూస్తే కొంత సంబంధం కనిపిస్తుంది. అనేక రకాల జంతువుల దేహభాగాల నుపయోగించి విషములు,

మంత్రౌషధాలు తయారుచేయడానికి సంబంధించినదీ విభాగం. ఇందులో బల్లి కుటుంబం తరచుగా కనిపిస్తుంది. మంత్రౌషధాలను, విషాలను తయారుచేయడానికి ఉపకరించినందున ఈ జంతువులవధ నిషిద్ధమని భావించవచ్చు. జంతు బలులను వ్యర్థ, నిరర్థక క్రతువులుగా అశోకుడు నిరసించినట్లు పెక్కు శాసనాలనుండి గ్రహిస్తున్నాము. అభిచారయోగాలలో జంతువులను ప్రయోగించడం సయితం ఈ శాసనాలలో కనిపిస్తుంది. ఇది అమాయక ప్రజలను మాంత్రికుల, భూతవైద్యుల ప్రభావంనుండి రక్షించడానికి చేసిన చతురప్రయత్నమై ఉండవచ్చు.

అర్థశాస్త్రంలో వధ్యస్థాన అధ్యక్షులను గురించిన అధికరణంలో పీడింపరాని జంతువుల, పక్షుల పట్టిక ఉంది. మానవరూపంలోని జంతువులు ఇందులో ఉన్నాయి. ఇవి కోతులని వేరే చెప్పనక్కరలేదు. అన్నిరకాల చేపలు, పక్షులలో హంసలు, బాతులు, చిలుకలు, మైనాలు ఇందులో ఉన్నాయి. అశోకుని శాసనంలోకూడ ఈ పక్షులను పేర్కొన్నారు. శకున జంతువులుగా సాధారణంగా వర్ణితమైన జంతువులు కూడ ఈ పట్టికలో ఉన్నాయి. ఈ జంతువులను ఏ ఆశయంతో రక్షించాలో అర్థశాస్త్రం వివరింపకపోవడం దురదృష్టము. ఆహారయోగ్యంకాని కొన్ని చేపలను పట్టరాదని విధించడం అర్థవంతమే. పాడిమేకలు, గొర్రెలు, పందులు, ఆరు నెలలు నిండని పశువులు వధ్యములుకాదని అశోకుని పై శాసనం విధిస్తున్నది. ఈ వాక్యానికి వ్యాఖ్యానం అనవసరం. వాటిని చంపడం హృదయం లేని క్రూర కర్మగా అశోకుడు భావించినాడని విదితమౌతున్నది. అంతేగాక అవి అన్నీ పెంపుడు జంతువులు; మాంసానికి అనుషంగికమైన ఉత్పత్తులకు పనికి వచ్చేవి.

చేపలు పట్టడాన్ని నిషేధించడం సర్వసాధారణం. కొన్ని రోజులలో చేపల అమ్మకాన్ని కూడ అశోకుడు నిషేధించినాడు. వివేకరహితంగా, విశృంఖలంగా చేపలను పట్టడంవల్ల వాటి సహజమైన జాతివర్ధక అలవాట్లకు భంగం వాటిల్లుతుందనే భయంతో రెండో నిషేధం విధించి ఉంటాడు. ప్రత్యేక దినాలలో చేపల విక్రయాన్ని నిషేధించడంలో సంవత్సరం మొత్తం మీద చేపల అమ్మకాన్ని క్రమబద్ధం చేయడమే అతని ఉద్దేశమై ఉంటుంది. మౌర్యయుగంలో చేపలను ప్రధాన వాణిజ్య వస్తువుగా పరిగణించినారు. వేటాడిన పక్షులపై, చేపలపై పదోవంతుసుంకం చెల్లించాల్సి ఉంది. అర్థశాస్త్రం చేపను ఆహారయోగ్యంగా పరిగణించింది. మత్స్యకేంద్రాల నిర్మాణాన్ని అభివృద్ధిని గురించి ఆలోచనలు జరిగినాయి. ఇతర ప్రయోజనాలకు సయితం చేపలను ఉపయోగించినారు. చేప ఎరువు విలువ నాటి ప్రజలకు తెలుసు. విరోధి దేశాలకు ప్రవహించే నదులలోని చేపలను విషదుష్టం చేయడం శత్రుబలానికి హానికలిగించే అనేక సాధనాలలో ఒకటి. దీన్నిబట్టి చేపలను తినడం నాడు సర్వసాధారణమని స్పష్టమౌతున్నది.

కాందహార్ శాసనంలో రాజనియుక్తులైన వేటగాంద్రను, బెస్తలను గురించి ఆసక్తికరమైన ప్రసక్తి కన్పిస్తుంది:-

"మహారాజు జంతువులను తినడం మానినాడు
కావున రాజుకు సంబంధించిన వేటకాండ్రు, బె
స్తలు, ఇతరులు కూడ వేటాడటం మానినారు."

ఇందులో ఉద్దేశించిన బెస్తలు, వేటకాండ్రు రాజక్షేత్రాలపై రాజు తన సొంత అవసరాలకై నియమించినవారని చెప్పవచ్చు. అశోకుడు మృగయా వినోదాలను నిలిపివేసినాడని మనకు తెలుసు. కాని మౌర్యులకాలంలో చేపలు ప్రధాన ఆహారవస్తువైనచో చేపలు పట్టడాన్ని పూర్తిగా నిషేధించడం అశోకునకు సాధ్యమయ్యేదికాదు. దుర్గమారణ్యాలను యాత్రికులకు సురక్షిత ప్రాంతాలుగా ఉంచడానికి వేటకాండ్రుకూడా అవసరమే. అందుచేత దేశం మొత్తం మీద వేటకాండ్రుకాని, బెస్తలుగాని, తమతమ వృత్తులు పూర్తిగామానడం అసంభవం.

మౌర్యులు భారతదేశ రాజకీయ ఐక్యాన్ని సాధించి పటిష్టమైన కేంద్ర పాలనాధికారం స్థాపించడంవల్ల అనేక ఫలితాలు కలిగినాయి. వాటిలో వివిధ వృత్తులకు లభించిన ప్రోత్సాహము గణనీయమైనది. పరిపాలన మెరుగుపడడం వల్ల వాణిజ్యము, వర్తకము సాగించడం సులభమైంది. వృత్తులు క్రమంగా కుటీరపరిశ్రమలుగా రూపొందినాయి. కళాకారులను (artisans) వృత్తిపనుల వారిని తన సప్తవర్ణ విభాగంలో నాలుగోవర్ణంగా మెగస్తనీసు వర్ణించినాడు. వారిలో కొందరు కప్పం చెల్లిస్తారని వ్రాసినాడు. వీరు కవచకారులని, ఉపకరణకారులని డియోడరస్ వాదిస్తాడు. కళాకారులు, చేతిపనివారలు పన్నులు చెల్లిస్తారుకాని కవచకారులు, నౌకానిర్మాతలు మాత్రం పన్ను చెల్లించరు. వారికి ప్రభుత్వమే వేతనం చెల్లిస్తుందని ఏరియన్ వ్రాసినాడు. పాటకజనంలో కొందరిని ప్రభుత్వమే నియమిస్తుంది కాబట్టి వారిపై పన్ను ఉండదు. కవచకారులు రాజ్యనియుక్తులనడంలో ఆశ్చర్యం లేదు. వీరు రాజ్యానికి కొన్ని సేవలు చేసేవారు. సంవత్సరంలో కొన్ని నిర్ణీత దినాలు రాజ్యంకోసం పనిచేసేవారు. దీన్ని సేవలరూపంలో చెల్లించిన పన్నుగా భావించేవారు.

భారతీయ, ఐరోపీయ వ్యాఖ్యలనుబట్టి కళాకారులు క్రమబద్ధంగా సుసంఘటితులైనట్లు తెలుస్తుంది. వస్తువులు తయారైనంతనే ఉద్యోగి ఒకడు విశిష్టమైన ముద్రనుపయోగించి వస్తువులపై చిహ్నాలు వేసేవాడు. అమ్ముడుపోని పాత వస్తువుల నుండి కొత్త వస్తువులను నిరూపించడానికై ఈ చిహ్నాలు ఉపయోగించేవి. ప్రభుత్వపక్షాన ఇంతటి జాగ్రత్త ఉన్నప్పుడు

ఉత్పత్తిదారులు సయితము సుసంఘటితమైన వ్యవస్థగా రూపొంది ఉండవలె. బౌద్ధయుగారంభంలో ప్రారంభమై మౌర్యయుగంలో కొనసాగిన శ్రేణుల పద్ధతినిగూర్చి నాటి సారస్వతంలో తరచు ప్రస్తావనలు కనిపిస్తున్నాయి. శ్రేణుల చరిత్రను పరిశీలించిన ఫిక్ పండితుడు శ్రేణుల వికాసానికి భౌగోళిక పరిస్థితులు తోడ్పడినట్లు సూచిస్తున్నారు. నగరంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క చేతివస్తువును విక్రయించే వర్తకులు నివసించేవారు. వర్తకుల గ్రామాలుకూడ ఉన్నట్లు తెలుస్తుంది. ముడిపదార్థాలు సులభసాధ్యమయినందున ఒక్కొక్కగ్రామంలో ఒకేవృత్తి కేంద్రీకృతమై ఉండేది. శ్రేణుల పద్ధతి ఉదయించడానికి అవసరమైన మూడు అంశాలు నాడు లభ్యమైనాయి. అందు మొదటిది-వృత్తులు స్థానీయంగా వికసించడం; రెండోది వృత్తులలో వంశపారంపర్యానికి గుర్తింపురావడం, మూడోది ప్రతిశ్రేణి 'జట్టక' అనే నాయకుని క్రింద పనిచేసే పద్ధతికి భావం సర్వత్ర అంగీకారం కావడం. ఇందువల్ల జాతికి, కులానికి మధ్యస్థమైన శ్రేణీపద్ధతియేర్పడి మౌర్యయుగంలో జరిగిన వ్యాపార విస్తరణవల్ల స్థిరపడింది. తరువాతకాలంలో శ్రేణులకు నియమ నిబంధనలు పెరిగినాయి. వీటి ఫలితంగా కొన్ని శ్రేణులు కులాలుగా మారినాయి. ప్రథమంలో శ్రేణీ విధానం బలపడడానికి పోటీకూడ తోడ్పడి ఉండవచ్చు. వ్యక్తిగతంగాకంటే సమిష్టిగా కృషిచేయడం ఆర్థికంగా లాభకారి. సాంఘికహోదాను పెంచడమేగాక అవసరమైన సందర్భాలలో వ్యక్తికి సమాజం సహాయం చేయగలదు. క్రమ క్రమంగా శ్రేణులు తమతమ పారిశ్రామిక సంఘాలుగా రూపొందినాయి.

ఇట్టి పరిస్థితులలో ఉత్పాదకవస్తు సముదాయమంతా శ్రేణుల ఆధీనంలో ఉంటుంది. వస్తువులకు గిరాకీ పెరిగి ఉత్పత్తిదారులు తాముగాని, తమ కుటుంబాలుగాని ఉత్పత్తి చేయగల వస్తువులతో ఆ గిరాకీని తృప్తి పరచలేమని గమనించడంతో వస్తూత్పత్తిలో కూలీలను నియమించవలసి వస్తుంది. కూలీకై పనిచేసేవారిలో భృతకులు, దాసులు అని రెండు రకాలవారుండేవారు. క్రమ వేతనానికై పనిచేసే స్వతంత్ర కార్మికులు మొదటిరకం. ఇక రెండవరకంవారు బానిసలు. అశోకుని శాసనాలలోని భృతక, దాస పదాలు పై రెండురకాల వేతనకారుల నుద్దేశించినవే. ఈ విధంగా శ్రేణులు మౌర్యయుగంలో భారీవ్యవస్థలుగా రూపొంది, ఉపఖండం మొత్తంమీద కాకపోయినా ఉత్తర భారతంలో పరిగణనలోకి వచ్చినాయి. స్థానిక ఉద్యోగులు శ్రేణులను నమోదుచేసుకొని స్థానిక సహకార సంఘాలు తప్ప మరేవీ గ్రామాలలో ప్రవేశింపరాదని నిషేధించి శ్రేణులకు ఒక హోదా కల్పించినట్లు తెలుస్తుంది. దీన్నిబట్టి ఉద్యోగుల అనుమతిలేనిదే శ్రేణులు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళరాదని గ్రహిస్తాము. ఒక వృత్తిపై ఆధారపడిన పాటక

జనంలోనే సాంఘికంగా తరతమ భేదాలేర్పడినట్లు కనిపిస్తుంది. అర్థశాస్త్రంలో నగర భవనాలను వర్ణించే అధికరణంలో భిన్నవృత్తుల సాంఘిక హోదాలను గురించిన సమాచారం కొంత ఉంది. నగరంలో వారి వారి నివాస ప్రాంతాల ననుసరించి వారి వారి హోదాలు మారేవి.

శ్రేణీవ్యవస్థవల్ల వాటిలోని సభ్యులకు కొన్ని హక్కులు లభించేవి. చోరుల వంటి ప్రమాదాలనుండి వారికి రక్షణ ఉండేది. చేతిపనివానిని గాయపరచిన వానికి మరణశిక్ష విధించేవారు. అయితే అతడు పనిలో ఉండగా గాయపరచినపుడే ఆ శాసనం వర్తిస్తుంది. కళాకారుని వస్తువులు దొంగిలించినట్లు ఋజువైతే నూరు వరహాలు అపరాధం చెల్లించాలి. కళాకారులు చేసే మోసాలను గురించి కూడ కఠిన నిబంధనలుండేవి. శ్రేణులకు చెందిన కళాకారులకు డబ్బు అప్పగించడంలో కూడ జాగ్రత్త వహించవలెనని ప్రజలను హెచ్చరించేవారు. మోసాలనరికట్టడానికి శ్రేణిలో సభ్యత్వం సాధనంగా పనిచేసేది. మోసంచేస్తూ పట్టుపడిన పనివాణ్ణి శ్రేణినుండి తొలగించేవారు. స్వతంత్రంగా పనిచేయడం ఆ రోజుల్లో కష్టసాధ్యంగా కనిపిస్తుంది.

ఉత్పత్తిగుణాన్ని, ప్రమాణాన్ని బట్టి వేతనం నిర్ణయించేవారు. ఉదా: ప్రమాణాన్ని బట్టి పనివాడు వడికినదారం సన్ననా, ముదుగా, మధ్యస్థమా అనే గుణాన్ని బట్టి అతనికి వేతనం ఇచ్చేవారు. ప్రమాణానికి నిర్దిష్టమైన వేతనం పద్ధతికూడ ఉండేది. సెలవరోజుల్లో పనికి వేతనంకాక పారితోషికం ఇచ్చేవారు. ఉత్పత్తిపై కఠినమైన పర్యవేక్షణ ఉండేది. మోసానికి కఠిన వరకం విధించేవారు. పూర్తియైన పని ప్రమాణాన్నిబట్టి వేతనం చెల్లించాలని అర్థశాస్త్రం చెబుతుంది. పని సగమే పూర్తియైనపుడు పూర్తియైన మేరకే పనివాండ్రకు వేతనం చెల్లించేవారు. పూర్తి వేతనం పని పూర్తికాగానే చెల్లిస్తారు. పని నష్టమైతే యజమానికి మేస్త్రీగాని, అతని ప్రతినిధిగాని నష్టపరిహారం చెల్లించవలె. ఈ పద్ధతే శ్రేణి మొత్తానికిగాని, పనివాండ్రకు వ్యక్తిగతంగా గాని వర్తిస్తుంది.

నాడు అమలులోఉన్నవి వృత్తి శ్రేణులొక్కటేకాదు. సైనికులను ఎన్నిక చేయడంలో సైనిక సంఘాలు ప్రముఖ పాత్రను నిర్వహించేవి. వీరు శ్రేణులుగా ఏర్పడిన మామూలు సైనికులు కాదు. కాని వీరిని నేటి మూలబలంతో పోల్చవచ్చు. వంశ పరం పరాగత సైన్యాలు, కిరాయి సైన్యాలు, మిత్ర సైన్యాలు, ఆటవిక జాతులు నాటి సైన్యంలో ఉండేవి. వంశ పరం పరాగత సైన్యాలనే మాట శాశ్వత ప్రాతిపదికపై ప్రభుత్వం నియుక్తమైన వ్యవస్థాపిత సైన్యాన్ని సూచిస్తుందనడంలో సందేహం లేదు. అవసరమైనపుడు కిరాయి సైన్యాన్ని తాత్కాలికంగా నియమించేవారు. సైనిక సంఘాలకు చెందని ఇతరరకాల

సైనికులను కూడ అవసర సమయాలలో నియోగించేవారు. కర్షకులు ఆయుధాలు ధరించడం నిషేధించినప్పటికీ చేతి పనివారిని ఆయుధాలు ధరించి తిరగనిచ్చేవారు. యుద్ధసమయాలలో సైన్యంలో పనిచేయడానికి సమర్థులైన వారినందరిని ఒక జాబితాలో చేర్చేవారు. వీరు తమ శ్రేణిలోనేగాక ఏదో ఒక సైనిక సంఘంలో కూడ సభ్యులై ఉంటారు. వీరు సుశిక్షితులైన సైనికులవలె సమర్థులు కాదని అర్థశాస్త్రం అదే అధికరణంలోని మరో పరిచ్ఛేదం చెబుతుంది. శత్రుసైన్యంలో కూడ మామూలు సైనికులతోపాటు సైనిక సంఘాలకు చెందిన సైనికులున్నప్పుడే అట్టివారిని తాముకూడ నియమించవలెనని ఈ పరిచ్ఛేదం వివరిస్తున్నది. ఈ వాక్యం నాడు సంకుల సమరాలుగాక గెరిల్లా యుద్ధాలు జరిగేవని సూచిస్తున్నది.

పరిపాలనాధ్యక్షులకు విధులను చర్చించే సందర్భంలో వారికి అనేక శ్రేణుల కార్యక్రమాలతో సంబంధం ఉన్నట్లు అర్థశాస్త్రం వివరిస్తున్నది. ఈ శ్రేణులలో పలురకాల వస్తువులు తయారైనట్లు పురావస్తు పరిశోధనలద్వారా, ప్రాచీన ఐరోపా రచనల ద్వారా తెలుస్తున్నది. నాడు తయారైన ఆయుధాల జాబితా చాల విపులంగా ఉంది. భారతీయ పదాతి సైనికులు ధనుస్సు, ఖడ్గము, శూలము ధరించేవారని, ప్రతి ఆశ్వికుడు రెండు ఈటెలు ధరించేవాడని ఏరియన్ వ్రాసినాడు. సైనిక అవసరాలకు, గృహోపకరణాలకు లోహాలు ఎక్కువగా వాడినారని హస్తినాపూర్‌లో జరిగిన పురావస్తు త్రవ్వకాలవల్ల తెలుస్తున్నది. అచట దొరికిన ఆయుధాలలో సూక్ష్మాగ్రము, ఆధారముఖముగల బాణాలు, శిలీ ముఖాలు ముఖ్యమైనవి. పూర్వయుగంకంటె మౌర్యయుగం చాల సాంకేతాభివృద్ధిని సాధించినట్లు ఇవి సూచిస్తున్నాయి.

నాటి ప్రజలకు పెక్కులోహాలు తెలుసు. వాటిని త్రవ్వి తీయడంలోను, ఉత్పత్తి చేయడంలోను ఉన్న ప్రత్యేక లక్షణాలను వారు గుర్తించినారు. ఇనుము, రాగి, సీసము మొదలైన నిత్యావసరలోహాలకేగాక బంగారం, వెండి మొదలైన అమూల్య లోహాలకు కూడ ఈ పరిజ్ఞానం విస్తరించింది. హస్తినాపూర్ త్రవ్వకాలలో రాగి కాటుక కడ్డీలు, గోరుగోళ్ళు దొరికినాయి. తక్షశిల భిర్‌దిబ్బలో మౌర్యయుగ ప్రస్తరాలలో ఇతర రాగి, కంచు వస్తువులు లభించినాయి. 'రాం పూర్వా' అశోక శిలాస్తంభంపై ఉన్న రాగి సీల, మౌర్యయుగానికి చెందిన తామ్ర నాణేలు నాడు రాగి విశేషం వాడుకలో ఉన్నదనడానికి నిదర్శనాలు. మౌర్యయుగంలో ఇనుముకు గిరాకీ హెచ్చినట్లు కనిపిస్తున్నది. భిర్‌దిబ్బ అడుగు ప్రస్తరాలలో దొరికిన వస్తువులలో ఇనుప గొడ్డళ్ళు, కత్తులు, గీకుడు పనిముట్లు ఉన్నాయి. ఎగువ ప్రస్తరాలలో ఇనుము విస్తృతంగా వాడుకలోనికి వచ్చిన సూచనలున్నాయి.

ఈ ప్రస్తరాలలోనే ఇనుముతో చేసిన వ్యావసాయక పనిముట్లు, ఆయుధాలు, పాత్రలు మొదలైన గృహోపకరణాలున్నాయి.

బంగారం, వెండి వంటి అమూల్య లోహాలు, వజ్రవైడూర్యాలవంటి పెక్కు అనర్ఘశిలలు మౌర్యయుగంలో వాడుకలో ఉన్నట్లు సాక్ష్యం విస్తారంగా లభించింది. సువర్ణాధ్యక్షుని విధులను గురించి, ప్రభుత్వ స్వర్ణకారుల కార్యకాలాపాలను గురించి కౌటిల్యుడు విపులంగా పేర్కొన్నాడు. రాజధనాగారానికి వచ్చే రత్నాల పరీక్షను గురించి ఒక ప్రత్యేక అధికరణం వ్రాసినాడు. సువర్ణ వస్తువులను, రత్నఖచిత ఆభరణాలను ప్రదర్శిస్తూ సాగిన ఒక భారతీయ ఉత్సవాన్ని స్ట్రేబో వర్ణించినాడు. నాడు అనేకరకాల ఆభరణాలున్నట్లు హస్తినాపూర్‌లోను, భిర్ దిబ్బలలోను నిదర్శనలు లభించినాయి. రాజాజ్ఞలతోను, ధనిక పౌరజననియోగాలతోను, స్వర్ణకార, రత్నజీవిక శ్రేణులు సర్వదా కార్యనిమగ్నులై ఉండేవి.

రాతిపనివారు తమ వృత్తిలో సాధించిన అపూర్వమైన పనితనాన్ని నిరూపించడానికి వాఙ్మయ సాక్ష్య మక్కరలేదు. అశోకుని స్తంభాల వాటి కిరీటాల సాక్ష్యమేచాలు. మౌర్యయుగానికి పూర్వకాలానిది అని నిశ్చయంగా చెప్పగల శిల్పము లభ్యంకాలేదు. అందుచే మౌర్యయుగం నాటి రాతి పనివారు అంతటి ఉత్కృష్టమైన పనినేవిధంగా సాధించారనేది ఒక పెద్ద సమస్యగా ఉంది. మౌర్యయుగానికి పూర్వం దారువును విస్తారంగా వాడేవారు. మౌర్యయుగానంతరం రాయి వాడకం అధికమైంది. ఈ అంశాలు మౌర్యయుగమే పరివర్తన యుగంగా సూచిస్తున్నాయి. మౌర్యయుగానికి చెందిన శిల్పాలు నేటికి చాలనిలచి ఉన్నాయి. వీటికి కారకులైన పనివారు మౌర్య సామ్రాజ్యం సరిహద్దులలో బహుశా తక్షశిలలో శిక్షణ పొందినారని చెప్పవచ్చు. పనితనంలో కనిపించే సారూప్యం ఈ శిల్పులందరు ఒకే కేంద్రంలో శిక్షణపొందినట్లు సూచిస్తున్నది. నాటికీ ఇరాన్ శిల్పులకు శిలాసాధనంతో మంచి పరిచయం ఉంది. వారితో తక్షశిల భారతీయ శిల్పులకు పరిచయం ఏర్పడి ఉంటుంది. ఈ అభిప్రాయాన్ని భిర్, మథుర, చునార్‌లలో దొరికిన వాలుకా శిలల అవశేషాలు బలపరుస్తున్నాయి.

దారుశిల్పుల శ్రేణికూడ కార్యనిమగ్నమై యుండేది. అగ్నిపట్ల నగరాధ్యక్షుడు ప్రత్యేక శ్రద్ధవహించాలని హెచ్చరించడంవల్ల నాటి నగరాలు చాలవరకు దారునిర్మితాలేనని అర్థశాస్త్రం సూచిస్తున్నది. జాతీయవిపత్తుల పట్టీలో అగ్నిప్రమాదాలది ప్రథమస్థానము. మౌర్యయుగంలో ఇటుకలువాడిన గుర్తులు లభించినాయి. ఒక ప్రత్యేక ప్రమాణం ఉన్న ఇటుకలను మౌర్యయుగం ఇటుకలుగా పురాతత్త్వవేత్తలు గుర్తించినారు. అయినప్పటికి ఆనాడు కలపనే విరివిగా వాడేవారు. ఆ రోజులలో బంజరుభూములలోని అడవులను

నరుకుతుండేవారు. అందుచేత కలప భారీగా సరఫరా అయి సులభంగా లభ్యమౌతుండేది. రాయికంటే కలపే చౌకగా లభించే నిర్మాణ సామగ్రి అయింది. పాటలీపుత్రాన్ని చుట్టి దారుప్రాకారం ఉండేది. దారుశిల్పులతోబాటు, దంత, శల్యశిల్పులు పనిచేసేవారు. దంత, శల్య అలంకరణ అవశేషాలు భిర్ దిబ్బలలో దొరికినాయి. సాంచీలోని ద్వారతోరణాలపై ఉన్న స్వల్పోల్బణ ఉల్లేఖనాలను దంతం నమూనాలు ఆధారంగా చెక్కినారని శిల్ప చరిత్రకారులు నిరూపిస్తున్నారు.

తంతువాయ శ్రేణి సయితం మౌర్యయుగంలో ప్రబలంగా ఉండేది. కొన్ని కొన్ని వస్త్రాలలో ప్రసిద్ధివహించిన ప్రదేశాలను అర్థశాస్త్రం పేర్కొంటున్నది. మధుర, అపరాంత, కళింగ, కాశీ, వంగ, వత్స, మహిషమండలాలలో నూలువస్త్రాలు తయారయ్యేవి. అపరాంతలో తయారైన నూలువస్త్రాలు బ్రోచ్‌ద్వారా ఎగుమతి అయి ఉండవచ్చు. దుకూల, క్షౌమాలు ఇతర రకాల వస్త్రాలలో ముఖ్యమైనవి. దుకూలము తెల్లని మృదువైన వస్త్రం. క్షౌమం ఒక రకం పట్టువస్త్రము. ఉన్ని దుప్పట్లు, ఉన్నివస్త్రాల తయారీకూడ నాడుతెలుసు. బంగారుజరీ అంచుబట్టలు, జరీదుస్తులు ధరించిన ప్రముఖవ్యక్తుల ఊరేగింపును గ్రీకురచనలు పేర్కొంటున్నాయి.

మృణ్మయపాత్రల వాణిజ్యాన్ని క్లుప్తంగా పేర్కొనికూడ కులాలవృత్తిని గురించి కౌటిల్యుడు వివరింపకపోవడం ఆశ్చర్యం. మౌర్యయుగానికి చెందిన ప్రదేశాలలో కుండలు, కుండపెంకులు విరివిగా కనిపిస్తున్నందున సమృద్ధమైన శ్రేణులలో నాడు కులాలశ్రేణి ఒకటి అని చెప్పవచ్చు. మృణ్మయపాత్రలు సర్వ సామాన్యంగా వాడుకలో ఉండేవి. అందుచేత వాటిని ప్రత్యేకించి చెప్పవలసిన పనిలేదు. మౌర్యసమాజంలో ఉన్నతవర్గాలవారు నల్లని మెరుగుదల మట్టిపాత్రలను (N B P) విరివిగా వాడేవారు. కనీసం ఆ పాత్రలనైనా అర్థశాస్త్రము వర్ణిస్తుందని ఆశిస్తాము. కాని కౌటిల్యుడు ప్రతివృత్తిని గూర్చి వ్రాయడానికి పూనుకోలేదు. సాధారణ వివరణకు ఉపయుక్తమైన వృత్తులను మాత్రమే వివరించినందున కులాలను విడిచిపెట్టి ఉంటాడు.

వ్యవస్థాపితమై దృఢమైన ఆర్థికవిధానానికి అనుగుణమైనరీతిగా వ్యాపార నిబంధనలను రూపొందించినారు. క్రయవిక్రయాలపై కఠినమైన ప్రభుత్వపర్యవేక్షణ జరిగేది. వాణిజ్యాధ్యక్షుడు వస్తువుల ధరలను నిర్ణయించేటప్పుడు రవాణా సౌకర్యాలను, ధరల హెచ్చుతగ్గులను పరిగణిస్తూ ఉండేవాడు. మెట్టమార్గాన రవాణాకంటె నీటిపై రవాణా చవక. కాబట్టి రవాణా సౌకర్యాల స్వభావాన్ని అనుసరించి వస్తువుల ధరలు మారుతూ ఉండేవి. విదేశ వస్తువులను దిగుమతి చేసే వర్తకులు కోరితే పన్ను మినహాయింపు

అమ్మకం ద్వారా, విదేశ వస్తువుల అమ్మకం ద్వారా మంచి లాభాలు పొందేవారు. అమ్మకం పన్ను ప్రభుత్వ ఆదాయమార్గాలలో ఒకటి అయి ఉంటుంది. ఇది సుంకంలో ఐదోవంతు. సుంకం వస్తు విలువలలో ఐదోవంతు. ప్రజలకు హాని కలిగేటట్లు వర్తకులు లాభాలు సంపాదించకుండా చూచే బాధ్యత వాణిజ్యాధ్యక్షునిది. కాబట్టి వర్తకుని లాభశాతం ముందే నిర్ణయించేవారు. అంతకుమించిన లాభం ధనాగారానికి చేరేది. స్థానిక వస్తువులపై ఐదోశాతము, విదేశ వస్తువులపై పదోశాతము లాభంగా ఉండేది. శ్రేయస్కరమైన ఈ ధరల నిర్ణయం సాధారణ పరిస్థితులలో ప్రజలకు వర ప్రసాదము. కాని ధనాగారాన్ని నింపవలసిన అవసర సమయాలలో ధరలు పెంచవలసినదిగా ప్రోత్సహించేవారు. తద్వారా ధనాగారానికి అధిక ఆదాయం సంక్రమించేది. ధరల లాభాల నిర్ణయంవంటి నిబంధనలు వాణిజ్యంలో మధ్యవర్తుల సంపాదనకుకూడ ధరల నిర్ణయము, లాభాల నిర్ణయము వర్తించేది. ఒక ప్రాంతం అవసరాలనుబట్టి ఒక వస్తువు గిరాకి, సరఫరాలనుకూడ అదుపులో ఉంచేవారని తెలుస్తుంది. వస్తూత్పత్తి ప్రమాణాన్నికాని, వస్తు వినియోగాన్నిగాని అంచనా వేయడం సాధ్యం కాదు. కాబట్టి పై చర్యలన్నీ నామమాత్రంగానే ఉండేవి. ఉత్పత్తిని అదుపులో ఉంచడంగాని, దాన్ని అవసర ప్రదేశాలకు తరలించడంగాని చాల నిదానంగా జరుగుతూ ఉండేది. అందుచే ఒక్కొక్క వస్తువులో అధికోత్పత్తి ప్రమాదం ఏర్పడడం కద్దు. పాతవస్తువులను కొత్తవిగా అమ్మడంవంటి మోసాలు జరుగకుండ ఈ నిబంధనను కఠినంగా అమలు జరిపేవారు. వస్తువునుబట్టి సుంక ప్రమాణం మారినప్పటికీ క్రయవిక్రయాలపై పదోవంతును సుంకంగా విధించినట్లు కనిపిస్తుంది. ఆరు ఇరవైఐదోవంతుల మధ్య సుంకం ప్రమాణం మారుతూ ఉండేది. కొన్ని రకాల వస్త్రాలపై ఇరవైఐదోవంతు, పూలు పండ్లపై ఆరోవంతు సుంకం విధించేవారు. క్రయవిక్రయాలపై పన్నులున్నందున వస్తూత్పత్తి స్థానంలోనే అంటే వస్తువు ధర నిర్ణయించి పన్ను విధించకపూర్వమే వస్తువును కొనడం శిక్షార్హమైన నేరం. దేశంలో తయారైన వస్తువులపై ఉత్పత్తిస్థానంలోను, దేశ వస్తువులపై రహదారి సుంక ద్వారాలలోను ముద్రలు వేసేవారు. రహదారి సుంకం వస్తువు విలువనుబట్టి ఉన్నందున సుంకాన్ని వస్తురూపంలోగాని, ధన రూపంలోగాని చెల్లించేవారు. విదేశ వాణిజ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో విదేశవస్తువులపై పన్ను మినహాయింపు ఉండేది. ఒక వర్తకుడుగాని, వృత్తిపనివాడుగాని తన శ్రేణిలో సభ్యుడై తన ఇంట్లో ఉంటే వాని సత్ప్రవర్తనకు ఆ గృహస్థు బాధ్యత వహించవలె. ఇట్టి పరిస్థితులలో పరిచయస్థునకు మాత్రమే ప్రామాణిక పురుషులు లభించే వారుగాని అపరిచితులకు లభించరు. అందుచేత విదేశ వర్తకుల రాకకు ఎక్కువ ప్రోత్సాహం లేదు. వస్తువుల ధర నిర్ణయించడంలోగాని,

కొలతలోగాని జరిగే మోసాన్ని కఠినంగా శిక్షించేవారు. నేర ప్రమాణ, శిక్షా ప్రమాణాలను గురించిన వివరాలు స్పష్టంగా ఉన్నాయి. అదే విధంగా నిర్ణీత లాభంకంటె ఎక్కువ లాభం గడించడం కూడ శిక్షార్హమైన నేరంగా పరిగణించారు.

వడ్డీకి డబ్బును ఇవ్వడంగాని, అప్పుచేయడంగాని భారతీయులకు తెలియదంటూ మెగస్తనీసు వ్రాసినాడు. కాని పైన వివరించిన ఆర్థిక కృషినిబట్టి ఆలోచిస్తే మెగస్తనీసు రచన యధార్థం కాదని తోస్తుంది. నాటి వణిక్ సమాజం తమకున్న వనరుల నుపయోగించుకొని అదృష్టాన్ని సమకూర్చుకొన్న పద్ధతినిబట్టి వారి వాణిజ్య నిర్వహణా సామర్థ్యం ఉన్నత ప్రమాణంలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇందుకు నిదర్శనలు బౌద్ధ సారస్వతంనుండి లభిస్తున్నాయి. దీనికే సంబంధించిన ఒక వాక్య భాగం:

> "జ్ఞాని నీతిపరుడై ఉంటాడు, పుష్పానికి హానికల్గించని మధుపం
> లాగ ధనం ఆర్జిస్తూ కొండశిఖరంపైని అగ్నిలా ప్రకాశిస్తాడు.
> చీమల పుట్టలవలె క్రమక్రమంగా కూడబెట్టి ధనికుడైనవాడు తన
> కుటుంబానికి సహాయకారి కాగలడు. శాశ్వతమైన అనుబంధా
> లను సంపాదించగలడు. అట్టివాడు తన ధనాన్ని నాల్గు భాగా
> లుగా విభజింపవలె. ఒక భాగంతో తన జీవితం సాగిస్తూ,
> రెండు వంతులలో వాణిజ్యాన్ని విస్తరింపచేసి నాల్గోవంతును
> దుర్దినాలకు నిల్వ ఉంచుకోవలె."
>
> (దీఘనికాయ)

వర్తకునకు అతని లావాదేవాలలో తోడ్పడడానికి అనధికార 'బ్యాంకింగు' విధానం లేదని చెప్పలేము. వడ్డీ వ్యాపారంపై నిషేధం ఉన్నట్లు కనిపించదు. అర్థశాస్త్రంలో కౌటిల్యుడు డబ్బును అప్పుగా ఇచ్చే పద్ధతిని వివరిస్తాడు. నిర్ధిష్టకాలాలలో వడ్డీ మొత్తాన్ని చెల్లించే పద్ధతిపై రాజ ధనాగారం సహితం అప్పులిచ్చేది. కొన్ని పరిస్థితులలో వసూలు చేయదగిన వడ్డీ మొత్తాలను అర్థశాస్త్రం వివరిస్తున్నది. సాలుకు పదునేనుశాతం సాధారణ వడ్డీ ప్రమాణంగా కనిపిస్తుంది. ప్రత్యేక వాణిజ్యరంగంలో వ్యావహారికమైన వృద్ధి ప్రమాణం భిన్నంగా ఉంది. ఇది సాలుకు అరువది శాతం వరకు లెక్క తేలుతుంది. దూర దేశాలతో జరిగే వాణిజ్యంలోను, సముద్రంపై జరిగే వాణిజ్య కార్యక్రమాలపైనా ఇంతపెద్ద వడ్డీ వసూలు చేసేవారు. వడ్డీ ప్రమాణాన్ని ప్రభుత్వం అదుపులో ఉంచి ఉంటుంది. దేశంలో వడ్డీ వ్యాపారం లేదన్న మెగస్తనీసు అభిప్రాయానికి అదే కారణమై ఉంటుంది.

పన్నులు ఎగవేసేవారికి మరణశిక్ష ఉండేదని గ్రీకు రచనలు చెబుతున్నాయి. ఇది బహుశా పన్నుల ఎగవేత అయి ఉండదు. కరగ్రాహకుని దగ్గర డబ్బును తస్కరించడం అనేవాదం ఉంది. ఇట్టి నేరానికి అర్ధశాస్త్రం మరణశిక్షను చెప్పలేదు. సరుకు స్వాధీన పరుచుకోవడం లేదా అపరాధం విధించడం శిక్షగా చెబుతుంది. అర్ధశాస్త్రం కరగ్రాహకుని ధనాన్ని తస్కరించడంపై నొక్కిపెట్టి చెప్పినందున అట్టి చర్యలు నాడు తరచు జరుగుతూ ఉండేవని తెలుస్తుంది. గ్రీకు రచనలు ఆ చర్యలనే ఉద్దేశించినవని గ్రహించడం యుక్తము.

మౌర్యయుగ ఆర్థిక వ్యవస్థకు నాటి వర్తక వాణిజ్య పాలనా విధానానికి అర్ధశాస్త్రం ఆధారం. కాని అర్ధశాస్త్ర సాక్ష్యాన్ని ఆలోచించేటప్పుడు కౌటిల్యుడు చిత్రించినది ఆదర్శ పన్నులరూపం మాత్రమేనని గుర్తుంచుకోవలె. అర్ధశాస్త్రం సూచించిన పద్ధతులను తు.చ తప్పక మౌర్యరాజ్య నిర్వహణలో అనుసరించినారని అంగీకరించలేము. సాధారణ విధానాలను, వాటి నమలుజరుపడానికి భిన్న మార్గాలను అర్ధశాస్త్రం సూచించింది. అర్ధశాస్త్రం సూచించిన సాధారణ విధానం మౌర్య ప్రభుత్వం అనుసరించిన విధానం ఇంచుమించు ఒకటే అనడంలో సందేహం లేదు. అర్ధశాస్త్రంలోని భావాలే మౌర్యపాలనకు ఆధారాలు. కాని ఆచరణలో కొన్ని మార్పులు వచ్చిఉండడం సహజమే. దేశ రాజకీయ ఆర్థిక వ్యవస్థలో అంత పెద్ద యెత్తున అమలుజరిగిన ఆర్థిక విధానం ఒక కొత్త ప్రయోగం. నాటి భావాలకు కార్యరూపం ఇవ్వడంలో లోపాలు జరిగిఉండవచ్చు. ఉదాహరణకు ప్రమాద భూయిష్టమైన దూరదేశ వాణిజ్యంలో వర్తకుల లాభ ప్రమాణాన్ని ప్రభుత్వం పదోవంతుగా నిర్ణయించింది. కాని వర్తకులు అంత తక్కువ లాభాన్ని అంగీకరించినారని విశ్వసించడం కష్టం. అధికారులకు లంచాలిచ్చి వర్తకులు లాభ ప్రమాణాన్ని గురించి రహస్య ఒప్పందాలు చేసుకొన్నారనడం చాలవరకు సముచితం.

ముఖ్యమైన రహదారులను, నౌకాయానానికి ఉపయుక్తమైన నదులను అనుసరించి వర్తకమార్గాలుండేవి. పశ్చిమదేశాలతోను, బర్మా పశ్చిమ తీరంతోను సముద్రంపై వాణిజ్యం జరిగేది. భూ, జలమార్గాల ప్రయోజనాన్ని గూర్చి అర్ధశాస్త్రంలో ఆసక్తిదాయకమైన చర్చ ఉంది. జలమార్గం భూ మార్గంవలె శాశ్వతమైనది కాదు. కాని రవాణా చాల చౌక. అది భూ మార్గమంతటి సురక్షితమైనది కాదు. తీరానున్న పెక్కు రేవు పట్టణాలను కలుపుతూ వాణిజ్యాభివృద్ధికి సహాయకారి అయినందున సముద్రం లోతట్టు మార్గం కంటె తీర మార్గాన్ని అనుసరించడమే శ్రేయస్కరం.

నౌకాయానానికి ఉపకరించే నదిని సురక్షితమైన మార్గంగా పరిగణించేవారు. భూ మార్గాలలో దక్షిణ దేశానికి వెళ్ళే మార్గాలకంటె ఉత్తరంగా హిమాలయాలకు వెళ్ళే మార్గాలు

మెరుగయినవి అనే భావం ఉండేది. బహుశా దక్షిణ భూములకంటె ఉత్తర ప్రాంతం సుపరిచితమై అచటి రవాణా సౌకర్యాలు మెరుగయి ఉన్నందున ఆ విధంగా భావించి ఉంటారు. ఉత్తరదేశ వర్తకులకు దక్షిణ దేశంతో వర్తకం ప్రారంభించడం క్రొత్త సాహసమై ఉంటుంది.

ఒక రహదారి విలువ అది కల్పించే వాణిజ్యావకాశాలనుబట్టి నిర్ణయిస్తారు. అది మనసులో ఉంచుకొనే ఉత్తరదేశ మార్గాలు మెరుగనే భావాన్ని కౌటల్యుడు ఖండించాడు. ఉత్తర దేశంలోకంటె దక్షిణ దేశంలో వస్తువుల సంఖ్య ఎక్కువ; విలువ అధికం. అందుచేత దక్షిణదేశంలో వాణిజ్యావకాశాలు ఎక్కువ అని నిర్ణయించాడు. దక్షిణ దేశానికి వెళ్ళే మార్గాలలో జనసమ్మర్ధం ఎక్కువగా ఉండే గనుల ప్రాంతాలగుండా ఉన్న రహదారులను అనుసరించడం ఉచితం. అందువల్ల సువిశాల భూభాగంలో ఒంటరిగా ప్రయాణంచేసే ప్రమాదం తప్పడమేకాక మార్గమధ్యంలోని ప్రజలతోను, నివాస ప్రదేశాలతోను వర్తకం సాగించే అవకాశంకూడా లభిస్తుంది. కాలిబాటకంటె బండిబాట శ్రేయస్కరం. అన్నిటికంటె ఉత్తమమైనది భారవాహ జంతు సముదాయానికి అనుకూలమైన మార్గం.

మౌర్యయుగానికి పూర్వం భారతదేశంలోని రహదారుల వివరాలు ప్రధానంగా బౌద్ధ గ్రంథాలలో లభిస్తున్నాయి. మౌర్యయుగంలో సయితం ఈ రహదారులే వాడుకలో ఉండి ఉంటాయి. వీటిలో ప్రధానమైనవి : ఉత్తర ప్రాంతం అంటే శ్రావస్తి నుండి రాజగృహం వరకు విస్తరించిన ఆగ్నేయమార్గం; గంగా యమునా నదీ ప్రవాహాల ననుసరించి తూర్పు–పడమరలుగా విస్తరించిన మార్గం. రాజస్థాన్ మరుభూమితో ఆనాడు పరిచయం ఉంది. బరుకచ్ఛ రేవు పట్టణాన్ని గురించిన ప్రస్తావనలు తరచు కనిపిస్తున్నాయి. పశ్చిమ రాజ్యాలలో సుప్రసిద్ధ వాణిజ్య కేంద్రంగా 'బవేరు' (బాబిలోనియా) తో పరిచయం ఉంది. క్రీ.పూ. 4,5 శతాబ్దాలలో బౌద్ధులీ రహదారులను వాడినారని భావింపవచ్చు. తరువాతి కాలంలో మౌర్య సామ్రాజ్యంలో విస్తరించిన రవాణా సౌకర్యాలకు ఈ మార్గాలు బీజప్రాయాలు. తీర్థయాత్రలకు బౌద్ధులిచ్చిన ప్రాధాన్యంవల్ల ఈ రహదారుల రక్షణపట్ల శ్రద్ధ వహించినారనడంలో సందేహం లేదు. దేశం పశ్చిమ ప్రాంతాలలోను గంగానది పొడవునా వాణిజ్యం బాగా వృద్ధి పొందింది. అందువల్లకూడ సక్రమ రవాణా సౌకర్యాల రక్షణ తప్పనిసరి అయింది.

మౌర్య సామ్రాజ్యం విస్తరించడంతో పాటలీపుత్రం నుండి సరిహద్దులకు ఆపైనకూడ రవాణా సౌకర్యాలను విస్తరింప చేయడం అవసరమైంది. పరిపాలనా వ్యవస్థ క్లిష్టరూపం ధరించడంతో ఉద్యోగులు రాజధానీ నగరాన్ని తరచు సందర్శించవలసిన అవసరం

ఏర్పడింది. ఇందువల్లకూడ రవాణా సౌకర్యాలను పెంపొందించడం అవసరమైంది. ఈ విధంగా పాటలీపుత్రంనుండి సామ్రాజ్యంలో నలుమూలలకు విస్తరించిన ప్రధాన రహదారులేగాక ఉప మార్గాలతో రాష్ట్రాలకు సయితం సౌకర్యాలు కల్పించవలసి వచ్చింది. బాటలను నిర్మించి రక్షించడానికి మౌర్య ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉద్యోగి బృందాన్ని నియమించినట్లు తెలుస్తుంది. వీరిని "అగోరనుయాయ" అనే పదంతో మెగస్తనీసు వర్ణించినాడు. అక్షరత: ఈ పదానికి సంతల ఉద్యోగులు అని అర్థం. కాని వీరి విధులన్నీ రవాణా సౌకర్యాలకు సంబంధించినవే. దూరాలను, ఇతర సమాచారాన్ని తెలుపుతూ పదిక్రోసులకొక సూచన స్తంభాన్ని బాటలపై నాటేవారు. ఈ వర్ణన ఎనిమిది క్రోసుల దూరానికొకటి చొప్పున బాటలపై బావులు త్రవ్వించినట్లు ఏడోస్తంభ శాసనంలో అశోకుడు చెప్పుకొన్న మాటలు జ్ఞప్తికి తెస్తున్నది. ఎనిమిది క్రోసులంటే సుమారు తొమ్మిది మైళ్ళు.

మార్గాలన్నింటిలో ముఖ్యమైనది వాయవ్యాన తక్షశిల ప్రాంతంనుండి పాటలీపుత్రానికి ఉన్న రాజమార్గం. శతాబ్దాలుగా ఇది ప్రధానమైన మార్గంగా ఉండేది. నేడది భారతీయులకు గ్రాండ్‌ట్రంకు రోడ్డుగా సుపరిచితం. లాటిన్ భాషలో ప్లినీ రచించిన 'హిస్టోరియా నేచురేలీస్' అనే గ్రంథం ఆరో సంపుటిలో ఈ రాజమార్గ వర్ణన ఉంది. ఈ మార్గం తూర్పుగా విస్తరించి గంగానదీ ముఖద్వారంలోని 'టామ్‌లూక్' వరకు విస్తరించినట్లు చెబుతారు. వాణిజ్యానికి, దేశ రక్షణకు కూడ ఈ మార్గం చాల ముఖ్యమైనది. సముద్రంపై వాణిజ్యం పెంపొందటానికి పూర్వం తక్షశిలకు నాడిది ఏకైక మార్గం. గంగానదీ మైదానము వాయవ్య ప్రాంతాలమధ్య చాల వస్తుమారకం జరిగేది కాబట్టి ఆంతరంగిక వాణిజ్యానికి కూడ ఈ మార్గం చాల ఉపకరించింది.

దక్షిణ దేశానికి ఉన్న మార్గాలను గురించిన సమాచారం చాల స్వల్పంగా లభిస్తున్నది. బహుశా వింధ్య పర్వతాల వరకు ప్రయాణాలు సర్వసాధారణం జరిగేవి. కాని ఆపైన దక్షిణంగా ప్రయాణం చాల సాహసోపేతం. బ్రోచ్, కథియ వారులనుండి నైఋతి తీరంలోని రేవులకు ఆపైన సింహళానికి వెళ్ళే మార్గం వాడుకలో ఉన్నట్లు తెలుస్తుంది. సింహళానికి మొట్టమొదటి రాజు విజయుడు. అతడు పశ్చిమ తీరంలోని సొపారా నుండి సింహళానికి వెళ్ళినట్లు చెబుతారు. కాని తూర్పుతీర మార్గానికే ఎక్కువరద్దీ ఉండేది. మహానది, గోదావరి నదులమధ్య, కళింగ దేశం కీలకస్థానంలో ఉండి వంగదేశానికి, దక్షిణ దేశాలకు మధ్యనున్న వాణిజ్యాన్నేకాక, సముద్ర వాణిజ్యాన్నికూడ కైవసం చేసుకుంది. ఉత్తర, దక్షిణాపథాల మధ్యనున్న సులభమైన భూమార్గాలు నదీలోయల ననుసరించి కళింగ దేశంగుండా నడిచినాయి. కళింగదేశం విరోధుల చేతులలోఉంటే ఈ మార్గాలకు ఆటంకం తప్పదు.

ఇంతటి కీలక స్థానంలో ఉన్నందుననే కళింగను ఆక్రమించడం మౌర్య సామ్రాజ్యానికి అవసరమైంది.

దక్షిణ పీఠభూమిలోని మెట్టమార్గాలు సాధ్యమైనంతవరకు నదీలోయల ననుసరించి ఉండేవి. సోన్‌నదీ లోయగుండా సహస్రామ్‌చేరి ఆపైన పీఠభూమిని చేరి కళింగదేశంలోని తోసలివరకు అచ్చటినుండి తీరం వెంబడి కృష్ణాముఖ ద్వారానికి వెళ్ళేమార్గం చాల సుపరిచితమైంది. కృష్ణానదీలోయ గుండా ఈ మార్గం రాయచూర్ ప్రాంతంవరకు విస్తరించింది. కృష్ణానది నుండి బయలుదేరిన తుంగభద్రానదీలోయ మైసూరు ఉత్తర ప్రాంతానికి దారితీస్తుంది. మరొక మార్గం చాల భాగం దేశాంతర్గతమైన మార్గం. ఇది పాటలీపుత్రం నుండి బయలుదేరి రూపనాథ్ వద్ద చీలి వైన్ గంగానదీలోయను చేరుతుంది. వైన్ గంగానది ఉత్తర దిక్కునుండి ప్రవహించి గోదావరిలో కలిసే ఉపనది. అనంతరం ఈ మార్గం గోదావరీ ముఖద్వారం నుండి దక్షిణంగా జరిగి కృష్ణానదిని చేరి, కృష్ణానదీలోయ గుండా విస్తరిస్తుంది. ప్రతిష్ఠాన నగరం నుండి సొపారా మీదుగా దక్షిణానికి మరొక మార్గం పశ్చిమ తీరంలో ఉండి ఉండవచ్చు.

నాటి రహదారులు నదీలోయల ననుసరించి ఉన్నవనడానికి కారణం కేవలం భౌగోళికమే. దక్కనుపీఠభూమి సరాసరి ఎత్తు 1200-3000 అడుగుల మధ్య ఉంటుంది. ఇది ప్రయాణానికి అనుకూలంకాని పెద్ద ఎత్తేమీకాదు. కాని పల్లపు ప్రాంతాల నానుకొని ఉన్న పీఠభూమి. అక్కడక్కడ నిటారుగా ఉండడమే ప్రధాన సమస్య. దీనికి తోడు బాటలపై చాలా ఎగుడు దిగుళ్ళు కనిపిస్తాయి. కాని నదులు పీఠభూమిని ఛేదించడంతో మైదానం నుండి పీఠభూమికి మార్పు క్రమంగా ఉండి పీఠభూమి కాలిబాటలకు అనుకూలమై ఉంటుంది. పీఠభూమిలో అడవులు బాగా పెరిగేవి. ఆ రోజులలో అడవులను ఎక్కువగా నరికేవారు కారు. పీఠభూమి చాలవరకు నిర్జల ప్రాంతం. ఈ కారణాలవల్ల ఒంటరి ప్రయాణం సురక్షితం కాదు. జనసమ్మర్థం ఎక్కువగాఉన్న నదీలోయలగుండా ప్రయాణమే ఎక్కువ భద్రంగా ఉండేది.

సామ్రాజ్యం నుండి సరిహద్దుల ఆవల దేశాలకు పోయే మార్గాలు చాల వరకు పశ్చిమ-వాయవ్య సరిహద్దులలో కేంద్రీకృతమైనాయి. తూర్పురాష్ట్రానికి ఉత్తరబర్మా తీరభూమికి సంబంధం ఉన్నట్లు కనిపిస్తుంది. ఆపైన తూర్పుదేశాలతో ఈ యుగంలో సంబంధం ఉన్నట్లు ఎక్కడా నమోదుకాలేదు. హెలెనిక్ ప్రపంచంతో మాత్రం చాల సన్నిహిత సంబంధాలు ఏర్పడినాయి. ఇండోగ్రీకు చరిత్రను వ్రాసిన తారన్ అనే ఆధునిక భారత చరిత్రకారుడు భారతదేశం నుండి పశ్చిమంగా వెళ్ళిన మార్గాలను విపులంగా చర్చించి

వాటిని మూడు ప్రధాన వర్గాలుగా విభజించినాడు. అందు మొదటిది ఉత్తర రహదారి. అంత ప్రధానమైనది కాదు. తక్షశిల, కాబూలు, బాక్ట్రియా, ఆక్ససు, కాస్పియన్ సముద్ర దక్షిణ ప్రాంతాలు, ఫాసిస్ (కాకసస్)ల గుండా నల్లసముద్రాన్ని చేరుతుంది. రెండవ వర్గంలో మూడు రహదారులున్నాయి. ఇవి క్రీ. పూ. మూడో శతాబ్దంలో బాగా వాడుకలో ఉండేవి. వీటిలో మొదటిది భారతదేశం నుండి కాందహార్, హీరట్‌లగుండా ఎగ్బటానా వరకు వెళ్ళేది. ఇది చాల ముఖ్యమైన మార్గమనే అభిప్రాయాన్ని కాందహార్‌లో ఇటీవల బయలుపడిన అశోకుని శాసనం బలపరుస్తుంది. ఈ శాసనం గ్రీకు-అరమిక్ భాషలలో ఉన్నందున కాందహార్‌లో నాడు గ్రీకు-పారశీక జనాభా ఎక్కువగా ఉండేదని తెలుస్తుంది. వీరి జీవనం ఈ వాణిజ్యవర్గ సౌభాగ్యం మీదనే ఆధారపడిఉంది. ఇంతకంటె కొంచెం తక్కువ ప్రాధాన్యం ఉన్నమార్గం కాందహార్‌వద్ద చీలి పెర్సిపోలిస్, సుసాల దిక్కుగా విస్తరించింది. ఇక మూడవ మార్గం దక్షిణంగా విస్తరించి పారశీక సింధుశాఖ టైగ్రిస్ నదుల మీదుగా సెల్యూకియా చేరేది. సెల్యూకియా నుండి బాటలు నలుముఖాలుగా చీలి ఇఫిసస్, యాంటియోక్, ఫ్రిజియా, ఎడెస్సా డమాస్కస్ టైర్‌లకు వెళ్ళేది. భారతదేశం నుండి తిరుగు ప్రయాణంలో అలెగ్జాండరు సైన్యాలు నడిచిన అనంతరమే ఈ దక్షిణమార్గం ఏర్పడి ఉంటుంది. కాని ఇందు సగభాగం మరుభూములగుండా విస్తరించినందున శీతవాతాతప బాధల దృష్ట్యా ఇది ప్రధాన మార్గం కాలేకపోయింది. తారన్ వివరించిన మూడో మార్గం సముద్రమార్గం. భారతదేశం పశ్చిమ తీరంనుండి అరేబియా ఆగ్నేయ తీరభాగానికి ముఖ్యంగా ఆధునిక రేవుపట్టణంగా వికసించిన ఏడెన్ ప్రాంతానికి చేరిన మార్గం. మౌర్యయుగంలో అరేబియా తీరరేవులు పెద్దవాణిజ్య కేంద్రాలుగా వికసించినాయి. తూర్పు మధ్యధరా ప్రాంత వస్తువులనేకం ఎర్రసముద్రం మీదుగా ఆ రేవులలో దిగుమతి అయ్యేవి. భారతీయ వర్తకులు ఆ వస్తువులతో మార్పిడి చేసుకొనేవారు. అయినా ఆ రోజులలో వాణిజ్యం పెద్దగాలేదు. తరువాతి శతాబ్దాలలో బాగా వికసించింది.

సుదూర యాత్రలు సాగిస్తున్న వర్తకులను గురించిన ప్రస్తావనలు బౌద్ధ వాఙ్మయంలో కనిపిస్తున్నాయి. ఈ యాత్రలు భయ సాహసాలతో కూడియుండేవి. కాని ఇందు కొంత యధార్థం; చాలభాగం ఊహాకల్పితం. దొంగల వల్ల, వన్యమృగాలవల్ల భయం కల్గడం సహజమే. ఇవి చాలవన్నట్లు భావనాశక్తి పిశాచ సంఘాలను సృష్టిస్తూ ఉండేవి. ముఖ్యంగా ఎడారి ప్రయాణాలు ఒక పెద్ద పరీక్షగా ఉండేవి. మార్గదర్శకంగా నక్షత్రాలు ఉపకరించి నందున ఎడారులలో ప్రయాణం రాత్రులందే జరిగేది. ప్రయాణాలు అపాయాలతో నిండి ఉన్నందున వర్తకులు బిడారులుగా ఏర్పడి ప్రయాణాలు సాగించేవారు. జాతక కథలలో

సముద్ర ప్రయాణాన్ని గూర్చిన ప్రస్తావనలు కూడా ఉన్నాయి. నౌకాయానంపై జాతకాల వ్యాఖ్యానాలు చాల ఆసక్తిదాయకాలు. ఉదాహరణకు కాకులు ఆకాశంలో భూముఖంగా పయనిస్తాయి కాబట్టి నావికులు కాకులను మార్గదర్శినులుగా ఉపయోగించేవారని తెలుస్తుంది. ఈ సంప్రదాయాన్ని ప్రాచీన బాబిలోనియనులు, ఫినీషియనుల నుండి మనవారు గ్రహించినట్లు చెబుతారు.

మౌర్యయుగానికి పూర్వమే భారతీయులకు నౌకాయానం తెలుసు. అలెగ్జాండర్ దండయాత్ర సమయంలో పంజాబులో నివసిస్తున్న కధి యియాయ్ అనే జాతివారికి నౌకాశ్రయాలు ఉన్నవని వారు రవాణా పడవలను గ్రీకులకు సరఫరా చేసినారని ఏరియన్ వ్రాసినాడు. ప్రాచీనయుగంలో సింధు ప్రజలకు, సేబియనులకు మధ్యవర్తకం జరుగుతూ ఉండేది. కాబట్టి సింధునది పొడుగునా నివసించే ప్రజలకు నదులపై ప్రయాణంలో పరిచయం ఉండి ఉండవలె. మౌర్యుల కాలంలో నౌకా నిర్మాణంపై గుత్తాధికారం ప్రభుత్వానిదేనని స్ట్రాబో వ్రాసినాడు. సముద్రయానానికి, నదీయానానికి పనికివచ్చే పడవలు నౌకా నిర్మాతలు వర్తకులకు అద్దెకిచ్చేవారని తెలుస్తుంది. అర్థశాస్త్రంలోని మాటలనుబట్టి నౌకా నిర్మాణ పరిశ్రమ ప్రభుత్వ వశంలో ఉండేది. సముద్రంపై పయనించే నౌకలు, నదులు, సరస్సులపై తిరిగే పడవలు, నౌకాధ్యక్షుడనే అధికారి పరంగా ఉండేవి. సముద్రచోరుల పడవలను, శత్రుదేశాలకు వెళ్ళే నౌకలను, ప్రభుత్వ నియమావళిని ధిక్కరించిన పడవలను ధ్వంసంచేయాలి అని ఉంది. కాని ఈ నిబంధనను అక్షరత: పాటించే వారుకాదు. అట్టి పడవలను పట్టుకొని నిర్బంధంలో ఉంచితే సరిపోతుంది. సముద్ర పరిస్థితులవల్ల నష్టపడిన నౌకలోని సరుకుపై సుంకం మినహాయింపు చేసేవారు; లేదా తగ్గించేవారు. సముద్ర వాణిజ్యానికి ఈ పద్ధతి మంచి ప్రోత్సాహకరం. సముద్ర తుషారానికి నౌకలు చెడిపోకుండా జాగ్రత్త వహించడమనేది  అసంభవంగా ఉండేది.

చిన్న తరహా వర్తకంలో అధికభాగం పరిసర ప్రాంతాల మధ్య స్థానిక ఉత్పత్తుల మారకమే. బహుమూల్యంతో కూడి సాహసోపేతమైన వాణిజ్యాన్ని గూర్చి అర్థశాస్త్రంలో కొంత ప్రస్తావన ఉంది. ఉత్తరాపథం దుప్పట్లను, చర్మాలను, గుర్రాలను దక్షిణదేశానికి ఎగుమతి చేసేది. శంఖాలు, ముత్యాలు, వజ్రాలు మొదలైన అమూల్యశిలలు, బంగారము దక్షిణదేశం నుంచి ఎగుమతులు. పాశ్చాత్య దేశాలతో ఏఏ వస్తువులతో వర్తకం జరిగిందీ సూచనమాత్రంగా కూడ తెలియకపోవడం దురదృష్టం. తరువాతి కాలంలో మాత్రం మిరియాలు, దాల్చిన చెక్క మొదలైన సుగంధ ద్రవ్యాలు, ముత్యాలు, వజ్రాలు, పుష్యరాగం, గోమేధికం, పచ్చలు, నీలాలు, నూలువస్త్రాలు, నెమళ్ళు, చిలుకలు, దంతపు సామానులు

పశ్చిమదేశాలకు ఎగుమతి అయ్యేవి. పశ్చిమదేశాల నుండి దిగుమతి అయ్యే సరుకులలో గుర్రాలు, రక్తప్రవాళము, పట్టువస్త్రాలు (క్షౌమ) గాజు ముఖ్యమైనవి. మౌర్యయుగం మొదటి రోజులలో కూడ ఇవే సరుకులలో అయితే చిన్నమొత్తాలలో, వాణిజ్యం జరిగిందని భావించవచ్చు. వస్తువుల మార్పిడి కంటె వాణిజ్యం ద్వారా జరిగిన భావాల, ఆచారాల ప్రసారం ప్రధానమైంది. వాణిజ్య ప్రమాణం పెరిగిన కొద్దీ వాణిజ్యం సాగిస్తున్న ప్రాంతాలలో పరిచయం పెరిగి పరస్పర అవగాహన అధికమయ్యేది.

మెగస్తనీసు పేర్కొన్న చివరి మూడు తరగతులు, సైనికులు, అధికారులు, మంత్రులు, దేశపాలనను వివరించే తరువాతి అధ్యాయంలో వీరిని గురించి విపులంగా చర్చిద్దాము.

మౌర్య సమాజంలో స్త్రీలు ప్రముఖ పాత్రనే నిర్వహించారు గాని స్త్రీలు పురుషాధీనమనే భావం బలంగా ఉండేది. ముఖ్యంగా అర్థశాస్త్రం భావన చేసిన సమాజ పద్ధతిలో పై అంశం పూర్తిగా యథార్థం. బ్రహ్మణశాస్త్రాలు స్త్రీలపట్ల చాలా కఠినంగా ఉన్నాయి. తరువాతి గ్రంథాలు స్త్రీలు హీనజాతి అని ముక్తకంఠంగా పలికినాయి. బౌద్ధుల దృక్పథంలో మాత్రం కొంత మానవత్వం కనిపిస్తుంది. బౌద్ధ సంఘంలో స్త్రీల ప్రవేశానికి అనుమతించారు. ఇది చాల ముఖ్యమైన అంశం. హిందువులు స్త్రీకి విద్యార్హత సయితం నిరాకరించిన సందర్భంలో, కేవలం శిశుధారణే స్త్రీ కర్తవ్యంగా బౌద్ధం పరిగణించలేదు. అందుచేత బ్రాహ్మణ సమాజంలోవలె బౌద్ధ సమాజంలో స్త్రీ స్థానం కష్టభూయిష్టం కాదని చెప్పడం సముచితమే. హిందూ పద్ధతికి పుత్త్రోదయ మవసరమైనది బౌద్ధులకు కాదు. బౌద్ధ సమాజం అవివాహితులను కూడ అంగీకరించింది. అందుచే భర్తను పొందటానికి బౌద్ధ స్త్రీ తాపత్రయ పడనక్కరలేదు. పరాధీనంగా అణగిమణగి ఉండనక్కరలేదు. అయినప్పటికీ వివాహం స్త్రీకి యోగ్యమైన జీవనోపాధిగా పరిగణించినారు. స్త్రీలు చేయదగిన పనిపాటలను గురించి నిబంధనలు ఉండేవి. గారడీలలోను, నాటకాలలోను పనిచేయడం గృహస్థుల ఇండ్లలోగాని, రాజాంతఃపురాలలోగాని గృహబానిసలుగా పనిచేయడం మాత్రమే వారికి సాధ్యం. గత్యంతరం లేనివారు పడుపుకత్తెలుగా, గణికలుగా ఉండేవారు. క్రమక్రమంగా హిందూ భావాలు బౌద్ధులలోనికి ప్రవేశించడంతో బౌద్ధ సమాజ గృహ జీవితంలో కూడ స్త్రీ స్థానం దిగజారిపోయింది. ప్రాచీన బ్రాహ్మణ భావాలను పునరుద్ధరించడం జరిగింది.

భారతీయుల ఆచారాలను ప్రస్తావిస్తూ, వారిలో స్త్రీలపట్ల ఉన్నభావాలను గూర్చి సమాజంలో స్త్రీల స్థానాన్ని గూర్చి మెగస్తనీసు, ఏరియన్‌లు వ్రాసినారు. భారతీయులు పెక్కంద్రు స్త్రీలను వివాహమాడుతారని మెగస్తనీసు రచన. నిర్ణీతమైన కన్యాశుల్కం ఉన్నట్లు తెలుస్తుంది. వధువుకు బదులు కాడి, ఎడ్లనీయవలె. శక్తి ఉన్నవారు బండ్లను

లాగడానికి చాల ఎడ్లను పోషించేవారు. ఎడ్లు లేనివారు కాడి, ఎడ్లవిలువకు సమానమైన ధనం చెల్లించవలె. వధువుకు బదులు గోద్వయాన్ని ఇవ్వవలెనని అర్థశాస్త్రం చెబుతుంది. ఇది ఆర్షవివాహంగా, ప్రాచీన సంప్రదాయంగా వర్ణితమై, అష్టవిధ వివాహాలలోకూడ చేరింది. గోద్వయం అనేది సూచన ప్రాయమేగాని, వాటి విలువకు సమానమైన ధనం సయితం అంగీకారమే. కేవలం బిడ్డలను పోషించడమే గృహిణులలో కొందరి ధర్మమని మరికొందరు తమ భర్తల కార్యకలాపాలలో సహాయపడుతూ ఉంటారని మెగస్తనీస్ వ్రాసినాడు. ఈ రెండ తరహా స్త్రీల వర్ణన కేవలం కర్షక వర్గానికే ఎక్కువగా వర్తిస్తుంది. పొలాలలో పనిచేయడం స్త్రీలకు సాధ్యం. ఇతర తరహా పనులలో ముఖ్యంగా నగరాలలో పనిచేయడానికి స్త్రీలను అనుమతించడం సాధ్యంకాదు. అయితే మెగస్తనీస్ కేవలం గృహ జీవితాన్నే ప్రస్తావించి ఉండవచ్చు. ధనిక కుటుంబాలలో గృహిణులు ఇల్లు చక్కదిద్దు కొనేవారు. కొన్ని కుటుంబాలలో తల్లులే పిల్లల బాధ్యత పూర్తిగా వహించేవారు.

భారత స్త్రీలకు శీలం లేదంటూ వ్యాఖ్యానాలు జరిగినాయి. నిర్బంధమే లేకపోతే స్త్రీలు పతివ్రతలుగా ఉండేవారు కాదు. ఎంత పతివ్రత అయినప్పటికీ ఒక ఏనుగును బహుకరిస్తే భారత స్త్రీ దారితప్పటానికి సుముఖంగా ఉంటుంది అని వ్రాశాడు. ఇది భారత స్త్రీ ఏనుగంతటి విలువైనదనే భావంతో ఆమెపట్ల అభినందనతో వ్రాసిన రచన. ఉన్నత వర్గాల హిందూ కన్యలలో హిందూ దేవతలు సాగించిన సాహసకృత్యాలను గురించి గ్రంథాలలో అనేక కథలున్నాయి. వీటిని బట్టి నిర్ణయిస్తే స్త్రీ, పురుష సంబంధాలు చాల శైథిల్యం కనిపిస్తుంది. ఇందులో ఆశ్చర్యం లేదు. ఇతర మతాలు లైంగిక విషయాలకు ఆపాదించినంతటి కళంకశంక హిందు నీతి శాస్త్రంలో లేదు. అందుచేత లైంగిక విషయాలలో ఆరోగ్యకరమైన మానసిక ప్రవృత్తిని హిందువులు ప్రదర్శించినారని చెప్పవచ్చు. కాని వారి స్వభావంతో కూడ దోషం లేకపోలేదు. సమాజం స్త్రీని పరాధీనం చేయడం కొన్ని విచిత్రమైన సంఘటనలకు కారణమైంది. ఉదాహరణకు ప్రభుత్వం పడుపువృత్తిని నిషేధించలేదు. పైపెచ్చు ఆ వృత్తిపై పన్నులు వసూలు చేసింది. పడుపుకత్తెల నెవ్వరూ హింసించకుండా రక్షణ కల్పించింది. అవసరమైతే ప్రభుత్వ పక్షాన గూఢచారిణిలుగా పనిచేయడానికి కూడా భోగస్త్రీలను నియోగించేవారు.

రాజప్రసాదంలో నియుక్తులైన యువతులు అంతఃపురంలో పనిచేసేవారు. లేదా రాజును కనిపెట్టిఉండేవారు. ఈ రెండోరకం యువతులను వారి తల్లిదండ్రుల నుండి కొనితెచ్చేవారు. రాజపరిచారకులు స్త్రీలయినట్లు అర్థశాస్త్రం సాక్ష్యం ఇస్తుంది. సాయుధ అంగరక్షకులుగా స్త్రీలను నియమించవలెనని అర్థశాస్త్రం సూచిస్తున్నది. రాజుల మృగయా

వినోదయాత్రలకు విపుల సన్నాహాలు జరిగేవి. ఈ సందర్భంలో కూడ సాయుధులైన స్త్రీలు రాజును పరివేష్టించి ఉండేవారు. పురుషులు స్త్రీలవలె అణగిమణగి ఉండరు. అవినీతికి పాల్పడి రాజుపై ఎదురు తిరగవచ్చుననే భయమే ఇంతటి జాగ్రత్తలకు కారణమై ఉంటుంది. ఇక స్త్రీలు తమ బలహీనతను సమాజంలో తమకున్న తక్కువ స్థానాన్ని గుర్తించి రాజపరిచారకులుగా తమకు లభించే గౌరవంతో సంతోషపడి రాజుపట్ల అత్యంత సావధానంతో జాగరూకులై ఉంటారు.

ఒక్కనేత వృత్తిలో మాత్రం స్త్రీలకు నిషేధంలేదు. సూత్రాధ్యక్షుడు అన్ని వయస్సుల స్త్రీలను నియోగించడం లాభకరమని అర్థశాస్త్రం సూచిస్తున్నది. కాని వికలాంగులైన స్త్రీలు, వితంతువులు, వృద్ధగణికలు, అపరాధ రుసుము చెల్లించడానికి పనిచేయడం తప్పనిసరి అయిన స్త్రీలకు ప్రత్యేకించి నేతవృత్తి సూచితమైంది. పై వర్గాలకు చెందకపోయినా ఉద్యోగావసరమున్న అవివాహితులు, వివాహితులు సయితం స్వగృహాలలో నేతవృత్తి అవలంబించవచ్చు. ఈ అధికరణం పరోక్షంగా స్త్రీలను గురించి నాటి సాంఘిక సంప్రదాయాలను వ్యక్తం చేస్తున్నది. స్త్రీలను మూడు వర్గాలుగా విభజించేవారు. ఇల్లు విడిచి బయటకు రానివారు (అనిష్కాసిన్యా:) భర్తలు విదేశాలకు వెళ్లిన స్త్రీలు, వికలాంగులై ఉదర పోషణకు పనిచేయవలసినవారు వీరి విషయంలో నూలు తెచ్చి ఇవ్వడానికి, నేసిన వస్త్రాన్ని తిరిగి అప్పగించటానికి సాధ్యమైనంతవరకు ఒక పరిచారిక మధ్యవర్తిగా ఉండాలని అర్థశాస్త్రం సూచిస్తున్నది. మధ్యవర్తి సాధ్యం కానిచోట సూత్రాధ్యక్షుడే స్వయంగా అట్టి స్త్రీతో వ్యవహరించవలె. కాన మసకవెలుగులో మాత్రమే ఆమె అతని కార్యాలయానికి వెళ్లవలె. అతడామెను స్పష్టంగా చూడరాదు. అతని సంభాషణ ఆమె వచ్చిన పనికి మాత్రమే పరిమితం కావలె.

వివాహము, భార్యాభర్తల సంబంధాలను గురించిన అధికరణాలలో స్త్రీ స్థానాన్ని గురించి అర్థశాస్త్రం మరికొంత చర్చిస్తున్నది. తరువాతి శతాబ్దాలలో కంటె మౌర్యయుగంలో వివాహితల సాంఘికస్థితి కొంత సౌమ్యంగానే ఉండేది. మామగారి అంగీకారంతో భర్త కుటుంబానికి వెలుపల అంటే బావలు, మరుదులకు వెలుపల వితంతువు వివాహమాడ వచ్చుననే ప్రస్తావన లేకపోలేదు. కొన్ని పరిస్థితులలో భార్యాభర్తలుభయులు కోరితే విడాకులు పొందవచ్చు. కాని ఈ సూత్రం స్వచ్ఛంద వివాహాలకు, రాక్షస వివాహాలకు, పెద్ద మొత్తాన్ని కన్యాశుల్కంగా చెల్లించిన వివాహాలకు మాత్రమే వర్తిస్తుంది. సాంఘిక సంప్రదాయానుసారం జరిగిన వివాహాలు గౌరవప్రదమైనవి కాబట్టి వాటికి భంగం వాటిల్లకూడదు. ఇదంతా ఊహామాత్రములైన సన్నివేశాలను గురించిన సిద్ధాంత చర్చ మాత్రమేనని గుర్తుంచుకోవలె.

ఆచరణలో పైన వివరించిన సంఘటనలను సాంఘిక సంప్రదాయం సమ్మతించినది లేనిది నిశ్చయంగా చెప్పలేము. దైనందిన ఆచరణలో ఈ నిబంధనలన్నీ జనవాక్యానికి లోబడి ఉండేవి.

భారతదేశంలో బానిసలు లేరని మెగస్తనీసు వ్రాసినాడు. కాని భారతీయ ఆధారాలలో బానిసల ప్రసక్తి కనిపిస్తున్నది. అందుచేత మెగస్తనీసు రచన పెద్ద చర్చకు కారణమైంది. వాస్తవానికి నాటి శ్రామిక శక్తిలో అధికభాగం బానిసల, భృత్యుల నుండి మాత్రమే లభించేది. భారతీయ బానిస విధానం గ్రీకు విధానం కంటె భిన్నమైనది. అందువల్ల గ్రీకు విధానాన్ని మనస్సులో ఉంచుకొన్న మెగస్తనీసు భారతదేశంలోని బానిసపద్ధతిని గుర్తించలేకపోయినాడు. అర్థశాస్త్రం వర్ణించిన విధంగా భారతీయ బానిస విధానం రూపొంది ఉంటే మెగస్తనీసు వ్రాసింది యథార్థమే అవుతుంది. భారతదేశంలోని దాసునకు, గ్రీసులోని దౌలోసుకు మధ్య పోలికలేదు. దాసునకు స్వయంసంపాదనకు అవకాశం వుంది. అతడు సొంత ఆస్తిని కలిగి ఉండవచ్చు.

ఉత్పత్తి కార్యక్రమంలో నియుక్తులైన బానిసల, భృత్యులద్వారా నాడు శ్రామికశక్తి లభించేది. వీరిద్దరిలో బానిసలకంటే భృత్యులదే ఉన్నతస్థానం. పూర్తిచేసిన పనినిబట్టి వారికి వేతనం చెల్లించేవారు. వారు నియోజకుని స్వకీయులు కారు. పైన చెప్పినట్లు కళాకారుల (artisans) భృత్యుల నెక్కువగా నియోగించేవారు. బానిసలను వ్యవసాయపు పనులకు, ఇండ్లలో పనిపాటలు చేయడానికి, నౌకలమీద నియోగించేవారు. సమాజంలో బానిసల స్థానం చాల నీచమైంది. ఇంచుమించు సంఘబహిష్కృతులతో వారు సమానం. వీరి వేతనాలను గురించిన వివరాలలో అర్థశాస్త్రం శ్రద్ధ వహిస్తున్నది. కాని వారి అభ్యున్నతికై తీసుకొనవలసిన చర్యలను సూచించదు. పనిని అనుసరించి నిర్ణీతమైన వేతనం చెల్లించేవారు లేదా శ్రామికులు సాధించిన ఉత్పత్తిలో ఏదో ఒకవంతు ప్రామాణిక వేతనంగా ఉండేది. మౌర్యుల కాలంలో 'విష్ఠి' అంటే వడ్డెర పని అమలులో ఉండేది. విష్ఠిని, భృత్య కృషిని భిన్నములని గుర్తించవలె. విష్ఠి బలాత్కారంగా చేయించేపని (వెట్టిచాకిరి). పన్నులు చెల్లించడానికి బదులు పాటక జనులు ప్రభుత్వానికి కొన్నిరోజులు పనిచేసేవారని మెగస్తనీసు వ్రాసినాడు. భూములు సేద్యం చేసేవారికి సయితం ఇటువంటి పద్ధతే ఉండేది. అర్థశాస్త్రం విష్ఠిని ప్రస్తావించి విష్ఠిని దౌర్జన్యంగా పొందటంపట్ల హెచ్చరిస్తున్నది. విష్ఠి విషయంలో తన సామంతులు దౌర్జన్యానికి పాల్పడకుండా రాజు కర్షకులను రక్షించవలె.

భారతీయులందరు స్వతంత్రులని వారిలో ఏ ఒక్కరు కూడ బానిసకాదని ఏరియన్ వ్రాసినాడు. ఈ విషయంలో లాసడమోనియనులు, భారతీయులు ఒక్కటే. కాని

లాసడమోనియనులు హీలట్లలను బానిసలుగా చూచేవారు. హీలట్లే బానిస చాకిరి చేసేవారు. కాని విదేశీయులను సయితం భారతీయులు బానిసలుగా చూడరు. ఇక స్వదేశీయుల సంగతి వేరే చెప్పనక్కరలేదు. భారతీయులలో ఏ ఒక్కరు బానిసకాదు అనే అంశాన్ని స్ట్రాబో ధ్రువపరుస్తున్నాడు. భారతీయులలో ఎవ్వరూ బానిస కాకూడదని స్వేచ్ఛ ననుభవిస్తూ స్వేచ్ఛ ననుభవించడానికి అందరికీగల సమాన హక్కును పరస్పరం మన్నించవలెనని మెగస్తనీసు వ్రాసినట్లు డియోడరస్ ఉల్లేఖించినాడు. డియోడరస్ రచనలలో తరువాతి వాక్యం ఆర్థిక సమత్వం లేకపోయినా చట్ట సమత్వాన్ని గురించి వివరిస్తున్నది. ఈ వాక్యం ద్వారా పై భావాలను అర్థం చేసుకోవచ్చు. గ్రంథంలోని మూలభావాన్ని తిమ్మర్ పండితుడు సవరణచేసినాడు. ఆ తరువాత ఆ వాక్యం ఈ క్రింది విధంగా ఉంది. "ఇతరులపై అధికారం చెలాయించడంకాని, ఇతరులకు లోబడి ఉండడంకాని తెలియనివారు ఏ పరిస్థితులలోనైనా ఉత్తమ జీవితం గడుపుతారు. ప్రజల ఆర్థిక స్థితిగతులను అసమంగానే ఉంచి వారందరికీ ఒకే విధమైన చట్టాలు చేయడం బుద్ధిహీనత." డియోడరస్ రచనలోని ఈ వాక్యం గ్రీసుదేశ విధానాన్ని విమర్శించడానికి చేసిన ప్రయత్నమని చెప్పడం సమంజసం. చట్ట సమత్వము, బానిసత్వము పొత్తుకుదరనివి అని గ్రీకులు గమనించలేకపోయినారని మెగస్తనీసు చేసిన సూచన. నాడు గ్రీసులో బానిసత్వానికి వ్యతిరేకంగా ముమ్మరమైన ప్రచారం సాగుతున్నది. సినిక్కులు, డియోజినిస్‌లు బానిసత్వాన్ని ఖండించడంతో తీవ్రమైన ఆందోళన ప్రారంభమయింది. అందుచేత మెగస్తనీస్ రచనలోని బానిసత్వాన్ని గూర్చిన ప్రస్తావన భారతీయ పరిస్థితుల వర్ణన కాకపోవచ్చు. భారతదేశంలోని బానిసత్వాన్ని మెగస్తనీసు నిజంగా గుర్తించకపోవడం కూడ సంభవమే. లేదా గుర్తించినప్పటికి గ్రీసులో జరుగుతున్న బానిసత్వ వ్యతిరేక ఉద్యమానికి అనుకూలవాదంగా తన రచనను సాగించి ఉండవచ్చు. గ్రీకు పాఠకులకు ఎక్కువ అంశాలను అందించే ఆశయంతో మెగస్తనీసు మౌలిక రచనకు ఏరియన్ స్పార్టా పోలికను గూడ చేర్చి ఉండడం కూడ సంభవమే.

మూల గ్రంథంలో బానిసత్వాన్ని మెగస్తనీసు ప్రస్తావించి ఉన్నప్పటికీ తరువాతి సంపాదకులు దాన్ని తొలగించి, అదే యథార్థమైన పాఠమని విశ్వసించి, తమ సొంత వ్యాఖ్యానాలను చేర్చి ఉంటారు. బౌద్ధ వాఙ్మయాన్ని బట్టి బానిసలలో మూడు రకాలవారు ఉండేవారు: 1) వారసత్వంగా తండ్రి నుండి సంక్రమించినవారు; 2) డబ్బిచ్చికొన్నవారు లేదా బహుమతిగా లభించినవారు; 3) తమ ఇంట్లో జన్మించినవారు. యుద్ధ ఖైదీలను సయితం బానిసలుగా పనిచేయించే ఆచారం ఉండి ఉంటుంది. కళింగ నుండి లక్షా ఏబదివేల మంది ప్రజలను దేశాంతరం పంపినట్లు పదమూడో శిలాశాసనం చెబుతున్నది.

వీరందరినీ బానిసలు చేయడం సంభవం కాదు. కాని వీరిలో కొంత శాతమైనా బానిసలుగా మారి ఉంటారు. అర్థశాస్త్రం సూచిస్తున్నట్లు కొత్తగా శుభ్రం చేసిన ప్రాంతాలలో స్థిరపడడానికి వీరిలో అధిక సంఖ్యాకులను పంపిఉంటారు. ఈ పద్ధతి క్రీ.శ. మొదటి శతాబ్దాలలో మనువుకాలం నాటికి పరిపాటి అయింది. జాతక కథలలోను, అర్థశాస్త్రంలోను దండదాసులను గూర్చిన ప్రస్తావన ఉంది. వీరు శిక్షా ఫలితంగా బానిసలైనవారు. ఇండ్లలో పనిపాటలు చేయడం బానిసలకు సర్వ సాధారణమైన పని. యజమానులు వీరిని తమ వ్యక్తిగత సేవకులుగా వినియోగించేవారు. కొందరు వ్యవసాయ కార్మికులుగాను, మరికొందరు కళాకారుల పక్షాన పని చేసేవారు. పెక్కుమంది సేవకులున్నప్పుడు యజమాని వారిలో కొందరిని సాధారణ కార్యక్రమాలలో కూలిపనికి పంపడం కూడ జరిగేది.

అర్థశాస్త్రం మరొక తరహా బానిసవర్గాన్ని వర్ణిస్తున్నది. ఈ వర్ణన గ్రీసులోవలె బానిసత్వం భారతదేశంలో నిష్ఠురంకాదనే అంశాన్ని బలపరుస్తుంది. సాధారణ పరిస్థితులలో ఆర్యుని బానిసగా చేయరాదు. కాని దురదృష్టం వల్ల అంటే కుటుంబ కష్టాలవల్లగాని, అధిక ధనార్జన అవసరమైనపుడుకాని తాత్కాలికంగా ఆర్యుడు బానిసగా పనిచేయవచ్చు. ఒప్పందం పూర్తి కావడంతో స్వాతంత్ర్యాన్ని కొనుక్కొని మామూలు జీవితం ప్రారంభించవచ్చు. ఈ వర్ణనలో చాల ముఖ్యమైన అంశాలు తెలుస్తున్నాయి. స్వాతంత్ర్యం లేకపోయినా బానిసకు సమాజంలో ఒక స్థానముంది. అతనిని ఒకరకమైన శ్రామికశక్తిగా పరిగణించినారు. మౌర్య సమాజంలో అట్టడుగున ఉన్నవాడు సంఘ బహిష్కృతుడేగాని బానిసకాదు. సంఘ బహిష్కృతుని లేదా పతితుని ప్రజలు తిరస్కరిస్తారు. బానిస ఆ వర్గానికి చెందినవాడు కాదు. కాబట్టి భారతదేశంలో బానిసగా బ్రతకడం గ్రీసులోవలె పెద్ద సాంఘిక అవమానం కాదు. ఈ పరిస్థితులవల్లనే సామాన్య గ్రీకు అభ్యాగతులకు గ్రీసులోకంటె బానిసత్వం భారతదేశంలో మెరుగుగా కన్పించి ఉంటుంది. ఈ అభ్యాగతులు సంఘ బాహ్యులను ఇతర ప్రజానీకం నీచంగా దండించటాన్ని గుర్తించి ఉండరు. ఆ పరిస్థితులు వారికి అర్థమై ఉండవు.

జాతక కథలు, అర్థశాస్త్రము బానిసలపట్ల సాధారణంగా మానవతాభావాన్ని సూచిస్తున్నాయి. బానిసల రక్షణకు అర్థశాస్త్రం ఎక్కువ నిబంధనలు పేర్కొన్నది. బానిసగా అమ్ముడుపోయిన పురుషుని బిడ్డలు బానిసలు కారు. బానిస సంపాదించిన ధనం అతనికే చెందుతుంది. తండ్రి ఆస్తిని అతడు పొందవచ్చు. తన ఆస్తినతడు దాయాదులకు ముట్టచెప్పవచ్చు. స్త్రీ బానిసపట్ల సక్రమంగా వ్యవహరించడం ఆవశ్యంగా చెప్పినారు. యజమానివల్ల స్త్రీ బానిసకు బిడ్డ కలిగితే తక్షణం మాతాశిశువుల నుభయులను

స్వతంత్రులుగా గుర్తిస్తారు. తమ బానిసల హక్కులను లక్ష్య పెట్టని యజమానులను రాజు శిక్షించవలె. సర్వ సాధారణంగా ఈ నిబంధనలన్నింటినీ గౌరవించే వారనడంలో సందేహంలేదు. కాని కొన్ని చోట్ల లోపాలు జరిగినట్లు తెలుస్తుంది. బానిసల గాథ దైన్యాన్ని గూర్చి జాతక కథలు వర్ణిస్తున్నాయి. బానిసలను యజమానులు తీవ్రమైన దండనకు గురిచేసేవారు. నిర్బంధంలో ఉంచేవారు. వారికి సక్రమ ఆహారం ఉండేదికాదు. ఇందుచేతనే కాబోలు బానిసలను, కార్మికులను దయతో చూడవలసినదని తన శాసనాలలో అశోకుడు ప్రజలను తరచుగా హెచ్చరించినాడు.

బానిసలకు, పతితులకు ఉన్న ముఖ్య విభేదం బానిసలు సర్వదా తమ యజమానుల సన్నిహిత పరిచర్యలో ఉన్నందున వారిని అపవిత్రులుగా భావించరు. వారు కుటుంబాలలో కలసి ఉంటారు. సంఘబాహ్యులవలె పట్టణ బహిరంగ ప్రదేశాలలో నివసించరు. ఇక హీనజాతులు మలిన వస్తువులకు సంబంధించిన వృత్తులను అనుసరించేవారు. ఇతర సమాజం నుండి వీరిని పూర్తిగా ప్రత్యేకించినారు. సమాజంలో భాగంగా పరిగణన పొందే ఆశ వీరికేమాత్రం లేదు. ఇట్టి సంఘ బాహ్యులకు చక్కని ఉదాహరణ చండాలురు. బ్రాహ్మణ శూద్ర సమాగమ ఫలితంగా జన్మించినందున వీరిని హీన జాతిగా పరిగణించినారు. జాతక కథలలో చండాల భాషను గూర్చిన ప్రస్తావన ఉంది. ఆ ప్రస్తావన వీరికి ఆదిమజాతి భాషగా సూచిస్తున్నది. ఉరి తీసేవారిగా వ్యవహరించడం, స్మశాన భూములను శుభ్రం చేయడం, గారడీ విద్య, కనుకట్టు విద్యలకు మాత్రమే వీరి వృత్తులు పరిమితమైనాయి. చర్మకారులను సయితం నీచులుగా పరిగణించినారు. రథకారులు చర్మంతో పనిచేయవలె. అందుచే వారిని కూడ భ్రష్టులుగా పరిగణించినారు. బుట్టలు, వేణువులు తయారు చేసే వేణుకులం వారు బహుశా ఆదిమవాసులే. నిషాదకులంవారు మృగాలను, చేపలను వేటాడి జీవించేవారు. వీరు సేద్యభూముల సమీప భూముల్లో నివసించే వారు. స్థిర నివాసాలు ఉన్న కర్షకులకు నిషాదవృత్తి నీచమైనది. కుమ్మర్లు, సాలెవాండ్రు, మంగళ్ళు, నటకులు, పాముల వాండ్రు, బిచ్చగాండ్రు హీన కులాలలోనివారే. వీరికులాల పేర్లు వారు చేసే పనిని స్పష్టంగా సూచించడం గమనింపదగిన అంశం.

ఏ ప్రాంతంలోకూడ హీన కులాలవారు ప్రతిఘటించడానికి తగినంత సంఖ్యాబలంలో ఉండేవారుకాదు. అందుచే వారికి సంఘ బహిష్కృతిని అంగీకరించక తప్పలేదు. తమ కుటుంబాలతో నగరాలకు వెలుపల చిన్న చిన్న ప్రాంతాలలో నివసించేవారు. నగరంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వారు చాలా ఇబ్బందులకు గురి అయ్యేవారు. సాధారణంగా వృత్తి పనివారిని సుసంఘటితంచేసే సాధనంగా శ్రేణి పనిచేస్తుంది. కాని ఈ హీన

కులాలవారు శ్రేణులుగా సంఘటితం కాలేదు. బుద్ధిపూర్వకంగా వీరిని విద్యావిహీనులుగా ఉంచారు. ఇది వారి స్థితి మరింత దిగజారడానికి కారణమైంది. జాతక కథలలో ముఖ్యంగా చండాలురకు సంబంధించినంతవరకు హీనజాతుల వర్ణనలోని సత్యాన్ని అర్థశాస్త్రం ఋజువుచేస్తున్నది. చండాలురు, పాషండులు స్మశాన భూములకు కూడ ఆవల అంటే నగర సరిహద్దులకు దూరంగా నివసించాలని అర్థశాస్త్రం స్పష్టంగా చెబుతున్నది.

పురావస్తు సాక్ష్యాన్నిబట్టి నగరాలు ప్రణాళికా బద్ధంగా నిర్మించినారని ఇళ్ళు తీర్చిదిద్దినట్లు కట్టినారని తెలుస్తున్నది. ఇంటి ప్రణాళిక చాల సాదాగా ఉండేది. మధ్య ప్రాంగణం ఉండి, దానిని పరివేష్ఠించి గదులుండేవి. క్రింది అంతస్తులోని గదులు చిన్నవి. పై అంతస్తులోని గదులు పెద్దవి. ఇందుకు కారణం క్రింది అంతస్తు గదులలో బానిసలు, పరిచారికులు నివసించి పై అంతస్తులో యజమాని నివసించేవారని చెబుతారు. శుంగ యుగంలో నగర ప్రణాళిక నియమబద్ధమై నగర విన్యాసం చాల మెరుగయింది. ఇంతటి ప్రాచీనయుగంలోకూడ మురుగునీటి సౌకర్యాలపట్ల పురపాలక విధులు క్రమబద్ధమై ఉండేవి.

సారస్వత, పురావస్తు సాక్ష్యాలనుబట్టి మౌర్యయుగం ఆర్థిక విస్తరణయుగం. వర్తకం పెరగడం, దానివల్ల సంక్రమిస్తున్న వాణిజ్య విషయక సౌకర్యాల దృష్ట్యా పెద్ద యెత్తున వివిధ వృత్తికళల వికాసానికిగల అవకాశాలను గుర్తించడం జరిగింది. విస్తృత ప్రాతిపదికపై నేర్పడిన వ్యవసాయ ఆర్థిక విధానంలోని లాభాలనుగూడ స్పష్టంగా గ్రహించినారు. వ్యవసాయ ఆర్థిక విధానం శాశ్వతమైన స్థాయికి చేరుకొంది. ఈ ఆర్థిక పరిణామాలతో కొన్ని శతాబ్దాలవరకు మారనవసరంలేని పద్ధతిలో సామాజిక వ్యవస్థ రూపొందింది.

## నాలుగో అధ్యాయము

# ఆంతరంగిక పాలన - విదేశ సంబంధాలు



మౌర్యరాజ్య స్థాపన కేంద్రీకృత సామ్రాజ్యము అనే కొత్త ప్రభుత్వ స్వరూపానికి అంకురార్పణ చేసింది. నాటివరకు గణరాజ్యాలు భారతీయులకు సుపరిచితాలైన సాధారణ రాజ్యవిధానాలు. ఈ విధానాలు కేంద్రీకృత రాచరిక స్థాపనకై నందరాజులు చేసిన ప్రయత్నంలో మారిపోయినాయి. రాచరికం మౌర్యుల ప్రభుత్వంతో కేంద్రీకృతాధికారంగా వికసించి మౌర్య ప్రభుత్వం రూపొందిన విస్తృత రాజకీయ, ఆర్థిక విధానం క్రిందికి వచ్చిన ప్రాంతాలకు విస్తరించింది. మౌర్యసామ్రాజ్యం సరిహద్దులలోని రాజ్యాలకు స్వతంత్ర ప్రభుత్వాలకు మౌర్యులతో అనియతమైన సంబంధం ఉండేది. సామ్రాజ్య అంతర్గత ప్రాంతాలు సంశ్లిష్టములు కాకపోయినప్పటికీ మౌర్యులపాలనకు లోబడి మాత్రం ఉండేవి. మౌర్యసామ్రాజ్యం సమాఖ్య రాజ్యాలతో ఏర్పడినదని కొందరు సూచించినారు. అది యథార్థమైన సూచనకాదు. కళింగ రాజ్యంతో మౌర్యులకు ఉన్న సంబంధం పై సూచనకు విరుద్ధము. మౌర్యులకాలంలో సమాఖ్య సిద్ధాంతం ప్రచారంలో ఉన్నట్లయితే కళింగ సమస్యకది పరిష్కారమై ఉండేది. కళింగ యుద్ధం జరిగేదికాదు. కళింగపై పూర్తి ఆధిపత్యం కాంక్షించే అశోకుడా రాజ్యంపై యుద్ధం చేయవలసి వచ్చింది.

భారతదేశంలో విస్తృత ప్రమాణంలో కేంద్రీకృతాధికార స్థాపనకు చేసిన మొట్టమొదటి ప్రయత్నమైనందున మౌర్యసామ్రాజ్యంలోను, సరిహద్దులలోను కొన్ని తెగలు తమ తమ రాజకీయ వ్యవస్థలను యధాతథంగా కొనసాగించుకొనడం సంభవమైంది. కొన్ని తెగల గణరాజ్యాలను అర్థశాస్త్రం పేర్కొంటున్నది. లిచ్ఛవి, వజ్జి, పాంచాల తెగలవి సయితం గణరాజ్యాలే. కాని వీటిని నామమాత్రుడైన రాజు పరిపాలించేవాడు. ఈ రాజ్యాలు మౌర్య సామ్రాజ్యంలో విలీనంకాలేదు. ఈ రాజులకు ఏ విధంగా చూచినా చక్రవర్తితో సమానమైన హోదా ఉండదు. వీరి రాజ్యాలు సయితం సమానహోదాగల ప్రమాణాలు కావు. అందుచేత కొత్త రాజకీయ విధానం అచరణలో సుగమం కాగలదనే ఉద్దేశంతో పై తెగలు తమ తమ రాజకీయ వ్యవస్థలను కొనసాగించుకొనడానికి మౌర్యులు అనుమతించినారు.

మౌర్యసామ్రాజ్య వ్యవస్థను భగ్నం చేయనంతకాలం ఈ తెగల ప్రత్యేక రాజకీయ హక్కులను అనుమతించడం జరిగింది. ఈ గణ ప్రభుత్వాలు మౌర్యసామ్రజ్యానికి అనుబంధాలుగా అర్థశాస్త్రం వర్ణిస్తున్నది. అందుచేత అవి మౌర్యప్రభుత్వ ప్రతినిధులకు సులభంగా అందుబాటులో ఉన్నట్లు తెలుస్తుంది. సామ్రాజ్యంలో విలీనములైన ప్రాంతాలకు లభించే ప్రాముఖ్యం వీటికిలేదు.

క్రొత్త రాజకీయ పద్ధతియైన రాజరికం గణరాజ్యాలపై సాధించిన విజయానికి మౌర్య సామ్రాజ్యం చక్కని ఉదాహరణ. ఇందుకు నిదర్శనంగా కౌటిల్యుడు గణరాజ్యాల పట్ల ప్రదర్శించిన దృష్టిని చెప్పవచ్చు. కేంద్రాధికార ఆధిపత్యముపై అర్థశాస్త్రం నొక్కిపెడుతున్నది. అదే అర్థశాస్త్రంలోని మౌలిక భావన, అంతిమాధిపత్యం రాజుకు చెందే లక్ష్యంతో రాజ్య వ్యవస్థలోని ప్రత్యంశము పరిపాలనా ప్రణాళికకు అనుసంధితమైంది. రాజు సమాజాన్ని రక్షించి పాలించవలె. అదే రాజునుండి ప్రజలాశించినది. యధాతథ పరిరక్షణ పరిపాలనను సుకరం చేసింది. ఇది ధనాగారానికి రాజ్యస్వం అవిరోధంగా సర్వదా ప్రవహించడానికి కారణమైంది. సాంప్రదాయక రాచరిక సిద్ధాంతాన్నిబట్టి సాంఘిక మర్యాదలను రక్షించడమేగాక, స్వయంగా శాసనాలను చేయడంద్వారా రాజాధికారం నిరతిశయంగా పెరుగుతుంది. సాంప్రదాయకమైన శాస్త్ర న్యాయానికి రాజశాసనమైన ధర్మ న్యాయానికి సంఘర్షణ వచ్చిన సందర్భంలో రాజ శాసనమే అమలు జరుగవలెననే సూచన ఎన్ని అవరోధాలున్నప్పటికీ రాజాధికారం విపరీతంగా పెరిగిందనడానికి నిదర్శనం.

రాజాధికారం పెరిగినందువల్లనే కేంద్రీకృత మౌర్య రాజరికం అశోకుని క్రింద పైతృక నిరంకుశమైంది. ప్రజల వ్యవహారాలకు దూరంగా ఉంటూ వారిని రక్షించేవాడు రాజు అనే ప్రాచీన సిద్ధాంతానికి బదులు రాజంటే సాంఘిక, రాజకీయ జీవిత రంగాలన్నింటినీ

అదుపులో ఉంచేవాడు అనే విశ్వాసం ఏర్పడింది. "ప్రజలంతా నాబిడ్డలే." అనేది ఇంచుమించు అశోకుని ఆదర్శ వాక్యమైంది. ఈ వాక్యంలో మౌర్య సామ్రాజ్య పైతృక స్వభావం వ్యక్తమౌతుంది. ప్రజా శ్రేయస్సే అశోకుని చింతన అయింది. అదే తన ప్రధాన కర్తవ్యమని భావించినాడు. అర్థశాస్త్రం కూడ ప్రజా శ్రేయస్సుకే ప్రాధాన్యమిచ్చింది. శ్రేయోసాధనకై నీతి సమ్మతమైన మార్గాన్ని పితృ వాత్సల్యంతో అనుసరించడమే అశోకుని తాపత్రయమని తెలుస్తుంది. ప్రజలతో వ్యక్తిగతమైన సంబంధం పెట్టుకోవాలనే ఆకాంక్ష నాతడు వ్యక్తం చేసినాడు. సామ్రాజ్యం నలుమూలల పర్యటనలు సాగించటానికి కొంతవరకు అదే కారణం. ఈ యాత్రలకు సమర్ధమైన పాలనా పద్ధతి మంచి అవకాశంగా కల్పించింది. కొత్త రవాణా సౌకర్యాల వల్ల కొత్త ప్రదేశాలతో పరిచయమేర్పడి స్వేచ్ఛగా ప్రయాణం సాగించడానికి వీలు కలిగింది.

భారతీయ ఆలోచనా క్రమాన్నిబట్టి సాంఘిక స్థితిని పరిరక్షించడమే రాజు ప్రధాన కర్తవ్యం. చాతుర్వర్ణాలు, ఆశ్రమాలు సాధ్యమైనంతవరకు తమ తమ వృత్తులను విద్యుక్త ధర్మాలను పాలించేటట్లు చూడవలె. రాజాధికారం దైవానుమోదంతో ముడి పడింది. దైనందిన కార్యకలాపాల ఆచరణ స్థాయిలో రాజు-దైవాల మధ్య సంబంధం బ్రాహ్మణులాక్రమించిన ఉన్నత స్థానంలో ముఖ్యంగా అంత:పుర అర్చకుడుగా పురోహితుని స్థానంలో వ్యక్తమవుతుంది. ప్రధానితోపాటు పురోహితుడు సయితం రాజు ఆంతరంగికులలో ఉండడం పురోహితుని ప్రాముఖ్యానికి తార్కాణం. ఈ విధంగా రాజుతో ఉన్న సంబంధాలలో పురోహితుని పాత్ర మత కార్యక్రమాలకు పరిమితంగాక రాజకీయ రంగానికి సయితం విస్తరించింది. బ్రాహ్మణులపై రాజు ఏ విధంగా ఆధారపడినది మరోచోట అర్థశాస్త్రం స్పష్టంగా చెబుతున్నది. బ్రాహ్మణానుగ్రహము, సదుపదేశము (మంత్రాంగము) శాస్త్రసమ్మతమైన వర్తనము, రాజునకు సంపూర్ణ విజయాన్ని చేకూర్చే మూడు అంశాలు అని అర్థశాస్త్రం నొక్కి చెబుతున్నది. తన శాసనాలలో అశోకుడు పురోహితుని గురించి ముచ్చటించడు. అందుచేత అతని కాలంలో రాజకీయ వ్యవహారాలలో పురోహితుని జోక్యాన్ని అతడు తొలగించినాడని భావించవచ్చు.

దేవానం ప్రియ బిరుదాన్ని అశోకుడు ధరించడం అతడు మతాధికార సహాయాన్ని అర్థించడానికి నిదర్శనమని కొందరు వాదిస్తారు. కాని ఇది అర్చకుల అనుగ్రహాన్ని ఆశించిన సూచనమాత్రమేకాదు. రాజుకు, దైవానికి మధ్యవర్తులైన అర్చకుల ప్రమేయం తొలగించి రాజాధికారానికి, దైవాధికారానికి మధ్య సూటియైన సంబంధాన్ని బలపరచే ప్రయత్నంగా కనిపిస్తుంది. ఈ కొత్త భావన అశోకుని ప్రచారానికి బాగా ఉపకరించింది. తన ధర్మ

ప్రచారంద్వారా దేవతలకు జంబూద్వీపం నివాసయోగ్యమైనదని చెప్పుకొన్నారు. ఇట్టి వాఖ్యానాలను దేవానం ప్రియ బిరుదుతో ముడి పెట్టినందున అమాయక ప్రజానీకం అశోకుడు నిజంగా దేవతలకు ప్రీతిపాత్రుడైనాడని విశ్వసించే అవకాశం ఉంది. ప్రజల ఈ విశ్వాసం సామ్రాజ్యానికి అపారమైన మేలు చేకూరుస్తుంది. తన సామ్రాజ్యానికి మేలు చేకూర్చినానన్న సంతృప్తిని అశోకుడు తన శాసనాలలో స్పష్టంగా వెల్లడించినాడు. దీన్నిబట్టి కనీసం చివరి రోజులలో దేవానాం ప్రియ బిరుదం తనపట్ల అక్షరత: సార్థకమైందని అశోకుడు విశ్వసించినాడని మా సూచన.

ఉద్యోగులకు, ప్రజలకు రాజు సర్వదా సులభుడు కావాలనే భావాన్ని అర్థశాస్త్రం నొక్కి చెబుతున్నది. సులభుడు కానిచో అసంతుష్టికి, సంక్షోభానికి కారణమై శత్రువులకు బలి అవుతాడని హెచ్చరిస్తున్నది. మౌర్యులీ సలహాను తు. చ తప్పక అనుసరించారనడంలో సందేహం లేదు.

సామ్రాజ్య పాలనాభారం వల్ల అలా అనుసరించడం తప్పనిసరియైంది. సంవాహన సమయంలో కూడ రాజు చర్చలకు లభ్యుడని మెగస్తనీసు వ్రాసినాడు. తాను ఎక్కడ ఉన్నప్పటికీ భోజనం చేస్తున్నా, అంతఃపురంలో ఉన్నా, విశ్రమిస్తున్నా నివేదకులకు తామే సులభుడని ఒక శాసనంలో అశోకుడు ప్రకటించాడు. తాను ప్రత్యక్షంగా శ్రద్ధవహించవలసిన అంశమేదైనా మంత్రి పరిషత్సమావేశంలో తలయెత్తితే తక్షణం తనకు నివేదించవలె; పరిపాలన సమర్థంగా ఉండడానికి రాజు మూడు పద్ధతులను అనుసరించవలె – 1. అన్ని విషయాలకు సమాన ప్రాముఖ్యం ఇవ్వడం; 2. సర్వదా అప్రమత్తుడై కార్యాచరణను సన్నద్ధుడై ఉండడం; 3. తన విధి నిర్వహణలో జాప్యం కలుగకుండ చూడడం. ఈ ఆదర్శాన్ని సాధించడానికి సామ్రాజ్యంలో సమర్థంగా పరిపాలించే విస్తృత ఉద్యోగి బృందం అవసరం.

నాటి శాసన నిర్మాణ కార్యక్రమంలో అధికాంశం సాంఘిక సంప్రదాయాన్ని రూఢి పరచడమే. వ్యష్టి సమస్యలపై నిర్ణయాలు సయితము సాంఘిక సంప్రదాయాన్ని అనుసరించే జరిగేవి. ఈ నిర్ణయాలు చేయడంలో రాజుకు స్వేచ్ఛ ఉంది. మంత్రుల అభిప్రాయాలను గణించవలసిందిగా రాజుకు సలహా ఉన్నప్పటికీ రాజుదే అంతిమ నిర్ణయం. మంత్రి పరిషత్తు రాజుపై రాజకీయ అవరోధంగా పనిచేసేది. రాజు నిర్ణయించిన విధానానికి జనవాక్యం విరుద్ధంగా ఉన్నప్పుడే మంత్రి పరిషత్తు కృషి ఫలప్రదమౌతుంది. నేటి ప్రభుత్వ యంత్రాంగంలో మంత్రి పరిషత్తుకు నియమితమైన రాజకీయ స్థానం ఉంది. స్వభావంలో ఒకటే అయినప్పటికీ నాటి ప్రభుత్వ యంత్రాంగంలో మంత్రి పరిషత్తుకు అటువంటి

స్థానం లేదు. రాజునకు ఉన్న బలాన్నిబట్టి మంత్రి పరిషత్తు సభ్యుల శక్తి సామర్థ్యాలను బట్టి మంత్రి పరిషత్తు అధికారాలు మారుతూ ఉండేవి. అశోకుడు సింహాసనం ఎక్కిన కాలంలో మంత్రుల అధికారాలను గూర్చిన ఉదాహరణ ఒకటి ఉన్నది. మంత్రి రాధాగుప్తుని అండదండలున్నందుననే అశోకుడు సింహాసన మాక్రమించడానికి సులువైంది. అశోకుడు మంత్రి పరిషత్తును రెండు శాసనాలలో ప్రస్తావించినాడు. మొదటి ప్రస్తావనలో పరిషత్తు రాజునకు లోబడి వ్యవహరించినట్లున్నది. అశోకుడనుసరించిన కొత్త పరిపాలనా చర్యలు కొన్నింటిని నమోదు చేయవలసిందిగా 'యుక్తు'లను పరిషత్తు ఆదేశించవలెనని శాసనం చెబుతున్నది. దీన్ని బట్టి రాజు నిర్ణయించిన విధానాలను అమలు జరిపే బాధ్యత పరిషత్తుదైనట్లు స్పష్టమౌతుంది. రెండవ ప్రస్తావననుబట్టి పరిషత్తుకు ఎక్కువ అధికారం ఉన్నట్లు కనిపిస్తుంది. రాజు లేనపుడు విధానాలను చర్చించి, వాటిలో మార్పులను పరిషత్తు సూచించవచ్చును. రాజు చర్చింపవలెనని విడిచిపెట్టిన అత్యవసర విషయాలను పరిషత్తు ఆలోచించవచ్చు. కాని ఈ సందర్భాలలో కూడ పరిషత్తు తన అభిప్రాయాన్ని వెంటనే ఎక్కడ ఉన్నా రాజుకు తెలియజేయవలెను. దీన్నిబట్టికూడా పరిషత్తు కేవలం సలహా సంఘమేనని, అంతిమ నిర్ణయం రాజుదేనని స్పష్టమౌతున్నది. అత్యయిక పరిస్థితులలో అన్ని విషయాలను మంత్రి పరిషత్తుతో సంప్రదించడం రాజుకు శ్రేయస్కరం.

మంత్రి పరిషత్సభ్యులను రాజే స్వయంగా ఎన్నిక చేసినందున పరిషత్తుపై అతని అధికారం ఎక్కువగా ఉండేది. తన విధానాలను ఆమోదించేవారినే సభ్యులుగా ఎన్నుకోవడం మామూలుగా జరుగుతుంది. మంత్రికి ఉండవలసిన లక్షణాలను పేర్కొంటూ కులీనత, బుద్ధికుశలత, న్యాయవర్తనలకు అర్థశాస్త్రం ప్రాధాన్యమిస్తున్నది. వివిధ పద్ధతులలో ఈ గుణాలను నిరూపణ చేయవలెనని కూడ సూచిస్తున్నది. ఇది మంత్రుల ఎన్నికను గురించిన ఆదర్శప్రాయమైన సూచనేకాని దాన్ని సర్వదా మన్నించి ఉండరు. మంత్రుల విశ్వాసాన్ని పరీక్షించడానికి కొన్ని మార్గాలను అర్థశాస్త్రం వివరిస్తున్నది. ఈ పరీక్షలో ప్రధాని, పురోహితుడు రాజుకు సాయం చేస్తారు. తాను పేర్కొన్న ఏడు వర్ణాలలో ఏడో వర్ణం నుంచి మంత్రులను ఎన్నికచేస్తారని మెగస్తనీసు వ్రాసినాడు. సాధారణంగా బ్రాహ్మణులనుండి, ఉన్నత క్షత్రియులనుండి, మంత్రులను ఎన్నిక చేసేవారు కాబట్టి మెగస్తనీసు వ్రాత యథార్థమే. ఇతర వర్ణాల నుండి మంత్రులను సాధారణంగా ఎన్నిక చేసేవారుకాదు.

పరిషత్తులో సభ్యులకు నిర్ణీతమైన సంఖ్యలేదు. అవసరాన్నిబట్టి మంత్రుల సంఖ్య మారుతూ ఉండేది. అర్థశాస్త్రం మహామంత్రిని లేదా ప్రధానిని పేర్కొంటూ మంత్రులను,

మంత్రి పరిషత్సభ్యులకు (మంత్రిణో మంత్రి పరిషదమాత్య) భేదాన్ని సూచిస్తున్నది. మంత్రి పరిషత్తునుండి ప్రధానితోబాటు ముగ్గురు లేదా నలుగురు సభ్యులున్న చిన్న సంఘాన్ని ఎన్నిక చేసేవారు. ఇది సన్నిహిత సలహా సంఘంగా వ్యవహరించేది. ఇది శాశ్వత సంఘం. ప్రత్యేక సమస్యలపై సంప్రదించడానికై నియమించిన ఆధునిక సంఘాలను పోలి ఉండేది. ఏదైనా విషయంపై సలహాను కోరి రాజు రహస్యంగా ముగ్గురు నలుగురు మంత్రులతో సంప్రదించవచ్చు. లేదా సమిష్టిగా పై సంఘాన్ని పోలిన చిన్న సలహా సంఘంతో సంప్రదించవచ్చు. ఇట్టి సంప్రదింపులు స్పష్టంగా భావ వ్యక్తీకరణకు తోడ్పడుతాయి. పెద్ద సమావేశాలలోకంటె రహస్య సమావేశాలలోనే మంత్రులు తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తీకరిస్తారు. చర్చాంశాన్ని గోప్యంగా ఉంచడానికి కూడ ఇట్టి సమావేశాలు ఉపకరిస్తాయి. ఇట్టి చర్యలను రహస్యంగా ఉంచడం వల్ల కౌటిల్యుడు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చినాడు.

కేంద్రపాలన కొన్ని నియోగాలద్వారా జరిగేది. వీటిలో చాలభాగం రాజ్యస్వ నియంత్రణకు సంబంధించినవి. ప్రతి నియోగము ఒక కార్యనిర్వాహకుని ఆధీనంలో ఉండేది. రాజధనాన్ని, రాజ్య ఆదాయాన్ని నిల్వ ఉంచే బాధ్యత సన్నిధాత (Treasurer). రాజ్య ఆదాయం ధనరూపంలోను, వస్తురూపంలోను ముఖ్యంగా ధాన్యము, వజ్రవైడూర్యాదులలోనూ ఉండేది. వీనిని భద్రపరచి ఉంచడమే సన్నిధాత ప్రత్యేకవిధి. ఈతని కార్యస్థానం సమాహర్త (Chief collector) కార్యస్థానంతో కలిసి పనిచేసేది. రాజ్యం వివిధ ప్రాంతాల నుండి రాజ్యస్వాన్ని వసూలు చేయడానికి బాధ్యుడు సమాహర్త. అర్థశాస్త్రం చెప్పినట్లు నగరాలు, భూములు, గనులు, అడవులు, రహదారులు, సుంకాలు, అపరాధ రుసుములు, అనుజ్ఞాపత్రాలు, ఉత్పాదక వస్తువులు, వివిధరకాల క్రయ విక్రయాలు, వజ్ర వైఢూర్యాలు రాజ్యస్వానికి ఆధారాలు. ఆదాయ వ్యయాలకు సంబంధించిన వ్యవహారాలలో శ్రద్ధవహిస్తూ సమాహర్త ప్రథమ గణకుడు సమర్పించే లెక్కలను తనిఖీచేస్తూ ఉంటాడు. రాజ్యానికి, రాజప్రసాదానికి సంబంధించిన లెక్కలను ప్రథమ గణకుడు తయారుచేస్తాడు. అతనికి సహాయంగా గుమాస్తాల బృందం పనిచేస్తుంది. మంత్రులందరు కలిసి ప్రతిశాఖకు చెందిన లెక్కలను సమర్పించాలని అర్థశాస్త్రం చెబుతున్నది. ఈ విధానం సమిష్టి బాధ్యతను సూచిస్తుంది. కాని మోసం జరిగినపుడు అందుకు కారణమైన మంత్రినిగాని, ఆ శాఖనుగాని శిక్షించేవారు. ప్రభుత్వ ధనాన్ని అపహరించడమనేది జరుగుతూ ఉండేది. అట్టి నేరానికి పెద్ద పెద్ద జరిమానాలు విధించాలని అర్థశాస్త్రం సూచిస్తున్నది. ఆర్థిక సంవత్సరం ఆషాఢం (జులై) నుండి 354 పనిరోజులుగా లెక్కించేవారు. అధికమాసాన్ని ప్రత్యేకంగా లెక్క కట్టేవారు.

వ్యయంలో అధికభాగం జీతాలు, ప్రజాహిత కార్యాల రూపంలో జరిగేది. రాజక్షేత్రాల నుండి వచ్చే ఆదాయమేగాక జాతీయ రాజ్యస్వంలో కొంత భాగం కూడ రాజాస్థానానికి, రాజకుటుంబ వ్యయానికి అవసరమయ్యేది. రాజ ధనాగారానికి చెల్లించిన మొత్తాల నుండి ఉద్యోగుల జీతాలు చెల్లించేవారు. రాజ్యస్వం మొత్తంలో నాలుగోవంతును జీతాలకు ప్రత్యేకించేవారు. అర్థశాస్త్రంలో ఈ జీతాల పట్టిక ఉంది. మంత్రి, పురోహిత, సేనాపతులకు ఒక్కొక్కరికి నలభై ఎనిమిదివేల వరహాలు జీతం. సన్నిధాత, సమాహర్తలకు ఇరువది నాలుగువేల పణాలు. మంత్రి పరిషత్సభ్యులకు పండ్రెండువేలు. గణక, లేఖక బృందాలకు 500 పణాలు. పణం విలువనుగాని ఈ మొత్తాలు నెలసరిజీతాలో సాలుసరిజీతాలో చెప్పకపోవడం దురదృష్టం. అయితే వీనివల్ల వివిధ ఉద్యోగుల వేతనాలు నిష్పత్తిమాత్రం స్పష్టమౌతుంది.

ప్రజాహిత కార్యాలపై వ్యయం క్రింద రహదారులు, బావులు, సత్రాల నిర్మాణ పోషణలు, సుదర్శనతటాకానికి ఆనకట్టవంటి నీటిపారుదల సౌకర్యాల నిర్మాణము, మూలికలు, చెట్లు నాటడం వంటి కార్యక్రమాలు ఉండేవి. సైన్య పోషణకూడా రాజ్యవ్యయాలలో ప్రధానమైనది. ప్రభుత్వ గనులమీద, ఉత్పాదనలమీద జరిగే చర్చను ప్రభుత్వం నియమించిన పనివాండ్ర వేతనాలను రాజధనాగారం నుండి చెల్లించేవారు. మత సంస్థలకు దానధర్మాలు ధనాగారం నుండి చెల్లించేవారో లేదా రాజక్షేత్రాల రాజ్యస్వం నుండి చెల్లించేవారో తెలియదు. జాతీయ ధనాగారానికి రాజు సొంతకోశానికి మధ్య వ్యత్యాసాన్ని అర్థశాస్త్రం సూచించదు. అందుచేత అనధికార దానధర్మాలు సైతం ధనాగారంనుండే చేసేవారని చెప్పవచ్చు. బౌద్ధసంఘానికి అశోకుడు దానాలు చేయడం పౌర పరిపాలనా యంత్రాంగానికి ఇతర మత సంస్థలకు ఆగ్రహకారణమై ఉంటుంది.

అధ్యక్షుల విధులను గురించి కౌటిల్యుడు ఒక విభాగాన్ని ప్రత్యేకించినాడు. ఈ ఉద్యోగులు వివిధ ఆదాయమార్గాలను పర్యవేక్షిస్తూ, దానితో సంబంధించిన ప్రభుత్వ శాఖల పాలనా బాధ్యత వహించేవారు. స్థానిక కేంద్రాలలో పనిచేస్తూ రాజధానిలోని పాలనా యంత్రాంగానికి నివేదికలు సమర్పించేవారు. క్రింది ఉద్యోగ బృందాలు వీరికి సహాయంగా ఉండేవి. అందుచేత వీరు రాజధానికి, స్థానికపాలనకు మధ్య కొలికి పూసవంటివారు. స్వర్ణకార, భాండాగార, వాణిజ్య, అటవీ ఉత్పాదక, ఆయుధాగార, తులామాన, సుంక, తంతువాయ, వ్యవసాయ, మద్య, వధ్యస్థాన, గణిక, నౌక, గో, అశ్వ, గజ, రథ, పదాతిదళ, యాత్రాపత్ర, నగర, అధ్యక్షులను అర్థశాస్త్రం పేర్కొంటున్నది.

రాష్ట్ర పరిపాలన ఒక రాకుమారుని ఆధీనంలోగాని, రాజకుటుంబ సభ్యుని

ఆధీనంలోగాని ఉండేది. శాసనాలలో రాష్ట్రపాలకునకు కుమార, ఆర్యపుత్ర పదాలను వాడినారు. ఇందు కుమార అనేది రాకుమారుల బిరుదమై ఉంటుంది. ఆర్యపుత్ర అనేది రాజుకు దగ్గర బంధువును సూచిస్తున్నది. సాధారణంగా వీరు సామ్రాజ్యంలో రాజ ప్రతినిధులు లేదా రాష్ట్రాధికృతులైయుంటారు. నాలుగు రాష్ట్ర రాజధానీ నగరాలను శాసనాలు పేర్కొంటున్నాయి. కాబట్టి అశోకుని పాలనలో సామ్రాజ్యం నాలుగు ముఖ్యరాష్ట్రాలుగా విభజితమయింది. ఉత్తర రాష్ట్రానికి తక్షశిల రాజధాని. పశ్చిమ రాష్ట్రానికి ఉజ్జయిని, తూర్పు రాష్ట్రానికి తోసలి, దక్షిణ రాష్ట్రానికి సువర్ణగిరి రాజధానులు. ఈ రాష్ట్రాలు పరిపాలనా విభాగాలు. వీటిపై రాజప్రతినిధులను నియమించేవారు. రాకుమారులను రాజప్రతినిధులనుగా నియమించడంవల్ల పరిపాలకులుగా వారికి శిక్షణిచ్చే ఆశయం నెరవేరేది. రాజుకు, రాకుమారునకు మధ్య సత్సంబంధాలు ఉన్నపుడు మరొక లాభంకూడా ఉండేది. రాజప్రతినిధిగా రాకుమారుడు రాజు రూపొందించిన విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తాడు. రాజుకు విధేయుడైన రాకుమారుని హయాములో తిరుగుబాట్లు జరిగే అవకాశం తక్కువ. కాని ఈ పద్ధతి వల్ల నష్టాలున్నవని కూడా తెలిసి, నాటి రాజనీతి వేత్తలు హెచ్చరికలు చేసినారు. రాజప్రతినిధిగా ఉంటున్న కాలంలో రాజుకు వ్యతిరేకంగా తన బలాన్ని రాకుమారుడు కూడదీసుకోవచ్చు. రాకుమారుడు అపాయహేతువని, రాష్ట్రంపై సంపూర్ణాధిపత్యం ఇవ్వడంవల్ల అతడు బాధ్యతారహితంగా వర్తించడానికి దారి తీయవచ్చుననీ అర్థశాస్త్రం హెచ్చరిస్తున్నది. రాష్ట్రాలలో రాజప్రతినిధులుగా సోదర రాకుమారుల మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడి వారసత్వ యుద్ధాలకు దారి తీయవచ్చు. ఈ యుద్ధాలలో రాష్ట్రాలలోని సేనలను పరస్పరం వినియోగించుకోవచ్చు. బిందుసారుని పుత్రులమధ్య సింహాసనానికై పోరాటం జరిగినప్పుడు ఇటువంటి పరిణామాలే ఏర్పడి ఉంటాయి. రాజప్రతినిధిగా సాధించిన విజయమే తండ్రికి వారసుడుగా తానే సమర్థుడనే ఆత్మవిశ్వాసం అశోకునకు కల్గించి ఉంటుంది.

రాష్ట్రంలోని చిన్న పాలనా విభాగాల అధిపతులను బహుశా స్థానిక ప్రజలనుండి ఎన్నిక చేసేవారు. జన్మతః విదేశీయుడైన 'తుషాస్పుడు' అనే స్థానిక వ్యక్తిని గిరినార్ ప్రాంతానికి అధిపతిగా శాసనం పేర్కొంటున్నది. ఇక తెగల విషయంలో స్థానికులైన రాజులను పాలనాధిపతులుగా ధ్రువపరచి ఉంటారు. మౌర్యుల సార్వభౌమత్వం క్రిందికి వచ్చిన ప్రాంతాలలో పాలనా వ్యవస్థ భగ్నమయ్యే అవకాశం తక్కువ. ఇంతేకాక స్థానిక పాలకునికంటే కొత్త పాలకుని ప్రజలు ద్వేషించే అవకాశం ఉంది. అందుచేత క్రింది స్థాయిలలో స్థానిక పరిపాలనను మౌర్యులు అనుమతించి ఉండవచ్చు.

కేంద్ర మంత్రి పరిషత్తుకు అనురూపంగా రాష్ట్రాలలో కూడా మంత్రి పరిషత్తులుండేవి. కాని రాష్ట్ర పరిషత్తులకు అధికారాలు ఎక్కువ. అవసరమైనపుడు రాజుతో సూటిగా సంబంధంకల్గి రాష్ట్ర మంత్రి పరిషత్తు రాకుమారునిపై అవరోధంగా పనిచేసేది. అశోకునకు పూర్వము, అశోకుని కాలంలోను జరిగిన రెండు సంఘటనలవల్ల ఇది స్పష్టమౌతున్నది. బిందుసారుని కాలంలో తక్షశిలలో జరిగిన తిరుగుబాటు స్థానిక మంత్రులు, ఉద్యోగులపైనేగాని రాకుమారుని పై గాదు. తక్షశిలలో మంత్రులు దౌర్జన్యంగా ప్రవర్తించి నందువల్లనే తిరుగుబాటు జరిగింది. ఇక అశోకుని ఆదేశంమీద కునాల రాకుమారుని అంధునిగా చేసిన గాథ రెండవ సంఘటన. రాజప్రతినిధికి తెలియకుండ నేరుగా మంత్రులకు తన ఆదేశాన్ని చక్రవర్తి పంపినట్లు ఈ కథ సూచిస్తున్నది. రాజ ప్రతినిధికి రాజాజ్ఞ తెలియకపోవడం మంత్రులకు ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కాబట్టి అట్టి సంఘటనలు సర్వసామాన్యాలు అని తెలుస్తున్నది. కొందరు ఉద్యోగులను నియమించే అధికారం రాజప్రతినిధికి ఉండేది. ఐదేండ్లకొకమారు అనుసంధాన పర్యటనలుచేసే మహామాత్తులలో కొందరిని రాజు నియమించేవాడు. మరికొందరిని రాజప్రతినిధి నియమించేవాడు.

మౌర్య పరిపాలనలో మహామాత్తుల సరిఅయిన హోదాయేమో స్పష్టంగా తెలియదు. అనేకరకాల ఉద్యోగులను వివిధ గ్రంథాలు మహామాత్తులుగా వ్యవహరిస్తున్నాయి. అతనికి నిర్దేశించిన విధులేమైనప్పటికి వరిష్టుడైన ఉద్యోగిని మహామాత్తుడని వ్యవహరించినట్లు కనిపిస్తుంది. అర్థశాస్త్రం ఆ మాటను మంత్రి అన్న అర్థంలో ప్రయోగించింది. బౌద్ధ సారస్వతంలో కంటే ఇది చాల సంకుచితార్థం. తన శాసనాలలో అశోకుడీ పదాన్ని అనేక రకాల ఉద్యోగులకు వర్తించేటట్లు యంత్రాంగానికి సంబంధించిన సలహా సంఘానికి సయితం వాడినట్లు కనిపిస్తుంది. వీరిలో కొందరు సాధారణ పరిపాలనకు సంబంధించిన ఉద్యోగులు, గౌణశిలాశాసనం వీరినుద్దేశించినదే. ప్రథమ ప్రత్యేక శాసనంలో ఈ పదాన్ని న్యాయాధికారుల నుద్దేశించి వాడినారు. న్యాయాధికారుల చర్యలను తనిఖీ చేయడానికి దేశపర్యటన జరిపే ఉద్యోగులకు కూడా ఈ పదాన్ని వాడినారు. న్యాయాధికారుల కంటే వారిపై తనిఖీచేసే మహామాత్తుడు వరిష్ఠుడై ఉంటాడు. న్యాయాధికారులపై తనిఖీ నిమిత్తం ఉద్యోగులను కేంద్రమూ పంపేది; రాష్ట్రంలో రాజప్రతినిధి పంపేవాడు. మహారాణి శాసనంలో మహారాణి చారువాకి' ఏదానం చేసినప్పటికి మహామాత్తులు నమోదుచేయవలసిందిగా చెప్పినారు. అంతఃపురము, స్త్రీలకు సంబంధించిన శాఖలు ఇథీజ్ఞక మహామాత్తుల ఆధీనంలో ఉండేవి. ధర్మ మహామాత్తులనే కొత్తతరహా మహామాత్తుల ప్రసక్తి తరచుగా కనిపిస్తుంది. తన పదునాలుగో రాజ్యసంవత్సరంలో అశోకుడీ ఉద్యోగాన్ని నెలకొల్పినాడు.

ఈ విధంగా మహామాత్తులు బాధ్యతగల ఉద్యోగి బృందంగా కనిపిస్తున్నారు. వరిష్ఠస్థానాల నాక్రమించి న్యాయ పరిపాలనను వివిధ పరిపాలనాంశాలను అదుపులో నుంచే వారైనందున మహామాత్తులకు అధిక గౌరవం ఉండేదనడంలో సందేహంలేదు. మంత్రులను, కరనిర్ధారకులను ఏడవ వర్గంగా చెప్పినపుడు బహుశా మెగస్తనీసు మహామాత్తుల నుద్దేశించి ఉంటాడు. మెగస్తనీసు నుల్లేఖిస్తూ మంత్రులు, కర నిర్ధారకులు ఏడవ వర్గం వారని రాజ్య వ్యవహారాలను చర్చించేవారని మెగస్తనీస్‌ను ఉల్లేఖిస్తూ డిమోడరస్ వ్రాసినాడు. సంఖ్యా ప్రమాణాన్నిబట్టి అన్ని వర్గాలలో ఏడవ వర్గం చిన్నది. కాని సభ్యులు శీలవంతులు, బుద్ధికుశలు రయినందున పూజనీయమైన వర్గం. వీరిలో నుంచే మంత్రులను, రాజ్య కోశాధిపతులను, తగాదాలను పరిష్కరించే మధ్యవర్తులను నియమించేవారు. సేనాపతులు ప్రధాన న్యాయమూర్తులు సయితం ఈ వర్తానికి చెందినవారే. "రాజు సలహాదారులు, కరనిర్ధారకులు, ఏడవ వర్గంవారు. ప్రభుత్వంలోను, ధర్మాసనాలలోను ఉన్నత స్థానాలు వారివే." అంటూ స్ట్రాబో వ్రాసినాడు. "ఏడవ వర్గంలోని వారు రాజుకు సలహా ఇచ్చే మంత్రులు; స్వీయ పాలనాధికారం ఉన్న నగరాలలో న్యాయాధిపతులు; ప్రజా వ్యవహారాల పాలకులు; సంఖ్యలో ఇది చాల చిన్న వర్గం. కాని బుద్ధికుశలతలో, న్యాయదీక్షలో పేరొందినవారు. అందుచేత రాష్ట్రాధిపతులను, రాష్ట్రంలోని ప్రధాన ఉద్యోగులను ఉపరాష్ట్రాధిపతులను, కోశాధ్యక్షులను, సేనాధిపతులను, నౌకాదళాధిపతులను, వ్యవసాయ శాఖాధిపతులను ఎన్నికచేయడంలో వీరికి ప్రత్యేక హక్కులుండేవి.

మహామాత్తుల ఉద్యోగాలను గురించిన పై వాక్యాలు ఇతర ఆధారాల నుండి లభించే సమాచారంతో సరిపోతూ ఉంది. పరిపాలనతో వీరి అనుభవం చాల సహాయకారి కాగలదు. కాబట్టి మహాత్తుల నుండే సలహాదారులను ఎన్నుకొనడం రాజుకు సముచితం. శాసనాలు పేర్కొంటున్న న్యాయ మహామాత్తులు వివాదాలు పరిష్కరించే మధ్యవర్తులై ఉంటారు. స్వయం పాలన నగరాలలో న్యాయాధికారులుగా ఏడోవర్గ సభ్యులు వ్యవహరిస్తారన్న ఏరియన్ వాక్యంలో కొంత పొరపాటు ఉంది. తెగల గణ ప్రభుత్వాలలో సైతం మౌర్యులు మహామాత్తులను నియమించి ఉంటారు. వీరిని గురించే ఏరియన్ పై విధంగా వ్రాసినాడు. మహామాత్తులలో యూరోపియన్ ఆధారాలు నిర్లక్ష్యం చేసిన ఒకే ఒక శాఖ ధర్మమహామాత్తులు. అశోకుని కాలంవరకు వీరి నియామకం జరగనందున మెగస్తనీసు రచనలో వీరి ప్రసక్తికి అవకాశం లేదు. మహామాత్తులు వరిష్ఠ స్థానాలలో ఉండి అసామాన్యులుగా కన్పించినందున వారిని ప్రత్యేక వర్గంగా మెగస్తనీసు పేర్కొనడం సహజమే.

నగరాలలో న్యాయపరిపాలన ప్రత్యేకంగా నియమించిన మహామాత్తులు నిర్వహించేవారు. ప్రథమ ప్రత్యేక శాసనం వీరినుద్దేశించి చెప్పినదే. న్యాయవర్తన, పక్షపాతరహిత తీర్మానాల ప్రాముఖ్యాన్ని ఈ శాసనం నొక్కి చెబుతున్నది. ఆగ్రహము, అలసత్వము, విసుగుదల, అసహనము మొదలైన బలహీనతల గురించి అశోకుడు హెచ్చరించినాడు. వీటిలో ఏ ఒక్క బలహీనతైనా న్యాయభంగానికి కారణం కావచ్చు. అన్యాయాలు జరుగకుండా ఐదు సంవత్సరాల కొకమారు నగర న్యాయశాఖను తనిఖీ చేయడానికి ఒక మహామాత్తుని పంపటానికి నిర్ణయించినాడు. రాజు పంపిన అవేక్షకుడేగాక, మూడు సంవత్సరాల కొకమారు స్థానికంగా నియమించిన మహామాత్తునిచే రాష్ట్రీయమైన తనిఖీ ఉండేది. నగరపాలనలో చేతిపనివారు, వర్తకులు, ఇతర నగరవాసులతో సంబంధించిన సమస్యలను న్యాయ మహామాత్తులు పరిశీలించేవారు. వీనిలో చాల సమస్యలను అర్థశాస్త్రం చర్చించింది. వివాహము, వారసత్వములకు చెందిన పౌర సంబంధమైన నేరాలు ఈ ఉద్యోగుల ముందుకు వచ్చేవి.

గ్రామ ప్రాంతాలలో రాజుకులు న్యాయ నిర్వహణ జరిపేవారు. వీరే కర నిర్థారణోద్యోగులుగా సయితం వ్యవహరించేవారు. ప్రస్తుతం వారి న్యాయ నిర్వహణ చర్యలనే చర్చిద్దాము. రాజుకుల న్యాయ నిర్వహణ విధులను గురించే అశోకుడొక పూర్తి స్తంభ శాసనం వేయించినాడు. ఈ శాసనం ఇరవయ్యేడో రాజ్యపాలనా సంవత్సరంలో వేయించడంచేత రాజుకులకు ఈ అధికారులు అశోకుని పరిపాలన చివరలో సంక్రమించినట్లు స్పష్టమౌతుంది. ఇంతకు పూర్వం గ్రామ ప్రాంతాలలో న్యాయ నిర్వహణ ప్రజాస్వామ్యానికి అందుబాటులో లేని ఉన్నతోద్యోగుల చేతులలో ఉన్నట్లు తెలుస్తుంది. వ్యవసాయము, భూమికి సంబంధించిన తగాదాలు సయితము వీరే పరిష్కరించవలె.

అదే శాసనంలో న్యాయ విచారణ క్రమాన్ని గురించి శిక్షలను గురించి ఒక వాక్యం ఉంది. దానిని బట్టి సాంప్రదాయకమైన హిందూ శిక్షా క్రమానికి అశోకుడు స్వస్తి చెప్పినారా అనే సందేహం వస్తుంది. ఇది చాల సాహసంతో కూడిన చర్య అనక తప్పదు. ఆ వాక్యం–

> "ఇచ్ఛితదియె హి ఏసాకింతి వియోహాలస
> మతాచ సియ దండ సమ తాచా"

"విచారణ క్రమంలో శిక్షలలో సమత ఉండడం ఆపేక్షణీయం." ఈ వాక్యంలోని 'సమతా' అనే మాట చాల ముఖ్యమైంది. దీనిని "పక్షపాత రహితం" అంటూ ఒక ప్రామాణికుడు అనువదించినాడు. పైవాక్యం చెప్పిన సందర్భంలో న్యాయాధీశుని పట్ల

దురభిప్రాయం లేకపోవడం మాత్రమే కాదని నేరస్థుని సాంఘిక హోదాపట్ల పక్షపాత దృష్టితో శిక్ష విధించరాదని సూచిస్తున్నది. అమలులో ఉన్న సంప్రదాయక గ్రంథాలలోని న్యాయ విధానానికి ఈ క్రొత్త నియమం విరుద్ధంగా ఉంది. సంప్రదాయక పద్ధతిపై అర్థశాస్త్రం స్పష్టంగా ఉంది. "వ్యక్తుల సాంఘిక హోదాను, నేరస్వభావాన్ని, నేరకారణం స్వల్పమో, తీవ్రమో అన్న విషయాన్ని, నేరానికున్న పూర్వాపరాలను, కాలాన్ని, స్థలాన్ని నేరస్థుల మధ్య న్యాయసమ్మతమైన విభేదాలను గమనించి అంటే నేరస్తులు రాజ కుటుంబానికి సంబంధించినవారా సామాన్య ప్రజలా మొదలైన విషయాలన్నీ చర్చించి న్యాయాధీశుడు ప్రథమ, మధ్యమ, ఉన్నత శిక్షలలో ఏది తగినదో నిర్ణయించవలె". అదే విధంగా నేరస్థుడైన బ్రాహ్మణునకు విధించే శిక్ష అదే నేరానికి హీన వర్ణజున కిచ్చే శిక్షకంటె కఠినతరంగా ఉండేది.

శిక్షలు విధించడంలో వర్ణవ్యత్యాసాలను సాంఘిక హోదాను నిషేధించడం అశోకుని ధర్మసూత్రాలకు అనుగుణమైనదనడం యథార్థమే. కాని అట్టి తీవ్రచర్య సమాజంలో చెప్పరాని సంక్షోభం కలిగిస్తుందని అతనికి తెలుసు. అంతేకాక అట్టి చర్య బ్రాహ్మణ క్షత్రియులను తనకు విరోధులుగా చేస్తుంది. వారుభయులు ఏకమైతే వారి బలాన్ని అణచడం కష్టసాధ్యం. జంతు బలి నిషేధం వంటి చర్యలవల్లకూడా బ్రాహ్మణుల హోదాను పరోక్షంగా అశోకుడు ప్రతిఘటించినాడు. కాని భారతీయ సమాజంలో బ్రాహ్మణులు బలవంతులని గుర్తించి వారు తనపట్ల పూర్తి విరోధం వహించకుండా జాగ్రత్తపడినాడు. బ్రాహ్మణులపట్ల అత్యంత గౌరవం వహించాలని తన శాసనాలలో ఉద్ఘాటించి బ్రాహ్మణులను స్వాంతన పరచడానికి ప్రయత్నించినాడు. ఇటీవలి అనువాదం ప్రకారంకూడా సమతా పదానికి సమత్వమనే అర్థమే సరియైనదని స్పష్టమౌతున్నది. ఈ వ్యాఖ్యానం వల్ల మౌర్యపాలన క్రిందనున్న ప్రాంతాలలో సారూప్యమైన న్యాయవిచారణ క్రమాన్ని ఒకేరకమైన శిక్షాస్మృతిని అనుసరించాలని ఆదేశించినట్లు తేలుతుంది. ఈ విధానంవల్ల న్యాయ నిర్ణయాలు జరపడం రాజుకు సులభమౌతుంది. అట్టి సారూప్యతవల్ల నేరాలను నియమబద్ధమైన వర్గాలుగా విభజించడానికి వీలై న్యాయవిచారణ సందర్భంలో ఎప్పుడైనా హాజరుకాని ఉన్నతాధికారులు సయితం ఏ నేరాన్నైనా అవగాహన చేసుకోడం సులభమౌతుంది.

మౌర్యయుగ భారతంలో నేరం చాల స్వల్పమని భారతీయులు నిష్కల్మషులని మెగస్తనీసు వర్ణించినాడు. గ్రీసు, ఆసియా మైనరు ప్రాంతాలతో పోలిస్తే మెగస్తనీసు వర్ణన యథార్థమే కావచ్చు. పాటలీపుత్రం రాజధాని నగరమైనందున రక్షకదళం తగినంత ఉండడంచేత ఉద్యోగుల నేరాన్ని నిర్ధాక్షిణ్యంగా నిర్మూలించి ఉండవచ్చు. వాస్తవానికి

అనేక రకాల నేరాలకు అవకాశాలను అర్థశాస్త్రం ఊహిస్తున్నది. కంటక శోధన, నేర శిక్షణలను గురించి మూడు సుదీర్ఘములైన అధికరణాలు అర్థశాస్త్రంలో ఉన్నాయి. గ్రామ ప్రాంతంలో తిరిగే దొంగల ముఠాలను బౌద్ధ సారస్వతం పేర్కొంటున్నది.

శిక్షలు ముఖ్యంగా అపరాధ రుసుము రూపంలో ఉండేవి. మామూలుగా అపరాధం చెల్లించలేనివారు బానిసలుగా అమ్ముడుపోయి చెల్లించడానికి అనుమతించేవారు. అప్పుడప్పుడు అంగచ్ఛేద శిక్షను సయితం అపరాధం చెల్లించడంగా మార్చేవారు. నాడు మరణ శిక్షకూడా అమలులో ఉండేది. బౌద్ధుడైనప్పటికి అశోకుడు మరణ శిక్షను రద్దు చేయలేదు. అయితే ఉరిశిక్ష పడ్డవారికి మూడురోజుల కాలవ్యవధిని మినహాయింపుగా ఇచ్చేవారు. ఈ వ్యవధిలో పునర్విచారణ నిర్వహించవలసిందని లేదా శిక్షను అపరాధ రుసుముగా మార్చమని కోరుతూ నేరస్తులు న్యాయాధిపతులకు అంతిమ విజ్ఞాపన చేసుకోవచ్చు. ఈ పద్ధతి అర్థశాస్త్రానికి తెలియకపోలేదు. ఇవి సాధ్యం కానప్పుడు నిందితుని బంధువులు అతని అంతిమ కోర్కెలను తీర్చవచ్చు. ఈ వాక్యాలన్నిటినిబట్టి మరణశిక్ష పట్ల అశోకుడు విముఖుడైనట్లు తెలుస్తుంది. విముఖుడైకూడా మరణశిక్షను రద్దు చేయకపోవడం ఆదర్శాలపై విచక్షణాయుతమైన రాజనీతి సాధించిన విజయానికి ఒక చక్కని ఉదాహరణ.

రాష్ట్రాలను పరిపాలనా సౌకర్యాలకై మండలాలుగా విభజించినారు. ప్రతి మండలంలోను ఒక ఉద్యోగి బృందం పనిచేసేది. వీరిలో ప్రాదేశిక, రాజుక, యుక్త అనే ముగ్గురు ప్రధాన ఉద్యోగులు. వీరికి సాయంగా చాలా మంది ఉద్యోగులుండేవారు. అర్థశాస్త్రంలోని ప్రదేష్టి విధులవంటివే ప్రాదేశికుని విధులు. మండల సాధారణ పరిపాలన ఈ ఉద్యోగుల ఆధీనంలో ఉండేది. ప్రదేష్టి మండలాధికారి. ఈతని పని చాలవరకు మండలంలో పర్యటించడమే. మండల, గ్రామ అధికారుల చర్యలనుగూర్చి ప్రధాన కరగ్రాహికి (సమాహర్త) వార్తలు, నివేదికలు పంపవలె. న్యాయ నిర్వహణ హోదాలో ముగ్గురు ప్రదేష్టులు ధర్మాసనంగా ఏర్పడి చట్ట ధిక్కారం చేసినవారిని విచారించవచ్చు. ముగ్గురు ప్రదేష్టులుగాని, ముగ్గురు మంత్రులుగాని ఈ పని నిర్వహించవచ్చునని అర్థశాస్త్రం చెబుతున్నది. ఇది కేవలం పాలనా నిర్వహణలోని చర్యగా భావించవచ్చు. కొన్ని ప్రాంతాలలో మంత్రులు, మరికొన్ని ప్రాంతాలలో ప్రదేష్టులు సులభంగా లభ్యమౌతారు. మంత్రుల శ్రేణిలో చేర్చడంవల్ల ప్రదేష్టులది ఉన్నతమైన హోదా అని తెలుస్తున్నది. తీవ్రమైన నేరాలు మాత్రమే వీరి ముందుకు వచ్చేవని స్పష్టంగా తెలుస్తుంది. చిన్న నేరాలను పరిస్థితులను బట్టి రాజుకులు లేదా నగర న్యాయాధిపతులు విచారించేవారు. అధ్యక్షుల చర్యలను,

చిన్న ఉద్యోగుల చర్యలను ప్రదేష్టి తనిఖీ చేయవలె. ఇదికూడ ప్రదేష్టి ఉన్నత పదవిని సూచిస్తున్నది. రాజ్యస్వాన్ని పర్యవేక్షించడం, మండలంలోని నగర గ్రామీణ ప్రాంతాలలో రాజ శాసనాలను అమలుపరచడం, శాంతి భద్రతలు పరిరక్షించడం అనేవి సంగ్రహంగా ప్రదేష్టి విధులు.

ప్రాదేశికుని క్రింది ఉద్యోగి రాజుకుడు. కొందరు రచయితలు వీరిహోదాలను వ్యత్యస్తం చేసినారు. లక్షల ప్రజలకు రాజుకుడు అధిపతి అని వర్ణించినంతమాత్రాన అతడు కేంద్ర ప్రభుత్వ మంత్రి అని అర్థం కాదు. స్థానిక పాలనలో బాధ్యతగల ఉద్యోగి అని మాత్రమే ఆ వర్ణన సూచిస్తున్నది. తన ఆధీనంలోని ప్రాంతాలలో ఐదేండ్లకొకమారు పర్యటించి యావత్పరిపాలనను పర్యవేక్షించడం ప్రాదేశిక విధులలోనిది. ఈ పర్యటనలలో యుక్త రాజుకులు అతణ్ణి అనుసరించి వెళ్ళేవారు. యుక్త, రాజుక, ప్రాదేశిక అనే క్రమంలో ఈ ఉద్యోగులను చెప్పినారు. సాధారణంగా మొదటివారుగాని, చివరివారుగాని వరిష్ఠులై ఉంటారు. యుక్త చిన్న ఉద్యోగి అని మనకు తెలుసు. వరిష్ఠోద్యోగిని పట్టిక మధ్య చెప్పడం సాధారణంగా జరుగదు. ఉద్యోగ ధర్మాన్ని అట్టి ఆలోచించినప్పటికీ పై పట్టికలోని ముగ్గురిలో ప్రాదేశికుడే వరిష్ఠుడైనట్లు స్పష్టమౌతుంది.

నాలుగోస్తంభ శాసనంలో రాజుకుడు కొన్ని లక్షల ప్రజలకధిపతి అని ఉంది. తాను ఆధిపత్యం వహించిన ప్రజలతో రాజుకునకు ఉండవలసిన సంబంధాన్ని గురించి ఆ శాసనం సలహా ఇస్తున్నది. ఈ సలహా ముఖ్యంగా శిక్షలు, పారితోషికాలు ఇవ్వడానికి సంబంధించినది. రాజుకులు రాజ్యస్వ ఉద్యోగులుగా ఉంటూ న్యాయ నిర్వహణాధికారం వహించినవారు. న్యాయ నిర్వహణలో సాధారణంగా కొద్దిమంది వ్యక్తులతో మాత్రమే వ్యవహరించడం జరుగుతుంది. సాధారణంగా పరిపాలనలో లక్షలాది ప్రజలతో సంబంధ మేర్పడుతుంది. లక్షలాది ప్రజలతో సంబంధించినవారు రాజుకులు అనే వాక్యంవల్ల పరిపాలనలో వారి బాధ్యత చాల ముఖ్యమైనట్లు తెలుస్తుంది. అంతేకాక చక్రవర్తి అభిలషితాన్ని తెలిసిన రాజోద్యోగులు రాజుకులు. అందుచే వారిపట్ల విధేయులై ఉండాలని ఈ శాసనం ప్రజలను శాసిస్తున్నది. రాజుకులు నిజంగా వరిష్ఠులైన ఉద్యోగులే అయితే రాజు బహిరంగంగా అట్లా శాసించవలసిన అవసరం ఉండేదికాదు. గ్రామ ప్రజల శ్రేయోభివృద్ధికై (జనపదహిత సుఖాయే) నియమితులైనందున రాజుకుల పని గ్రామ ప్రాంతాలకు మాత్రమే పరిమితము. తమ విధి నిర్వహణలో రాజుకులు ధర్మాచరణను గురించి ప్రజలకు బోధించవలె.

రాజుకులు న్యాయనిర్ణయం జరుపవలెనని అశోకుడు తన ఇరవై యేడో పాలనా సంవత్సరంలో శాసించడం అంతకు పూర్వం రాజుకుల కంటే ఉన్నతోద్యోగులు ఆ విధిని నిర్వహించినట్లు సూచిస్తున్నది. ఈ కొత్త విధానంవల్ల రాజుకులకు ఎక్కువ అధికారాలు సంక్రమించినవి. న్యాయ నిర్ణయాలను రాజుకులు ఉన్నతాధికారులకు నివేదించనక్కరలేదు. అందుచేత న్యాయనిర్వహణ చురుకుగా సాగింది. మరణశిక్ష విషయంలోకూడ రాజుకులకు విజ్ఞాపన చేసుకోవచ్చు. సందేహాస్పదమైన నేరాలలో ఉన్నతాధికారులకు అంటే ప్రాదేశికులకు నివేదించవచ్చు. ఈ విధంగా రాజుకుని న్యాయనిర్వహణ విధుల స్వభావాన్ని, వాని పాలనా చర్యలను గూర్చిన యావత్సమాచారాన్నిబట్టి ఆలోచిస్తే రాష్ట్రపాలనలో వారికిగల ప్రాముఖ్యం స్పష్టమౌతుంది.

పంట పొలాలను పరిశీలించి కర నిరూపణచేసే ఉద్యోగులు రాజుకులే అనడంలో సాక్ష్యాధారాలపట్ల అంగీకారం ఉంది. మౌర్యపాలనా విధానంలోని రాజుకులు, జాతక గాథలలోని రజ్జగాహకులు ఒక్కరే అని చారిత్రకులు నిర్ణయించినారు. రజ్జువు (తాడు) ధరించి పన్నుచెల్లించే కర్షకుల పొలాలు కొలిచే అధికారియే రాజుకుడు లేక రజ్జుగాహకుడు. క్షేత్ర ప్రమాణమును, గుణమును బట్టి వీరు భూమి పన్ను నిర్ణయించేవారు. ఉత్పత్తిలో ప్రభుత్వం వాటాను మరొక ఉద్యోగి నిర్ణయించేవాడు. రాజుకుడనే ఉద్యోగి అర్థశాస్త్రానికి సయితం పరిచయమే. రాజస్వ ఆధారాలకు సంబంధించిన ఉద్యోగిని 'చొరరజ్జుకుడ'ని వర్ణిస్తున్నది. 'ఆగరనోమాయ్' అంటే అంగడి ఉద్యోగులుగా మెగస్తనీసు పేర్కొన్నది రాజుకులనే అయి ఉండవచ్చు. వారి విధులను అతడీ విధంగా వర్ణించినాడు: "కొందరు నదులను పర్యవేక్షించేవారు. ఈజిప్టులోవలె భూములను కొలిచేవారు. అందరికీ నీరు సమంగా అందేటట్లు పెద్ద కాలువలనుండి పంట కాలువలలోకి నీరు ప్రవహించే తూములను పరిశీలించేవారు. వేటకాండ్రమైకూడ వీరే ఉద్యోగులు. వారి వారి నేరాలను బట్టి శిక్షలు, యోగ్యతలనుబట్టి పారితోషికాలు ఇచ్చే అధికారం కూడ వీరిదే. వీరు పన్నులు వసూలు చేసేవారు. అడవులు నరికేవారు. వడ్రంగులు, కమ్మరులు, గని పనివాండ్రు మొదలుగా భూమికి సంబంధించిన వృత్తుల వారిని పర్యవేక్షించేవారు. బాటలు నిర్మించి పది ప్రమాణాలకు ఒకచోట ఉపమార్గాలను, దూరాలను తెలుపుతూ స్తంభాలు నాటేవారు."

రాజుకుల విధులను గురించి ఒక పూర్తి శాసనాన్ని అశోకుడెందుకు వ్రాయించినాడో అర్థమౌతుంది. స్థానిక పాలనకు వారు వెన్నెముకవంటివారు. తగాదాల పరిష్కారంలో వారికెక్కువ అధికారాలు అశోకుడివ్వడం హేతుబద్ధమైన చర్యగా కనిపిస్తుంది. రాజుకుల ముందుకువచ్చే తగాదాలలో చాలభాగం వ్యవసాయ సమస్యలే. కరనిరూపణను, పన్నుల

మినహాయింపును గూర్చిన తగాదాలు, కర్షకులమధ్య పాలకుల మధ్య వచ్చే భూమి తగాదాలను, నీటితగాదాలను, పచ్చికమేత తగాదాలను రాజుకులు పరిష్కరించేవారు. ఏ తగాదా అయినా తీర్మానానికై ప్రాదేశికునకు పంపవలసివస్తే సత్వర పరిష్కారం సాధ్యం కాదు. ఏ తగాదాకైనా ప్రత్యేక పాలనా బాధ్యత వహించేది రాజుకుడు. అందుచే అవసరమైనపుడు అతడే తగాదాను ప్రాదేశికునకు నివేదించవలె. కాబట్టి రాజుకుని అధికారాన్ని పెంచడమే సంతృప్తికరమైన చర్య. అయితే దీనివల్ల గ్రామీణ ప్రజలపట్ల రాజుకుడు దౌర్జన్యంగా వ్యవహరించే ప్రమాదం ఉంది. అశోకుడీ ప్రమాదాన్ని గుర్తింపకపోలేదు. అయినప్పటికీ వారి అధికారాలను పెంచడానికే అశోకుడు నిర్ణయించడానికి మరొక కారణం కూడా ఉంది. తన పాలనాకాలం ప్రారంభంలో కొనసాగించగలిగిన వ్యక్తిగతాధికార స్థాయిని ఉత్తరార్థంలో అశోకుడు నిలుపుకొనలేక పోయినాడు. అందుకే కొన్ని శాఖలలో వికేంద్రీకరణ విధానాన్ని అనుసరించడానికి అశోకుడు నిర్ణయించినట్లు కనిపిస్తుంది. తత్ఫలితంగానే రాజుకుల అధికారం పెరిగింది.

స్థానిక పాలనపై పర్యవేక్షణ ప్రాదేశికుని ప్రధానమైన విధి. వీరు రాజుకులు అధికారం దుర్వినియోగం చేయకుండా ప్రాదేశికులు నిరోధంగా పనిచేసేవారు. ప్రాదేశిక, రాజుక, యుక్త అనే ముగ్గురు ఉద్యోగుల బృందం అయిదు సంవత్సరాల కొకమారు పర్యటించ వలసిందని తన పదమూడో పాలనా సంవత్సరంలో మరింత స్పష్టంగా అశోకుడాదేశించినాడు. రాజుకుడు తన పరిపాలన న్యాయనిర్వహణల గూర్చిన నివేదికను ప్రాదేశికునకు సమర్పించడమే ఈ పర్యటన ఉద్దేశము. ప్రాదేశికుని నివేదికను యుక్త నమోదు చేయవలె. రాజుకుని సమక్షంలో జరిగినందున తనిఖీ విలువ పెరిగేది. నగర న్యాయపాలనను తనిఖీచేసే మహామాత్తులు రాజుకుని న్యాయ నిర్వహణాధికారాలను తనిఖీచేసేవారు. ఈ మహామాత్తుల నివేదికను యుక్తులు తయారుచేసి మంత్రిపరిషత్తుకు సమర్పించేవారు.

మూడో శిలాశాసనం పేర్కొంటున్న యుక్తులు క్రింద ఉద్యోగులుగా కనిపిస్తున్నారు. పూర్వ రచయిత లీమాటను అనేక రకాలుగా అనువదించినారు. వీరివి చాలవరకు గణాంక, కార్య నిర్వహణాదిక విధులే. వరిష్ఠోద్యోగుల నిర్ణయాలను నమోదుచేసి, అవి ఆధారంగా మంత్రులకు, మంత్రిపరిషత్తుకు నివేదికలను తయారుచేయడానికై వీరు రాజుకులను, ప్రాదేశికులను అనుసరించి వెళ్ళేవారు. 'యుక్త',ను అర్థశాస్త్రం గణకునిగా పేర్కొంటూ నిధుల దుర్వినియోగాన్ని నివారించటానికై శాఖాధ్యక్షులు యుక్తులతోను, ఇతర ఉద్యోగులతోను కలిసి పనిచేయవలెనని సూచిస్తున్నది. పంచవర్ష యాత్రలలో రాజుక, ప్రాదేశికులను అనుసరించి వెళ్ళడానికి యుక్తులు గణకులై ఉండడం మరొక కారణం.

జిల్లా, గ్రామ స్థాయిలకు మధ్యస్థమైన మరొక పాలనా స్థాయి ఉండేది. అది అయిదు లేదా పది గ్రామాలు కలిసి యేర్పడిన విభాగం. గోప, స్థానక అనే ఇద్దరు ముఖ్య ఉద్యోగులు ఈ విభాగ పరిపాలనను నిర్వహించేవారు. గోప విభాగానికి గణకుడు గ్రామం పొలిమేరలను నిర్ణయించడం, వేర్వేరు భూములను భవనాలను దానధర్మాలను నమోదుచేయడం, వ్యవసాయం పన్నుల మినహాయింపు ఇవ్వడం గోపుని ఉద్యోగ ధర్మాలు. పన్ను చెల్లించే స్తోమత, వృత్తులు, వయస్సును అనుసరించి గ్రామ జనాభా లెక్కలు కూడ అతడే తయారుచేసేవాడు. ప్రజల ఆదాయ వ్యయాలు సయితం నమోదు అయ్యేవి. ప్రతి గ్రామంలోని పశుసంపదను కూడ లెక్క వ్రాసి ఉంచేవారు. స్థానకుడు పన్ను వసూలుచేసేవాడు. ఇతడు ప్రాదేశికుని క్రింది ఉద్యోగి. గోప, స్థానకుల కార్యక్రమాలను నియమిత కాలాలలో వరిష్ఠోద్యోగులు తనిఖీ చేసేవారు. నేటి మాండలిక కరగ్రాహికి (District Collector) సమానం ప్రాదేశికుడు. సహాయ కరగ్రాహికి సమానం స్థానకుడు. ఈ ఉభయ వర్గాల ఉద్యోగులు ప్రధాన కరగ్రాహి అయి సమాహర్త అంతిమాధికారానికి లోబడి పనిచేసేవారు.

ప్రతి గ్రామానికి ఒక ఉద్యోగిబృందం ఉండేది. వీరు గోపునకు బాధ్యులు. గ్రామ వృద్ధులనుండి గ్రామాధికారిని ఎన్నుకునే వారనడంలో సందేహం లేదు. ఈతడు పన్ను వసూలు, క్రమశిక్షణ, శాంతిభద్రతల రక్షణ మొదలుగా గ్రామానికి సంబంధించిన అంశాలను పర్యవేక్షించేవాడు. చిన్న గ్రామాలలో గ్రామాధికారి ఒక్కడే వ్యవహర్త అయి ఉండవచ్చు. పెద్ద గ్రామాలలో పాలనా నిర్వహణలో అతనికి గణక, లేఖక వంటివారు తోడ్పడి ఉంటారు. వీరు పాక్షికోద్యోగులు, వీరికి పన్నుల మినహాయింపు రూపంలో జీతాలు చెల్లించేవారు. రాజు నియమించిన సార్వకాలికోద్యోగులకు భూమి రూపంలో చెల్లించేవారు. ఈ భూమిని విక్రయించడానికిగాని, తనఖా ఉంచడానికిగాని హక్కులేనందున భూమి అతని సొంతం గాదు. ఫల సాయానికి మాత్రమే అతనికి హక్కున్నది.

పాలనా వ్యవస్థ వేరువేరు స్థాయిలలో ఇతర ఉద్యోగులు వ్యవహరించేవారు. బహుశా యుక్తుల శ్రేణిక సమానమైన 'పులిసాని' అనే ఉద్యోగులుండేవారు. వీరు ఆధునిక పౌరసంబంధాల ఉద్యోగులవంటివారు. రాజే వీరిని తనప్రతినిధులుగా నియమించేవాడు. ప్రజాభిప్రాయాన్ని వీరు రాజుకు తెలియజేసేవారు. తన విధానాలను రాజ్యం మారుమూలల ప్రజలకు సయితం తెలియడానికి రాజు వీరి నుపయోగించేవాడు. ఉద్యోగ స్వభావాన్ని బట్టి వీరు భిన్న శ్రేణులలో ఉన్నట్లు తెలుస్తుంది. వీరిని మూడు శ్రేణులలో నియమించినట్లు అశోకుడు చెప్పుకొన్నాడు. రాజుకు చాల సన్నిహితంగా ఉండి విధాన నిర్ణయాలలో

ఉన్నత శ్రేణి ఉద్యోగులు తోడ్పడేవారు. పులసానితో కలసి 'పట్టివేదకులు' పనిచేసేవారు. వీరు ప్రత్యేక వార్తా నివేదకులు. శాసనాలు వీరిని సయితం పేర్కొంటున్నాయి. ఏ క్షణంలోనైనా వీరు రాజును దర్శింపవచ్చు. వీరు చేసిన ప్రజాభిప్రాయ నిరూపణను రాజు పూర్తిగా విశ్వసించేవాడు. పులసాని, పటివేదకులు ఉభయులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కొలికిపూసగా వ్యవహరించి ఉండవలె. అర్థశాస్త్రం పేర్కొంటున్న గూఢచారి (చార, గూఢపురుష) దళంతో పటివేదకులను పోల్చవచ్చు. కాని అశోకుని గూఢచారి దళం కౌటిల్యుడు భావన చేసినంత క్లిష్టమైనదికాదు. కౌటిల్యుని రచనలో గూఢచారి వ్యవస్థకు చాల ప్రాముఖ్యం ఉంది. సామాన్య పౌరుల వేషంలో దేశం నలుమూలలకు అన్ని జీవితరంగాలలోను గూఢచారులను పంపేవారు. మంత్రులను సయితం గూఢచారులు కనిపెట్టి ఉండేవారు. ఇదిలాఉండగా తాను నివేదకులను, ప్రతినిధులను నియమించినట్లు అశోకుడు తన శాసనాలలో అంగీకరించినాడు. వీరు ఉన్నత శ్రేణికి చెందిన సంచార ద్రష్టలుగా వ్యవహరించేవారు. ప్రజలకు, పాలనాయంత్రాంగానికి వీరు సుపరిచితులు. దేశపర్యటన సాగిస్తూ ప్రభుత్వ వ్యవస్థను పరీక్షిస్తూ రాజుకు వీరు నివేదికలు సమర్పించేవారు. భారతేతర సామ్రాజ్యపాలనా వ్యవస్థలకు సయితము ఇట్టి ఉద్యోగులు తెలియకపోలేదు. ఆఖ్ఖిమీనిర్లు తమ సామ్రాజ్యంలోని ప్రతిరాష్ట్రాన్ని తనిఖీ చేయడానికై ప్రతి సంవత్సరం ఒక అధికారిని పంపేవారు. రాజచక్షువులుగా, రాజదూతలుగా వీరు పరిచయులు. వీరి చర్యలు పరిపాలనపై రాజుకు అదనపు అదుపునిచ్చేది. ఇంతకంటే సమర్థమైన విధానాన్ని చార్లిమేన్ చక్రవర్తి రూపొందించినాడు. 'మిస్‌పీ' అనే ఇద్దరు ఉద్యోగులను దేశంలో పర్యటించడానికి పంపేవాడు. వీరిలో ఒకరు లౌకిక ప్రతినిధి మరొకరు చర్చి ప్రతినిధి. ఒకరిపై ఒకరు అవరోధంగా వీరు ఇద్దరు జంటగా పర్యటించేవారు. క్రింది ఉద్యోగులలో ఎవరైనా అసమర్థులుగా కనిపిస్తే వారిని తొలగించే అధికారం వీరికుంది. పౌరసభలలో రాజశాసనాలను తప్పనిసరిగా చదివించేవారు. అవసరమైనచోట లాటిన్ భాషనుండి ప్రాంతీయ భాషలోకి శాసనాలను అనువదించేవారు. అదే విధంగా అశోకుని శాసనాలను పులిసాని బహిరంగంగా చదివేవారు. మిస్‌పీలోని మతాధికారి భిక్షుకుల, భిక్షణుల కార్యక్రమాలను పరిశీలించేవాడు. లౌకికాధికారి పరిపాలనకు సంబంధించిన న్యాయ ఆర్థిక పత్రాలను తనిఖీ చేసేవాడు. చార్లిమేన్ కాలంలో దినదినాభివృద్ధి అవుతున్న స్థానిక ప్రభువుల భూస్వామ్య అధికారంపై ప్రతిరోధంగా మిస్‌పీ వ్యవహరించేవారు. అశోకుని విషయంలో అతని ప్రతినిధులు రాష్ట్ర పాలకుల దురాశను అరికట్టేవారు.

తనిఖీలు తరచుగా జరగడం, గూఢచారులుండడం వల్ల అశోకునిది పుంజీ రాజ్యం అనే భావనరావచ్చు. కాని ప్రభుత్వ నిర్వహణలో రాజుకు సహాయంగా ఎన్నికైన ప్రతినిధుల సభలేనందున ప్రజాభిప్రాయాన్ని తెలిసికోవడానికి పై విధానాలను అనుసరించవలసి వచ్చింది. జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా ఉపయోగించినపుడు పై సాధనాలు ఆశించిన ఫలితాల నియ్యవచ్చు. తమ ఇతర బాధ్యతల నిర్వహిస్తూ ఈ ఉద్యోగులు విస్తృత ప్రచార యంత్రంగా కూడ అశోకునకు ఉపకరించినారు. ప్రజానీకానికి ధమ్మ విధానాన్ని వివరించి, ఆ విధానం పట్ల వారి దృష్టిని నిరూపణ చేసేవారు. అశోకుని శాసనాలలో కొన్నింటికి ధమ్మంపట్ల ప్రజల దృష్టి ప్రాతిపదిక అయి ఉండవచ్చు.

వివిధాంశాలను పర్యవేక్షణ చేసి, లేదా పరిశీలించి రాజుకుగాని, స్థానిక న్యాయాధీశుని వంటి ఉన్నతోద్యోగికి గాని నివేదికలు సమర్పించే ఉద్యోగులను ఆరోవర్గంగా మెగస్తనీసు పేర్కొన్నాడు. ఈ భాగాన్ని డియోడరస్ ఉల్లేఖిస్తూ ఈ వర్గానికి ఎపిస్కోపాయ్ అనే పదాన్ని ఉపయోగించినారు. ఈ వర్గాన్ని గురించి స్ట్రాబో కూడ పేర్కొన్నాడు. కాని ప్రధానంగా వీరు సైన్యాన్ని గణికలను పర్యవేక్షించేవారని, రాజుకు రహస్య నివేదికలు పంపేవారని వ్రాస్తూ వీరికి ఎఫొరాయ్ అనే పదాన్ని వాడినాడు. ఏరియన్ కూడా ఎఫొరాయ్ అనే పదాన్నే వాడినాడు కాని వీరు రాజుకు కాని, స్వీయపాలనా ప్రాంతాలలోని న్యాయాధీశులకు గాని నివేదికలు పంపుతారని వ్రాసినాడు. పూర్వ రచయితలలో పెక్కుమంది వీరు గూఢచారులలో ఒక వర్గమని వాదించినారు. కాని మూలంలోని విషయాన్ని బట్టి ఆలోచిస్తే గ్రీకులు వాడిన మాటకు ఈ రచయితలు చేస్తున్న వ్యాఖ్యానం అతిశయోక్తి అవుతుంది. ఆ మాటల శబ్దార్థం పర్యవేక్షకుడు, లేదా అవేక్షకుడనే కాని గూఢచారి అనికాదు. రాజుకు రహస్య నివేదికలు పంపవలెనన్నంత మాత్రాన వీరు గూఢచారి శాఖకు చెందినవారు అని అర్థం కాదు. నివేదికలను ప్రస్తావించడాన్ని ఇంతకంటె సబబుగా వ్యాఖ్యానించవచ్చును. రాజును నేరుగా కలుసుకోడానికి వారికి వీలుందని ఉద్యోగి బృందంతో ప్రమేయం లేకుండా మార్గాంతరాల ద్వారా నేరుగా వారి నివేదికలు రాజుకు చేరే అవకాశం ఉందని అర్థం చెప్పవచ్చు. ప్రజల నుండి గూఢచారులను ఒక వర్గంగా ప్రత్యేకించడం సమంజసం గాదు. గూఢచారులెవరో వారి చర్యలేమో ప్రజలందరికీ తెలిసినప్పుడు గూఢచారులను నియమించడంలో గల ఆశయానికి భంగం వాటిల్లుతుంది.

మంత్రి మండలి సభ్యులకంటె ఆరోవర్గం ఉద్యోగులు హోదాలో తక్కువ. వీరు అర్థశాస్త్రం పేర్కొన్న వేరు వేరు శాఖలను పర్యవేక్షించే అధ్యక్షులతో సమానులు. ప్రత్యేకించి తమ క్రింద ఉన్న శాఖలు సమర్థంగా పనిచేయడానికి వీరు బాధ్యులు. తమ విధులు

నిర్వహిస్తూ రాజుకుగాని, ఉన్నతాధికారులకు గాని వీరు నివేదికలు పంపవలె. ఇది అసాధారణ విషయమేమీ కాదు. అర్థశాస్త్రం చెబుతున్న గూఢచారి వ్యవస్థకు ఈ ఆరో వర్గానికి పోలికలేదు. సమాచార సేకరణకై అనేక వేషాలలో గూఢచారులను నియమించడం పరిచయమున్న ఆచారం మాత్రమే కాదు. రాజ్యపాలనలో అది సర్వసాధారణాంశం. కాని గూఢచారులనెక్కడా ప్రత్యేక వర్గంగా పరిగణించలేదు. గూఢచార వ్యవస్థ పాలనావిధానంలో అంతర్భాగం. సమాజంలోని భిన్న అంతరువుల నుండి అనాథ శిశువులు, బ్రాహ్మణ వితంతువులు మొదలు శూద్ర స్త్రీలు, పలురకాల ప్రభుత్యోద్యోగులు, మొదలగు వారినుండి గూఢచారులను నియమించేవారు.

గూఢచారులు పర్యవేక్షకులుగా పనిచేస్తున్నట్లు ఎక్కడా చెప్పలేదు. ఏ వర్గంమీద గూఢచారి పని సాగించాలో వారిలో పూర్తిగా కలిసిపోవడమే గూఢచారులు చేయవలసిన పని. ఆ వృత్తిలోని సభ్యులతో తాదాత్మ్యం పొందినపుడే వారికి సంబంధించిన అంశాలతో అత్యంత సాన్నిహిత్యం లభిస్తుంది. అందుచేతనే ఆషాఢభూతి శిష్యులు, సర్వసంగ పరిత్యాగులు, గృహస్థులు, వర్తకులు, బైరాగులు, విద్యార్థులు, సన్యాసినులు, వ్యభిచారులు మొదలైన వేషాలలో గూఢచారులు పనిచేయాలని సూచించినారు. ఇన్ని రకాల గూఢచారులున్నపుడే సమాజంలోని భిన్న విభాగాలలో పనిచేయగలుగుతారు. గూఢచారి పనిలో రహస్యవర్తనపై నొక్కు ఉండడం సహజం. గూఢచారులు ప్రజలకు తెలియకపోవడమే గాదు; వారు పరస్పరం తెలిసి ఉండకూడదు. గూఢచారి వ్యవస్థలోని అధికారులకు కార్యసాధకులైన గూఢచారులు తెలియకూడదు. తమ సూచనలను అధికారులు లిఖితపూర్వకంగానే గూఢచారులకు అందజేయవలె. స్వదేశంలో నేర పరిశోధన ప్రజాభిప్రాయ సేకరణకు మాత్రమేగాక గూఢచారులను విదేశాలకు కూడ పంపేవారు. విదేశ గూఢచారులు స్వదేశంలో పనిచేస్తున్నారనేది అందరికి తెలిసిన అంశమే.

నగర పరిపాలన ప్రత్యేకంగా ఒక ఉద్యోగి పరంపర ఉండేది. నగరంలో న్యాయనిర్వహణ శాంతి భద్రతల రక్షణల బాధ్యత నాగరకునిది. అందుచే నగరానికి వచ్చిన ప్రతి ఆగంతకుడు నాగరకునికి నివేదించి తన పేరు నమోదు చేసుకోవలె. ప్రత్యేక అనుమతి ఉన్నవారు మినహా ఇతరులు నగరంలో రాత్రులందు సంచరించరాదని నిషేధపు ఉత్తర్వులు అమలు జరిగేది. నగర పారిశుద్ధ్యం కూడ నాగరకుని బాధ్యతయే. కొన్ని నగరాలలో దారు నిర్మాణాలు అధికంగా ఉన్నందున సర్వదా అగ్ని ప్రమాద భయం బాధిస్తుండేది. అగ్నిని గుర్తించిన జాగ్రత్తలను నాగరకుడు పర్యవేక్షించేవాడు. తమ వృత్తిలో నిప్పుతో పనిచేసే కమ్మరులు మొదలైన వారందరు నగరంలో ఏదో ఒక ప్రత్యేక ప్రాంతంలో

నివసించే ఏర్పాటు చేసేవాడు. క్షామ సమయాలలో ధాన్యాగారాల నుండి ధాన్యాన్ని పంపిణీ జరిపే బాధ్యత వహించేవాడు. నాగరకునకు సహాయంగా గోప, స్థానిక అనే ఇద్దరు క్రింది తరగతి ఉద్యోగులుండేవారు. వీరిని గ్రామ ప్రాంత పాలనలో అదే పేర్లున్న ఉద్యోగుల ధర్మాలను పోలినవే. పది, ఇరవై లేదా నలభై ఇండ్ల లెక్కలను సేకరించడం స్థానికుని కర్తవ్యం. రావలసిన ప్రాంతాలనుండి సాధారణ పన్నులను వసూలు చేసేవారు. ముఖ్యమైన విషయాలను గురించి గోపునికిగాని, స్థానికునకుగాని ప్రజలు ఫిర్యాదు చేసేవారు. వారు నాగరకునకు నివేదించేవారు.

అశోకుని శాసనాలు 'నగలవియోహాలక మహామాత్తు'లను గురించి న్యాయ నిర్వహణాధికార హోదాలో ఎక్కువ ప్రస్తావిస్తున్నాయి. ఈ మహామాత్తులు న్యాయనిర్వహణ జరిపేవారని తెలుస్తున్నందున ఇది నాగరకుని గురించిన ప్రస్తావన కాదు. న్యాయపాలనలో రాజకుమారోదయం వంటి శుభ సందర్భాలలో ఖైదీలను విడిపించడం మాత్రమే నాగరకడు నిర్వహించే బాధ్యత. నగర వియోహాలక మహామాత్తులు నాగరకుని సాధారణ పరిపాలనకు లోబడి పనిచేసే న్యాయ నిర్వహణాధికారులవలె కనిపిస్తున్నారు. ప్రత్యేక నేరాల విచారణ సందర్భంలో ముఖ్యంగా బంధ విమోచనం చేయదగిన నిర్బంధితులను నిర్ణయించడం వంటి కార్యక్రమాలలో నాగరకుడు మహామాత్తుల పనిలో జోక్యం కల్గించుకొని ఉండవచ్చు. నగర వియోహాలక మహామాత్తులు నేటి మేజిస్ట్రేటులను పోలి ఉండేవారు.

నగర పాలనను వర్ణిస్తూ ఇంతకంటె విపులమైన పద్ధతిని మెగస్తనీసు చిత్రించినాడు. అతని రచన ప్రకారం నగర ఉద్యోగులు ఆరు పంచాయితీలుగా ఏర్పడేవారు. మొదటి సంఘం పారిశ్రామిక కళలకు సంబంధించిన అంశాలను పరిశీలించేది. రెండో సంఘం విదేశీయుల వ్యవహారాలను పరిశీలించేది. అంటే విదేశీయులకు వసతి సౌకర్యాలు కల్పించడం, రహస్యంగా వారికి సాయపడుతున్న స్థానికులద్వారా విదేశీయులపై కన్నువేసి ఉంచడం ఈ సంఘం విధులు. విదేశీయులు దేశాన్ని విడిచివెళ్ళే సందర్భాలలో వారికి తోడుగా కొంతదూరం వెళ్ళవలె. విదేశీయులెవరైనా మరణిస్తే వారి ఆస్తిని వారి బంధువులకు అందజేయవలె. విదేశీయులు జబ్బు పడినపుడు వారికి వైద్య సదుపాయం కలిగించవలె. మూడవ సంఘం జనన మరణాలు సేకరించేది. ఈ సేకరణ జనాభా నిర్ణయానికి, పన్నులు వసూలుకు రెంటికి ఉపకరించేది. వర్తక వాణిజ్యాలకు సంబంధించినది నాలుగో సంఘం. తూకాలు, కొలతలు తనిఖీ చేయడం, బహిరంగ విక్రయాలు జరిపించడం ఒక్కొక్క వర్తకుడు ఒకే వస్తువులో వర్తకం చేసేటట్లు చూడడం ఈ సంఘం నిర్వహించే విధులు. ఒకటికంటే ఎక్కువ వస్తువులలో వ్యాపారం చేసేవారు రెండింతలు పన్నులు

చెల్లించవలె. వస్తువుల బహిరంగ విక్రయాలను పర్యవేక్షించేది ఐదో సంఘం. ఆరో సంఘం అమ్మకపు పన్ను వసూలుచేసేది. కొనుగోలు ధరలో ఈ పన్ను ఐదోవంతు ఉండేది.

పై సంఘాల ఉనికిని గురించి భారతీయ సాక్ష్యాధారాలు ముచ్చటించవు. అయితే మెగస్తనీసు పేర్కొన్న ఒక్కొక్క సంఘానికి సరితూగగల ఉద్యోగి అర్థశాస్త్రంలోని నగర పాలనోద్యోగుల పట్టికలో ఉన్నాడు. ప్రత్యేకించి పాటలీపుత్రంవంటి మహానగరాల పాలనలోని కొన్ని విభాగాల బాధ్యతలను వ్యక్తిగతంగా ఒక ఉద్యోగికంటె ఒక సంఘమే సమర్థంగా నిర్వహించగలుగుతుంది. పాటలీపుత్రం వంటి నగరాన్ని కొన్ని విభాగాలుగా చేసి ఆ విభాగాలన్నింటిలో ఒకేరకమైన పాలనా వ్యవస్థలను నెలకొల్పి ఉంటారు. ఒక్కొక్క విభాగంలోని ఉద్యోగులు సమిష్టిగా సమావేశమై కేంద్ర వ్యవస్థకు తమ నివేదికలందించి సమిష్టిగానే వారి సూచనలను గ్రహిస్తూ ఉండడం సంభవం. ఈ విధానాన్ని అర్థశాస్త్రం వివరింపకపోవచ్చు. కారణం అర్థశాస్త్రం మౌర్య పాలనా విధాన సమగ్ర వర్ణన కాదు. అది కేవలం సాధారణ పాలనా సూత్రాల పాఠ్య గ్రంథం మాత్రమే. ఆచరణలో మౌర్యులు అర్థశాస్త్రంలోని కొన్ని భాగాలను మార్పు చేశారనడంలోను అవసరమైనచోట అందుకు భిన్నంగా వ్యవహరించినారనడంలోను సందేహం లేదు. మెగస్తనీసు ఇచ్చినది పాటలీపుత్ర నగరపాలన వర్ణన మాత్రమే అయి ఉండవచ్చు. ఒక శాఖలో పనిచేస్తున్న భిన్న హోదాలుగల ఉద్యోగులను సమిష్టిగా దర్శించి వారందరు సమాన హోదాగల సంఘ సభ్యులుగా మెగస్తనీసు పొరపడి ఉంటాడని 'టిమ్మర్' పండితుడు సూచిస్తున్నాడు. వాస్తవానికి మెగస్తనీసు పేర్కొన్న సంఘాలు అర్థశాస్త్రంలో చెప్పిన వేరువేరు అధ్యక్షుల కార్యాలయాలకు సరిపోతున్నది. ఈ అధ్యక్షులకు క్రింది ఉద్యోగులు సహాయపడుతూ ఉండేవారు. ప్రతి కార్యాలయంలోను బహుశా ఒక అధ్యక్షుడు నలుగురు సహాయ ఉద్యోగులు ఉండి మెగస్తనీసును సంఘంగా భ్రమింపజేసి ఉండవచ్చు. ఈ ఊహ మెగస్తనీసు వర్ణనకు చెప్పదగిన అనేక వ్యాఖ్యానాలలో ఒకటి మాత్రమే.

మొదటి సంఘం పారిశ్రామిక కళలను పర్యవేక్షించేది. వీరు బహుశా నగరంలోని చేతి పనివారికి సంబంధించిన ఉద్యోగులై ఉంటారు. రెండో సంఘానికి సమానమైనది అర్థశాస్త్రంలో లేదు. కాని విదేశీయులపట్ల నాగరకుని విధుల వల్ల విదేశీయుల వ్యవహారాలు చూడడానికి ఒక ఉద్యోగి బృందం ఉన్నట్లు తెలుస్తుంది. విదేశీయులు సాధారణంగా రాజధానీ నగరాన్ని సందర్శిస్తారు. కాబట్టి ఆ ఉద్యోగి బృందానికి రాజధానీ నగరంలోనే పని యెక్కువ. విదేశీయులంటే భారతీయేతరులు మాత్రమేకాదు. సామ్రాజ్యంలో దూర ప్రాంతాలనుండి రాజధానిని దర్శించడానికి వచ్చేవారు సయితం ఆ వర్గంలోనే చేరుతారు.

అర్థశాస్త్రం సూచించినట్లు నగరవాసులను గురించి వివిధ వివరాలతో గూడిన చిట్టా తయారుచేసి ఉంచితే నగరవాసులు కానివారందరిని విదేశీయులుగా వర్గీకరించడం సులభం. దేశాన్ని విడిచి వెళ్ళేటప్పుడు వారికి తోడుగా మార్గంలో కొంతదూరం వెళ్ళవలసినవారే ముఖ్యమైన విదేశీయులు. వారి యోగక్షేమాలను చూచే నిమిత్తం నియుక్తులైన సహోద్యోగులు వారి చర్యలను పరిశీలిస్తారు అనే అంశము సమాచార సేకరణకై అనేక వేషాలలో గూఢచారులను నియమించవలెనన్న అర్థశాస్త్ర ఆంతర్యము ఒక్కటే. పాటలీపుత్రంలో మరణించిన విదేశీయుల ఆస్తిని వారి బంధువులకు ఈ సంఘం అందజేస్తుందనే మాట చాల ఆదర్శప్రాయంగా కనిపిస్తుంది. బహుశా ఆ బంధువులు మౌర్యసామ్రాజ్య ప్రాంతాలలో నివసిస్తున్నప్పుడే అట్టి చర్య సంభవమౌతుంది. ఈ సంఘం మరణించిన వారి దేహాలను ఖననం చేస్తుందని చెప్పడం వల్ల ఇది హైందవేతర విదేశీయులనే సూచిస్తున్నది. హిందువులలో మృతదేహాలకు దహన సంస్కారమే సాధారణము.

జనన మరణాలను నమోదుచేసి జనాభా లెక్కలు, నివేదికలు సేకరిస్తుందన్న మూడో సంఘం పైన చెప్పిన గోపుల విధులకు సరిపోతుంది. నాలుగో సంఘానికున్న బాధ్యతలు అర్థశాస్త్రంలో చెప్పిన వ్యాపార వాణిజ్యాలకు సంబంధించిన అధ్యక్షుల ధర్మాలకు సమంగా ఉన్నాయి. ఐదో సంఘం వాణిజ్యాధ్యక్షుని కార్యకలాపాలకు సమమైన పనులు నిర్వహించేది. పదోవంతు పన్ను వసూలుచేసే ఆరో సంఘం వేరు వేరు పన్నులు వసూలుచేసే స్థానికుని కార్యాలయానికి సూచన అయి ఉండవచ్చు.

నగరపాలనతో సంబంధం ఉన్న ఇతర ఉద్యోగులను మెగస్తనీసు తన స్మృతులు వ్రాసే సమయానికి మరిచిపోయి ఉండవచ్చు. లేదా వారిని నిర్లక్ష్యం చేసి ఉండవచ్చు. పాటలీపుత్రంలో నాగరకుడు ప్రధానోద్యోగి అనేది నిశ్చయం. కాని మెగస్తనీసు అతణ్ణి పేర్కొనలేదు. నగరపాలనను గురించి మెగస్తనీసు వ్రాసిన మూల రచన నష్టమై ఉండవచ్చు. ఆ పూర్తి రచనలో ఇతరోద్యోగులతోపాటు నాగరకుని ప్రసక్తికూడ ఉండి ఉంటుంది. కేంద్రాధిపత్యానికి ఉన్న ప్రాధాన్యంపై అర్థశాస్త్రం సర్వదా నొక్కు పెట్టింది. ఇట్టి కేంద్రీకరణకే మౌర్య ప్రభుత్వం సుముఖంగా ఉన్నదనడం నిశ్చయం. సాధారణంగా మెగస్తనీసు కుశాగ్రబుద్ధి అయిన పరిశీలకుడు. అట్టివాడు మౌర్య ప్రభుత్వంలో కేంద్రీకరణకుగల ప్రాముఖ్యాన్ని గమనించకుండా ఉండడు. అది పేర్కొనకపోవడం తన వ్యక్తిగత ఆదర్శాలను భారతీయ సంస్థలకు అంటగట్టినాడనడానికి మరొక నిదర్శనం.

అశోకుని శాసనాలు పేర్కొంటున్న ఇతర ఉద్యోగులలో ' అంతమహామాత్తు'లొకరు.

వీరు సరిహద్దు ప్రజలలో అనాగరక జాతులలో పనిచేసేవారు. మహామాత్తుల స్థాయిలో చెప్పినందున వీరు ఆయాప్రాంతాల పరిపాలన నిర్వహించి ఉండవచ్చు. అశోకుని విధానాన్ని సరిహద్దు ప్రజలకు అందించడం వీరి బాధ్యత. సరిహద్దు జాతుల విశ్వాసాన్ని చూరగొనడానికి ఈ విధానమొక ప్రయత్నం. పరస్పర విశ్వాసం వల్ల సరిహద్దు జాతుల విధేయతపట్ల నమ్మకం ఏర్పడుతుంది. అంత మహామాత్తులు సరిహద్దు జాతులలో తనయందు విశ్వాసం కలిగించడానికి కృషి చేయాలని అశోకుడు ఆశించినాడు. అంతేకాక సరిహద్దు జాతులు తన బిడ్డలవంటివారని, వారితో తనకున్నది పైతృకమైన సంబంధమని నొక్కిచెబుతూ తన పాలనా విధానానికి సరిహద్దు ప్రజలలో ధర్మప్రచారానికి ముడిపెట్టినాడు. ధర్మ ప్రచారం కూడ అంతమహామాత్తుల విధులలోనిదే.

పొరుగు రాజ్యాలలో మానవులకు, జంతువులకు వైద్యకేంద్రాల నిర్మాణం తన ప్రోత్సాహంవల్లనే జరిగినట్లు శాసనాలలో అశోకుడొకచోట చెప్పుకొన్నాడు. దక్షిణ సరిహద్దు ప్రజలలో కూడ అదేవిధంగా జరిగింది. సరిహద్దు ప్రజలకు సంబంధించినంతవరకు ఇట్టి వ్యవహారాలలో అంతమహామాత్తులు మధ్యవర్తి ఉద్యోగులుగా వ్యవహరించి ఉంటారు. దక్షిణ సరిహద్దు రాజ్యాలతో అశోకునకున్నంత సన్నిహిత సంబంధాలు గ్రీకు రాజ్యాలతో లేవు. అందుచేత గ్రీకు రాజ్యాలు అశోకుని రాయబారులను అంగీకరించి ఉండవచ్చు. సరిహద్దు రాజ్యాలకు ధర్మసూత్రాలతో పరిచయం చేయడంతోపాటు సరిహద్దు ప్రజలు మౌర్య అధికారంపై తిరుగుబాటు చేయకుండ చూడటం అంతమహామాత్తుల బాధ్యత. ప్రత్యేకంగా ఈ పనికై రాజు నియమించిన 'అయుతికే' అను ఉద్యోగులు అంత మహామాత్తులతో సహకరించేవారు. యుక్త, అయుతిక అనే మాటలలోని సామ్యం వారొక వర్గానికి చెందిన ఉద్యోగులని సూచిస్తున్నది. శాసనాలలోని అంతమహామాత్తులు అర్థశాస్త్రంలోని అంతపాలురు ఒకరే అయి ఉండవచ్చు. అంతపాలురు రహదారి సుంకాలను పర్యవేక్షించే ఉద్యోగులు. ప్రతి రాష్ట్రానికి అంతపాలురు ఉన్నారనడంలో సందేహం లేదు. ఒక్కొక్క రాష్ట్రంలో జిల్లా మారినపుడెల్లా రహదారి సుంకం చెల్లించవలసి ఉంటుంది. కాని రహదారి సుంక గృహాలు మాత్రం సామ్రాజ్య సరిహద్దులలోనే ఉండి ఉండవలె. ఈ రహదారి సుంకాల వసూలుకూడ అంతమహామాత్తుల విధే అయి ఉంటుంది. బహుశా వారు సుంకాలు వసూలుచేసే ఉద్యోగులపై పర్యవేక్షణ జరిపేవారు. సుంకాధ్యక్షుడు వీరికి బాధ్యుడై పనిచేసేవాడు.

సమకాలిక సమాజంలో స్త్రీలు హీనస్థితిలో ఉన్న కారణం చేత స్త్రీల సంక్షేమం కోసం ప్రత్యేక మహామాత్త వర్గాన్ని నియమించవలసిన అవసరాన్ని అశోకుడు గుర్తించాడనేది

సంభవము. ఈ ఉద్యోగులకు వాడిన మాట ఇథీజ్జక్క మహామాత్తులు. అక్షరతః ఈ మాటకు స్త్రీ అధ్యక్షులు, పర్యవేక్షకులు అని అర్థం. ఈ ఉద్యోగులకు గణికాధ్యక్షులకు సంబంధాన్ని కొందరు చరిత్రకారులు సూచిస్తారు. కేవలం నగర గణికల పర్యవేక్షణకు మహామాత్త స్థాయిలో ఉద్యోగుల నియామకం సంభవం కాదు. ఈ మహామాత్తల విధి నిర్వహణకాలంలో చాల భాగం రాజాంతఃపురంలోనే గడిచిపోయేది. రాజాంతఃపురాలు ప్రత్యేక ఉద్యోగి బృందాలను నియమించవలసినంత పెద్దవిగా ఉండేవని అశోకుని శాసనాలవల్ల స్పష్టమౌతున్నది. పాటలీపుత్రంలోను. ఇతర ప్రాంతాలలో ఉన్న తన నివాసాలలోను, తన సోదరుల, సోదరీల ఇతర బంధువుల నివాసాలు మొదలైన అనేకచోట్ల ధమ్మ మహామాత్తులు పనిచేస్తున్నారని అశోకుడు పేర్కొన్నాడు. అంతఃపుర వ్యవస్థా నిర్వహణకు బహుశా ప్రత్యేక ఉద్యోగి బృందం అవసరమై ఉంటుంది. తన ప్రధాన అంతఃపురానికి అనుబంధంగా ఇతరచోట్ల అశోకునకు అంతఃపురాలుండేవని అందులోనివారు హీనవర్ణ స్త్రీలని కొందరు సూచిస్తున్నారు. ఇది కేవలం అంతఃపుర విలాస జీవితంలో అశోకుడు నిమగ్నుడై ఉండేవాడని సూచించడం. ఇది కేవలం అతిశయోక్తి మాత్రమే. కాని పై శాసనం పేర్కొంటున్నట్లు ఈ అంతఃపురాలన్నీ అశోకునివి కావు. అతని బంధువులకు చెందినవి. అశోకుని కుటుంబసభ్యులు చేసే దానధర్మాలను నమోదు చేయడమే విధిగా ఉన్న ధర్మమహామాత్తులను, ఇతర ఉన్నతోద్యోగులను ఏడో స్తంభశాసనం పేర్కొంటున్నది. ఈ ఉన్నతోద్యోగులు బహుశా ఇథీజ్జక్క మహామాత్తులై ఉంటారు. ధర్మ ప్రచారం చేస్తూ ఈ రాజకుటుంబ సభ్యులను దానధర్మాలు చేయుడని ప్రోత్సహించడం ధర్మమహామాత్తుల విధి. అంతఃపుర పాలనా వ్యవహారాలను చూడడం ఇథీజ్ఝక్క మహామాత్తుల పని అయి ఉంటుంది. ఇతర సమయాలలో స్త్రీలకు సహాయం అవసరం అయినప్పుడు మహామాత్తుల కార్యస్థానాలకు నివేదించేవారు. నేత మొదలైన చేతి పనులలో స్త్రీలకు ఉద్యోగాలు చూడడం, గణికలను అదుపులో ఉంచడంవంటి అర్థశాస్త్రం సూచించిన పనులకు క్రింది తరహా ఉద్యోగులుండేవారు.

దేశ పర్యటన సాగిస్తున్న ప్రాదేశికుడైనా, న్యాయ నిర్వహణ హోదాలో రాజుకుడైనా, ఏ ఉద్యోగి అయినా తన విధిని నిర్వహిస్తూ ధర్మప్రచారాన్ని సాగించవలె. బానిసలు, సేవకులు, బ్రాహ్మణులు, శ్రమణులు, తల్లిదండ్రులు, వృద్ధులు, జంతువుల పట్ల విచక్షణతో వ్యవహరించడం, జంతుహింస మానడం, ఖైదీల యోగక్షేమాలను పరికించడం వంటి సామాన్యములైన ఆచరణలకు ధర్మ ప్రచారంలో ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఈ విధమైన ధర్మప్రచారంతో తృప్తి వహించక తన పదునాలుగో రాజ్యసంవత్సరంలో

ధర్మమహామాత్తులనే క్రొత్త ఉద్యోగి శాఖను అశోకుడు నెలకొల్పినాడు. ధర్మవ్యాప్తి కావిస్తూ అవసరమైనపుడు ధమ్మ విధానాన్ని విపులీకరించడం వీరివిధి. ప్రభుత్వ శాఖగా భారతదేశ పాలనా పద్ధతికే ఈ ఉద్యోగిబృందం కొత్త. మొదట్లో వీరు నిర్వహించింది ప్రధానంగా ప్రజాక్షేమ కార్యక్రమాలే. కాని క్రమంగా చక్రవర్తి వారిపై ఎక్కువ ఆధార పడడంతో వీరి అధికారం పెరిగింది. మతశాఖల చర్యలలోను, లౌకిక సంస్థల కార్యక్రమాలలోను వీరు జోక్యం కలిగించుకోసాగినారు. స్వభావంలో ధర్మ మహామాత్తులొక మత సంస్థగా రూపొందినట్లు కనిపిస్తుంది.

దైనందినపాలనలోని ముఖ్యాంశాలను సాధారణ ఉద్యోగులే నిర్వహించేవారు. నీటిపారుదలను రాజుకుల కార్యస్థానం నిర్వహించేది. వీరినే మెగస్తనీస్ అగ్రనోమాయ్ అనినాడు. వీరు నదులను, తూములను తనిఖీచేసి రైతులమధ్య నీటి పంపిణీని పర్యవేక్షించేవారు. సమీప గ్రామప్రాంతాలకు నీటిసౌకర్యం కలిగించడానికై మౌర్యచంద్రగుప్తుని కాలంలో సుదర్శన తటాకంపై ఆనకట్ట నిర్మించినారని రుద్రదాముని శాసనం చెబుతున్నది. అడవుల ప్రాముఖ్యాన్ని ఈ యుగంలోనే గుర్తించినారు. అటవీ ఉత్పత్తుల పర్యవేక్షకులను అర్థశాస్త్రం పేర్కొంటున్నది. అటవీ సంరక్షణనుగూడ ఈతడే పర్యవేక్షించేవాడు. అక్కడక్కడ అడవులను ఛేదించటం వల్ల దుష్ఫలితాలను గూడ మౌర్యయుగంలోనే గుర్తించి ఉండవలె. అడవులలోని జంతువులు వేటకాండ్రకు జీవనాధారాలు. వేటకాండ్రమీద, కలపమీద పన్నులద్వారా ప్రభుత్వానికి ఆదాయమార్గాలైన అడవుల రక్షణపట్ల ప్రభుత్వం శ్రద్ధవహించేది. అడవులనుండి లభ్యమయ్యే కలప నిర్మాణాలకు చాల అవసరం. కాబట్టి అడవులను ఛేదించడాన్ని అదుపులో ఉంచవలె. అనవసరమైన నష్టం వాటిల్లకుండా అడవులలో కావలిగాండ్రను నియమించవలెనని అర్థశాస్త్రం సూచిస్తున్నది. కావలిగాండ్రవల్ల మరికొన్ని ప్రయోజనాలు గూడ ఉన్నవి. అడవులను నరికి భూమిని సాగుచేయడాన్ని, స్థానిక ఉద్యోగికి నివేదించడానికి, అట్టిభూమి పంటపొలంగా నమోదుచేసి రైతునుండి తగిన పన్నులు వసూలుచేయడానికి, కావలిగాండ్రు సహాయపడతారు. బుద్ధిపూర్వకంగా అడవులను కాల్చడాన్ని అశోకుని శిలాశాసనం ఒకటి నిషేధిస్తున్నది.

కౌటిల్యుడు, మెగస్తనీసు ఉభయులు సాయుధ దళాల పాలననుగూర్చి వివరంగా వర్ణించినారు. కౌటిల్యుడు సైన్యాలను మూడు ప్రధాన వర్గాలుగా విభజించినాడు. వంశానుగత సైన్యాలు, కిరాయి సైన్యాలు, శ్రేణుల సైన్యాలు. ఇందు మొదటి విభాగం చాల ముఖ్యమైంది. అది రాజు మూలబలం. బహుశా మెగస్తనీసు ఐదోవర్గం సైనికులని వర్ణించినది వీరినే. సైన్యంలో ప్రధానభాగంగా వీరికి ప్రత్యేక పరిగణన ఉండేది. రైతుల

తరువాత సంఖ్యాబలం వీరిదే అని మెగస్తనీసు పేర్కొన్నాడు. వీరికి జీతాలు బాగా ఇచ్చేవారు. శాంతి సమయాల్లో వీరు విలాస జీవితం గడిపేవారు. తమ జీతంతో ఇతరులను సయితం వీరు పోషించేవారనడంలో అతిశయోక్తి లేదు. అర్థశాస్త్రం ప్రకారం సుశిక్షితుడైన సైనికుని జీతం ఐదువందల పణాలు. జీతాల క్రమాన్ని బట్టి ఆలోచిస్తే ఇది చాల సంతృప్తికరమైన జీతమే. సైన్యపాలన సైన్యాధ్యక్షునకు, పదాతిదళాధ్యక్షునకు సంబంధించినది. సైన్యంలోని అశ్వదళం, గజదళం, శస్త్రాగారము మొదలైన అంగాలు ఇతర అధికారులక్రింద ఉండేవి.

చంద్రగుప్త బిందుసారుల కాలంలో జరిగిన సామ్రాజ్య విస్తరణవల్ల దండయాత్రలకు సర్వదా సిద్ధంగా ఉండగలందులకై సైన్యానికి అనేక విషయాలలో ప్రాధాన్యం ఇవ్వవలసి వచ్చింది. ఇదే కారణంగా సైన్యాన్ని ఒక ప్రత్యేక వర్గంగా పరిగణించినారు. వంశానుగత సైన్యాలు సమాజంలోని క్షత్రియాంశానికి సంబంధించిన వనడంలో సందేహంలేదు. అందుచే ఈ విభాగానికి మంచి గౌరవం ఉండేది. యూరపియన్ గ్రంథాలలో మౌర్యుల సైన్యాన్ని, మౌర్యులకు పూర్వం రాజ్యం చేసిన నందుల సైన్యాన్ని అధిక సంఖ్యలో వర్ణించినారు. చంద్రగుప్తుని సైన్యంలో తొమ్మిదివేల ఏనుగులు, 30,000 గుర్రాలు, 6 లక్షల కాల్బలము ఉన్నట్లు ప్లీనీ వ్రాయగా 6,000 ఏనుగులు, 80,000 గుర్రాలు, 8,000 రథాలు, 2లక్షల కాల్బలములను ప్లూటార్కు పేర్కొన్నాడు. ఈ సంఖ్యలు మూల బలాన్ని, అనుపూర్వీక దళాలను కలిపి చెప్పినవి. బియాస్‌నదిని దాటి దండయాత్రను అలెగ్జాండరు కొనసాగించి ఉన్నట్లయితే అతడెదుర్కొనవలసివచ్చే సైన్య ప్రమాదాన్ని వర్ణించే సందర్భంలో ప్లూటార్క్ పై విషయాలను చెప్పినాడు. అందుచేత ఆ అంకెలలో కొన్ని అతిశయోక్తులని చెప్పవచ్చు. సేనలపాలనను గూర్చి వివరిస్తూ పాటలీపుత్రాన్ని పాలించే సంఘాల వంటివే ఆరు పంచాయితీలున్నట్లు మెగస్తనీసు వ్రాసినాడు. ఈ సంఘాల మధ్య ఉన్న సామ్యం గ్రంథాలలో దొర్లిన పొరపాటు ఫలితమై ఉంటుంది. ఈ సందర్భాలలో కూడ అర్థశాస్త్రంలో చెప్పిన వేరువేరు విభాగాల పర్యవేక్షకులను మనసులో ఉంచుకొని మెగస్తనీసు వ్రాసి ఉండవచ్చు. మొదటి సంఘం నౌకాదళాధిపతితో సహకరించి పని చేస్తున్నందున నౌకాయుద్ధ నిర్వహణతో సంబంధించినది. నదులపై రవాణా, నదులమీదుగా దాడి, అవకాశం ఉన్నచోట్ల యుద్ధాలలో నౌకల వాడకం జరిగి ఉండవచ్చు. కాని మౌర్య యుగానికి నౌకాయుద్ధ విధానం అభివృద్ధి పొందినట్లు లేదు. రెండవ సంఘం సైన్యానికి భోజనాదిక సౌకర్యాలు కల్పించే ఆధునిక శాఖను పోలింది. రవాణాకు వాడే ఎడ్లబండ్లను పర్యవేక్షించేది. అర్థశాస్త్రం ఈ శాఖను వివరించకపోయినప్పటికి ప్రతి సైన్యాన్ని అనుసరించి

ఈ శాఖ ఉండేదని చెప్పవచ్చు. ఉదాహరణకు సైనిక శిబిరాన్ని వర్ణించిన విభాగంలో ఆ శాఖ ప్రసక్తి ఉంది. సైనికుల నౌకర్లను గురించి, అశ్వపాలకులు మొదలైన పరివారాన్ని గురించిన ప్రస్తావన ఈ విభాగంలో ఉంది.

మిగిలిన నాలుగు సంఘాలు సైన్యంలోని రథ, గజ, తురగ పదాతి దళాలనే నాల్గు విభాగాలను పాలించేవి. భారతీయ గ్రంథాలు సయితం ఈ దళాలను అను పూర్వికంగా పేర్కొంటూనే ఉన్నాయి. ఇందు ప్రతి ఒక్కదాన్ని గురించి అర్ధశాస్త్రం వివరంగా వర్ణిస్తున్నది. సైనికుడు తన ఆయుధాలను ఆయుధాగారానికి అప్పగించి వేయాలని మెగస్తనీసు వ్రాసినాడు. తరచు అధికారులు తనిఖీచేసే విస్తృత వ్యవస్థగా ఆయుధాగారాన్ని కౌటిల్యుడు వర్ణించడం ఆయుధాలన్నీ ఒకే ప్రదేశంలో ఉంచేవారని సూచిస్తున్నది. దీన్ని బట్టి మెగస్తనీసు వ్రాత యధార్ధమే అయి ఉండవచ్చు. గుర్రాలు, ఏనుగులు రాజు సొంత ఆస్తి. వీనిలో వ్యక్తి ఆస్తికి అనుమతి లేదు. భారతదేశానికి వచ్చిన ఇతర గ్రీకు రచయితల వలెనే మెగస్తనీసుకు సయితం ఇచట ఏనుగులు బాగా నచ్చినట్లు కనిపిస్తుంది. ఏనుగులను పట్టుకొనడం వాటికి శిక్షణ ఇవ్వడాలను గురించి అతడు వర్ణించినాడు. ఈ సమాచారమంతా సైనికులకు భూమి ఈనాములు గాక జీతాలే ఇచ్చేవారనే అంశాన్ని బలపరుస్తున్నది. సైన్య పాలనను గురించి వ్రాయడంలో కేంద్రాధికారాన్ని అంటే సర్వ సైన్యాధ్యక్షుని మెగస్తనీసు పేర్కొనక పోవడం విచిత్రం. ఈ పదవి నదిష్టించే వ్యక్తి సైన్యంలోని చతురంగాలను నడపడంలో సమర్ధుడై ఉండాలని అర్ధశాస్త్రం నొక్కిచెబుతున్నది.

మౌర్యపాలన విధానంలో మరొక అంశాన్ని ఐరోపాగ్రంథాలు క్లుప్తంగా సూచనప్రాయంగా పేర్కొంటున్నాయి. తన రచనలో డియోడరస్ రాజులేని రాజ్యాలను ప్రస్తావించినాడు. భారతదేశంలో డియొనీషియస్ ఒక రాజ్యం స్థాపించినాడని అతని సంతతివారు కొన్ని తరాలు పాలించిన తరువాత ఆ రాజ్యం విచ్ఛిన్నమై నగరాలలో ప్రజాస్వామ్య ప్రభుత్వం నెలకొన్నదనీ డియోడరస్ వ్రాసినాడు. హిరాక్లిస్ నిర్మించిన రాజ్యాన్ని గురించి కూడ ఇదే చెప్పినాడు, అయితే హిరాక్లిస్ రాజ్యంలో కొన్ని నగరాలు రాజులనే నిల్పుకొన్నాయి. ఇతర నగరాలు మాత్రం ప్రజాస్వామ్యాన్ని స్థాపించుకొన్నాయి. రాజులేని నగరాలలో న్యాయాధిపతులకు ఆరోవర్గాకి చెందిన ఉద్యోగులు తమ నివేదికలను పంపేవారని ఒకచోట ఉల్లేఖితమైంది. ఇదేవిధంగా వ్రాస్తూ స్వతంత్ర నగరాలకు, రాజులకు, రైతులు పన్నులు తీసుకవచ్చేవారని, ఆరోవర్గ సభ్యులు స్వపరిపాలక నగరాలకు నివేదికలు తెచ్చేవారని పేర్కొన్నాడు. ఏడోవర్గ సభ్యులు అంటే సలహాదార్లుకూడ ఇదే విధానాన్ని అనుసరించినట్లు వ్రాసినాడు. హైఫాసిస్ ఆవలి దేశంలో సలహాదార్ల ప్రభుత్వం అమలు

జరిగినట్లు స్ట్రాబో పేర్కొన్నాడు. అదొకరకమైన ధనిక స్వామ్యం. అందులో 500 మంది సలహాదార్లు ఉండేవారు. ఒక్కొక్క సలహాదారు ప్రభుత్వానికి ఒక ఏనుగును సమర్పించేవారు.

సెల్యూకస్ సామ్రాజ్యంలో వలెనే నగరాలు పాక్షిక స్వతంత్ర హోదాను అనుభవించే పద్ధతి మౌర్య సామ్రాజ్యంలో అమలుజరిగినట్లు మెగస్తనీసుకు తెలుసునని టిమ్మర్ పండితుని అభిప్రాయము. ఈ స్వాతంత్ర్యం అంతరంగిక వ్యవహారాల పాలనకు మాత్రమే పరిమితమనడం సహజము. ఈ స్వీయ పాలక నగరాలు చంద్రగుప్తుని సామ్రాజ్యంలో భాగంగా వ్రాసినాడు కాని అశోకుడు వాటిని గురించి ప్రస్తావించడు. సామ్రాజ్యంలో నివసించే స్వీయ పాలక జాతులను గురించి మెగస్తనీసు వ్రాసినాడని మరికొందరి సూచన. వీరిలో ఒకరిని అర్థశాస్త్రం ఆటవికులుగా పేర్కొన్నది. ఈ జాతులకే మెగస్తనీసు స్వతంత్ర నగరపాలన విధానాన్ని అంటగట్టి ఉంటాడు. కాని రాజులేని రాజ్యాలను మెగస్తనీసు పోలిస్ అని వ్యవహరించాడు. కాని ఈతాన్ అని వ్యవహరించలేదు. పోలిస్ అంటే నగరాలనీ, ఈతాన్ అంటే ప్రజలని అర్థము. పోలిస్ అనే మాట ప్రభుత్వ విధానాన్నే సూచిస్తున్నది కాని దోపిడీలమీద ఆధారపడిన ఆటవికులను సూచించదు.

ఈ అంశంపై వెలుగు ప్రసరింపగలమరొక సాక్ష్యం లేఖనాలున్న నాణేలనుండి లభిస్తున్నది. తక్షశిలలో దొరికిన నాణేలలో పొడవైన రాగి నాణేలపై నిగమ అనే పదం ఉంది. ఈ పదాన్ని వర్తకులశ్రేణి లేదా ఒక విపణికి చెందిన వర్తకులశ్రేణి అని, వర్తకులిచ్చిన వ్యాపారద్రవ్య చిహ్నమనీ, వాణిజ్య నాణెకమని పలురకాలుగా వ్యాఖ్యానించినారు. ఈ నాణేలు స్థానిక విషయాలలో స్వీయ పాలనాధికారాన్ని సూచిస్తున్నాయి. అంతమాత్రంచేత ఈ నాణేలనిచ్చిన నగరాలు స్వతంత్ర నగరాలని భావించరాదు. అదీకాక వర్తక శ్రేణులకు, పెద్ద పెద్ద వాణిజ్య సంస్థలకు, వాణిజ్యానికి సంబంధించినంతవరకు మాత్రమే స్వీయ పాలనాధికారం పరిమితం. అంతేగాని మొత్తం నగరానికి రాజకీయ స్వాతంత్ర్యమని అర్థంకాదు. వస్తువుల తయారీకి ఉపయోగించే పదార్థాలను ఉత్పత్తిచేసే రైతులు ఆయా శ్రేణులతోగాని, కళాకారులతోగాని ఒప్పందం కుదుర్చుకొని పన్నులను నేరుగా శ్రేణులకు చెల్లించేవారు.

మెగస్తనీసు మూల గ్రంథాన్ని డియోడొరస్, ఏరియన్లు పొరపాటుగా అర్థం చేసుకొనడం గాని లేదా యథార్థ పరిస్థితిని మెగస్తనీసు స్పష్టంగా వివరింపలేకపోవడం గాని స్వతంత్ర నగరాల ప్రసక్తికి కారణమై ఉంటుంది. బౌద్ధయుగంలో గంగానదీ లోయలో బహుస్వామ్యం అమలుపరచుకొన్న జాతులుండేవి. సింధులోయలోని కొన్ని తెగలలో గణ ప్రభుత్వం ఉన్నట్లు యూరపియన్ గ్రంథాల ద్వారా తెలుస్తున్నది. కొన్ని జాతులు పాక్షిక నాగరకతతో

స్వతంత్ర జీవనం గడిపేవారు. ఈ ప్రాంతాన్ని మౌర్యులాక్రమించడంతో ఆ జాతులన్నీ మౌర్య సామ్రాజ్యంలో లీనమైనవి. ఇవి క్రొత్తగా జయించిన రాజ్యాలయినందున ఈ తెగలపట్ల చంద్రగుప్తుని ప్రభుత్వం సౌమ్యంగా వ్యవహరించి వారి పూర్వ సంస్థలను కొనసాగించుకొనడానికి సమ్మతించి ఉండవచ్చు. ఈ విధానం ఆ జాతులు లేదా వారి నగరాలు పాక్షిక స్వతంత్రములనే అపోహను కలిగించి ఉంటుంది. పరిపాలన విస్తరించి సరిహద్దు ప్రాంత రాష్ట్రాలపై ఆధిపత్యం పెరిగినకొద్దీ ఆ నగరాలు తమ స్వాతంత్ర్యం కోల్పోయి అశోకుని కాలం నాటికి సామ్రాజ్యంలో పూర్తిగా లీనమైనాయి.

ప్రాచీన యుగంలో రాజులను ఎన్నుకొనే సంప్రదాయం ఉండేది. ఆ సంప్రదాయ స్మృతులు ప్రజలలో సజీవంగా ఉన్న కారణంచేత మధ్య మధ్య గణ ప్రభుత్వం అమలుజరిగే రాచరిక సంప్రదాయాన్ని గురించిన ప్రస్తావనలు కనిపిస్తాయి. సభ, సమితి అనే ప్రజా సభల సహాయంతో పరిపాలన సాగిన వైదిక ప్రభుత్వ విధానమే అల్పసంఖ్యా స్వామ్యానికి (Oligarchy) మూలం. గ్రీకు రచయితలకు గ్రీకు పౌర రాజ్యాలలో పరిచయముంది. అందుచే వారికి స్వతంత్ర నగరాలనేవి అసాధారణమైన రాజకీయ విశేషమేమీకాదు. తమ పరిజ్ఞానంతో మౌర్యయుగ భారతదేశంలో గ్రీకు పౌర రాజ్యాలకు తుల్యమైన సంస్థలు ఉండకపోవచ్చుననే ఆలోచన వారికి రాకపోవడం సహజం. అందుచేతనే తన రచనలో స్వతంత్ర నగరాలనే అంశాన్ని యథాలాపంగా డియోడొరస్ చేర్చి ఉండవచ్చు.

మెగస్తనీసు మౌలిక రచనను పొరపాటుగా అర్థం చేసుకొనడం వలననే స్వతంత్ర నగరాల ప్రసక్తి వచ్చి ఉంటుంది. ముఖ్యంగా రాజులులేని నగరాలలోని న్యాయాధిపతులకు అవేక్షకులు నివేదికలు పంపేవారన్న వ్యాసంలో ఈ పొరపాటుకు అవకాశం ఉంది. రాజుగాని ప్రముఖుడైన రాజప్రతినిధిగాని నివసించని నగరాలను గురించి మెగస్తనీసు ముచ్చటించి ఉండవచ్చు. పాటలీపుత్రంలో గాని, రాజ ప్రతినిధుల ఆధీనంలోని రాష్ట్ర ముఖ్య నగరాలలోగాని పర్యవేక్షకులు తమ నివేదికలను రాజుకు గాని, రాజ ప్రతినిధికి గాని నేరుగా పంపవచ్చు. అట్టి ప్రతినిధిలేని నగరాలలో అచటి ఉన్నత పాలకవర్గానికి అంటే న్యాయాధీశులకు ఆ నివేదికలు పంపేవారు. ఈ నగరాలు రాజ ప్రతినిధి పాలించే నగరాలకు భిన్నంగా స్వయం పాలకములని మెగస్తనీసు భావించి ఉండవచ్చు. నిజానికి ఈ నగరాలను స్వయం పాలకములని వర్ణించడంతప్పు. అయినప్పటికి తరువాతి రచయితలు స్వయం పాలకములనే పదాన్ని వివరణాత్మకంగా వాడి ఉంటారు. ఏరియన్ కంటె పూర్వీకుడు డియోడొరస్. మెగస్తనీసును ఉల్లేఖిస్తూ డియోడొరస్ తన గ్రంథం వ్రాసినాడు. కాబట్టి తన ఇండికాను వ్రాయడంలో డియోడొరస్ గ్రంథాన్ని ఏరియన్

సంప్రదించి ఉండవచ్చు. డియోడొరస్ మాటలను తర్కబద్ధంగా ఆలోచించి ఏడోవర్గం వారని వర్ణించడంలో స్వీయ పాలక నగరాలనే మాటను ఏరియన్ స్వయంగా చేర్చి ఉండవచ్చు.

నాటి పరిపాలనను బట్టి సామ్రాజ్యంలోని మారుమూల ప్రాంతాలలోకూడ చక్రవర్తి తన అధికారాన్ని చెలాయించినట్లు స్పష్టమౌతున్నది. అందుకు సమర్థమైన ఉద్యోగి బృందం అవసరం. దైనందిన జీవితంలోని అన్ని అంశాలకు ఈ ఆధిపత్యం విస్తరించింది. ఆచరణలో వివరాలన్నింటిని అధికారులు పర్యవేక్షించకపోయినప్పటికీ అవి వారి బాధ్యతలోనివిగా పేర్కొనడం నాటి పాలనా వ్యవస్థ పాటవానికి నిదర్శనం. ఈ విధానం సమర్ధవంతమైనదే కావచ్చు. కాని దీనివల్ల ప్రజా జీవనంలో తరచు అధికారుల జులుము ఎక్కువ అవుతుంది. మామూలు ఉద్యోగులతో కలిసి ధమ్మ మహామాత్తులు పనిచేసేవారు. ఈ ఉభయుల కలయిక సామాన్య పౌరునకు బాధాకరంగా పరిణమించేది. సామ్రాజ్య పరిపాలన రెండు స్థాయిలలో జరిగేది. ఒకటి సామ్రాజ్య పరమైంది. రెండోది స్థానికము. దైనందిన వ్యవహారాలన్నీ స్థానిక పాలనకు సంబంధించినవి. అయితే పాలనా విధానాలన్నీ కేంద్రం ఆదేశించినవే. శాసనాలనుబట్టి పరిపాలనలో కేంద్రీకరణ ప్రవృత్తి బలంగా ఉన్నట్లు స్పష్టమౌతున్నది. పాలకుడు సమర్థుడైనపుడు కేంద్రీకృత విధానం విజయవంత మౌతుందనేది సర్వజన విదితం. కాని దుర్బలమైన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలలో దురదృష్టకరమైన ఫలితాలకు దారితీస్తుంది. మొదటి మౌర్యుల పాలనలో గర్భితమైన ఈ దౌర్బల్యమే తరువాతి మౌర్యుల కాలంలో సామ్రాజ్య క్షీణతకు కారణమైంది.

మౌర్య సామ్రాజ్య పరిస్థితులకు సంబంధించిన పాలనా యంత్రాంగాన్ని పైన వివరించినాము. అదృష్టవశాత్తు అశోకుని పాలనా కాలంలో సామ్రాజ్య భౌగోళిక విస్తృతిని నిర్దుష్టంగా చెప్పడానికి వీలౌతున్నది. అతని శిలా స్తంభ శాసనాల విస్తరణ అతని అధికారానికి తిరుగులేని నిదర్శనము. అతని శాసనాలలో చెప్పిన ప్రజలు, ప్రాంతాలేకాక సాంప్రదాయకంగా అతని పేరులో సంబంధించిన ప్రదేశాలన్నీ అతని సామ్రాజ్య భాగాలుగా గ్రహించవచ్చు. వాయవ్య ప్రాంతంలోని మాన్‌శేహ్‌ర, షెబాజ్‌గరీ, లంఘన్‌లు మొదలుకొని పశ్చిమంగా కాందహార్ వరకు అతని శాసనాలు విస్తరించినాయి. యోన, కాంభోజ, గాంధారులను తన సరిహద్దు ప్రజలుగా పేర్కొన్నాడు. పశ్చిమాన సిరియారాజు రెండో యాంటియోకస్ రాజ్యం అశోకుని సామ్రాజ్యానికి సరిహద్దు. పైన పేర్కొన్న ముగ్గురు ప్రజల విషయం కొంత సందిగ్ధంగా ఉంది. వీరు సామ్రాజ్యం లోపలివారా లేదా వెలపల సరిహద్దు పొడుగునా విస్తరించి ఉన్నారా అనే అనుమానం ఉంది. శాసనాల ఉనికిబట్టి

నిర్ణయిస్తే ఆ ప్రజలు సామ్రాజ్యం లోనివారే అని తేలుతుంది. దక్షిణ సరిహద్దు ప్రజలుగా పేర్కొన్నవారు సామ్రాజ్యంలోని వారుగా కనిపించరు. వీరు చోళ, పాండ్య, సాతియ పుత్ర, కేరళ పుత్రులు. వీరి ప్రాంతాలలో ఇంతవరకు అశోకుని శాసనాలు దొరకలేదు. అత్యంత దాక్షిణాత్య శాసనాలు రాయచూరు జిల్లాలోనివే. ఇచటి ప్రజలకు సామ్రాజ్యంతో సన్నిహిత సంబంధం ఉంది. సామ్రాజ్య దక్షిణ సరిహద్దు స్పష్టంగా లేదు. కాని చితాల్ దుర్గ్ జిల్లాకు దక్షిణంగా పశ్చిమ–తూర్పు తీరాల మధ్య ఉన్నట్లు కనిపిస్తుంది. సరిహద్దు తూర్పు ప్రాంతంలో పెన్నా నదీలోయ సహజమైన ఎల్లగా ఉపకరించి ఉంటుంది. తూర్పున గంగా ముఖద్వారంవరకు సామ్రాజ్యం విస్తరించింది. ప్రసిద్ధ వాణిజ్య కేంద్రమైన టామ్‌లూక్ (తామ్రలిప్తి) సామ్రాజ్యంలోనే ఉంది.

ప్రభుత్వాల గుణాన్నిగాని, పాలకుల గుణాన్నిగాని నిర్ధరించడానికి వారి విదేశాంగ విధాన స్వభావాన్ని అంచనా వేయడం అవసరం. ఇందుకు దౌత్య వ్యవహారాలు, భౌగోళిక సామీప్యం అనే అంశాలమీద ఆధారపడిన సంబంధాల పరిశీలన అవసరం. అశోకుని కాలంలో అంటే క్రీ. పూ. మూడో శతాబ్దంలో తూర్పు మధ్యధరా ప్రాంతాలకు, దక్షిణ ఆసియాకు మధ్య రాక పోకలెక్కువగా జరుగుతూ ఉండేవి. విదేశ సంబంధాల ప్రాముఖ్యాన్ని, సామ్రాజ్యం వెలుపలి ప్రజలతోటి సంబంధ అవసరాన్ని అశోకుడు గుర్తించినాడు. అతని సంబంధాలన్నీ దక్షిణ, పశ్చిమ ప్రాంతాలకే పరిమితం. తూర్పు ప్రాంతాలు ఇంకా అతని సామ్రాజ్య ప్రభావానికి వెలుపలే ఉన్నాయి. అశోకుని సంబంధాలు కేవలం ఏకముఖం కావు. పాటలీపుత్రానికి విదేశీయులధిక సంఖ్యలో వచ్చేవారు. అందుచేతనే పౌరపాలనా నిర్వహణలో నియమించిన సంఘాలలో ఆగంతకుల అవసరాలను, శ్రేయస్సులను పర్యవేక్షించడానికై ఒక సంఘాన్ని ఉద్దేశించవలసి వచ్చింది. పరదేశీయులనే మాట సామ్రాజ్యంలోని దూరస్థ రాష్ట్రాల నుండి వచ్చిన వారికి కూడ వర్తించేది. పాటలీపుత్ర నగరానికి గ్రీకు లెంతటి పరదేశీయులో వీరూ అంతే.

'భారతీయులు దేశం విడిచి వెళ్ళరు' అని మెగస్తనీస్ వ్రాసినప్పటికీ భారతీయులధిక సంఖ్యలో విదేశాలకు వెళ్ళడం, దూరప్రాంతాల్లో పర్యటించడం, మౌర్యయుగానికి కొత్త పరిణామంగా కనిపిస్తున్నది. ఈ కొత్త సాహసానికి గ్రీకు దండయాత్ర తరువాత విదేశీయులతో ఏర్పడిన పరిచయం కొంతవరకు కారణం. విదేశాలతో ముఖ్యంగా పశ్చిమ ప్రాంతాలతో ఏర్పడిన వాణిజ్య సంబంధాలు మరొక కారణం. వీనికి తోడు హెలెనిక్ ప్రపంచ వివిధ ప్రాంతాలకు అశోకుడు పంపిన మత ప్రచారకులు కూడ సహాయకారులై ఉండవచ్చు. వాస్తవానికి విదేశాలకు, అశోకునకు మధ్య ముఖ్య సంబంధం మత ప్రచారకులే.

వీరిని మత ప్రచారకులనడమే సముచితమైనప్పటికి రాయబారులని చెప్పవచ్చు. అశోకుని విధానాలను ముఖ్యంగా అశోకుని ధమ్మాన్ని ఆయా దేశాలకు పరిచయం చేయడమే వారి ముఖ్య కర్తవ్యం. వారు ఏ ఒక్క దేశంలో కూడ చిరకాలం స్థిరంగా ఉండరు. అందుచేత ఒక ప్రాంతం నుండి మరొయొక ప్రాంతానికి పర్యటిస్తూ, స్థానిక ప్రజలతో సంభాషిస్తూ, బహుమతులు పంచుతూ సౌహార్ధ సందేశాలనందిస్తూ, తమ దేశ ప్రజలలో, ఆశయాలలో విదేశీయులకు ఆసక్తి కలిగించే నేటి సుహృద్భావ సంఘాలతో అశోకుని మత ప్రచారకులను పోల్చవచ్చు.

ఈ రాయబారులు విదేశాలలో నివసిస్తూ శాశ్వత విజయాన్ని ఏ మాత్రమైన సాధించి ఉన్నట్లయితే వాటి ప్రసక్తి ఐరోపా గ్రంథాలలో తప్పక ఉండేది. సమకాలిక సారస్వతంలోగాని, తదనంతర గ్రంథాలలో కాని వాటిని గురించి వినరాకపోవడం వాటి ప్రభావం తాత్కాలికమని సూచిస్తున్నది. కాని అవి భారతీయ వస్తు సామాగ్రి భావాలు పశ్చిమ దేశాలకు ప్రవహించే మార్గం కల్పించినాయి. హెలినిక్ ప్రపంచంలో భారతీయ జీవితాన్ని గురించి తెలియకపోలేదు. అశోకుని మత ప్రచారక బృందాలు పొరుగు రాజ్యాల ప్రజలకు భారత జీవితంతో మరింతగా పరిచయం చేసినాయి. ఈ ప్రచారకులను ఆహ్వానించిన రాజులందరు ధమ్మ విధానాన్ని అనుసరించినట్లు అశోకుడు చెప్పుకొన్నాడు. కాని వారా విధానాన్ని తక్షణం పూర్తిగా ఆచరణలో ఉంచగలరని అశోకుడు ఆశించి ఉండడు. తాను దర్శించిన ప్రజలలో ఏ మాత్రమైనా ధమ్మం పట్ల ఆసక్తి కలిగిస్తే మత ప్రచారకులు సఫలీకృతులైనట్లు అశోకుడు భావించి ఉంటాడు.

అశోకుడు చేసిన చివరి బహిరంగ ప్రకటన ఏడో స్తంభశాసనం. అందులో మత ప్రచారకుల ప్రసక్తి లేకపోవడం విడ్డూరంగా ఉంది. కాని తన సంక్షేమ కార్యక్రమాలు విస్తృత ధర్మ ప్రచారము విజయవంతమైనట్లు ఆ శాసనంలో చెప్పుకొన్నాడు. ఈ కార్యక్రమాలన్నీ అతని సామ్రాజ్యంలో జరిగినవే. ఈ శాసనంలో ప్రచార బృందాల ప్రసక్తి లేకపోవడానికి ప్రబలకారణం అశోకుడాశించినంతటి విజయాన్ని అది సాధించ లేకపోవడమే. ప్రధాన శిలా శాసనాలలో వాటిని ప్రస్తావించడానికి కారణం అప్పటికా బృందాలను పంపి ఎక్కువ కాలం కాకపోడమూ, ఆ ఉత్సాహంలో వాని విజయాన్ని గురించి అతనికి పూర్తి విశ్వాసం ఉండడమూ కారణం. ఇరవై ఎనిమిదో పాలనా సంవత్సరానికి బృందాలను పంపి తగినంత కాలమైంది; అనుభవమూ వచ్చింది. నాటికి ప్రచారక బృందాలు తాము దర్శించిన దేశాల ప్రజలలో భారతీయములైన అంశాలపై ఆసక్తిని కలిగించినారే కాని ధర్మాచరణను నెలకొల్పడంలో తగినంత విజయం సాధించలేదని

అశోకుడు గ్రహించినాడు. పరాజయాన్ని అంగీకరించడానికి బదులు ప్రచారకుల ప్రస్తావనే మానుకొన్నాడు. ఈ శాసనంలో ప్రచారకుల ప్రసక్తి నెత్తకపోవడానికి మరొక కారణంకూడా చెప్పవచ్చు. ఈ ప్రకటన కేవలం ఆంతరంగిక విషయాలకు మాత్రమే పరిమితంచేసి ఉండవచ్చు. ఈ ప్రచారక బృందాలు సింహళంలో పూర్తి విజయాన్ని సాధించినాయి. సింహళాధీశుడైన తిస్సకు ధమ్మంలో గాఢ విశ్వాసం కలిగింది. ఇతర దేశాల ప్రసక్తిని వదలినా కనీసం సింహళ విజయమైనా ఈ శాసనంలో చెప్పదగింది.

పశ్చిమాన అశోకుని సామ్రాజ్యాన్ని ఆనుకొని ఉన్న ప్రాంతం యాంటియోకస్ పాలనలో ఉంది. మౌర్యయుగానికి పూర్వం అది అఖమీనిడ్ సామ్రాజ్యంలోనిది. భావాలలోను, ఆచరణలోను కూడ యాంటియోకస్ అశోకునకు చాల సన్నిహితుడు. ఇరాన్ ఇండియాల మధ్య సంబంధాలకు చాల సాక్ష్యం ఉన్నది. ఈ సంబంధాలలో కొన్ని తాత్కాలికము. ఉదాహరణకు వాయవ్య సరిహద్దు ప్రాంతంలోని భారతీయ కిరాయి సైన్యాలు అఖమీనిడ్ సైన్యంలో చేరి అనేక సందర్భాలలో పోరాడినవట. మరికొన్ని సంంధాలు కొంతవరకు స్థిరమైనవి. ఇందుకు ఉదాహరణగా సైరస్ సామ్రాజ్యంలో భారతీయ రాష్ట్రమైన సింధు-గాంధారాన్ని చేర్చడాన్ని చెప్పవచ్చు. ఈ అంశాన్ని పెర్‌సీపోలిస్‌లో డరయస్ వేయించిన శాసనం పేర్కొంటున్నది. ఆచారాలలోను, సంస్కృతిలోను కనిపించే పోలికను భారతదేశంపై ఇరాన్ ప్రభావంగా వర్ణిస్తారు. గతాన్ని పరిశీలించడంలో ఇది చాల ప్రమాదకరమైన దృక్పథము. రెండువేల సంవత్సరాల నాటి సాంస్కృతిక విధానంపై ఇరవయ్యో శతాబ్దపు జాతీయ సరిహద్దులను విధించడంవల్ల కలిగిన ఫలితమే ఈ దృక్పథము. ఆధునిక పురాతత్త్వవేత్తలు సంస్కృతులలో సాగించిన పరిశోధనల ఫలితంగా ఏర్పడిన సరియైన దృక్పథంతో పైసమస్యను పునఃపరిశీలించడం అవసరం. అఖమీనిడ్ ప్రభావాన్ని గురించిన సమస్యపై పూర్వం అమలులో ఉన్న రెండు సిద్ధాంతాలలో ఏదీ అంగీకారం కాదు. అందు ఒక సిద్ధాంతం ప్రకారం అశోకుని శిల్పంలోని సమస్తము అఖమీనిడ్ ఇరాన్ నుండి వచ్చినదే. ఇక రెండవ సిద్ధాంతం ప్రకారం ఆ శిల్పం యావత్తు దేశీయమే. అఖమీనిడ్ ఇరాన్, వాయువ్య భారతము సాంస్కృతికంగా సన్నిహితములైన ప్రాంతాలని పురాతత్త్వశాస్త్రం నిరూపించింది. అందుచే రెంటిమధ్య పోలికలు తప్పనిసరిగా ఉంటాయి. నాటికి తెలిసిన ప్రపంచం చాల చిన్నది. పరస్పర రాకపోకలు, వాణిజ్యము చురుకుగా సాగుతూ ఉండేవి. ఈ అంశాలవల్ల స్థానిక అవసరాలకంటె అధికంగానే సాంస్కృతిక పరిణామాలు జరిగినాయని ఆదిమ మూఢభావాల నధిగమించి మతోద్యమాల ప్రభావం పెరిగిందని తెలుస్తుంది.

ఇరాన్ భారతదేశాలకు సమానములైన ఆచారాలు నాటి పరిస్థితులకు అవసరంగా రూపొందినవే. పెక్కు సంస్కృతులకివి సమాన ధర్మాలు. కొన్ని సందర్భాలలో తలగొరగడం ఇరాన్ శిక్షా విధానమని చెబుతారు. అర్ధశాస్త్రము, మహావంశకూడ దీన్ని శిక్షల జాబితాలలో చేర్చినాయి. నేటి భారతదేశంలో కూడా ఈ శిక్ష అమలులో ఉంది. నేరస్తుని బాగా గుర్తించడానికై అతని కనుబొమ్మలు కత్తిరిస్తారు. ఇదే ఆశయంతో పూర్వకాలంలో కూడా క్షురకర్మను శిక్షగా అమలు జరిపినారు. ఇంకా పెక్కు ఆధారాలకు ఒకేరకమైన పూర్వ చరిత్ర ఉంది. ఇరేనియనులు, ఇండో ఆర్యులు ప్రాచీన ఆర్యజాతి సంతతివారే కాబట్టి భిన్నములైన కొత్త ప్రాంతాలలో స్థిరపడిన అనంతరం కూడా ఉభయులు చాలవరకు ప్రాచీన ఆచారాలనే అనుసరించడం సహజం. అట్టి వాటిలో జన్మదినంనాడు రాజు ఉత్సవపూర్వకంగా అభ్యంగన స్నానం చేయడం ఒకటి అయి ఉండవచ్చు.

డరయస్ అశోకుల శాసనాలమధ్య కన్పించే సామ్యం ఒకే సంస్కృతికి మరొక తార్కాణం. డరయస్ శాసనాలు అశోకునకు తెలుసునని నిశ్చయంగా చెప్పలేము. అఖమీనికులు తమ శాసనాలను శిలాముఖాలపై వ్రాసినట్లు తెలిసి అశోకుడు కూడ అదేవిధంగా చేయడానికి నిశ్చయించి ఉండవచ్చు. సంబోధన స్వరూపంలోని సామ్యం అశోకుడు ఇరేనియన్ శాసన పాఠాన్ని చదివి ఉండవచ్చునని సూచిస్తుంది. డరయస్ ఉపయోగించిన పదగుచ్ఛం:

ధటీయ్ దరియ వుష్ క్షయ తియ

డరయస్ రాజు ఈ విధంగా చెప్పినాడు.

అశోకు డీ క్రింది పాదాన్ని ఉపయోగించినాడు.

దేవానాం పియ ప్రియదశ్శిరాజా ఏవం అహ

దేవానం ప్రియుడు ప్రియదర్శిరాజు ఈ విధంగా మాటాడుతున్నాడు. "రాజు ఈ విధంగా మాటాడుతున్నాడు" - అంటూ శాసనాలను ప్రారంభించే పద్ధతి మాత్రం అశోకునకు తెలిసి ఉండవచ్చు. బహుశా భారతీయ ఇరేనియన్ చక్రవర్తులు ఉభయులలో అనేకులు ఆ పద్ధతిని అనుసరించి ఉండవచ్చు.

డరయస్ శాసనాలలో కంటె అశోకుని శాసనాలలో నమ్రభావం ఎక్కువ అనడంలో సందేహం లేదు. ఈ శాసనాలమధ్య ఉన్న వ్యత్యాసానికి ఆయా శాసనస్థములైన అంశాలలోని వ్యత్యాసమే కారణం. తన గొప్పదనాన్ని, తన విజయాల ఘనతను చాటడమే డరయస్ ఉద్దేశం. అశోకుడు సయితం కొన్ని శాసనాలలో తన విజయాలను సగర్వంగా చెప్పుకొనడానికి వెనుకాడలేదు. అయినప్పటికీ ప్రధానంగా అతని ఉద్దేశం ధర్మ ప్రచారం.

ఈ వ్యత్యాసం వారు ధరించిన బిరుదాలవల్ల స్పష్టమౌతున్నది. మహారాజు, రాజాధిరాజు, భిన్నజాతులు నివసించే అనేక రాజ్యాల అధిపతి, సువిశాల మహా ప్రపంచాధిపతి అయిన దరయస్ అంటూ తన్ను గురించి దరయస్ చెప్పుకొన్నాడు. వ్యక్తిత్వంలో దరయస్‌కు దీటైనవాడే అశోకుడు. అశోక సామ్రాజ్యం కూడ దరయస్ సామ్రాజ్యమంతటి సువిశాలమైనదే. కాని అశోకుడు "దేవతలకు ప్రీతిపాత్రమైన ప్రియదర్శి అయిన రాజు"ను అంటూ చెప్పుకొన్నాడు.

సంస్కృతులలో పోలిక భావాలకు మాత్రమే పరిమితం కాదనీ, మౌర్య సామ్రాజ్య వాయవ్య ప్రాంత ప్రజలకు, అఖమీనిడ్ – ఇరాన్ ప్రజలకు మధ్య భాషా విషయకమైన సంబంధం కూడ ఉన్నట్లు తెలుస్తున్నది. ఉత్తరాదిని షహబాజ్‌గరీ మాన్‌శేహ్రా శాసనాలలో ఖరోష్ఠీ లిపిని వాడడం ఇరాన్‌తో బలమైన సంబంధానికి నిదర్శనం. తక్షశిలలోని అరమిక్ శాసనఖండం కాందహాక్‌లో లభ్యమైన అరమిక్ శాసనం రెండు ప్రాంతాల మధ్య అవిచ్ఛిన్నంగా రాకపోకలు జరుగుతుండేవనడానికి తార్కాణం. ఉత్తరాదిన ప్రధాన శిలాశాసన ప్రతులలో ఠిపి, నిపిష్ఠ అనే ఇరేనియన్ పదాల వాడకం కూడ పై భావనలో విశ్వాసాన్ని పెంచుతుంది.

తుషాష్పుడనే యోనరాజు అశోకుడని రాజ ప్రతినిధిగా అపరాంత ప్రాంతాన్ని పాలించినట్లు రుద్రదాముని జునాగడ్ శాసనం చెబుతున్నది. తుషాష్పుడు గ్రీకు జాతీయుడని శాసనం పేర్కొంటున్నప్పటికీ ఆ పేరు మాత్రం స్పష్టంగా ఇరేనియన్ సంబంధమైనది. అలెగ్జాండరు దండయాత్ర అనంతరమే వాయవ్య ప్రాంతంలో గ్రీకుస్థావరా లేర్పడినాయి. గ్రీకు సైన్యంనుండి పారిపోయినవారు కాని, గ్రీకు సైన్యం స్వదేశానికి మరలిన సందర్భంలో వెనుక దిగబడిపోయినవారు గాని ఈ ప్రాంతంలో స్థిరపడి ఉంటారు. వారే ఇచ్చటి గ్రీకు ప్రజలకు పూర్వీకులు. తుషాష్పుడు ఇరేనియన్ జాతీయుడై ఉండవచ్చు. లేదా ఇరేనియన్ సంస్కృతీ ప్రభావం ప్రబలంగా ఉన్న ప్రాంతంలో చిరకాలం నివసించినవాడైనా అయి ఉండవచ్చు. బ్రోచ్ వరకు అలెగ్జాండరు దండయాత్ర అవశేషాలున్నట్లు పెరిప్లస్ గ్రంథం చెబుతున్నది. కాని ఈ ప్రాంతాన్ని అలెగ్జాండరు దండయాత్ర తాకలేదు. మౌర్యయుగంలో గుజరాత్‌లో ఉన్న చిన్న గ్రీకు వలస పెరిప్లస్ పొరపాటుకు కారణమై ఉంటుంది. భారతదేశ దండయాత్రలో ఇరేనియన్ కిరాయి సైనికులను అలెగ్జాండరు వాడినాడనడంలో సందేహం లేదు. అందులో కొందరు సైన్యాన్ని విడిచి గుజరాత్ ప్రాంతానికి పారిపోయి ఉండవచ్చు. కాబట్టి గ్రీక్ లేదా ఇరేనియన్ లేదా ఇండో–గ్రీక్, ఇండో–ఇరేనియన్ కుటుంబాలలో ఒకదానికి తుషాష్పుడు చెంది ఉండవచ్చు.

అఖిమీనిడ్ ఇరాన్ మౌర్య భారతాలలోని కొన్ని నిర్మాణాల స్థాపత్యంలో ఉన్న సాన్నిహిత్యం అనేక వ్యాఖ్యానాలకు కారణమైంది. వీటిలో పాటలీపుత్రంలోని మౌర్యుల రాజప్రాసాదం చక్కని ఉదాహరణ. సుస, ఎక్బటన, పెర్సీ పోలిస్‌లలోని రాజ ప్రాసాదాలతో పాటలీపుత్ర ప్రాసాదాన్ని పోలుస్తారు. వీటితాళచ్ఛందములు (Ground plans) చాలవరకు ఒకటే. పెర్సీపోలిస్‌లో మధ్య కోష్ఠానికి నూరుస్తంభాలవరుసలున్నాయి. పాటలీపుత్రంలో 80 స్తంభాలున్నాయి. ఇక్కడే ఒక రాతి మీద కన్పించిన లేపకారుని చిహ్నానికి, పెర్సీ పోలిస్‌లోని చిహ్నాలకు అద్భుతావహమైన పోలికలు ఉన్నాయి. ఈ పోలికలు ఆ పనివాండ్రిద్దరు ఒకే ప్రాంతం నుండి వచ్చినవారని సూచిస్తున్నది. మృగ కిరీటాలున్న అశోకుని శిలా స్థంభాలను గురించి కూడ అదేరకమైన చర్చ జరిగింది. ఆ స్తంభాలు తక్షశిలలోనే తయారై ఉంటే వాటికి పారశీక స్తంభాలకు మధ్య పోలిక సహజమైనదే. దాన్ని గురించి ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

ఇంకా పశ్చిమంగా బేబిలోన్‌తో కూడ మౌర్యయుగంలో వర్తక వాణిజ్యాలు సాగినాయి. సముద్ర మార్గాన్ని వాడుకలోనికి తెచ్చి, భారతదేశానికి పాశ్చాత్య దేశాలకు మధ్య రాకపోకలకు ఈ వాణిజ్యం చాల తోడ్పడింది. గ్రీకులతో సంబంధం కూడ కొత్త పరిణామం కాదు. గ్రీకులకు వాడిన యోన లేదా మనవ పదం ఇరాన్‌గుండా వచ్చింది. ఇయోనియా గ్రీకులతో మొట్ట మొదట ఇరేనియునులకు పరిచయమైంది. అందుచే గ్రీకులందరికి సర్వ సాధారణంగా యౌనపదం ప్రయోగించారు. ఆమాటే సంస్కృతంలో యవన అయింది. అదే ప్రాకృతంలో యోన అయింది. సింధునదికావల ఆఫ్ఘనీస్థాన్‌లోను గ్రీకు స్థావరాలున్నవని చెప్పడానికి తగినంత సాక్ష్యం ఉన్నది. బలక్, సమరఖండ్‌ల మధ్య ఇయోనియన్ గ్రీకు స్థావరాన్ని నెలకొల్పినట్లు క్సెర్ క్సెస్ చెప్పుకొన్నాడు. వీరిని బ్రాంఖి యేడే అని పిలిచేవారు. తన దండయాత్రల సందర్భంలో అలెగ్జాండర్ వీరందరిని మట్టుపెట్టినాడు. అలెగ్జాండర్ ప్రశ్నించినపుడు స్వాట్ లోయలోని వైసా ప్రజలు తాము గ్రీకు సంతతి వారమని చెప్పుకొన్నారు. పాణిని గ్రంథం మౌర్యయుగానికి పూర్వమే తయారైనదని చెబుతారు. ఆ గ్రంథంలో యవనలిపి ప్రసక్తి ఉంది. భారతదేశంపై పెద్దగా ప్రభావాన్ని ప్రదర్శించకపోయినా అలెగ్జాండరు దండయాత్ర భారతీయులకు గ్రీకు పద్ధతులను పరిచయం చేసిందనడం నిశ్చయం. ముఖ్యంగా మౌర్యయుగ భారత ఆస్థానానికి తమ రాయబారులను పంపడంవల్ల గ్రీకు రాజులకు భారతదేశంలో ఆసక్తి ఉన్నట్లు స్పష్టమౌతున్నది. మెగస్తనీస్, డీమేకస్, డియొనీమియస్ పాటలీపుత్ర ఆస్థానంలో కొంతకాలం గడిపినారు. మెగస్తనీస్ అధికార రాయబారి అయిందీ, లేదా వ్యక్తిగత హోదాలో భారత సందర్శనార్థం వచ్చిందీ చెప్పడం

కష్టం. దీన్ని గురించి లభ్యమౌతున్న ఆధారాలమధ్య అంగీకారం లేదు. ఈ విధమైన పూర్వ సంబంధాల దృష్ట్యా అశోకుడు రాయబారాలను పంపకపూర్వమే భారతీయులు గ్రీకు కేంద్రాలను దర్శించి ఉంటారని తెలుస్తున్నది. అశోకుని శిలా శాసనాలలో యోన ప్రసక్తులున్నాయి. సందర్భాన్నిబట్టి ఈ ప్రసక్తి కొన్నిచోట్ల వాయువ్య ప్రాంతంలోని గ్రీకు స్థావరాలను గురించినది. సిరియా రాజైన రెండో యాంటియోకస్‌ను గురించిన ప్రస్తావన తరచుగా కనిపిస్తున్నది. భౌగోళికంగా సన్నిహితుడైనందువల్ల పూర్వ భాంధవ్యంవల్ల ఇతర గ్రీకురాజుల కంటె యాంటియోకస్‌తో అశోకునకు ఎక్కువ పరిచయం ఉండి ఉంటుంది. అశోకుడు దౌత్యరాయబారాలు పంపిన ఇతర గ్రీకు రాజులు : ఈజిప్టునేలిన రెండోటాలెమీ ఫిలడల్ఫోస్, సిరీన్ రాజైన మేగస్, మేసిడోనియా రాజైన గొనతాస్, ఎపిరస్ ప్రభువైన అలెగ్జాండరు.

బహుశా వాయవ్య ప్రాంతంలో నిర్దుష్టమైన సరిహద్దురేఖ ఉండి ఉండదు. సరిహద్దు పొడవునా గ్రీకుస్థావరాలేర్పడి తక్షశిలలోని రాజప్రతినిధితో సంబంధాలుండేవి. మౌర్యచక్రవర్తులతో విరోధంగాని, స్నేహంకాని ఈ సంబంధాల స్వభావంమీద ఆధారపడి ఉండేది. మౌర్య ప్రభుత్వానికి ఆ స్థావరాలపై ఆధిపత్యం ఉన్నదనడంలో సందేహం లేదు. ప్రధానంగా గ్రీకుస్థావరాలే అయినప్పటికీ వాటిపై భారతదేశ ప్రభావం అధికంగా ఉండేది. సామ్రాజ్యంలోపల వెలుపల కూడ ధమ్మ మహామాత్తులు పనిచేసేవారు. బాటలు నిర్మించడం, మూలికలు నాటడం మొదలైన సాంఘిక సంక్షేమ కార్యక్రమాలలో సహాయకారులైనందున ధర్మమహామాత్తుల చర్యలకు ఆక్షేపణ ఉండే అవకాశం లేదు. భౌగోళికంగా సమీపంలో ఉన్నందున గ్రీకు స్థావరాలు మౌర్య ప్రభావ పరిధిలో ఉండేది.

ఉత్తరాన కాశ్మీర్‌లో అశోకుని సంబంధాలను గురించి ప్రామాణికులైన రచయితలు అనేక రకాలుగా ఊహలు చేశారు. కాని అశోకుని ఆధిపత్యాన్ని గురించి స్పష్టమైన సాక్ష్యంలేదు. అశోకుడు శ్రీనగర్‌ను నిర్మించినట్లు కల్హణుడు తన రాజ తరంగిణిలో చెప్పినాడు. మరొక ఐతిహ్యాన్ని బట్టి తక్షశిల తిరుగుబాటు నణచిన తరువాత అశోకుడు ఖశాప్రాంతాన్ని జయించినాడట. ఇది నేటి కాశ్మీరులో నైఋతి ప్రాంతం. కునాలుని అంధునిగా చేసినందున దేశ బహిష్కృతులైన అధికారులను గురించి హుయాన్ సాంగ్ నిగూఢమైన కథ ఒకటి చెప్పినాడు. ఈ అధికారులు ఖోటాన్‌కు తూర్పుగా నివాస మేర్పరచుకొన్నారు. అదే సమయంలో ఖోటాన్‌కు పశ్చిమాన చైనా రాకుమారుడొకడు రాజ్యాన్ని స్థాపించినాడు. ఈ రాకుమారునకు భారతీయాధికారులకు సంఘర్షణ జరిగిందని హుయాన్‌సాంగ్ చెప్పినకథ. కాశ్మీరు అనేక కార్యక్రమాలకు ఆటపట్టయిందని సారస్వత

ఆధారావల్ల తెలుస్తుంది. కాని దురదృష్టవశాత్తూ మౌర్యయుగానికి చెందినవని నిర్ణయింపగల అవశేషాలేవీ కాశ్మీరులో లభించలేదు. కాశ్మీర్ సులభంగా అందుబాటులో లేనందున వాయవ్య సరిహద్దుల కిచ్చినంత ప్రాముఖ్యాన్ని కాశ్మీరు కిచ్చినట్లు కనిపించదు. సామ్రాజ్యంలో ఖశా ప్రాంతం చేరిందని నమ్మకపోవడానికి ఆధారం లేదు. కాశ్మీరు సామ్రాజ్య అంతర్భాగం కాకపోయినా మౌర్యప్రభావ పరిధిలోనిదే. కాశ్మీరు ప్రజలు సయితం ఇతర సరిహద్దుప్రాంత ప్రజల హోదానే పొందినారు.

బుద్ధుని మరణానంతరం 250 సంవత్సరాలకు అంటే క్రీ. పూ. 236లో అశోకుడు ఖోటాన్ దర్శించినాడని టిబెట్ట ఐతిహ్యం నొక్కి చెబుతున్నది. ఆ ఐతిహ్యం ప్రకారం ఖోటాన్ రాజ్యాన్ని భారతీయులు చైనీయులు కలిసి స్థాపించినారు. ఇందలి సంఘటనలు హుయాన్‌సాంగ్ కథనంలోని సంఘటనలను పోలి ఉన్నాయి. బహుశా ఖోటాన్ దర్శించినపుడు హుయాన్‌సాంగ్ ఆ కథను మొట్టమొదట విని ఉంటాడు. ఖోటాన్‌కు అశోకుని యాత్రాకథ నమ్మశక్యంగా లేదు. 33వ పాలనా సంవత్సరానికి అశోకుని వయస్సు కనీసం అరవై సంవత్సరాలు. ఆ వయస్సులో పర్వత ప్రాంతాలమీదుగా సాహసోపేతమైన యాత్ర సాగించినాడనడం సంభావ్యంకాదు. అయితే ధర్మ ప్రచారక బృందాలను పంపి ఉండడం సంభావ్యం.

ఆధునిక నేపాల్ ప్రాంతంలో అశోకునకు సన్నిహిత సంబంధం ఉన్నట్లు కనిపిస్తున్నది. అశోకుడు రుమ్మిండైను దర్శించడం విదేశాన్ని సందర్శించడంగా భావించడానికి అవకాశం లేదు. కాబట్టి నేపాలులో కొంతభాగమైనా సామ్రాజ్యంలో చేరి ఉండేదని చెప్పవచ్చు. రుమ్మిండై యాత్రలో అశోకుని వెంట అతని కుమార్తె చారుమతి వెళ్ళిందనీ నేపాల్ క్షత్రియ రాకుమారుడైన దేవపాలునితో ఆమె వివాహం జరిగిందనీ ఒక ఐతిహ్యం. యువరాజుగా ఉన్నప్పుడే అశోకుడా ప్రాంతంలో తిరుగుబాటు నణచినట్లు చెబుతారు. అందువల్ల నేపాల్ అంతర్భాగానికి అశోకుని పరిపాలన విస్తరించక పోయినప్పటికీ కనీసం తరాయ్ అతని సామ్రాజ్యంలో చేరిందనడం తథ్యం. అశోకుడు నేపాలును దర్శించినాడని నేపాల్ సంప్రదాయం నొక్కి చెబుతున్నది. ఇది రుమ్మిండైను దర్శించడమే కావచ్చు. లేదా ఆ సందర్భంలో అశోకుడు నేపాల్‌లో పర్యటించి ఉండవచ్చు. నేపాల్‌లో కొన్ని దేవాలయాలను అశోకుడు నిర్మించినాడని చెబుతారు. వాటిలో పశ్చిమ నేపాలులోని స్వయం భూనాథ గిరిమీద బౌద్ధ భిక్షువులు నిర్మించిన పుణ్యశాల ఒకటి. కాని ఇది పుణ్యశాలకు ప్రాచీనతను, ప్రతిష్ఠను ఆపాదించే ఉద్దేశంతో తరువాతి కాలంలో కల్పించిన గాథ అయి ఉండవచ్చు.

తూర్పున వంగరాష్ట్రం సామ్రాజ్యంలో చేరి ఉంది. ఆ ప్రాంతంలోని తామ్రలిప్తి

మౌర్యయుగంలో ప్రధాన రేవు పట్టణం. దేశంలోని ప్రధాన నౌకాయాన కేంద్రాలలో ఒకటి. సింహళ భారతదేశాల మధ్య రాయబారులు తామ్రలిప్తి గుండా ప్రయాణం చేసేవారు. కళింగ రాజ్యాక్రమణ తూర్పు భారతంపై మౌర్యుల ఆధిపత్యాన్ని పటిష్టంచేసి ఉండవలె. గంగానదీ ముఖద్వారంలో ఇటీవల జరిగిన పురావస్తు త్రవ్వకాలలో విస్తృతంగా మౌర్య స్థావరాలు బయటపడ్డాయి. ఇది ఆశ్చర్యపడవలసిన పరిశోధనేమీకాదు.

ఉత్తర భారతంలో కంటె దక్షిణాన అశోకుని అధికార విస్తరణ ప్రభావాలను గురించిన లిఖిత ఆధారాలు ఎక్కువ ఉన్నప్పటికి ఊహాపోహలకు కూడ అవకాశం ఎక్కువగానే ఉన్నది. దక్షిణ భారతంలో అశోకుని అధికార విస్తరణను గురించి వాఙ్మయ పూర్వక, శాసనస్థములైన ఆధారాలలో సాక్ష్యం లభిస్తున్నది. తరువాతి కాలానికి చెందిన పల్లవ దానశాసనం అశోకవర్మను కాంచీపాలకుడుగా పేర్కొంటున్నది. ఇది మౌర్య చక్రవర్తిని గూర్చిన ప్రసక్తి కావచ్చు. లేదా ఆ పేరు ధరించిన దక్షిణ భారత పరిపాలకునదైనా అయి వుండవచ్చు. ప్రముఖ ఔత్తరాహ చక్రవర్తుల పేర్లతో సంఘటనలను ముడి పెట్టి అధిక గౌరవం పొందాలని దాక్షిణాత్య సంప్రదాయం తాపత్రయ పడలేదు. అందుచేత కొన్ని బౌద్ధ గ్రంథాలకంటె దాక్షిణాత్య సంప్రదాయమే ఎక్కువ ప్రామాణికము. అంతేకాక అశోకునకు సంబంధించినంతవరకు మౌలిక సంప్రదాయంతో జోక్యం కలిగించుకొనే బౌద్ధ ఐతిహాసికులు దక్షిణ దేశంలో లేరు. గావిమఠ్, పాల్కిగుండు, బ్రహ్మగిరి, మస్కీ, ఎర్రగుడి, సిద్ధాపూర్, జటింగ్ రామేశ్వర్‌లలో దొరికిన అశోక శాసనాల నుండి శాసనస్థమైన సాక్ష్యం లభిస్తున్నది. ఈ ప్రదేశాలు సామ్రాజ్య దక్షిణ సరిహద్దులను గురించి సూచిస్తాయి. ఈ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను గురించిన ప్రసక్తికూడ ఈ శాసనాలలో ఉంది.

క్రీ. పూ. మూడు లేదా రెండో శతాబ్దంలో శిలాశాసనాలు వ్రాయడంలో సిద్ధహస్తులైన దేశాంతరాధివాసులు తమిళ కవిత్వాన్ని లేఖ్యం చేసినారనే ఐతిహ్యం ఒకటి ఉంది. ఈ దేశాంతరాధివాసులు దక్షిణాదికి విస్తరించిన ఆర్యజాతులే. శిలాశాసనాల ప్రసక్తి అశోక యుగాన్ని సూచిస్తున్నది. ఈ సంప్రదాయాన్ని అంగీకరిస్తే ఉత్తరాది నుండి బ్రాహ్మీ వచ్చేవరకు దక్షిణ భారతంలో లిపిలేదని చెప్పవలసి ఉంటుంది. సామ్రాజ్య దక్షిణ ప్రాంతాలను చాల వరకు జయించింది బిందుసారుడే. క్రీ. శ. మొదటి మూడు శతాబ్దులలో మామూల్‌నార్ మొదలైన తమిళ కవులు నందులను, మౌర్యులను ప్రస్తావించినారు. నందరాజులు అపార ధనాన్ని సేకరించి పాటలీపుత్రంలో గంగానదిలో దాచినట్లు తమిళ కవులు వర్ణించినారు. మోరియార్ దక్షిణ దిగ్విజయ యాత్రను తమిళ కవితా సంకలనాలు ప్రస్తావిస్తున్నాయి. వీరు మౌర్యులవలె కనిపిస్తున్నారు. తమిళ దేశానికి అంటే వటుకార్ నుండి వచ్చిన

మహోజ్వల సైన్యంగా మోరియారును వర్ణించినారు. కాని ఈ మహాసైన్యం ఇరుకు కనుమను సమీపించి దాటలేక వెనుకకు మరలవలసి వచ్చింది. మరొక సందర్భంలో వారు విజయం సాధించారు కాని కనుమను రక్షిస్తున్న సైన్యం వారికి ఉన్న తేజోవంతమైన చక్రాన్ని కూల్చినారు. వటుకారులు సూర్య భూమి నుండి వచ్చినట్లు చెప్పినారు. ఆ కనుమ వెల్లిమలై (వెండికొండ)లలో ఉన్నదని, ఆ కనుమను రక్షిస్తున్న వటుకారులు తెలుగు కన్నడ ప్రజలని, సూర్యభూమి ఆదిత్యమండలమని పై గ్రంథానికి వ్రాసిన భాష్యం సూచిస్తున్నది. దీన్ని బట్టి దక్షిణ దేశాన్ని జయించడం మౌర్యులకు సులభసాధ్యం కాలేదని తెలుస్తున్నది. ఈ విషయాన్ని గుర్తించే బహుశా అశోకుడు దక్షిణదేశ దిగ్విజయ ప్రసక్తిని మానుకొని ఉంటాడు. క్రీ. శ. మొదటి శతాబ్దానికి చెందిన తమిళ సారస్వతంలో 'వర్కడు' ప్రస్తావన ఉంది. ఇది ఉత్తరపు సామ్రాజ్యానికి సరిహద్దు రేఖ. ఇది అశోక సామ్రాజ్యపు దక్షిణ సీమలతో ఇంచుమించుగా సరిపోతుంది.

అశోకుడు నిర్మించినట్లు ప్రసిద్ధమైన రెండు స్థూపాలను దక్షిణదేశంలో ఒకటి చోళ రాజ్యంలోను, మరొకటి పాండ్య రాజ్యంలోను – తాను చూచినట్లు హుయాన్‌సాంగ్ చెప్పినాడు. ఈ అంశం బౌద్ధమత ప్రచారక బృందాలు ఈ ప్రాంతాలను చేరినట్లు సూచిస్తాయి. కావేరినదికి దక్షిణంగా ఉన్న దేశంలో కూడ అశోకుడు, మహీంద ఉభయులు నిర్మించిన స్థూపాలను హుయాన్‌సాంగ్ పేర్కొన్నాడు. ఆయా ప్రాంతాలను గురించి హుయాన్‌సాంగ్‌కు వివరించిన వారు ఆస్థూపాల ప్రాచీనతను, ప్రాముఖ్యాన్ని నచ్చచెప్పటానికి అశోకునితో ముడిపెట్టినారని చెప్పవచ్చు. అదీకాక రెండు సాంప్రదాయాలలో ఒకదానితోనొకటి తారుమారు చేయడం వల్ల కూడ ఇట్టివి జరిగి ఉండవచ్చు. అశోకుడు ఈ ప్రాంతాలకు ధర్మ ప్రచారక బృందాలను పంపి ఉండవచ్చు. అశోకుడు బౌద్ధ మతస్థుడని ప్రచారంచేస్తూ, ఈ బృందాలే దక్షిణదేశంలో స్థూప విహారాలు నిర్మించుకొని ఉండవచ్చు. సముద్రంమీదుగా మహీంద సింహళానికి వెళ్ళిన సందర్భంలో ఈ ప్రదేశాలను దర్శించి ఉండవచ్చు.

దాక్షిణాత్య రాజ్యాల నాగరికతా ప్రమాణం చాల ఆసక్తిదాయకమైన సమస్య. అశోకుని అనంతరం మూడు శతాబ్దాలకు ఈ రాజ్యాలు రోమన్ సామ్రాజ్యంతో విస్తృతమైన వాణిజ్యాన్ని సాగించినాయి. అందుచేత అశోకుని కాలంలోనే ఈ రాజ్యాలు ఉత్తమ నాగరికతా సంస్కృతులను సాధించినవనడం తథ్యమనిపిస్తుంది. ఈ రాజ్యాలు అశోకుని కాలంలో మౌర్యులతో విరోధం వహించినట్లు లేదు. బహుశా అందుచేతనే అశోకుడు దాక్షిణాత్య రాజ్యాలను జయించడానికి సంకల్పించి ఉండడు. అదీకాక కళింగలో కలిగిన అనుభవం

కూడ అతణ్ణి 'యుద్ధం కొరకు యుద్ధం' అనే సిద్ధాంతం నుండి విముఖుణ్ణిచేసి ఉంటుంది. తమిళ పద్య కావ్యాలలోని మౌర్యసైన్య వర్ణనలవల్ల మౌర్య సైనిక బలం దాక్షిణాత్యులపై గాఢమైన ప్రభావాన్ని ప్రదర్శించినట్లు తెలుస్తున్నది. దక్షిణదేశంపై మౌర్య విజయయాత్ర జరిగి పూర్తిగా ఒక తరం నిండలేదు. అందుచే మౌర్యులను దాక్షిణ్యాలు భయ గౌరవాలతో పరిగణించినారు. కళింగ యుద్ధాన్ని గురించిన వర్తమానంకూడ తమిళులు మౌర్య చక్రవర్తికి వశవర్తులు కావడంలో తోడ్పడి ఉంటుంది. సామ్రాజ్య సరిహద్దులలోని ఇతర ప్రజలవలె దాక్షిణాత్యులుకూడ అశోకుని నామమాత్రపు సార్వభౌముడుగా అంగీకరించి అతని ధర్మమహామాత్తులను ఆహ్వానించి ఉంటారు. అంతేకాని ఆ ప్రాంతాలు సామ్రాజ్య భాగాలు మాత్రం కావు.

అశోకుని పాలన కాలమంతా సింహళం మిత్రరాజ్యంగానే ఉంది. సింహళాన్ని శాసనాలలో తంబపణ్ణి అని పేర్కొన్నారు. సింహళ చరిత్రలలో కూడ సింహళ భారత దేశాలమధ్య సంబంధాలను గురించిన సమాచారం లభిస్తున్నది. తరువాతి శతాబ్దాలలో ఈ గ్రంథాలలో ప్రక్షిప్తాలు జరిగినాయని భావించినప్పటికీ, మౌలికంగా వీటిని సాక్ష్యాధారాలుగా అంగీకరించవచ్చు. ఈ రెండు దేశాల మధ్య మహీందునిరాకయే ప్రథమ, అధికారిక సంబంధం కాదు. మహీందుని ప్రయాణానికి పూర్వమే మత ప్రచారకులు సింహళానికి వెళ్ళినట్లు పదమూడవ శిలాశాసనం చెబుతున్నది. సాక్ష్యాధారాలవల్ల అశోకునకు పూర్వమే భారత సింహళాలమధ్య సంబంధాలు ఉన్నవని మహీందుని రాకకు పూర్వమే సింహళంలో బౌద్ధం ప్రవేశించినదని తెలుస్తున్నది. సింహళ రాజైన దేవానాం పియ తిస్సను బౌద్ధమతం స్వీకరించటానికి ప్రోత్సహించడమే మహీందుని ఘనత. తిస్స బౌద్ధం స్వీకరించడంతో సింహళంలో ఆ మతానికి ఇంచుమించు అధికార హోదా లభించింది. మహీంద ఉత్తర సింహళంలలో దిగినాడు. అంతకు పూర్వమే దక్షిణ సింహళంలో బౌద్ధ స్థూపాలున్నట్లు తెలుస్తున్నది. దక్షిణ ప్రాంతంలో చాల ప్రాచీన స్థూప శిథిలాలున్నాయి. సంఖ్యలోకూడ ఉత్తర సింహళంలోకంటె బౌద్ధ శిథిలాలు దక్షిణప్రాంతంలోనే ఎక్కువ. సింహళంలో బౌద్ధమత ప్రచారకులుపయోగించిన భాషను గురించిన సమస్య ఒకటి ఉంది. మొట్టమొదటి బౌద్ధ ప్రచారకులు ప్రాకృతంలోనే మత బోధ గావించినట్లు తెలుస్తున్నది. దక్షిణ సింహళంలోని ప్రాకృత భాషా శాసనాలు ఆ ప్రాంతానికి ప్రాకృత భాషా పరిచయాన్ని సూచిస్తున్నవి. విజయుడు సింహళం రావడానికి నాగరికతా ప్రాముఖ్యం ఉన్నట్లు సింహళ చరిత్రలు వ్రాయడంలో ఒక వైశిష్ట్యం ఉంది. భారతదేశం నుండి పెద్ద ఎత్తున నావికులదళం వలస వచ్చినందున రాజకీయంగాను,

సాంస్కృతికంగాను సింహళాన్ని భారతదేశం జయించిందన్న అంశాన్ని ఈ కథ నిగూఢంగా చెబుతున్నదనవచ్చు. విజయుని జన్మను గురించిన విచిత్రగాథ ఒకటి ఉంది.

మహాపరి నిర్వాణం రోజునే అతడు సింహళంలో ప్రవేశించాడని మరొక కథ. ఈ గాథలన్నీ విజయుని అద్భుత వ్యక్తిగా చిత్రించడానికి చేసిన ప్రయత్నాలని చెప్పవచ్చు. మొట్టమొదటి బౌద్ధులు విజయుని అనుయాయులుగా సింహళానికి వచ్చి ఉండవచ్చు. వారే ప్రాకృత భాషనుకూడ తెచ్చి ఉంటారు. సింహళంలోని ప్రాకృత శాసనాలు ఉత్తీయరాజు కాలానివి. తిస్స తరువాత ఉత్తీయ సింహాసన మెక్కినాడు. ఈ శాసనాల భాషకు, అశోకుని శాసనాల భాషకు ఎక్కువ వ్యత్యాసం లేదు. ఉత్తీయ శాసనాలు సయితం బ్రహ్మీలిపిలోనే వ్రాసినారు. ఈ అంశాలన్నీ మహీందుని రాకకు పూర్వమే ప్రాకృత భాషకు సింహళంలో ఒక చరిత్ర ఉన్నట్లు సూచిస్తున్నాయి. అందుచేత అధికార పత్రాలలో ప్రాకృతాన్ని వాడడం సమర్థనీయమే.

ప్రాచ్య భారతంలోని వంగదేశం నుండి విజయుడు సింహళానికి వచ్చినట్లు సింహళ ఇతిహాసాలు చెబుతున్నాయి. కాని అతని జన్మస్థలాన్ని గురించి చాల గందరగోళం ఉన్నది. సింహళయాత్రలో అతడు మొదట సుప్పారకలో దిగినట్లు ఉంది. సుప్పారా అనేది నేటి సొపారా. ఇది తమ పూర్వీకులు భారతదేశ పశ్చిమ తీరంనుండి వచ్చినారని సింహళ ప్రజలలో ఉన్న సంప్రదాయాన్ని బలపరుస్తున్నది. ప్రాచీన సింహళ భాష తూర్పు ప్రాకృతంవల్ల ప్రభావితమైనట్లు కన్పిస్తున్నప్పటికీ 'స' కు బదులు 'హ' ను వాడడం పశ్చిమభారత ప్రభావాన్ని సూచిస్తున్నది. అరిర్ధ సముద్రంమీదుగా పయనించి వింధ్యపర్వతాలను దాటి పాటలీపుత్రాన్ని చేరిన గాధకూడా చాల ఆసక్తిదాయకమైంది. వింధ్యపర్వతాలను దాటడం అతడు పశ్చిమతీరం వెంట పయనించినట్లు సూచిస్తున్నది. అందుచేత సింహళంలో స్థిరపడిన భారతీయులు తూర్పు, పశ్చిమ తీరాలనుండి వచ్చినారనేది స్పష్టమౌతుంది. ఈ రెండు సంప్రదాయాల కలయికయే సింహళ గ్రంథాలలోని గందరగోళానికి కారణమని చెప్పవచ్చు. మహీంద రాకపూర్వం అన్ని మతాలవారు సింహళంలో ఉన్నట్లు మహావంశ సూచిస్తున్నది. విజయుని పట్టమహిషి పాండ్య రాకుమారి అని చెప్పినందున సింహళ దక్షిణ భారతాల మధ్య ఈ యుగంలో ఉన్న సన్నిహిత సంబంధం స్పష్టమౌతున్నది. ఆమె బుద్ధుని బంధువు. ఆమె, ఆమె చెలికత్తెలు భిక్షుణీ వేషాలలో సింహళానికి వచ్చారు. బహుశా ప్రయాణంలో రక్షణ నిమిత్తమై ఆ వేషాలు ధరించి ఉంటారు. మహీందునకు పూర్వమే సింహళంలో బౌద్ధం ఉందనడానికి ఈ ఒక్క అంశం చాలు. ఈ విధంగా ఉన్న సంబంధాలు అశోకుని పదునాల్గో రాజ్య సంవత్సరంలో

అతని ధర్మ మహామాత్తులు సింహళానికి రావడంతో బలపడినాయి. ఆ తరువాత తిస్సకు బౌద్ధం బోధించి బౌద్ధసంఘాలు నిర్మించే ఆశయంతో మహీంద సింహళానికి వచ్చినాడు.

సింహళంలో అశోకుని సంబంధం కేవలం రాజకీయంకాదు. అశోకుడు, తిస్స చాల సన్నిహితంగా ఉండేవారు. పట్టాభిషేకానికి ఐదు సంవత్సరాలకు పూర్వమే సింహళానికి వచ్చిన ధమ్మ మహామాత్తులతో తిస్సకు పరిచయమైంది. ఆ ఉద్యోగుల కృషి ఫలితంగా అశోకుని గురించి తెలుసుకొన్నాడు. అశోకుని వ్యక్తిత్వం తిస్సను ప్రభావితుణ్ణి చేసింది. తిస్సకంటె అశోకుడు పెద్దవాడు. అందుచే అశోకుడు ఆదర్శంగా తనను తాను తీర్చి దిద్దుకోవాలని తిస్స నిర్ణయించి ఉంటాడు. తిస్స ప్రథమ పట్టాభిషేకం అశోకుని పదునేడో రాజ్య సంవత్సరంలో జరిగింది. మరికొంత కాలానికి జరిగిన ద్వితీయ పట్టాభిషేకానికి భారతదేశ ప్రతినిధి తిస్సని ఆహ్వానించినాడు. ఈ మర్యాదకుబదులుగా బహుమతులతో పాటు అశోకుడు తన రాయబారిని పంపినాడు. ఈ రాయబారంతోనే బహుశా మహీంద వచ్చి ఉంటాడు. మహీందయే అశోకుని ప్రతినిధి. అతణ్ణి బౌద్ధ భిక్షువులు అనుసరించినారు. బౌద్ధ మతాన్ని స్వీకరించడమేగాక తిస్స ఆ మతాన్ని రాజమతంగా చేసినాడు. బహుశా అశోకుని పట్లగల అభిమానంతో దేవానం ప్రియ బిరుదాన్ని ధరించినాడు. ఇది పరస్పరం ఉన్న అభిమానాన్ని సూచిస్తున్నదేగాని తిస్స అశోకుని సామంతుడని సూచించదు. ఉభయరాజ్యాల మధ్య వాణిజ్య సంబంధాలున్నాయి. రాజకీయ సంబంధాలు బలపడినాయి. పరస్పరం రాయబారాలు ఎక్కువగానే నడచినాయి. కాని సింహళ దేశం స్వతంత్రంగానే ఉంది.

## ఐదో అధ్యాయము

# ధమ్మ విధానము



'దురాశాపరుల లక్ష్యాలకు, కృత్యాలకు అంతఃకరణ మెంతగా అసమ్మతి తెల్పినా ప్రయోజనంలేదు. బాధితుల లక్షలాది ప్రార్థనలు భగవంతునిచేరినా లాభం లేదు. తరచుగా తనకు తెలియకుండానే గొప్పవాడు తన ఉన్నత ఆశయాన్ని సాధిస్తాడు. ఒక యుగాన్ని పాలిస్తున్నానని, తన స్వభావానికి తానే నిర్ణేతనని విశ్వసిస్తాడు. ఒక శకం అతని వ్యక్తిలో ప్రతిఫలిస్తుంది.' అనేది కాన్‌స్టన్‌టైన్‌ను గురించీ, అతని యుగాన్ని గురించి బుర్‌ఖార్డ్టు పండితుడు చేసిన తీర్మాన సారాంశము. ఈ విధంగా చెప్పడం కాన్‌స్టన్‌టైను గాని, అంతటి ఆకాంక్షలు గల మరియే వ్యక్తిగాని అతని యుగ ఫలితమేనని ఏవ్యక్తీ తన యుగానికి బాహ్యంగా గాని, ముందుగా గాని ఉండలేదని సూచించడం కాదు. స్వీయజనులకు వ్యతిరేకంగా గూడ తరచు తన జాతిని, సమాజాన్ని, కులాన్ని శాసిస్తూ ఉండే వ్యక్తి గతసంగుడైన ప్రవక్తా కాడు, దుష్టవర్తనుడైన నిరంకుశుడూ అయి యుండడు. లేదా తన యుగానికి భిన్నమైన అలౌకిక దృష్టిగల పురుషుడూ కాదు. నిశితంగా పరిశీలిస్తే తన పదవిని, అధికార కాంక్షను నిర్మించుకొనడానికి అతడుపయోగించిన మౌలికాంశాలు అతడు జన్మించిన సమాజంలోనే కన్పిస్తవి. ప్రత్యేక పరిస్థితులకు సమాజ

ప్రతిచర్యలే వ్యక్తిగతంగా సమాజ సభ్యుల భావాలకు కారణమౌతాయి. పరిస్థితులతో సమాధానపడడం ద్వారా గాని, పరిస్థితులను అంగీకరించడం లేదా నిరాకరించడం ద్వారా గాని వ్యక్తుల స్వభావాలు ఏర్పడుతాయి.

అధికారంలో ఉన్న వ్యక్తి అనుసరించే విధానాలు చాల వరకు అతని యుగంతో గాని, యావత్సమాజంతో గాని సంబంధించక కేవలం వ్యక్తిగతమైన ఇష్టానిష్టాలపై ఆధారపడి ఉంటాయని చెప్పటం కద్దు. కాని ఇట్టి వ్యక్తుల స్వాతంత్ర్యం కూడ పైకి కన్పించేది మాత్రమే. వ్యక్తిపై సమాజ ప్రభావాన్ని పరిశీలించడంవల్ల వ్యక్తి చర్యలకున్న కారణాలు స్పష్టమౌతాయి. కనీసం ఒక్క సాంఘిక శక్తి ప్రభావమైనా వ్యక్తిపై కనిపిస్తుంది. తమ చుట్టూ ఉండే స్త్రీ పురుషుల చర్యలతో ప్రమేయం లేని ఆంతరంగిక నిస్సంగ జీవితం గడిపే యథార్థ తపోధనులను మినహాయించి (వీరి విషయం కూడ అనుమానాస్పదమే) సాధారణ మానవుల చర్యలన్నీ తమ చుట్టూ ఉన్న ప్రజల భావాల, కార్యకలాపాల అనుభవంతో శిక్షణ పొందుతాయి.

అశోకుడు ఊహాజీవి కాడు. బౌద్ధ సంబంధమైనది కాని, ఇతరమైనది కాని ప్రత్యేక దివ్యజ్ఞానమేమీ అతడు పొందలేదు. అతని భావాలు అతని యుగానికి చాల ముందుగా ఉన్నవనీ, అనువైన సమయానికి ముందు వ్యక్తం చేసినందువల్లనే అవి విఫలమైనవనీ ఒక అభిప్రాయం ఉంది. కాని ఆ అభిప్రాయాన్ని అంగీకరించలేము. ఏకాకి ప్రకృతిగా గాక చారిత్రక నేపథ్యంలో పరిశీలిస్తే అశోకుని ధమ్మ విధానానికి కారణమూ ఆ విధానం ఏమి సాధించినదీ స్పష్టమౌతుంది. అతని యుగాన్ని పూర్తిగా అర్థం చేసికొనడానికి మౌర్యుల ఆసన్నగతాన్ని, నాడు బౌద్ధమత వికాసాన్ని, బౌద్ధ మతానికీ అశోకుని భావాలకు ఉన్న సంబంధాన్ని స్పష్టంగా గ్రహించవలె.

నాటి వైజ్ఞానిక రీతులలోను, భావాలలోను మౌర్యులు గొప్ప ఆసక్తిని ప్రదర్శించినారనేది సాంఘిక, వైజ్ఞానిక జీవితంతో వారికిగల వివిధ సంబంధాలను బట్టి స్పష్టమౌతుంది. చంద్రగుప్తుడు జైన మతాన్ని స్వీకరించడమే గాక సింహాసనాన్ని త్యజించి పరివ్రాజకుడై సనాతన జైన పద్ధతిలో ఉపవాసం ద్వారా క్రమంగా మరణించినట్లు చెబుతారు. రాజు కావడంలోనూ, సామ్రాజ్య నిర్మాణంలోను ఆతడెదుర్కొన్న కష్టాలనుబట్టి ఆలోచిస్తే చివరి రోజులలో అతడు రాజ్య పరిత్యాగం చేసి, పరివ్రాజకుడైనాడని నమ్మటం కష్టం. మహావీరుని బోధనలు విని జైనుడైనాడని నమ్మవచ్చు. లేదా జన్మతః వైశ్యుడైనందున కులీన ప్రభు వర్గాల ద్వేషానికి గురి కాకుండ తప్పించుకొనడానికై అతడు జైన మతంలో ఆసక్తి చూపినాడని సమర్థింపవచ్చు. కాని ఆ యుగంలో మహావీరుని బోధనలు హిందూమతం నుండే ఉద్భవించినవని భావించేవారు. అందుచేత తాము పురాతన మతంలోని

ఉపశాఖగానే జైనులు పరిగణించుకొన్నారు. కాబట్టి పై అభిప్రాయాన్ని త్రోసిపుచ్చవచ్చు. ఉన్నతవర్ణ హిందువుల నైతిక విలువలు వర్ణ నియమాలు ఆధారంగా నాటికే నిర్ణీతమైనందున వారి దృష్టిలో జైనమతం పుచ్చుకొన్నంత మాత్రాన సాంఘిక గౌరవం పెరిగే అవకాశంలేదు. కాబట్టి జైన మతంలో చంద్రగుప్తుని ఆసక్తి కేవలం తాత్త్వికమేనని చెప్పవలె.

జైన మతాన్ని బుద్ధునకు సమకాలికుడైన మహా వీరుడు స్థాపించినాడు. అందుచే బౌద్ధ, జైనాలలో చాల సమానాంశాలున్నాయి. నిగ్రంధులనే పరివ్రాజకులతో చేరడంతో మహా వీరుని తాపన జీవితం ప్రారంభమైంది తరువాత నిగ్రంధ పదం జైన భిక్షుకులకు వాడినారు. ప్రకృతి ధర్మాన్ననుసరించి విశ్వం యావత్తూ నడుస్తున్నదని జైనుల విశ్వాసం. ఈ విశ్వాసం భగవంతుని ఉనికిని అంగీకరించవలె అనే నియామకానికి అవకాశం లేకుండా చేస్తున్నది. అభివృద్ధి, క్షీణత అనే తరంగాలుగా విశ్వ పరిణామం సాగుతుంది. ఆత్మ ధరించే ఆచ్ఛాదనమే మానవ శరీరం. మౌలికమైన పరిశుద్ధ దశను ఆత్మ సాధించినప్పుడే పునర్జన్మనుండి విముక్తి లభిస్తుంది. నేటి వలెనే నాడు కూడ జైన మతానికి వర్తక వర్గాలనుండే ప్రాపకం లభించింది.

చంద్రగుప్తుని ఆస్థానంలో జైన మతము ఏకైక ప్రభావం కాదు. అతని దృక్పథంలోని సమతా భావాన్ని ఆ స్థానంలో ఉన్న కొద్దిమంది గ్రీకులు బలపరచినారు. ఐరోపియన్ గ్రంథాలలో చంద్రగుప్తుడు అలెగ్జాండరును నిజంగా కలిసికొన్నట్లు చెబుతున్నారు. కాని ఆ యుగ చరిత్రను వ్రాసిన చరిత్రకారుడొకడు ఆ సంఘటనను సందేహిస్తున్నాడు. (మొదటి అధ్యాయం) సెల్యూకసు మిత్రుడుగా మెగస్తనీస్ పాటలీపుత్రంలో కొంతకాలం గడిపినట్లు తెలుస్తున్నది. గ్రీసు ఆసియా మైనర్లలో అతడెరిగిన ఆలోచనా విధానాన్ని, సంస్థలను గురించి మౌర్య ఆస్థానంలో మెగస్తనీసును ప్రశ్నించి ఉంటారు. భారతదేశాన్ని గురించి అతడు వ్రాసినదాన్ని బట్టి మెగస్తనీసు మంచి బుద్ధికుశలుడని, సునిత పరిశీలనా సామర్థ్యం ఉన్నవాడని తెలుస్తుంది. భారతీయుల ప్రశ్నకాతడు మంచి ఆసక్తితో సమాధానాలిచ్చి ఉండవచ్చు.

సామ్రాజ్యం వాయవ్య ప్రాంతంలోని తక్షశిల విదేశీ ప్రభావాలకు కేంద్రం. సింధునది కావల గ్రీకు స్థావరాలకు సరిహద్దు విశ్వజనీనమైన ఇండో – గ్రీక్ ధిషణా జీవితానికి కేంద్రం. ముఖ్యమైన రహదారిపై ఉంటూ క్రమంగా పాశ్చాత్య భారతీయ భావ సమ్మేళనానికి తక్షశిల అనుకూల కేంద్రమయింది. రాష్ట్ర రాజధానిగా వాణిజ్య కేంద్రంగా తక్షశిలకు మంచి ప్రతిష్ట ఉండేది. భారతీయ సనాతన సంప్రదాయాలను మార్చలేక పోయినా, విదేశీ భావాల ప్రచారానికి అనుమతి ఉండి పరస్పర అవగాహనకు, తత్ఫలితమైన గౌరవానికి తక్షశిలలో అవకాశం ఏర్పడింది.

చంద్రగుప్త సెల్యూకసుల మధ్య వైవాహిక సంబంధాల సంభవా సంభవాలను గురించి ఆసక్తిదాయకమైన ఊహలు చేయవచ్చు. అది జరిగినా జరుగకపోయినా గ్రీకు ప్రభు కుటుంబాలకు చెందిన వనితలు ఒకరో ఇద్దరో మౌర్య ఆస్థాన వర్గాలలోచేరి ఉండవచ్చు. ఇది సందర్భాన్ని బట్టి హిందూసనాతనత్వం మార్దవాన్ని సంతరించుకొని సనాతనేతరాంశాలను గ్రహించడానికి విస్తరించేదని సూచిస్తున్నది. తరువాత అనేక రాజాస్థానాలలో కంటె మౌర్య ఆస్థానంలో స్వేచ్ఛా వాతావరణం ఉన్నట్లు తెలుస్తున్నది. బాల్యంలో అశోకుడు ఈ అంతఃపుర గ్రీకు వనితలను కలిసి ఉండవచ్చు. అశోకుని తండ్రి బిందుసారుడు సమకాలికములైన పోకడలను గమనించినట్లు కనిపిస్తుంది. చంద్రగుప్తుడు జైనుడైనట్లు చెబుతారు కాని తండ్రివలె బిందుసారుడు కూడ జైనుడైనాడని ఆధారం లేదు. తండ్రి జైనమతాభిమాని అయినందున బిందుసారుడు జైనులపట్ల పక్షపాతం వహించి ఉండవచ్చు. అందుచే జైన, బౌద్ధాలవంటి సనాతనేతర మత శాఖలలో అశోకుడు ఆసక్తి వహించినాడని భావించడంలో పొరపాటు ఉండదు. మత విషయాలలో సర్వసమభావం వహించడం యువకుడైన అశోకునకు తండ్రి ఆస్థానంలోనే పరిచయమై ఉండవచ్చు. భిన్న మతాలవారు మౌర్య ఆస్థానంలో స్వేచ్ఛగా వ్యవహరించేవారు.

అశోకుని తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు, అశోకుడు జన్మించినప్పుడు బాలుని జాతకాన్ని చెప్పినది ఆ జీవిక మహర్షి, కాబట్టి మౌర్య ఆస్థానంలో ఆ జీవికులకు ప్రవేశం ఉన్నట్లు తెలుస్తున్నది. నాటి వాదోపవాదాలలో బిందుసారునకు మంచి ఆసక్తి ఉన్నట్లు గ్రీసుదేశం నుండి వేదాంతిని బహుమతిగా నాతడు కోరినట్లు మనకు తెలుసు. కాబట్టి అశోకుడు పెరిగిన సన్నిహిత పరిసరాలనుబట్టి సనాతన ధర్మానికి అనురూపంగాని జీవిత విధానాన్ని అతడనుసరించే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నది.

మౌర్యయుగానికి పూర్వమే బ్రాహ్మణ మతం క్లిష్టమైన మత విధానంగా రూపొందింది. ఇంచుమించు మతాలన్నింటిలోను తాత్త్విక భావన, కర్మకాండ రెండూ కనిపిస్తాయి. కాని బ్రాహ్మణమతంలో ఈ రెండు పోకడలు క్లిష్టతరమైన రూపాన్ని సంతరించుకొన్నాయి. సమకాలిక అవసరాలకు అనుగుణంగా బాహ్య స్వరూపం కొంత మారినా వైదిక క్రతుకాండ కొనసాగుతూనే ఉంది. ఈ క్రతుకాండలో యజ్ఞమే ప్రధానాంగంగా నిలిచింది. కాని యజ్ఞాలు ద్విజన్ములు పూజారులు కులీనులకు మాత్రమే పరిమితం. అప్పుడప్పుడు వాణిజ్య వర్గంలోని ధనికులు సయితం యజ్ఞాలు చేసేవారు. ఇక తాత్త్వికమైన ఊహాగానాలు మరొక ధోరణి. దీనికి బీజాలు ఋగ్వేదంలోనే కనిపిస్తాయి. క్రమంగా ఆ భావనలు శాఖోపశాఖలైనవి. వీటిలో ప్రతి శాఖ ఏదో ఒక మార్గంలోగాని లేదా భిన్నమార్గాల

సమ్మేళనం ద్వారా గాని విశ్వానికి అర్థాన్ని కనుగొనడానికి ప్రయత్నించింది. వీటన్నింటిలో బౌద్ధ, జైన, (నిగ్రంధ) శాఖలు ముఖ్యమైనవి.

ఈ మూడు శాఖలలో ప్రధానమైనవి బౌద్ధం. ఇది బ్రాహ్మణ మతంలో అతిసనాతనమైన దృక్పధానికిభిన్నంగా బయలుదేరింది. సంసారం నుండి ప్రాపంచిక జీవిత శృంఖలాల నుండి పునరావృత్తమయ్యే జనన మరణాల నుండి విముక్తి కాంక్షయే బౌద్ధంలోని ప్రేరణశక్తి. అందుకు మధ్య మార్గభావనలో పరిష్కారాన్ని కనుగొన్నాయి. ఉదాత్తమైన, హేతుబద్ధమైన ఆలోచనా క్రమంతో మధ్య మార్గాన్ని సాధించారు. మధ్య మార్గ సిద్ధాంతానికి బీజం ప్రాచీన హిందూ సంప్రదాయంలోనే ఉంది. కాని బౌద్ధం బోధించిన మధ్య మార్గాన్ని సామాన్యులు, విద్యాహీనులు సయితం అవగాహన చేసుకోగలరు. ఈ మేరకు హిందూ మత కర్మకాండలో ఆలోచనలో ప్రవేశించిన దురాచారాలపై నిరసనగా బౌద్ధం బయలుదేరింది. తాము భూదేవతలమనే అహంకారంతో లౌకికాధికారాన్ని హస్తగతం చేసుకొని ప్రబలమైన స్థానాన్ని ఆక్రమించిన బ్రాహ్మణుల అధికారమే మత దురాచారాలకు కారణమైంది. సుదీర్ఘకాలం ప్రభుత్వ మతం కాగలిగిన స్థాయికి బౌద్ధం ఎన్నడూ చేరలేదు. కాని ప్రథమ దశలలో మత సాంఘిక జీవితంపై బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించే ఉద్యమంగా రూపొందింది. ఈ విషయంలో నాటి భారతీయ సమాజంలోని ఆందోళనను ఐరోపాలోని మత సంస్కరణోద్యమంతో అంటే కేథలిక్ మతం నుండి చీలి ప్రొటెస్టెంటు మతం ఏర్పడిన యుగ పరిస్థితులతో పోల్చవచ్చు. కాని ఈ పోలిక పూర్తిగా సరైనదికాదు. ప్రొటెస్టెంటు ఉద్యమంవలె బౌద్ధం కేవలం తిరుగుబాటు ఉద్యమమే కాదు. ప్రజానీకంలో అమలులో ఉన్న ధర్మాలను, ఆచారాలను గ్రహించడంద్వారా బ్రాహ్మణ మతంకంటె భిన్నమైన మతంగా బౌద్ధం ప్రత్యేకతను సాధించింది. భారతదేశంలో బుద్ధుడొక కొత్తమత వ్యవస్థ నేర్పరచి ప్రచారం చేసినాడు. అందుకు ప్రాచీన హిందూమతంలో అట్టి వ్యవస్థ లేకపోవడమే కారణం. హిందూ మతం కూడ ఒక చారిత్రక పురుషుని బోధనలపై ఏర్పడి సుస్థాపితమైన వ్యవస్థద్వారా పనిచేసినట్లయితే బౌద్ధం కేవలం ఒక తిరుగుబాటుదారులు సాగించిన వేర్పాటు ఉద్యమంగా ప్రారంభమై అంతరించి ఉండేది.

సిద్ధాంత విభేదాలకు వేర్వేరు శాఖల మధ్య ఉండే వైరుధ్యమే కారణము. ఆధ్యాత్మిక వర్గాలలో ముఖ్యంగా శిష్యగణాలలో ఈ విభేదాలను గురించిన చర్చలు జరుగుతుంటాయి. మత సంస్కరణోద్యమ, ప్రతి సంస్కరణోద్యమకాలంలో భిన్న క్రైస్తవ భావాలకు ఉన్న పరిస్థితులే భారతదేశంలో కూడ ఏర్పడినాయి. బ్రాహ్మణులు నిరంతరం వ్యతిరేకించినా సమాజంలోని ఇతర వర్గాలు క్రమంగా అవగాహన చేసుకొని బలపరచడం వల్ల బౌద్ధం

కేవలం తిరుగుబాటు భావ సందోహంగా గాక స్వతంత్ర మతంగా రూపొందసాగింది.

ప్రథమ దశలలో బౌద్ధ మతాన్ని వాణిజ్య వర్గాలు చాల బలపరచినాయి. ఇందుకు కారణం వర్ణ వ్యవస్థపై బౌద్ధం వైఖరి కావచ్చు. బుద్ధుడు స్వయంగా క్షత్రియుడు. బ్రాహ్మణాధిక్యతను తగ్గించటానికి అతని ఉద్యమం ప్రతికూలం కాదు. బౌద్ధంలో సిద్ధాంతరీత్యా వర్ణ వ్యవస్థకు ప్రాముఖ్యం లేదు. త్వరితగతిని ఆర్థిక ప్రాముఖ్యాన్ని సాధిస్తున్న వాణిజ్య వర్గాలు సాంఘికంగా తక్కువ స్థాయిలోనే ఉన్నాయి. బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలు ఈ హైన్యతను నొక్కి చెప్పడం వాణిజ్య వర్గాలకు బాధాకరమైన దనడంలో సందేహం లేదు. సిద్ధాంతరీత్యా వైశ్యులు ద్విజన్ములలోని వారే. కాని ఆచరణలో వారిపట్ల తిరస్కార దృష్టి ప్రదర్శించేవారు. అందుచేత సాంఘికంగా నైచ్యాన్ని అనుభవిస్తున్న వర్గాలకు బౌద్ధం ప్రబోధించిన సాంఘిక సమత్వ సిద్ధాంతం సహజంగా నచ్చుతుంది.

వాస్తవానికి బౌద్ధం సమాజంలోని క్రింది వర్గాలనే ఆకర్షించింది. బౌద్ధంలోని మూలసూత్రాలు సాధారణ వ్యక్తులకు సులభ గ్రాహ్యాలు, మధ్య మార్గం ద్వారా జీవిత సమస్యలకు ఆచరణయోగ్యమైన పరిష్కారాన్ని సూచించింది. క్లిష్టము, నిగూఢమునైన ఆధ్యాత్మిక విద్యను ఆర్థం చేసికొని తీరాలని చెప్పలేదు. ఆచరణ సాధ్యం కాని, అసాధ్యములైన సర్వసంగ పరిత్యాగాన్ని కాని, తపశ్చర్యలను కాని కోరలేదు. వ్యయప్రయాసలతో కూడిన కర్మకాండలను సయితం విధించలేదు.

అశోకుని కాలంలో భిక్షుకీ – భిక్షుక సంఘం ద్వారా బౌద్ధమత ప్రచారం విస్తృతంగా సాగింది. భిక్షువులు శీతాకాలంలోను, వేసవిలోను మతప్రచారం సాగించి, వర్షకాలంలో విహారాలకు మరలేవారు. ఆడంబరమైన యజ్ఞానికి బదులు బౌద్ధానికి చైత్యవాదం అంటే స్థూపపూజ కేంద్రమయింది. ఆభిచారక, మూఢ విశ్వాసమూలకములైన అంశాలపై నొక్కు పెట్టక, ప్రజలనుసరిస్తున్న మతాలను స్వీకరించడం ద్వారా బౌద్ధం సామాన్య ప్రజానీకాన్ని ఆకర్షించడానికి ప్రయత్నించింది. బుద్ధునివి కాని, బౌద్ధ సంఘంలో అర్చనీయుడైన స్థవిరునివిగాని అవశేషాలుంచిన సమాధియే స్థూపము. సాంచిలోపలె సాధారణంగా విహారాలను స్థూపాలనంటి నిర్మించేవారు. బౌద్ధమతానికి స్తంభం మరొక చిహ్నం. ఇది ప్రాచీన రాక్షస గుళ్ళలకు, లేదా లింగచిహ్నానికి అవశేషం. పై రెంటికి, స్థూపానికి స్పష్టమైన సంబంధాన్ని నిరూపించలేముగాని అట్టి సంబంధం ఉండడం సంభవమని మాత్రం చెప్పవచ్చు. అశోకుని యుగంలో పెద్ద దేవాలయాలు లేనందున పూజావస్తువుగా బుద్ధుని ప్రతిమలు వాడే ఆచారం లేదని తెలుస్తున్నది. నేటికి నిలిచి ఉన్న బుద్ధ ప్రతిమలకు ఉదాహరణలు క్రీస్తు అనంతరం మొదటి శతాబ్దివి. అవి గాంధార రాష్ట్రంలో దొరికినవి.

కొందరు చరిత్రకారులు మొట్టమొదటి బుద్ధ ప్రతిమలు గాంధారలోకాక మధురలో తయారైనవని సూచిస్తున్నారు. వాటి జన్మస్థలం ఏదైనా ఆ ప్రతిమలు మౌర్యయుగం తరువాతివే.

కొన్ని శతాబ్దాల హేతుబద్ధమైన తాత్త్విక పరిశీలనకు సాంస్కృతిక పురోగతికి మౌర్యయుగం పరాకాష్ఠ. ఇనుము ఎక్కువగా వాడుకలోనికి వచ్చి అభివృద్ధికరమైన పద్ధతులు అమలులోనికి రావడంవల్ల ప్రాచీన ఆర్యుల సంచారక పశుపాలక సంస్కృతిమారి నగర సహజమైన స్థిర సంస్కృతి ఏర్పడింది. కొత్తభూములను శుభ్రం చేసినారు. జనాభా తూర్పుగా పురోగమించసాగింది. వలసలు, స్థిరనివాసాలు నెలకొల్పడానికి సారవంతమైన గంగానదీ మైదానం అనుకూలించింది. ఈ మార్పులన్నీ క్రీ. పూ. 800–600 సంవత్సరాలమధ్య జరిగినాయి. ఆరోశతాబ్దికి ఉత్తర రాజ్యాలు రూపొందినాయి. మగధ ప్రాముఖ్యం లోనికి వస్తూ ఉన్నది. నదీ వాణిజ్యం ద్వారా గంగానది కొత్త ఆర్థిక జీవితంలో ప్రవేశించింది. ఈ వాణిజ్యమంతా గంగానది పొడుగునా విస్తరించిన చంపారాజ్యం స్వాధీనమైంది. అందుచే చంపారాజ్యం విలువ హెచ్చింది. నాటి ఆర్థిక జీవితంలో వచ్చిన ఈ మార్పులవల్ల సమాజ స్వరూపంలో మార్పులు తప్పనిసరి అయినవి. సమాజంలో క్రింది తరగతిగా నైచ్యానికి పాల్పడుతున్న వాణిజ్య వర్గాలు తమ న్యాయస్థానాన్ని నిలద్రొక్కుకునేందుకు ప్రయత్నించడం సహజం. వారికి సాంఘిక ప్రతిష్ఠ లేదు. కాని వారి కృషివల్లనే సాంకేతికమైన అభివృద్ధి సాధ్యమయింది. ఈ వర్ణాలలో బలపడిన నిరసనభావం నాడు ప్రచారంలో ఉన్న పెక్కు ఆలోచనా క్రమాలలో వ్యక్తమౌతోంది. తాము దివ్యజ్ఞాన సంపన్నులమనే బ్రాహ్మణుల అహంకారానికి వ్యతిరేకంగా ఈ క్రొత్త ఆలోచనాక్రమాలు ప్రయోగసిద్ధమైన జ్ఞానంపై నొక్కుపెట్టినాయి. ఇక సామాన్యుల స్థాయిలో, కర్మకాండలోగాని, తపశ్చర్యలలోగాని పూర్తి నిమగ్నం కానక్కరలేదనే భావం బలపడింది. ఆచరణీయమైన, సంతృప్తికరమైన పరిష్కార మార్గాన్ని వారు అన్వేషింప సాగినారు.

నాటి సామాజిక నీతి విధానంలో ఈ కొత్తభావాలు విదగ్ధమైన ప్రాముఖ్యాన్ని సూచించినాయి. నగర సంస్కృతికి పరివర్తనమంటే నిర్దిష్టమైన సాంఘిక వ్యవస్థ అని అర్థం. సామాజిక జీవితం క్లిష్టతరం కావడంతో సమాజంలో వ్యక్తిపాత్రను గురించిన పాత భావాలను మార్చవలసిన అవసరం ఏర్పడింది. వర్ణవ్యవస్థను కఠినతరం చేయడమే ఈ సమస్యకు బ్రాహ్మణులు సూచించిన పరిష్కారం. కాని బౌద్ధులీ సమస్యలను చాల స్పష్టంగా అర్థం చేసుకొన్నారు. సమాజంలో ప్రతి వ్యక్తికీ బాధ్యతనిస్తూ కొత్త సామాజిక నీతిని రూపొందించినారు. బ్రాహ్మణ సమాజ నీతిలోని నిష్ఠురమైన నియమాలు క్రింది

వర్ణాలలో జన్మించినవారికి వర్తించలేదు; అయితే సామాజిక జీవితపరిధిలో మానవ ప్రలోభాలకులోను కాని వారికి శాశ్వత స్వర్గప్రాప్తిని వాగ్ధానం చేసినాయి.

ఈ కొత్త భావాలకు నాటి రాజకీయ వ్యవస్థకు ఉన్న సంబంధాన్ని పరిశీలించవలె. పశుపాలక దశనుండి నగర సంస్కృతి దశకు పరివర్తనం జరిగినందున పాత రాజకీయ సంబంధాలు మారడం తథ్యం. ఇంతకు పూర్వం ఉత్తర భారతంలోని ప్రాచీన స్థావరాలలో చాలభాగం కేవల జాతి సంబంధాలు ఆధారంగా కూటములుగా గణరాజ్యాలుగా సమీకృతములైనాయి. నేడు స్పష్టమైన రాజకీయ వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. జాతి సంబంధాలనుండి నగరాలలో సాంఘిక బాధ్యత పైకి నొక్కు మారింది. చిన్న చిన్న పశుపాలక స్థావరాలకు విరుద్ధంగా నగరజీవితం క్లిష్టతరం కావడంవల్లనో, ప్రధాన వృత్తిగా వాణిజ్యం పెంపొందడంవల్లనో సుసంఘటితమైన సామాజిక వ్యవస్థను నిర్మించవలసిన అవసరం ఏర్పడింది. దీనివల్ల సభ, సమితులపై నిర్మాణమైన ఆదిమ ప్రజాస్వామ్యం అంతరించి కొత్త సమాజ చర్యలను సుసంఘటితంచేసి అల్పప్రమాణం గల వర్గంలో అధికారం కేంద్రీకృతమౌతుంది. పంటపొలాలు విస్తరించడంతో అత్యవసర పరిస్థితి వంటిదేర్పడి, సమాజాన్ని అదుపులో ఉంచగల బలమైన శక్తి అవసరమైంది. అందుచే గణకూటాలు, గణరాజ్యాలు మొదలైన చిన్న చిన్న ప్రమాణాలు సమైక్యమై పెద్ద రాజ్యాలేర్పడినవి. ఈ ధోరణి మౌర్య సామ్రాజ్యంలో పరాకాష్ఠనందింది. రాజకీయంగా వచ్చిన ఈ మార్పు స్థానిక సంఘటనలకే పరిమితమైన పౌరత్వానికి బదులు విస్తృత పౌరత్వ భావాన్ని ప్రవేశపెట్టింది. బ్రాహ్మణమతంలో సాంఘిక బాధ్యత చాలవరకు ఒక్కొక్క కులపరిధికి మాత్రమే పరిమితం. ఆ మతానికి విరుద్ధంగా విస్తృత సాంఘిక చైతన్యంపై నొక్కుపెట్టిన బౌద్ధమతం నాటి పరిస్థితులకు చాల అనుకూలమైంది.

అశోకుడు ప్రతిపాదించిన ధమ్మ విధాన స్వభావాన్ని వివరించడానికి ముందు ఆకొత్త విధానానికి అవసరమైన పరిస్థితులను గురించి ఆలోచించడం అవసరం. రెండువేల సంవత్సరాలకు పైగా దూరంలో ఉన్న మనం నేడు అశోకుని చిత్త వికారాలను గురించి స్పష్టంగా చెప్పలేము. కాని మనం చేయగలిగినదంతా అతని శాసనాలు ఆధారంగా ఆ విధానాన్ని తప్పనిసరి చేసిన బాహ్య పరిస్థితులను చర్చించడమే. నందవంశ కాలంలో మహా పద్మనందుని క్రింద కేంద్రీకృత సామ్రాజ్య నిర్మాణానికి పెద్ద యెత్తున ప్రయత్నం జరిగింది. ఆ ప్రయత్నం పూర్తిగా విజయం పొందకపోవడానికి నందవంశపు రాజులు సామ్రాజ్య పరిపాలనను అర్థంచేసుకోలేక పోవడమే కారణం. నందుల రాజ్యాన్ని జయించి చంద్రగుప్త మౌర్యుడు కేంద్రీకరణ విధానాన్ని విజయవంతంగా పూర్తి చేసినాడు.

సమర్థవంతమైన ఉద్యోగి బృందము, దేశ వ్యాప్తమైన రవాణా సౌకర్యాలు ఉండి, శక్తిసంపన్నుడైన ఏకైక పాలకుని అదుపులోనున్న సామ్రాజ్యము నాటి పరిస్థితులలో సాధ్యమైనంతవరకు కేంద్రీకృతమైనదనే చెప్పాలి. పై మూడు లక్షణాలు మౌర్య సామ్రాజ్యానికి ఉన్నట్లు అర్థశాస్త్రంవల్ల స్పష్టమౌతున్నది. పాలకుని కేంద్రాధికారాన్ని ఏ విధంగానైనా పరిరక్షించాలనేదే సమస్య. ఇది సాధించడానికి రెండురకాల విధానాలున్నాయి. సైనిక బలం ద్వారా ప్రజలను నిర్దాక్షిణ్యంగా అదుపులో ఉంచడం, తాను దైవ స్వరూపడని ప్రకటించడం మొదలైనవి మొదటి విధానంలోని అంశాలు. ఈ విధానాన్నే అశోకునకు ఇంచుమించు సమకాలికుడైన చైనా చక్రవర్తి షీహూయాంగ్‌టి అనుసరించినాడు. ఇక రెండో విధానం చాలక్లిష్టతరమైనది. ప్రజలలో బాగా పాదుకొనని ఒక కొత్త సిద్ధాంతానికి కాని, సమదృష్టితో భిన్నవర్గాల నుండి సేకరించిన భావ సందోహంపట్ల కాని తన అనుకూల్యతను ప్రకటించడమే రెండో విధానం. ఈ విధానం ద్వారా ఇతర వర్గాల ప్రాబల్యం క్షీణించడంతో కేంద్రాధిపత్యం తన బలాన్ని ఇనుమడింప చేసుకొంటుంది. ఉద్యోగుల ప్రచారంవల్ల పాలకుల భావాలపట్ల ప్రజలు గౌరవాన్ని వహిస్తారు. ఈ గౌరవం నామమాత్రమైనదే కావచ్చు. అశోకుడీ విధానాన్నే అనుసరించాడు. 18 శతాబ్దాల అనంతరం అక్బరు ఇటువంటి విధానాన్నే అనుసరించాడు. రూపంలో భిన్నమైనా గుణంలో అక్బరు విధానం అశోకుని విధానం వంటిదే.

సింహాసనం ఎక్కినపుడు అశోకుడు బౌద్ధుడుకాదని, బౌద్ధంలో అతని ఆసక్తి అనంతర సంవత్సరాలలో పెరిగిందని మనకు తెలుసు. సింహాసనానికై అతడు పోరాడవలసి వచ్చిందని పైన పరిశీలించినాము. తరువాత తన పదవిని పటిష్ఠం చేసుకొనే సందర్భంలో కూడ ఆస్థానంలోని సనాతనులైన పెద్దలు హృదయ పూర్వకంగా ఆతణ్ణి బలపరచలేదు. అందువల్ల సనాతన బ్రాహ్మణ మతాన్ని వ్యతిరేంచకపోయినా ఆ మతానికి దూరమవుతూ ప్రజా బాహుళ్యాన్ని ఆకట్టుకొన్న బౌద్ధ ఆ జీవికాది ఇతర మతాలను బలపరుస్తూ సనాతనేతర అంశాల సహాయాన్ని పొందడంలో సఫలీకృతుడై తద్వారా ప్రజానీకం తన సిద్ధాంతాలను అంగీకరించేటట్లు చేసినాడు. కొత్తగా తలెత్తిన వాణిజ్య వర్గాల మద్దతు ఈ మతాలకు లభించడం, ప్రజా బాహుళ్యం ఆ మతాలను వ్యతిరేకించక పోవడం అశోకునకు మంచి ఉపకారమైంది. దీనికి తోడు కొత్త విశ్వాసాలు పాత విశ్వాసాలకు పూర్తిగా విరుద్ధం కానందున వాని మధ్య రాజీ కూడ సాధ్యమయింది. అందుచే ధమ్మ విధానం అనుసరించడంలో ఉన్న ప్రయోజనాన్ని అశోకుడు గమనించినాడు.

చిన్న చిన్న రాజకీయ ప్రమాణాలను సమైక్యం చేయడం, విరుద్ధములైన భిన్న వర్గాలను

కనీస ప్రాతిపదికపై సంలగ్నం చేయడం కేంద్రీకరణ విధానంతో సంబంధించిన మరొక అంశం. జాతీయ, సాంస్కృతిక రీతులలో భిన్నత్వం ఉన్న సువిశాల ప్రాంతాలను సమైక్యం చేయడంలో పై అంశం ప్రత్యేక ప్రాముఖ్యాన్ని వహిస్తుంది. ఈ విధానం విజయవంతం కావడానికి సన్నిహిత వర్గాలకంటె సరిహద్దులలోని ప్రజల విశ్వాసం ఎక్కువ అవసరం. జాతి విభిన్నతలు ఎక్కువ లేకపోయినా మౌర్య సామ్రాజ్యంలో సాంస్కృతికంగా భిన్నత్వాలు మాత్రం చాల ఎక్కువే. తక్షశిల, తోసలి, ఉజ్జయిని, సువర్ణగిరి అనే రాష్ట్ర రాజధానీ నగరాలను గురించి ఆలోచించినపుడు మౌర్య సామ్రాజ్య సాంస్కృతిక భిన్నత్వము, ప్రజలలోని వైవిధ్యము బోధపడుతుంది. కొత్త మతాన్ని స్వీకరించడం, ఆ మతాన్ని చురుకుగా ప్రచారం చేయడం చిన్నచిన్న ప్రమాణాలను సమైక్యంచేసే సాధనాలుగా ఉపకరిస్తాయి. విముఖులైన ప్రజలపై రుద్దే ప్రయత్నంగా కాక, తెలివిగా ప్రయోగించినపుడు కొత్త మతం జయించిన ప్రాంతాలను పదిలపరచడానికి ఉపకరిస్తుంది. ఈ విషయంలో అశోకుడు తగినంత అవగాహన ప్రదర్శించినాడనడం వాస్తవం. ఈ విధానానికి ఉదాహరణలు ఇతర నాగరికతల చరిత్రలలో కూడ కనిపిస్తున్నాయి. శాగ్జనులను జయించి చార్లిమేన్ క్రైస్తవ మతాన్ని సమైక్యతా సాధనంగా ప్రయోగించినాడు. శాగ్జనులను తన క్రైస్తవ మతంలోనికి మార్చి తద్వారా వారిని తన సామ్రాజ్య విభాగంలో విలీనం చేసినాడు. కొత్తగా సాధ్యమైన సమైక్యానికి కొత్త మతం లాంఛనం లేదా చిహ్నంగా శక్తిమంతమైన ప్రచారక సాధనంగా ఉంటుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో తెలివిగా ప్రయోగించిన ఒకే ఒక భావం కొత్తమతంగా పనిచేస్తుంది. అశోకుణ్ణి తరచు కాన్‌స్టన్‌టైన్ చక్రవర్తితో పోలుస్తారు. కొన్ని సందర్భాలలో కాన్‌స్టన్‌టైన్ తన రాజకీయ లక్ష్యాలపై క్రైస్తవ మతాన్ని సాధనంగా ఉపయోగించినాడు. క్రిస్టోస్ అనే మాటమీదుగా వచ్చిన P అనే పద చిత్రాన్ని తన కేతనంపై వాడి తన నాణేలపై మాత్రం ప్రాచీన దేవతలనే కొనసాగించినాడు. అతడు క్రైస్తవ మతం స్వీకరించి ఆ మత చిహ్నాలను అంగీకరించినా ప్రాచీన విశ్వాసాలు యథాతథంగానే ఉన్నాయి. సామ్రాజ్యంలోని మతాలన్నింటికి పూజా స్వాతంత్ర్యం ఇచ్చినాడు. క్రైస్తవ మతానికి పూర్వం ప్రజలు తమ తమ ఇండ్లలో బలులీయడం వంటి ఆచారాలుండేవి. వాటిని మాత్రం నిషేధించినాడు. అది కూడా మత కారణాలవల్ల కాదు. ఆ సమావేశాలు రాజకీయంగా ప్రభుత్వ వ్యతిరేక వర్గాల సమావేశాలుగా తయారు కాగలవనే భయంతో వాటిని నిషేధించినాడు. ఇతరులకంటే క్రైస్తవులకు ఎక్కువ హక్కులు ఇవ్వలేదు. కాని తమకు భద్రత ఉన్నదనే భావమేర్పడే స్థానంలో వారిని ఉంచినాడు. హింసకు గురికాకుండా క్రైస్తవులు సాధారణ మానవ జీవితం గడిపే అవకాశం కలిగించినాడు.

అశోకుని కాలంలో గూడా అట్టి పరిస్థితులే ఉండేవి. బౌద్ధులపై నాడు ఆగ్రహావేశాలు ప్రదర్శించడం జరిగేది. నాస్తికులని బహుశా వారిని హింసించే వారు. అట్టి బౌద్ధులకు గౌరవప్రదమైన స్థానమిచ్చి వారి నొక మతంగా గుర్తించినారు.

అశోకుని కొత్త విధానంలో రాజకీయ ఆంతర్యాలను పరిశీలించడంలో చక్రవర్తి ఆదర్శ సమస్య చాల ముఖ్యమైనది. బౌద్ధ వాఙ్మయంలో చక్రవర్తి వర్ణన లభిస్తున్నది. చక్రవర్తి విశ్వసమ్రాట్టని, అతని సామ్రాజ్యంలో యావజ్జంబూద్వీపం చేరి ఉందని బౌద్ధ గ్రంథాలు వర్ణిస్తున్నాయి. అతని పరిపాలన న్యాయ సమ్మతం. అతని రాజ్యం సర్వసంపత్సమృద్ధము, దివ్యశక్తి సంపన్నుడని ప్రజలు భావించేటంత ధర్మమూర్తి. ఈ చక్రవర్తిభావనలో జంబూద్వీపమంతటిని జయించడంపై నొక్కు ఉన్నందున ఇది తరువాతి కాలంలో బహుశా మౌర్యయుగానంతర కాలంలో రూపొంది భావన అయినట్లు కనిపిస్తున్నది. జైనులకు ఈ భావనతో పరిచయముంది. ఇతిహాస వీరులైన యుధిష్ఠిర, రామాదులను దిగ్విజేతలుగా వర్ణించినారు. కాని తరువాత సారస్వతానికి లక్షణమైన ఆలంకారిక పద్ధతిలో ఈ పదాన్ని ప్రయోగించి ఉండవచ్చు. మౌర్యయుగానికి పూర్వమే చక్రవర్తి భావన ఉండి ఉండవచ్చు. కాని అందుకు గట్టి ఉదాహరణ అశోకుని తరువాత మాత్రమే ఉల్లేఖించడానికి సాధ్యమౌతున్నది. ఏమైనా మౌర్యయుగానికి పూర్వం చక్రవర్తి అనేది సంపూర్ణమైన రాజకీయ భావనగా రూపొందలేదనడం ఉచితం. లేదా చక్రవర్తి కావాలనే కాంక్షయే అశోకుని భావాలకు చాల వరకు ప్రేరకమైందని చెప్పవచ్చు. కాని ఇదే నిజమైతే తన ఇతర కోరికలను వెలిబుచ్చినట్లే ఈ విషయాన్ని కూడ తన శాసనాలలో ఏదో ఒకచోట ముచ్చటించి ఉండేవాడు. దీపవంశంలో అశోకుని గురించిన ఒక పద్యం ఈ క్రింది వాక్యంతో పరిసమాప్తమౌతుంది.

> "ఆతని అధికారచక్రం జంబూద్వీప
> మహా సామ్రాజ్యం గుండా పరిభ్రమించింది."

ఈ వాక్యం చక్రవర్తి భావనను అశోకుని రాజ్యంతో ముడి పెట్టటానికి చేసిన ప్రథమ ప్రయత్నం. లేదా బౌద్ధ సంప్రదాయం అశోకునకు చక్రవర్తి గౌరవాన్ని ఇచ్చిన అనంతరం దీపవంశలో జరిగిన ప్రక్షిప్తమై ఉంటుంది. చక్రవర్తి భావనను చర్చించే సందర్భంలో సైద్ధాంతికులు రాజకీయ, రాష్ట్రీయ అధికారాలు రెంటిపై నొక్కుపెట్టి చెప్పినారు. చక్రవర్తి విగ్రహాన్ని అనుసరించి ఉండే చిహ్నాలను సప్త రత్నాలంటారు. ఇవి: చక్రము, లక్ష్మి, రాణి, యువరాజు, మంత్రి, పట్టపుటేనుగు, అశ్వము. ఇందులో చక్రం విశ్వాధిపత్యాన్ని సూచిస్తుంది కాని అశోకుని శాసనాలను బట్టి నిర్ణయిస్తే అశోకుని విశ్వాధిపత్య భావన ఔద్ధత్య రహితమయినది, మానవత్వం మూర్తీభవించినది.

రాజకీయ ప్రయోజనాలకు బౌద్ధాన్ని ఉపయోగించడం అతడు భక్తుల శ్రేణిలో చేరడానికి ప్రతిబంధకం కాదు. వ్యక్తిగా, పాలకుడుగా బౌద్ధమతం వల్ల తనకు గల ప్రయోజనాన్ని అశోకుడెప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. ప్రతి మతంలోవలె బౌద్ధంలో సయితం సిద్ధాంతానికి ఆచరణకు మధ్య చాల వ్యత్యాసం ఉంది. తన పరిసరాలకు వ్యక్తిగత అవసరాలను అనుగుణంగా ప్రతి విశ్వాసి సిద్ధాంత ఆచరణలకు సమన్వయం కుదుర్చుకొంటాడు. ఇట్టి చిన్న చిన్న సమాధానాలు అనేకం చేరినపుడు మత ప్రవక్త మౌలిక బోధనల స్వరూపం తరచు మారిపోతూ ఉంటుంది. రాజకీయ రంగంలో రాజును గురించి బౌద్ధుల భావనకు అశోకుడు చక్కని ఉదాహరణగా చెప్పవచ్చు. ప్రాచీన బౌద్ధం మహాసమ్మత భావాన్ని ప్రచారం చేసింది. ప్రజలకు, వారు రాజుగా ఎన్నుకొన్న వ్యక్తికి మధ్యగల ఒప్పందం మీద ఆధారపడిన సమయ సిద్ధాంతమే మహా సమ్మత భావం. రాజ్యాన్ని సేవించే వానిని రాజుగా పరిగణిస్తారు. అందుకై ప్రజలాతనికి పన్ను చెల్లించాలి.

అశోకుని శాసనాలను నిశితంగా పరిశీలిస్తే తననెన్నడు అశోకుడు మహా సమ్మతునిగా పరిగణించుకోలేదు. ప్రజలకు, అతనికి మధ్య ఉన్న సంబంధాలలో తండ్రి భావన కనిపిస్తుంది. రాజుకు ప్రజలకు మధ్య సర్వదా తండ్రి బిడ్డల సంబంధంపై నొక్కిపెట్టి మాటాడేవాడు.

**సవ్వే మనుస్సే పజా మమా అద్ధా**
**పజాయే ఇచ్ఛా మిహ కమ్ కింతి**
**సవ్వేన హిత సుఖేన హిదలోకిక పాల**
**లోకికేన యాజ్జేవూ తి తధామనుసేషు**
**వి ఇచ్ఛాపి హ కమ్.**

"ప్రజలందరు నా బిడ్డలు. నా బిడ్డలకు ఇహలోకంలోను పరలోకంలోను సుఖ శ్రేయస్సులను కాంక్షించినటులే ప్రజలందరికీ కాంక్షిస్తున్నాను."

రాజుకు ప్రజలకు మధ్య ఇట్టి పైతృక భావన చాల కొత్త అంశం. బహుశా నాటికి మహా సమ్మత సిద్ధాంతం వెనుకంజ వేసింది. అందుకు కారణం పైన వివరించినట్లు ప్రజాస్వామ్యం వెనుకంజవేసి, కేంద్రీకృతాధికారాని కనుగుణమైన పోకడలకు దారి తీసింది. కేంద్రీకృతాధికార విధానంలోని ప్రజలలో ఆశ్రయ భావం ఎక్కువ. అందువల్ల రాజును రాజ్యానికి సేవకుడుగా కాక పైతృక శ్రేయోదాయకుడుగా పరిగణిస్తారు. ఇట్టి పైతృక దృష్టి నిరంకుశత్వానికి అవకాశాలను కల్పిస్తుంది. కేంద్రీకృతాధికారానికి, నిరంకుశత్వానికి మధ్య ఎంతో దూరం ఉండదు.

అశోకుడు బౌద్ధానికి ఇచ్చిన వ్యాఖ్యానాన్ని గురించి అనేక సమీక్షలు జరిగినాయి. తన జీవితంలో కొంతకాలం పాటు అశోకుడు యధార్ధంగా బౌద్ధ భిక్షువైనాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. మరి కొందరి అభిప్రాయంలో అతనిది భిక్కుగటిక దశ – అంటే ఉపాసన భిక్కు దశలకు మధ్య దశ. గృహస్థాశ్రమంలో ఉంటూ కొన్ని సమయాలలో భిక్కు గటిక విహారంలో నివసించేవాడు. ఇది బౌద్ధం సమ్మతించిన పద్ధతే. ఈ అంశం శాసనాలలో అశోకుడు వాడిన 'సంఘం ఉపాగతే' అన్న వాక్యాన్ని గూర్చిన వివాదానికి కారణమైంది. కొంతకాలం పాటు బౌద్ధ భిక్షువు అయినట్లయితే ఆ సంఘటనలకు సంబంధించినదే ఆ వాక్యం అయి ఉండవలె. అతడెన్నడూ ఉపాసకునకు భిన్నంగా లేకపోతే సంఘాన్ని చేరడం కేవలం ఉపదేశార్ధం అయి ఉండవలె. లేదా తాత్కాలిక బౌద్ధ భిక్షువుగా మత విషయాలలో సహాయార్ధమై సంఘాన్ని చేరి ఉండవలె, అశోకుడు సంఘానికి మతాధిపతి అయినాడని కొందరు సూచిస్తారు కాని అందుకు ఋజువు లేదు. రాజకీయంగా బలమైన స్థానం ఆక్రమించి ఉన్నందున వ్యక్తిగతంగా బౌద్ధంలో విశ్వాసం ఉన్నవాడైనందున క్రియాశీలమైన ఆతని ఆసక్తి బౌద్ధ సంఘం హర్షించి ఉంటుంది. సంఘానికి శాసనాలు జారీ చేసినప్పటికీ పాటలీపుత్రంలో మూడవ బౌద్ధ సంగీతిని సమావేశ పరచినప్పటికీ దాని కార్యక్రమాన్ని నిర్వహించే ముఖ్య బాధ్యతను వహించనందున అశోకుడు తనను సంఘ మతాధిపతిగా పరిగణించుకోలేదని స్పష్టమౌతున్నది.

అశోకుని మత విశ్వాసాలను గురించిన సాక్ష్యాధారాలకు చాల భిన్నములైన వ్యాఖ్యానాలున్నాయి. కొందరాతడు బౌద్ధుడు కాదని, బ్రాహ్మణ మతస్థుడైన హిందువే అనీ వాదించినారు. వాస్తవానికి అశోకుని రాజ్యకాలంపై ఉన్న చారిత్రక ఆధారాలు చాల వరకు బౌద్ధమత సంబంధమైనవే; అతని పట్ల సానుభూతి వహించే ఉన్నాయి. అతని శాసనాల నుండి లభ్యమయ్యే సాక్ష్యం అశోకుడు బ్రాహ్మణ మతస్థుడైన హిందువు కాదని స్పష్టం చేస్తుంది. టిబెటన్ చరిత్రకారుడైన తారానాధుడు ఊహాపోహలతో అల్లిబిల్లిగా వ్రాసిన కథనంలో తాంత్రిక బౌద్ధంతో అశోకునకు సంబంధం కనిపిస్తుంది. అశోకుడు అమ్మ తల్లి (Mother Goddess) భక్తుడంటూ టిబెటన్ చరిత్రకారుడు వ్రాసినాడు. అశోకుని కాలంలో సామాన్య ప్రజానీకం అమ్మ తల్లిని పూజించేవారే కాని తాంత్రిక బౌద్ధం చాల శతాబ్దాల అనంతరం వికసించింది.

అశోకుని ధమ్మము బుద్ధుడు ప్రబోధించిన మౌలిక బౌద్ధమే అనీ, నేడు మనకు బౌద్ధంగా లభిస్తున్నది శతాబ్దాల తరబడి జరిగిన మత చర్చల ఫలితంగా పెరుగుతూ వచ్చిన మతమని మరొక సూచన. ఈ అభిప్రాయాన్ని నిరూపణ చేయగల సాక్ష్యాధారాలు

లేకపోవడం దురదృష్టకరం. బౌద్ధ వాఙ్మయ కాలక్రమాన్ని విశ్లేషించి పరిశోధన చేయవలసి ఉంది. అట్టి పరిశోధనా ఫలితాలు సయితం మన అనుమానాలను తీర్చక పోవచ్చు. నేటివరకు జరిగిన పరిశోధనలవల్ల నికాయాలలోని ఆలోచనా క్రమంలో అశోకుడు పూర్తిగా పరిచయ మున్నట్లు తెలుస్తుంది. నికాయాలలో అధిక భాగం క్రీ.పూ. నాలుగో శతాబ్దికి తయారయినాయి.

అశోకుని ధమ్మము కేవలం ఆతని నిర్మాణమే అని మా అభిప్రాయం. అందలి సూత్రాల నాతడు హిందూ బౌద్ధ సిద్ధాంతాల నుండి గ్రహించి ఉండవచ్చు. కాని అనుకూలము, ఆచరణీయమునై నైతికంగా ఉన్నతమైన జీవిత విధానాన్ని సూచించడానికి చేసిన ప్రయత్నమే అశోకుని ధమ్మంలోని సారాంశము. తన ప్రజలలో తాత్త్విక ఆలోచనలు చేయడానికి కాల వ్యవధి లేని అధిక సంఖ్యాకుల నుద్దేశించి తయారు చేసిన రాజీ విధానం. ఇందుకాతని శాసనాలు చక్కని సాక్ష్యం ఇస్తున్నాయి. కేవలం బౌద్ధ సిద్ధాంతాలను నమోదు చేయడమే అతని ధమ్మ విధానం అయినట్లయితే ఆ విషయాన్ని అశోకుడు స్పష్టంగా చెప్పి ఉండేవాడు. బౌద్ధానికి తన మద్దతును గోప్యంగా ఉంచడానికి అశోకుడెప్పుడూ ప్రయత్నించలేదు.

శాసనాలలో మత ప్రశస్తిని చెప్పిన సందర్భంలో నైతిక జీవితానికి ప్రతిఫలం స్వర్గప్రాప్తి అన్న అంశానికి వివరణ అవసరం. స్వర్గాన్ని పొందాలనే కోరికే అశోకునిచేత ధర్మ ప్రతిపాదన చేయించిందా అన్న ప్రశ్న వస్తుంది. అయితే ధమ్మంలో ప్రతిఫలించే నైతిక ఉదాత్తత ముందు అశోకునకు అనంత జీవితంలో విశ్వాసం లేదని సూచించడం కాదు. శాసనాన్ని చదివే సామాన్య ప్రజలకు బాగా పరిచయమైన ఒక భావంతో నైతిక జీవితంవల్ల కలిగే ప్రతి ఫలగుణాన్ని పోల్చే ప్రయత్నంతోనే స్వర్గ ప్రసక్తిని అశోకుడీ శాసనంలోకి తెచ్చినాడు. నాటి మత తాత్త్విక రీతులను బట్టి స్వర్గప్రాప్తి గణనీయమైన ప్రతిఫలం. ధర్మ సూత్రానుగుణంగా నడచిన జీవితానికి కూడ అదే ప్రతిఫలమని అశోకుడు సూచించినాడు. స్వర్గప్రాప్తినే అశోకుడు లక్ష్యంగా భావించి ఉన్నట్లయితే నాటికి విస్తృతంగా ప్రచారంలో ప్రముఖంగా ఉన్న కొత్త సిద్ధాంతాన్ని అంటే పునర్జన్మ సిద్ధాంతాన్ని కూడా ముచ్చటించి ఉండేవాడు. పునర్జన్మ ప్రసక్తి లేనందువల్ల స్వర్గప్రాప్తి సిద్ధాంతంలో ఉన్న మత ప్రసక్తికి అశోకునకు సంబంధం లేదనేచెప్పవలె.

అశోకుని మతాసక్తుల స్వభావగుణాలను నిర్ణయించడం కష్టం. అతడు మతంలో ఆసక్తి కలవాడనడంలో సందేహం లేదు. కాని చివరి రోజుల వరకు మతాచారాల ననుసరించినట్లు కనిపించదు. కొంతకాలం భిక్షుక దుస్తులు ధరించినాడా లేదా అనే

అంశానికి అంత ప్రాముఖ్యం ఇవ్వనక్కరలేదు. యౌవనంలో వ్యతిరేకించిన వారినందరిని ప్రతిఘటించి రాజు కావాలన్న అతని నిర్ణయం వల్ల అతడొక అసాధారణ రాజ్య కాంక్షగల రాకుమారుడుగా కనిపిస్తాడు. బౌద్ధమత స్వీకారం హఠాత్పరిణామంగా తరచు చెబుతూ ఉంటారు. అదే నిజమయితే బౌద్ధమత స్వీకారం వల్ల పూర్వదశకు పూర్తి విరుద్ధంగా తయారయి ఉండేవాడు. ఏ పనినైనా సగంచేసి ఊరుకోవడం అతని లక్షణం కాదు. భిక్షువు కావాలని సంకల్పించి ఉంటే రాజ్య పరిత్యాగం చేసి మఠంలోనే చేరి ఉండేవాడు. ఆశ్రమ స్వీరార కాంక్షకు, పరిపాలనా బాధ్యతకు మధ్య అశోకుని మనస్సులో రేగిన సంఘర్షణను గురించి పెద్దగా చర్చ సాగింది. కాని ఆ సంఘర్షణకు స్పష్టమైన నిదర్శనం ఎక్కడా కనిపించదు.

వాస్తవానికి అటువంటి దశ ఉన్నట్లయితే అది హఠాత్తుగా వచ్చిన మానసిక ఆందోళన ఫలితం కానేరదు. యువరాకుమారుడుగా తీవ్రకాంక్షతో సింహాసనం కోసం పోరాడినపుడు సయితం అశోకుని మనస్సులో ఆ సంఘర్షణ ఉండి ఉండవలె. కాని దీనిని సంఘర్షణ అనడం కంటె సందిగ్ధావస్థ అనడం సత్య సమ్మతంగా ఉంటుంది. ఒకవైపున వ్యక్తిగా తనకు, తన బౌద్ధానికి గల సంబంధాన్ని పరిశీలించాడు. ఇక మరొకవైపు మౌర్య సామ్రాజ్యధిపతిగా బౌద్ధాన్ని కేవలం బుద్ధుడు బోధించిన మతతత్త్వంగా గాక, సాంఘిక పరమైన మేధాశక్తిగా తనభావాలకు సహాయకారిగా బౌద్ధంలోని కొన్ని అంశాలను పరిశీలింపగలిగినాడనేది స్పష్టం. ఈ సందిగ్ధ పరిస్థితికి సమాధానంగా అశోకుని ధమ్మ విధానం రూపొందింది.

తన ధమ్మాన్ని వివరించడానికి అశోకునకు శాసనాలు మంచి అవకాశమిచ్చినాయి. అందువల్ల అతని ధమ్మాన్ని పునర్నిర్మించడానికి శాసనాలలో వ్యక్తమైన సూత్రాలను పరిశీలించడమే ఉత్తమం. ఈ సూత్రాలను రెండు విభాగాలుగా చేయవచ్చు. అందు మొదటిది బహిరంగ ప్రకటనలు. రెండవది వ్యక్తిగతంగా సంఘానికి ఇచ్చిన సలహాలు. ప్రస్తుతం వాని తేదీలను బట్టి శాసనాలను పరిశీలించి తద్వారా అశోకుని భావపరిణామ క్రమాన్ని పునర్నిర్మించడానికి కూడ ప్రయత్నిస్తాను.

మొదటి ముఖ్య శిలాశాసనాలను క్రీ. పూ. 256 నుండి ఇవ్వడం జరిగింది. ప్రథమ శిలాశాసనంలో జంతుబలుల, పండగ సమావేశాల బహిష్కరణ ఉంది.

ఆ శాసన మూలం :

ఇద్దాన కించిజీవం ఆరభిత్వాన ప్రజా
హీతవ్యం నచ సమాజో కత్తవ్యో

ఏ ప్రాణిని ఇక్కడ చంపరాదు. బలి ఇవ్వరాదు. ఏ సమావేశము జరుపరాదు.

ఇందులో మొదటి పంక్తికి అర్థం స్పష్టంగాలేదు. 'ఇద్ద' అనే మాట పాటలీపుత్రాన్ని ఉద్దేశించినదై ఉండవచ్చు. లేదా శాసనం వేయించిన స్థానిక ప్రదేశమైనా అయి ఉండవచ్చు. కేవలం పాటలీపుత్రాన్ని లేదా రాజ ప్రాసాదాన్ని మాత్రమే సూచిస్తున్నదని ఒక ప్రామాణిక రచయిత అభిప్రాయం. కాని అదే శాసనంలో ప్రతినిత్యము మహానసానికి రెండు నెమళ్ళు, ఒక జింకను వధిస్తున్నారని చెప్పడంచేత పై అభిప్రాయంతో ఏకీభవించలేము. ఇక ప్రభుత్వం ఆ రక్షిత జంతువుల నుద్దేశించినదే నిషేధమని అర్థం చెప్పడం సమంజసంగా కనిపించదు. వధ్యములు కాని మృగముల పట్టీలోని జంతువులను చంపడం శిక్షార్హమైన నేరమైనట్లు అర్థశాస్త్రం నుండి తెలుస్తున్నది. ఆ విధానాన్ని అనుసరిస్తూ అశోకుడు తన ఆజ్ఞను జారీచేసి ఉండవచ్చు.

పై వాక్యానికి 'ఇక్కడ ఏ జంతువును చంపి బలి ఇవ్వరాదు' అని అనువదించవచ్చు. ఇక్కడ నొక్కు చంపడం మీదగాక బలి ఇవ్వడం మీద. కాబట్టి నిషేధం మత సంబంధమైన జంతుబలుల మీద అని స్పష్టమౌతున్నది. భోజనానికి జంతు వధను నిషేధించినట్లయితే ఆ అలవాటును రాజే ముందుగా మాని ఉండేవాడు. శాసనం చివరలో ముందు ముందు ఆ అలవాటును మానవలెననే ఆసక్తిని వెల్లడించినా మహానసానికి చంపే జంతువులను పేర్కొనడం వల్ల అహింసలో తన విశ్వాసానికి బహుళ ప్రచారం సాధించాలనే కోరిక మాత్రం అతనికున్నట్లు తెలుస్తున్నది. ఇతర శాసనాలలో నిరర్థక ఆచారాలను ముచ్చటించడం, పండగ సమావేశాలను నిషేధించడం వల్ల జంతుబలులకు దారితీసే పూజా విధానాల నతడు సమ్మతించలేదని తెలుస్తున్నది. జంతుబలుల నాతడు ఆదిమ మతాలతో ముడిపెట్టినాడు. అందుచే జంతుబలి కంటే జంతుబలి భావమే అశోకునకు జుగుప్సాకరమైనది. జంతుబలి అనాగరికతకు చిహ్నం. కాని అవి బ్రాహ్మణులకు సర్వదా జీవనాధారం అయినందున వారికా నిషేధం నచ్చలేదు.

ఈ సందర్భంలో మరొక సూచన కూడ ఉంది. జంతుబలులతో కూడిన వైదిక యజ్ఞాలు పశుపాలక ఆర్థిక విధానంతో ముడిపడి ఉన్నాయి. ఈ విధానంతోపాటు చిన్న రాజ్యాల నిర్మూలనం జరగడంతో జంతుబలులు వెనుకపడినాయి. పశుపాలక దశలోనే యజ్ఞపూజా విధానం పరాజయమై వ్యవసాయక ఆర్థిక విధానం నెగ్గిందని కొందరు సూచిస్తారు. కాని సర్వసాధారణమైన పరిణామ క్రమంలోని ఒక చర్యకు ఈ వ్యాఖ్యానం అనవసర ప్రాధాన్యాన్ని కల్పిస్తున్నది. అశోకుని కాలానికి పశుపాలక ఆర్థిక విధానం వెనకపడి దాని స్థానంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఏర్పడిన మాట వాస్తవమే. లేకపోతే

అంతటి కేంద్రీకృత మౌర్య సామ్రాజ్య నిర్వహణ అసంభవమై ఉండేది. పశుపాలక పూజా విధానంలో చాలభాగం వెనుకపడి జంతుబలుల సంఖ్య సహజంగానే తగ్గేది. అందుచేత అమలులో ఉన్న ధోరణికి అశోకుడు చేసిన నిషేధం అధికారిక బలాన్ని చేకూర్చిందని చెప్పవచ్చు.

ఇతరత్ర అశోకుడు మతసహనాన్ని హృదయపూర్వకంగా బలపరచినాడు. అందుకు పర్వదిన సమావేశాల నిషేధం విరుద్ధం. ఈ సమావేశాలలో చెడు ఎక్కువగా ఉందని గ్రహించి వాటిని నిషేధించినాడు. అతడు వాడిన 'సమాజం' పదం మతప్రమేయంలేని లౌకిక సమావేశాలను సూచించవచ్చు. మరొక శాసనంలో దివ్యదృశ్యాలు కనిపించే పర్వదిన సమావేశాలను ప్రస్తావించినాడు. ఇది బహుశా ప్రభుత్వం నిర్వహించిన సమావేశమై ఉండవచ్చు. ఈ నిషేధానికి స్పష్టమైన కారణాలు తెలియవు. పండగ సమావేశాలలో కన్పించే చెడువల్ల అవి ఆర్థికంగా దుర్వ్యయానికి, నీతి బాహ్య వర్తనకు దారితీయగలవని పవిత్ర బుద్ధితో చేసిన నిషేధం అయిఉండవలె. కొన్ని పర్వదిన సమావేశాలు పుణ్యకర్మలుగా తాను భావిస్తున్నట్లు చెప్పినాడు. అవి పైన పేర్కొన్న ప్రభుత్వం నిర్వహించిన సమావేశాలనడంలో సందేహం లేదు. 'సమాజ' పద ప్రయోగం చాల ఆసక్తిదాయకమైంది. సమజ్జ, సమాజో – అనే పదాలను బౌద్ధ వాఙ్మయం సభ అనే అర్థంలో వాడింది. సాధారణ వేడుక సమావేశాలకు కూడ వాడినప్పటికి సమాజ పదానికి మతపరమైన ప్రాముఖ్యం ఉన్నదని భావించే వారు. అందుచేత అశోకుడు సమ్మతించని ఆదిమ ఆచారాలతో కూడిన పూజా విధానంలో సమాజము, జంతుబలి ముఖ్య అంశాలై ఉండి ఉండవచ్చును.

ప్రజలు అభిమానించిన సభలను, సమావేశాలను నిషేధించడం పూర్తి కేంద్రీకరణ విధానానికి అనుగుణమైనదే. రాజు ప్రవేశపెట్టిన కొత్త భావాలను ఖండించడానికి ఆ సమావేశాలు అవకాశమిస్తాయని అశోకుడు భయపడి ఉండవచ్చు. ప్రాచీన సాంప్రదాయక పర్వాలను కొనసాగించడంవల్ల పాత భావాలు సజీవంగా ఉండి కొత్త ప్రచారంపట్ల అప్పుడప్పుడు ప్రచారకులే సందేహాలు కలిగించవచ్చు. ప్రభుత్వం నిర్వహించిన పర్వాలు ప్రజల భావాలలో ఆశించిన ఫలితాలను కలిగించి సమర్థమైన ప్రచారక యంత్రంగా ఉపకరిస్తాయి. ఇందుకు కూడ సమమైన ఉదాహరణ చార్లిమేన్ రాజ్యంలో కనిపిస్తుంది. ప్రాచీన పర్వాలు జరుపుకొనే స్వేచ్ఛతోసహా శాగ్జనులకు సమావేశ స్వాతంత్ర్యాన్ని చార్లిమేన్ నిరాకరించినాడు. న్యాయసభలకు తప్పించి ఇతర సమావేశాలకు రాజ ప్రతినిధి అనుమతిగాని, న్యాయస్థానాల అనుమతిగాని అవసరము. శాగ్జనుల నుండి తనకు

ప్రతిఘటన వస్తుందని చార్లిమేన్ భయపడినాడు. వారు సమైక్యం కాకుండటానికి ఈ విధానం ఒక ఉపాయం.

ధర్మ ఆచరణలో చేరిన సాంఘిక సంక్షేమ చర్యలను కొన్నింటిని రెండో శిలాశాసనం పేర్కొంటున్నది. మనుషులకు, జంతువులకు ఔషధ కేంద్రాలు నిర్మించడం, రెండు వైపుల నీడనిచ్చే చెట్లతో, బావులతో బాటలు వేయించడం, ఔషధ మూలికలు నాటించడం వంటివి వాటిలో కొన్ని. మంచి రాకపోకల సౌకర్యాల ప్రాముఖ్యాన్ని అశోకుడు గుర్తించినాడని గమనించడం అవసరం. వర్తక వాణిజ్యాలకు తోడ్పడమేగాక అశోకుని భావాలు దేశంలో విస్తృతంగా చొచ్చుకు పోవడానికి రాకపోకల సౌకర్యాలు సహాయ కారులయినాయి.

మూడో శిలాశాసనంలో మతాన్ని గురించి అస్పష్టమైన ప్రస్తావన ఉంది. బ్రాహ్మణ శ్రమణులపట్ల ఔదార్యం సద్గుణంగా ఆ శాసనం పేర్కొంటున్నది. కాని సహనశీలిఅయి, విశాలబుద్ధిగల వ్యక్తి ఎవరైనా ఆ మాట అని ఉండవచ్చు. అయినప్పటికీ అశోకుని ధర్మసూత్రాలలో ఈ ఔదార్యం ఒకటిగా ఇతర శాసనాల నుండి ముందు ముందు పరిశీలిస్తాము.

ధమ్మ పరిణామంలో నాలుగో శిలాశాసనం చాల ముఖ్యమైంది దేశంలో చిరకాలంగా నీతి లుప్తమైనదంటూ శాసనపాఠం ప్రారంభమౌతున్నది. బంధువుల పట్ల, బ్రాహ్మణ శ్రమణుల పట్ల అమర్యాద, జీవహింస, జంతు బలులు ఇందుకు తార్కాణం. కాని ఈ అవినీతి వర్ణనలో ప్రత్యేకించి బౌద్ధం ఏమీ లేదు. ఈ సందర్భంలోను, ఇతర సందర్భాలలోను బ్రాహ్మణులను, శ్రమణులను కలిపి చెప్పడం అశోకుని సహనానికి నిదర్శనం.

**ఆ శాసనం ఇంకా ఇలా అంటున్నది. -**
**త అజ్జ దేవానాం పియస్స ప్రియదశ్శినో రాణ్ణో**
**ధమ్మ చరణేన భేరీ ఘోషో అహోధర్మ ఘోషో**
**విమాన దర్మణచ అగ్గి ఖంధానిచ అణ్ణానిచ**
**దివ్యాని రూపాని దశ్శ యిత్సాజనం.**
కాని నేడు దేవానాం ప్రియదర్శి
రాజు పక్షాన ధర్మాచరణ ఫలితంగా
భేరీ ఘోష ధర్మ ఘోషగా మారింది.
విమాన హస్తి అగ్ని ఖండాది దివ్యరూ
పాలు ప్రజలకు ప్రదర్శిత మౌతున్నాయి.

తన ధమ్మ విధానం విజయవంతమైనదనీ, తద్వారా దేశంలో నైతిక ప్రవర్తన బాగా మెరుగు పడిందన్న దృఢ విశ్వాసంతో అశోకుడీ శాసనాన్ని ప్రారంభించినాడు.

భేరీఘోష ధర్మఘోష అయిందనే వాక్యార్థం వివాదగ్రస్తమై వేరు వేరు పండితులు భిన్న వ్యాఖ్యానాలు చేసినారు. దివ్య దృశ్యాలతో భేరీ ఘోష ముడిపడినట్లు చెప్పడం శాసనకర్త అభిమతమైనట్లు సందర్భాన్ని బట్టి తెలుస్తుంది. భేరీ అనే మాట యుద్ధ ఢంకా అని ఒక రచయిత వాదం. కాని ఆ ప్రత్యేకార్థం ఆ మాటకు లేదు. భేరీ అనేది సైన్యాలను యుద్ధాలకు నడిపేటప్పుడు వాయించవచ్చు. లేదా నగరాలలోను, గ్రామాలలోను ముఖ్యమైన ప్రకటనలు చేసే సందర్భంలోను వాయించవచ్చు. కేవలం యుద్ధఢంకా అని వ్యాఖ్యానించడం ఆమాట అర్థాన్ని బుద్ధిపూర్వకంగా సంకుచితం చేయడమే. ఢంకాకు భేరీ అనే పదం సర్వ సామాన్యంగా జాతక కథలలో వాడినారు. నర్తకులకు, గాయకులకు అవసరమైన సరంజామాలో భాగంగా వీణ, శంఖాలతో పాటు భేరీని కూడ చెప్పేవారు.

పై వాక్యాన్ని వ్రాయించే సమయంలో అశోకునిలో ఉండి ఉండిన భావానికి భండార్కర్ అభిప్రాయం చాల సన్నిహితంగా ఉందనే మా అభిప్రాయం. "యుద్ధానికి గాని ప్రకటనలకు గాని లేదా ప్రజలకు ఒక దృశ్యాన్ని ప్రకటించడానికి గాని ముందు భేరీ మ్రోగించేవారు. అశోకుడు పవిత్ర జీవితం ప్రారంభించినాడు కావున భేరీ వాయించడం యుద్ధానికి పిలుపు కాదు. కొన్ని దివ్య దృశ్యాలను వీక్షించడానికి ప్రజలకు పిలుపు. ప్రజలలో ధర్మ తత్పరతను పెంచే గుణం ఆ దృశ్యాలకు ఉన్నందున ఆ ఢంకా ధమ్మ ఘోష అయింది." అంటాడు భండార్కర్.

హస్తి, విమానాది దివ్య దృశ్యాలను ప్రజలు తరచు ఆశ్చర్యంతో చూసేవారు. అశోకుడు సమ్మతించిన కొన్ని పర్వదిన సమావేశాల సందర్భంలోనే వీటిని ప్రదర్శించినట్లు కనిపిస్తుంది. ఈ ప్రదర్శనలు ప్రజా సామాన్య విశ్వాసాలకు పౌరాణిక గాథలకు చుట్టూ ఏర్పడినవి; ప్రభుత్వం నిర్వహించేది. కాని వీటిలో ధర్మ ప్రచారం నిక్షిప్తమై ఉండేది. హస్తి, విమాన, దివ్య విగ్రహాలు మొదలైన హంగామాతో ప్రజా సామాన్యంలో ప్రచారంలో ఉన్న మత గాథనే ప్రదర్శింపవచ్చు. కాని ఆ గాథలలోని ధర్మసూత్రాలపై ఆధారపడిన నీతిపై నొక్కు ప్రదర్శనలో ఉండి ఉండవచ్చు. ప్రాచీన క్రైస్తవ నీతి గాథలను ఇంగ్లండులో ప్రదర్శించేవారు. ఆ పరిస్థితులకు, దీనికి ఒకటే వ్యత్యాసం. అశోకుడు నిర్వహించిన ప్రదర్శనలు ప్రభుత్వం నిర్వహించేవి. ప్రచార సాధనంగా దివ్య దృశ్యాలను ప్రదర్శింపవచ్చునని అర్థశాస్త్రం వక్కాణిస్తున్నది. అదే లక్ష్యంతో వాటి నశోకుడు ప్రదర్శించినాడనడంలో సందేహం లేదు.

పదమూడో పాలనా సంవత్సరంలో బరాబర్ కొండలలోని రెండు గుహలను అశోకుడు ఆజీవికులకు దానం చేసినాడు. అశోకుని జీవితంలో వేరు వేరు సందర్భాలలో ఆజీవికులతో అతనికి సంబంధం ఉన్నట్లు వారితో అశోకుడు సర్వదా మైత్రి వహించి ఉన్నట్లు తెలుస్తున్నది. అశోకుని కాలంలో ఆజీవిక మహర్షి; పింగళవత్స అతని గొప్పతనాన్ని గురించి జోస్యం చెప్పినాడు. మహారాణి గురువు ఆజీవిక మహర్షి అనేది సత్యం అయితే బాలుడుగానే అశోకునకు వారితో బాగా పరిచయం ఏర్పడి ఉంటుంది. అందుచే వారిపట్ల పక్షపాతం వహించి వారి రక్షణలో అశోకుడు ఆసక్తి వహించి ఉంటాడు. బ్రాహ్మణుల పట్ల, ఆజీవికుల పట్ల శ్రద్ధతో ధర్మ మహామాత్తుల కృషి చేయాలని ఏడో స్తంభ శాసనంలో చాటినాడు. తన ధమ్మంలో నిరతిశయ ఆత్మ విశ్వాసం ఉన్నప్పటికీ ఇతర మత శాఖల శ్రేయస్సులో సయితం అశోకుడు ఆసక్తి వహించినాడు. ఇతర మతాలను అణచాలనే స్వమత దురభిమానం గాని, మతోన్మాదం గాని అశోకునిలో లేదు. మూడో బౌద్ధ సంగీతికి పూర్వం జరిగిన సంఘటనలను బట్టి ఆజీవికులను, నిగ్రంధులను బౌద్ధులు ఆమోదించినట్లు లేదు.

పదమూడో రాజ్య సంవత్సరంలో గౌణ శిలా శాసనం ఇవ్వడం జరిగింది. ఈ శాసనాన్ని మధ్య భారతంలో చైరాట్, రూపనాథ్, సహస్రామ్ అనే చోట్ల దక్షిణాన బ్రహ్మగిరి, గావీమఠ్, సిద్ధాపూర్, ఎర్రగుడి, మస్కి అనే చోట్ల వ్రాసినారు. క్రిందటి ఆధ్యాయంలో పైన చర్చించిన 'సంఘం ఉపాగతే' లేదా 'ఉపయతే' అన్న మాట. పై ఆధ్యాయంలో చర్చించిన 256 రాత్రులు ఈ శాసనంలోనివే. ఈ శాసనంలో వాదోపవాదాలకు కారణమైన వాక్యం :

యా ఇమాయ కాలాయ జంబు దిపస్సి
అమిస్సా దేవాహు సుతే దాణి మిస్సా కటా
ఇప్పటి వరకు జంబూద్వీపంలో దేవ
తలు మనుష్యులతో సన్నిహితంగా లేరు.
ఇక సన్నిహితు లౌతారు.

తన ధమ్మ విధానం ఆచరణలోకి వచ్చినందున స్వర్గంలోని దేవతలు భూమికి ముఖ్యంగా జంబూ ద్వీపానికి దిగి వచ్చినారనేది, అమాయకమైన విశ్వాసమైనట్లు ఈ వాక్యం తెలియజేస్తున్నది. అది తన ఉత్సాహానికి ఫలితమైనట్లు అతడు వర్ణిస్తాడు. ఆ విశ్వాసం కేవలం ఔపచారికమే అయినా ఆ రోజులలో అట్టి భావాలు నిజంగా ఉండేవి.

'అమిస్స' అంటే కలిసి లేరు– అన్న పాఠానికి సంస్కృతంలోని మిశ్ర (కలియడం) మూలము. 'మృష' అని ఆమాటకు మరొక పాఠము. అసత్యమని ఈ మాట కర్థము. ఈ పాఠం ఆధారంగా అశోకుడు మృష, అమృష దేవతలను గురించి ప్రస్తావించినాడని వ్యాఖ్యానిస్తారు. ఈ వ్యాఖ్యానం అనేక వాదోప వాదాలకు కారణమైంది. 'మిస్స' అనే పదానికి 'కలిసిన' అనే అర్థమే సముచితమైనదని మేము అంగీకరిస్తున్నాము. 'మనుసా' అన్న పదంతో 'మిస్స' చేరినపుడు ప్రజలతో కలిసి అంటూ స్పష్టమైన అర్థాన్ని ఇస్తున్నది. ఏమైనా ధమ్మంలో తనకున్న మహోత్సాహం వల్ల జంబూ ద్వీపంలో మానవులతో కలిసి తిరగడానికి దేవతలు వాస్తవంగా దిగివచ్చినారని అశోకుడు భావించినట్లు ఈ వాక్యానికి అక్షరత: అర్థం చెప్పకూడదని, తన విధానానికి దేవతల ఆమోదం ఉన్నదని అశోకుడు భావించినట్లు కేవలం ఔపచారికమైన అర్థాన్నే గ్రహించవలెనని మా ఉద్దేశ్యము. కృతయుగంనాటి ధర్మం పూర్తిగా నడిచే రోజులలో తమ సంతోషం కొద్దీ దేవతలు ప్రపంచాన్ని దర్శించి ప్రజలతో కలిసి తిరిగేవారు. తన ధమ్మ విధానం తిరిగి అంతటి మంచిని దేశంలో సాధించినదని అశోకుని విశ్వాసం. ఈ సందర్భంలో కూడ సామాన్య పాఠకునకు సుపరిచితమైన విలువలనే అశోకుడు వాడినాడు. నాల్గు పాదాల ధర్మంతో మహదైశ్వర్యంతో మానవులు దేవతలవలె జీవితం గడిపేది ఆదర్శ రాజ్యం. ఆ రాజ్యంలో మానవులతో కలవటానికి దేవతలు సందేహించరు అనే భావన నాటి ప్రజల మనస్సులలో సర్వదా మెదులుతూ ఉన్నదనడం స్పష్టం. ఈ భావమే క్రమంగా రామరాజ్య సిద్ధాంతంగా రూపొందింది. తన ధర్మ విధానం ద్వారా అటువంటి సువర్ణయుగం సాధ్యమైనదని అశోకుడీ వాక్యంలో సూచించినాడు.

ఇదే సమయానికి ఐదో శిలాశాసనం ఇవ్వడం జరిగింది. నాటికి ప్రజల పట్ల తాను అనుసరించే విధానాన్ని రూపొందించినట్లు స్పష్టం చేసినాడు. అది అన్ని విధాల శ్రేయోవిధానం అనదగిన విధానం. అందులో కూడ మత సంబంధమైన ధ్వని కనిపించదు. యజమానికి సేవకునకు మధ్య సంబంధాలను గురించి బందీలను చూచే పద్ధతిని గురించి అశోకుని చింతన అయినట్లు కనిపిస్తున్నది. మత విశ్వాసాలేమైనప్పటికి, ఇవి ప్రతి పాలకుడు ఆలోచించవలసిన సాధారణ అంశాలు. ఏ సమాజంలోనైనా యజమాని, సేవకుల మధ్య సంబంధాలు చాల ముఖ్యమైనవి. వాటిని సరిచూడడానికి ఉద్యోగి బృందాన్ని నియమించడమే అశోకునిలోని గొప్పతనం.

బందీల యోగక్షేమాలను పరిశీలించే ఉద్యోగుల నుద్దేశించి అశోకుడన్న మాటలు అతని విధానంలోని మానవత్వాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఆ శాసనమూలం :

బంధన బద్ధన పటి విధానాయే మొఖ్ఖాయె
మొఖ్ఖాయేచ ఇయం అనుబంధ పజాపతి
వా కలూభికాలేతి వా మహాలకే తివా వియా
పా టా తే ... ... ... ... ... ... ... ... ...
సంతానవంతులైన బందీలను, వ్యాధిపీడితులను,
వృద్ధులను విడిపించడంలోను బందీల యోగ
క్షేమాలపట్ల శ్రద్ధ వహించడంలోను (ఉద్యోగులు)
కార్యాతురులై ఉండవలె. లేనిచో బాధ్యతారహి
తంగా ప్రవర్తించిన వారౌతారు.

ఈ వాక్యానికి కెరన్ పండితుడు చిత్రమైన వ్యాఖ్యానం చేసినాడు. దేహి ఆత్మ విమోచనం సాధించడాన్ని ఉద్దేశించిన దా వాక్యమని అతని విశ్వాసము. కాని ఇది తెచ్చిపెట్టిన వ్యాఖ్యానము. ఈ శాసనం కేవలం సాంఘిక సంక్షేమాన్ని, పరిపాలన సంబంధమైన సంక్షేమాన్ని ఉద్దేశించినది. ఇందులోని ప్రసక్తి ప్రభుత్వ ఖైదీలను గురించిన దనడం స్పష్టం. బందిఖానా అనేది నరకతుల్యమైన చిత్రహింసా స్థానంగా కనిపించదు. సంస్కరణాలయ పద్ధతులపై ఏర్పడిన శోధనాలయమే బందిఖానా అయినట్లు ఈ శాసనం సూచిస్తున్నది. తన బంధ విమోచనం అతిసమీపంలో ఉన్నదని ప్రతిబందీ సర్వదా ఆశతో ఉంటాడు. శిక్షా విధానంలో బందీ కుటుంబ యోగక్షేమాలను విచారించడం చాల ఆధునిక భావం. దీన్ని ప్రస్తావించడం మౌర్యపాలన విధానంలోని దూరదృష్టికి నిదర్శనం.

ధర్మ ఉద్యోగులైన ధర్మమహామాత్తుల నియామకాన్ని గురించిన మొదటి ప్రస్తావన ఐదో శాసనంలో చేసినాడు. ఈ ప్రత్యేక ఉద్యోగి బృంద నియామకం పదునాల్గో రాజ్య సంవత్సరంలో జరిగింది. ధర్మాచరణకు బాధ్యులైనందున, వీరికొక ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రాజుకు వీరియందు ప్రత్యేకాభిమానం ఉన్నందున రాజుతో వీరికి సూటి సంబంధం ఉన్నందున ధర్మమహామాత్తులు ప్రత్యేకాధికారాలున్న ఉద్యోగి బృందమని చెప్పవలె. రాజకుటుంబ ప్రాసాదాలు రాజ బంధువుల నివాసాలతో సహా అన్ని వర్గాల ఇండ్లలో ప్రవేశించడానికి వారికి అనుమతి ఉంది. ప్రజా జీవితంలో జోక్యం కలిగించుకొనే హక్కు వారికి క్రమక్రమంగా పెరిగినట్లు శాసనాలను పరిశీలించడం ద్వారా స్పష్టమౌతుంది. సామ్రాజ్య కేంద్రమైన పాటలీపుత్రంలోనే గాక, దూరస్థములైన సామ్రజ్య సరిహద్దు ప్రాంతాలలోను, పరిసరరాజ్య ప్రజలలోను వీరు పనిచేస్తుండేవారు. అంతేకాక మత సంఘాలలోను, లౌకిక బృందాలలో సయితం వీరు పనిచేసేవారు.

అశోకుని ధమ్మం నాడు ప్రచారంలో ఉన్న ఏ మత విధానంతోను సరిపోదనడానికి ఉన్న బలమైన హేతువులలో ధమ్మమహామాత్తుల నియామకం ఒకటి. అది కేవలం మత విధానం కాక, ఆర్థిక సాంఘిక రాజకీయ జీవితాన్ని గురించిన విస్తృత కార్యరంగానికి అన్వయించే విధానం. ధమ్మం ఏ మతంతోనైనా ముఖ్యంగా బౌద్ధంతో అనురూప మయినట్లయితే ధర్మమహామాత్తుల నియామకం అనవసరం. ప్రతి మతంలోను గాఢ విశ్వాసి బృందంగాని, పరివ్రాజక సంఘంగాని ఉంటుంది. వారినే ఆ మతాన్ని ప్రచారం చేయడానికి సంఘటిత పరచవచ్చు. తమ మతంలో గాఢమైన విశ్వాసం ఉన్నవారైనందున మంచి సామర్థ్యంతో ప్రచారాన్ని నిర్వహిస్తారు. అనాథల, దురదృష్టవంతుల అవసరాలను పరిశీలిస్తూ, ప్రజాక్షేమానికై అశోకుడు ప్రారంభించిన కార్యక్రమాలు నిర్వహించడం వారికి శ్రమ అయ్యేది కాదు.

అసలు విషయం అది కాదు. యథార్థానికి భిన్న మత శాఖల శ్రేయోభివృద్ధి ధమ్మమహామాత్తుల విధులలో నొకటి. సర్వమతాలకు అతీతమైనది, భిన్నమైనది ధమ్మం. చైనాతో పోల్చిచూస్తే వర్ణవ్యవస్థకు సంబంధించిన నియమావళి రూపొందడంతో భారతదేశంలో సాంఘిక నీతి వెనుకంజ వేసింది. బుద్ధుని ప్రయత్నం కూడ విఫలమైంది. పరివ్రాజక సంఘాలు సయితం చాలవరకు విరక్తి, సన్యాసాల ద్వారా వ్యక్తిమోక్షానికి మాత్రం పరిమితమయినాయి. మతాంతరీకరణం, భిక్షాప్రదానం వినా లౌకిక సమాజం మోక్షానికి స్వయంకృషిపై ఆధారపడవలసిందే. అంత్యజులను సర్వదా సంఘబాహ్యులుగా పరిగణించేవారు. బ్రాహ్మణులు, శ్రమణులు సయితం అంత్యజుని మానవమాత్రుడుగా పరిగణించడానికి సాహసించేవారు కాదు. సమాజంలో అదృష్టహీనుల క్రింది వర్ణాల సాంఘిక శ్రేయస్సును సాధించడానికై అశోకుడు చేసిన ప్రయత్నమే ధమ్మ మహామాత్తుల నియామకం. అదొక సాంఘిక సంక్షేమ పద్ధతి. కాని వర్ణ వ్యవస్థలోని కాఠిన్యం వల్ల ఆ ప్రయత్నం కూడ ఫలించలేదు.

ధర్మ మహామాత్తుల పద్ధతిని ఉదారబుద్ధితో, సానుభూతితో అశోకుడు ప్రారంభించి ఉండవచ్చు. కాని నాడు దాని అవసరం కూడ ఉన్నది. అన్ని ఆంతరువులలోను సాంఘిక సంక్షేమకృషి జరుగుతున్నపుడే కేంద్రీకృత పాలనా విధానం ఎక్కువ సమర్థంగా పనిచేస్తుంది. అశోకుని దృష్టిలో కేంద్రీకరణ సిద్ధాంతంలో సమస్త ప్రజా సంక్షేమమూ ఇమిడి ఉంది. ధమ్మ మహామాత్తులనే బిరుదం ఇవ్వడం వల్ల వారు కేవలం సాధారణ ఉద్యోగులని, వారికి విస్తృతాధికారాల నిచ్చినాడనే నిందను తప్పించినాడు. మహారాజు ఉద్దేశించిన కార్యక్రమం నిర్వహించే ఉద్యోగులుగా వారు ప్రత్యేక హక్కులను అనుభవించినారు.

ఆధ్యాత్మిక, లౌకిక రంగాలకు సంబంధించిన విషయాలను చిన్న, పెద్ద వారలపై విస్తృతాధికారాలు వీరికుండేవి. సమాజంలో అన్ని స్థాయిల ప్రజలతో వారికి సాన్నిహిత్యం ఏర్పడక తప్పదు. వీరికున్న ఈ అదుపు సమాజంలో అన్నివర్గాల ప్రజలలోనికి ధమ్మవిధానం చొచ్చుకుపోవడానికి ఉపయోగించింది.

తరువాతది ఆరో శిలాశాసనం. ఇది ధర్మ మహామాత్తులద్వారా రాజుకు ప్రజలకు మధ్య సంబంధాన్ని మరింత స్పష్టంచేస్తూ ప్రాచీన పద్ధతులకు స్వస్తి చెబుతున్నది. మహారాజు ఏ కార్యక్రమంలో నిమగ్నుడయినప్పటికీ – అంతఃపురంలో వినోదాలలో ఉన్నప్పటికీ, వ్యక్తిగత కార్యక్రమాలలో ఉన్నప్పటికీ, బయట ఉద్యానవనంలో ఉన్నప్పటికీ ఏ సమయంలోనైనా ఉద్యోగులు తనను కలుసుకోవచ్చునని ధమ్మ మహామాత్తులకు తెలియజేసినాడు. ఉద్యోగులు తనను సమీపించిన సమయంలో తక్షణమే అశోకుడా వ్యవహారంపై నిర్ణయం తీసుకొంటాడు. రాజు చర్యలను చర్చించే మంత్రి పరిషత్తులో తలయెత్తే అంశాలనుగాని, మంత్రి పరిషత్తు చేసిన తాత్కాలిక తీర్మానాలనుగాని అత్యవసరంగా తనకు నివేదించవలెనని నొక్కి చెప్పినాడు.

ప్రజల సమాచారాన్ని రాజుకు నివేదించే ఉద్యోగి బృందాన్ని అశోకుడు 'పటి వేదకులు' అని వ్యవహరించినాడు. మంత్రి పరిషత్తు అభిప్రాయాలను విన్నవించే వారిని ప్రత్యేకంగా మహామాత్తులు అనినాడు. రెండు వర్గాలు ప్రత్యేకమైనవి. కాని మొదటి వర్గం వారు అంటే పటి వేదకులు మహామాత్తులనే సాధారణ ఉద్యోగి బృందానికి ఉపశాఖ అయి ఉంటుంది. రాజు సర్వదా సులభుడై ఉండడం మంచి చక్రవర్తి ముఖ్య లక్షణమని రాజనీతి గ్రంథాలన్నీ నొక్కి చెబుతున్నాయి. పని రోజులలో రాజు దిన చర్యను వివరంగా చెబుతూ, ప్రజలకు దుర్లభుడైన రాజు అసంతృప్తిని కలిగించడమేగాక, తన పదవికే ప్రమాదం తెచ్చుకొంటాడని అర్థశాస్త్రం స్పష్టంచేస్తున్నది. ఇది కేవలం సిద్ధాంత పరమైన సూచనగా మాత్రమే చంద్రగుప్తుడు పరిగణించలేదని అతనిని గురించి మెగస్తనీసు చెప్పిన మాటలను బట్టి తెలుస్తున్నది. ఒళ్ళు పట్టించుకొనే సమయంలో కూడ రాజ్య వ్యవహారాలను పరిశీలించడానికి వెనుకాడేవాడుకాదని చూడవచ్చిన ప్రజలకు దర్శన మిచ్చే వాడని చంద్రగుప్తుని గూర్చి మెగస్తనీసు వ్రాసినాడు.

ఆరో శిలాశాసనం రెండవ భాగం అశోకుడు ప్రజాశ్రేయస్సుపట్ల శ్రద్ధవహించినాడని నొక్కి చెబుతున్నది. రాజ్యవ్యవహార నిర్వహణ ప్రజా సంక్షేమ కార్యక్రమ విజయానికి మూలమని అశోకుడు భావించినాడు. ఇక్కడ కూడ పాలనా విధానాన్ని సమర్థంగా సంఘటిత పరచడం మీదనే నొక్కు కనిపిస్తున్నది. అట్టి చర్యకు కారణం ప్రాణికోటిపట్ల తన ఋణం

తీర్చుకొనవలెననే కోర్కెగా వర్ణించినాడు. ఏ మత విశ్వాసమూ ఈ భావానికి ఆధారం కాదు. అది అశోకుని వ్యక్తిత్వం నుండి ప్రజలపట్ల తనకు గల బాధ్యత అనే సంవేదన నుండి ఉత్పన్నమైంది. ప్రజల యోగక్షేమాల కిచ్చిన ప్రాధాన్యం నాడు ప్రచారంలో ఉన్న సిద్ధాంతాలకు విరుద్ధమైన భావం కాదు. అర్థశాస్త్రంలో ఒక శ్లోకముంది. ఆ శ్లోకమే ఈ శాసనంలో కొన్ని భాగాలకు ప్రోత్సాహమై ఉంటుంది. అందులో కౌటిల్యుడు అంటాడు. "ప్రజల సుఖంలోనే రాజు సుఖం; ప్రజల శ్రేయస్సే రాజు శ్రేయస్సు. తనకు సంతోషాన్ని ఇచ్చేదికాక ప్రజలకు సంతోషాన్ని ఇచ్చేదే మంచిగా రాజు పరిగణిస్తాడు. ఉద్యోగుల, వార్తాహరుల సుసంఘటితమైన రాజ్యంపై అశోకుడు అధికారం చలాయించినాడనే భావం ఈ శాసనంవల్ల కలుగుతుంది. రాజత్వంలో ఉన్న అనుభవము, రాజత్వాన్ని గురించి సిద్ధాంత గ్రంథాల పరిచయం ద్వారా కలిగిన పరిజ్ఞానము, అతని వ్యక్తిత్వము అనే అంశాలన్నింటివల్ల సువిశాల మహాసామ్రాజ్యానికి చక్రవర్తిగా తన బాధ్యతలను అశోకుడు గుర్తించినాడు.

ఏడో శిలాశాసనం చిన్నది. మత శాఖలన్నింటిపట్ల సహనాన్ని ఉద్బోధిస్తున్నది. ఆ రోజుల్లో భిన్నమత శాఖలు తమ మధ్య అభిప్రాయభేదాలను తీవ్రంగా వ్యక్తీకరిస్తున్నట్లు కనిపిస్తున్నది. ప్రతి మతము నిర్మలమైన మనస్సును, ఆత్మ సంయమనాన్ని బోధిస్తుంది అనే సిద్ధాంతాన్ని కాంక్షించే వ్యక్తి చేసే ప్రబోధం ఈ శాసనంలో కనిపిస్తున్నది. మత కలహాలవల్ల కల్గే హానిని అశోకుడు స్పష్టంగా గుర్తించి ఉండవలె. మత సంఘర్షణలవల్ల ధమ్మ విధానానికి కూడా అంతరాయం కలుగుతుంది. ధమ్మాన్ని కూడ కేవలం ఏదో ఒక మతానికి చెందిన సిద్ధాంతాలుగా ప్రజలు పరిగణించే ప్రమాదం ఉంది. అయినప్పుడు ధమ్మ విధాన భవిష్యత్తుకు హాని కలుగుతుంది. తమతమ నివేశనాలలో సమాజాలు, మతశాఖలు కలిసిమెలిసి ఉండాలని అశోకుడు కోరినాడు. దీనివల్ల రెండు ప్రయోజనాలున్నాయి. మొదటి ప్రయోజనం మతసహనానికి ప్రోత్సాహం లభిస్తుంది. రెండో ప్రయోజనం మత, రాజకీయ వ్యతిరేకత విజృంభించకుండ అరికట్టడం జరుగుతుంది. ఈ విధంగా చెప్పడం అశోకుడు మతసహనాన్ని ప్రోత్సహించడం కేవలం రాజకీయ అవసరాలకు మాత్రమే అని సూచించడం కాదు. ఇతర పరిస్థితులలో అతని అభిమతం అదే అయి ఉండవచ్చు. కాని ధమ్మ విధానం దృష్ట్యా మత సహనంపై నొక్కు అత్యవసరమైంది.

అశోకుని మతసహన విధానాన్ని గురించి ఒక సమస్య ఉంది. అతని సహనం ఇతర మతాలకు మాత్రమే వర్తించింది. బౌద్ధ మతంలో మాత్రం అతడు పూర్తిగా

సిద్ధాంతాలను గుణంగా ప్రవర్తించినాడు. ఇందుకు ఉదాహరణగా బౌద్ధ సంఘాన్ని మాత్రమే ఉద్దేశించిన విభేద శాసనాలను కెరన్ పండితుడు సూచిస్తాడు. కాని ఈ అభిప్రాయం అశోకునకు, బౌద్ధ సంఘానికి మధ్య నున్న సంబంధాన్ని గురించి పొరపడడం వల్ల ఏర్పడింది. బౌద్ధ సంఘాన్ని బలపరచే ఉపాసకుడుగా, చక్రవర్తిగా అతని మాటలలో ఉత్సాహంతోపాటు క్రమ శిక్షణ పట్ల గౌరవం కనిసిస్తుంది. ఒకే మతాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్నందున ఆ మత సభ్యులను సిద్ధాంతాలలో, విధానంలో సమైక్యంగా వ్యవహరించినాడని ఉద్భోధించడం సహజం. మరే ఇతర సంఘాన్ని సంబోధించినా అశోకు డిదే దృష్టిని ప్రదర్శించి ఉండేవాడు. బౌద్ధులు ఇతర మతస్థులను సహింపరాదని కాని, ఆ మతస్థుల వాక్స్వాతంత్ర్యాన్ని, ఆచార స్వాతంత్ర్యాన్ని అరికట్టాలని గాని ఎక్కడా చెప్పలేదు. మత సహిష్ణుతను ప్రయోజనాత్మకమైన జీవిత లక్ష్యంగా తన ధర్మంలోని క్రమశిక్షణపట్ల అతడెక్కువ శ్రద్ధ వహించి నాడనడం సత్యానికి సన్నిహితంగా ఉంటుంది. భిన్న మార్గాలమధ్య శాంతి అతని విధానానికి చాల ముఖ్యం.

తన పదో రాజ్య సంవత్సరంలో బోధివృక్షాన్ని దర్శించడానికై అశోకుడు బుద్ధగయకు వెళ్ళినాడు. ఈ సంఘటనను అనుసరిస్తూ ధర్మయాత్రల పద్ధతిని ప్రారంభించినాడు. ఎనిమిదో శిలాశాసనం ధర్మయాత్రలను వర్ణిస్తూన్నది. ధమ్మాన్ని విస్తరింపచేయడానికై దేశాటనం చేసే సందర్భాలే ధర్మ యాత్రలు. అశోకునకు పూర్వం సైనిక దాడులుకాక మృగయా విహార, వినోద పర్వదినాల సందర్భాలలోనే రాజులు దేశంలో పర్యటించేవారు. చంద్రగుప్తుని కాలం నాటి ఒక మృగయా విహారయాత్రను మెగస్తనీసు వర్ణించినాడు. ఆ వర్ణన వల్ల అట్టి యాత్రలలోని విషయాలను గ్రహిస్తున్నాము. మృగయా విహార యాత్రలలోని వృధావ్యయ ప్రయాసలను, ప్రాణనష్టాన్ని తీవ్రంగా నిరసించినందున అశోకుడాయాత్రలను నిషేధించడం సమంజసమే. అశోకుడు కూడ దేశయాత్ర సాగించినాడు. కాని మృగయా విహారానికి బదులు సిద్ధాంత వ్యాప్తికి సాధనంగా దేశాటనం చేస్తూ ధమ్మ సూత్రాల విస్తరణకు సహాయకారి అయినాడు. ప్రపంచంలో అన్ని ప్రాంతాలలోను మతాచార్యులు ప్రచార విధానాన్ని అనుసరించినారు. అందుచేత రాజ విహార సంప్రదాయాన్ని ధమ్మ ప్రచారానికి అనుసంధించడం అశోకుని చాపల్యము కాదు.

అశోకుడే వివరించినట్లు ఈ యాత్రలవల్ల అనేక ప్రయోజనాలున్నాయి. బ్రాహ్మణులను, శ్రమణులను దర్శించి వారికి దానధర్మాలు చేయడం; వృద్ధులను దర్శించి వారికి బంగారం పంచి, భృతి కల్పించడం; ఉదాత్తమైన నీతి సూత్రాలను బోధించి ప్రజల నైతిక ప్రవర్తనను గురించి పరామర్శించడం; అనేవి ఆ ప్రయోజనాలని అశోకుడే

చెప్పినాడు. ఈ పట్టికవల్ల ధమ్మయాత్రలది ప్రత్యేకించి మత ప్రయోజనంకాదని తెలుస్తున్నది. ఆశించిన పూర్తి ప్రయోజనంలో భిన్న మత శాఖలను దర్శించడం ఒక భాగం మాత్రమే. అశోకుడు బోధివృక్షాన్ని దర్శించడం ఆధారంగా ధర్మయాత్రల ప్రయోజనం కేవలం బౌద్ధ క్షేత్రాలను దర్శించడం మాత్రమే అని కొందరు సూచిస్తున్నారు. కాని అది సరియైన సూచనకాదు. శాసనమూలంలో అశోకుడా యాత్రలను ఆ విధంగా వర్ణించలేదు. పైపెచ్చు బ్రాహ్మణులను, శ్రమణులను కలిపి ప్రస్తావించినందున కనీసం ఈ యాత్రా సందర్భాలలో అశోకుడు ఏ ఒక్క మతాన్ని, ఇతర మతాలకంటె ఎక్కువగా అభిమానించలేదని స్పష్టమౌతుంది. అంతేకాక ఒక ప్రత్యేక ప్రదేశానికి యాత్ర అనిగాని, మత సంబంధమైన పర్యటన అని కాని సూచించడంలేదు. ఒక ప్రాంతంలో పర్యటించడం ద్వారా, అచటి సమాజంలో వేరు వేరు మతశాఖలను, రైతులను, గ్రామస్థులను, వృద్ధులను కలిపి ప్రజలతో తన పరిచయాన్ని పెంచుకొనేందుకు, ప్రజలలో అన్ని తరగతుల వారికి తన ధమ్మ విధానాన్ని ప్రబోధించేందుకు అశోకుడు ప్రయత్నించినాడని వ్యాఖ్యానించవచ్చు. కావున ధమ్మంతో ప్రజల పరిచయాన్ని పెంచడానికి ఉద్దేశించిన యాత్రనే ధమ్మయాత్ర అని అశోకుడు వ్యవహరించినాడు.

ఈ యాత్రలలో వేరు వేరు ప్రదేశాలను రాజు తనిఖీ చేయడంకూడ చేరి ఉండవలె. తన రాజ్యంలో జరిగే సంఘటనలపట్ల మిక్కిలి ఆసక్తి వహించినందువల్ల దేశ వ్యాప్తంగా అశోకుడు పర్యటనలు సాగించినాడనడం అబ్బురం కాదు. సునిశిత బుద్ధిగల చక్రవర్తికి ఈ యాత్రలు ప్రజాభిప్రాయాన్ని అంచనా కట్టడానికి సంతృప్తికరమైన సాధనంగా ఉపకరిస్తాయి. అశోకుడీ ప్రయోజనాన్ని కూడ సాధించి ఉండవలె. అంతేకాక స్థానిక ఉద్యోగులను అదుపులో ఉంచడానికి సయితం ఈ యాత్రలు ఉపకరించేవి. మౌర్య సామ్రాజ్యం వంటి సువిశాల సామ్రాజ్యంలో గ్రామీణ ప్రాంతాలను, దూర ప్రాంతాలను దర్శించడం పరిపాలనకు తప్పనిసరి. బ్రహ్మగిరిలోను, తత్పరిసర ప్రాంతాలలోను దొరికిన గౌణ శిలాశాసన ప్రతులు అశోకుడు తన సామ్రాజ్య దక్షిణ సీమలలో పర్యటించినాడని స్పష్టంచేస్తున్నాయి. పర్యటనలో ఉండే అశోకుడు ఈ శాసనాన్ని ఇచ్చినాడు.

బహుశా తొలి యాత్రలలోనే అశోకునకు ధమ్మ మహామాత్తులను నియమించాలనే భావం కలిగి ఉండవచ్చు. ఆ ఉద్యోగులు తనకు ప్రజలకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తారు. సాధారణ ఉద్యోగి బృందాలలో పని చేసేవారికంటె ధర్మ మహామాత్తులది ప్రత్యేకమైన హోదా. వీరిని సమర్థులైన ఉద్యోగుల నుండి ఎన్నుకొనేవారు. ధర్మాన్ని అమలు జరపడానికై ప్రజల మధ్యకు వారిని పంపేవారు. సర్వదా ధర్మ మహామాత్తులతో చక్రవర్తికి సంబంధం

ఉన్నందున వారి కృషిఫలితా లాతనికి స్పష్టంగా తెలుస్తాయి. ధర్మ మహామాత్తులు రాజు ఆధీనంలో ఉండేవారు. అతడే వారి చర్యలను సంఘటిత పరుస్తాడు. అతని ఆధీనంలోనే ఉండి, ధర్మ మహామాత్తులు పని చేస్తున్నందున ఇతర రాజ్య వ్యవహారాలపైకి తన దృష్టిని చక్రవర్తి మరలించకవచ్చు.

గ్రామీణ ప్రజానీక ప్రాముఖ్యాన్ని గుర్తించిన ప్రథమ భారతీయ చక్రవర్తి బహుశా అశోకుడే. ఈ విధంగా గుర్తించడానికి ముఖ్య కారణం ప్రజలలో అధిక సంఖ్యాకుల భావాలను గ్రహించాలనే కోరిక అయి ఉండవచ్చు. అందుకై అశోకు డనేక చర్య లమలు జరిపాడు. వానిలో యాత్రలొకటి. పట్టణాల మధ్య మంచి రాకపోక సౌకర్యాలున్నందున పరస్పర భావ ప్రసారం సులభమౌతుంది. కాని గ్రామ ప్రాంతాలలోని ప్రజలింకా ఏకాంతంలోనే ఉంటూ ఉన్నారు. అందుచే వారితో పరిచయం పెంచుకోవాలని అశోకుడాశించడం సహజమే. గ్రామ ప్రజలకు చేరనిదే ధమ్మం విజయవంతమైనదని చెప్పజాలము. ఈ ప్రయోజనాలు రెంటిని సాధించడానికి దేశ వ్యాప్తంగా ప్రజల మధ్య యాత్రలు జరపటం ఒక్కటే మార్గం.

రైతాంగ ప్రాముఖ్యాన్ని అశోకుడు గ్రహించడాన్ని పశుపాలక దశ నుండి వ్యావసాయకంగా ఆర్థిక పద్ధతి మారడమే కారణమని సూచించవచ్చు. రాజ్యస్వం చెల్లిస్తున్నందున రాజ్య ఆదాయానికి గ్రామము, రైతులు ప్రధాన ఆధారమైనారు. రాజ్య ఆదాయానికి భూమిశిస్తు ముఖ్య ఆధారమైనందున దేశ పాలన వ్యవస్థలో రైతుకు కొత్తగా ప్రముఖ స్థానం లభించింది.

తొమ్మిదో శిలా శాసనంలో తిరిగి అశోకుని పవిత్ర దృక్పథం కనిపిస్తుంది. దేశంలో విస్తృతంగా అనుసరించే ఆచార విధులను శాసనం మొదటి భాగంలో పరుషంగా ఖండించినాడు. శాసనం రెండో భాగంలో పారుష్యం కొంత తగ్గింది. ఈ విధులను అనుసరించడంకంటె నీతి ప్రవర్తన ఎంతో ముఖ్యమని వివరించినాడు. ఇది కర్మకాండలు చేయించడం ద్వారా వచ్చే ఆదాయంమీద ఆధారపడిన బ్రాహ్మణులను, ఇతర మతస్థులను పరోక్షంగా విమర్శించడం అనే వాదం ఒకటి ఉన్నది. అనారోగ్య సమయాలలో, శిశూదయమైనపుడు, వివాహ సందర్భాలలో, ప్రయాణాలకు ముందు జరిపే తంతులను ప్రత్యేకించి అశోకుడు పేర్కొన్నాడు. ముఖ్యంగా స్త్రీలు అంటే భార్యలు, తల్లులు వ్యర్థ నిరర్థక ఆచారాలు పాటిస్తారని ఆక్షేపించినాడు.

సమకాలిక మతంలో కర్మకాండకు విపరీత ప్రాముఖ్యం ఇస్తున్నారని అశోకుడు గుర్తించినాడనడంలో సందేహంలేదు. అందు చాల భాగం అర్థరహితమని కేవలం పూజారికి

ఆదాయ మార్గమేనని గమనించినాడు. కర్మకాండ నిష్ఫలమనీ, దానితో పోలిస్తే నీతివర్తన నిజంగా విలువైనదని అతని వాదం. ఇది కర్మకాండను ఋజు దృక్పథంతో చూడడానికి చేసిన ప్రయత్నం. కర్మకాండను ప్రోత్సహించే బ్రాహ్మణులను, శ్రమణులను అశోకుడు దూషించడం లేదు. వారిపట్ల ఉదారంగా వ్యవహరించాలనే కోరినాడు. కాని ఈ విషయాలలో ప్రజలు వివేకంతో వ్యవహరించాలని అతని కోరిక. కర్మకాండ స్థానంలో అతడు ప్రవేశ పెట్టదలచిన ఆచారాలు సమాజంలో మానవ సంబంధాలను పెంపొందించేవిగా ఉన్నాయి. అందుచే అవి చాల విలువైనవి. బానిసల పట్ల, సేవకుల పట్ల దాక్షిణ్యము, పెద్దలయందు గౌరవము, జంతువులపట్ల కరుణ వహించుడని ఆతడు కోరినాడు. అందుకు ప్రతిఫలంగా ఇహలోకంలో కోరికలు సిద్ధిస్తాయని, పరలోకంలో అనంత పుణ్యం లభిస్తుందని అశోకుడు వాగ్దానం చేసినాడు. క్లుప్తంగా చెప్పాలంటే ధమ్మమే సదాచారమని, దానివల్ల ప్రజలందరికీ మంచి జరుగుతుందనీ, వ్యయ ప్రయాసలతో కూడి వైయక్తికమైన క్రతువుల కంటె ధమ్మం ఉత్తమ ప్రయోజనమని ప్రచారం చేసినాడు.

సాంప్రదాయక క్రతుకాండను కేవలం మత కారణాలమీదనే అశోకుడు నిరసించలేదు. క్రతువులకయ్యే వ్యయంపట్ల ఆతడు ఆసక్తి వహించినాడు. సమాజంలో ఏ కొద్దిమంది మాత్రమే ఆ వ్యయాన్ని భరించగలరు. అంతేకాక క్రతువుల వల్ల ఒక అల్పసంఖ్యాక వర్గం చేతులలో ధనం కేంద్రీకృతం కాగల ప్రమాదముంది. అందుచేత ఆర్థిక దృష్టితో పరిశీలిస్తే అది దుర్వ్యయం అవుతుంది. అట్టి ఆచారాల ఖండనకు మితంగా ఖర్చుచేయాలని, భోగాలు మితంగా ఉండాలని మూడో శిలా శాసనంలో వ్యక్తం చేసిన కోరికకు సంబంధం ఉంది.

పదో శిలా శాసనంలో కీర్తి ప్రతిష్టలను నిరసిస్తూ ప్రజలు ధర్మ సూత్రాలను పాటించడమే తనకు ప్రతిష్ఠగా అశోకుడుద్ఘాటిస్తాడు. తన కృషికి ప్రయోజనం ద్విముఖమని వర్ణించినాడు. ఒకటి పరలోకంలో పుణ్యం; రెండు ఇహలోకంలో ప్రమాదం తప్పడం. మొదటి ప్రయోజనాన్ని పేర్కొన్నాడే గాని వివరంగా చర్చించలేదు. రెండోదాన్ని పాప ప్రమాదంగా వివరించినాడు. ఉన్నత స్థానంలో ఉన్న వారికి ధర్మ సూత్రాలను పాటించడం కష్ట సాధ్యం. అందుకు కారణం వారెక్కువ త్యాగం చేయవలసి ఉండడమే. వారికి లభ్యపడే విభవాన్ని, ఉపచారాలను పరిత్యజించవలె. ఈ వివరణ దైనందిన కార్యక్రమాల దృష్ట్యా మానవ బలహీనతల పట్ల అవగాహనను సూచిస్తున్నది. ప్రతి వ్యక్తి అసంభవమైనదానిని సాధించవలెనని కోరకుండా ధర్మానుగుణంగా ప్రవర్తించడంలోని సాధక బాధకాల ప్రమాణం వ్యక్తులనుబట్టి మారుతాయని, అందువల్ల ధర్మాచరణలో సమస్యలు తలెత్తగలవని

అశోకుడంగీకరించినాడు. ఈ శాసనంలో అశోకునియందు మత బోధకుని ధోరణి కనిపిస్తుంది. కాని తన భావాలకు సహజమైన మంచితనంలో పూర్తి ఆత్మవిశ్వాసం ఉన్న మనిషిగా కూడ కనిపిస్తాడు.

తరువాతిది పదకొండో శిలా శాసనం. ఇందులో ధమ్మాన్ని గూర్చి మరికొంత వివరణ ఉంది. ధర్మ ఉపాయనం, ధర్మ వితరణ, ధర్మ బాంధవ్యాలను దీనిలో ప్రస్తావిస్తాడు. ఈ శాసనం తొమ్మిదో శిలా శాసనాన్ని చాల సన్నిహితంగా అనుసరిస్తున్నది. ఈ శాసనంలో కూడ ఏ మతాన్నీ ప్రస్తావించక ధమ్మాన్ని మాత్రం వివరించే ప్రయత్నం సాగింది. ధమ్మం బౌద్ధమత ప్రచారానికి ప్రయత్నమే అయితే బౌద్ధ పరివ్రాజకుల, ప్రచారకుల మాటల పట్ల ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టంగా చెప్పి ఉండేవాడని గట్టిగా చెప్పగలము. కాని అశోకుడిచ్చిన వివరణ వల్ల ధమ్మానికి అతడిచ్చిన అర్థం బోధపడుతుంది. అతనిది కేవలం లౌకికమైన బోధన మాత్రమే. పెద్దలను గౌరవించడంపై అశోకుడు నొక్కి పెట్టినాడు. పెద్దలంటే సమాజంలోని మత వృద్ధులు, కుటుంబంలోని పెద్దలు, మిత్రుల పట్ల, పరిచయస్థుల పట్ల ఉదారులై ఉండాలనే విజ్ఞాపనం తనకు సామాజిక నీతి పరిజ్ఞానం పరిపూర్ణంగా ఉన్నదని గర్వించే ఏ జాతికైనా చేయదగిన విజ్ఞాపన. జంతువధ మానడం అన్నది శతాబ్దాల తరబడి అన్ని సంస్కృతులలోను వినిపించిన మానవత్వంతో కూడిన విజ్ఞాపనయే.

ధమ్మం అనేది అశోకుని దృష్టిలో ఒక జీవిత విధానం. అది అతనికి పరిచయమున్న తత్త్వవేత్తల నైతిక బోధనల సారము. బహుశా స్వీయ జీవితానుభవసారం కూడ అయి ఉండవచ్చు. ఆ జీవిత విధానం ఉన్నత స్థాయి సామాజిక నీతిమీద, పౌర బాధ్యతలమీద ఆధారపడింది. అశోకుడు కేవలం సైద్ధాంతికుడైన బ్రాహ్మణుడు కాదు. వర్ణవ్యవస్థను గురించి ఆదర్శప్రాయంగా చిత్రించిన సిద్ధాంతంగా కాక, నిత్య జీవితం దృష్ట్యా తన ధమ్మాన్ని రూపొందించినాడు. లౌకిక సంబంధాల సక్రమ అవగాహనపై ఆధారపడిన చైతన్యయుత సాంఘిక ప్రవర్తన ఏ సమాజానికైనా చాల అవసరమని అతడు గమనించినాడు. కాని నాటి సమాజంలో బ్రాహ్మణ బోధనల ఫలితంగా ఆ ప్రవర్తన క్రమంగా అంతరిస్తున్నది. వ్యక్తిగత యోగ్యతను బట్టిగాక జన్మ అనే అదృష్ట ఫలితంగా ద్విజన్ములకు ప్రత్యేక సదుపాయాలు, హక్కులు సంభవిస్తవని బ్రాహ్మణుల బోధనలలోని సిద్ధాంతం. అశోకుని సూత్రాలు ఆ సిద్ధాంతాన్ని ఖండించినాయి. సాధారణంగా పెక్కు సమాజాలలో కన్పించే సాంఘిక డాంభికత్వాన్ని పరిహరించి, మానవత్వ సిద్ధమైన సాంఘిక ప్రవర్తనను అశోకుడు కాంక్షించినాడు. స్వర్గ సౌఖ్యం వంటి ఆధ్యాత్మిక భావనతో ప్రజలకు

పరిచయముంది. అటువంటి ప్రతిఫలాల ఆశ చూపటం ద్వారా సాంఘిక బాధ్యతను కేవలం సదాచార వర్తనగాగాక ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉండి నిర్వ్యాజంగా అనుసరించే బాధ్యతగా ఉదాత్త స్థానానికి కొనిపోవడానికి అశోకుడు ప్రయత్నించినాడు.

తన శాసనాలన్నింటిలో కుటుంబ ప్రాముఖ్యాన్ని అశోకుడు నొక్కి చెప్పినాడు. ధమ్మ వికాస విస్తరణలకు కుటుంబం కేంద్రంగా ఉపకరిస్తుందని ఆతడు గ్రహించినాడనడంలో సందేహం లేదు. మౌర్యయుగం నాటికి సాంఘిక వ్యవస్థ క్లిష్టరూపం వహించింది. వర్ణవ్యవస్థ రక్త సంబంధాలపై విపరీతమైన నొక్కు పెట్టింది. అందుచేత సమాజంలో కుటుంబం చాల ప్రాముఖ్యం వహించింది. వంశానుగతమైన వర్ణము, వృత్తి అనేవి తరానికి తరానికి మధ్య సంబంధాలను సన్నిహితం చేస్తవి కాబట్టి భావవ్యాప్తికూడ సూటిగా సాగుతుంది.

నాటి కుటుంబం పైతృక వ్యవస్థ. తాత మొదలు నౌకర్లు, బానిసలవరకు కలిసి ఒక కుటుంబం ఏర్పడుతుంది. వారందరు ఒకే గృహంలో నివసిస్తారు. కాబట్టి గృహం ముఖ్యమైన సామాజిక ప్రమాణం. ద్రవ్య ఆర్థిక విధానం అమలు లోనికి వస్తూ కొత్త వాణిజ్యవృత్తులు ఆవిర్భవించడంవల్ల డబ్బు కూడబెట్టి మూలద్రవ్యాన్ని ప్రోగుచేయడమే కుటుంబ సభ్యులకు ఉత్సాహ కారణమై కుటుంబానికి మరింత బలం చేకూరింది. అందుచేతనే మిత్రులను, పొరుగువారినేగాక, తండ్రి, కొడుకు, సోదరుడు, గేస్థులను సయితం ఉద్దేశించి ధమ్మాచరణకు అశోకుడు విజ్ఞప్తి చేసినాడు.

ధౌళి, జౌగడలలో పదకొండు, పండ్రెండు, పదమూడో శాసనాలు లేవు. వాటికి రెండు ప్రత్యేక శాసనాలను చేర్చినారు. ఇతరచోట్ల ఈ రెండు శాసనాలు లేవు. పై మూడు శాసనాలను పరిశీలించి కళింగ ప్రాంతంలో వానిని (11,12,13) ఎందుకు చేర్చలేదో గమనించడం అవసరం. పైన పరిశీలించినట్లు పదకొండో శాసనం నీతి ఆచరణకు సంబంధించినది. తొమ్మిది, పదకొండు శాసనాలలోని అంశాల మధ్య పోలిక ఉంది. పండ్రెండవ శాసనం భిన్నమత శాఖలమధ్య సహనానికి ఉన్న ప్రాముఖ్యాన్ని నొక్కి చెబుతున్నది. నాడు భిన్న మత శాఖల మధ్య తీవ్ర అభిప్రాయ భేదాలుండి పరస్పరం సత్సంబంధాలు లేనట్లు కనిపిస్తుంది. ఈ అభిప్రాయ భేదాలు తీవ్రమైనవి కానిచో అశోకుడు వానికై ప్రత్యేకంగా ఒక పెద్ద శాసనాన్ని వేయించేవాడు కాడు. ధమ్మానికి ప్రజలిస్తున్న ప్రోత్సాహంవల్ల తమ తమ మతాలకు హానికలుగుతుందని ఊహించి, ఆ మతాల నాయకులు అశోకుని విధానాన్ని విమర్శించిన ఫలితమే పండ్రెండో శాసనం. ఇతర మతాలన్నింటిని బహిష్కరించి కేవలం తన మతాన్నే ధర్మ మత స్రష్టప్రచారం చేయనున్నాడనే బ్రాహ్మణాది మత వర్గాలు వాదించి ఉండవచ్చు. సాంప్రదాయక ఆచారాలు వెనకపడి స్థానిక పూజారుల

పలుకుబడి తగ్గడంతో ప్రజలలో ధమ్మ ప్రభావంవల్ల ధర్మచ్యుతి కలుగుతున్నదనే అభియోగాలు, నివేదనలు వచ్చి ఉండవచ్చు.

అన్ని మతాలలోని గృహస్థులను, పరివ్రాజకులను తాము గౌరవిస్తున్నట్లు ప్రతి మతంలోని ముఖ్య సిద్ధాంతాల పురోగతియే తనకు ఉత్కృష్ట గౌరవంగా భావిస్తున్నట్లు అశోకుడు చెప్పినాడు. అయితే పరమత సహనంలోనే ఈ పురోగతి ఉంది. సహనం అంటే నిశ్చేష్టమైన సహజీవనం కాదు. పరస్పరం దూషణలకు దిగకుండ భావాలు వ్యక్తం చేసుకొనే ఉత్సాహశీలమైన మానసిక స్థితి, ఇతర మతాలను గూర్చి నిగ్రహంతో మాట్లాడాలని అశోకుని కోరిక. లేనిచో స్వమతాన్ని అతిగా భూషించడం అన్యమతాలను దూషించడం జరగవచ్చు. ఇతర మతాలను గౌరవించడంలోనే స్వమతగౌరవ శ్రేయస్సులు ఇమిడిఉన్నాయి. ఇక్కడ కూడ సాంఘిక ప్రవర్తన అనే భావానికే ప్రాముఖ్యం ఉంది. ఉత్తముడైన వ్యక్తి తన మతంలో ఎంత అచంచల విశ్వాసం ఉన్నప్పటికీ మాటలలో, చేతలలో తోటివారి భావాలను పూర్తిగా సహిస్తాడు. అట్టిసహనం ద్వారా తనకు గౌరవం, తన వర్గానికి ఔన్నత్యం సాధించగలుగుతాడు. చైనా తత్త్వవేత్త అయిన కన్‌ఫ్యూషియస్ నీతిని గురించి ప్రబోధించిన సిద్ధాంతం వంటిదే ఈ శాసనంలో ప్రవేశించింది. సహనానికి తోడు సమన్వయం ప్రశస్తమైనదనీ, మతాలన్నీ పరస్పరం నీతి బోధనలను ఆలకించి అనుసరించాలని కూడ అశోకుడు చేర్చినాడు. భిన్నమతాల సారవమైనందున అశోకుడనుసరించిన ఈ మార్గం ధర్మ అభ్యున్నతికి దోహదం చేసింది. ధమ్మంలో ఇతర మతాలకు విరుద్ధమైనది ఏమీ లేదని నిరూపిస్తూ ఇతర మతాల స్థానంలో ధమ్మాన్ని నెలకొల్పడం తన ఆశయంకాదని పరస్పర సహనానికి తాను ప్రాముఖ్యం ఇస్తున్నానని ఉద్ఘాటించి ఇతర మత నాయకులను తృప్తిపరచి, తన విధానాన్ని సమర్థించుకొన్నాడు.

మతసారాన్ని వ్యాప్తిలోనికి తేవడానికే అశోకుడు మహామాత్తులకు ఎక్కువ అధికారాలనిచ్చినాడు. ధమ్మ మహామాత్తులు ధర్మ ప్రచారంలో నిమగ్నులైనారని పదే పదే ఉద్ఘాటించినాడు. అదే విధంగా స్త్రీలకై నియామకం చేసిన ఇథీజ్ఞక్క మహామాత్తులు. వీరు నిర్వహించిన విధులేమో నేటికీ సందిగ్ధంగానే ఉన్నాయి. కాని ధర్మవ్యాప్తి అంటే ప్రతివ్యక్తికీ ధర్మం చేరవలెనని స్పష్టం చేసినాడు. పశుక్షేత్రాలను పరిశీలించే ఉద్యోగులకు, ఇతర ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. వారు ధమ్మంలో పరమత సహనంలో ఉపదేశం పొందినారు. తమ దైనందిన విధి నిర్వహణలో వారీ ఉపదేశాన్ని ప్రచారం చేస్తారని అశోకుడాశించినాడు. ఈ శాసనం చివరి వాక్యంలో తన విధానంపట్ల అశోకుని దృష్టి వ్యక్తమౌతుంది.

అయంచ ఏతస్స ఫలయ ఆత్పపాషండ
వడ్ఢీచ హోతి ధమ్మస్స చ దీపనా :
దీని ఫలితం స్వీయమత ప్రభావాభివృద్ధియే గాక ధర్మ అభ్యున్నతి.

కొన్ని కర్మకాండలను మానవలసి వచ్చినా ధమ్మ ఆచరణవల్ల స్వీయ మతాభిమానాన్ని త్యజించనక్కరలేదనే అంశాన్ని అశోకుడు స్పష్టం చేయదలచినాడు. మాటలలో, చేతలలో ధమ్మాన్ని బలపరచడం వల్ల స్వీయ మతం నుండి బహిష్కరణ జరుగుతుందనే విమర్శకులకు సమాధానంగా అశోకుడీ మాటలన్నాడు. తన చర్యల ఫలితంగాను, హృదయపూర్వక మత సహనం ద్వారా ఇతర మతాలతో సాధించిన సంబంధాల ఫలితంగానూ ధమ్మం విస్తరిస్తుందని అశోకుడు ఉద్ఘాటించినాడు.

అశోకుని చరిత్రకు పదమూడో శిలాశాసనం చాల ముఖ్యమైన లేఖ్య ప్రమాణం. తొలి శాసనాలకు కనీసం రెండు మూడు మాసాల అనంతరం ఈ శాసనాన్ని వేయించినట్లు కనిపిస్తుంది. సింహావలోకన ధోరణిలో ఈ శాసనం ఉంది. యుద్ధ విజయానికి లేదా హింసాయుత విజయానికి బదులు ధర్మ విజయం అనే కొత్త భావాన్ని వ్యక్తీకరిస్తున్నది. ఇది అశోకునకు తరువాత వచ్చిన ఆలోచన అయి ఉండవచ్చు. కానిచో మొదటి శాసనాలలో సయితం చెప్పి ఉండేవాడే. తన పాలనా కాలం పూర్వ భాగాన్ని సమీక్షిస్తూ కళింగయుద్ధం వల్ల కలిగిన విషాదానికి పరిత్రాసం చెందినట్లు కనిపిస్తుంది. యుద్ధం ముగిసిన వెంటనే పెద్దగా లేకపోయినా సంవత్సరాలు గడిచినకొద్దీ అతనిలో సంతాపం పెరిగింది. మొదటి శాసనాలలో ఉదాహరణకు గౌణ శిలా శాసనంలో తన సంతాపాన్ని గురించి ప్రస్తావించకపోవడం విచిత్రం. తరువాత పశ్చాత్తాపంతో ధమ్మాన్ని అనుసరించడంలో అనురక్తుడయినాడు. యుద్ధం వల్ల జరిగే మరణాలు, దేశాంతర గమనాలు శోచనీయములని భావించినాడు. యుద్ధం వల్ల పూజ్యులైన బ్రాహ్మణ శ్రమణ వర్గాలకు సయితం దురదృష్టం తప్పకపోవడం మరింత బాధాకరం. సాధారణ సాంఘిక వర్తనా సూత్రాలు యుద్ధంలో తల్లక్రిందులవుతాయి.

ధర్మాన్ని ఉద్దేశించిన సందర్భాలలో అశోకుడు బ్రాహ్మణ శ్రమణ పదాలను వాడడం ఆసక్తి దాయకం. గ్రీకులను మినహాయించి ఈ రెండు వర్గాలు లేని ప్రజలు లేరని తన శాసనంలో చెబుతాడు. అతడుద్దేశించిన రాజ్యాలు జంబూద్వీపానికి పొరుగు రాజ్యాలయినందున ఆ రాజ్యాలకు భారతీయ మతాలతో పరిచయం ఉంటుంది. భారతీయ మతాలవంటివే ఆ రాజ్యాలలో కూడ ఉంటాయి. అందుచే అశోకుని మాటలలోని ఆంతర్యం వ్యక్తమవుతుంది. గ్రీకులవి పూర్తిగా భిన్నమైన మతాలని వారి మత సంస్థలు భిన్నములని

తెలిసినందువల్లనే వారిని మినహాయించినాడు. బ్రాహ్మణులు శ్రమణులు భారతీయ సమాజంలో అత్యంత ప్రాముఖ్యం ఉన్న వర్గంగా గ్రీకులకు తెలుసు. వీరిని మెగస్తనీసు దార్శనికులుగా ప్రస్తావించినాడు. కాని బ్రాహ్మణులకు శ్రమణులకు మధ్యనున్న వ్యత్యాసం స్పష్టంగా లేదు. మెగస్తనీసు రచనలో ఒకచోట యోగులను బైలోబియాయ్ అని పేర్కొంటూ 'బౌత్త' సూత్రాలను అనుసరించే దార్శనికులని చెబుతున్నది. కాని బైలోబియాయ్ బుద్ధుని అనుయాయులా? లేదా ప్రత్యేక వర్గమా? అనే సందేహానికి ఆ రచన అవకాశమిస్తున్నది. వారొక ప్రత్యేక వర్గమనడమే సమంజసంగా కనిపిస్తున్నది. బైలోబియాయ్ అంటే బహుశా బ్రాహ్మణ పరివ్రాజకులై ఉంటారు. బుద్ధుని అనుయాయులు శ్రమణులు. రచయిత ఒకరికి ఒకరిని తారుమారు చేసి ఉంటాడు. ఈ రచనలనుబట్టి బ్రాహ్మణులు శ్రమణులు ఉభయులు పూజనీయులైన వర్గాలని తెలుస్తున్నది.

సమాజంలో మత నాయకులుగా పూజనీయులైనందున బ్రాహ్మణులు శ్రమణులు అశోకుని దృష్టిలో సమానులు. బౌద్ధమతంలో తమ విశ్వాసాన్ని స్పష్టంగా వ్యక్తంచేసే సందర్భాలు మినహాయించి తన శాసనాలలో బ్రాహ్మణ శ్రమణ వర్గాల మధ్య అశోకుడు భేదభావం వహించడు. సాధారణంగా ఈ రెండు పదాలు ద్వంద్వసమాసంగానే కనిపిస్తాయి. ఒక పదంకంటె మరొక పదాన్ని ముందు వాడడం కేవలం యాదృచ్ఛికం. ఇది ఆధారంగా అశోకుడు బౌద్ధం పట్ల పక్షపాత బుద్ధి వహించినాడని నిందించజాలము.

ధమ్మ సిద్ధాంతానికి సహజ పరిణామమే ధర్మ విజయ భావము; యుద్ధ విజయానికి విరుద్ధము. అందుచే ఇది దురాక్రమణను యుద్ధ విధానాన్ని పరిహరిస్తున్నది. విజయం అంటే అశోకుని దృష్టిలో వాస్తవంగా విదేశంపై దండెత్తి ఆక్రమించడం కాదు. ధర్మ విజయంలో విజయ పదానికి ధర్మసూత్రాలను ఆ రాజ్యం అనుసరించడమే అని అర్థం చెప్పవలె. సిరియా, ఈజిప్టు, సైరీన్, మేసిడోనియా, ఎపిరస్ రాజ్యాలను ధర్మంతో జయించినట్లు అశోకుడు చెప్పుకొన్నాడు. కాని వాస్తవానికి మిత్రభావంతో ఆ రాజ్యాలకు, మౌర్యసామ్రాజ్యానికి మధ్య రాయబారాలు నడిచి ఉండవచ్చు. ఆ రాజ్యాలకు మతప్రచారకులు వెళ్ళి ఉండవచ్చు. గ్రీకు రాజ్యాలకు రాయబారాన్ని పంపడాన్నే అశోకుడా విధంగా ప్రస్తావించి ఉండవచ్చు. ధర్మ విజయం అశోకునకు పూర్తి తృప్తి నిచ్చింది. తన సంతతి వారు సాధారణ విజయాన్ని అనుసరించకూడదని అతని కోరిక. అయినప్పటికీ సాధారణ విజయ విధానాన్ని పూర్తిగా నిషేధించలేదు. యుద్ధం చేయడం తప్పనిసరి అయినప్పుడు దయతో వ్యవహరించాలని స్వల్ప శిక్షలు మాత్రమే విధించాలని అతడు కోరినాడు. కాబట్టి అశోకుడు చేసినదల్లా సంప్రదాయక అంతర్జాతీయ నీతిలో స్వల్పమైన మార్పులు చేయడమేనని తెలుస్తున్నది.

తొమ్మిదో పాలనా సంవత్సరంలో అశోకుడు కళింగాన్ని జయించినాడు. అనంతరం దురాక్రమణ యుద్ధాలను మానినాడు. ప్రత్యేక ప్రయోజనానికై సాధనంగా యుద్ధాన్ని త్యజించినానని అశోకుడు చెప్పుకొన్నప్పటికీ అందుకు కారణం కేవలం కళింగ యుద్ధం కాదు. కళింగను ఆక్రమించడంతో అతని సామ్రాజ్యం సుస్థిరమైంది. అంతేకాక సామ్రాజ్యంలో అతణ్ణి ధిక్కరించగల మరొక శక్తి లేదు. సరిహద్దులలోని ప్రజలు బలహీనులు. అతనితో యుద్ధం చేయగలవారు కారు. ఇక ఆసియామైనరులోని గ్రీకు రాజ్యాలపై దండెత్తే అవకాశం ఉంది. కాని అవి చాల దూరంలో ఉన్న రాజ్యాలు. వాటిని జయించడం వల్ల మౌర్య సామ్రాజ్యానికి ప్రత్యేకించి కలిగే లాభం లేదు.

దక్షిణాపథంలో మౌర్య దండయాత్రను కొనసాగించి ద్వీపకల్ప భాగం యావత్తూ సామ్రాజ్యంలో అశోకుడేల చేర్చలేదనే ప్రశ్న రావచ్చు. అట్టి యుద్ధం అతని దృష్టిలో అనవసరం. అతని సిద్ధాంతానికి విరుద్ధం. శాసనాలను బట్టి ఆలోచిస్తే దాక్షిణాత్య రాజ్యాలు మౌర్య సామ్రాజ్యంతో మైత్రి వహించి ఉన్నాయి. ఈ రాజ్యాలు ధమ్మ మహామాత్తులను అంగీకరించి ధర్మ విధానాన్ని కనీసం గౌరవించినట్లు కనిపించినా వారిపట్ల అశోకుడు వైరం వహించడు. పైన చెప్పినట్లు దక్షిణా పథంపై మౌర్య దండయాత్ర జరిగిన నాటినుండి దాక్షిణాత్యులు మౌర్యాధికారం పట్ల భయ గౌరవాలతో ఉన్నట్లు తమిళ వాఙ్మయం నుండి తెలుస్తున్నది. సింహళదేశం కూడ ముఖ్యంగా తిస్స సింహాసనం ఎక్కినప్పటి నుండి అశోకుని పట్ల అభిమానం వహించింది. హిందూ సిద్ధాంత కారులు యుద్ధాన్ని శ్లాఘించినారు. బలాన్ని, శక్తిని ప్రదర్శించడానికి యుద్ధాలు మంచి అవకాశాలని వ్యాఖ్యానించవచ్చు. సాధారణంగా ఒక రాజు ఘనత ఆతని సైనిక బలంపై ఆధారపడి ఉంటుంది. ఇది అశోకుని స్వభావము అంగీకరించలేని విషయం. సత్యాగ్రహంలో అశోకునకు విశ్వాసం లేదు. కాని పూర్తిగా అవసరమైనప్పుడు మాత్రమే తీసుకొనవలసిన అంతిమచర్య యుద్ధమని ఆతని అభిప్రాయము. అతని స్థానంలో సముద్రగుప్తుడే ఉన్నట్లయితే కన్యాకుమారి వరకు నడవడమే గాక నౌకాదళంతో సింహళంపై దండెత్తేవాడు. కాని అశోకుడు మాత్రం మైసూరు దగ్గరే ఆగి, తన్ను రెచ్చగొట్టేవరకు, మైత్రి వహించి ఉన్న దాక్షిణాత్య రాజ్యాల జోలికి పోరాదని నిర్ణయించినాడు. రెండు కారణాల వల్ల అశోకుడు కళింగ రాజ్యాన్ని జయింపవలసి వచ్చింది. ఒకటి సామ్రాజ్యంలో కళింగ కీలక స్థానంలో ఉంది. రెండు మౌర్య సామ్రాజ్య ఆర్థిక విధానానికి కళింగ రాజ్య ఆక్రమణ అవసరమైంది. పైన చెప్పినట్లు గంగానదీలోయ నుండి దక్షిణ దేశానికి ఉన్న మార్గాలు కళింగగుండా వెళ్లేవి. అంతేకాక కళింగ బలవత్తరమైన సముద్ర తీరస్థ రాజ్యం. సామ్రాజ్యంలో చేరిస్తే కళింగ మంచి ఆదాయ మార్గమవుతుంది.

కళింగను ఆక్రమించిన అనంతరం అశోకుని దృష్టిలో రాజ్యాక్రమణలు పరిసమాప్తమయినాయి. ఏ రాజ్యమైనా రెచ్చగొట్టితే తప్ప యుద్ధం చేయనక్కరలేదు. సామ్రాజ్యానికి శత్రు భయం లేదు. పాలన విధానం కేంద్రీకృతమై స్థిరపడుతున్నది. అందుచే అశోకుడు ఆత్మవిశ్వాసంతో ధర్మ విజయంతో పూర్తి సంతృప్తి వహించినాడు.

ముఖ్య శిలా శాసనాలలో చివరిది పదునాల్గోది. పరిమాణంలో చాల చిన్నది. ఇందులో రచయిత తాను ఈ శాసనాల పూర్తి పాఠాలను గాని, సంక్షిప్త పాఠాలను గాని, దేశమంతటా వ్రాయించినట్లు వివరించుకొన్నాడు. దీనివల్ల ప్రస్తుతం లభ్యమౌతున్న శాసనాలు మాత్రమేకాదనీ, అవి ఇంకా అధిక సంఖ్యలో ఉండాలనీ, శిలా శాసనాల్కై ఇంకా పరిశోధన జరగాలనీ, రాలపైనే గాక ఇతర సాధనాలపై కూడ ప్రకటించి ఉండవచ్చునని తోస్తుంది. ధమ్మంలో అశోకునకున్న శ్రద్ధ అపారం. అందుచే సామ్రాజ్యం నలుమూలలకు ధమ్మం విస్తరించాలనే కోర్కెతో ఈ శాసనాల నాతడు దేశ వ్యాప్తం చేయడంలో అధిక శ్రద్ధ వహించి ఉంటాడు. అనుకూలమైన శిలలు లభ్యంకాని చోట్ల దారు ఫలకాలపై కాని, వస్త్రాలపై కాని వ్రాయించి ఉంటాడు. సాధ్యమైనంత అధిక ప్రచారం సాధించడానికై ప్రతి నగరంలోను ముఖ్య ప్రదేశాలలో వాటిని వేయించి ఉండవచ్చు. బహిరంగ సభల వంటి సందర్భాలలో ధర్మ సూత్రాలను చదివినట్లుకూడ కనిపిస్తుంది.

ధౌళి, జౌగడలలో 11, 12, 13 శాసనాలకు బదులు ప్రత్యేక శాసనాలను చేర్చడం వల్ల ప్రాంతాన్ని బట్టి శాసనాలలో మార్పులున్నట్లు స్పష్టమౌతుంది. కళింగ ప్రాంతంలో 13వ శాసనం వేయకపోవడానికి కారణం విదితమే. కళింగ ప్రజలకు కళింగ యుద్ధం చాల సన్నిహితమైన అంశం. దానివల్ల కలిగిన బోధనలను వివరించే ఈ శాసనం చదవడం కళింగ ప్రజలకు ఆనందదాయకం కాదు. అందువల్ల వారు నేర్చుకొనే గుణపాఠం ఉండదు. అంతేకాక తాను పోరాడిన ప్రజలకే తన పశ్చాత్తాపాన్ని వెల్లడించడం రాజనీతి కూడ కాదు.

మొదటి ప్రత్యేక శిలాశాసనం తోసలి, సమాపలలోని మహామాత్తుల నుద్దేశించి ముఖ్యంగా ఆ ప్రాంతంలో సక్రమ న్యాయ నిర్వహణకు సూచనలు చేస్తూ వేయించింది. మహామాత్తులకు ముందు నగల వియొహాలక, నగల న్యాయాధీశ అనే విశేషణం ఉంది. ముఖ్యంగా ఈ ఉద్యోగులు ప్రజాభిమానాన్ని చూరగొనాలని అశోకుడు కాంక్షించినాడు. అతడు అన్న మాటలు :

సవ్వే మనుస్సే పజా మమ
మనుషులందరు నాప్రజలు (బిడ్డలు)

తన బిడ్డల యోగక్షేమాలను కోరినట్లే తన ప్రజలందరి యోగక్షేమాలను అశోకుడు కోరినాడు. ఈ ప్రకటన మొదటి భాగంలోని ప్రజా అనే పదానికి భిన్నమైన అర్థాలను చెప్పవచ్చు. బిడ్డలు అనికాని, పాలితులు అని కాని అర్థం వస్తుంది. ఏ అర్థమైనా ఇక్కడ వర్తిస్తుంది. రెండో అర్థంలో వారి వారి అధికార ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరు తన పాలితులు కావున అధికారులు ప్రజల ప్రేమను చూరగొనాలని చెప్పవచ్చు. కాని ఈ ప్రకటన రెండో భాగాన్ని బట్టి 'ప్రజా' అనే మాటను బిడ్డలు అనే అర్థంలోనే వాడినట్లు కనిపిస్తుంది.

అనేక కారణాలవల్ల న్యాయ నిర్వహణలో లోపాలున్నట్లు అశోకుడు గ్రహించినాడు. కొన్ని లోపాలు న్యాయాధికారుల వ్యక్తిత్వానికి సంబంధించినవి. న్యాయవిధానం సమర్థంగా పనిచేయడంపై, తీర్పులలో నిష్పక్షపాత బుద్ధిపై అశోకుడు నొక్కు పెట్టినాడు. రాజుకు అధికారులు ఋణపడి ఉన్నారు. వారి సామర్థ్యం మహారాజు తృప్తిని, సంతోషాన్ని పొందడమేగాక స్వర్గం పొందడానికి తగినంత పుణ్యం సంపాదించగలదని ప్రకటించినాడు. రాజు సంతోషంకంటే ఉన్నతమైన స్వర్గసాధనే మంచి ప్రతిఫలంగా ఇందులో సూచితమైంది.

తిష్యదినాలలో ప్రతిరోజూ సంవత్సరం మధ్య మధ్య తరచుగా ముఖ్య సందర్భాలలోను శాసన పఠనం జరగాలని గట్టిగా చెప్పినాడు. ప్రత్యేక శాసనాలలోను, నగరాలలో జరిగే సాధారణ సంఘటనలలో భాగంగాను శాసనాలు చదివేవారన్న ఈ సూచనను ఈ సమాచారం బలపరుస్తున్నది. ఇలా చదవడంలో రెండు ప్రయోజనాలున్నవనడంలో సందేహం లేదు. మొదటి ప్రయోజనం ధమ్మాన్ని గురించి రాజు వాంఛితాన్ని ప్రజలకు తెలియ చెప్పడం. రెండో ప్రయోజనం ప్రజలకు, అధికారులకు మధ్య అతడు వాంఛించిన సంబంధాన్ని స్పష్టం చేయడం. ఉద్యోగులపై అదుపుగా అయిదు సంవత్సరాలకు ఒక మారుపర్యవేక్షణాధికారిని పంపేవారు. ఈతడు న్యాయ నిర్వహణను తనిఖీ చేస్తూ, రాజు సూచనలు సక్రమంగా అమలు జరిపేటట్లు చూచేవాడు. ఏ ఒక్క వ్యక్తి అయినా ఈ శాసనాన్ని తనకు చదివి వినిపించుమని కోరవచ్చునని రెండో ప్రత్యేక శాసనంలో ప్రకటించినాడు.

తోసలి, సమాపలలో సరిహద్దు ప్రాంత ప్రజలలో పనిచేస్తూ ఉన్న ఉద్యోగుల నుద్దేశించి రెండో ప్రత్యేక శిలా శాసనం వేయడం జరిగింది. ఈ ప్రజలు తూర్పు భారతంలోని స్వల్ప నాగరిక జాతులవారై ఉంటారు. కళింగ యుద్ధానంతరం వీరిని సామ్రాజ్యంలో లీనం చేసినారు. లేదా ఆ యుద్ధానంతరం వీరికి సామ్రాజ్యంతో సన్నిహిత సంబంధం ఏర్పడి ఉంటుంది. తిరిగి ఈ శాసనంలో కూడ ప్రజలంతా తన బిడ్డలని అశోకుడుద్ఘాటించి నాడు. ప్రజలలో సరిహద్దు ప్రజలను కూడ చేర్చినాడు. ఈ ప్రజలలో ప్రభుత్వం పట్ల

విశ్వాసం కలిగించడమే ఉద్యోగుల ధర్మం. రాజుకు తమయందు పైతృక వాత్సల్యం ఉందని తమ యందాతడు శ్రద్ధ వహిస్తున్నాడని ఆ ప్రజలు భావించవలె. ప్రాచీన భారత రాజకీయ ఆలోచనా పద్ధతిలో రాజు ప్రజలను బిడ్డలవలె చూడాలని అప్పుడే రాజ్యం అభ్యున్నతి పొందగలదని చెప్పే వాక్యాలు అర్థశాస్త్రంలో ఉన్నాయి. ఇంచుమించు ఈ భావాలనే అశోకుడు పునరుద్ఘాటించినాడు. ఇక ఈ శాసన సందర్భంలో సరిహద్దు ప్రజలలో విశ్వాసం కలిగించడమే ముఖ్యం. వీరిపట్ల అశోకుడు ఇతర ప్రజల కంటె భిన్నమైన విధానం అనుసరించినట్లు స్పష్టమౌతుంది. దీనిని బట్టి అశోకుని సామ్రాజ్యంలోని జాతుల మధ్య ఉన్న అపార వైవిధ్యమేగాక ప్రతి వర్గానికి చేయవలసిన విజ్ఞాపన స్వభావాన్ని అశోకుడు స్పష్టంగా అర్థం చేసుకొన్నట్లు విదితమౌతుంది. తూర్పుసరిహద్దు ప్రజల విషయంలో ముఖ్యమైనది వారి విశ్వాసాన్ని చూరగొనడం అయినప్పుడు బహుశా వారు ధర్మానికి ఎక్కువ సుముఖులవుతారు.

స్తంభ శాసనాలు వేరొక వర్గానికి చెందినవి. ముఖ్య శిలా శాసనాలకు వీనికి మధ్య పండ్రెండు సంవత్సరాల విరామం ఉంది. ఈ విరామ కాలంలో గౌణస్తంభ శాసనాలను వేయించినాడు. ఇవి ప్రత్యేక స్థలాలనుగాని, సంస్థలనుగాని ఉద్దేశించి వేసినవి. ఈ కాలంలో ముఖ్య శాసనాలను వేయించినాడా అనేది సందేహాస్పదం. అందుచేత ఉపలభ్యమైన శాసనాలను బట్టి వివిధాంశాలు నిర్ణయించవలె. ఈ విరామ సమయం ధర్మసూత్రాలను ప్రజలు పూర్తిగా  అవగాహన చేసుకొనడానికి చక్కగా ఉపకరించింది. ముఖ్య శిలాశాసనాలవల్ల తెలుస్తున్నట్లు ధర్మ విధానంపై అతని ఆలోచన కూడా మారి పరిణతి చెందింది.

గౌణస్తంభ శాసనాలు రెండోరకానికి చెందినవి. పూర్తిగా బౌద్ధమత చర్యలకు సంబంధించినవి. సంఘంతో అశోకునకున్న సంబంధాన్నిగాని, తీర్థయాత్రలలో అతడు సందర్శించిన ప్రదేశాలనుగాని సూచిస్తున్నాయి. ఈ గౌణ స్తంభ శాసనాలు వ్రాయించిన అనంతరమే స్తంభాలపై బహిరంగ శాసనాలు వ్రాయించవలెనని ఆలోచన కలిగి ఉంటుంది. ఈ ఆలోచనే హృదయంగమమైన ఫలితానికి దారితీసింది. నాటి నుండి శిలాతలాలకోసం వెదకడం మాని అందంగా మెరుగుపెట్టిన స్తంభాలను నిలిపి, వాటిపై శాసనాలు వ్రాయించడానికి అశోకుడు నిర్ణయించి ఉంటాడు. కాని ఈ కాలంలో కూడా రెండు గౌణ శిలాశాసనాలను ఇచ్చినాడు. వీటిలో ఒకటి దక్షిణ భారతంలో పెక్కుచోట్ల కనిపిస్తుంది. ఈ శాసనాన్ని స్తంభశాసనాలకు ముందే ఇచ్చినాడనడం యథార్థం. రెండోది కాందహార్ శాసనం. శాసనస్థమైన అంశాలను బట్టి కాందహార్ శాసనం దాక్షిణాత్య శాసనానికి కొంచెం తరువాతిది.

దక్షిణదేశంలో ఎక్కువగా వ్రాయించిన గౌణ శిలాశాసనాన్ని ఇంచుమించు ముఖ్య శిలాశాసనాల సమయంలోనే జారీ చేసినాడు. ఈ అధ్యాయంలోనే పైన అశోకునకు బౌద్ధమతంతో ఉన్న సంబంధాన్ని పరిశీలించే సందర్భంలో ఆవిషయం ప్రస్తావించడం జరిగింది. మొదట్లో అశోకునిది ఉపాసకుని స్థితి. క్రమంగా సంఘంతో సన్నిహితుడయినాడు. ఆతని విశ్వాసం కూడ బలపడి తత్ఫలితంగానే దేశంలో ధర్మవ్యాప్తి జరిగింది. అత్యాసక్తులు కావలిసిందని అందువల్ల అభివృద్ధి సాధ్యమని ప్రజలకు విజ్ఞప్తిచేస్తాడు కాని ధమ్మము, బౌద్ధ మత బోధనలు ఒక్కటే అని ఎక్కడా చెప్పడు. బ్రాహ్మణులు మొదలు మావటీలవరకు సాంఘిక తరగతులన్నింటిలో ధర్మవ్యాప్తి జరగడమే తన ఆకాంక్ష అని, అందుకు ఉద్యోగులు బాధ్యులని ఎర్రగుడి గౌణ శిలాశాసనంలో స్పష్టం చేసినాడు. సిద్ధాంతాలను గురించి మాటాడే సందర్భంలో కుటుంబానికి గల ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పడమేకాక అందులో సంప్రదాయాన్ని, ఆచారాన్ని ప్రస్తావిస్తాడు. ఇతర శాసనాలలో మరెక్కడా కుటుంబ వ్యవస్థను గూర్చి ఇంత నిర్దుష్టంగా లేదు.

గౌణశిలాశాసన ప్రతులు ప్రధానంగా అశోకుని వ్యక్తిగత విషయాలు అంటే బౌద్ధంలో అతని విశ్వాసాన్ని గురించి ప్రస్తావించేవి గావున దాక్షిణాత్య ప్రజలపట్ల అభిమానానికి చిహ్నంగా వేయించి ఉంటాడు అని చెప్పవచ్చు. మరొకచోట కూడ గౌణశిలాశాసనం కనిపిస్తుంది కాని దక్షిణాదిని ఉన్నన్ని ప్రతులులేవు. దక్షిణాది ప్రజలు దూరంగా ఉన్నారు. వారికి తనతో పెద్దగా పరిచయం లేదు. అందుచేత తన వ్యక్తిగత విశ్వాసాన్ని వారికి స్పష్టంగా ప్రకటించి అనంతరం ధమ్మాన్ని వివరించడంవల్ల తన పరిస్థితిని వారు అర్థంచేసుకోగలరని అశోకుడు భావించి ఉండవచ్చు. అందుచేతనే ధమ్మ అభ్యసనానికి ఆచరణ యోగ్యమైన మార్గాలు సూచిస్తూ గౌణ శిలాశాసనం ఉత్తరార్థంలోనే ధమ్మ భావం కనిపిస్తుంది. ముఖ్య శిలా శాసనాలతో పోల్చి చూస్తే గౌణశిలాశాసనంలో తాను ఉద్దేశించినంత పూర్తిగా శ్రోతలు, పాఠకులు అర్థంచేసుకోలేరేమో అనే అశాంతి రచయితలో కనిపిస్తుంది. దక్షిణాది దేశానికి విస్తరించిన ఔత్తరాహ చక్రవర్తులు చాలకొద్దిమంది. వారిలో ఆ భావం ఉండడం సహజమే. అశోకునకు దక్షిణదేశం, అచటి ప్రజలు పూర్తిగా అపరిచితులు. దాక్షిణాత్యులకు బ్రాహ్మీలిపితో అదే ప్రథమ పరిచయం. అయినప్పుడు ఆ ప్రజలకు, తన్ను స్పష్టంగా వివరించు కోవడంలో అశోకునిలో కన్పించే అ వ్యాకులపాటు క్షమింప దగిందే.

పన్నెండు సంవత్సరాల వ్యవధిలో బౌద్ధ ప్రపంచంలో అనేక సంఘటనలు చురుకుగా జరిగినాయి. క్రీ. పూ. 250లో బౌద్ధ సంఘం సమావేశమై ఉపఖండం వివిధ ప్రాంతాలకు మత ప్రచారకులను పంపడం జరిగింది. బౌద్ధుడుగా అశోకుడీ సంఘటనలలో ఆసక్తి

వహించి ఉండవలె. అయితే అశోకునిలో శాఖాదురభిమానం కనిపించదు. సంఘం భిన్న మతస్థులను బహిష్కరించి ఇతర మతాలను ఖండిస్తూ ఉన్న ఈ కాలంలోనే తన ఇరవయ్యో పాలనా సంవత్సరంలో బరాబర్ కొండలలో మరొక గుహను ఆజీవికులకు దానం చేయడమే అందుకు నిదర్శనము. దీనివల్ల బౌద్ధుడయినప్పటికీ బౌద్ధ మతానికి వ్యతిరేకులయిన మతశాఖల శ్రేయస్సును సయితం అశోకుడు నిర్లక్ష్యం చేయలేదని స్పష్టమౌతున్నది. బౌద్ధ సంగీతికి దారితీసిన సంఘటనలను వివరించే గాథలు అజీవికుల పట్ల అనుకూలంగా భాషించవు. రాజుగా పక్షపాతం లేకుండ అన్ని మతాలను సంభావించడమే తన బాధ్యతగా గుర్తించడమే అశోకుని ఘనత. ముఖ్య స్తంభ శాసనాలలో అశోకుడిచ్చిన అభయానికి నాందివాక్యం కాందహార్ శాసనంలోనే ఉంది. అది పశ్చిమ సరిహద్దులోని గ్రీకు అరమిక్ భాషలు మాటాడే ప్రజలకు ధర్మ ప్రయోజనాలను నచ్చచెప్పడానికి చేసిన ప్రచారం. ధమ్మాన్ని గురించిన రచనగా ఇతర శాసనాలలోని అంశాలకంటే ఇందులో ఎక్కువలేవు. ధమ్మవర్ణన కూడ అస్పష్టంగానే ఉంది. జంతువధ నిషేధం మీద నొక్కు కన్పిస్తుంది. ప్రజలను ధర్మ పరులుగా చేయగలగడమేగాక ప్రపంచంలో అన్ని రంగాలలోను చక్రవర్తి అభివృద్ధి సాధించినాడని ఈ శాసనం చాటుతోంది. కేవలం స్థానిక ప్రజలలోనే గాక కాందహార్ మార్గాన పయనించే విదేశ వర్తకులలో సయితం ధర్మాసక్తిని కలిగించడమే ఈ శాసనం ఉద్దేశం. ఆ వర్తకులు తమతమ దేశ ప్రజలలో సయితం ధర్మపట్ల ఆసక్తి కలిగించగలరని అశోకు డాశించినాడు.

ఇదే విధమైన గట్టి ఆత్మ విశ్వాసంతో తన ఇరవయ్యేడో పాలనా సంవత్సరంలో అశోకుడు ఆరు స్తంభ శాసనాలను జారీ చేసినాడు. ఈ కొత్త శాసన సముదాయం కూడ ప్రజలను ఉద్దేశించినదే. కాబట్టి తత్త్వంలో ముఖ్య శిలాశాసనాలను పోలింది. బహుశా ప్రచారాన్ని ఆశించి ప్రజలు అధిక సంఖ్యలో సమావేశమయ్యే స్థలాలలో స్తంభాలపై ఈ శాసనాలను వ్రాయించినాడు. దీనిలో ధమ్మ వివరణ తిరిగి ప్రారంభమైంది.

మొదటి స్తంభ శాసనంలో ధర్మ వికాసాన్ని సింహావలోకనం చేస్తూ సంవత్సరాలు గడిచిన కొద్దీ ధమ్మం వికసించినదని సంతృప్తిని వెల్లడించినాడు. వేరువేరు స్థాయిలలో తన ప్రతినిధులు ధర్మంపట్ల సందేహాత్ములైన వారిలో చలనం కలిగించ గలిగినారని చెప్పినారు. ఈ వాక్యం ధమ్మ మహామాత్తుల కార్యకలాపాల నుద్దేశించినదని గ్రహించవచ్చు. ధమ్మాన్ని గురించి సంశయించే వారికి శాసనమూలంలో 'చపలం' అనే మాట ఉంది. ఈ సందర్భంలో శాసన వాక్యాలలోని ధ్వని చాల ఆసక్తికరమైంది. సాధ్యమైనంతవరకు దేశకాలాల ననుసరించి ధర్మ ప్రచారమే తన ఏకైక విధిగా ఉద్యోగులు భావించినారనేదే ఇందు ఆసక్తికరమైన అంశం. ప్రతివ్యక్తి ధర్మాన్ని ఆచరించవలెననేదే అతని తపన.

సమాజంలోని అరిష్టాలన్నింటికీ కొత్త పరిష్కారమార్గంగా ధర్మ గుణాలను వర్ణించే అశోకుని స్వరంలో అధికార దర్పం గోచరిస్తుంది. ధర్మపదాన్ని పదే పదే వాడడం ఒక కొత్తభావాన్ని ప్రచారం చేసే వ్యక్తిలోని అత్యాసక్తిని మాత్రమే వ్యక్తంచేయదు. ధర్మం అతని అస్తిత్వంలో భాగమైనట్లు గోచరిస్తుంది.

సామాన్య సద్గుణాలు, ఉన్నత మనస్తత్వంగల సామాజిక నీతి పుణ్యానికి సాధనాలని పూర్వకాలంలో భావించేవారు. ప్రస్తుతం సామాజిక నీతి ధమ్మం పైనే ఆధారపడింది. ధమ్మం అంటే ఇక్కడ శ్రద్ధాసక్తులు, భయభక్తులు, విధేయత, శక్తియుక్తులు, నిర్మలమైన ఆలోచనతో సాంఘిక వర్తనా ప్రాముఖ్యాన్ని మానవుడు గుర్తిస్తాడు. కాని తాను అర్థం చేసుకొనడంతోనే సమస్య పరిష్కారమయిందనే భ్రాంతి సక్రమ ఆలోచనకు ప్రతిబంధక మౌతోంది. తన ప్రబోధం ద్వారానే ధమ్మ వికాసం జరిగిందని అశోకుడు చెబుతున్నాడు. సంశయాత్ములను ప్రోత్సహించే సందర్భంలో ధర్మ మహామాత్తుల చర్యలు ప్రశస్తంగా కనిపించవు. తొలి ప్రకటనలలో కనిపించే స్వీయ బాధ్యతా భావం క్రమంగా ఆజ్ఞాపనలుగా మారి వ్యక్తి అభీష్టానికి అవకాశం తగ్గింది. వ్యక్తి ఇష్టానిష్టాలతో ప్రమేయం లేకుండ ధమ్మమహామాత్తులు అమలుజరిపే నిర్దిష్టమైన ఆజ్ఞాపనల రూపాన్ని ధమ్మం వహించినట్లు కనిపిస్తుంది. సర్వసమస్యలకు ధమ్మం ఐంద్రజాలిక పరిష్కారమయింది. ధర్మ ప్రచారకులు ఒక మత వ్యవస్థగా రూపొందసాగినారు. ఈ శాసనంలోని చివరి వాక్యం :

ఏనాహి విధియా ఇయం ధమ్మేన పాలనా
ధమ్మేన విధానే ధమ్మేన సుఖియానా ధమ్మేన గొత్తితి.

ఇది నా సిద్ధాంతం. ధమ్మం ద్వారా రక్షణ.
ధమ్మంద్వారా వ్యవహార పాలన. ధమ్మంతో
ప్రజలను సంతోషింప చేయడం. ధమ్మంతో
సామ్రాజ్యాన్ని రక్షించడం.

ఈ శాసనంలో ధర్మోన్మాదానికి, అహంభావానికి అంకురార్పణ కనిపిస్తుంది.

రెండో స్తంభశాసనం ఇదే ధోరణిలో సాగింది. పాప లేశము, గుణ సమూహము, దయ, దాక్షిణ్యము, సత్యం, శౌచం అంటూ ధర్మాన్ని వర్ణించినాడు. అనేక విధాల తాను చక్షుదానం చేసినట్లు చెప్పుకొన్నాడు. ధర్మ ఆచరణ ద్వారా వ్యక్తి సంబంధాలు, సాంఘిక సంబంధాలు సుస్పష్టమై సాంఘిక జీవితాన్ని సత్కర్మలవల్ల లభించే పుణ్యాన్ని అవగాహన చేసుకోవడానికి వీలు కలిగించడమే 'చక్షుదానం' భావము. అశోకుడే జ్ఞానాన్ని ప్రసాదించినట్లు చెప్పడానికి లేదా తానే మార్గదర్శకుడనైనానని చెప్పడానికి మరొక పద్ధతే

చక్షుదానం. అదే శాసనంలో మరోచోట మానవులకు, జంతువులకు అనేక వరాలు ప్రసాదించినట్లు సత్కర్మలు చేసినట్లు చెప్పుకొన్నారు. ఇదంతా అశోకునిలో పెరుగుతున్న ఆత్మోత్కర్షకు నిదర్శనం. దీనివల్ల అప్పుడప్పుడూ స్వాతిశయంతో సంతుష్టిపొంది ప్రజాభిప్రాయంతో పూర్వమేర్పడిన పరిచయానికి ప్రతిబంధక మేర్పడిందనడంలో సందేహం లేదు. ఈ దశలో కూడ ధమ్మ అభిమానం ఎంత పెరిగినా ధమ్మాన్ని నైతిక సూత్రంగానే పరిగణించినాడే కాని మత సిద్ధాంతంగా భావించలేదు. ధర్మ ప్రచారానికి ఆతడవలంబించిన విధానాలు మత సంస్థల విధానాలతో పోటీపడి ఉండవచ్చు. కాని అతని బోధలను మాత్రం మత స్వరూపాన్ని దాల్చలేదు.

మూడో స్తంభ శాసనం పుణ్య పాప కర్మలను వేరుచేసి చెప్పడానికి ప్రయత్నించింది. రౌద్రం, క్రౌర్యం, క్రోధం, గర్వం, అసూయ, పాప వికారాలుగా పరిగణించినాడు. ఇవి విధ్వంసకరాలు. దురాశను కూడ అప్పుడప్పుడు పాపవికారమని పరోక్షంగా చెప్పిన సందర్భాలున్నాయి. కాని వీటిలో అశోకుడు కామాన్ని చేర్చకపోవడం, ఉత్కంఠతో వాంఛలను తీర్చుకోవడం ధర్మసూత్రాల ననుసరించి పాపంగా చెప్పకపోవడం ఆశ్చర్యకరం. ధమ్మ ఆచరణను ఎక్కడా వివరంగా చెప్పలేదు. శాసనాలలో అశోకుని వాక్యాలు సర్వసామాన్యంగానే ఉన్నాయి. కాని సాంఘిక ప్రవర్తనను వివరించడంలో స్త్రీ పురుష సంబంధాల ప్రసక్తి లేకపోవడం మాత్రం విశేషం. అశోకుని కాలానికి సమాజంలో స్త్రీ పాత్ర పూర్తిగా క్రమబద్ధమైనందున దాన్ని గురించిన ప్రస్తావన అనవసరంగా భావించి ఉంటాడు. శాసనం ఈ క్రింది వాక్యంతో పూర్తవుతోంది.

> ఇయం మే హిదత్తి కాయే ఇయం మనమే
> పాలత్తికాయే
> ఇహలోకంలో నా సుఖానికి ఇది చాల
> ముఖ్యం. అది పరలోకానికి.

దీనితో నీతిశాస్త్రంలో మౌలికమైన తారతమ్య నీతి సూత్ర సమస్య తలెత్తుతుంది. దురదృష్టవశాత్తు చివర వాక్యానికి వివరణ ఇవ్వకుండా శాసనం పరిసమాప్త మవుతుంది. యధాతథంగా ఆ వాక్యంవల్ల పుణ్యకార్యాలకు ద్విగుణ ప్రమాణాలను గురించి ఆలోచించడానికి ప్రారంభించినట్లు కనిపిస్తుంది. ఒకటి ఐహిక సుఖం. రెండు పరలోకానందం. ఈ భావన పుణ్యము ఇహపరలోకాలకు మంచిదని చెప్పిన అశోకుని మొదటి నైతిక విలువ నుండి తీవ్రంగా మారినట్లు కనిపిస్తున్నది. అయినప్పటికీ పుణ్య పాపాలను గురించిన చర్చాశేషంగా భావించినపుడు ఈ వాక్యానికి మరొక వ్యాఖ్యానం

చెప్పుకోవచ్చు. సుఖమనేది ఇంద్రియ పరితుష్టి వల్ల లభించే క్షణిక సంతోషమని, ఇంద్రియ నిగ్రహం వల్ల లభించేది స్వర్గంలో శాశ్వతానందమని వ్యాఖ్యానించవచ్చు.

ధమ్మాన్ని గురించిన మొదటి భావాలలో మరొక మార్పు కూడా జరిగింది. అది పాపానికి పాప కర్మలకిచ్చిన ప్రాముఖ్యం. బౌద్ధ మతంతో సాంగత్యం పెరిగిన కొద్దీ అశోకునిలో పాపభీతి పెరిగింది. తరువాతి శాసనాలను బట్టి పుణ్య పాపాలను గురించిన కేవల పవిత్రభావనలో నిమగ్నుడయినట్లు మొదటి సాంఘిక నీతివైపుకు నడిపించిన ప్రాక్తనశక్తి క్రమంగా క్షీణించినట్లు కనిపిస్తుంది.

నాలుగో స్తంభ శాసనంలో ముఖ్య శిలా శాసనాల ధోరణికి మరలడం కనిపిస్తుంది. కొంతవరకీ శాసనానికి ధౌళి, జౌగడలలోని ప్రత్యేక శాసనాలకు సంబంధం ఉన్నది. ఆ శాసనాలలో ఉద్యోగులు బాధ్యతాయుతంగా సమర్థులై ఉండాలనే ఆదేశం ఉంది. నాలుగో స్తంభ శాసనకాలానికి ఉద్యోగులలో పై రెండు గుణాలను అశోకుడు గుర్తించినట్లు కనిపిస్తుంది. శిక్షలు విధించడానికి, పారితోషికాలివ్వడానికి, స్థానికోద్యోగులకే అధికారాలు ఇవ్వడం జరిగింది. పంచవర్ష అవేక్షణలలోను, ధమ్మ మహామాత్త వ్యవస్థలోను కేంద్రీకరణ ప్రవృత్తి కనిపిస్తుంది. కాని స్థానికోద్యోగులకు అధికారాలు అప్పగించడం అందుకు భిన్నమైన చర్య. నాలుగో అధ్యాయంలో దీన్ని పరిపాలనా సౌకర్యానికై చేసిన చర్యగా వివరించినాము. నిర్భయంగా ఆత్మ విశ్వాసంతో ఈ ఉద్యోగులు తమ విధులను నిర్వహించగలందులకై వారికి శిక్షించడానికి, పారితోషికాలివ్వడానికి వారికి అధికారాలివ్వడం జరిగింది. ఇది చాల ముందడుగు. ఈ చర్యకు తన ఉద్యోగులతో రాజుకు పూర్తి విశ్వాసం అవసరమైనచర్య. దీనివల్ల ఉద్యోగి బృందము రాజ్యపాలన సమర్థంగా ఉన్నట్లు స్పష్టమౌతున్నది. లేనిచో ఈ అధికారాలను రాజు ఉద్యోగుల పరం చేసేవాడు కాదు. కాని ఇక్కడ ఒక విషయాన్ని ఉపేక్షించరాదు. వృద్ధాప్యం వల్ల తొలి సంవత్సరాలలో వలె పరిపాలనలో శక్తిమంతంగా ఆసక్తి వహించజాలడు కాబట్టి వయసు పైబడిన కొలదీ ఏరాజైనా కొన్ని అధికారాలను ఇతరులకు అప్పగించక తప్పదు.

మరొక ముఖ్యమైన చర్య న్యాయ విధానము, శిక్షాస్మృతి సామాన్యంగా ఉండాలని నొక్కి చెప్పడం. ఇది కేవలం ఒక పవిత్ర ఆలోచనగా ఉండాలనే ఉద్దేశంకాదు. ఆచరణ సాధ్యం చెయ్యాలనే ఉద్దేశమే. కానిచో దాన్ని ప్రస్తావించవలసిన అవసరంలేదు. న్యాయదృష్టిలో పాలితులందరు సమానులనిగాని, దేశవ్యాప్తంగా న్యాయసమత్వం అనిగాని ఈ వాక్యానికి రెండు రకాల వ్యాఖ్యానం చెప్పవచ్చు. ఏవిధంగా చూచినప్పటికీ ఇది అపూర్వమైన చర్య. సాంఘిక న్యాయానికి అశోకుడివ్వవలసిన ప్రాముఖ్యాన్ని వ్యక్తం చేస్తుంది. తన ప్రజల శ్రేయోభివృద్ధికయి జరిపే కృషిలో భాగంగా మరణశిక్ష అమలుకు ముందు

మూడురోజుల వ్యవధి ఇవ్వవలెనని ఆజ్ఞాపించినాడు. ఇది కేవలం అనుగ్రహంతో కూడిన చర్య. ఈ విరామకాలంలో నిందితుని అమాయకత్వం ఋజువు కావచ్చు. లేదా నేరస్థుడు పశ్చాత్తాపం చెందవచ్చు. బౌద్ధమతంలో గాఢ విశ్వాసం ఉన్నప్పటికీ అశోకుడు మరణశిక్షను రద్దు చేయకపోవడం ఆశ్చర్యకరం. వ్యక్తిగత విశ్వాసాలు భిన్నంగా ఉన్నప్పటికీ రాజ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు మరణశిక్ష అవసరమని, నిర్ణీతములు బాధాకరములు అయిన శిక్షలపైన, సమ్మోదకరమైన ప్రతిఫలాలపైన దేశంలోని న్యాయ విధానం వ్యవస్థాపితమై ఉండాలని అశోకుడు భావించినాడనడంలో సందేహం లేదు.

ఇంచుమించు ఇదే భావాన్ని అయిదో స్తంభశాసనంలో అశోకుడు వ్యక్తంచేసినాడు. కొన్ని జంతువులను అసలు వధింపరాదని, ప్రత్యేకించి కొన్ని రోజులలో కొన్ని జంతువులను చంపరాదని ఆజ్ఞాపించినాడు. ఈ పట్టిక ఆశ్చర్యం కలిగించేదిగా ఉంది. వీటిలో కొన్ని ఎడ్లవంటి భారవాహ జంతువులు, మరికొన్ని చేపలవంటి ఆహార యోగ్యమయినవి ఉన్నాయి. కారణం లేకుండా వీటిని చంపరాదని విధించినాడేకాని బౌద్ధంలో గాఢవిశ్వాసం ఉన్న వ్యక్తివలె దేశమంతటా పూర్తి అహింసను శాసించకపోవడం చాల విచిత్రమైన అంశం. బహుశా జంతువధను పూర్తిగా మాన్పించడం సాధ్యంకాదని అట్టి శాసనం ఎన్నడూ అమలు జరగదనీ అశోకుడు గ్రహించి ఉండవచ్చు.

ఆరో స్తంభశాసనంలో తాను వేయించిన శాసనాల ప్రయోజనాన్ని అశోకుడు క్లుప్తంగా వివరించినాడు. ప్రజల సుఖ శ్రేయస్సులే ఆతని ప్రధానాశయం. ధర్మ సూత్రాలకనుగుణంగా జీవితాన్ని దిద్దుకొన్నచో ప్రజలు సుఖిస్తారని ఆతని ఆశ. ధమ్మాన్ని ప్రజల కందించడంలో అన్ని వర్గాలపట్ల, అన్ని శాఖలపట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించినట్లు ప్రజలను దర్శించడం వ్యక్తిగతంగా తన ధర్మమైనట్లు చెప్పుకొన్నాడు. దీన్నిబట్టి సాంఘిక సంక్షేమ పద్ధతి, అశోకుని మానవతా దృక్పథముల మిశ్రమమే ధమ్మం అని స్పష్టమౌతుంది. తనకు, తన ప్రజలకు మధ్య పరిచయం పెంచే సాధనంగా ధమ్మం ఉపకరించాలని అశోకుడు హృదయపూర్వకంగా వాంఛించినాడు. ఇతర కారణాలెన్ని ఉన్నా ఈ ఒక్క వాంఛా కారణంగా ధమ్మము, తత్ఫలితంగా పాలకుని హోదాలో అశోకుడు అన్ని మత శాఖలపట్ల, విశ్వాసాలపట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించడం తప్పనిసరి అయింది.

ఏడో స్తంభ శాసనాన్ని ఇరవై ఎనిమిదో పాలనా సంవత్సరంలో ఒకే ఒక స్తంభంపై వ్రాయించినాడు. అదే ఢిల్లీతో ప్రాస్తంభం. ఇతర స్తంభాలపై ఇది లేకపోవడానికి కారణం చెప్పడం కష్టం. చాల వరకీ శాసనం ధమ్మాన్ని గూర్చి తన కృషి సారమేగాని, ధమ్మ వివరణ విశేషంగా లేనందున దానివల్ల ప్రత్యేక ప్రయోజనం లేదని అశోకుడు తరువాత గ్రహించి ఆ విధంగా ఆజ్ఞాపించి ఉంటాడు. ఒక స్తంభంపై లిఖించిన అనంతరం

ఉపసంహరించి ఉండవచ్చు. ఒక ఢిల్లీ–తోప్రా స్తంభంపై మాత్రం అనుమతించి ఉండవచ్చు.

ప్రజల శ్రేయస్సు నుద్దేశించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరిగినాయి. బాట నిర్మాణం జరిగింది. బాటల పొడుగునా ఉభయ పార్శ్వాలలో నీడనిచ్చే వటవృక్షాలు, మామిడి తోపులు నాటినారు. ఎనిమిది కోసుల కొకటి చొప్పున బావులు తవ్వి, మనుషులకు, పశువులకు మంచినీటి సౌకర్యం కల్పించినారు. కాని అశోకుని పాలనకున్న ఏకైక కాంక్ష ధర్మ విస్తరణ. ధర్మాచరణతో పోలిస్తే ఈ కార్యక్రమాలకు విలువలేదు. శ్రేయోభివృద్ధి కార్యక్రమాలెన్ని జరిగినప్పటికీ అశోకునకు యధార్థమైన తృప్తినిచ్చేది ధర్మాచరణ విస్తరణయే. పూర్వకాలంలో కూడ ధర్మ విస్తరణను కోరినవారున్నారు. కాని అది జరుగలేదు. అందుచే ధర్మవ్యాప్తికి అశోకుడు ద్విముఖ విధానాన్ని అమలు జరిపినాడు. రెండోది ధర్మాచరణకు ప్రజలను ప్రోత్సహించడానికై ధర్మ ప్రచారమే విధిగా ఉన్న ఉద్యోగులను నియమించడం.

సమాజంలో ఏ ఒక్క వర్గానికి ధర్మమహామాత్తుల కృషి పరిమితం కాదు. అశోకుడే చెప్పినట్లు గృహస్థు మొదలు వానప్రస్థుని వరకు సమాజంలో ఆమూలాగ్రం ధర్మమహామాత్తుల చర్యలు విస్తరించినాయి. ఈ వాక్యం అర్థవంతమైంది. అశోకుని మనస్సు ఏ విధంగా పనిచేస్తున్నదీ తెలుపుతున్నది. బ్రాహ్మణులు మొదలు శూద్రులవరకంటూ సమాజాన్ని బ్రాహ్మణులు వర్గీకరించడంలో సాంఘిక ప్రతిష్ఠను కాక, సాంఘిక బాధ్యతను కొలమానంగా వాడినాడు. గృహస్థు కుటుంబానికి పెద్ద. కుటుంబం సమాజానికి మౌలికమైన ప్రమాణం. అందుచే గృహస్థు ఎక్కువ సాంఘిక బాధ్యతను వహిస్తాడు. యతి బుద్ధిపూర్వకంగా సమాజ పరిధులకు వెలుపల నివసిస్తున్నందున సాంఘిక బాధ్యత నాతడు వహించడు. అయినప్పటికీ ఈ భిన్నవర్గాలపట్ల నిష్పక్షపాతంగా ధర్మమహామాత్తులు వ్యవహరించవలె. ధర్మ మహామాత్తులలో కొందరిని ప్రత్యేక మతశాఖల నుద్దేశించి నియమించినారు. ఈ శాఖలలో సంఘ, బ్రాహ్మణ, ఆజీవిక, నిగ్రంధులను పేర్కొన్నారు.

రాజు, రాజు కుటుంబంలోని వేరువేరు సభ్యులుచేసిన దానధర్మాలను మాత్రమే ఉద్దేశించి మరొక ఉద్యోగి బృందాన్ని నియమించినారు. ధర్మాభివృద్ధియే దానధర్మాల ప్రయోజనం. ఈ రోజులలో కూడ కొన్ని రాజ కుటుంబాలలో ఒక్కొక్క సభ్యుడు ఒక సంస్థను కాని, మతశాఖనుగాని స్వీకరించి, దాని పోషణకై దానధర్మాలు చేసే ఆచారం ఉంది. బహుశా ఆ పద్ధతిమీదనే మౌర్య కుటుంబం దానాలు చేసి ఉంటుంది. ధర్మ మహామాత్తుడు సంస్థ పక్షాన దానం స్వీకరించడమేకాక ఆ సంస్థకు ధమ్మ ప్రయోజనాన్ని బోధించేవాడు. ఈ పద్ధతికి మహారాణి శాసనానికి సంబంధం కనిపిస్తున్నది. మహారాణివారు వాకీచేసిన దానాలను నమోదు చేయవలసిందిగా అశోకుడుద్యోగులను ఈ శాసనంలో ఆజ్ఞాపించినాడు.

ఇదే శాసనంలో శాసించడంద్వారా, అనునయించడంద్వారా అనే రెండు రకాల ధమ్మ ప్రచారం జరుగుతోందని అశోకుడు వివరించినాడు. అనునయమార్గం ద్వారా శాసించినదే విలువైనదనీ శాసించే పద్ధతి నిష్ప్రయోజనమని అంగీకరించినాడు. ఇందుకుదాహరణగా అశోకుడొక విషయాన్ని పేర్కొన్నాడు. కొన్ని అవధ్య జంతువులను ప్రకటించి వాటిని చంపడంమీద నిబంధనలుంచినాడు. కాని ధమ్మాన్ని అవగాహన చేసుకొనడంవల్ల స్వయంగానే ప్రజలు జంతువధ మాని, తన నిబంధనల అవసరం లేకుండా చేస్తారు. ఈ దశలోకూడ నిబంధనలకంటే అనునయశక్తిని అశోకుడు గుర్తించినాడు. ధమ్మ మహామాత్తుల అధికారాలు అపారంగా పెరిగి ప్రజల జీవితంలో వారు జోక్యం కలిగించుకొంటున్నప్పుడు కూడ సిద్ధాంతరీత్యా అశోకుడు అనునయ విధానం మీదనే నొక్కి పెట్టి మాటాడినాడు.

రెండో సాధారణ వర్గానికి చెందినవి నాల్గు శాసనాలున్నాయి. ఇవి బౌద్ధమతంలో తన విశ్వాసాన్ని స్పష్టంగా ప్రకటించి సోదర బౌద్ధులను, బౌద్ధ సంఘాన్ని ఉద్దేశించి వేసిన శాసనాలు. ఇవి రుమ్మిండై, నిగలీసాగర్‌లో ఉన్న శాసనాలు, విభేదశాసనం, భబ్రాశాసనం. మౌర్య చక్రవర్తిగా గాక సాధారణ వ్యక్తిగా అశోకుడీ శాసనాలలో తన భావాలను వ్యక్తం చేసినాడు. బౌద్ధమతాన్ని అనుసరిస్తూ తీర్థయాత్రలు చేస్తూ పవిత్ర సంప్రదాయాలలో విశ్వాసం ఉన్న వ్యక్తిగా అశోకుడీ శాసనాలలో కనిపిస్తాడు.

లుంబినీ వనయాత్రకు స్మృతి చిహ్నంగా రుమ్మిండై స్తంభశాసనాన్ని అశోకుడు వేయించినాడు. లుంబినీవనం బుద్ధుని జన్మస్థలమైనందున బౌద్ధులు పరమపవిత్రంగా భావించినారు. బౌద్ధుల కుద్దిష్టమైన నాల్గు తీర్థయాత్రలలో ఒకటి లుంబినీ వనయాత్ర, పదిహేనో పాలనా సంవత్సరంలో 'కనకముని' స్థూపాన్ని అశోకుడు దర్శించి తరువాతికాలంలో అశోకుడాస్థూపాన్ని అభివృద్ధిపరచిన అంశాన్ని 'నిగలీసాగర్ శాసనం' నమోదు చేసింది. శిథిలావస్థలో ఉన్న ఈ శాసనంలో రెండోతేదీని చదవలేము. వేరు వేరు బౌద్ధ స్థలాలకు సాగించిన యాత్రలలో రెండోమారు అశోకుడు 'కనకముని' స్థూపాన్ని దర్శించి ఉండవచ్చు. ఇరవై ఒకటవ పాలనా సంవత్సరంలో లుంబినీ వనాన్ని దర్శించినట్లు చెప్పినాడు. అదే సమయంలో కనకముని స్థూపాన్ని రెండోమారు దర్శించి ఉండవచ్చు. బౌద్ధమతంతో అశోకుని వ్యక్తిగత అనుబంధం సంవత్సరాలు గడిచినకొద్దీ బలపడినట్లు నిగలీసాగర్ శాసనాన్ని బట్టి స్పష్టమౌతోంది.

పరిపాలనా కాలం చివరి భాగంలో అంటే సుమారు క్రీ.పూ. 240లో అశోకుడు విభేద శాసనాన్ని జారీచేసినాడు. దీని ప్రతులు సాంచీ, సారనాథ్, కోశంలలో ఉన్నాయి. సంఘంలో విభేదాలకు కారకులైన భిక్షుకీ భిక్షుకులు సంఘ బహిష్కృతు లౌతారని

బెదిరించినాడు. బౌద్ధ మతస్థుడుగా సంఘ సమైక్యానికి కృషి చేయాలని అతడు ఆశించినాడు. అందుచే సంఘంలో విద్రోహులను సహించేది లేదని చెప్పడమే ఈ శాసనం ఇవ్వడంలో ఆతని ఆశయం. శాసనం ప్రతినొక దానిని సంఘ కార్యాలయంలో ఉంచాలని, ఈ విషయంలో తన అభిప్రాయాన్ని అందుకు సంబంధించిన ఉద్యోగులు గ్రహించడం కోసం రెండో ప్రతిని ప్రకటించాలని ఆజ్ఞాపించినాడు. సంఘానికై పనిచేస్తున్న మహామాత్తుల నుద్దేశించి ఈ శాసనం జారీచేయబడింది. బౌద్ధమత కేంద్రాలన్నింటికీ శాసన ప్రతిని పంపి స్థానికోద్యోగులకు ఆదేశాలను ఇచ్చి ఉంటాడు.

ఇక మిగిలింది చివరిదైన భబ్రశాసనం. దీనిపై తేదీ లేదు. కాని అశోకుని పాలనకాలం చివరలో జారీచేసిందని మా విశ్వాసం. ఈ శాసనం కన్పించిన కొండపై రెండు బౌద్ధ విహారాల శిథిలాలున్నాయి. సంఘానికి ఉద్దేశించిన శాసనం విహారాల దగ్గర ఉండడం సబబే. అంతేకాక బౌద్ధంలో అశోకుని విశ్వాసాన్ని ఈ శాసనం మరింత స్పష్టం చేస్తున్నది. బౌద్ధ బిక్షువులు, ఉపాసకులు తప్పనిసరిగా అధ్యయనం చేయవలసిన మత గ్రంథాలను ఈ శాసనం పేర్కొంటున్నది. అశోకుడు బౌద్ధుడన్న అంశాన్ని గురించి సందేహానికి అవకాశంలేని మాటలలో చెబుతున్నందున ఈ శాసనం చాల ముఖ్యం. బుద్ధ, ధమ్మ సంఘములలో అతని విశ్వాసాన్ని చాటుతున్నది. ఈ వాక్యంలో సందేహానికి తావులేదు. ఇది ప్రజలకుకాక రాజు వ్యక్తిగతంగా కేవలం సంఘాన్ని ప్రత్యేకంగా ఉద్దేశించి ఇచ్చిన శాసనం. భబ్రలో నేడు కనిపించిన విహారాలలో నాడు నివసించిన భిక్షువుల నుద్దేశించినదై ఉండవచ్చు. సాధారణంగా వాడే దేవానాం ప్రియ, ప్రియ దర్శిరాజా అనే గౌరవ బిరుదులు కాక ఈ శాసనంలో 'ప్రియ దస్సిలాజా మగధే' మగధ రాజైన ప్రియదర్శి అనే చాల సామాన్యమైన బిరుదం వాడినారు. అందుచే అశోకుడీ శాసనాన్ని బౌద్ధమతస్థుడుగా ఇచ్చినట్లు అర్థమౌతున్నది.

కొన్ని ఆచారాలు. ఆశయాలు కలిసి మిశ్రమమైన జీవిత విధానంగా అశోకుని ధమ్మం రూపొందింది. అందులో అహింస (జీవహింస మానడం) ఒక ముఖ్య సూత్రం. అంతేగాక అప్రమత్తమైన కుటుంబ సంబంధాలు సాంఘిక సంబంధాలుకూడ ముఖ్యమైనవి. ఈ సంబంధాలు తల్లిదండ్రులకు, బిడ్డలకు మధ్యవి కావచ్చు. వృద్ధులకు, యువకులకు మధ్య సంబంధాలు కావచ్చు స్నేహితుల మధ్య సంబంధాలై ఉండవచ్చు. లేదా భిన్న సిద్ధాంత శాఖల మధ్య సంబంధాలై ఉండవచ్చు. ఇరవయ్యో శతాబ్ద పరిభాషలో సాంఘిక సంక్షేమ కార్యక్రమాలనదగినవి వీటిలో చేరినాయి. ఔషధ సౌకర్యాలు, రాకపోకల సౌకర్యాలు, మూఢ విశ్వాసాలపై వ్యర్థవ్యయం మానడం మొదలైనవి ఇందులోనివి. మాటలలో, చేతలలో నిగ్రహం ధమ్మానికి కీలకం. కాని ఏరకమైన బలప్రయోగములేదు.

వీటిలో కొన్ని సిద్ధాంతాలను సూచించడం మాత్రం జరిగింది. వాటిలో నుండి ప్రతివ్యక్తి తన అంత:కరణ ననుసరించి ఎన్నిక చేసుకోవచ్చు. చివరి శాసనాలలో ఒక పెద్ద మార్పును గమనించాము. స్తంభశాసనాలలోని ఉపదేశం సంక్షిప్తంగా ఉంది కాని ముఖ్య శిలాశాసనాల ఉపదేశాలంత విలువైనది కాదు. ధమ్మం విజయవంతమైనదనే భావావేశంతో వాస్తవ పరిస్థితిని నమోదు చేసినట్లు కనిపించదు.

బౌద్ధ ధర్మంతో కాని, ధర్మమనే సాధారణ నామంతో వ్యవహృతమౌతున్న ఏయితర విధానంతో గాని అశోక ధమ్మాన్ని సరిపెట్టే ప్రమాదం ఉంది. అందుచే ధమ్మాన్ని వ్యాఖ్యానించడంలో అప్రమత్తత అవసరం. ధమ్మ పదాన్ని వాడిన దెవరు? ఏ సందర్భంలో వాడినారు? అని విశ్లేషణాత్మకమైన వివరణ చేసిన తరువాతనే ధమ్మానికి నిజమైన వ్యాఖ్యానం లభిస్తుంది. ప్రాచీన భారతీయ సారస్వతంలో ఆలోచనా విధానంలో కన్పించే ధర్మాలు లేదా ధమ్మాలు ఏకరూపాలు లేదా ఇంచుమించు ఏకరూపాలు అని చెప్పడమనేది గత రెండు శతాబ్దాలలో అనేక సందర్భాలలో కనిపిస్తున్న 'సోషలిజమ్' అన్న మాటకు ఒకే అర్థం అన్నంత మూర్ఖము. అదృష్టవశాత్తు గతంలో అశోక ధమ్మానికి సామాన్యులను వెదికే ప్రయత్నాలు జరిగినాయి. నేడా అవసరం లేదు. విశ్వాసయోగ్యము అపారమునయిన సారస్వతము అశోకుని శాసనాలలోనే ఉన్నది. అశోకుని ధర్మం ఏమి? అనే ప్రశ్నకు ఆ సారస్వతమే సమాధాన మిస్తున్నది.

న్యాయము, సాంఘిక విధానము అనే అర్థంలో ధర్మసూత్రాన్ని వాడడం మౌర్యయుగ భారతదేశానికి ఏ విధంగానూ కొత్త కాదు. అశోకుడు చేసినదల్లా ధర్మాన్ని ప్రచారం ద్వారా సభ్యమైనదిగా చేయడానికి ప్రయత్నించడమే. నాటి పరిస్థితులలో అది అవసరమైంది. సత్ప్రవర్తన, దుష్ప్రవర్తనల తారతమ్యాన్ని గ్రహించగల శక్తి ఒక్కటే ఇతర సృష్టి నుండి మానవుని ప్రత్యేకిస్తున్నది. సత్ప్రవర్తన మానవులందరికీ సమానమైన ధర్మంగా సాధింపవచ్చు. అట్టి ప్రవర్తనే ఆధారమైన ధమ్మం భిన్నమత విశ్వాసాల పరిధుల కతీతము. పైన చెప్పినట్లు ధమ్మం అనేది సమాజం సందర్భంలో చాలవరకు వ్యక్తికి సంబంధించిన నైతిక భావన. మత బోధనల సంకుచిత దృక్పథాన్ని సంస్కరించడానికి సామ్రాజ్యమంతటా సాంఘిక ప్రవర్తనా చైతన్యాన్ని కలిగించటానికి అశోకుడు ధర్మ ప్రచారం ద్వారా ప్రయత్నించినాడు. ఈ ప్రచారం ద్వారా ఏ సాంస్కృతిక వర్గం కూడా అడ్డు చెప్పలేని విస్తృత ప్రయోజనాన్ని అశోకుడాశించినాడు.

ఆరో అధ్యాయము

# తరువాతి మౌర్యులు

అశోకుని మరణానంతర సంవత్సరాలలో మౌర్య రాజవంశం భారతదేశంలో రాజకీయ శక్తిగా అంతరించింది. అశోకుని తరువాత ఒక అర్ధ శతాబ్దం వరకు అంటే క్రీ.పూ. రెండో శతాబ్దం పూర్వార్ధం వరకు మౌర్య రాజులు పరిపాలన కొనసాగించినప్పటికీ మౌర్యవంశ పతనం పూర్తై శుంగవంశ స్థాపనకు దారితీసింది. ఈ అర్ధ శతాబ్దంలోనే మౌర్య సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. అశోకుడు పాలించిన మహా సామ్రాజ్యం క్షీణించి ఒక చిన్న రాజ్యానికి, ఇంచుమించు మగధకుమాత్రం, మౌర్యాధికారం పరిమితమైంది. మగధయే మౌర్య సామ్రాజ్యానికి బీజప్రాయం. చంద్రగుప్తుడు తన జీవితాన్ని మగధతోనే ప్రారంభించినాడు. అశోకుని పాలనా కాలాన్ని గురించి అపారమైన సాక్ష్యాధారాలున్నాయి. అందుకు భిన్నంగా తరువాతి మౌర్యులకున్న సాక్ష్యం చాల స్వల్పం. ఈ సాక్ష్యం కూడ క్రమ రహితంగాను, అస్పష్టంగాను, సంశయాస్పదంగాను ఉంది. అందుచే చివరి ఏభై సంవత్సరాల మౌర్యచరిత్రను పునర్నిర్మించడంలో చారిత్రకుల మధ్య ఏకాభిప్రాయం లేదు. ఏ చరిత్రకారుని కథనమైనా, పునర్నిర్మాణ ప్రయత్నమైనా కేవలం సూచనప్రాయమే. అటువంటి పునర్నిర్మాణమే ఈ అధ్యాయంలో కూడ సూచించడమైంది.

పెక్కు ఆధారాల నుండి మౌర్య వంశంలోని రాజుల పట్టికలు లభ్యమౌతున్నాయి. ఒక్కొక్క పాలకునిపై లభించే సాక్ష్యం ఆధారంగా ఈ వేరు వేరు రాజవంశం పట్టికలను పోల్చడం ఈ చరిత్రకు సముచితమైన ప్రారంభమవుతుంది. తరువాతి మౌర్యులను గురించి పౌరాణికాధారాలు పెద్ద పెద్ద పట్టికలిస్తున్నాయి. క్రింద సూచించినట్లు పురాణాల పట్టికలలో చాల వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి.

**వాయు, బ్రహ్మాండ పురాణాల ప్రకారం :**

| **రాజు** | **పాలన సంవత్సరాలు** |
|---|---|
| అశోక | -- |
| కునాల | -- |
| బంధు పాలిత | 8 |
| ఇంద్రపాలిత | 10 |
| దేవవర్మ | 7 |
| శతధనుష్ | 8 |
| బృహద్రథ | 7 |

మౌర్యవంశం బృహద్రథునితో పరిసమాప్తమైంది. శుంగవంశ స్థాపకుడైన పుష్యమిత్రుడు బృహద్రథుని వధించినాడు. ఈ సంఘటనను పురాణాలన్నీ పేర్కొంటున్నాయి. ప్రతి పట్టిక తరువాత ఈ సంఘటనను గురించి ముచ్చటించవలసిన పనిలేదు.

**మత్స్య పురాణం ప్రకారం :**

| **రాజు** | **పాలన సంవత్సరాలు** |
|---|---|
| అశోక | -- |
| దశరథ | 8 |
| సంప్రతి | 9 |
| శతధన్వ | 8 |
| బృహద్రథ | 7 |

**విష్ణు పురాణాన్ని అనుసరించి :**

| | |
|---|---|
| అశోక | సోమవర్మ |
| సుయశ | శతధన్వ |
| దశరథ | బృహద్రథ |
| సంగత | |
| శాలిశుక | |

వాయుపురాణం "E" ప్రతి ఆధారంగా పార్జిటర్
మరో పట్టిక సూచించినాడు. అది:

| రాజు | పాలన సంవత్సరాలు |
|---|---|
| అశోక | -- |
| కునాల | -- |
| బంధుపాలిత | 8 |
| దశోన | 7 |
| దశరథ | 8 |
| సంప్రతి | 9 |
| శాలిశుక | 13 |
| దేవధర్మ | 17 |
| శతధన్వ | 8 |
| బృహద్రథ | 7 |

ఈ పట్టికలను పోల్చడం వల్ల క్రింది పట్టిక వస్తుంది.

| రాజు | పాలన సంవత్సరాలు |
|---|---|
| అశోక | -- |
| కునాల | 8 |
| బంధుపాలిత | 8 |
| ఇంద్రపాలిత | 10 |
| దశోన | 7 |
| దశరథ | 8 |
| సంప్రతి | 9 |
| శాలిశుక | 13 |
| దేవవర్మ | 7 |
| శతధన్వ | 8 |
| బృహద్రథ | 7 |

ఏమైనప్పటికి పై పట్టిక అంగీకారయోగ్యం కాదు. మౌర్యవంశం 137 సంవత్సరాలు పాలించిందన్న ఒక్క అంశంపై పురాణాల మధ్య అంగీకారం ఉంది. మొదటి ముగ్గురు మౌర్యులు 85 సంవత్సరాలు పాలించినారు. మిగిలిన 52 సంవత్సరాలు తరువాతి

మౌర్యులందరికీ పంచవలె. కాని పై పట్టికను కూడితే 85 సంవత్సరాలు వస్తున్నాయి. అందుచే అది అసంబద్ధమౌతుంది. అదే విధంగా పురాణాల పట్టికలన్నీ 52 కంటె ఎక్కువగాని, తక్కువగాని మొత్తాలు ఇస్తున్నాయి. ఈ పురాణాల పట్టికలలో చాల తేడాలున్నాయి. ఒక పట్టికలో ఉన్న రాజులు మరొక పట్టికలో ఉండరు. అందుచేత ఏ పట్టికా పూర్తి ప్రామాణికమని అంగీకరించడానికి యోగ్యంగా లేదు.

ఇతర ఆధారాలు సయితం మౌర్యవంశంలోని రాజుల పట్టికలను ఇస్తున్నాయి. వాటిలో 'అశోకావదాన' ఈ విధంగా చెబుతున్నది :

అశోక

సంపది

వృహస్పతి

వృషసేన

పుష్యధర్మ

పుష్యమిత్ర

జైన సంప్రదాయం రెండు పేర్లను చెబుతున్నది. ఆ సంప్రదాయం ప్రకారం అశోకుని అనంతరం అతని దౌహిత్రుడు కునాలుని పుత్రుడు నైన సంప్రతి రాజైనాడు.

టిబెటన్ చరిత్రకారుడైన నాథుడు బౌద్ధ గ్రంథాలు ఆధారంగా క్రింది పట్టిక ఇస్తున్నారు:

అశోక

విగతాశోక

వీరసేన

కల్హణుని రాజతరంగిణి పూర్తిగా ఒక కొత్త పేరు ప్రవేశపెట్టుతున్నది. అశోకుని అనంతరం కాశ్మీర్ రాజైనవాడు జలౌకుడు. జలౌకుని తరువాతివాడు దామోదరుడు.

ఐరోపా ప్రాచీన ఆధారాలనుండి లభ్యమైన ఏకైక సాక్ష్యం పోలీబియస్‌ది. అతడు క్రీ.పూ. 206 లో వ్రాస్తూ భారతీయ రాజైన సొఫగ సేనునితో మైత్రిని సిరియా చక్రవర్తి ఘనుడైన యాంటియోకస్ పునరుద్ధరించినాడని చెప్పినాడు. దాని తరువాత పోలిబియస్ క్రింది వాక్యాలను చేర్చినాడు. "ఇక్కడ యాంటియోకస్ అనేక ఏనుగులను సంపాదించినాడు. అంతటితో అతని గజబలం 150 కి పెరిగింది. తన సైనికులకు మరల ధాన్యం పంచి రాజు తనకు చెల్లిస్తానన్న మొత్తాన్ని వసూలు చేయడానికై సైజికస్ వాసియైన యంద్రోస్తనీస్‌ను విడిచి తన సైన్యంతో బయలుదేరినాడు." శుభగసేన అనే భారతీయ నామానికి గ్రీకు రూపాంతరమే 'సొఫాగ సేనాస్' అనేది స్పష్టము. ఈ రాజు గుర్తింపు గురించి తరువాత చర్చిద్దాము.

బృహద్రధుని పుష్యమిత్రుడు వధించిన గాథను తన హర్ష చరిత్రలో బాణకవి పునశ్చరణ చేసినాడు. సర్వ సైన్య ప్రదర్శన అనే మిషమీద దుష్ట సేనాని పుష్యమిత్రుడు మూర్ఖుడైన తన యజమాని మౌర్య బృహద్రధుని చంపినాడని బాణుని కథనము.

అశోకుని అనంతరం అతని కొడుకైన తీవర సింహాసనం ఎక్కే అవకాశం ఉంది. మహారాణి శాసనంలో తల్లి 'కారువాకీ' దేవితో తీవరుని ప్రస్తావించినాడు. తీవరుని ప్రస్తావించేది ఈ ఒక్క ఆధారమే. సారస్వతంలో ఈతని పేరు లేదు. సారస్వతం ఇతణ్ణి మరే పేరుతోనైనా వ్యవహరించెనేమో తెలియదు. మహారాణి కారువాకీ బౌద్ధగాథలలోని తిస్సరఖ్ఖా ఒకరే అయి యుండవచ్చునని పైన సూచించడం జరిగింది. ఉభయులు అశోకుని రెండో భార్యలే. కారువాకీ అసలు పేరనీ, మహారాణి పదవిని పొందిన అనంతరం తిస్సరఖ్ఖా అనే అధికార నామం ధరించిందన్న పై భావనే నిజమైతే తీవరుని అంతర్ధానానికి సులభంగా అర్థం చెప్పవచ్చు. తిస్సరఖ్ఖా చాల దురాశాపరురాలని, వృద్ధుడైన మహారాజును తన అదుపులో ఉంచిందని ఆధారాలవల్ల తెలుస్తుంది. అశోకుని వృద్ధాప్యంలో తీవర జన్మించి ఉండవచ్చు. అతి గారాబంవల్ల అతడు చెడిపోయి ఉండవచ్చు.

తిష్యరక్షిత బోధి వృక్షానికి హాని కలిగించిందనే కథవల్ల బౌద్ధమతంలో అశోకుని శ్రద్ధను ఆమె నిరసించిందని తెలుస్తుంది. ఆతని బౌద్ధమతాభిమానం తన ప్రేమకు ప్రత్యర్థిగా నిలచినదని ఆమె భావించడమే యదార్థమైతే తనకు వారసుడుగా తీవరుని ప్రకటించ వలసిందని, అశోకుని ఆమె వేధించినదనడం అసంభవం కాదు. దురాశాపరురాలైన తల్లిగా తిష్యరక్షిత రాకుమారుని తన చెప్పుచేతల్లో ఉంచుకొనవచ్చు. అందుచేత కునాలుని వంటి ఇతర రాకుమారులు, తీవరునికంటె పెద్దవారు, తీవరుని గర్హించి ఉండవచ్చు. తండ్రి మరణానంతరం వారు అతణ్ణి లెక్కచేసి ఉండక పోవచ్చు. అశోకుని అనంతరం కునాలుడే రాజైనాడనే కథలోను, తిష్యరక్షిత కునాలు అంధుని గావించినదన్న గాథలోను ఏ మాత్రం సత్యమున్నప్పటికీ అశోకుని మరణానంతరం తీవర, తిస్సరఖ్ఖాలిద్దరు అదృశ్యం కావడంలో ఆశ్చర్యం లేదు. అశోకుని అనంతరం కునాలుడే రాజైనట్లు తరచుగా ఆధారాలు చెబుతున్నాయి. తక్షశిలలో తిరుగుబాటు నణచడానికి కునాలుణ్ణి పంపినట్లున్న బౌద్ధగాథచారిత్రకంగా సత్యంగాదని మా విశ్వాసం. కునాలుణ్ణి అంధునిగా చేయడానికి తిస్సరఖ్ఖా కారణమని మరొక బౌద్ధగాథ చెబుతుంది. కాని ఈ గాథ కూడ ఎంతవరకు ప్రామాణికమో అనుమానం. ఏమైనప్పటికి కునాలుడు అశోకుని కుమారుడు. తక్షశిలలో రాజ ప్రతినిధి. బహుశా అతడే అశోకుని వారసుడుగా కనిపిస్తున్నాడు.

అశోకుని తరువాత అతని పౌత్రుడు దశరథుడు సింహాసనం అధిరోహించినట్లు మత్స్య పురాణం చెబుతున్నది. విష్ణు పురాణం ప్రకారం అశోకుని అనంతరం సుయశ, అతని అనంతరం దశరథుడు సింహాసనం ఎక్కినారు. సుయశుని ప్రస్తావిస్తున్న ఆధారం విష్ణు పురాణం ఒక్కటే. సుయశ అనేది కునాలుని నామాంతరమని ఒక సూచన. ఇది నిజమే కావచ్చు. కునాలపక్షి కండ్లవలె అతని కండ్లు అందంగా ఉన్నందున అతని కా పేరు పెట్టినారట. రాజు కావడంతో సుయశ (గొప్ప కీర్తిమంతుడు) అనే అధికార నామాన్ని అతడు ధరించి ఉండవచ్చు. ఈ ఆచారం అనేక రాజవంశాలలో ఉంది. దివ్యావదాన ఈతనికి ధర్మ వివర్ధన అనే పేరు వాడింది. సుయశ, ధర్మ వివర్ధన పేర్లకు సంబంధం ఉండవచ్చు. కాని ఈ గుర్తింపును జాగ్రత్తగా పరిశీలించి నిరూపణ చేయవలె.

కునాలుని అంధుని గావించిన కథే నిజమయితే అతడు పేరు మార్చుకొనడానికి అది మరొక కారణం. కాని అంధుడే అయితే అతడు సింహాసనమెక్కడం హాస్యస్పదం. వికలాంగులకు రాజ్యార్హత లేదని న్యాయశాస్త్రము, ఆచారము చాటుతున్నాయి. మౌర్య రాజాస్థానం సయితం అంధ రాకుమారుని పరిపాలనను సమ్మతించి ఉండదు. బౌద్ధ గాథలలో చారిత్రక సత్యం ఉన్నా లేకున్నా రెండు కథలకు కునాలుడే కేంద్రం. అయితే రాకుమారుడుగా అతడు చాల ప్రధానమైన వ్యక్తి అయి ఉండవలె. బహుశా సింహాసనానికి వారసుడై ఉంటాడు. అంధుడైన గాథను ఔపచారికంగా మాత్రమే గ్రహించవలె. అతడు బౌద్ధమతం పట్ల చిన్నచూపు చూస్తూ ఉండడమే అతని అంధత్వమని గ్రహించవలె. బౌద్ధమతానికి భిన్నంగా నడిచేవారు బౌద్ధభిక్షువుల దృష్టిలో సన్మార్గం పట్ల కండ్లు మూసుకున్నవారే. అందులోను అశోకుని పుత్రుడు బౌద్ధమతానికి భిన్నంగా వర్తించడమంటే అతడంధుడయినట్లే.

దశరథుని మత్స్యపురాణం ప్రస్తావిస్తూ ఉన్నది. అంతేకాక నాగార్జున కొండలలోని గుహా శాసనాలద్వారా కూడ దశరథుడు తెలుస్తున్నాడు. దశరథుడీ గుహలను ఆజీవికులకు దానం చేసినాడు. సింహాసనం అధిష్టించిన వెంటనే ఆ గుహలను అంకితం చేస్తూ దేవానాం ప్రియ దశరథుడు చేసిన ఆజ్ఞలే శాసనాలుగా వ్రాశారు. శాసనలిపి అశోక బ్రాహ్మీ, శాసన స్వభావంకూడ అశోకుని శాసనాలను పోలిఉన్నది. అందువల్ల అశోకుని అనంతరం వెంటనే ఈ శాసనాలు జారీఅయినట్లు తెలుస్తున్నది. సూర్యచంద్రు లున్నంతవరకు ఈ నివాసం నిలిచి ఉండాలన్న దశరథుని కోరికకు ఏడో స్తంభ శాసనంలో ఆచంద్రార్కం ధర్మసూత్రాలను స్త్రీ పురుష లనుసరించవలెనన్న అశోకుని ఆకాంక్షకు దగ్గర సంబంధం ఉంది.

గుహల నంకితం చేయడం, శాసనాలు వేయించడం దేవానాం ప్రియ బిరుదం – ఇవి అన్నీ పితామహుడైన అశోకుని స్వభావానికి సన్నిహితంగా దశరథుడున్నట్లు సూచిస్తున్నాయి. "దశలదేన దేవానాం పియేన అనంతలియం అభిసితేన" అన్న వాక్యంలోని 'దేవానాం పియ' పదం అశోకుని ప్రస్తావిస్తున్నదని కొందరి వాదం. అశోకుడు సర్వదా తనపేరు ప్రియదర్శికి పూర్వమే 'దేవానాం పియ' బిరుదాన్ని వాడినాడు. పై వాక్యంలో రాజు పేరు అనంతరం బిరుదం ఉంది. ఇది పైవాదానికి ఆధారం. ఈ అంశం ఆధారంగా పైవాక్యాన్ని 'డలవాలీపౌస్సిన్' క్రింది విధంగా తర్జుమా చేసినాడు:– అశోకుడు తనకు పట్టాభిషేకం జరిపిన తరువాత దశరథుడీ గుహను దానం చేసినాడు," దేవానాం పియ అనే బిరుదం సర్వసామాన్యమైనది. దశరథుడా బిరుదాన్ని ధరించి ఉండవచ్చు. పేరుకు ముందుగాని, వెనుకగాని బిరుదాన్ని ప్రయోగించవచ్చు. రాజు తన పేరును, వంశంలో తన స్థానాన్ని చెప్పుకొన్న తరువాత బిరుదాలు రావచ్చు. వ్యాకరణరీత్యా శాసనంలో దేవానాం ప్రియ దశరథుని బిరుదుగానే ఉన్నది. బిరుదు రాజు పేరుకు విశేషణంగా ఉండవలె. శాసనంలో అదేవిధంగా ఉన్నది.

బౌద్ధానికి విరుద్ధమైన మతంపట్ల దశరథుడు సానుభూతి వహించడాన్ని కొందరు విమర్శించినారు. ఆజీవికుల కాతడు చేసిన దానాలు, బౌద్ధ గ్రంథాలాతని పాలనను ప్రస్తావించక పోవడం బౌద్ధమతం పట్ల దశరథుని వ్యతిరేకతను సూచిస్తున్నాయని కొందరన్నారు. ఈ విషయాల్లో అశోకుని జీవితమే ఉదాహరణగా లేకపోతే పై సిద్ధాంతం సబబైనదిగానే కన్పిస్తున్నది. అశోకుడు బౌద్ధుడుగా ఉంటూనే గుహలు తొలిపించి ఆజీవికులకు దానం చేసినాడు. అదే పని దశరథుడు చేసినాడు. అందువల్ల దశరథుడు ఇతర మతాలపట్ల ద్వేషం వహించినాడని చెప్పనవసరం లేదు. కాగా తన పట్టాభిషేకమయిన వెంటనే గుహలను దానం చేయడం చేత ఆజీవికులపట్ల ప్రత్యేకాభిమానం వహించినాడని చెప్పవచ్చు. కాని ఇతర మతాల పట్ల నిరాదరణ వహించినాడని అర్థంకాదు.

క్రీ. పూ. 232 లో దశరథుడు చిన్నవాడు కాదు. కాబట్టి అశోకుని అనంతరం అతడు సింహాసనానికి వెంటనే రావడం సంభవం. సింహాసనం ఎక్కినపుడు అశోకునకు ముప్పది యేండ్ల పైబడి వయసుంటుంది. అతడు ముప్పై ఏడు ఏండ్లు పరిపాలించినాడు. అందువల్ల మరణించే నాటికి అశోకుని వయస్సు కనీసం 67 సంవత్సరాలు. కాబట్టి అశోకుడు మరణించే నాటికి అతనికి ఇరవై యేండ్ల పౌత్రుడుండడం సంభవమే. పౌత్రుడు తాతగారి వల్ల ప్రభావితుడైనపుడు అశోకుడు తన కొడుకు హక్కులను కాదని పౌత్రునే బలపరచి ఉండవచ్చు. అయినప్పుడు అశోకుని కుమారులకు చాల ఆగ్రహం కలిగి ఉంటుంది.

మత్స్య పురాణం సంప్రతిని కూడ పేర్కొంటున్నది. బౌద్ధ జైన వాఙ్మయాలాతణ్ణి కునాలుని కొడుకుగా చెబుతున్నాయి. ఇక్కడ సాక్ష్యాధారాలలో కొంత వ్యత్యాసం కనిపిస్తున్నది. పురాణం సంప్రతిని దశరథుని కుమారుడంటుంది. జైన సంప్రదాయం ప్రకారం సంప్రతి అశోకుని పౌత్రుడు. జైన మత పోషకుడు. సుహస్తి అనే ఆచార్యుడు సంప్రతికి జైనమతం బోధించినాడు. నాడు మొదలు పాలకుడుగా సంప్రతి జైన మతాన్ని బలపరచినాడు. ఇతర విధాలుగా కూడ ప్రోత్సహించినాడు. పాటలీపుత్రము, ఉజ్జయినీ నగరాల నుండి సంప్రతి పాలించినట్లు ఆధారాలు చెబుతున్నాయి. కాని ఈ అంశాలను బలపరచే శాసనాధారాలుగాని, ఇతర ఆధారాలు గాని లేకపోవడం దురదృష్టం.

అశోకుని చివరరోజులలోని ఆసక్తికరమైన ఒక కథతో బౌద్ధవాఙ్మయం సంప్రతికి సంబంధాన్ని సూచిస్తున్నది. సుదుత్తుని దాతృత్వాన్ని అధిగమించాలనే నిర్ణయంతో అశోకుడు బౌద్ధ సంఘానికి నూరుకోట్ల బంగారు నాణేలను దానం చేసినాడు. బొక్కసం నుండి ఆధనం చెల్లిస్తున్నారు. ఇక నాల్గు కోట్లు మాత్రమే చెల్లించవలె. ఆ సమయంలో మంత్రి రాధాగుప్తుని సలహాపై సింహాసనానికి వారసుడైన సంప్రతి అశోకుని అటకాయించినాడు. అంతట అశోకుడు తన సొంత ఆస్తిని దానం చేయసాగినాడు. చివరికాతనికి సగం మామిడి పండు మాత్రమే మిగిలింది. రాజు మరణించిన తరువాత మంత్రులు నాలుగు కోట్లు చెల్లించి సంఘానికి అపహృతమైన రాజ్యాన్ని ఉద్ధరించి సంప్రతికి పట్టం కట్టినారు. తన జీవిత కాలంలో జనాకీర్ణమైన ప్రపంచాన్నంతా అశోకుడు పూజారి వర్గానికి ముమ్మారు దత్తంచేసి, ధనం చెల్లించి తిరిగి విక్రయించుకొన్న అంశానికి స్మృతి చిహ్నంగా రాజ గృహం చెంత అశోక స్తంభంపై శాసనం చెక్కించినట్లు ఫాహియాన్ తన కథనంలో చెప్పినాడు. ఆ స్తంభ చిహ్నాలు ఇంతవరకు బయల్పడలేదు. బహుశా ఈ కథను స్థానిక బౌద్ధులు ఫాహియాన్‌కు చెప్పి ఉంటారు. ఆ తరువాత పై కథ, స్తంభశాసనం అతని మనస్సులో తారుమారై ఉంటాయి.

కల్హణుని రాజ తరంగిణి కాశ్మీరదేశ చరిత్ర. దాని ప్రకారం అశోకుని వారసుడు జలౌకుడు. మ్లేచ్ఛులను (పరదేశీయులను) నాశనం చేయాలనే సంకల్పించి కొడుకు కావాలన్న అశోకుని కోర్కె ఫలించి జలౌకుడు జన్మించినాడు. జలౌకుడు తీవ్ర శైవ మతాభిమాని. విజయగర్వంతో బలవంతులై ఉన్న బౌద్ధవాదులను జలౌకుని గురువు ఓడించి అణచివేసినాడు అనే వర్ణన ఉంది. ఈ సంఘటనలు అశోకుని కాలానికి చాల సన్నిహితములైనట్లు స్పష్టమౌతున్నది. దేశాన్ని పీడిస్తున్న మ్లేచ్ఛులను పారదోలి సముద్ర పరివేష్టిత భూమండలాన్ని జలౌకుడు జయించినాడు. పాలనా వ్యవహారాలలో ఉద్యోగుల

సంఖ్యను ఏడు నుండి పద్దెనిమిది వరకు పెంచినాడు. ధర్మాధ్యక్ష, ధనాధ్యక్ష, కోశాధ్యక్ష, సమ్ములిపతి, దూత, దైవాధ్యక్ష అనేవారు ఆ ఏడుగురు రాజోద్యోగులు. జలౌకునకు బౌద్ధ మతంతో ఉన్న సంబంధాన్ని వివరిస్తూ ఒక కథ ఉంది. ఒకనాడాతణ్ణి ఒక అన్నాతురయైన అభిచారిణి కలిసి అతని మాంసం తినగోరింది. జలౌకుడు వెంటనే తన్ను తాను సమర్పించుకొన్నాడు. తత్ఫలితంగా ఆ అభిచారిణి తాను వాస్తవానికి మహాశాక్యుడనని తెల్పి, జలౌకుని ప్రశంసించి తనకు కీర్తి 'ఆశ్రమ విహారం' నిర్మింప కోరింది. జలౌకుడా కోర్కెను తీర్చినాడు. నాటి నుండి జలౌకుడు శైవుడుగా ఉంటూనే ఆ దివ్య యోగినిని పూజింప సాగినాడు. జలౌకుని అనంతరం రెండో దామోదరుడు సింహాసనం ఎక్కినాడు. ఈతడు అశోకుని వంశంవాడై ఉండవచ్చు. లేదా ఇతర వంశస్థుడైనా అయి ఉండవచ్చు.

బౌద్ధమత గ్రంథాలు ప్రస్తావించనందున జలౌకుడు హిందూ మతాభి అయి ఉండవచ్చు. లేదా గురు ప్రభావంవల్ల బౌద్ధమత వ్యతిరేకి అయి ఉండవచ్చు. ఇది తృప్తికరమైన సమాధానం కాదు. అతడు బౌద్ధుడే అయితే దివ్యయోగిని గాథను బౌద్ధ గ్రంథాలు విపులీకరించి ఉండేవి. వీటి అన్నింటి వల్ల జలౌకుడెవరో ఇంతవరకూ స్పష్టంగా గుర్తించడం జరుగలేదని చెప్పవలె. అతని రాజ్యంలో కాశ్మీర గాంధారాలున్నాయి. ఉత్తర భారతంలో కొన్ని ప్రాంతాలను కూడ అతడు తన రాజ్యంలో చేర్చుకొని ఉండవచ్చు.

రాజతరంగిణిలో ప్రాచీన రాజుల గాథలు అస్తవ్యస్తంగా ఉన్నందున జలౌకుడు అశోకుని కుమారుడు కాదనే వాదం ఉంది. అతడు కుషానురాజని, ఆతని పేరు పొరపాటుగా చదివినారని మరొక వాదం. కాని ఆతడు మౌర్య రాకుమారుడే అని, కునాలుని పేరే పొరపాటున జలౌకుడని చదివినారని మా అభిప్రాయం. కలౌకుని పేరు కాశ్మీర చరిత్రలోనే కాని మౌర్య రాజ పట్టికలలో ఎచ్చటా లేదు. అందుచే కునాల పదానికి జలౌక స్థానిక రూపాంతరం అయి ఉంటుంది. ధ్వనిలో రెండూ భిన్నాలే. కాని వ్రాయడంలో అక్షరాలు తారుమారు కావడానికి అవకాశం ఉంది. అశోకుని బ్రాహ్మీ లిపిలో కునాల, జలౌక పదాన్ని వ్రాసేవారు. బాక్ట్రియన్ గ్రీకుల దండయాత్రలు, కుషానుల దండయాత్రలు జరిగిన తరువాత జలౌక వంటి విదేశ పదాలను స్థానికులు నిరాక్షేపణగా అంగీకరించి ఉంటారు.

పైన పేర్కొన్న రాజోద్యోగు లేడుగురిలో ధర్మాధ్యక్షుని ప్రథమంగా పేర్కొనడం చాలా విచిత్రం. ప్రభుత్వ యంత్రాంగంపై భారతీయ సైద్ధాంతిక గ్రంథాలు సర్వసాధారణంగా రాజ్యస్వ ఉద్యోగులకు, కోశాధికారులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇచట ధర్మాధ్యక్షుని ప్రథమంగా చెప్పడం అసాధారణమైన పద్ధతి. ధర్మాధర్మ పదాన్ని రచయిత న్యాయాధీశు

డనే అర్థంలో వాడి ఉండవచ్చు. లేదా ధర్మాధ్యక్షుని ప్రస్తావించడం ధర్మ మహామాత్ర సంప్రదాయంపై ఆధారపడి ఉండవచ్చు. ఏమైనా జలౌకుడు పరిపాలనలో చేసిన మెరుగులు మౌర్యయుగపాలన విధానానికి అనుగుణంగానే ఉన్నాయి.

జలౌకుడు మ్లేచ్ఛులను పారద్రోలడంపై ఉన్న నొక్కు చాలా ముఖ్యం. మ్లేచ్ఛులనే మాట బాక్ట్రియన్ గ్రీకులకు వాయవ్య భారంతోని ఇతర విదేశీయులకు వాడినట్లు కనిపిస్తున్నది. మౌర్యుల అనంతరం శుంగుల అధికారానికి ఉపద్రవంగా పరిణమించిన యవన దండయాత్ర అశోకుని తరువాత కునాలుని కాలంలోనే చెదురుమదురు దాడులుగా ప్రారంభించి ఉంటుంది. ఏడోస్తంభ శాసనంలో ధర్మ ప్రచారాన్ని సమీక్షిస్తూ తన సామ్రాజ్యంలో విషయాలను గురించి అశోకుడు సంతృప్తితో మాటాడడం గమనించదగింది. తత్పూర్వ శాసనాలలో వాయవ్య సరిహద్దులలోని పొరుగు రాజ్యాలు సైతం ధమ్మాన్ని అనుసరించినారని చెప్పుకొన్న అశోకుడు ఆ రాజ్యాలతోటి తన సంబంధాలను ప్రస్తావించడు. అందుచేత పదమూడో శిలాశాసనం జారీచేసిన తరువాత పది సంవత్సరాలకు వాయవ్య సరిహద్దులలోని గ్రీకు రాజ్యాలతో వైరం ప్రారంభమైనట్లు కన్పిస్తున్నది.

అశోకుని మరణానంతనరం 25 సంవత్సరాలకు అంటే క్రీ. పూ. 206 నాటికి వాయవ్య ప్రాంతంలోని భారతీయులకు, పొరుగున ఉన్న గ్రీకులకు సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఈ సంబంధం మిత్రత్వమో లేదా శత్రుత్వమో వివాదగ్రస్తమైన అంశం. భారతదేశపు రాజైన సొఫగసేనునితో సంబంధాన్ని యాంటియోకస్ పునరుద్ధరించినట్లు చెబుతారు. చంద్రగుప్త మౌర్యునకు, సెల్యూకసు నికటారుకు క్రీ. పూ. 303లో జరిగిన సంధిని మనసులో ఉంచుకొని పోలీబీయస్ ఈ ప్రస్తావన చేసినాడని తారన్ సూచిస్తున్నాడు. మైత్రిని పునరుద్ధరించడం అనేది కేవలం అశోకునకు సిరియారాజైన రెండో యాంటియోకస్‌కు మధ్య నున్న స్నేహ సంబంధాలను సూచించడమే గాని వేరుకాదు. 'సొఫగ సేనస్' మౌర్యవంశ రాజైనట్లు పోలీబీయస్ ఎక్కడా చెప్పడు. అతడు ఏరాజ వంశానికి చెందినవాడో పరిశీలించే శ్రమతీసుకోడు. సొఫగసేనుడు భారతీయరాజు అనటంతో అతని పని తీరిపోయింది.

సొఫగసేనస్ (శుభగసేన) యాంటియోకస్‌ల మధ్య జరిగింది సమాన హోదా వున్నవారి మధ్య సంధివలె కన్పించదు. శుభగసేనుడు స్పష్టంగా హీన పదస్థుడు. శుభగసేనుని నుండి ఏనుగులను, తన సైన్యానికి సరఫరాలను యాంటియోకస్ గ్రహించినాడని ఉంది. అయితే యూథిడెమస్ నాయకత్వంలోని బాక్ట్రియన్ గ్రీకులతో

యాంటియోకస్ చేసిన యుద్ధం తరువాత ఈ సంధి జరిగి ఉంటుంది. కాని ఈ కథనంలో నిజకన్ నివాసి అయిన యాండ్రొస్తనీసును శుభగసేనుని ఆస్థానంలో నియమించి, శుభగసేనుడిచ్చే ఏనుగులను, సరఫరాలను, ధనాన్ని తీసుకురావలసిందిగా ఆజ్ఞాపించినందున అవి అన్నీ యాంటియోకస్‌కు చెల్లించే కప్పంలో భాగమనే భావాన్ని ఇస్తున్నాయి. దీన్ని క్రీ. పూ. 303 లో జరిగిన సంధితో పోలిస్తే యాంటియోకస్ సామంతుడుగా శుభగసేనుడు కనిపిస్తాడు. యాంటియోకస్, యూథిడెమస్‌ల మధ్య జరిగిన సంఘర్షణలలో దురదృష్టవశాత్తూ భారతీయ రాజు చిక్కుకున్నట్లు కనిపిస్తుంది. బాక్ట్రియా రాజ్యం విస్తరించడంతో వాయవ్య భారతంలోని రాజ్యాలు పరాజయం పొందడం సహజం.

శుభగసేన అనేపేరుగాని, అందుకు దగ్గరగా ఉన్న పేరుగాని మౌర్యరాజ వంశ పట్టికలో లేదు. ఆ పేరుకు సన్నిహితంగా ఉన్నది వీరసేన. ఇతణ్ణి గాంధార రాజుగా తారానాథుడు పేర్కొన్నాడు. రెండు పేర్లకు చివర ఉన్న సేన పదం ఉభయులకు కొంత సంబంధాన్ని సూచిస్తున్నది. కాని వీరసేన పదం కూడ ఏరాజ పట్టికలోను కన్పించదు. అశోకుని అనంతరం అతని పౌత్రుడైన విగతాశోకుడు సింహాసనం ఎక్కినట్లు చెబుతాడు. ఈతడు అంధుడైన కునాలుని కుమారుడు. విగతాశోకుడనే పేరును తారానాధుడు దివ్యావదాన నుండి గ్రహించి ఉంటాడు. విగతాశోకుడు అశోకుని సోదరుడని దివ్యావదాన చెబుతున్నది. విగతాశోకుడు బౌద్ధుడు. గౌరవనీయుడు. అతని అనంతరం అతని కుమారుడైన వీరసేన సింహాసనమెక్కినాడు. అనంతరం అతని కుమారుడైన నంద 29 సంవత్సరాలు రాజ్యం చేసినాడు. తరువాత తారానాథుడు బెంగాల్ పరిపాలించిన రాజవంశంపై దృష్టిని కేంద్రీకరించినట్లు కనిపిస్తుంది. హరిచంద్రుడు తరువాతి ఏడుగురు చంద్రులు ఆ ప్రాంతాన్ని పాలించినట్లు అందరూ బౌద్ధమతస్థులైనట్లు వర్ణించినాడు. వీరిలో చివరివాడైన నేమచంద్రుని పుష్యమిత్రుడు తొలగించగా అతడు ఐదు సంవత్సరాల అనంతరం మరణించినాడు. ఈ సమయానికే మ్లేచ్ఛ దండయాత్ర జరిగింది. తరువాత ఐదు సంవత్సరాలకు పుష్యమిత్రడు గతించినాడు. ఈ కాల పట్టికలో కొంత కాలానికి చంద్రగుప్తుడు అతని తరువాత బిందుసారుడు కనిపిస్తాడు. బిందుసారుడు 35 ఏండ్లు పాలించిన తరువాత శ్రీచంద్రుడు, ఆతని తరువాత ధర్మచంద్రుడు సింహాసనం అధిష్ఠించారు. ధర్మచంద్రుడు తూర్పు ప్రాంతాలలో మాత్రమే రాజ్యం చేసినాడు.

అస్తవ్యస్తమైన ఈ కథనం నుండి చారిత్రకాంశాలను ఉద్ధరించడం కష్టం. దీనిలో కేవలం మౌర్యవంశానికి సంబంధించినంతవరకే రెండు పట్టికలున్నాయి. మొదట్లో అశోకుని తరువాత విగతాశోకుడు సింహాసన మెక్కినాడని, బిందుసారుని వారసుడు శ్రీ చంద్రుడని, అతని వారసుడు ధర్మచంద్రుడని పై కథనం చెబుతున్నది. ఈ రెండు పేర్లలో ఏ ఒక్కటీ

మౌర్యవంశానికి చెందింది కాని మనకు తెలుసు. వీరసేనుడు వీరెవరితోను సంబంధించి ఉండడు. పుష్యమిత్రుని స్యాలకుడొకడు వీరసేనుడున్నాడు. ఇతణ్ణి నర్మదానది తీరభూముల్లో ఒక దుర్గంపై అధిపతిగా పుష్యమిత్రుడు నియమించినాడు. బహుశా ఈ వీరసేనుని వృత్తాంతమే తారానాథునకు ఆధారమై ఉంటుంది. కాబట్టి వీరసేనుడు మౌర్యుడు కాదని త్రోసిపుచ్చవచ్చు.

కాని తారానాథుని కథనంలో రెండు ఆసక్తికరాలైన అంశాలున్నాయి. మొదటిది అశోకుని అనంతరం ఆతని పౌత్రుడు సింహాసన మెక్కినాడనేది. ఈ విషయంలో అతడు దివ్యావదానాన్నే అనుసరించినట్లు కనిపిస్తుంది. రెండవది బిందుసారుడు పూర్వ పశ్చిమ సముద్ర మధ్యదేశాధీశ్వరుడని చెబుతూ అతని మనుమని మాత్రం తూర్పు దేశాధిపతిగా వర్ణించడం. దీన్ని బట్టి మౌర్య సామ్రాజ్యం అతి త్వరలోనే క్షీణించినట్లు తారానాథుడు సూచిస్తున్నాడు.

అశోకుని తరువాత నాలుగోరాజు శాలిశుకుడని విష్ణుపురాణం చెబుతున్నది. ఇతర ఆధారాలు సయితం శాలిశుకుని బలపరుస్తున్నాయి. జ్యోతిష శాస్త్ర గ్రంథమైన గార్గిసంహిత శాలిశుకుని దుష్టునిగా ప్రజాకంటకునిగా వర్ణిస్తున్నది. శాలిశుకుని అనంతరం గ్రీకులు భారతదేశంపై దండెత్తి పాటలీపుత్రం వరకు నడుస్తారన్న జోస్యం గార్గి సంహితలో ప్రధానమైన అంశం. కాని పురాణాలు ముఖ్యమైన అంశాలను మాత్రమే నమోదు చేసినాయి. అందుచేత శాలిశుకుని తరువాత వెంటనే గ్రీకులదాడి జరిగిందని చెప్పనక్కరలేదు. అతని అనంతరం ఒక అర్ధశతాబ్దానికి శుంగయుగంలో జరిగి ఉండవచ్చు.

అశోకావదానలోని రాజుల పట్టిక సయితం అస్తవ్యస్తంగా ఉంది. వృషస్పతి, వృషసేన, పుష్యధర్మ, పుష్యమిత్ర అనేవారు సంప్రతి తరువాత సింహాసన మెక్కినట్లు ఆ పట్టికలో ఉంది. శుం వంశ స్థాపకుడైన పుష్యమిత్రునకు మౌర్యవంశ క్రమంలో స్థానం లేదనడం నిర్వివాదం. మిగిలిన ముగ్గురు రాజులు ఇతర పట్టికలలోని రాజులతో సరిపోవడంలేదు. వృహస్పతి అనేది బృహద్రధ నామానికి భ్రష్టరూపమై ఉండవచ్చు. కాని ఈ ఊహకూడ ఏదో సరిపుచ్చడానికి చేసిన వృధా ప్రయత్నమే. మౌర్యవంశం బౌద్ధమతాన్ని పోషించడం మానినందున ఆవంశంలో బౌద్ధులకు ఆసక్తి లుప్తమైంది. అందుచే ఆ రాజులు పట్టికలు అస్తవ్యస్తంగా తయారయినాయి.

అశోకుని చివరిరోజులను గురించి బౌద్ధ సారస్వతంలో మూడు గాథలున్నాయి. ఇవి అశోకావదానలో కనిపిస్తున్నాయి. అందు మొదటిది తక్షశిల ప్రజలు చేసిన తిరుగుబాటును, దాని నణచటానికై కునాలుని చంపడాన్ని గురించింది. రెండో గాథలో కూడ కునాలుడున్నాడు. సవతితల్లి తిస్సరఖ్ఖా ప్రోద్భలంవల్ల కునాలుని గుడ్లు పీకించిన

గాథ. మూడోది తన పాలన కాలం చివరలో అశోకుడు తనకు మిగిలిన యావదాస్తియైన సగం మామిడిపండును సంఘానికి సమర్పించిన గాథ. సరియైన సాక్ష్యాధారం లేనందున చివరి రెండు గాథలు వర్ణిస్తున్న సంఘటనలు జరిగినవని నిర్ణయించలేము; అసత్యములని తోసిపుచ్చనూలేము. కాని వృద్ధాప్యంలో రాజ్య వ్యవహారాలపై అశోకుని అదుపు తగ్గిపోయినట్లు ఈ గాథలు సూచిస్తున్నాయి. మరణించేనాటికి అశోకుని వయస్సు 65 లేదా 70 సంవత్సరాలనే విషయం మనం మనసులో ఉంచుకోవలె. అయినప్పుడు పూర్తిగా కేంద్రీకృత పాలన విధానంలో అతని అధికారం క్షీణించడంలో ఆశ్చర్యంలేదు. కాని ఈ గాథలవల్ల తెలుస్తున్న ఆస్థానం కుట్రలు మాత్రం చాలా శోచనీయమైన పరిణామం.

అశోకావదానలోనే కాక మరొక గ్రంథంలో సయితం ఇటువంటి గాథలే ఉన్నాయి. వీటివల్ల పై సంఘటనలపై కొత్త వెలుగు ప్రసరిస్తున్నది. సాధారణంగా చరిత్రకారు లీఆధారాన్ని అలక్ష్యం చేస్తున్నారు. కాని అశోకుని మరణానంతర సంఘటనల కీసాక్ష్యం చాల ముఖ్యమైనదని మా అభిప్రాయం. టోకియో త్రిపిటకానికి చైనాప్రతి నుండి మనకు ప్రస్తుతమైన కథాభాగాన్ని ప్రిజులుస్కీ పండితుడు అనువదిస్తూ ఆ కథనాన్ని కునాలసూత్ర అంటూ ప్రస్తావించినాడు. గాంధార, కాశ్మీర ప్రాంతాలలో ఈ కునాల సూత్ర ప్రథమంగా తయారైందని అతని వాదన. కేవలం స్థానిక దృష్టితోనే బౌద్ధ ఐతిహాసికులు అనేక సంప్రదాయాలు కల్పించినారు. వాటికి అనుగుణంగా చెప్పి తీరవలె అనే ధోరణితోగాక స్వతంత్రంగా చెప్పిన గాథ కాబట్టి కునాల సూత్ర చాల ముఖ్యమైంది. ఈ సూత్ర రచయితలు అశోకుని స్వభావాన్ని ఏదో ఒక ప్రత్యేక పద్ధతిలో వర్ణించాలనే దృష్టితో వ్రాయలేదు. స్థానిక సంప్రదాయాన్ననుసరించి గాథలను యధాతథంగా వ్రాసినారు.

ఈ మూలగాథనుబట్టి ప్రజల తిరుగుబాటు జరగడంవల్ల కునాలుడు తక్షశిలకు రాలేదు. గాంధారరాజు మరణానంతరం అచటి ప్రజలు అశోకుని పాలన క్రిందకి రావాలని కాంక్షించినాడు. వారిని పాలించడానికై కునాలుడు తక్షశిల వెళ్ళినాడు. అతని సామర్థ్యాన్ని గుర్తించి అశోకుడు తన సామ్రాజ్యాన్ని విభజించి సింధునది మొదలు చైనా సరిహద్దుల పర్యంతము కునాలుని పాలనలో ఉంచడానికి నిర్ణయించినాడు. ఖోటాన్, కాశ్మీర్, గాంధార రాజ్యాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. బాక్ట్రియన్ గ్రీకులు బాధలు భరించలేక గాంధార ప్రజలు మౌర్యుల రక్షణ వర్ణించి ఉండవచ్చు. అశోకుని కాలంలోనే బాక్ట్రియాలో సెల్యూకిడ్ వంశానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. దీనికి మొదటి డియోడటస్, రెండో డియోడరస్‌లు నాయకులు. తరువాతి మౌర్యుల కాలంలో బాక్ట్రియాలో మూడో యాంటియోకస్‌ను ప్రతిఘటించి మొదటి యూధిడెమస్ విజృంభించినాడు. నాటికే మౌర్య సామ్రాజ్యం త్వరితగతిని విచ్ఛిన్నమౌతూ ఉంది. అందుచేత మౌర్య సామ్రాజ్యపు ఉత్తర

సీమలపై దండెత్తటానికి అది మంచి తరుణమని డియోడొరస్ గమనించినాడు. సైనికంగా, రాజకీయంగా సామ్రాజ్య శ్రేయస్సుకు వాయవ్య సరిహద్దుల పరిరక్షణ అత్యవసరమని అశోకుడు గుర్తించినాడు. గాంధార నుండి మ్లేచ్ఛులను జలౌకుడు పారదోలినట్లు చెబుతున్న రాజతరంగిణి ఈ అంశాన్ని బలపరుస్తున్నది. పరిపాలనలో కునాలుని విజయం సామ్రాజ్యాన్ని విభజించాలనే భావం అశోకునకు కలిగించింది. సామ్రాజ్య విభజన జరుగుతుందనే భయంతోనే తిస్సరఖ్ఖా కునాలకునకు హాని తలపెట్టి ఉంటుంది.

కునాలుని అంధునిగా చేసిన గాథను కునాలసూత్ర పునశ్చరణ చేస్తూ భిక్షుఘోష అతని కంటి చూపును పునరుద్ధరించిన మరొక గాథను కూడా ప్రస్తావిస్తూ ఉంది. కంటిచూపు వచ్చిన తరువాత కునాలుడు బౌద్ధం స్వీకరించినాడని వేరే చెప్పవలసిన పనిలేదు. కునాలసూత్ర మొదట్లోనే కునాలుడు బౌద్ధమత పోషకుడని ఉంది. ఇటువంటి అసంబద్ధాలవల్ల ఇది చాలవరకు కట్టుకథ అని తోస్తుంది.

అశోకుని ప్రధాని యశుని ప్రస్తావన ఈ కథలో చాల ఆసక్తిదాయకమైన అంశం. యశుడు దుర్మార్గుడు. ధర్మాత్ముడైన బౌద్ధ వృద్ధులలో యశుడొకడని అశోకావదాన ప్రస్తావిస్తున్నది. కాని కునాలసూత్ర అతణ్ణి లౌకిక బౌద్ధుడుగా వర్ణించి అతనికి అనేక పాపకార్యాలను అంటగట్టుతున్నది. అంతేగాక పుణ్య చరిత్రుడైన బౌద్ధ వృద్ధుడు సుమనునకు అతడు విరోధి. అశోకావదానలో కూడ దుష్టబుద్ధి అయిన మంత్రి సలహా ప్రకారమే అశోకుని వారసుడు అశోకుడు బౌద్ధ భిక్షువులకు రాజ ధనాగారం నుండి చేస్తున్న దాన ధర్మాలను ఆపివేసినట్లున్నది. యశుడీ మంత్రులలోని వాడుగా కన్పిస్తున్నాడు. అశోకునకు ధనం అందుబాటులో లేకుండా చేయటానికి వారసుడైన సంప్రతిని ప్రోత్సహించినందువల్ల యశుని ప్రభావం చాల బలమైనదిగా కనిపిస్తుంది. యశుని పేరుని పోలిన పేరు మరొక సందర్భంలో కనిపిస్తుంది. విష్ణుపురాణం ప్రకారం అశోకుని వారసుడు సుయశ. అతని అనంతరం కుమారుడైన దశరథుడు సింహాసన మెక్కినాడు. కాని సుయశ అశోకుని కుమారుడని, మరే ఇతర ఆధారంలోనూ ప్రస్తావన లేదు. అందుచేత సుయశ అశోకుని ముఖ్య మంత్రులలో ఒకడై ఉండవచ్చు. అశోకుని మరణానంతరం దశరథుడు సింహాసన మదిష్టించడానికి అతడే కారణమై ఉండవచ్చు. పురాణ కథనంలో ఏదో పొరపాటు జరిగి అశోకుని కుమారుడు సుయశ అని వర్ణించడమైంది.

దివ్యావదాన గాథ ఆధారంగా అశోకుడు సింహాసన పరిత్యాగం చేసి బౌద్ధ భిక్షువైనాడనే వాదం ఉంది. సింహాసన మాక్రమించడానికి అశోకుడు చేసిన ప్రయత్నాలను బిందుసారుని మంత్రి అయిన రాధాగుప్తుడు బలపరచినాడు. కాని తన రాజ్యకాలం చివరలో అశోకుడు ప్రజాభిమానాన్ని కోల్పోవడంతో రాధాగుప్తుడే బలవంతంగా అశోకుని రాజ్య త్యాగం

చేయించి తానే సింహాసనమెక్కడానికి ప్రయత్నించినాడట. ఈ గాథ చాల అనుమానాస్పదం. బిందుసార అశోక చక్రవర్తుల రాజ్యపాలన కాలం అరవై సంవత్సరాలు పైగా ఉంది. ఇంతకాలం రాధాగుప్తుడు బలవంతుడై ఉన్నాడనడం విశ్వాసయోగ్యం కాదు. ఇతర గ్రంథాలేవీ ఈ గాథను ప్రస్తావించడం లేదు. నీతిబోధకు మాత్రమేగాక పెక్కు ఇతర గాథలను సృష్టించడానికి కూడా వస్తువును సమకూర్చే ఇంత చక్కని గాథను బౌద్ధ ఐతిహాసికులు అలక్ష్యం చేసేవారు కాదు.

కునాలుని కుమారుడైన సంప్రతి అశోకుని ఉత్తరాధికారిగా అశోకావదానలోని అర్ధ చూతఫల గాథ పేర్కొంటున్నది. కాని మత్స్య విష్ణు పురాణాలు అశోకుని ఉత్తరాధికారిగా దశరథుని పేర్కొంటున్నాయి. నాగార్జున కొండలోని దశరథుని శాసనాలు అశోక దశరథుల కాల సాన్నిహిత్యాన్ని సూచిస్తున్నట్లు పైన పరిశీలించాము. కాబట్టి అశోకుని మరణానికి ఇంచుక పూర్వం లేదా మరణ కాలంలో మౌర్య సామ్రాజ్యం విభాజ్యమైనదని మా అభిప్రాయము. పశ్చిమ భాగం అంటే కాశ్మీర గాంధారలతో కూడిన వాయవ్య రాష్ట్రాన్ని కునాలుడు పాలింపసాగినాడు. తూర్పుభాగం అశోకుని పౌత్రుడైన దశరథునకు మిగిలింది. క్రమంగా కునాలుని రాజ్యం సామ్రాజ్య పశ్చిమ సీమలన్నిటా విస్తరించింది.

అశోకుని అనంతరం సింహాసనాధికారి సంప్రతి అని దివ్యావదాన పేర్కొంటున్నది. ఈ వాక్యానికి అర్థం సాధించవచ్చు. దశరథునివలె సంప్రతి సయితం అశోకునకు పౌత్రుడే. దశరథుని అనంతరం సంప్రతియే పాటలీపుత్ర సింహాసనం అధిష్ఠించినాడు. అందుచే దివ్యావదాన పొరపడటానికి అవకాశం ఉంది. దశరథునికంటె బౌద్ధమతం పట్ల సంప్రతి ఎక్కువ సానుభూతిపరుడైతే బౌద్ధ గ్రంథాలు సంప్రతిని అశోకున కుత్తరాధికారిగా పేర్కొనడానికి అవకాశం ఉంది.

దశరథుని కథ చాల గోప్యంగా ఉంది. సింహాసన మాక్రమించినపుడాతడు సుమారిరువది సంవత్సరాల యువకుడు. మంత్రులాతణ్ణి బలపరచినారు. దశరథుని కుమారుడు సంప్రతి అని మత్స్యపురాణం చెపుతుంది. ఇది తప్పు. సంప్రతి, దశరథులన్నదమ్ముల బిడ్డలు. సుయశ మంత్రి పేరు కాదని, కునాలునకు నామాంతరమని నిరూపించగలిగినపుడు దశరథ సంప్రతులు సోదరులు కావచ్చు. పురాణాల ప్రకారం దశరథుడు ఎనిమిదేండ్లు రాజ్యం చేసినాడు. కాబట్టి అతని మరణ సమయానికి ప్రాతినిధ్య పాలన ఆవశ్యకత లేకుండ, రాజ్యభారం వహించగల ఉత్తరాధికారి లేడు. ఇవే సాక్ష్యాధారాలు కునాలుడు సయితం ఎనిమిదేండ్లే పాలించినాడని చెబుతున్నాయి. దీన్నిబట్టి కునాల దశరథు లించుమించు ఒకే సమయంలో మరణించి ఉంటారు. అందుచేత పశ్చిమ ప్రాంతంలో

రాజ్యం చేస్తున్న సంప్రతి పాటలీపుత్ర సింహాసనాన్ని సాధించి ఉండవచ్చు. ఇది క్రీ. పూ. 223 లో జరిగింది.

ఏమైనప్పటికీ నాటికే సామ్రాజ్యం విచ్ఛిన్నం కాసాగింది. సంప్రతి ఉజ్జయిని, పాటలీపుత్ర నగరాలనుండి పాలించినట్లు జైనగ్రంథాలు చెబుతున్నాయి. కాబట్టి పశ్చిమప్రాంత రాజధాని ఉత్తర భూములనుండి ఉజ్జయినికి మారినదని ఈ గ్రంథాల సూచన. తరువాతి దశాబ్దంలో సిరియారాజు మూడో యాంటియోకస్‌కు బాక్ట్రియా నేలుతున్న యూథిడెమస్‌కు పోరాటం జరిగింది. ఈ పోరాటంవల్ల బాక్ట్రియా బలవత్తర రాజ్యంగా విజృంభించి వాయవ్య భారతానికి ప్రమాదంగా తయారయింది. పాటలీపుత్రాన్ని ఆక్రమించడంలో నిమగ్నుడై ఉన్న సమయం సింధునది కావలనున్న చిన్న చిన్న రాజ్యాలు సామ్రాజ్యం నుండి విడివడడానికి మంచి అవకాశం కల్పించింది. క్రమంగా మగధపైనే దృష్టి కేంద్రీకృతమై మౌర్య వంశ ప్రధానశాఖ పాటలీపుత్రంలోనే జీవిత శేషం గడపవలసి వచ్చింది. వారి అధికారం క్షీణించి సామ్రాజ్యం నుంచి విడివడిపోతున్న దూర ప్రాంతాలను అదుపులో ఉంచలేక పోయినారు. సంప్రతి తొమ్మిది సంవత్సరాల పాలన అనంతరం శాలిశుక పదమూడేండ్లు రాజ్యపాలన సాగించినాడు. గార్గి సంహితను విశ్వసిస్తే శాలిశుక కాలంలో మౌర్యుల అధికారం మరింత క్షీణించినట్లు కనిపిస్తుంది.

ఈ మధ్య వాయు, బ్రహ్మాండ పురాణాలలో మూడు పేర్లు కనిపిస్తున్నాయి. మరే ఇతర సాక్ష్యాధారాలు వీరిని ప్రస్తావించవు. వీరు బ్రహ్మపాలిత, ఆంద్రపాలిత, దశోనులు. మౌర్యరాజుల పట్టికలలోని పేర్లతో ఏమాత్రం పోలిక లేనందున వీరిని గుర్తించడం చాల కష్టం. పురాణాలు సయితం వీరి మధ్య సంబంధాలను గురించి స్పష్టంగా చెప్పడం లేదు. బంధుపాలితుని దాయాది ఇంద్రపాలితుడని చెబుతున్నాయి. దాయాది అంటే సోదరుడని ఉత్తరాధికారి అని చెప్పవచ్చు. ఈ చరిత్రను ఇటీవల పరిశీలించిన ఒక రచయిత బంధుపాలిత అనేది వ్యక్తిపేరు కాదని, ఆ మాటకు బంధువులచేత రక్షితుడని మాత్రమే అర్థం చెప్పవలెనని, వీరిలో ఒకరికాలంలో ప్రాతినిధ్య పరిపాలన వంటిది కనిపిస్తుందని సూచించినాడు. ఈ ముగ్గురు మౌర్య రాజవంశంలోని వారేనని, సామ్రాజ్యంలో పాటలీపుత్రం వెలుపల బహుశా ఉజ్జయినిలో రాజులై మౌర్యులకు సామంతులుగా రాజ్యపాలన సాగించి ఉంటారని మా సూచన. శాలిశుకునకు ఉత్తరాధికారిగా విష్ణుపురాణం సోమవర్మను పేర్కొంటున్నది. ఇది వాయు పురాణం పేర్కొంటున్న దేవవర్మ అనే పేరుతో సరిపోతుంది. దశోనుని అనంతరం దేవవర్మ ఏడేండ్లు పాలించినాడట. ఇచ్చట వాయు పురాణం స్థానిక సంప్రదాయాన్ని వీడి, పాటలీపుత్రాన్ని పాలించిన రాజులను పేర్కొన్నట్లు కనిపిస్తుంది. చివరి ఇద్దరు మౌర్య రాజులను గురించి

వాయు, మత్స్య, విష్ణుపురాణాల మధ్య ఏకాభిప్రాయం ఉంది. వీరు శతధన్వ లేదా శతధనుస్, బృహద్రథులు, శతధన్వుడు ఎనిమిదేండ్లు పాలించినాడు. చివరకు బృహద్రథుడు ఏడేండ్లు పాలించినాడు. అనంతరం పుష్యమిత్రుడాతణ్ణి వధించినాడు.

చివరకు క్రింది విధంగా అనంతర మౌర్యుల చరిత్రను పునర్నిర్మిస్తున్నాము. క్రీ.పూ. 233–232 లో అశోకుని మరణానంతరం మౌర్య సామ్రాజ్యం తూర్పు పశ్చిమ విభాగాలుగా విడిపోయింది. పశ్చిమ విభాగాన్ని కునాలుడు, తరువాత స్వల్పకాలంపాటు సంప్రతి పాలించినారు. ఇందులో దక్షిణ ప్రాంతాన్ని కొంతకాలం తరువాత బంధుపాలిత, ఇంద్రపాలిత, దశోనులు పాలించి ఉండవచ్చు. సామ్రాజ్య అంతర్భాగమైన దక్షిణాపథ ఉత్తర ప్రాంతంలో ఆంధ్రులవల్ల ప్రమాదం ఏర్పడినట్లుగానే పశ్చిమ విభాగానికి వాయవ్య ప్రాంతం నుండి బాక్ట్రియన్ గ్రీకుల ప్రమాదం ఏర్పడింది.

అశోకుని మరణానంతరం సామ్రాజ్య తూర్పు విభాగంలో పాటలీపుత్రం నుండి పాలించిన ప్రధాన మౌర్యవంశ శాఖలో వారసత్వం క్రింది విధంగా సంక్రమించింది.

| **రాజు** | **పాలనా సంవత్సరాలు** |
|---|---|
| దశరథ | 8 |
| సంప్రతి | 9 |
| శాలిశుక | 13 |
| దేవవర్మ | 7 |
| శతధన్వ | 8 |
| బృహద్రథ | 7 |

ఈ విధంగా 52 సంవత్సరాలు వస్తున్నది. మొదటి ముగ్గురు మౌర్యుల 85 సంవత్సరాలతో పై సంఖ్యను చేర్చినప్పుడు మౌర్యవంశానికి పూర్తికాలం 137 సంవత్సరాలు వస్తున్నది. ఇందలి సంవత్సరాలు పూర్తిగా యధార్థాలు కావు. పురాణాలు రాజ్యం చేసిన రాజుల పాలన సంవత్సరాలపట్ల మాత్రమే శ్రద్ధ వహించి అరాజక పరిస్థితులను ప్రస్తావించవు. అందుచేత పై సంఖ్యలో ఒకటి రెండు సంవత్సరాల వ్యత్యాసాన్ని అంగీకరించవచ్చు. అశోకుడు క్రీ. పూ. 233–232లో మరణించినట్లు భావిస్తే మౌర్యవంశం క్రీ. పూ. 181–180లో అస్తమించిందని చెప్పవచ్చు.

ఏడో అధ్యాయము

# మౌర్యవంశ క్షీణత

మౌర్యవంశ చరిత్రను పరిశీలించడం వారి క్షీణతకు ఉన్న కారణాల పరిశోధనకు దారితీస్తుంది. అశోకుని మరణానంతరం మౌర్యవంశం చిన్నాభిన్నం కావడం చాలా ఆశ్చర్యకరం. సామ్రాజ్యాలు క్షీణించిన ఉదాహరణలు చాల ఉన్నాయి. కాని వాటిలో రాజకీయ క్షయానికి చాల ముందుగానే పతనోన్ముఖ లక్షణాలు కన్పించేవి. మౌర్యుల విషయంలో ఆ విధంగా జరుగలేదు. వెనుకటి అధ్యాయంలో పరిశీలించినట్లు ఒక అర్ధ శతాబ్ద కాలంలోనే మౌర్య వంశ పతనం పూర్తి అయింది.

అశోకుని అనంతరం దుర్భలులైన రాజులు వరుసగా సింహాసనానికి రావడం బయటికి కనిపించే కారణాలలో ఒకటి. సామ్రాజ్యాన్ని రెండుగా విభజించడం మరొక అతి సన్నిహిత కారణం. తూర్పు ప్రాంతానికి దశరధుడు పశ్చిమ ప్రాంతానికి కునాలుడు రాజుగా సామ్రాజ్యాన్ని విభజించడం జరిగింది. సామ్రాజ్య విభజనే జరుగనిచో వాయవ్య ప్రాంతంపై గ్రీకుదాడిని కొంతకాలం అటకాయించి మౌర్యులు తమ పూర్వ ఆధిపత్యాన్ని కొనసాగించగలిగి ఉండేవారు. సామ్రాజ్య విభజన పాలన శాఖలను కూడ బలహీన పరచింది. మౌర్య రాజకీయ పాలనా వ్యవస్థను మొదటి ముగ్గురు మౌర్య చక్రవర్తులు నిర్మించినారు.



సామ్రాజ్యం నలుమూలల ఆ వ్యవస్థ అల్లుకుపోయింది. అది సక్రమంగా పనిచేయడానికి కేంద్ర పర్యవేక్షణ అవసరం. సామ్రాజ్య విభజనానంతరం పాటలీపుత్రం రాజధానిగా ఉండి, మౌర్య పాలనా వ్యవస్థ కొనసాగడం వల్ల తూర్పు విభాగానికి మంచి అవకాశముంది. పశ్చిమ విభాగానికి కొత్త సమస్య ఏర్పడింది. వాయవ్య రాష్ట్రానికి తక్షశిల రాజధాని. ఆ రాష్ట్ర పాలననే చురుకుగా విస్తృతం చేసి సామ్రాజ్య పాలనా వ్యవస్థకు సన్నిహితంగా ఉండేటట్లు రూపొందించవలసి వచ్చింది. ఈ పరిణామాలు జరిగే సమయంలోనే వాయవ్య ప్రాంతంపై గ్రీకు దాడులు ప్రారంభమైనాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రీకుదాడుల నరికట్టలేక పోయింది.

అశోకుని తరువాత వచ్చిన రాజులు గుణంలో అతనికి పూర్తిగా భిన్నమైనవారు. అశోకుడవలంభించిన విధానాలు సంప్రదాయ సిద్ధమైనవి కావు. అందుకు మౌర్యుల నవ సామ్రాజ్యవాదము, ప్రభుత్వాన్ని శాసించిన అశోకుని భావాలు కారణాలు. అమలులో ఉన్న విధానాన్ని కొనసాగించడమా లేదా సాంప్రదాయక పద్ధతికి మారడమా అనేది అశోకుని తరువాతి వారికి సమస్యగా పరిణమించింది. సామ్రాజ్యం సమైక్యంగా కొనసాగి అశోకుని విధానాలనే ఆతని తరువాతివారు అనుసరించినట్లయితే భారతదేశ భావి రాజకీయాలలో ఆసక్తికరమైన పరిణామాలు జరిగి ఉండేవి. క్రీ.పూ. మూడోశతాబ్దిలో భారతదేశానికి ధమ్మం ఎందుకు అవసరమైందో అశోకుని తరువాతివారు గ్రహించలేదు. అందుచే వారా విధానాన్ని కొనసాగించడం అసంభవం. అశోకుడు భారతదేశ పరిస్థితులను సమూలంగా అవగాహన చేసికొన్నాడు. అంతటి అవగాహన తరువాతి మౌర్యులలో ఒక్కరికైన ఉన్నదా? అనేది వివాదాగ్రస్తమైన అంశం. అయితే దశరథుని శాసనాలనుబట్టి అశోకుని విధానాలను ఆతడు గ్రహించి బలపరచినట్లు తెలుస్తుంది. కాని ఆతడు యౌవనంలో ఉన్నాడు. ఆ విధానాన్ని పెంపొందించటానికి అతని వయస్సు ఆటంకమైంది. సాక్ష్యాధారాలను బట్టి మౌర్యరాజుల పట్టికల పేర్లలో పెద్ద వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. దీన్నిబట్టి రాజబంధువులు, దాయాదులు సింహాసనంపై తమ తమ హక్కులను చాటినట్లు కనిపిస్తున్నది. లేదా రాష్ట్రాలలో స్వతంత్రించడం జరిగింది. నామాంతరాలు, బిరుదులు అనే వాదంతో పేర్లలోని వ్యత్యాసాలను అన్వయం చెప్పే ప్రయత్నాలు జరిగినవిగాని, వారి వ్యాఖ్యానాలు సమ్మతంగా లేవు. బిరుదులలో చాల భాగం ధ్వనినిబట్టి మనకు పరిచయమున్న రాజుల పేర్లకు సంబంధం లేదు. ఏభై సంవత్సరాల స్వల్పకాలంలో పెక్కుమంది రాజులు సింహాసనమెక్కినారు. వీరిలో కొందరు సింహాసన భ్రష్టులు కావడాన్ని ఇది సూచిస్తున్నది.

మౌర్య సామ్రాజ్య క్షీణతకు, అశోకుని విధానానికి ప్రత్యక్ష సంబంధమున్నదంటూ చాలా వ్రాయడం జరిగింది. ఈ ఆరోపణ రెండు ప్రధాన వాదాలపై ఆధారపడింది. అశోకుని బౌద్ధ అనుకూల విధానానికి, ఆతని తరువాతి వారి జైన అనుకూల విధానానికి వ్యతిరేకంగా విజృంభించిన బ్రాహ్మణ ఉద్యమ ఫలితమే పుష్యమిత్రుని విప్లవమని మొదటివాదం. అశోకుని శాంతి విధానం మౌర్య సామ్రాజ్యాన్ని నిర్వీర్యం చేసిందని రెండవ వాదం. హరప్రసాద శాస్త్రి మొదటి వాదాన్ని ఘంటాపథంగా వివరించినాడు. ఈ సమస్యను చాల వరకు క్షుణ్ణంగా రాయచౌధురి పరిశీలించినాడు. ఈ పండితుల ఉభయుల వాదాలను సమీక్షించి, అవసరమైనచోట వ్యాఖ్యానించడానికి ప్రయత్నిస్తాను.

యజ్ఞాధికారం బ్రాహ్మణులది తద్వారా వారు ప్రజలకు, దేవతలకు మధ్యవర్తులయినారు. బ్రాహ్మణుల అధికార ప్రతిష్ఠలు యజ్ఞాలపైనే ఆధారపడినాయి. అందువల్ల జంతుబలులను నిషేధించడం ప్రత్యక్షంగా బ్రాహ్మణులపై దెబ్బతీయడమే అనేది శాస్త్రి వాదన. కాని బ్రాహ్మణ వాఙ్మయం సయితం అహింసపై నొక్కి పెడుతూ కేవలం యజ్ఞాలు మాత్రమే చేస్తూ ఉండటం నిష్ప్రయోజనమని చాటుతున్నందున జంతుబలి నిషేధం బ్రాహ్మణులపట్ల విరోధం వహించడం కాదని రాయ్‌చౌధురి అంటాడు. శాసనం వేసిన ప్రత్యేక స్థలంలోనే జంతువులను వధించరాదని అశోకుడు ఒక శాసనంలో విధించినాడు. అంతేకాక బలులకు ఉద్దేశించినవేకాక ఆహారయోగ్యమైన జంతువులను కూడ కొన్నింటిని వధించరాదని కొన్ని శాసనాలలో వ్రాయించినాడు.

అశోకుడు శూద్రుడు. అందుచే శూద్రుడు విధించినది కావున బ్రాహ్మణులీ శాసనాన్ని గర్హించినారనేది ఈ సమస్యలో మరొక అంశం. మౌర్యులు శూద్రులవడానికి పురాణాలలోని ఒక వాక్యం ఆధారం. నంద వంశాన్ని ప్రస్తావిస్తూ మహా పద్మని ఉత్తరాధికారులైన రాజులందరు శూద్రులని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ వాక్యం మహా పద్మని అనంతర నందరాజులకే పరిమితమని, కాని చోళుంగ, కణ్వవంశాల రాజులను సయితము శూద్రులలో చేర్చవలసి వస్తుందని, కాని శుంగులు బ్రాహ్మణులని స్పష్టంగా తెలుస్తున్నదని రాయ్‌చౌధురి సూచిస్తున్నాడు. మౌర్యులు క్షత్రియులని ఇతర గ్రంథాలు పేర్కొంటున్నాయి.

శాస్త్రి వాదంలోని మరొక అంశం బ్రహ్మగిరి గౌణ శిలా శాసనంలో జంబూద్వీపంలోని దేవతలను గురించి ప్రస్తావిస్తున్న వాక్యంపై ఆధారపడింది. భూదేవతలుగా ప్రజలు పరిగణించే బ్రాహ్మణులు అసత్య దేవతలంటూ అశోకుడు బ్రాహ్మలను దుయ్యబట్టినాడని ఆ వాక్యాన్ని శాస్త్రి వాఖ్యానించినాడు. ఈ వాదం 'అమిస్సా' అనే మాటకు ఉన్న భిన్నమూలపదంపై ఆధారపడి ఉంది. కాని ఈ మాటలు అసత్యదేవతలనుగాక, భూమిపై దేవతలు కలసి తిరగడాన్ని గురించి ప్రస్తావన అని సాధారణంగా అంగీకరిస్తున్నారు.

ధర్మ మహామాత్తులు బ్రాహ్మణుల ప్రతిష్ఠను భగ్నంచేసినారని శాస్త్రివాదము. కాని ధర్మమహామాత్తులలో కొందరు బ్రాహ్మణుల హక్కులను, శ్రేయస్సును రక్షించడానికి ఉద్దేశించిన వారు గావున శాస్త్రి వాదం సబబుకాదని రాయ్‌చౌధురి సూచన. అంతేకాక ధర్మ మహామాత్తుల లక్ష్యం సమాజ శ్రేయస్సు. బ్రాహ్మణుల కార్యకలాపాల కంటె విస్తృత పరిధిగల సాధారణ సమాజశ్రేయస్సు కాని అశోకుని పాలనకాలం చివరలో ధర్మ మహామాత్తులు ప్రజాభిమానాన్ని కోల్పోయినందున. వారిద్వారా అశోకుడు ప్రజాభిప్రాయాన్ని గ్రహించడానికి వీలు లేకపోయింది. క్రమంగా వారి అధికారాలు పెరిగి ప్రభుత్వం మద్దతుతో సమస్త విషయాలలో జోక్యం కల్గించుకుంటూ వారొక వర్గంగా తయారయినారు. ధర్మ మహామాత్తులకు ప్రత్యేకించి రాజాభిమానం ఉన్నందున వారంటే ప్రజాసామాన్యానికి హడలు. వారిని సంతృప్తిపరచడానికి ప్రత్యేక హక్కులివ్వడం జరిగింది. సామాన్య గృహస్థులపైనేకాక, రాజకుటుంబంపై కూడ వారికి పర్యవేక్షణాధికారాలున్నాయి. అనాసక్తులయిన ప్రజలను సయితం ధర్మావలంబులుగా చేయగలిగినారంటే అది కేవలం ప్రోత్సాహం ద్వారా, ప్రచారం ద్వారా సాధించినదికాదు. ప్రశాంతంగా ధర్మాన్ని అనుసరించే వారికంటె తాము ధమ్మాన్ని అనుసరిస్తున్నామని ఎలుగెత్తి చాటి చెప్పే వారికే అధిక గౌరవం లభించేది. ఎంతటి సదభిప్రాయాలతో వ్యవహరించే ఉద్యోగులైనా ధమ్మ మహామాత్తులయినా మానవాతీతులుగా వ్యవహరించగలరని భావించలేము. వీరు తమ దైనందిన విధి నిర్వహణలో అశోకునకు తెలిసినదాని కంటె ఎక్కువ అధికారాలను చలాయించి ఉండవచ్చు. ఈ మహామాత్తుల మతం ధమ్మం. సామ్రాజ్యంలోని దూరప్రాంతాలలో ధర్మానికి వీరు భాష్యకారులయినారు. ఈ పరిస్థితి ఇతర సంస్కృతులలో సయితం కనిపిస్తుంది. క్రైస్తవ చర్చిలో పూజారులే భాష్యకారులు. రాజకీయ విధానాలలో రాయబారులే వ్యాఖ్యాతలు.

న్యాయ విధానంలో అశోకుడు నెలకొల్పిన వ్యవహార సమత, దండ సమతలను తన వాదానికి బలంగా హర ప్రసాదశాస్త్రి సూచిస్తున్నాడు. వీటివల్ల శిక్షల విషయంలో బ్రాహ్మణులు సాధారణంగా అనుభవిస్తున్న ప్రత్యేకహక్కులను నిలిపివేసినాడని శాస్త్రి వాదం. రాయచౌధురి ఈ వాదాన్ని ఖండిస్తున్నాడు. రాయచౌధురితో మేము ఏకీభవిస్తున్నాము. ఈ సమస్యను గురించి నాలుగో అధ్యాయంలో విపులంగా చర్చించినాము. బ్రాహ్మణుల మరణశిక్ష విషయంలోగాని, వాటికిగల ప్రత్యేక హక్కులను గురించిగాని బ్రాహ్మణ వాఙ్మయంలోని ఉల్లేఖనాలలో శాస్త్రి చెబుతున్నంత స్పష్టంగా లేదు. తన శాసనాలలో బ్రాహ్మణులను, శ్రమణులను గౌరవించాలని తరచుగా చేసిన విజ్ఞాపనలు అశోకునకు బ్రాహ్మణ ద్వేషం లేదని సూచిస్తున్నాయి.

శాస్త్రి చివరివాదం పై వాదాలకంటె దుర్బలమైంది. బ్రాహ్మణులకు వ్యతిరేకంగా నిలబడగలిగిన బలవంతుడు అశోకుడు. అందుచే ఆతని రాజ్యం సాఫీగానే సాగింది. కాని ఆతని ఉత్తరాధికారులకు, బ్రాహ్మణులకు మధ్య సంఘర్షణ ప్రారంభమై పుష్యమిత్రుడు అధికారం హస్తగతం చేసుకొనేవరకు సాగింది. సుప్రసిద్ధ బ్రాహ్మణ విప్లవానికి పుష్యమిత్రుడు ప్రతినిధి అని శాస్త్రి వాదం. కాని రాయ్‌చౌధురి వివరించినట్లు ఉపలభ్యమైన ఆధారాలు ఈ అభిప్రాయాలను సమర్థించడంలేదు. అశోకుని ఉత్తరాధికారులలో కనీసం ఒక్కడైనా బౌద్ధ విరోధి, బ్రాహ్మణ మతాభిమాని ఉన్నట్లు రాజతరంగిణి నుండి గ్రహిస్తున్నాము. పుష్యమిత్రుడు తీవ్ర బౌద్ధ వ్యతిరేకి అనే అభిప్రాయం తరుచు వెలిబుచ్చుతూ ఉంటారు. కాని పురావస్తు సాక్ష్యం అందుకు వ్యతిరేకంగా ఉంది. దుష్కృత్యాల ద్వారానైనా తనకు పేరు రావడమే పుష్యమిత్రుని ఆశయమంటూ బౌద్ధ వాఙ్మయం వ్రాస్తున్నది. 84,000 స్థూపాలు నిర్మించడం ద్వారా అశోకుడు కీర్తిమంతుడైనాడని ప్రజలను ప్రశ్నించి పుష్యమిత్రుడు తెలుసుకొన్నాడట. అంతటితో తానా స్థూపాలను ధ్వంసం చేయడం ద్వారా ప్రసిద్ధి వహించాలని సంకల్పించినాడని బౌద్ధ వాఙ్మయ కథనం. కాని ప్రస్తుత ఆవరణలోని సాంచీస్థూప విస్తరణ శుంగయుగానికి చెందినట్లు పురావస్తు పరిశీలన ద్వారా తెలుస్తున్నది. అయితే స్థూప సమీపంలోని అశోక స్తంభాన్ని బుద్ధిపూర్వకంగా విధ్వంసం చేసినట్లు కన్పిస్తున్నది. అది శుంగ యుగానంతరం జరిగి ఉండవచ్చు. అశోకావదానలో పుష్యమిత్రుడు మౌర్యులపై దాడి జరిపినట్లున్నది. అది కేవలం బౌద్ధుల పాఠాంతరం. రాజాస్థానంలో బౌద్ధ సంస్థలపైన నిర్మాణాలపైన శ్రద్ధ తగ్గి ఉంటుంది. అశోకావదాన బౌద్ధానికి సంబంధించిన ఆధారము. కాబట్టి అందులో బౌద్ధ విరోధుల దౌష్ట్యాన్ని అతిశయోక్తులతో వర్ణించడం సహజం.

మౌర్య సామ్రాజ్యం చాల సంకుచితమై తరువాతి రాజులు తమ్ముతామే రక్షించుకోలేని స్థితిలో ఉన్న సమయంలో బృహద్రధుని సింహాసన భ్రష్టుని చేయడానికి పెద్ద విప్లవం అనవసరం. సైనిక పర్యవేక్షణ సందర్భంలో బృహద్రధుని పుష్యమిత్రుడు వధించినట్లు తెలుస్తుంది. ఈ సంఘటన ఒక పెద్ద విప్లవాన్నిగాక అంతఃపుర కుట్రను మాత్రం సూచిస్తున్నది. సమర్థమైన ప్రభుత్వాన్ని వాగ్దానం చేసే ఎవరికైనా ప్రభువుగా అంగీకరించడానికి క్రింది ఉద్యోగులు సిద్ధమైన దుస్థితికి ప్రభుత్వ యంత్రాంగం దిగజారి పోయింది. అది బ్రాహ్మణ విప్లవమే అయినట్లయితే పుష్యమిత్రునకు పొరుగు రాజ్యాల సహాయం లభ్యమయ్యేది. ముఖ్యంగా వాయవ్య ప్రాంతంలో శుభగసేనుని వారసులు ఆతనికి తోడ్పడేవారు.

మౌర్యయుగంలో జరిగిన బౌద్ధమత ప్రచారంవల్ల బ్రాహ్మణ మత సాంఘిక వ్యవస్థకు భంగం వాటిల్లిందని ఒక వాదం. కాని ఇది కేవలం బౌద్ధమత ప్రచార ఫలితమే అనలేము. 'మంగళము' లు మొదలైన పర్వాలను ఆపుచేయడం వల్ల కూడ పై ఫలితం కలిగి ఉండవచ్చు. కాని అది మౌర్య సామ్రాజ్యాన్ని బలహీన పరచేటంత పెద్ద ఫలితమై ఉండదు. బౌద్ధ మత ప్రచారం కొత్త ఆలోచనా పద్ధతులను ప్రారంభించి ఉండవచ్చును. కాని సాంఘిక ప్రవర్తన యథాతథంగానే ఉండి ఉంటుంది.

దృఢ సంకల్పంతో అశోకుడు అహింసా విధానాన్ని అవలంబించినందున సైనికంగా జాతి నిర్వీర్యమై గ్రీకు దాడులను ఎదిరించలేక పోయిందని రాయ్‌చౌధురి ఆరోపణ. అశోకుని మరణానంతరం అనతి కాలంలోనే సామ్రాజ్యం విచ్ఛిన్న మవడానికి అశోకుని విధానాలే ప్రత్యక్ష కారణమని అతడంటాడు. అహింసా విధానంవల్ల సామ్రాజ్య సైనిక బలం క్షీణించడమేగాక, రాజాధికారం సన్నగిల్లి రాష్ట్రాలలో అధికారుల దౌర్జన్యాలకు దోవ తీసింది. దీని ఫలితంగా బౌద్ధ వాఙ్మయం పేర్కొన్న తిరుగుబాటులు జరిగినాయి. క్లుప్తంగా చెప్పాలంటే అశోకుని శాంతివిధానంలో సామ్రాజ్యపాలన యాంత్రాంగం పూర్తిగా అవ్యవస్థితమైందని రాయ్‌చౌధురి ఆరోపణ. శాసనాలనుబట్టి ఆలోచిస్తే అశోకుని విధానాలపై ఈ తీర్మానము అంగీకార యోగ్యం కాదు.

అశోకుని ప్రభుత్వ స్వభావం సంప్రదాయానికి విరుద్ధమైనదే. కాని అందుకు కారణం అతడు అహింసా సిద్ధాంతాన్ని హృదయపూర్వకంగా అంగీకరించడం కాదు. అహింస పరస్పర గౌరవాలు సమాజానికి లాభదాయకములని వ్యక్తిగతంగా విశ్వసించడంలోను అట్టి ప్రవర్తనను అలవరచుకొమ్మని ప్రజలకు విజ్ఞప్తి చేయడంలోను రాజుగా ఆ సిద్ధాంత ప్రచారాన్ని విరమించక పోవడంలోను సంప్రదాయానికి వైరుధ్యం కనిపిస్తుంది. సాధ్యమైనంతవరకు ఆ సూత్రాలకు అనుగుణంగానే అశోకుడు తనపాలనను రూపొందించినాడు. ఏమైనా అశోకుని శాంతి విధాన యథార్థ స్వరూపం గ్రహించకుండా చరిత్రకారులు గోరంతలు కొండంతలు చేసినారు. ఆహారం నిమిత్తంగాని, బలులుగా గాని, జంతువులను వధించడాన్ని అశోకుడు గర్హించినాడు. జంతువుల వధ కూడదని, అది సాధ్యం కానిచోట జంతువులపట్ల దయ వహించవలెనని శాసనాలన్నింటిలో చెబుతూ వచ్చినాడు. అయినప్పటికీ అంతఃపురంలో కూడ ఆహారార్థం జంతువులను వధిస్తూనే ఉన్నారు. కాని వీటి సంఖ్య చాలవరకు తగ్గింది. ఎంతగా ఆశించినప్పటికీ అవధ్యములని ప్రకటించిన జాబితాలో ఆహారానికై ప్రధానంగా ఉపయోగించే జంతువులను చేర్చడం జరుగలేదు. సాధ్యమైనంతవరకు మాంసాహారాన్ని మానడం జరిగింది గాని పూర్తి విరమణ

జరగలేదు. అంతఃపురంలో జంతువులను వధించే ఆచారాన్ని పూర్తిగా నిషేధించినాడనడానికి నిదర్శనం లేదు.

రాయ్‌చౌదురి చెప్పినంతగా అశోకుడు శాంతివాది అయినట్లయితే మరణశిక్షను రద్దు చేసేవాడే. ఒకే ఒక విధమైన మినహాయింపుతో మరణశిక్ష అశోకుని పాలనా కాలమంతా అమలు జరిగింది. మరణదండన విధించిన వారికి మూడురోజుల విరామం ఇవ్వడమొక్కటే ఆ మినహాయింపు. అది ఇరవై ఏడో సంవత్సరంలో ఇవ్వడం జరిగింది. అశోకుని సంతతివారు కేవలం సాత్త్వికాహారానికి అలవాటుపడినందున సైనికంగా దుర్బలులైనారని, నిత్యం ధర్మఘోషనే వింటూ, భేరీఘోషను మరచినారని రాయ్‌చౌధురి వాదిస్తాడు.

అశోకుడు తన సైన్యాలను రద్దుచేసి అక్షరతః సూత్రాలపై ప్రభుత్వం నడిపినాడని పై వాద సారాంశం. కాని ఇందుకు శాసనాలలో ఏ మాత్రం సూచన కానరాదు. అశోకుడు జరిపింది ఒకే ఒక దండయాత్ర. కాని అతడు చండశాసనుడనే అభిప్రాయమే శాసనాలనుండి లభిస్తున్నది. దోషులను క్షమించడానికి అశోకుడు సర్వదా సంసిద్ధమే. కాని క్షమార్హమైనదే క్షంతవ్యం. ఆటవిక తెగల కిచ్చిన సందేశంలో తన విధానాన్ని మరింత స్పష్టంగా వివరించినాడు. కళింగయుద్ధం తరువాత అశోకుడు పశ్చాత్తప్తుడైన మాట నిజమే. కాని తన బలపరాక్రమాలను గురించి ఆటవిక జాతులను చాల కఠినంగా హెచ్చరించినాడు. తప్పులు చేయనిచో వారికి ప్రాణాపాయం ఉండదని స్పష్టం చేసినాడు. తన సంతతివారిని దేశాక్రమణలను మానుడని అశోకుడు కోరినాడన్న రాయ్‌చౌధురి వాదానికి వ్యతిరేకంగా ఆ శాసనమే సాక్ష్యమిస్తున్నది. ఇకముందు దాడులు, రాజ్యాక్రమణలు అవసరం లేదని తాను విశ్వసిస్తున్నట్లు అశోకుడు చెప్పినాడు. మౌర్య సామ్రాజ్యం ఇంచుమించు భారత ఉపఖండమంతటా విస్తరించినందున అతని విశ్వాసం హేతుబద్ధమైనదే. రాజ్యాక్రమణ జరుపవలసి వస్తే దయతో వ్యవహరించవలెనని, శిక్షల కాఠిన్యాన్ని తగ్గించవలెనని అశోకుడు కోరినాడు.

సామ్రాజ్యంలోని ప్రశాంత పరిస్థితులవల్ల, సరిహద్దులు భద్రంగా ఉన్నందున అశోకుడు శాంతియుత విధానాలను అనుసరించ గలిగినాడు. సామ్రాజ్యానికి ఇబ్బంది కలిగించే ఒకే ఒక ప్రాంతం కళింగ. దాన్ని పాలనకాలం మొదట్లోనే జయించినారు. దక్షిణదేశాన్ని జయించడం మౌర్యుల సైన్యాలకు కష్ట సాధ్యంకాదు. కాని ఆ ప్రాంతాన్ని జయించవలసిన అవసరం లేదు. ఇక యాంటియోకస్ పాలించే సిరియా సామ్రాజ్యం ఒక్కటే మౌర్య సామ్రాజ్యానికి ప్రబలమైన ప్రత్యర్థి కాని హిందూకుష్ పర్వతాల కావలి ప్రాంతాలను

జయించే ప్రయత్నం వల్ల పర్వత మయాలైన మరుభూములలో దండయాత్రల ప్రమాదాలకు సైన్యాలు గురి అవుతాయి. అట్టి వృధా ప్రయత్నం కంటె మూర్ఖత్వం మరొకటి ఉండదు. ఆ రాజ్యాలను జయించే విధానంకంటె యాంటియోకస్ మైత్రి వహించడమే ఉచితమైనది. పైన పేర్కొన్నట్లు సరిహద్దు జాతుల నుండి మాత్రమే సామ్రాజ్యానికి ప్రమాదం ఉంది. ఈ జాతులు మౌర్య ఉద్యోగులను బాధించి ఉండవచ్చు. వారి పట్ల అశోకుడు నిర్ధాక్షిణ్యంగానే ఉన్నాడు.

అశోకుడు విజయయాత్ర లెక్కువగా సాగించలేదన్న మాట నిజమే. ఈ అంశం పిత్రార్జితమైన సామ్రాజ్యాన్ని యధాతథంగా ఉంచాలని అశోకుడాశించినట్లు సూచించదు. అశోకుడు గొప్ప విజిగీషు వనడంలో సందేహంలేదు. అతడు శాంతి కాముకుడే అయితే పైన సూచించినట్లు కళింగను స్వతంత్ర రాజ్యంగా పునరుద్ధరించకపోవడం చాల విచిత్రం. చక్రవర్తిగా అతడు క్రియాశీలి. కళింగను జయించడంలో అతనికి నైతిక సందేహాలు లేవు. అంతేకాక తన పశ్చాత్తాపాన్ని కళింగలో బహిరంగంగా ప్రకటించలేదు. అట్టి ప్రకటన చేయడం రాజకీయంగా యుక్తియుక్తం కాదని గుర్తించినాడు. మధ్యధరా సముద్రం తూర్పు ప్రాంతంలోని గ్రీకు రాజ్యాలు ధమ్మ రాయబారులను అంగీకరించినంత మాత్రాన ఆ రాజ్యాలు తనకు వశవర్తులని సగర్వంగా చెప్పుకొన్నాడు. అశోకునకు సముద్రగుప్తునకు కొంత భేదం ఉంది. అశోకుడు ధర్మ విజయంలోను, సముద్రగుప్తుడు యుద్ధ విజయంలోను గర్వించినాడు. సింహళాన్ని అశోకుడు జయించలేదు. కాని సింహళాధిపుడైన దేవానాం పియతిస్సపై అశోకుని ప్రభావం ఎంతో ఉంది. సింహళాన్ని సైనికంగా జయించడం ఈ సంబంధాన్ని తారుమారుచేసి చెప్పలేనన్ని పాలన సమస్యలకు దోవతీసి ఉండేది.

సైనిక విజయాలే మన విజయాలు కావు. సైనిక విజయాల సంఖ్యపై, ఘనతపై, స్వభావంపై ఒక రాజు ఘనత ఆధారపడదు. పూర్తి శాంతివాదిగా అశోకుని చిత్రించడానికి కొందరు చరిత్రకారులు ప్రయత్నించినారు. అది యధార్థం కాదు. ఒక తరంలో అహింసా విధానాన్ని అనుసరించినంత మాత్రాన సామ్రాజ్యం బలహీనమై విచ్ఛిన్నం కాదు. సామ్రాజ్యాల ఉభయాస్తమయాలకు యుద్ధాలు, దేశాక్రమణలు మాత్రమే కారణాలు కావు. అందుకు కారణాలను ఇతరత్రా కూడ పరిశోధించవలె.

రాష్ట్ర పాలన దౌర్జన్య పూరితంగా ఉండేదని, మౌర్యుల క్షీణతకు అది మరొక కారణమని చెప్పటం ఉంది. దీనికి సాక్ష్యంగా తక్షశిల ప్రజలు మంత్రులపై చేసిన తిరుగుబాట్లను సూచిస్తారు. వీరిని గూర్చి దివ్యావదానలో రెండు కథలున్నాయి. పైన వివరించినట్లు ఈ రెంటిలో ఒకటి అశోకుని పాలనా కాలం చివరలో తిరుగుబాటు జరిగినట్లు చెప్పే గాథ.

ఇది కేవలం కల్పన. పరిస్థితులను బట్టి బిందుసారుని కాలంలో అశోకుడణచిన తిరుగుబాటు యధార్థమని తెలుస్తున్నది. అశోకుని కాలంలో ఉద్యోగుల దౌర్జన్యాలను గురించిన సాక్ష్యం లేదు. తమతమ ప్రాంతాలలోని ప్రజలపట్ల దయతో న్యాయబద్ధంగా వ్యవహరించవలెనని మహామాత్తులకు ప్రథమ ప్రత్యేక శాసనంలో అశోకుడు సలహా ఇచ్చినాడు. ఉద్యోగుల దౌర్జన్యాల నరికట్టే ఆశయంతోనే ఈ సలహా ఇచ్చినాడని ఒక సూచన, కాని ఈ శాసనం కళింగ రాజ్యంలోని దౌళి, జౌగడ నగరాలలోని మహామాత్తులనేగాని, ఇతర ప్రాంత మహామాత్తుల నుద్దేశించినది కాదు. అదే ఈ శాసనానికున్న ప్రాముఖ్యం. ఇటీవలనే కళింగ ప్రజలను అశోకుడు జయించినాడు. వారి శ్రేయస్సుపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం వల్ల వారి విశ్వాసాన్ని చూరగొనగలుగుతాడు. అంతే కాని పరిపాలనపై చక్రవర్తి అదుపును కోల్పోయినాడనడానికి అది సాక్ష్యం కాదు.

తరువాతి మౌర్యుల కాలంలో మౌర్య ఆర్థిక విధానంపై భారం అధికమైనదనే అభిప్రాయాన్ని మరొక రచయిత వెలిబుచ్చినాడు. ఈ వాదానికి రెండు అంశాలు ఆధారం. అందు ముఖ్యమైనది పన్నులను పెంచటానికి అనవసర చర్యలను తీసుకొన్నాడనే వాదన. అర్థశాస్త్రంలో పేర్కొన్న నటులపైన వ్యభిచారిణులపైన పన్నులను విధించడం ఇందుకు ఉదాహరణ. ఇక ఈ యుగానికి చెందిన మౌర్య విద్ధాంక నాణేలు అపకర్షానికి సాక్ష్యంగా ఉన్నాయనేది రెండో వాదన. కాని ఈ వాదన చాలవరకు నాటి రాజకీయాంశాలను గణించక ప్రత్యేకంగా ఎన్నికచేసిన ఆర్థిక సాక్ష్యం మీద ఆధారపడింది. జాతీయాదాయానికి పన్నులు ముఖ్య ఆధారమని మొట్టమొదటగా మౌర్యయుగంలోనే గుర్తించినారు. దీని ఫలితంగా పన్ను విధించదగిన ప్రతిపాదనపై పన్ను విధించే ప్రవృత్తి ఏర్పడింది. వ్యభిచారంవంటి వృత్తుల వారిపైన కూడా పన్నులు న్యాయబద్ధమేనని, వ్యవసాయదారులపై పన్నుల వంటివి సర్వసామాన్యమైనవేనని, అత్యవసర చర్య కాదని అర్థశాస్త్రంవల్ల తెలుస్తున్నది. రాజ ధనాగారం వట్టిపోయిన సమయంలో తీసుకొనవలసిన అత్యవసర చర్యలను అర్థశాస్త్రం పేర్కొంటున్నది. వాటిలో రెండు పంటల పద్ధతి ఒకటి. కాని నటులపై పన్నులవంటివి ఈ అత్యవసర చర్యలలో లేవు.

మౌర్యయుగం నాటి అపకర్ష నాణెకాలకు నాటి ఆర్థిక విధానంపైగల ఒత్తిడి అని అర్థం చెప్పవలసిన పనిలేదు. తరువాతి మౌర్యుల కాలంలో అధికారం శిధిలమై అదుపు తగ్గిపోయినందున ముఖ్యంగా సామ్రాజ్యం నుండి విడిపోతున్న ప్రాంతాలలో అపకర్ష నాణెకాలు చెలామణి కావడం సంభవమే. ఈ నాణేలు రాసులుగా లభ్యమైనందున అవి ఏ ప్రాంతాలలో ప్రచారంలో ఉన్నవో చెప్పడం కష్టం. పైన పేర్కొన్న ప్రాంతాలలోని

అధికారులు నాణెక గుణాన్ని సక్రమంగా గమనించక గుర్తులుంచి అమలు జరిపి ఉండవచ్చు. అంతేకాక ఇతర వస్తువులతో పోలిస్తే నాడు వెండికి బాగా గిరాకీ హెచ్చినట్లు ఈ అపకర్ష సూచిస్తున్నది. అందుచేత నాణేలలో వెండి నిష్పత్తి తగ్గి ఉంటుంది. అంతేకాని తరువాతి మౌర్యుల నాణేలపై కోశాంబి పండితుడు చేసిన వాదం యథార్థమని చెప్పడానికి అవకాశం లేదు. అతని వాదం కేవలం తరువాతి మౌర్యుల నాణేలేవో స్పష్టంగా గుర్తించడంమీద ఆధారపడి ఉంది.

ఇతర భౌతిక అవశేషాలనుండి లభ్యమౌతున్న సాక్ష్యం నాటి ఆర్థిక విధానంపై ఒత్తిడిని సూచించడం లేదు. వాస్తవానికి ఆ సాక్ష్యం వర్ధమాన ఆర్థిక విధానాన్నే సూచిస్తున్నది. హస్తినాపుర శిశుపాల ఘర్‌ల త్రవ్వకాలలో లభ్యమైన పురావస్తు సాక్ష్యాన్ని బట్టి నాటి ఆర్థిక విధానంలో ముఖ్యంగా వాడకంలో ఉన్న వస్తువుల గుణంలో సాంకేతిక పద్ధతులలో పురోగతి వ్యక్తమౌతున్నది. ఈ అభివృద్ధి మౌర్యయుగారంభంలో కంటె చివరలో దేశమంతటా సమంగా విస్తరించినట్లు తెలుస్తుంది. ఉదాహరణకు పై ప్రదేశాల త్రవ్వకాలలో ఉత్తరాది నలుపు, మెరుపు కుండల పాదులతో పాటు గోధుమరంగు ముతక కుండలు దొరికినాయి. అశోకానంతర మౌర్యులకు, తొలి శుంగులకు చెందిన తరువాతి అంతరువు నుండి మృదువైన మట్టితో సారెమీద తయారైన కుండలు విస్తృతంగా వాడుకలోఉన్న నిదర్శనం లభ్యమైంది. గృహ నిర్మాణానికి నగర నిర్మాణానికి తప్పనిసరిగా పథకాలువేసి అమలు జరపడం ఈ యుగంలో ఒక కొత్త అంశం. పూసలు, ఉంగరాలు, జేగురుమట్టి బొమ్మల పనితనంతో సయితం అభివృద్ధి కనిపిస్తుంది. అశోకుని పాలనకాలం ఆర్థిక వికాసానికి చాల ఉపకరించింది. సమర్థమైన ఒకే పరిపాలన క్రింద దేశం సమైక్యం కావడంవల్ల రవాణా సౌకర్యాలను పటిష్టంగా పెంపొందించడంవల్ల, ఆంతరంగిక శాంతిభద్రతలవల్ల వర్తకం పెరిగి కొత్త వాణిజ్య శ్రేయస్సు లనేకం బయలుదేరినాయి.

రాజకీయ అవ్యవస్థ యేర్పడిన కాలంలో, ముఖ్యంగా గంగానదిలోయలో వాణిజ్య తరగతులకు చెందినవారు డబ్బును దాచిపెట్టుకొని ఉండవచ్చు. ఈ విధంగా ద్రవ్యాన్ని దాచడం వల్లకూడ నాణేలు అపకర్షకు గురి అయి ఉండవచ్చు. అంతేకాని మౌర్య సామ్రాజ్యం క్షీణించే సమయంలో సయతం దేశం ఆర్థికంగా మహదైశ్వర్యాన్ని అనుభవిస్తూనే ఉన్నదనడంలో సందేహం లేదు. వాణిజ్య తరగతులవారు తమ మిగులు ధనాన్ని మత నిర్మాతలకు శోభను చేకూర్చడంలో వినియోగించినారు. కొంత కాలం వరకు వారే దేశంలోని దాతలు, బార్‌హుత్ సాంచీ శిల్పాలు, దాక్షిణాత్య గుహాశిల్పాలు ఈ కొత్త బూర్జువా వర్గాన్ని వ్యక్తీకరిస్తున్నాయి.

మౌర్యులు సాగించిన దౌర్జన్య పాలనమీద, వారనుసరించిన విదేశీభావాల మీద ప్రజలు చేసిన తిరుగుబాటే పుష్యమిత్రుడు సాధించిందని ఒక రచయిత అభిప్రాయం. విదేశీ భావాను సరణకు మౌర్యుల కళను మంచి ఉదాహరణగా అతడు పేర్కొన్నాడు. మౌర్యుల శిల్పంకంటె శుంగయుగానికి చెందిన కళ ముఖ్యంగా బార్‌హుత్, సాంచీశిల్పాలు జానపద సంప్రదాయాల ననుసరించిన లౌకిక శిల్పమనే భావమే అతని వాదానికి ఆధారం. కాని మౌర్యులకళ మౌర్య చక్రవర్తుల సామ్రాజ్యవాదాన్ని స్పష్టంగా వ్యక్తం చేసినదనడానికి అశోక స్తంభాల కిరీటాలే ఆధారాలు. విదేశీయ ఆధారాల నుండి వచ్చినా రాకపోయినా మౌర్యుల కళాస్వభావం మారేది కాదు. కాని శుంగుల కళాస్వభావం మారడానికి కారణం ఉంది. ఈ కళలను పోషించినవారు భిన్నమైన సాంఘిక తరగతివారు సాంచి, బార్‌హుత్ ప్రాకార ద్వార తోరణాలవలెనే అశోక స్తంభాలకు బౌద్ధ మతానికి సంబంధం లేదు. శుంగయుగ శిల్పం జానపద సంప్రదాయానుగుణంగా ఉండడానికి ఒక కారణం ఉంది. బౌద్ధం సామాన్య ప్రజల మతాచారాలను అనేకం స్వీకరించింది. బౌద్ధ శిల్పాన్ని పోషించినవారు, ఆశిల్పాన్ని సృష్టించిన శిల్పులు సాంస్కృతికంగా జానపద సంప్రదాయంలో ప్రధానంగాలు కావడమే ఆ కారణం.

అశోకుడు సమాజాలను నిషేధించడం కూడ ప్రజలు తిరుగుబాటు చేసినారనే వాదానికి బలంగా సూచించడం జరిగింది. పండగ సమావేశాలను, మాంసాహారాన్ని నిషేధించడం వల్ల అశోకుడు ప్రజాదరణను కోల్పోయి ఉండవచ్చు. అయితే ఈ నిషేధం పూర్తిగా అమలు జరిగిందనడం అనుమానాస్పదం. పాలన కాలం చివరలో అశోకుడు కొంత నిరంకుశంగా ఉన్నట్లు కనుగొన్నాము. ఆ రోజులలో ప్రజలకిబ్బందులు కలిగించే చర్యల నాతడు తీసుకొని ఉండవచ్చు. ఈ విధానాలను తు.చ. తప్పకుండ తరువాతి మౌర్యులు అనుసరించారనే భావం మీదనే ప్రజా విప్లవ వాదం ఆధారపడింది. ఏమైనప్పటికీ మౌర్య నిరంకుశత్వం యధార్థమే అయితే అందుకు వ్యతిరేకంగా పుష్యమిత్రుని బలపరుస్తూ తిరుగుబాటు చేయడానికి మౌర్య సామ్రాజ్యంలోని ప్రజానీకంలో సమైక్య జాతీయ చైతన్యం ఉన్నదని చెప్పలేము.

గ్రీకు ఆధారాలను బట్టి మౌర్యుల కాలంలో పంటలో నాలుగో వంతును భూమి శిస్తుగా వసూలు చేసినట్లు తెలుస్తుంది. వాస్తవానికి అది చాల ఎక్కువే. రైతులపై విధించిన ఈ భారమే ప్రజా విప్లవానికి కారణమంటూ తరచు వాదించటం జరుగుగున్నది. పన్నులు దేశమంతటా నాలుగో వంతే విధించినట్లయితే గ్రామీణ ప్రజానీకంలో అసంతృప్తి కలిగి ఉంటుందనడంలో సత్యం ఉంది. కాని భూసారాన్ని బట్టి నీటి వనరులను బట్టి ప్రాంతానికి

ప్రాంతానికీ మధ్య పన్నులలో వ్యత్యాసాలున్నట్లు పై అధ్యాయంలో వివరించినాము. పంటలో నాల్గవ వంతు పన్నని మెగస్తనీసు చెప్పినాడు. కాని అది మెగస్తనీసుకు బాగా పరిచయమున్న పాటలీపుత్ర పరిసర ప్రాంతాలకు సంబంధించి ఉండవచ్చు. ఆ ప్రాంతం చాల సారవంతమైనది. అచట నీరు పుష్కలంగా లభిస్తుంది. సాధారణంగా రైతులనుండి పంటలో నాలుగోవంతు వసూలు చేసేవారు కాదని అర్థశాస్త్రం నుండి సయితం తెలుస్తున్నది. అత్యయిక పరిస్థితులలో నాలుగు లేదా మూడో వంతుకు రాజులు పన్ను పెంచవచ్చునని అర్థశాస్త్రం సూచిస్తున్నది. అందుచేత నాలుగోవంతు పన్ను చాల ఎక్కువని నాడు పరిగణించినట్లు స్పష్టమౌతున్నది. సాధారణ పరిస్థితులలో మౌర్యులు నాలుగోవంతు పన్నుపై నొక్కు పెట్టినారని చెప్పలేము. అయినప్పుడు తీర్పుల్విడంలో న్యాయంగా సరళంగా వ్యవహరించాలని రాజుకులకు అశోకుడిచ్చిన ఉపదేశం కేవలం పచ్చి మోసంగా పరిగణించాల్సి ఉంటుంది.

సైనిక అలసత్వాన్ని కాని, బ్రాహ్మణ ఆగ్రహాన్ని కాని, ప్రజల తిరుగుబాట్లను గాని, ఆర్థిక ఒత్తిడిని గాని ఉల్లేఖించి మౌర్య సామ్రాజ్య పతనాన్ని తృప్తికరంగా వివరింపలేము. వాస్తవానికి మౌర్య సామ్రాజ్య క్షీణతకు మౌర్య యుగ జీవితంతో విస్తృత సంబంధం ఉన్న మౌలికమైన కారణాలున్నాయి. ఇతర సామ్రాజ్యాల క్షీణతకు సయితం అవే కారణాలు చెప్పవచ్చు. పాలనా వ్యవస్థ స్వరూపము, రాజ్యము లేదా జాతి, భావ పరిణామము అనేవి మౌర్య సామ్రాజ్య క్షీణతలో ప్రాముఖ్యం వహించినాయి.

మౌర్య ఉద్యోగి బృంద స్వరూపాన్ని పైన వివరించినాము. అందుకు భిన్నంగా ఉద్యోగి బృందం ఉన్నట్లయితే విచ్ఛిన్నాన్ని అరికట్టి సామ్రాజ్యాన్ని రక్షించగలిగి ఉండేది. మౌర్య పరిపాలనా విధానం పూర్తిగా కేంద్రీకృతం. ఉన్నత చర్యలన్నీ ప్రత్యేకంగా పాలకుని అదుపులో ఉండేవి. అందువల్ల రాజు వ్యక్తిగతంగా మంచి సమర్థుడై ఉండవలె. అట్టి పరిస్థితులలో కేంద్రాధికారం దుర్బలమైతే పరిపాలన బలహీనమై పోతుంది. అశోకుని తరువాతి రాజులు సమర్థులు కారు. అందుచే ముఖ్యంగా సామ్రాజ్య విభజనానంతరం కేంద్రాధికారం బలహీనమై పోయింది. ఈ సందర్భంలో రాష్ట్రాలు విడిపోవడం అనివార్యమయింది.

ప్రభుత్వోద్యోగులు రాజ్యానికి గాక రాజుకు విధేయులు. ఉద్యోగుల ఎన్నికలో రాజుకు విశేషాధికారాలున్నందున వారు వ్యక్తిగతంగా రాజుచే నియుక్తులైనవారు. అందుచేత రాజు మారినప్పుడల్లా ముఖ్యంగా బాధ్యతగల ఉన్నతోద్యోగులు మారుతుండేవారు. ఈ విధానం వల్ల రాజులు తరచుగా మారిన కాలంలో దేశానికి నష్టం వాటిల్లుతుంది. అశోకుని

అనంతరం మౌర్య భారతంలో అదే జరిగింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఫ్రాన్సు దేశంలో పాలనా యంత్రాంగం అధికారంలో ఉన్న ప్రభుత్వానికి మాత్రమే విశ్వాస పాత్రమై వర్తించి ఉంటే ఈ పాటికి ఫ్రాన్సుదేశం ఒక రాజకీయ ప్రమాణంగా విచ్ఛిన్నమై ఉండేది.

రాజకీయ ప్రళయాలు జరుగుతున్నప్పటికీ, విధేయతలు మారుతున్నప్పటికీ పరిపాలనను ప్రశాంతంగా నిర్వర్తించగలిగిన సురక్షితమైన ఉద్యోగి బృందాన్ని మౌర్యులు నిర్మించి ఉండవచ్చు. అట్టిది పోటీ పరీక్షా విధానాల ద్వారా సాధ్యమై ఉండేది. ఇటీవలి కాలంలో బ్రిటీషువారు అట్టి విధానాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టినారు. రాజ్యపాలనను గురించి అర్థశాస్త్రం అనేక వివరాలిస్తున్నది. కాని కింది ఉద్యోగులను నియమించే పద్ధతిని సూచన ప్రాయంగానైనా చెప్పకపోవడం ఆశ్చర్యకరం. నాడు పోటీ పరీక్షా విధానం అమలులో ఉన్నదనడానికి ఏమాత్రము నిదర్శనం లేదు. ఉన్నతోద్యోగులను రాజే స్వయంగా ఎన్నిక చేసేవాడని తెలుస్తున్నది. ఉన్నదోత్యోగులు తమ క్రింది ఉద్యోగులను నియమించేవారు. ఈ పద్ధతివల్ల సాంఘిక సంబంధాలు శక్తిమంతమైనాయి. సాధారణంగా ఉన్నతోద్యోగులు తమ తమ సాంఘిక వర్గాల నుండి లేదా మిత్రబృందం నుండి క్రింది ఉద్యోగులను నియమించడం జరిగేది. దీనివల్ల కొత్తగా సింహాసనమెక్కిన రాజుపట్ల ఉద్యోగివర్గాలు లేదా సాంఘికవర్గాలు మైత్రి వహించడంగాని విరోధం వహించడంగాని జరిగేది. రాజుపట్ల అవిధేయతా నేరానికి ఒక ఉద్యోగిని తొలగించాలంటే ఒక విభాగాన్ని పూర్తిగా మార్చవలసిన అవసరమేర్పడేది. కేంద్రంలో రాజు దుర్బలుడైనప్పుడు స్థానిక పరిపాలకుడు రాజునుండి ప్రజల విశ్వాసాన్ని తనవైపుకు సులభంగా మరలించుకోగలడు.

పోటీ పరీక్షా విధానంలో రెండు లాభాలున్నాయి. సిద్ధాంతరీత్యా అభ్యర్థులను అన్ని సాంఘికవర్గాల నుండి ఎన్నికచేస్తారు. కాబట్టి సాంఘికవర్గ ప్రాబల్యం తప్పుతుంది. పాలన శాఖలు సామ్రాజ్యమంతటికీ చెందినందున కేంద్రం ఆధిపత్యం వహించి ఉద్యోగులను సామ్రాజ్యంలో ఏ భాగానికైనా నియమించవచ్చు. స్థానిక ముఠాలు బలపడి కేంద్ర పాలకుని ధిక్కరించే ప్రమాదంపై విధానంవల్ల తప్పుతుంది. నాటి సామాజిక వ్యవస్థ సూత్రాలకు పై పద్ధతి విరుద్ధం. సామాజిక వ్యవస్థా పరిరక్షణ సమాజంలోని ప్రతి సభ్యునిమీద ఆధారపడి ఉంటుంది. ప్రతి సభ్యుడు తన హోదాను గుర్తించి అదే హోదాలో ఉండటానికి నిర్ణయించుకొన్నప్పుడే సమాజ వ్యవస్థ పరిరక్షిత మౌతుంది. శూద్రవర్ణరాజులైన రాజులు బలవంతులైనప్పుడు వారిని ప్రజలంగీకరించవచ్చు. కాని సాంఘికవర్గం నుండి వచ్చిన పాలక బృందం మాత్రం సమాజ వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేయవచ్చు.

సమాజంలోని ఏడు వర్గాలలో ఉద్యోగులు రెండు వర్గాలని మెగస్తనీసు చెప్పడాన్ని గురించి ఆశ్చర్యపడ నవసరంలేదు. ఉద్యోగులు ప్రత్యేకాధికారాలున్న వర్గం అనడం నిశ్చయం. రాజు స్వయంగా నియమించినందున వరిష్ట ఉద్యోగులకు సాంఘికంగా గౌరవం ఉండేది. ఉద్యోగి బృందంలోని ఇతర సభ్యులతో కలిసి వీరొక ప్రత్యేక రహస్యవర్గంగా తయారయ్యేవారు. సాంఘిక ప్రతిష్ఠతోబాటు అర్ధశాస్త్రం పేర్కొన్న జీతాల జాబితా ప్రకారం ఆర్థికంగా కూడ సముచితమైన ఏర్పాట్లు ఉన్నట్లు కనిపిస్తుంది.

రాజుకు ఇతోధికారాలున్నాయి. కాని ప్రజాభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించే సలహాసంఘం లేకపోవడంవల్ల ప్రజాభిప్రాయాన్ని గ్రహించడానికి సందేహాస్పదమైన సాధనాలు మాత్రమే ఉండేవి. ఈ సాధనాలు రాజుకు ప్రమాదంగా పరిణమించే అవకాశం ఉంది. ప్రజాభిప్రాయాన్ని గ్రహించడానికి అర్థశాస్త్రం ఆమోదంతో మౌర్య రాజ్యాంగం గూఢచారి దళాన్ని నియోగించింది. తమతమ విద్యుక్త ధర్మాలతోపాటు గోప మొదలైన క్రింది ఉద్యోగులు వివిధ సమాచారాలను సేకరించడానికి నియుక్తులయ్యేవారు. గూఢచారి విధానం చాల క్లిష్టంగా ఉండేది. ప్రతినిధుల, నివేదకుల నియామకాల్ని తన శాసనాలలో అశోకుడంగీకరించినాడు. అంతేకాక వీరికి రాజు సర్వదాసులభుడని శాసనాలలో పేర్కొన్నాడు.

ప్రాతినిధ్య సంస్థలు లేకపోవడమేగాక ప్రభుత్వ నిర్వహణలో కార్య నిర్వహణ, న్యాయనిర్వహణ శాఖల మధ్య భేదంలేదు. అవేక్షకులుగా మహామాత్తులను నియమించడంగాని, గూఢచారులను లేదా నివేదకులను నియమించడంగాని ఈ ఒక్కటే ఉద్యోగులమీద రాజు ఉంచగల అదుపు. ఈ పద్ధతి రాజు శక్తిసామర్థ్యాలపైనే ఆధారపడింది. ప్రజాభిప్రాయాన్ని గ్రహించడానికి, అవసరమైతే ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా మలచుకోవడానికి విజ్ఞుడైన రాజు ఉద్యోగులను నేర్పుతో ఉపయోగించుకోగలడు. అసమర్థుడైన రాజు వీరిని ప్రజలను పీడించడానికి వినియోగిస్తాడు; లేదా ఉద్యోగులే రాజును వ్యర్థ ప్రయోజనాలకు వాడుకోవచ్చు. అశోకుని జీవితకాలంలో మౌర్యపరిపాలన చాల సమర్థంగా పనిచేసింది. బలవంతుడు, జాగరూకుడు అయిన రాజుకు అనుకూలించే వ్యవస్థ దుర్బలుడు, విరక్తుడు అయిన రాజు కాలంలో కలుషితం కాక తప్పదు. అట్టి కాలుష్యానికి ఆ వ్యవస్థ నిలబడలేదు. మౌర్య పాలనా యంత్రాంగం పూర్తిగా కేంద్రీకృతం. శక్తి మంతుడైన రాజు ఆ విధానాన్ని తన శ్రేయస్సుకు, తన ప్రజల శ్రేయోభివృద్ధికి నియమించగలడు. కాని దుర్బలుడైన రాజు కేంద్ర ఆధిపత్యాన్ని కోల్పోవడంవల్ల ప్రమాదకరంగా పరిణమించి, విధ్వంసక శక్తులు విజృంభించి సామ్రాజ్య విచ్ఛిత్తికి దారితీస్తాయి.

ఏ రాజకీయ పద్ధతిలోనైనా రాజ్యాన్ని గురించిన సిద్ధాంతం ఏదైనా ఉంటే దానికి, పరిపాలనకు పరస్పర సంబంధం ఉంటుంది. రాజ్యాన్ని గురించిన సిద్ధాంత ఆవశ్యకతపై నొక్కు పెట్టడంలో ఒక కారణం ఉంది. అట్టి సిద్ధాంతమే ఉంటే రాజుకు, ప్రభుత్వానికి, సాంఘిక వ్యవస్థకు రాజ్యం అతీత మవుతుంది. పరస్పర పౌరుల మధ్య ఎన్ని వ్యత్యాసాలు, ఎన్ని అడ్డుగోడలున్నప్పటికీ నాడు రాజ్యం పరమ సమవాయ మౌతుంది. ప్రజల పూర్తి విధేయతను ఆశిస్తుంది; కోరుతుంది. ప్రజల ఆలోచనా విధానంలో రాజ్యభావన సహజమైనప్పుడు జాతీయ చైతన్యోదయం జరుగుతుంది.

పూర్వ మౌర్య యుగంలో కూడా రాజ్యాలుండేవి. వాటిలో రాజ్య భావానికి సూచన కన్పిస్తుంది. సాధారణ భాషలో రాజ్యాన్ని తరచు నిర్వచించడం జరిగింది. కాని మౌర్య భారతంలో జాతీయభావం లేదు. జాతీయ భావోదయానికి అవసరమైన పరిస్థితులు నాడు లేవు. మౌర్య సామ్రాజ్యంలో చేరిన ప్రాంతాలలో ఒకే ఆచారాలు, ఒకే భాష, ఒకే చారిత్రక సంప్రదాయాలు లేవు. మౌర్య సామ్రాజ్య భూములలో సంస్కృతీ ప్రమాణం కూడ ఒకే రకంగా లేదు. సామ్రాజ్యంతో పెద్ద ఎత్తున జాతీయతా భావం లేనప్పుడు సామ్రాజ్యంలో చేరిన చిన్న చిన్న రాజకీయ ప్రమాణాలలో జాతీయభావం ఉండటానికి అవకాశం లేదు.

ఈ పరిశీలన సందర్భంలో మన దృష్టిని తాత్కాలికంగా మగధ రాష్ట్రానికి పరిమితం చేద్దాము. మగధ చిన్న భూభాగం. అందు ఒకే ఆచారాలు, భాష, చారిత్రక సంప్రదాయాలుండడానికి అనుకూలమైన పరిస్థితులున్నాయి. అయినప్పటికీ ప్రజలలో రాజ్యభావం జనించలేదు. ఆ భావంతో పరిచయమే ఉంటే సమకాలిక రాజకీయ వ్యవస్థలను గూర్చిన ఆలోచనలో, ఆచరణలో రాజనీతి గ్రంథాలలో ఆ భావం ప్రవేశించి ఉండేది. ఆ యుగ ప్రజల రాజకీయ ఆలోచనకు ప్రత్యక్ష వ్యక్తీకరణమైన రాజనీతి గ్రంథం కౌటల్యుని అర్థశాస్త్రం. అది మనకు లభ్యమౌతున్నది. అర్థశాస్త్రం రాజ్యాన్ని గురించిన మౌర్యయుగ భావాలను నిరూపిస్తున్నదని ఆ యుగ చరిత్రను వ్రాసినవారు నొక్కి చెబుతున్నారు. కాని రాజ్య భావానికి అవసరమైన రెండు మౌలికాంశాలను బట్టి పరిశీలిస్తే అర్థశాస్త్రం ఈ విషయంలో విఫలమౌతున్నది. ప్రజల విధేయత వ్యక్తిగతంగా రాజు పరమేగాని, రాజ్యానికి చెందదు అని అర్థశాస్త్రంలో ఉన్నది. అందుచేత రాజుకు ప్రతిరూపంగా ఉన్న ప్రభుత్వానికి అతీతమైన వ్యవస్థ రాజ్యం అనే భావానికి ఆస్కారం లేదు. రాజ్యానికి అనుకూలమైన రాజకీయ వ్యవస్థను పరిశీలించే సందర్భంలో రాచరికము, కతిపయ స్వామ్యము, గణతంత్రము వంటి భిన్న రాజ్యాంగ విధానాలను చర్చించక, ప్రభుత్వానికి ప్రేరక శక్తిగా

రాజు ఎంత సమర్ధంగా వ్యవహరిస్తాడు అనే అంశంలో మాత్రమే అర్థశాస్త్రం శ్రద్ధ వహిస్తున్నది. అర్థశాస్త్రంలో రాజ్యాన్ని గురించిన భారతీయ భావన ప్రతిఫలిస్తున్నది అనడం మెఖవిల్లీ వ్రాసిన 'ఇన్‌ఫ్రిన్స్' అనే గ్రంథంలో ఐరోపా వారి రాజ్య భావన కన్పిస్తుందనడం వంటిదే. కాని మెఖవిల్లీ తన 'ఇల్‌ఫ్రిన్స్' లో గల లోపాలను తానే గుర్తించినాడు. అంతేగాక రాజ్యాన్ని గురించి వివరంగా చర్చించిన 'ఇల్‌డిస్కోర్సు' గ్రంథంలో ఒక అంశానికి విపులీకరణగా మాత్రమే 'ఇల్‌ఫ్రిన్స్'ను పరిగణించినాడు. ఇక క్లిష్టమైన పాలన విధానంలో రాజు విధులను అతని పద్ధతులను విశ్లేషణాత్మకంగా పరిశీలించడమే కౌటల్యుడు చేసింది. తరువాత వచ్చిన సైద్ధాంతికులు కౌటిల్యుని అనుసరిస్తూ సాంఘికంగా వచ్చిన ఆచారాలను గుర్తిస్తూ ప్రభుత్వ పద్ధతులను చర్చించినారు. సాంఘిక వ్యవస్థలోని మంచి చెడుల మీదనే ఈ చర్చలలో నొక్కు ఉండడం ముఖ్యమైన అంశం.

రాజకీయ భావవికాసం జరగడంతో ఇతర దేశాలలో రాజ్యంపట్ల విధేయత పెరిగింది. కాని భారతదేశంలో మాత్రం విధేయత సాంఘిక వ్యవస్థ పరమైంది. సాంఘిక వ్యవస్థ యథాతథంగా నిలబడినంతకాలం రాజ్య భావానికి బలంగాని, గుర్తింపుగాని లభించలేదు. సర్వోత్తమమైన రాజ్యాన్ని గురించిన ఆలోచన జరుగలేదు. సామ్రాజ్య విధానం చిరకాలం భారతదేశంలో మనలేక పోవడానికి ఇదొక కారణం కావచ్చు. భారతీయ సామాజిక వ్యవస్థలోని పరివర్తన దశలు చాల మందకొడిగా సాగినాయి. మార్పులు హఠాత్పరిణామాలు కానందున వాటికి గుర్తింపు లభించలేదు. అందుచే పాత విధానాల పట్ల విధేయత నిరంతరాయంగా కొనసాగింది. బౌద్ధుల పట్ల, బ్రాహ్మణుల ఆగ్రహం బహుశా మత పరమైంది కాదు. ప్రత్యేక మతంగా బ్రాహ్మణ ఆలోచనా విధానానికి బౌద్ధం పూర్తిగా విరుద్ధమైనది కాదు, అది సామాజిక పరమైనది. సామాజిక వ్యవస్థను భగ్నంచేసి కొత్త విధేయతలకు బౌద్ధం కారణమౌతుందనే భయం వల్లనే బౌద్ధాన్ని బ్రాహ్మణులు వ్యతిరేకించి ఉంటారు.

హిందూ జీవితానికి రూపకల్పనచేసే ధర్మ – అర్థ – కామాలు ఆదర్శవంతమైన పురుషార్థాలు. ధర్మాన్ని దివ్యశాసనం అనీ, దాన్ని అనుసరించడమే విధి అనీ వ్యాఖ్యానించారు. ఏదో ఒక రాజ్యపౌరులను ఉద్దేశించి నిర్మించినది కాదు ఈ ధర్మం; ఇది సాంఘిక ఆచారాలను సామాజిక వ్యవస్థను పరిరక్షించడానికి ఉద్దేశించినది. మతాధారాల నుండి తనకు ఆమోదం లభిస్తున్నట్లు హిందూ సమాజం నొక్కి చెబుతున్నది. పాశ్చాత్య ఆలోచనా విధానం దేశంలో ప్రవేశించక పూర్వం శతాబ్దాల తరబడిగా వర్ణవ్యవస్థ దైవసృష్టి అని హిందూ సైద్ధాంతికులు వర్ణించినారు. అదే విధంగా ధర్మ శాస్త్రకారుడైన

మనువుకు సయితం దివ్య శక్తులు ఆపాదించినారు. ఈ పద్ధతికి చైనా పరిస్థితులు పూర్తి విరుద్ధం. చైనాలో సామాజిక నీతికి మతానికి మధ్య భేదాన్ని గుర్తించారు. కన్ఫ్యూషియస్‌ను సనాతన ధర్మపరులైన అతని శిష్యులు సయితం మానవమాత్రుడుగానే పరిగణించినాడు.

మౌర్య భారతంలో జాతీయ ఐక్యం లేదని ఇతర అంశాల నుండి సయితం గ్రహించవచ్చు. రాజకీయంగా సమైక్య భారతదేశ భావన నాడు లేదు. మ్లేచ్ఛులుగా గ్రీకులను భారతీయులు ద్వేషించినారు. కాని గ్రీకులను సయితం భారతీయులు సుసంఘటితంగా ప్రతిఘటించక పోవడమే అందుకు నిదర్శనం. గ్రీకులు నెదిరించినవారు స్థానిక పాలకులు మాత్రమే. అది కూడ తాము కొత్తగా ఆక్రమించిన రాజ్యభాగాలను కోల్పోతామనే భావంతోనే వారు గ్రీకుల నెదిరించారు. అలెగ్జాండరును పోరస్ ప్రతిఘటించినపుడు గాని, యాంటియోకస్‌కు శుభగసేనుడు దాపోహమన్నపుడు గాని వాయవ్య భారతంలో వారు ఒంటరి వారే. పాటలీపుత్రం నుండి వారికి మద్దతు లభించలేదు. దుష్టయవనులను వారు ప్రతిఘటిస్తున్నట్లు భారతీయ గ్రంథాలలో ప్రస్తావనేలేదు. తమ శత్రువైనప్పటికీ శౌర్యధనుడైన పోరస్‌ను గ్రీకులు ప్రశంసిస్తూ పేర్కొన్నారు కాని భార గ్రంథాలాతణ్ణి స్మరించవు. కాబట్టి మౌర్య సామ్రాజ్య ప్రజల మధ్య మౌలికమైన రాజకీయ ఐక్యం లేనందున రాజకీయంగా సామ్రాజ్య విచ్ఛిత్తి అనివార్యమైంది.

జాతీయ ఐక్యం లేకపోవడంతోపాటు సామ్రాజ్య విచ్ఛిత్తికి భూమి యాజమాన్యము, ఆర్థిక స్థాయిలలోని అసమానతలు కారణమైనాయి. యధార్థానికి భూమికి రాజే యజమాని అయినందున భూమి సులభంగా చేతులు మారేది. భూమి విభజనకుగాని, పంపిణీకి గాని ఎవరి ఆమోదమూ అక్కరలేదు. భూమి రాజ్యానిది అని భావించి ఉంటే తరచు యాజమాన్యం మారేదికాదు. మౌర్య సామ్రాజ్యం చాల సువిశాలమైంది. అందులో చిన్న చిన్న ప్రాంతాలు తమకు తాముగా ఆర్థిక వనరులను పెంపొందించుకొనేవి. కాగా ఉత్పత్తి ప్రమాణాలలోను, ఆదాయంలోను అంతరాలెక్కువగా ఉండేవి. గంగానదీ ప్రాంతం సారవంతమైనందున ఆర్థికంగా చాల ఐశ్వర్యవంతమైంది. దానితో పోలిస్తే దక్షిణాపథ ఉత్తర ప్రాంతంలో ఆర్థిక వికాసం చాల తక్కువ. ఈ రెండు ప్రాంతాల ఆర్థిక విధానాలలో చాల వ్యత్యాసం ఉంది. మొదటి ప్రాంతానిది వాణిజ్య శ్రేయస్సులు పెంపొందదానికి ఇతోధిక అవకాశాలున్న వ్యావసాయక ఆర్థిక విధానం, రెండవ ప్రాంతానిది నిమిత్తమాత్రమైన వ్యవసాయ, వాణిజ్య అవకాశాలున్న సంచార, పశుపాలక ఆర్థిక విధానం.

భిన్న ఆర్థిక విధానాలలోని లాభాలను మౌర్య పరిపాలన గ్రహించసాగినట్లు అర్థశాస్త్రం వల్ల స్పష్టమౌతుంది. సైద్ధాంతికులు ఉత్తరదేశ ఆర్థిక విధానం పట్ల శ్రద్ధ వహించినందున

ప్రభుత్వోద్యోగులకు ఆ విధానంతోనే ఎక్కువ పరిచయం ఏర్పడింది. దాక్షిణాత్య ఆర్థిక విధానం కూడ లాభసాటిగా వికసించినట్లైతే సామ్రాజ్యంలో ఆర్థిక సమైక్యం సాధ్యమయ్యేది. కాని అది జరుగలేదు.

సాంస్కృతికంగా కూడ భారత ఉపఖండంలోని ప్రజలందరూ ఒకే ప్రమాణంలో వికాసం సాధించలేరు. నగరాలు వాణిజ్య కేంద్రాలై క్లిష్టమైన నాగరికతను సాధించినాయి. వాటిలో పరస్పర సంబంధంలేని గ్రామీణ సంఘాలకు పోలిక కనిపించదు. ప్రాంతాలమధ్య సంప్రదాయాలు భిన్నాలు. సాంఘికాచారాలు స్థానికంగానే ఉండిపోయినాయి. ఇరవయ్యో శతాబ్దంలోకూడ, సమీకరణశక్తులు కొన్ని దశాబ్దాలుగా కృషి చేస్తున్నప్పటికీ, భారతీయులలో సాంస్కృతిక అసమానతలు కొట్టవచ్చినట్లు కన్పించడం చాల చిత్రమైన విషయం. అయినప్పుడు ఈ విషయంలో మౌర్యభారతం చాల హీనంగా ఉండి ఉండవలె. ప్రాంతాలమధ్య రాజకీయ, ఆర్థిక విధానాలలోనే గాక భాషలో సయితం భిన్నత్వం ఉంది. ప్రాకృత భాషద్వారా తన సామ్రాజ్యంలో జాతీయ ఐక్యాన్ని సాధించడానికి అశోకుడు తీవ్ర ప్రయత్నం చేసినాడు కాని వాయవ్య ప్రాంతాలలో గ్రీకు, అరమిక్ భాషలు మాటాడేవారి నుండి దక్షిణదేశంలో తమిళభాష మాటాడే ప్రజలవరకు ఉన్న వైవిధ్యమే జాతీయ ఐక్యానికి ఆటంకమైంది.

మగధ విధానమే శతాబ్దాల తరబడి ఉపఖండమంతటికీ వర్తిస్తుందని భావించిన చరిత్రకారుల వల్ల భారతదేశ చరిత్ర పరిశీలన దెబ్బతిన్నది. ఈ దృష్టివల్ల దూరదూరంగా ఉన్న భిన్నప్రాంతాల పరిస్థితులను పరిశీలించడంలో కొత్త విశ్లేషణలు సరి అయిన ఫలితాల నీయలేదు. భారతదేశ చరిత్రను ఒక ఉపఖండ చరిత్రగా పరిశీలించవలె. చరిత్ర పరిశీలనకు చాల ముఖ్యమైన కార్యకారణ సంబంధాలను భారతదేశంలో ప్రతి ప్రాంతంలోను గమనించవలె. అధికారం కొద్దిమంది చేతులలో కేంద్రీకృతమై, అత్యంత భారమైన పాలన విధానం జాతీయ చైతన్యం లేకపోవడం మౌర్య సామ్రాజ్య క్షీణతకు కారణాలని చెప్పవలె. ఇతర అంశాలతోపాటు ఈ కారణాలు మగధలోనే కనిపిస్తాయి. విశాల దృక్పథంతో మౌర్య సామ్రాజ్యాన్ని పరిశీలించినపుడే ఈ కారణాలు స్పష్టమౌతాయి.

# ఉపసంహారము

**బా**బిలోనియన్, ఈజిప్షియన్. హీబ్రూ, హిందూ, పారశీక, గ్రీక్, రోమన్ జాతులతోపాటు ట్యూటన్ మొదలుగా ప్రముఖ నాగరక జాతులన్నీ పురాణ పురుషులు, రాజులు, మత ప్రవక్తలు, రాజవంశ కర్తలు, నగర నిర్మాతలు, సామ్రాజ్య స్థాపకులు మొదలైన తమ జాతీయ నాయకులను చాల ప్రాచీన కాలం నుంచీ కావ్య కథలలో, గాథలలో శ్లాఘించి వ్రాయడం నేర్చుకొన్నారు. నేటికి సయితం అన్ని సమాజాలలోను వీరపూజ కన్పిస్తూనే ఉంది. వీరపూజను నిర్మూలించడం చరిత్రకారుల పని కాదు. కాని గాధావళి నుండి ఆరాధ్యులైన ఈ వీరుల యధార్థ చరిత్ర నుద్ధరించడమే చరిత్రకారుల ధర్మం. వీర మతాల పెరుగుదలలో జాగ్రత్త వహించడం చరిత్రకారుని నైతిక బాధ్యత. అనారోగ్యకరంగా పెరిగి ప్రాచీన యుగ గాథలు మారురూపం ధరించిన సందర్భాలలో విమర్శనాత్మక దృష్టితో పరిశీలించవలె. తన సంస్కృతీ స్వరూపాన్ని వ్యాఖ్యానించడంలో చరిత్రకారునకు ప్రాముఖ్యం ఉన్నది. అందుచే ఆతడు విషయాశ్రయ దృష్టితో ఉండడం అవసరం. వీరపూజలో ఆతడు భాగస్వామి కారాదు. తన భావాలను ఆత్మ విమర్శకు గురిచేసుకొంటూ ఉండవలె. సమాజంలోని మానసిక వికారాలనుండి జనప్రియాలైన గాథలుద్భవిస్తాయి. అందుచేత తన సమాజంలోని మూఢ విశ్వాసాలకు కారణాలైన సామాజిక వికారాలను చరిత్రకారుడు విశ్లేషణాత్మకంగా పరిశీలించవలె.

ఈ గ్రంథంలో క్రీ.పూ. మూడో శతాబ్ద భారత నేపథ్యంలో వాస్తవ చారిత్రక దృక్పథంతో అశోకుని వర్ణించడం జరిగింది. నేటికి అశోకుడు సుదూర కాలంలో జీవించినాడు. అందుచేత సాధ్యమైన విధంగా వ్యక్తిగా, చక్రవర్తిగా అతనిలో కనిపించే భేదాన్ని నిరూపించడానికి చేసిన ప్రయత్నమే ఇది. సందర్భంలోనుంచే సంఘటన

ఉద్భవిస్తుంది. కాబట్టి ఒక చారిత్రక సంఘటన ఎంత ముఖ్యమో అది జరిగిన సందర్భం కూడా అంత ముఖ్యం. ఈ దృక్పథమే మౌర్యయుగాన్ని, అశోకుని పరిశీలించడంలో అవలంబించినాను. ఈ దృక్పథమే చాల ముఖ్యమైనదని భావిస్తున్నాను. దురదృష్టవశాత్తూ ప్రాచీన సంస్థలలో నేటి సంస్థల కవసరమైన గుణాలు ఆపాదించడంవల్ల చరిత్ర పరిశోధన అప్రమాణికం అవుతున్నది. మౌర్య సామ్రాజ్యం రాజకీయంగా వికేంద్రీకృతమని, వైయక్తికంగా ప్రజాస్వామ్యమని జన ప్రియమైన ఒక దురభిప్రాయం ఉంది. వాస్తవానికి మనం పైన పరిశీలించినట్లు రాజకీయంగా కేంద్రీకరణకు మౌర్య సామ్రాజ్యం నాంది పలికింది. వ్యక్తి స్వేచ్ఛకు ఎక్కువ అవకాశం లేని సాంఘిక విధానానికి అది విజయం. ప్రజాస్వామ్యము, వ్యక్తివాదము మౌర్య యుగానికి లక్షణాలు కావు. ఈ భావాలకై భారత చరిత్రలో మరొక చోట పరిశీలన చేయవలె.

ఇండో యూరపియన్ విద్వత్తు కొన్ని దశాబ్దాలుగా "గ్రీకు అద్భుతం" అనే భావంతో ప్రభావితమయింది. ఇతర నాగరికతల వారిలో తాము హీనులమనే అభిప్రాయం కలిగే విధంగా గ్రీకు నాగరికత సర్వశ్రేష్ఠమనే భావాన్ని నొక్కి చెబుతూ వచ్చారు. దీనివల్ల ఇతర సంస్కృతులలో సయితం గ్రీకు సంస్కృతిలో ఉన్న విలువలతో సమమైన విలువలను పరిశీలించే ప్రయత్నాలు జరిగినాయి. కాని పరిశోధన పురోగమించినకొలదీ ప్రతి సంస్కృతిలోను, ప్రతి నాగరికతలోను వాని వానికి తగినట్లు అద్భుతాలున్నట్లు స్పష్టమౌతున్నది. అట్టి అద్భుతాలను బయల్పరచడమే చరిత్ర పరిశోధన లక్ష్యం. కాని నాగరికత లన్నింటిలోను ఒకేరకమైన విలువలను దర్శించినందువల్ల కాక, ప్రతి నాగరికతలోను ఉన్న ప్రత్యేకత ప్రాధాన్యాన్ని వివరించడంవల్లనే పైలక్ష్యం సిద్ధిస్తుంది. ఇందుకు చాల చిత్తశుద్ధి అవసరం. నాగరకత సాధించిన విజయాలను చాటటంతోపాటు అందలి లోపాలను కూడా అంగీకరించవలె.

నేటి భారత ప్రజానీకం హృదయాలలో అశోకుని మూర్తి చుట్టూ ఆరాధనా భావం ప్రబలింది. అహింస, పంచశీలవంటి సిద్ధాంతాలను అశోకుని భావాలతో ముడిపెట్టడం జరిగింది. అహింస, సహనంతో కూడిన సుదీర్ఘమైన రాజకీయ సంప్రదాయం అశోకునితో ప్రారంభమై శతాబ్దాల తరబడి అవిచ్ఛిన్నంగా కొనసాగి గాంధీజీ రాజకీయ తత్త్వంలో పరాకాష్ఠ నందినదని భావించసాగినారు. కాని చక్రవర్తిగా అశోకుని కృషి భారత చరిత్రనుండి భారతీయ ఆలోచనా విధానం నుండి పూర్తిగా అదృశ్యమైనదనే విషయాన్ని ఉపేక్షించకూడదు. అశోకుని భావాల రాజకీయ ప్రాముఖ్యాన్ని సమాధి చేయడంలో

మనవారు విజేతలయినారు. భారతీయ లౌకిక గ్రంథాలలోని రాజవంశ పట్టికలలో అశోకుడు నామమాత్రావశిష్టుడై ఆతని శాసనాల లిపివలెనే అజ్ఞాతంగా ఉండిపోయినాడు. మధ్యయుగ శాసనాలు కొన్ని అశోకుని ప్రస్తావిస్తున్నవి. కాని అవి అంత ముఖ్యమైన శాసనాలు కావు. అందులో సంప్రదాయ విరుద్ధమైన అతని ధర్మ విధానాన్ని గురించిన ప్రసక్తియేలేదు. తరువాతి కాలంలో చెప్పుకోదగిన రాజెవ్వడు అశోకుని సిద్ధాంతాలను తన విధానాలకు ఆధారంగా అనుసరించలేదు. అశోకుని బ్రాహ్మీలిపిని శతాబ్దాల తరబడి క్రమబద్ధంగా చదువుతూ ఉన్నట్లయితే అతని విధానాన్ని గూర్చిన ప్రసక్తి భద్రంగా ఉండి ఉండేది.

మూర్ఖుడుగా, దుష్టుడుగా ఉంటూ హఠాత్పరిణామంవల్ల ధర్మాత్ముడుగా మారి చివరకు విశ్వాసహీనులు పెట్టిన బాధలను అశోకుడనుభవించినట్లు బౌద్ధ గ్రంథాలు చిత్రిస్తున్నాయి. ఇది ప్రతి మతంలోను మహర్షుల జీవితాలను గురించి మనకు సుపరిచితమైన కథనమే. శాసనాలు, స్తంభాలు ఉన్నప్పటికీ సామాన్య ప్రజలలో అశోకుని గురించిన గాథలు, సంప్రదాయాలు నిలువలేదు. నేటి అశోకుని ఆరాధన ఇటీవల ప్రారంభమైనదే. అతి చారిత్రక యుగంనాటి ప్రయోజనమే అశోకుని స్తంభాల కాపాదించి వాటిని లింగాలనే భావంతో ఆరాధింపసాగినారు. భవిష్యత్తును గూర్చి ఇంతదూరం అశోకుడాలోచించినట్లయితే అతని భావాలే విధంగా ఉండేవో ఊహాతీతం.

బౌద్ధంలో పూర్తి విశ్వాసం ఉన్నవాడుగా మారినట్లు బౌద్ధ గ్రంథాలు అశోకుని చిత్రిస్తున్నాయి. కాని రాజుగా అశోకుడు నిర్వహించిన పాత్ర బౌద్ధ రచనలకు విరుద్ధంగా ఉంది. తన రాజ్యకాలం ప్రథమ అర్ధభాగంలో సహనాన్ని, మానవతా వాదాన్ని అశోకుడు నొక్కి చెప్పినాడు. ఇవి బౌద్ధ మత సిద్ధాంతాలకు అనుగుణమైనవేకాని అతని వ్యక్తిగత భావాలు మాత్రమే. అవి తన ప్రజలందరు నిష్పక్షపాత బుద్ధితో అభ్యసించవలసిన గుణాలని అతడు ఆశించినాడు. కాని మానవ స్వభావాన్ని పూర్తిగ మార్చివేయడంలో విజయం సాధించాననే ఆత్మవిశ్వాసంతో అతని మానవతా వాదం క్రమంగా మసకబారి పోయిందనీ, తాను సాధించిన విజయంపట్ల ప్రత్యయంతో అహంకారానికి బానిస అయినాడని అశోకుని ధర్మ విధానంపై వ్రాసిన అధ్యాయంలో వివరించినాము.

అశోకుడు ప్రయత్నించిన విధానానికి క్రీ. పూ. మూడోశతాబ్ది భారతదేశ సాంఘిక, ఆర్థిక పరిస్థితులు అనుకూలించినాయి. అవి పశుపాలక దశ నుండి గ్రామీణ వ్యవసాయ ఆర్థిక విధానానికి పరివర్తన జరుగుతున్న రోజులు. కొత్త పరిస్థితులతో సమాధాన పడవలసిన

అవసరం ఏర్పడింది. ఈ సమాధానంలో సాంఘిక బాధ్యతలవంటి ముఖ్య అంశాలపై ధమ్మం నొక్కిపెట్టింది. ప్రశాంత పరిస్థితులలో ఈ పరివర్తన జరగడానికి అశోకుడే కారణం. అందుకాతని అభినందించవలె. ముప్పది సంవత్సరాలపాటు యుద్ధం లేకుండటం సాధారణ విషయం కాదు. ఈ ప్రశాంత పరిస్థితులే కొత్త ఆర్థిక సాంఘిక విలువలను స్పష్టంగా అర్థం చేసుకోవడానికి తోడ్పడినాయి.

ధమ్మాన్ని పరిశీలించడం ద్వారా తన భావాల ప్రచారానికి అశోకుడవలంబించింది మత సాంఘిక సాధనమని స్పష్టమవుతుంది. వ్యక్తిగతంగా అశోకుడు బౌద్ధుడు. అందుచే తన కొత్త భావాలను కొంతవరకు బౌద్ధంతో ముడి పెట్టినాడు. అంతేకాక బౌద్ధం ఆ భావాలను వ్యతిరేకించదు. ఆర్థిక, రాజకీయ పరివర్తన జరుగుతున్న యుగంలో సమకాలిక భావాలను ఒక కొత్త మతాన్ని అనుసంధానించడంవల్ల కొన్ని ప్రయోజనాలు కూడ లేకపోలేదు. ఈ విధానాన్ని చాల మంది చక్రవర్తులు అనుసరించినారు. ఈజిప్టులో ఇఖ్నాటన్ భావాలను దరయన్ జొరాష్ట్రియన్ మతాన్ని, మనిఖేఇజాన్ని మొదటి షాపూర్, దిన్ఇలాహీని అక్బరు అనుసరించడం ఉదాహరణలుగా చెప్పవచ్చు. చైనాలో షీహుయాంగ్ టీ వలె గతాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని ప్రయత్నించిన పాలకుల ఆశయానికి పై విధానానికి పోలిక ఉంది. పెద్ద ఎత్తున ప్రజలు బౌద్ధంలోనికి మారాలని కోరక, సాంఘిక ప్రవర్తనలో బుద్ధిపూర్వకంగా మానవత్వాన్ని ప్రదర్శించవలెనని అశోకుడు నొక్కి చెప్పడం గమనార్హము.

నాటి రాజకీయ విధానం దృష్ట్యా ధమ్మ పరిణామాన్ని ఆలోచించవలె. క్రీ. పూ. మూడోశతాబ్దిలో భారతదేశం ఏకైక జాతీయ ప్రమాణం కాదు. అయినప్పటికీ రాజకీయంగా కేంద్రీకృత రాచరికం క్రిందికి వచ్చింది. కేంద్రాధిపత్యంపై ఆధారపడిన పాలన విధానం అమలు జరిగింది. అనేక సాంస్కృతిక పద్ధతులున్న నాటి సమాజంలో కేంద్రీకృత రాచరికం వంటిది తప్పనిసరి. సాంస్కృతిక పరిణామంలో ఏ దశలోనున్న ప్రజలకయినా ధమ్మం అంగీకృతమైన జీవిత విధానం. దేశవ్యాప్తంగా ధమ్మానుసరణ సమీకరణశక్తిగా ఉపయోగింపగలదని అశోకుడాశించినాడు. ఈ విషయంలో పదునెన్మిది శతాబ్దాల అనంతరం పరిపాలించిన అక్బరు చర్యలను అశోకునితో పోల్చవచ్చు.

అత్యంత లాభసాటి అయిన స్వేచ్ఛా వాణిజ్య వికాసానికి అశోకుని యుగం చాల అనుకూలంగా ఉంది. సమర్థమైన పరిపాలనతో వాణిజ్య సౌకర్యాలు పెరిగి, వాణిజ్యాభివృద్ధికి కారణమవుతాయి. ముప్పది సంవత్సరాల ప్రశాంత వాతావరణంలో వికసించిన వాణిజ్యం తరువాతి శతాబ్దాలలో మంచి ఫలితాల నిచ్చింది. అశోకుని అనంతరకాలం రాజకీయంగా క్షీణించినప్పటికీ ఆర్థిక వికాసం సాధించినట్లు పురావస్తు

ఆధారాలు చాటుచున్నవని గుర్తుంచుకోవడం అవసరం. ఈ ఆర్థిక వికాసానికి అశోకుని సుస్థిర పాలన కాలమే కారణం.

అశోకుని వ్యక్తిగతమైన బలహీనతలుండవచ్చు. అవి పాలన కాలం చివరలో బయల్పడినాయి. బలహీనతలేమైనప్పటికీ క్రీ. పూ. మూడో శతాబ్దినాటి క్లిష్ట సాంస్కృతిక నేపథ్యంలో ధమ్మాన్ని నిర్వచించి ప్రబోధించడానికి చేసిన ప్రయత్నంలో అతని ధైర్యాన్ని అభినందించవలె. మతంపట్ల, తమ పూర్వీకుల సంప్రదాయాల పట్ల మనిషికి గల బాధ్యతలను మత గ్రంథాలు నొక్కి చెబుతున్నాయి. వీటికి అశోకుడు అన్నిటికంటె బహుశా ముఖ్యమైన బాధ్యతను చేర్చినాడు. అది 'తోటి మానవుని పట్ల మనిషికి గల బాధ్యత.' దీన్ని ఆరో శిలా శాసనంలో చెప్పినాడు. అవకాశం లభించినపుడెల్లా అహింసను చాటడంలో మాత్రమే అతని మానవతావాదం లేదు. బాధ్యతాయుతమైన సాంఘిక ప్రవర్తన పై నొక్కు పెట్టడంలోను, ప్రవర్తనలో నిగ్రహం చూపుడని చెప్పడంలోను, మానవశక్తిగల పరిమితులను గుర్తించడంలోను అతని మానవత్వం ప్రతిఫలిస్తుంది. ఈ అంశం అతని మొదటి శాసనాలలో కనిపిస్తుంది. సర్వదా అశోకుడు వ్యక్తి గౌరవాన్ని నొక్కి చెప్పినట్లు శాసనాలు చదవడంవల్ల స్పష్టమౌతున్నది. ధర్మ విధానం అనుసరించడంవల్ల దివ్యత్వం ప్రత్యక్ష్యం కాక తప్పదు. దేవతలు భూమిపైకి దిగి మానవులతో కలిసి తిరుగుతారు. కాని దేవతలు మానవుని స్థాయిలోనే అతనితో కలిసి తిరుగుతారని అతని ఆశయం.

అయినప్పటికీ అశోకుని మరణంతో ధర్మప్రయోగం అంతరించి, భారతీయ సంప్రదాయంలో ఛాయా మాత్రంగా కూడ మిగలక నశించింది. అతని శాసనాలు చదివే వరకు సుమారు రెండువేల సంవత్సరాల వరకు ఆ సంప్రదాయాన్ని లక్ష్య పెట్టిన వారే లేరు. శాసన పరిశోధనతో అతని భావాలు బయల్పడినాయి. అశోకునిలో శ్రద్ధ పునరుద్ధరించడం జరిగింది. కంబోడియాలో ఖ్మేర్ రాజైన ఏడో జయవర్మ అశోకుడు ప్రవచించిన భావాల వంటి భావాలనే అనుసరించినాడు. కాని తనకు పూర్వం గతించిన అశోకుని గురించిన పరిజ్ఞానం ఏమాత్రం అతనికి లేదు. అశోకునకు మనకు పెద్ద కాలవ్యవధి ఉంది. అందుచేత ధమ్మ విధానం విఫలం కావడానికి కారణాలను స్పష్టంగా గుర్తించలేము. కాని వ్యక్తి స్థాయిలో అశోకుడు ప్రదర్శించిన అపార ఔత్సుక్యం వల్ల ధర్మానికి వ్యతిరేకత ప్రబలిందని సూచింపవచ్చు. ఈ విషయం అశోకుని తరువాతి శాసనాలలో స్పష్టమవుతుంది. ఈ శాసనాలు ధమ్మ మహామాత్తుల అధికారాలను భావ నియంత్రణాన్ని అహంకార పూరిత మానసిక ఔద్ధత్యాన్ని సూచిస్తున్నాయి. ఇది ధమ్మ ప్రభావాన్ని క్లుప్త పరచడమే గాక భావ వికాసానికి పెద్ద నిరోధమయింది. అశోకుని

ఔత్సుక్యం వల్ల ధమ్మం కేవలం ఆతని వ్యక్తిగత విశ్వాసమని ఆతని తరువాతి వారు అపార్థం చేసుకొనడంతో అందులోని మౌలికమైన సామాజిక మానవతావాద ప్రాముఖ్యాన్ని గుర్తించలేక పోవడం జరిగి ఉండవచ్చు.

అశోకుని వ్యక్తిత్వానికి కారణమైన నేపథ్యాన్ని పరిశీలించిన తరువాత సయితం అశోకుని ఘనతను గురించి పైన చేసిన భావననే నొక్కి చెబుతున్నాను. తన సంస్కృతిని, వేగంగా మారుతున్న సామాజిక అవసరాలను అశోకుడు గ్రహించినాడు. అందుకు పరిస్థితులు, స్వయం కృషి అతనికి తోడ్పడినాయి. ఈ గుణాలు అతనిలో అపారంగా ఉన్న ఆదర్శవాదంతో సమ్మేళనమైనాయి. ఈ రెండు అంశాలు సమకాలిక పరిస్థితులతో ప్రయోగం చేయడానికి, వాటికి అపూర్వమైన పరిష్కారం సూచించడానికి తగిన ధైర్యాన్ని అశోకునకు ప్రసాదించినాయి.

మొదటి అనుబంధం

# అర్థశాస్త్ర రచనా కాలం

అర్థశాస్త్ర రచనా కాలాన్ని గురించి నేటికి చాల సారస్వతం తయారయింది. భారత చరిత్రలో మౌర్య, గుప్తయుగాల మధ్య ఈ గ్రంథానికి పెక్కు తేదీలు సూచితమైనాయి. నేటివరకు వచ్చిన ఈవాదాలను సంక్షిప్తంగా సమీక్షించి గ్రంథ కాలాన్ని గురించి ఒక సూచన చేయడానికి ప్రయత్నిస్తాను.

శ్యామశాస్త్రి ఇంగ్లీషు అనువాదానికి ఫ్లీట్ పండితుడు ఉపోద్ఘాతము వ్రాసినాడు. అర్థశాస్త్ర శైలి, విషయము ప్రాచీనమైనవి, ప్రాచీన రచయితలు అర్థశాస్త్రం నుండి ఉల్లేఖించినారని, అందుచేత తాను అర్థశాస్త్రం చాల ప్రాచీన గ్రంథమని విశ్వసిస్తున్నట్లు ఆ ఉపోద్ఘాతంలో వ్రాసినాడు. రాచరికంపై ప్రభుత్వ సార సంగ్రహంగా ప్రథమ రాజకీయ మార్గదర్శినిగా అర్థశాస్త్రం ఉపకరించి ఉంటుంది. మెగస్తనీసు రచనలోని వాక్యాలను, ప్రాచీన శాసనస్థములైన అంశాలను అర్థశాస్త్రం బలపరుస్తున్నదని కూడ ఫ్లీట్ పేర్కొన్నాడు. మరికొన్ని ఉపపత్తులు ఆధారంగా శ్యామశాస్త్రి కూడ అర్థశాస్త్రం ప్రాచీన గ్రంథమని చెబుతున్నాడు. అర్థశాస్త్రం చివరి అధ్యాయంలో కౌటిల్యునకు విష్ణుగుప్తుడనే నామాంతరమున్నట్లు, అతడు నందులను నిర్మూలించినట్లు చెబుతున్న శ్లోకం ఆ ఉపపత్తులలో ఒకటి. అంతేకాక యాజ్ఞవల్క్యుడు కౌటిల్యుని శైలి బ్రాహ్మణ, ఉపనిషత్తుల శైలికి సన్నిహితంగా ఉందని, పాణిని నొక్కిపెట్టిన వ్యాకరణ రూపాలతో కౌటిల్యునకు పరిచయం లేదని, కౌటిల్యుడు వర్ణించిన సమాజ స్వరూపం మౌర్యయుగ సమాజం లేదా మౌర్యయుగ పూర్వానికి చెందిన సమాజమని శ్యామశాస్త్రి పేర్కొన్న ఉపపత్తులు.

కృష్ణారావుకూడ ఈ సమస్యను చర్చించి అర్థశాస్త్రం మౌర్య యుగానిదేనని నిర్ణయించినాడు. కాని అశోకుని విధానము కౌటిల్యుడు సమర్థించిన విధానమేనన్న అతని వాదం ప్రత్యయజనకంగా లేదు. అశ్వఘోషుడు కౌటిల్యుని ప్రస్తావిస్తున్నందున అర్థశాస్త్రంలో అశ్వఘోషునకు పరిచయముందని కృష్ణారావు మరొక వాదన. అశ్వఘోషుడు క్రీ.శ. రెండవ శతాబ్దివాడని సర్వసాధారణంగా అంగీకరిస్తున్నారు. కాని అశ్వఘోషుడు కౌటిల్యుని మాత్రమే పేర్కొన్నాడు కాని గ్రంథాన్ని పేర్కొనలేదు. అందుచే కృష్ణారావు వాదనలో బలంలేదు.

ఈ వివాదంలో ఎక్కువ కాలం అధికంగా శ్రమించిన ప్రధాన కక్షిదారులు జాలీ, జయస్వాల్ పండితులు. అర్థశాస్త్రం క్రీ.శ. మూడో శతాబ్దికో, ఆ తరువాతి కాలానికో చెందిందని జాలీ వాదము. జాలీ ఉపపత్తులన్నింటిని చాల సమర్థంగా జయస్వాల్ పూర్వపక్షం చేసినాడు. అందుచేత జాలీ ఉపపత్తులను పెద్దగా చర్చించనవసరం లేదు. అర్థశాస్త్రం కౌటల్యుని రచనయే 'చీనపట్ట' అనే మాట వాడకాన్ని గురించి ప్రత్యయ జనకమైన సాక్ష్యాన్ని జయస్వాల్ పండితుడు ఉద్ధరించలేక పోయినాడు. 'చీనపట్ల' పదాన్ని 'చైనాపట్టు' అని సాధారణంగా వ్యాఖ్యానిస్తాము. చైనా పట్టు తూర్పు భారతంగుండా భారతదేశానికి తరువాతి కాలంలో దిగుమతి అయింది. అందుచేత అర్థశాస్త్రం తరువాతి కాలానికి చెందినదని చెప్పటానికి ఆ గ్రంథంలోని 'చీనపట్ల' పదాన్ని తరచు సూచించడం జరుగుతుంది. కాని క్రీ. పూ. కనీసం రెండో శతాబ్దంలోనే బాక్ట్రియాలో పట్టును వాడినట్లు, పట్టును భారతదేశం నుండి బాక్ట్రియా దిగుమతి చేసికొనినట్లు నిదర్శనలు లభిస్తున్నాయి. బాక్ట్రియన్లు క్రీ. పూ. 129 లో చైనా పట్టును వాడుతున్నట్లు చాంగ్–కీన్ చూసినాడు. స్థానికులు ఆ పట్టు భారతదేశం నుండి వచ్చినట్లు అతనికి చెప్పినారు. ముఖ్యంగా జకువాన్ రాష్ట్రం నుండి వచ్చినట్లు ప్రస్తావించడం చాలా చిత్రమైన సంగతి. అనాదిగా జకువాన్ రాష్ట్రం పట్టు పురుగులకు ప్రసిద్ధి అంటే గిలిగిత్ ప్రాంతంలో పట్టు తయారుకాదని స్పష్టమవుతున్నది. దీన్ని బట్టి పట్టు భారతదేశంలో లభ్యమౌతున్నదని, కాని జకువాన్ రాష్ట్రం నుండి వస్తున్నదని తెలుస్తున్నది. ఇక 'చీన పట్ట' అనే పేరు సమస్యను తేల్చవలె. చీనపట్ట పదంలోని చీన శబ్దం 'చిన్' సామ్రాజ్యాన్ని సూచిస్తున్నట్లు సాధరణమైన విశ్వాసం. 'చిన్' సామ్రాజ్యం మౌర్య సామ్రాజ్యం తరువాత వర్ధిల్లింది. కాని షిహుయాంగ్‌టీకి పూర్వం 'చౌ' యుగంలోని చిన్ అనే సామంతరాజ్య ప్రస్తావనే చీనా అని మరొక సూచన. ఏమైనప్పటికీ ప్రాచీన యుగంలో పట్టును మరొక పేరుతో వ్యవహరించేవారని అర్థశాస్త్రాన్ని పునర్విచారణ చేసిన సందర్భంలో 'చీనపట్ట' అనే పదం ప్రక్షిప్తం చేశారని భావించడం సముచితం.

కౌటిల్య, కాళిదాసులను గూర్చిన తన అధ్యయనంలో రఘు వంశంలోని కొన్ని భాగాలలో (XVII, 49, 76; XVIII, 50) కాళిదాసు అర్థశాస్త్ర వాక్యాలను సంగ్రహించినట్లు రాఘవన్ వ్రాసినాడు. ఇవి ప్రధానంగా రాజకీయాలకు సంబంధించిన సాంకేతిక పదాలవలె ఉన్నాయి. కాళిదాసు కాలంలో ఈ పదాలు వాడుకలో ఉన్నవనడంలో సందేహం లేదు. వీటికి అర్థశాస్త్రం వంటి గ్రంథాలు ఆధారాలు. కాళిదాసువంటి విద్యావంతులకు ఈ పదాలు సుపరిచితాలు.

గ్రంథ మూలంలో శ్లోకాలకు ప్రస్తావన ఉన్నందున అర్థశాస్త్రం మొదట్లో శ్లోకాలలో ఉన్నదని డి. ఆర్. భండార్కర్ సూచన. ఈ అభిప్రాయాన్ని అంగీకరిస్తే అర్థశాస్త్రాన్ని సూత్రాలలో ఎప్పుడు వ్రాసినారనే సమస్య ఉదయిస్తుంది. ఈ విషయంలో దండి, భవభూతులను భండార్కర్ ఉదాహరిస్తున్నారు. అర్థశాస్త్రాన్ని ఛందోబద్ధంగా వ్రాసినారని దండి చెప్పగా, భవభూతి అందలి సూత్రాలను ఉదాహరించినాడు. అందుచేత క్రీ.శ. నాలుగు వందల ప్రాంతం నుండి అనగా జనాదరణ పొందసాగినప్పటి నుండి అర్థశాస్త్రాన్ని సూత్ర రూపానికి మార్చినారని భండార్కరు నిర్ణయించినాడు. మౌలిక గ్రంథం శ్లోకాలలో ఉండి ఉండవలె. కాని ప్రాచీన గ్రంథాలన్నీ శ్లోకాలలోను, సూత్రాలలోను ఉన్నట్లు తెలుస్తుంది. అందుచే అర్థశాస్త్రం శ్లోక సూత్రాలలో ఏరూపం ప్రాచీనతరమో స్పష్టంగా చెప్పడం సాధ్యంగాదు. ప్రస్తుతం లభ్యమౌతున్న అర్థశాస్త్రంలోని శ్లోక, గద్య భాగాలలో ఏవి ప్రాచీనతరమో నిర్ణయించడానికి కూడ సవిమర్శకమైన పరిశీలన జరుగవలె.

అర్థశాస్త్రంలోని కొన్ని భాగాలు, కొన్ని జాతక కథలు ఒకే కాలంలో తయారయినట్లు కనిపిస్తున్నది. అందుకు కారణం శ్రేణుల నిర్మాణం వంటి ఆర్థిక జీవితంలోని ప్రధానాంశాలు రెండు గ్రంథాలలోను కన్పించడమే. భండార్కరు ఒక శ్లోకాన్ని మన దృష్టికి తెచ్చినాడు. అర్థశాస్త్రంలోను, జాతకకథలలోను ఇంచుమించు ఒకే రూపంలో ఉంది. ప్రాణహానిని, ధనలాభహానిని గురించిన అధ్యాయం చివరలో ఆ శ్లోకం ఉంది. అందుచే అర్థశాస్త్రంలో ఉండడమే సముచితమని అర్థశాస్త్రంతో పరిచయమున్నందున జాతక రచయిత ఆ శ్లోకాన్ని ఉదాహరించి ఉంటాడు అని భండార్కరు అంటాడు. కాని మనం మరొక విషయాన్ని ఉపేక్షించరాదు. ఉభయ రచయితలు ఆ శ్లోకాన్ని వేరొక ఆధారం నుండి గ్రహించి ఉదాహరించి ఉండవచ్చు. వాస్తవానికి రెండు గ్రంథాలు నాటికి ప్రచారంలో ఉన్న అనేక చాటువులను ఉదహరిస్తున్నాయి.

జాలీ పండితునితో మొత్తంమీద ఏకీభవిస్తూ కౌటిల్యుని కర్తృత్వాన్ని వింటర్‌నిడ్జ్ సందేహిస్తున్నాడు. ముఖ్యంగా రాజ్యాధికార సప్తాంగ విభాగం రాజకీయ నాయకుల

పాండిత్య ప్రకర్షకు ఉపకరించేదే కాని ఆచరణ యోగ్యం కాదని ఆతని విమర్శ. ఈ విమర్శను "లా" పండితుడు సమర్ధంగా పూర్వ పక్షం చేసినాడు. సప్తాంగ విభాగము మండల సిద్ధాంతానికి అవసరమని లేకపోతే స్వపక్ష పరపక్ష బలాబలాలను గుర్తించడం రాజుకు అసాధ్యమని 'లా' అభిప్రాయం. అర్థశాస్త్రం ఉద్దేశించినది చిన్న రాజ్యమా పెద్ద రాజ్యమా అనే అంశంపై పెద్ద చర్చ జరిగింది. మౌర్య సామ్రాజ్యం సుస్థిరం కాక పూర్వం చంద్రగుప్తుని రాజ్యారంభ కాలంలోనే అర్థశాస్త్ర రచన జరిగిందని మా సూచన. నంద సామ్రాజ్యంతో కౌటిల్యునకు మంచి పరిచయం ఉంది. ఆ సామ్రాజ్యమే చక్కని ఉదాహరణగా కౌటిల్యునకుపకరించింది. కాని నంద సామ్రాజ్యం మౌర్య సామ్రాజ్యమంత పెద్దది కాదు. మౌర్య సామ్రాజ్యం తొలిరోజులే అంతర రాజ్య సంబంధాలను గురించిన అధ్యాయం వ్రాయవలసిన అవసరం కల్పించినాయి. తరువాత సామ్రాజ్య వ్యాప్తితో అనంతరం పరిపాలనను గురించిన ఆధ్యాయం వ్రాయడం లేదా విస్తరించి వ్రాయడం జరిగింది. మౌర్య సామ్రాజ్యమంతటి సువిశాల సామ్రాజ్య భావం భారత రాజనీతికి కొత్త. అందుచే కౌటిల్యుని వంటి సైద్ధాంతికుడు సయితం చిన్న రాజ్యాన్ని దృష్టిలో ఉంచుకొనే వ్రాసినాడన్నందున ఆశ్చర్యపడవలసిన పనిలేదు. మౌర్య అధికారానికి కౌటిల్యుడు ఆలోచించినాడనడం సంభవం. అదే భావాన్ని మనసులో ఉంచుకొనే అంతర రాజ్య సంబంధాలను వివరించినాడనడం హేతుబద్ధం.

అర్థశాస్త్రం మౌర్య యుగానిది కాదని, తరువాతి కాలానికి చెందిన గ్రంథమని రాయ్‌చౌధురీ అభిప్రాయం. అందుకాతడు ప్రధానంగా రెండు అంశాలను సూచిస్తున్నాడు. అర్థశాస్త్ర కాలనిర్ణయానికి ఉదాహరిస్తున్న రచయిత లెవ్వరు క్రీ.శ. మూడువందల సంవత్సరాలకు పూర్వీకులు కారు. అర్థశాస్త్రం సంస్కృత భాషలో ఉంది. కాని మౌర్యులు వాడిన భాష ప్రాకృతం అనేవి రాయ్‌చౌధురి ఉపపత్తులు. ఈ వాదం తన శాసనాలకు అశోకుడు ప్రాకృతభాషను వాడడంమీద ఆధారపడింది. కాని జనబాహుళ్యం చదవటానికి ఉద్దేశించినవైనందున శాసనాలను ప్రజల భాషలోనే వ్రాయడం సహజం. మౌర్యయుగంలో సయితం విద్యావంతులలోను, ఆస్థాన మండలాలలోను సంస్కృతం వాడడానికి అభ్యంతరం ఉన్నదనడానికి అవకాశం లేదు. సంస్కృతం బహుళ ప్రచారంలో ఉన్న గుప్తయుగంలో కూడ సమాజంలో సంస్కృత ప్రాకృత భాషలు మాటాడే తరగతుల మధ్య విభేదం ఉన్నట్లు కాళిదాసు నాటకాలవల్ల తెలుస్తున్నది. అశోకుడు ఏ లక్ష్యాలతో శాసనాలు వేసినాడో అవే లక్ష్యాలతో గుప్తరాజు లెవరైనా శాసనాలు వేయించి ఉంటే ప్రాకృత భాషనే వాడి ఉండేవారు. ప్రాకృతాన్ని జన బాహుళ్యం వాడుతున్నందున శాసనాలను ఆ భాషలోనే

వేయడాన్ని అశోకుడు ప్రోత్సహించి ఉంటాడు. పాండిత్య ప్రకర్షకు సంస్కృతాన్నే వాడి ఉండవచ్చు.

సముద్రతీరంలోను, నదుల ఒడ్డున ఉన్న నగరాలు దారు నిర్మితాలని మెగస్తనీసు ఆధారంగా ఏరియన్ వ్రాయగా నిర్మాణాలలో దారువు నుపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ, కౌటిల్యుడు ఇటుకల వాడకాన్ని సమర్థించినాడనేది రాయ్‌చౌధురి సూచిస్తున్న మరొక అంశం. ఇందులో మాకు వైరుధ్యమేమీ కనిపించదు. ఇటుకల కంటే కలప త్వరగా నశిస్తుంది కాబట్టి నగరాలను కలపతో నిర్మించడంలో ఉన్న ప్రమాదాలను కౌటిల్యుడు గమనించినాడు. ఆ రోజులలో అడవులను విపరీతంగా ఛేదిస్తున్నారు. దారు నిర్మాణాలు చౌక అయినందున కౌటిల్యుని సలహాను ప్రజలు నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంది. అంతేకాక నదీ సముద్రతీర నగరాలు మినహాయించి, ఇతర నగరాలు ఇటుకలతో నిర్మించినారని, ఇటుకలు సులభంగా లభ్యంకాని తావులలోను వరదల బాధలను అధిక వర్షాల ప్రమాదాలను తట్టుకోవడానికి కోసమున్నూ కలపను వాడినట్లు ఏరియన్ వ్రాసినాడు. నిర్మాణాలకు దారువు నుపయోగించడాన్ని తాను వ్యతిరేకించినప్పటికీ దారు నిర్మాణాలు అమలులో ఉండడం కౌటిల్యునకు తెలియకపోలేదని అగ్నిమాపకాన్ని గురించి తీసుకోవలసిన జాగ్రత్తలను విపులంగా చర్చించిన ఆతని రచనవల్ల తెలుస్తుంది. అగ్ని ప్రమాదాలను గురించి అతని భయాన్ని బట్టి దారు నిర్మాణాలు తరచు అగ్ని కాహుతి అయ్యే ప్రమాదం ఉన్న కాలంలోనే కౌటిల్యుడు ఉన్నాడని స్పష్టమౌతుంది.

మౌర్యుల రాజ బిరుదాల ప్రసక్తి అర్థశాస్త్రంలో లేదనేది రాయ్‌చౌధురి మరొక వాదం. అయితే బిరుదుల ప్రసక్తి లేకుండటానికి కారణం లేకపోలేదు. ఆ రోజులలో రాజ బిరుదావళిని గురించి నిర్దుష్టమైన పద్ధతిలేదు. దేవానాం ప్రియ బిరుదాన్ని ఇద్దరు రాజులు వాడినందున అది మౌర్య బిరుదమే అయి ఉండవచ్చు. కాని ఆ ఉభయుల విషయంలోను ఆ బిరుదం వ్యక్తిగతాభిమానాన్ని సూచించవచ్చు. కౌటిల్యుడు మౌర్య రాజు లెవరిని పేరుతో ప్రస్తావించలేదు. అందుచే రాజులు ధరించిన బిరుదులు పేర్కొనకపోవడం చాల సహజంగానే ఉంది.

సమాహర్తృ, సన్నిధాతృ మొదలగు అర్థశాస్త్రంలో కనిపించే కొన్ని ఉద్యోగ నామాలు మౌర్యయుగానంతర కాలంలో వాడుకలోనికి వచ్చినాయని తెలుస్తున్నది.
మహాయాత్ర అనే ఉద్యోగ నామం అర్థశాస్త్రంలో అరుదుగా కనిపిస్తుంది. ఈ పేరు స్పష్టంగా మౌర్యకాలానిదే. క్రీ. శ. ప్రథమ శతాబ్దాలలో ఆ వరాన్ని వాడడం మానినారు. లేదా ఆ పదాన్ని మార్చి వేసినారు. దీన్నిబట్టి అర్థశాస్త్ర చరిత్రలో మహామాత్ర పదం ఒక విషయాన్ని

స్పష్టం చేస్తున్నది. ఒకప్పుడు బహుశా మౌర్యయుగంలో దైనందిన పరిపాలనలో ఆ బిరుదం వాడుకలో ఉన్నప్పుడు అర్థశాస్త్రంలో ఆ పదాన్నే తరచుగా వాడినారు. క్రమంగా వాడుక తగ్గిన తరువాత  సమకాలిక పదాలు ఆ పదం స్థానాన్ని ఆక్రమించినాయి. కొన్ని చోట్ల అదే పదం ఇంకా కనిపించటానికి కారణం గ్రంథాన్ని తిరుగ వ్రాయడంలో జరిగిన అశ్రద్ధ అని చెప్పవచ్చు.

రాయ్‌చౌధురి చివరి వాదం నాడు ఉన్న భౌగోళిక పరిజ్ఞానం మీద ఆధారపడింది. పార సముద్ర, చీన భూమి, కంపు అనే పదాలు అర్థశాస్త్రం తరువాతి కాలానికి చెందినవని సూచిస్తున్నవని అతడంటాడు. కాని చౌనాను గురించిన పరిజ్ఞానం చాల ప్రాచీన కాలంనుండి ఉన్నదని పైన వివరించినాను. అందుచే అర్థశాస్త్రం తరువాతి కాలానిదని చెప్పడానికి భౌగోళిక పరిజ్ఞానం బలమైన వాదంకాదు. అర్థశాస్త్రంలో ప్రక్షిప్తాలున్నవని అంగీకరించినాము. అందుచే తరువాత ప్రచారమైన స్థల నామాలు అర్థశాస్త్రంలో ప్రవేశించి ఉంటాయి. గ్రంథాన్ని సమకాలికంగా రూపొందించడానికి మూల గ్రంథ భౌగోళిక పరిజ్ఞాన పరిధిని పెంచడం ఆ సంపాదకునకు చాల అవసరం.

కౌటిల్యునకు విష్ణుగుప్తుడనే పేరు తరువాత కల్పించబడిందని ఓర్ఝూ సూచన. ఈ పేరు క్రీ.శ. ఆరు, ఏడు శతాబ్దాలలో ప్రచారంలోనికి వచ్చింది. పురాణాలు, మహావంశ మొదలైన ప్రాచీన గ్రంథాలలో చాలవరకు కౌటిల్య, చాణక్య అనే పేర్లు మాత్రమే కనిపిస్తున్నాయి. నేడు లభ్యమౌతున్న మహావంశ ప్రాచీన మూల గ్రంథం ఆధారంగా క్రీ.శ. ఐదో శతాబ్దంలో తయారయింది. అంతేకాక సింహళం నుండి బౌద్ధులు తెచ్చిన అంశాలపై ఆధారపడి తయారుచేసిన మహావంశ గ్రంథంలో చాణక్యుని గురించి కేవల కల్పనలు ఉందవలసిన ప్రత్యేక అవసరం కనిపించదు. విష్ణుగుప్తుని సమస్యపై గ్రంథాంతంలో ఉన్న ఉపసంహార వాక్యం చాలా ముఖ్యమని మా అభిప్రాయం. కౌటలీయార్థశాస్త్రం పదునైదో విభాగంలోని ప్రథమాధ్యాయంలో కౌటలీయార్థశాస్త్రం పరిసమాప్తమంటూ వివరించే మామూలు ఆశ్వాసాంత గద్య ఉంది. దాని తరువాత మరొక వాక్యం ఉంది. ఆ వాక్యాన్ని క్రిందివిధంగా తర్జుమా చేయవచ్చు:

శాస్త్ర వ్యాఖ్యాతలలోని లోపాలను పరిశీలించి
విష్ణుగుప్తుడు సూత్ర, వ్యాఖ్యానాలు రెండు వ్రాయ
డానికి సంకల్పించినాడు.

విష్ణుగుప్తుడు గ్రంథ రచయిత కానట్టు ఈ వాక్యం సూచిస్తున్నదని మా అభిప్రాయం. ప్రస్తుత రూపంలో గ్రంథాన్ని మార్చడానికి మాత్రమే విష్ణుగుప్తుడు బాధ్యుడు. సూత్రాలలోనికి

మార్చుడాన్ని గురించిన ప్రస్తావన ఆదిలో గ్రంథం శ్లోక రూపంలో ఉన్నదని సూచిస్తున్నది. ఓర్ఘూ సూచించినట్లు విష్ణుగుప్తుని ప్రతి ఆరు, ఏడు శతాబ్దాలలో లేదా అంతకు ఒకటి రెండు శతాబ్దాలకు పూర్వం తయారయి ఉండవచ్చును. విష్ణుగుప్తుని సంపాదకత్వం క్రింద తయారయి ఉండవచ్చును. విష్ణుగుప్తుని సంపాదకత్వం క్రింద తయారయినందున ఆప్రతితో అతడే రచయిత అన్నంత గాఢంగా అతని పేరు ముడి పెట్టడం సహజం. ఇట్టి పరిణామాలు సారస్వత ప్రపంచంలో అరుదు కాదు.

మూల గ్రంథంకంటె విష్ణుగుప్తుడు సంకలనం చేసిన అర్థశాస్త్రం, అదే అంశంపై వివిధ గ్రంథాలలోని అంశాలను చేర్చుకుని పెద్ద గ్రంథమయింది. నేడు మనకు లభ్యమౌతున్న వ్రాతప్రతులన్నీ కౌటలీయార్థశాస్త్రం పెద్ద గ్రంథం నుండి గ్రహించినవై ఉంటాయి. ఒకే అధ్యాయం ఉన్న అధికరణం చివర కొత్త విభాగాన్ని చేర్చడం వింతగా ఉంది. ఈ కొత్త విభాగం అధికరణ సంగ్రహమే. అయితే అధికరణానికి ముందైనా, చివరైనా చేర్చుడానికి వీలైనంత సంక్షిప్తంగా, సర్వ సామాన్యంగా ఉంది. విష్ణుగుప్తుని మూల సమగ్ర గ్రంథంలో కౌటలీయార్థశాస్త్రంలో వ్యాఖ్యానాలను గురించి గాని, అర్థశాస్త్రంపై వెలసిన ఇతర గ్రంథాలను గురించి గాని విమర్శలతోగూడిన విభాగాలుండి ఉండవలె.

విష్ణుగుప్తుని చేతులలో అర్థశాస్త్రం స్వరూపం మారిపోయి నందున ప్రస్తుతం ఉపలభ్యమౌతున్న గ్రంథం పూర్తిగా ఒకే యుగానికి చెందిన కృతిగా పరిగణింపలేము. అందుచేత తాత్త్విక భావాలు ఆధారంగా 'కలియినావ్' చేసిన పరిశీలనను యథార్థంగా అంగీకరింపలేము. తత్త్వ, ప్రకృతి, సామాజిక శాస్త్రాలను అర్థశాస్త్రం భిన్నంగా పరిగణించినట్లు కలియనావ్ సాక్ష్యం చూపిస్తున్నాడు. ఈ దశ బానిస సమాజం పతనమై భూస్వామ్య విధానం జనించే కాలంతో ముడి పడిందని అతని సూచన. భారతదేశంలో భూస్వామ్య విధానం క్రీ. శ. మొదటి శతాబ్దాలలో ఆవిర్భవించిందని అతడంటాడు. కాని ఈ వాదం సమాజంలోని మార్పులను చాల సామాన్యంగా పరిగణిస్తున్నది. ఈ బానిస సమాజం, భూస్వామ్య సమాజం అనే పదాలను స్థూలములైన సర్వ సామాన్య పదాలుగా వాడవచ్చు. కాని ప్రతి సమాజంలోను కొన్ని ప్రత్యేకతలుంటాయి. మార్పులలో వ్యత్యాసాలుంటాయి. స్థూల, సాధారణీకరణాలను వివరంగా పరిశీలించవలసిన అవసరం ఉంది. అర్థశాస్త్రం వివరిస్తున్న ఉత్పత్తి సాధనాలు, సాంఘిక వ్యవస్థ, ఆర్థిక రాజకీయ సంస్థలు మెగస్తనీసు వర్ణించిన వాటికన్న అభివృద్ధి కరమైనవిగా ఉన్నందున నేటి రూపంలో అర్థశాస్త్రం క్రీ. శ. మూడో శతాబ్దానికి చెందిందని 'కలియనావ్' అభిప్రాయం. కాని తన వ్యాసం మొదట్లో మెగస్తనీస్ రచనపై పూర్తిగా ఆధారపడరాదని 'కలియనావే' వ్రాసినాడు.

అర్థశాస్త్రంలోని మౌలికమైన భాగం కౌటలీయ శిష్యబృందం నుంచే వచ్చి ఉండవచ్చు. చంద్రగుప్తుని కాలంలో దేశాన్ని సుస్థిరం చేసే ప్రయత్నం జరిగింది. ఆ ఆశయాన్ని సాధించడానికి ఏ సాధనమైనా ప్రయోగించవచ్చుననే తత్వం అవసరమైంది. సుదీర్ఘమైన రాజకీయ ఆలోచనా సంప్రదాయంపై ఆధారపడి అర్థశాస్త్రం తయారయిందని తరువాతి కాలంలో పున:పరిశీలించి దానిని సంకలనం చేసినారని 'కలియనావ్' అభిప్రాయం. పై తత్వ అవసరాన్ని అర్థశాస్త్రము, దశకుమార చరిత్ర నొక్కి చెబుతున్నాయి. అర్థశాస్త్రంలోని మూల భాగం ఆర్థిక, రాజకీయ సాంఘిక సంస్థలు పనిచేయడాన్ని వర్ణిస్తున్నది. మెగస్తనీస్ వర్ణించిన సంస్థలతో పోల్చి అర్థశాస్త్రంలో వర్ణితమైన సంస్థలు మౌర్య యుగానంతర కాలానివని నిర్ణయించినపుడు అర్థశాస్త్రంలోని మూల భాగం మౌర్యయుగం తరువాతిది అన్న కలియనావ్ వాదంలో ఏకీభవించవచ్చు. కాని అర్థశాస్త్రం వర్ణిస్తున్న సంస్థలు ప్రధానంగా మౌర్య యుగానివే అని మా అభిప్రాయం. సాంఘిక సంస్థల విషయంలో గ్రంథంలోని కొన్ని భావాలు ఆ గ్రంథం సమాజ పరిణామంలో చాల ప్రాచీనదశకు చెందిందని సూచిస్తున్నాయి. ఉదాహరణకు నటులు ప్రదర్శకుల పట్ల గల దృక్పథాన్ని పేర్కొనవచ్చు. అర్థశాస్త్రాన్నిబట్టి పై ఉభయులను అనుమానంతో సంఘ బాహ్యులుగా చూచేవారు. వారిపట్ల అంతటి కాఠిన్యం గుప్తయుగంలో ఉండడానికి అవకాశంలేదు. గుప్తయుగంలో రంగస్థలానికి ప్రాధాన్యం వచ్చింది. రంగస్థలంతో సంబంధించిన వ్యక్తులు సాంఘికంగా మర్యాదస్తులైనారు. అర్థశాస్త్రంలో నటులపట్ల కన్పించే కాఠిన్యమూ, అశోకుని పవిత్ర శాసనాలు మతేతర వినోదాలను నిషేధించినట్లు కన్పించే భావమూ ఏకీభవిస్తున్నాయి.

గ్రంథమంతటా అర్థశాస్త్ర రచయిత మానసిక ప్రవృత్తి ఒకేవిధంగా ఉందని చెప్పలేము. గ్రంథం ఉత్తరభాగంలో ప్రయోజన సాధకునకు నిగూఢములైన మాయోపాయములను సూచించడం జరిగింది. పూర్వ భాగంలోని క్రియాత్మక దృష్టి మారిపోయింది. ఉదాహరణకు దేశంలో మనుషులకు పశువులకు వచ్చే అంటు జాడ్యాల నివారణకు సూచించిన ఉపాయాలను పేర్కొనవచ్చు. ఇందులో మొదటి ఉపాయం హేతుబద్ధము, ఆచరణయోగ్యము అయినది తరువాత రచయిత ఏదో తంత్రాన్ని సూచిస్తాడు. ఈ తంత్రాలను బ్రాహ్మణులు మాత్రమే ప్రయోగించగలరు. కాబట్టి రచయిత బ్రాహ్మణుడైనందున బ్రాహ్మణుల పట్ల అభిమానం చూపించడం సహజమే. ఏమైనప్పటికీ నివారణోపాయాలలో మొదటిది కౌటలీయార్థశాస్త్రం మూలంలోనిదని, తాంత్రిక పద్ధతులు పెరుగుతూ ఉన్న కాలంలో తరువాతి సంపాదకులు తంత్రసాధనలు చేర్చి ఉంటారని మా విశ్వాసం.

ఈ పుస్తకంలో అనేకచోట్ల అశోకుడనుసరించిన విధానాలకు, కౌటల్యుని సూచనలకు మధ్య సన్నిహితమైన అంగీకారమున్నట్లు పేర్కొన్నాడు. ఇందుకు ఉదాహరణగా రాజు దేవతలకు సన్నిహితుడని ప్రజలకు చెప్పడంవంటి ప్రచార విధానాలను పేర్కొనవచ్చు. కొన్ని రకాల జంతువులను వధించడంపై నిషేధం కూడ రెంటికీ సమానమే. రెంటిలోను ఉన్న సాంకేతిక పదాలు సమానం. వాటిలో కొన్ని :

| **అశోక శాసనాలు** | **అర్థశాస్త్రము** |
|---|---|
| యుత (శి. శా III) | యుత II, 5, 9 |
| ప్రాదేశిక ( శి. శా III) | ప్రదేష్టి IV, I |
| పరిస (శి. శా. I, VII) | పరిషద్ IV, 1 |
| పులిసా (స్తం. శా. IV) | పురుష II, 5 |
| గగనాయం (శి. శా. III) | గననయం III, 6 |
| వ్రచ (శి. శా. II, VI) | ప్రజ II, 1 |
| పలికిలేశు (శి. శా. I) | పరిక్లేశ IV, 9. |

చాణక్యుడని కూడ సుప్రసిద్ధుడైన చంద్రగుప్తుని మంత్రి కౌటల్యుడే మొదట్లో అర్థశాస్త్రం రచించినాడని ముగింపుగా మా అభిప్రాయం. క్రీ. శ. మూడు, నాలుగు శతాబ్దాలలో ప్రక్షిప్తాలతో సహా యావద్గ్రంథంపై విష్ణుగుప్తుడు పరిశ్రమించేవరకు పెక్కుమంది రచయితలు అర్థశాస్త్రాన్ని సంకలనం చేసినారు; వ్యాఖ్యానాలు వ్రాసినారు. నేడు మనకు లభ్యమౌతున్న అర్థశాస్త్రం విష్ణుగుప్తుని ప్రతియే. శతాబ్దాల తరబడి ఇతర గ్రంథాలు అర్థశాస్త్రంలోని భాగాలను గ్రహించినాయి. ఇతర గ్రంథాలలో అర్థశాస్త్రచ్ఛాయలు కనిపిస్తాయి. అర్థశాస్త్రం క్రీ. పూ. నాలుగో శతాబ్దిలో తయారయింది అన్నప్పుడు మాత్రమే వీటన్నింటికీ సరియైన సమాధానం చెప్పగలం.

రెండో అనుబంధం

# అశోకుని బిరుదులు

అశోకుడు వాడిన బిరుదులు సయితం చాల ఆసక్తిదాయకములైనవి. 'దేవానాం పియ పియదస్సి రాజా అశోక' అనేది పూర్తి రాజబిరుదము. భారతదేశంలో తరువాతి రాజులు వాడిన బిరుదులుకంటె ఇది చాల నిరాడంబరమైనది. కొన్ని సమయాలలో ఈ బిరుదం కూడ పూర్తిగాకాక, 'దేవానాం పియ' అనిగాని, బరాబర్ కొండగుహ శాసనాలలోవలె 'పియదస్సి రాజా' అనిగాని వాడేవారు. హుల్ట్ వివరించినట్లు 'దేవానం పియ' బిరుదానికి దేవతలకు ప్రీతిపాత్రుడు అని శబ్దార్థము. భవాన్,చ దీర్ఘాయు:, ఆయుష్మాన్ అనే పదాలవలె ఈ బిరుదాన్ని వాడేవారని పతంజలి మహాభాష్యంలో వ్రాసినాడు. పతంజలిపై కయ్యటుని భాష్యంలో దేవానాం పియ పదానికి మూర్ఖుడు అనే అర్థమున్నట్లు పతంజలికి కూడ ఆ అర్థం తెలిసినట్లు వ్రాసినాడు. మౌర్య వంశం సనాతనేతర ధర్మాన్ని అనుసరించినందున ఆ వంశ స్మృతుల ఫలితంగా బ్రాహ్మణ లావిధంగా వ్రాసి ఉండవచ్చు. కాని జైన వాఙ్మయంలో ఆ పదం గౌరవ వాచకంగానే ఉంది.

సింహళ సారస్వతంలో దేవానాం పియ బిరుదాన్ని అశోకునకు గాక అతని సింహళ సమకాలికుడైన తిస్సకు మాత్రమే వాడినారు. అశోకుని పూర్వీకులెవ్వరు ఈ బిరుదాన్ని ధరించిన నిదర్శనాలు లేవు. కాని ఎనిమిదో శిలాశాసనంలో పూర్వదేవానాం ప్రియులను గురించి అశోకుడు ప్రస్తావించినాడు. అందుచేత అతని ప్రజలకు రాజబిరుదంగా దేవానాం ప్రియ పదంతో పరిచయమున్నట్లు తెలుస్తున్నది. అశోకుని మనుమడైన దశరథుడు, సింహళంలో తిస్స అనంతరం పెక్కుమంది రాజులు వాడినందున దేవానాం పియ అనేది ఒక రాజ బిరుదంగానే గ్రహించవచ్చు.

అశోకుని తరచుగా కన్పించే మరొక బిరుదము ప్రియదర్శి. ఈ మాటకు దర్శనీయుడని అర్థము. ఇది అశోకుని వ్యక్తిగతమైన పేరువలె బహుశా పట్టాభిషేక నామంగా కనిపిస్తుంది. కాందహార్ శాసనంలో ఈ పేరునే వాడినారు. దీపవంశంలో చాలవరకు అశోకుని ప్రియదర్శి అంటూనే వ్యవహరించినారు. తరువాతి రోజులలో ఈ మాటను రాజ బిరుదంగా వాడడం జరిగింది. విష్ణు ధర్మోత్తర పురాణంలో ప్రియదర్శన పదం రాజబిరుదంగా ప్రస్తావితమైనట్లు అనంతదేవుడు తన రాజధర్మ కౌస్తుభంలో ఉదాహరించినాడు. రామాయణంలో ఈపదాన్ని రామునకు బిరుదంగా వాల్మీకి వాడినాడు. అశోకవర్ధన అనేది రాజు పేరని, పియదస్సి బిరుదమని, తన శాసనాలలో పియదస్సి అనే మాటను వాడడానికి కారణం పియదస్సి అంటే మానవత్వం ఉన్నవాడు అని అర్థమనిన్నీ విన్సెంటు స్మిత్తు సూచిస్తున్నాడు. ఇక రాజుపేరు అశోక అనిన్నీ, బహుశా పట్టాభిషేక సమయంలో వాడిన అధికార నామం పియదస్సిఅనీ, ఆ రోజులలో దేవానాం పియ అనేది సర్వసాధారణంగా వాడిన రాజ బిరుదమనీ మా అభిప్రాయం.

మూడో అనుబంధం

# శాసనాలు దొరికిన స్థలాలు

అశోకుని శాసనాలు దొరికిన స్థలాలు ఇష్టం వచ్చినట్లు ఎన్నిక చేసినవి కావు. వాటికి భౌగోళిక ప్రాముఖ్యం ఉన్నది. నివాస ప్రదేశాల సమీపంలో ప్రధాన రహదారుల మీద మత ప్రాముఖ్యం ఉన్న స్థలాలలో సాధ్యమైనంత ఎక్కువ మంది ప్రజల కందుబాటులో ఉండగలందులకై ఉద్దేశపూర్వకంగా శాసనాలను నెలకొల్పినారు. ఒక్కొక్క స్థలాన్ని ప్రత్యేకించి ఎన్నిక చేయడానికి గల కారణాలను ఈ అనుబంధంలో పరిశీలిస్తాము. అట్టి పరిశీలనకు వాఙ్మయ, శాసన సూచనలను నిరూపణచేయగల పురావస్తు సాక్ష్యం చాలినంతగా ఉండవలె. కాని దురదృష్టవశాత్తూ అన్నిచోట్ల తవ్వకాలు జరుగలేదు. అందుచేత కొన్నిచోట్ల కారణాలు కేవలం సూచనప్రాయంగానే ఉండగలవు. దక్షణ భారతంలోని ప్రదేశాల ప్రాముఖ్యాన్ని ఆలోచించే సందర్భంలో శాసనాలు లభ్యమైన ప్రాంతము, దక్షిణా పథంలో బంగారు గనుల ప్రాంతము ఇంచుమించు ఒకటేనని మనసులో ఉంచుకొనవలె. దక్షిణాపథంలోని ఈ కృషిని అర్థశాస్త్రం ప్రస్తావిస్తున్నది. దక్షిణ దేశంలో వర్తకంలో ప్రత్యేక ప్రాముఖ్యం ఉన్న పదార్థం బంగారం అని చెబుతున్నది. ఆ విధంగా దక్షిణాపథ ప్రాంతం ఆర్థికంగా అపార ప్రాముఖ్యం ఉన్న ప్రాంతం. అధిగమించే దక్షిణాపథంలో శాసనాలు వేయించే ప్రదేశాలు కొన్నింటిని ఎన్నిక చేసి ఉండవలె. బహుళ జన సమ్మర్థం ఉండి గనులున్న ప్రాంతాలలోగాని, ఆ ప్రాంతాలకు ఉన్న ప్రధాన రహదారుల మార్గంలోగాని శాసన స్థలాలను ఎన్నికచేసి ఉండవలె.

*ఆ స్థలాలను ఈ క్రింది పట్టికలో ఇస్తున్నాము :*

**అల్లహాబాదు – కోశం :**

(స్తంభశాసనాలు I - VI; మహారాణి శాసనం; కౌశాంబిశాసనం లేదా సంవిభేద

శాసనం) అల్లహాబాదే ప్రాచీన ప్రయాగ – గొప్ప యాత్రా స్థలం. అదే అల్లహాబాదు ప్రాముఖ్యం. గంగాయమునా నదులమధ్య ఒకప్పుడుండిన ఇసుక మైదానంమీద నిర్మితమైంది. హిందువులకు ప్రయాగ పవిత్ర స్థలమని హుయాన్‌సాంగ్ వివరించినాడు. ఆ పుణ్య స్థలాన్ని గూర్చిన గాథలను, అచటి ఆలయాలను గురించి వివరించినాడు. కౌశాంబి శాసనం కౌశాంబిలోని మహామాత్తుల నుద్దేశించినది. అందుచే ఆ స్తంభం మొదట్లో కౌశాంబిలో ఉండి ఉండవలె. కౌశాంబి నేటి కోశమ్ ఒకటే. యమునానది ఎడమ గట్టుపై అల్లహాబాదు నైబుతి దిక్కున 28 మైళ్ళ దూరంలో ఉన్నది. బౌద్ధయుగంలో కౌశాంబికి మత ప్రాధాన్యం ఉండేది. దేశం అనేక ప్రాంతాల నుండి యాత్రికుల నాకర్షించినందున శాసనాలు వేయించడానికి మంచి ప్రదేశం. ఇచ్చటి అశోక స్తంభం తరువాతి పాలకులైన సముద్రగుప్త, జహంగీర్‌లు తమ శాసనాలు వ్రాయించినారు. గుప్తయుగం నాటికి ఆ స్తంభం కౌశాంబిలోనే ఉన్నట్లు సముద్రగుప్తుని శాసనం ద్వారా తెలుస్తున్నది. బహుశా ఆ స్తంభాన్ని అల్లహాబాదు చేర్చటానికి జహంగీరే కారణమై ఉండవచ్చు. తోప్రా, మీరట్ల నుండి అటువంటి స్తంభాలను ఢిల్లీకి చేర్చిన ఫిరోజ్‌షాను అనుకరిస్తూ జహంగీర్ కౌశాంబి స్తంభాన్ని అల్లహాబాదు చేర్చి ఉండవచ్చు. అల్లహాబాదు కౌశాంబీలు రెండూ యమునా నదిమీదనే ఉండడంవల్ల రవాణా అంతకష్టమై ఉండి ఉండదు.

**బైరాట్ :**

(గౌణ శిలాశాసనం, భాబ్రాశాసనం) బైరాట్ రాజస్థాన్‌లో జయపూర్‌కు నలభై మైళ్ళ ఈశాన్యంలో ఉంది. మత్స్య జనపదానికి రాజధాని అయిన విరాట నగరంగా బైరాటును గుర్తిస్తారు. బైరాట్‌కు నైబుతి దిక్కున సుమారు మైలు దూరంలో ఉన్న కొండపై రెండు విహారాల శిథిలాలు కనిపించినాయి. అందుచేత ప్రత్యేకంగా సంఘాన్ని ఉద్దేశించిన భాబ్రా శాసనం అక్కడ ఉండడం సముచితమేనని మా అభిప్రాయం. ఇటీవల ఆ ప్రదేశంలో జరిగిన తవ్వకాలలో స్థూపాన్ని బోలిన ఇటుకల గది బయల్పడింది. బౌద్ధుల ప్రత్యేక నిర్మాణంగా స్థూపం రూపొందని కాలానికి చెందిన బౌద్ధాలయం అయి ఉంటుంది. ఈ అంశం బైరాట్‌ను చాల ప్రాచీన బౌద్ధమత కేంద్రంగా నిరూపిస్తున్నది. అందుచే ఆ ప్రాంతంలో బైరాట్ జన సమ్మర్దం ఉన్న పట్టణమే కాక మత కార్యకలాపాలకు కేంద్రం కూడా అని తెలుస్తున్నది.

**బరాబర్ కొండగుహలు :**

(ఆజీవిక శాఖకిచ్చిన దాన శాసనాలు) ఈ గుహలలోనివి దాన శాసనాలు. అందుచేత

శాసనాలకు ఉన్న ప్రాముఖ్యం స్థలానికి కాదు. రాజ గృహ నగరాన్ని చుట్టి ఈ గుహల సమూహం ఉంది.

బ్రోచ్‌ని శాసనాలు ప్రస్తావించడం లేదు. అశోక శాసనాలేవీ బ్రోచ్‌లో లభించలేదు. కాని పాశ్చాత్య భూములతో వర్తకానికి బ్రోచ్ ముఖ్య వాణిజ్య కేంద్రమని తెలుస్తున్నందున మౌర్యయుగంలో బ్రోచ్ ప్రముఖ స్థానాన్ని ఆక్రమించి ఉండవలె. పెరిప్లస్‌లో తరచుగా బ్రోచ్ ప్రస్తావన ఉంది. సౌరాష్ట్ర రేవు పట్టణాలకు, గంగామైదాన నగరాలకు మధ్య రవాణా సౌకర్యాలున్నందున పశ్చిమ దేశాలతో వాణిజ్యం సాగించటంలో సౌరాష్ట్ర రేవు పట్టణాలు ప్రాధాన్యం వహించినాయి. అంతేకాక మౌర్యసామ్రాజ్యంలోని పశ్చిమ ప్రాంతమైన అపరాంతకు గ్రీకు పారశీక సంబంధాలున్నాయి. ఈ సంబంధాలను కొనసాగించాలని అపరాంత ప్రజల వాంఛితము. (అందుకు బ్రోచ్ అనుకూలమైనది.)

**బ్రహ్మగిరి :**

(గౌణ శిలా శాసనం) ఇచట తవ్వకాలలో లభ్యమైన పురావస్తు సాక్ష్యం వల్ల మౌర్యయుగానికి పూర్వమే బ్రహ్మగిరి ఒక ముఖ్య కేంద్రమైనట్లు తెలుస్తున్నది. శతాబ్దాల తరబడి అవిచ్ఛిన్నంగా మానవ నివాస ఫలితంగా అందునా మౌర్య సామ్రాజ్య సరిహద్దు స్థావరాలలో ఒకటిగా బ్రహ్మగిరి పట్టణానికి పలుకుబడి హెచ్చింది. గోదావరీ కావేరీ నదుల జన్మస్థలాలకు వెళ్ళే యాత్రికులు బ్రహ్మగిరి నుండి బయలుదేరుతూ ఉండి ఉండవచ్చు. ఆ విధంగా కూడ బ్రహ్మగిరి ప్రాముఖ్యం వహించి ఉంటుంది.

**ఢిల్లీ మీరట్; ఢిల్లీ – తోప్రా :**

(స్తంభ శాసనాలు క్రమంగా I-VI; II-VI) ఈ స్తంభాల అసలు స్థావరాలు మీరట్–తోప్రాలు. అచటి నుండి ఫిరోజిసా ఢిల్లీకి తరలించినందున వీటికి ఢిల్లీ–మీరట్, ఢిల్లీ–తోప్రా స్తంభాలనే పేర్లు వచ్చినవి. మీరట్–తోప్రాలు ఢిల్లీకి వాయవ్యదిశలో ఉన్నాయి. స్తంభ శాసనాలు వేయడానికి ఈ ప్రదేశాలలో ఎన్నిక చేసిన కారణాలను స్పష్టంగా చెప్పలేము. ఈ ప్రదేశాలలో పురావస్తు తవ్వకాలు జరుగలేదు. పాటలీపుత్రం నుండి వాయవ్య ప్రాంతానికి వెళ్ళే రహదారిపై ఈ రెండూ గొప్ప మజిలీ స్థలాలైనట్లు కన్పిస్తున్నది. ఈ ప్రదేశాలలో వర్తకుల కుద్దేశించిన సత్రాలు ఉన్నట్లయితే వాటి చుట్టూ జన బాహుళ్యం గల నగరాలు ఏర్పడి ఉండేవి.

**ధౌళి :**

(ముఖ్య శిలాశాసనాలు) ధౌళి శాసనాన్ని చుట్టుపట్ల మైదానానికి నిటారుగా ఉన్న పర్వత పంక్తిపై ఎత్తుగా ఉండేచోట చెక్కినారు. ధౌళిని తోసలిగా గుర్తించినారు. తోసలిని

ముఖ్యపట్టణంగా టాలెమీ వర్ణించినాడు. కోసల–గంగాప్రదానికి సమీపంలో ఉండి ధౌళి పవిత్ర స్థలంగా రూపొందింది. తోసలి మహామాత్తుల కుద్దేశించిన మొదటి ప్రత్యేక శాసనమూలం ధౌళిని తోసలిగా గుర్తించారు.

**గావీ మఠ్ :**

(గౌణ శిలాశాసనం) నేటి కర్ణాటక (మైసూరు)లో ఉంది. సిద్దాపూర్ పరిసరాలలో ఉన్న స్థల సమూహంలోనిది. ఈ ప్రాంతాలలో ఈ శాసనం తరచుగా కన్పిస్తున్నది. గనుల ప్రాంతంలో ఉన్నందున గాని ప్రధాన రహదారిపై ఉన్నందున గాని ఈ స్థలానికి ప్రాముఖ్యం వచ్చి ఉంటుంది.

**గిర్నార్ :**

(ముఖ్య శిలాశాసనం) గిర్నార్ ప్రాముఖ్యాన్ని నిరూపించడం కష్టం కాదు. కథియావార్‌లో జునాగడ్‌కు తూర్పున ఒక మైలు దూరంలో గిర్నార్ ఉంది. అశోకుని శాసనాలు కాక రుద్రదామ, స్కందగుప్తుల శాసనాలు అనేకం బయల్పడినందున ఆ ప్రాంతానికి చాల ప్రాముఖ్యం ఉన్నట్లు ఋజువవుతున్నది. బృహత్సంహితలో గిరినగర్‌గా ఈప్రాంతం ప్రస్తావితమైనది. బ్రాహ్మణులకు, జైనులకు కూడ ఈ పర్వతం పవిత్ర స్థలమని సంప్రదాయం. గిర్నార్ సమీపంలోనే చంద్రగుప్తుని పాలన కాలంలో సుదర్శనం తటాకంపై ఆనకట్ట కట్టడంవల్ల దీని ప్రాముఖ్యం పెరిగింది. చంద్రగుప్తుని రాష్ట్ర పాలకుడైన పుష్యగుప్తుడు ఈ ఆనకట్టను మొదట నిర్మించినాడని రుద్రదాముని శాసనం చెబుతున్నది. తరువాత అశోకుని కాలంలో తుషాస్ప అను నాతడు తూములు పెట్టించినాడు. సమీపంలోని గిరినగరాన్ని శాసనం ప్రస్తావిస్తున్నది. ఎనిమిది వందల సంవత్సరాల అనంతరం గుప్తయుగంలో కూడ ఈ తటాకం నీటిని పారుదల చేస్తున్నట్లు స్కందగుప్తుని శాసనాన్ని బట్టి తెలుస్తున్నది. సేద్యపు నీటికి ఆధారమైనందున ప్రజల దృష్టిని ఆ ప్రాంతం ఆకట్టుకొంది. నీటి సౌకర్యానికి సాధ్యమైనంత దగ్గరగా మహా నగరాన్ని నిర్మించడం వివేకం కాబట్టి అశోకుని కాలంలో గిర్నార్ నగరం నేటి జునాగడ్ ప్రాంతం కంటె తటాకానికి చేరువగా ఉండి ఉండవలె. శాసనం వేయించిన పర్వతం ఆ రోజులలో బహుళ కృషికి కేంద్రంగా ఉండి ఉండవలె.

**గుజర్ర :**

(గౌణ శిలాశాసనం) డేటియా జిల్లాలో ఝాన్సీ సమీపంలో గుజర్రా ఉంది. గంగా నదీలోయ నుండి పశ్చిమ తీరానికి బహుశా ఉజ్జయిని మీదుగా బ్రోచ్‌కి వెళ్ళే ప్రధాన రహదారి మీద ఉండి ఉంటుంది.

**జటింగ రామేశ్వర్ :**

(గౌణ శిలాశాసనం) ఈ ప్రదేశం బ్రహ్మగిరికి మూడుమైళ్ళ దూరంలో ఉంది. శాసనం మైసూరు శాసనవర్గంలోనిది. జటింగరామేశ్వర ఆలయ సమీపంలో ఉన్నందున ఈ ప్రాంతం ఆ రోజులలో కూడ పవిత్ర స్థలమై ఉండవచ్చు.

**జౌగడ :**

(ముఖ్య శిలాశాసనాలు – ధౌళిప్రతిని పోలినవి) జౌగడ శాసనాలలో రెండు ప్రత్యేక శాసనాలను చేర్చడం జౌగడ కళింగలోనిదని సూచిస్తున్నది. ప్రస్తుతమిది గంజాం జిల్లాలోని బెర్హాంపూర్ తాలూకాలో ఒక శిథిలమైన కోట. ఋషి కుల్యానది ఉత్తరపు ఒడ్డున ఉంది. రెండు ప్రత్యేక శాసనాలు సమాపలోని మహామాత్తుల నుద్దేశించినవి. అందుచేత మౌర్య యుగంలో జౌగడ పేరు 'సమాప' అయి ఉండవచ్చు. విస్తృత ప్రాంతంలో ఇచట కనిపించే శిథిలాలు సమాప మహానగరమని సూచిస్తున్నాయి. ఇచటి కోట జౌగడ ఒక సైనిక కేంద్రమని సూచించవచ్చు. సముద్రానికి దగ్గరలో ఉండడంవల్ల వాణిజ్యానికి, సముద్రయానానికి కూడ సమాప మంచి సౌకర్యంగా ఉండి ఉంటుంది.

**కాల్సి :**

(ముఖ్య శిలాశాసనము) కాల్సి పట్టణం యమునా – తోన్స్ నదుల సంగమ స్థలంలో ఉంది. అందువల్లనే దానికి మత ప్రాధాన్యం వచ్చి ఉంటుంది. ఇచటి శాసనానికి ఎదురుగా ఇటీవలి తవ్వకాలలో సంస్కృత శ్లోకాలున్న ఇటుకలలో నిర్మించిన యజ్ఞవేదిక బయల్పడింది. ఈ యజ్ఞవేదిక క్రీ. శ. మూడో శతాబ్దంలో శీలవర్మ నాలుగో అశ్వమేధం చేసిన స్థలం. దీన్నిబట్టి ఈ స్థలానికి ఆ రోజులలో చాల ప్రాముఖ్యం ఉన్నట్లు తెలుస్తుంది. హిమాలయ పర్వత పాదానికి ఢిల్లీకి మధ్యనున్న ఈ గంగా మైదాన భాగం ఎప్పుడూ కీలక ప్రాంతమే. తూర్పుగా విస్తరించిన మైదానంలోనికి ఈ ప్రాంతం ద్వారంవలె ప్రవేశాన్ని అదుపులో ఉంచేది. వాయవ్య భారతం నుండి తూర్పుకు పోయే ప్రధాన రహదారి ఈ ప్రాంతం గుండానే ఉంది. భారత చక్రవర్తులీ రహదారిని కాపాడుతూ ఉండేవారు. ఇటీవలికాలం వరకు ఈ రహదారినే గ్రాండ్ ట్రంక్ రోడ్ అనేవారు. దిగువ హిమాలయ ప్రాంతాలలో ఉన్నందున కాల్సి ఈ ప్రాంతానికి ఆయువుపట్టుగా ఉండి ఉండవచ్చు. నాభకజాతుల నివాసాలకు ఈ ప్రాంతం సరిహద్దులలో ఉండి ఉంటుంది.

**కాంద హార్ :**

(గ్రీక్ – అరమిక్ ద్విభాషా శాసనం) ఈ శాసనం దొరికిన చోటు షర్–ఇ–క్యూన; దక్షిణ ఆఫ్ఘనీస్థాన్‌లోని కాందహార్ పాతపట్టణం. అలెగ్జాండరు దండయాత్రలతో హెలినిక్

ప్రపంచానికి వాయవ్య భారతానికి మధ్య సంబంధాలేర్పడి వాణిజ్యం పెంపొందడంతో కాందహార్ ప్రాముఖ్యం హెచ్చింది. భారత దేశం నుండి పశ్చిమ ప్రాంతాలకు వెళ్ళే దక్షిణ రహదారిపై ఇది ప్రముఖ స్థానం ఆక్రమించింది. ఇచట గ్రీకుభాష మాటాడే జనాభా తగినంతగా ఉండేదనడానికి ఈ శాసనం గ్రీకు అరమిక్ భాషలలో ఉండడమే నిదర్శనం.

**లంపక :**

(అశోకునిదని చెబుతున్న అరమిక్ శాసనం) లంపక అరమిక్ శాసనం ప్రస్తుతం కాబూలు వస్తు ప్రదర్శన శాలలో ఉంది. ఇది లంపక లేదా లంబక అనేచోట దొరికింది. జలాలాబాద్ సమీపంలో కాబూల్‌నది ఉత్తరం ఒడ్డున ఉన్న నేటి లంఘన్ ఈ స్థలంగా గుర్తిస్తున్నారు. దేవానాం ప్రియ వేయించిన స్తంభశాసనాన్ని ప్రస్తావిస్తున్నందున లంపక శాసనం అశోకుని కాలానిదని నిర్ణయిస్తున్నారు.

**లౌరియా – అరరాజ్ :**

(స్తంభ శాసనాలు – I-VI) ఈ స్తంభం ఉత్తర బీహార్‌లో ఉంది. బౌద్ధమతంతో సన్నిహిత సంబంధం ఉన్నందున ఈ ప్రాంతం పవిత్ర స్థలమైనట్లు కనిపిస్తుంది. ఈ ప్రాంతంలోని అశోక స్తంభాలు పాటలీపుత్రం నుండి నేపాలుకు వెళ్ళే రాజమార్గంలో ఉన్నవని కూడ చెబుతారు.

**లౌరియా – నందన్‌గర్ :**

(స్తంభశాసనాలు – I-VI) ఉత్తర బీహార్‌లో లౌరియాకు – నందన్‌గర్ గ్రామానికి సమీపంలో ఉంది. స్తంభానికి దగ్గర్లో సమాధులు కొన్ని కన్పించినాయి. ఇవి బౌద్ధయుగానికి పూర్వపు సమాధులని కొందరి విశ్వాసం. బుద్ధుడు ప్రస్తావించిన వృజ్జియనుల చైత్యాలే ఇవియని కొందరి సూచన. ఇటీవల ఒక దిబ్బను తవ్వగా సంకీర్ణమైన వస్తు సామాగ్రి లభించింది. వీటిలో క్రీ. పూ. మొదటి శతాబ్దికి చెందిన విద్ధాంక నాణేలు, ముద్రించిన రాగి నాణేలు, జేగురు మట్టిముద్రలు ఉన్నాయి.

**మహాస్థాన్ :**

(అశోకునకు పూర్వపు మౌర్యశాసనము) బెంగాలులో బోగ్రా జిల్లాలో మహాస్థానగర్ చెంత ఈ శాసనం దొరికింది. సామ్రాజ్య తూర్పుభాగంలో స్థానిక పాలకునకు ఈ ప్రదేశం కార్యస్థానమై ఉంటుంది. ఆ రోజులలో దీనిపేరు పుండ్రనగరం అని శాసనాలు పేర్కొంటున్నాయి. పుండ్రనగరంలోని మహామాత్తుడు క్షామనివారణ చర్యలను తీసుకోవాలని శాసనం చెబుతున్నది. ఇచట జరిగిన తవ్వకాలలో ఇంతవరకు శుంగయుగానికి చెందిన జేగురు మట్టిబొమ్మలు మాత్రం దొరికినాయి.

**మాన్ సేహ్రా :**

రాష్ట్రంలోని హజారా జిల్లాలో ఉన్న గ్రామం. ఇది ముఖ్యమైన తీర్థయాత్రామార్గంలో ఉంది. అంతేగాక వాయవ్య సరిహద్దులనుండి పాటలీపుత్రానికి ఆ పైకి కూడ వెళ్ళే ప్రధాన రహదారిమీద ఉంది. ఉత్తర సరిహద్దుకు సమీపానికి ఉన్నందున కూడ శాసనాలు వేయించడానికి ఈ చోటును ఎన్నికచేసి ఉండవచ్చు.

**మస్కీ :**

(గౌణ శిలాశాసనము) కర్ణాటకలో పూర్వం నిజాం రాజ్యంలో రాయచూర్ జిల్లాలో మస్కీ ఉంది. మస్కీని సువర్ణగిరిగా గుర్తించడం జరిగింది. కాని అది అంత అంగీకార యోగ్యం కాదు. సువర్ణగిరిని గుర్తించే సమయంలో ఆ విషయం వివరిస్తాను.

**నిగలిసాగర్:**

(స్తంభ శాసనము) ఈ శాసనంవల్ల నిగలిసాగర్‌లో స్తంభాన్ని ప్రతిష్ఠించడంలోని ఉద్దేశం స్పష్టమౌతున్నది. కనకముని బుద్ధుని స్థూపానికి సమీపంలో నిగలిసాగర్ ఉంది. స్థూపాన్ని విస్తృత పరచినట్లు, అనంతరం అశోకుడా స్థలాన్ని దర్శించినట్లు, శాసనం వల్ల తెలుస్తున్నది. కపిలవస్తుకు ఆరు మైళ్ళ దూరంలో ఉన్న కొనాకమన స్థూప ప్రదేశంలో తానొక స్తంభాన్ని దర్శించినట్లు ఆ స్తంభాగ్రంలో సింహం చెక్కి ఉన్నట్లు హుయాన్‌సాంగ్ వ్రాసినాడు. స్తంభాన్ని స్వస్థలం నుండి మార్చినందున సింహం నేటికీ కనిపించలేదు. స్థూపం కూడ బయల్పడలేదు. ప్రస్తుత మా స్తంభం నేపాల్ భూభాగంలో రుమ్మిండై సమీపంలో ఉంది.

**పాల్కిగుండ :**

(గౌణ శిలాశాసనము) గావిమఠ్‌కు నాలుగు మైళ్ళ దూరంలో పాల్కిగుండ ఉంది. ఇది బ్రహ్మగిరి చుట్టూ ఉన్న ప్రాంతాలలో ఒకటి.

**పాటలీపుత్ర ం :**

శాసనాలొకదానిలో పాటలీపుత్ర ప్రస్తావన ఉంది కానీ ఆ నగర పరిసరాలలో శాసనప్రతి ఏమీ లభించక పోవడం ఆశ్చర్యకరం. పాటలీపుత్రాన్ని గుర్తించడం సులభమే. భౌగోళికంగా ఆ ప్రదేశ ప్రాముఖ్యం అందరికీ తెలిసిందే. మౌర్య సామ్రాజ్యానికి పాటలీపుత్రం రాజధాని. మగధ విజృంభణ నాటినుండి అంటే అశోకునకు మూడు శతాబ్దాల పూర్వం నుండి పాటలీపుత్రానికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. యూరపియన్ భారతీయ వాఙ్మయాధారాలు రెండింటిలోను, అశోకుని శాసనాలలోను ఆ నగర ప్రసక్తి ఉంది. ఇచట విస్తృతంగా పురావస్తు ఖననాలు జరిగినాయి. వాటివల్ల నేటి పాట్నా నగరం

చుట్టూ ఉన్న ప్రదేశాలలో ముఖ్యంగా నది ఒడ్డున పాటలీపుత్రం విస్తరించినట్లు తెలుస్తున్నది. గత శతాబ్దాలలో నదీగమనం మారుతూ వచ్చింది. పాటలీపుత్ర నగరాన్ని పరివేష్ఠించి ఉన్నట్లు మెగస్తనీను పేర్కొన్న దారు ప్రాకారం ఈ త్రవ్వకాలలో బయల్పడింది. అనేక విధాన పెర్సీ పోలిస్‌ను పోలిన రాజప్రాసాదంలోని మొగసాల, ఆరోగ్య విహారం బయల్పడినాయి. పూసలు, జేగురు మట్టిబొమ్మలు, నాణేలు సాధారణంగా మౌర్య యుగానివని చెప్పే మృణ్మయ పాత్రలు మొదలైనవి ఈ తవ్వకాలలో దొరికినాయి.

**రాజుల మందగిరి :**

(గౌణ శిలాశాసనం) ఇది దాక్షిణాత్య శాసనవర్గం లోనిది. ఎర్రగుడికి ఈ ప్రదేశం ఎంతో దూరంలో లేదు.

**రాంపూర్వ :**

(స్తంభ శాసనాలు I-VI) రాంపూర్వా ఉత్తర బీహార్‌లో బెట్టియాకు ఉత్తరంగా ముప్పదిరెండు మైళ్ళ దూరంలో ఉంది. హిమాలయాలకు గంగానదికి మధ్య ఉన్న ఈ ప్రాంతం చాల సారవంతమైనది. జనసమ్మర్ధం ఉన్న ప్రాంత మనడంలో సందేహం లేదు. అందుచేతనే శాసనాలకు యోగ్యమైంది. అదీగాక దేశం నలుమూలల నుండి యాత్రికుల నాకర్షించే బౌద్ధ పుణ్యస్థలాలీ ప్రాంతంలో ఉండేవి.

**రుమ్మిందై :**

(స్తంభ శాసనం) రుమ్మిందై స్తంభము రుమ్మిందై ఆలయ సమీపంలో నేపాల్ సరిహద్దు లోతట్టున ఉంది. బుద్ధుని జన్మస్థలమైన లుంబినీ వనానికి స్మృతి చిహ్నంగా అశోకుడీ స్తంభాన్ని నిలిపినాడు. లుంబినికి నేటి పేరే రుమ్మిందై. బుద్ధుడు జన్మించినచోటును ఈ స్తంభం సూచిస్తుందని భావిస్తున్నారు. స్తంభానికి అశ్వకిరీటం ఉండేదని పిడుగు పాటుకు అది నష్టమైందని, స్తంభం కూడ మధ్యకు విరిగి పోయిందని హుయాంగ్ సాంగ్ కథనము. నేటికీ స్తంభం దిగువ భాగం నిలబడి ఉంది. పై భాగం రెండు ముక్కలయింది. కిరీటం జాడ తెలియటం లేదు.

**రూపనాథ్ :**

(గౌణ శిలాశాసనం) మధ్యప్రదేశ్‌లో సలీమాబాద్ దగ్గర కైమూర్ కొండలమీద రూపనాథ్ ఉంది. ఇచట ఉన్న శివలింగంవల్ల ప్రస్తుతం శైవులకిది పవిత్ర స్థలమైంది. అశోకుని కాలంలో కూడ హిందూ యాత్రికులు దర్శించే పుణ్యస్థలమై ఉండవచ్చు. అంతేగాక ప్రయాగ నుండి బ్రోచ్‌కు వెళ్ళే ప్రధానరహదారి బహుశా రూపనాథ్ గుండా వెళ్ళేది. అల్లహాబాద్ కంటె కైమూర్ కొండలు ఎత్తు ఎక్కువ. అట నుండి పీఠభూమి ఉపరితలం

మీదుగా జబల్‌పూర్ చేరడం సులభం. జబల్‌పూర్ నర్మదా నదికి సమీపంలో ఉంది. అట నుండి రహదారి నర్మదానది లోయగుండా సాగి బ్రోచ్ చేరేది. జబల్‌పూర్‌కు మరొక మార్గం పాటలీపుత్రం నుండి పర్వతాల ననుసరించి ఉండేది. ఈ అంశాలవల్ల సహస్రామ్ ప్రాముఖ్యం కొంతవరకు తెలుస్తుంది.

**సహస్రామ్ :**

(గౌణ శిలాశాసనము) బీహార్‌లో షహబాద్ జిల్లాలో పాట్నాకు తొంభై మైళ్ళ నైఋతి దిక్కున సహస్రామ్ ఉంది. శోణానది సహస్రామ్‌కు ఎంతో దూరంలో లేదు. నేటి సహస్రామ్ పట్టణానికి శాసనం దొరికిన చోటు దగ్గరలోనే ఉంది. కైమూర్ కొండల అంచులు సహస్రామ్ వరకు విస్తరించినాయి. పాట్నా నుండి శోణానది లోయ ఎగువన పీఠభూమి గుండా జబల్‌పూర్‌కు అటనుండి నర్మదానది లోయలో బ్రోచ్ పట్టణానికి రహదారి ఉండేదనే అభిప్రాయాన్ని ఈ పట్టణం బలపరుస్తుంది. పీఠభూమి ఉత్తరపు అంచున సహస్రామ్ ప్రముఖమైన పట్టణము అయి ఉంటుంది. ఇది మగధ రాజ్య సరిహద్దు పట్టణము. అపాయాలతో నిండిన పీఠభూమి గుండా అనుమానాస్పదమైన ప్రయాణం సహస్రామ్ దగ్గరే ప్రారంభమయ్యేది.

**సాంచీ :**

(సంఘవిభేదన శాసనం) ఈ ప్రదేశానికి సాంచి అనేది ఆధునిక నామం. ఈ పేరు ఇటీవలి కాలంలో వచ్చింది. బౌద్ధయుగం నుండి గుప్తయుగం వరకు 'కాకనదబోట' అని దీన్ని వ్యవహరించేవారు. ఇచట లభించిన శాసన ఖండం ధమ్మ మహామాత్తులను, సంఘాన్ని ఉద్దేశించినదనడంలో సందేహం లేదు. ఈ అంశాల వల్ల అశోకుని కాలంలో సాంచి ప్రసిద్ధ బౌద్ధ కేంద్రమయినట్లు తెలుస్తున్నది. సాంచీ స్థూపాన్ని శుంగయుగంలో విస్తృతం చేసినట్లు, నేడు కనిపించే శిలాఆచ్ఛాదనను తాపడం చేసినట్లు పురావస్తు సాక్ష్యం వల్ల తెలుస్తున్నది. ఉజ్జయినికి సమీపంలో ఉన్నందున సాంచీ ప్రాముఖ్యం పెరిగింది. అంతేకాక భోపాల్ సమీపంలో భిల్సాకు కొన్ని మైళ్ళ దూరంలో సాంచి ఉంది. ప్రాచీన విదిశానగరమే భిల్సా అని విశ్వసిస్తున్నాము.

**సారనాథ్ :**

(స్తంభశాసనం మహామాత్తుల కుద్దేశించిన సంఘవిభేద శాసనం) వారణాసికి మూడున్నరమైళ్ళ దూరంలో సారనాథ్ ఉంది. బుద్ధుడు మొట్టమొదటిసారిగా ధర్మ బోధ చేసింది సారనాథ్‌లో అయినందున ఈ స్తంభం ఉన్న చోటు బౌద్ధులకు పరమపవిత్ర స్థలం. ఇచట అశోకుడు నిర్మించిన స్థూపానికి ఎదురుగా శాసనం ఉన్న స్తంభాన్ని తాను

చూచినట్లు హుయాన్‌సాంగ్ వ్రాసినాడు. మత ప్రాముఖ్యమటుంచి సారనాథ్ గొప్ప వాణిజ్య కేంద్రం. సారనాథ్ గంగానది ఒడ్డున ఉంది. నదిపై జరిగే వాణిజ్యం చాల భాగం సారనాథ్ గుండా జరిగేది. ప్రయోగ పాటలీపుత్రాలకు మధ్య సమదూరంలో ఉన్నందున ఉభయ ప్రాంతాల నుండి వచ్చే వస్తువుల మార్పిడికి సారనాథ్ కేంద్రమని భావింపవచ్చు. వాయవ్య భారతం నుండి పాటలీపుత్రానికి రహదారి కూడ సారనాథ్ గుండా వెళ్ళినట్లు కనిపిస్తుంది.

**షహబాజ్ గరీ :**

(ముఖ్య శిలాశాసనాలు. ఖరోష్ఠి లిపిలో వ్రాసినవి) ఈ ప్రదేశం పెషావర్ చెంత యూసుఫ్‌జై ప్రాంతంలో మర్దన్ సమీపంలో ఉంది. ఏరియన్ వర్ణించిన బజేరియా లేదా బజిరాయే షహబాజ్ గరీగా గుర్తించే ప్రయత్నాలు జరిగినాయి. దీనినే హుయాన్‌సాంగ్ పో – లూ – షా అని వ్యవహరిస్తూ ప్రాచీన నగర శిలాశిథిలాలపై దీన్ని నిర్మించినట్లు వ్రాసినాడు. హుయాన్‌సాంగ్ కథనం ఏరియన్ వర్ణనకు సరిపోతున్నది. షహబాజ్ గరీ ప్రాంతంలో తవ్వకాలు జరుగనందున పురావస్తు సాక్ష్యం నుండి పై గుర్తింపుకు బలం లభించడం లేదు. అశోకుని యుగంలో ఈ ప్రాంతంలో నగరం ఉండి ఉంటుంది. అయితే సరిహద్దులలో లేకపోయినా దాన్ని సరిహద్దు నగరంగానే భావించేవారు. పెషావర్ వంటి ఆధునిక సరిహద్దు నగరాలకు ఉన్న ప్రాముఖ్యం దానికి ఉండేది. ప్రధాన రహదారి మార్గంతో షహబాజ్ గరీకి సంబంధం ఉంది.

**సిద్ధాపూర్ :**

(గౌణ శిలాశాసనం) బ్రహ్మగిరికి పడమర మైలుదూరంలో జటింగ్ రామేశ్వర్ శాసనానికి దక్షిణంగా మూడుమైళ్ళ దూరంలో సిద్ధాపూర్ ఉంది. ఈ శాసన సముదాయం సామ్రాజ్య దక్షిణ సరిహద్దును సూచించవచ్చు. వీనికి ఉన్న ఇతర ప్రాముఖ్యాన్ని పైన వివరించినాము.

**సోహ్‌గౌరా :**

(మౌర్యయుగానికి చెందిన తామ్రశాసనం) ఉత్తరప్రదేశ్‌లో గోరఖ్‌పూర్ జిల్లాలో ఉంది.

**సొపారా :**

(ముఖ్య శిలాశాసనం ఎనిమిదవ శిలా శాసన ఖండం) బొంబాయిలో థానా జిల్లాలో ప్రాచీన రేవు పట్టణము. అశోకుని కాలంలో చాల ప్రాముఖ్యం వహించినదనడంలో సందేహం లేదు. వాణిజ్య కేంద్రంగా టాలెమీ వర్ణించిన సొపారాగా దీన్ని గుర్తిస్తారు. దీని ప్రాచీన నామం సుప్పారక. రేవు పట్టణమైనందున శాసనానికి చాల అనుకూల ప్రదేశం.

ఇచటికి వచ్చిపోయే అపార జనప్రవాహం నిరంతరం శాసనాలను చదువుతూ ఉంటారు. అంతేకాక ఈ రేవు పట్టణాన్ని దర్శించే విదేశీయులకు శాసనాల ద్వారా అశోకుని ధమ్మంతో పరిచయం కలుగుతుంది.

**సువర్ణగిరి :**

(గౌణ శిలాశాసనం) కర్ణాటకంలో మస్కీకి దక్షిణాన ఉన్న కనకగిరియే సువర్ణగిరి. ఆ మాటకు బంగారుకొండ అని అర్థం. ప్రాచీనకాలంలో రాయచూర్ జిల్లాలో బంగారం తవ్వి తీసేవారు. అందుచే పైపేరు సార్థకం. నేటికి ప్రాచీనకాలంనాటి గనులచాయలు కనిపిస్తాయి. సామ్రాజ్యంలో దక్షిణ రాష్ట్రానికి సువర్ణగిరి రాజధాని.

**తామ్రలిప్తి :**

ఇది మౌర్యుల రేవుపట్టణం. బెంగాలులో మిద్నపూర్ జిల్లాలోని నేటి 'టామ్‌లుక్'గా దీన్ని గుర్తించడం సర్వసాధారణం. గంగానదీ ముఖద్వారంలో టామ్‌లుక్ ప్రముఖ రేవుపట్టణం. సింహళచరిత్రలు దీన్నే 'తామవిత్తి' అని వ్యవహరిస్తాయి. తాను తామ్రలిప్తినుండి సింహళానికి బయలుదేరినట్లు పాహియాన్ వ్రాసినాడు. ఇదేస్థలంలో అశోకుడు నిర్మించిన స్థూపాలను తాను చూచినట్లు హుయాన్‌సాంగ్ చెప్పినాడు. సముద్రంమీద ప్రయాణం చేసేవారికేగాక గంగానది ఎగువకు వెళ్ళేవారికి కూడ టామ్‌లుక్ మంచి కూడలి. పురావస్తు అవశేషాలను బట్టి సయితం టామ్‌లుక్ మౌర్యయుగ నివాస ప్రాంతమని రుజువవుతున్నది.

**తక్షశిల :**

అశోక యుగంపై లభ్యమౌతున్న సారస్వత ఆధారాలతో తక్షశిల ప్రస్తావన తరచుగా కన్పిస్తున్నది. సామ్రాజ్యంలో ఉత్తర రాష్ట్రానికి ఇది రాజధాని. దేశంలోని ప్రధాన నగరాలలో ఒకటి. పురావస్తు పరిశోధనలవల్ల ఈ ప్రాంతంలో ఉన్నతస్థాయి పరిశ్రమ సాగినట్లు, సంస్కృతి విలసిల్లినట్లు తెలుస్తుంది. తక్షశిల ప్రాముఖ్యానికి అనేక కారణాలను చెప్పవచ్చు. పాశ్చాత్య భూములతో చిరకాల పరిచయంవల్ల తక్షశిల విశ్వజనీన సంస్కృతీ కేంద్రమయింది. విద్యా కేంద్రంగా ప్రసిద్ధి చెంది, సుప్రసిద్ధ ఆచార్యులకు నివాసమైంది. తక్షశిల మూడు రహదారుల కూడలి. పాటలీపుత్రం నుండి బయలుదేరే మహీ రాజమార్గము, బాక్ట్రియా, కాపిశ, పుష్కలావతి (పెషావరు) వీటి గుండా వెళ్ళే వాయవ్య రహదారి, కాశ్మీర్ నుండి శ్రీనగర్, మాన్‌సేహ్రా, హరిపూర్ లోయలగుండా మధ్య ఆసియాను చేరే మార్గము తక్షశిల కలిసేవి. పశ్చిమ రాజ్యాలతో సముద్రంమీదుగా సంబంధాలు పెరిగిన తరువాత పెషావరు–బాక్ట్రియాల భూమార్గ ప్రాముఖ్యం తగ్గి, క్రమంగా తక్షశిల తరువాతి కాలంలో క్షీణించింది.

**ఉజ్జయిని :**

సామ్రాజ్యంలో పశ్చిమ రాష్ట్రానికి ఉజ్జయిని రాజధాని. ఈ రాజకీయ ప్రాముఖ్య మటుంచి తక్షశిలవలె ఉజ్జయిని అనేక రహదారుల కూడలి. పశ్చిమ తీరంలోని రేవు పట్టణాలతో ముఖ్యంగా బ్రోచ్–సొపారాలను కలుపుతూ ఉజ్జయినికి బాటలున్నాయి. అందుచే ఆ రేవు పట్టణాల గుండా జరిగే వాణిజ్యం ఉజ్జయిని అదుపులో ఉండేది. దక్షిణ రహదారులు కొన్ని ఉజ్జయినిలో ఆగిపోయేవి. ఉజ్జయినికి పాటలీపుత్రానికి రహదారి ఉంది. టాలెమీ దీనిని 'ఓజీన్' అని వ్యవహరించినాడు. మౌర్యయుగంలో ఇది ప్రసిద్ధ బౌద్ధ కేంద్రం. ఇక్కడున్న వ్యవహారాలను బట్టి ఆలోచిస్తే ఉజ్జయినికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. ఉజ్జయినికి ఈశాన్యంగా నాలుగు మైళ్ళ దూరంలో కుమ్హాటేక్రీ దిబ్బ ఉంది. దీనిని తవ్వగా క్రీ. పూ. మూడో శతాబ్ది వరకు పోయే ఖనన–శ్మశాన భూమి బయలుపడింది. తాను నిర్మించిన "నరకం" స్థానంలోనే అశోకుడొక స్థూపాన్ని నిర్మించినాడని, అది ఉజ్జయినికి ఎంతో దూరంలో లేదని హుయాన్‌సాంగ్ వ్రాసినాడు.

**ఎర్రగుడి :**

(ముఖ్య శిలాశాసనాలు; గౌణ శిలాశాసనము) కర్నూలు జిల్లా దక్షిణ సరిహద్దులో గుత్తికి ఎనిమిది మైళ్ళ దూరంలో సిద్ధాపూర్‌కు ఈశాన్యంగా ఎనభై మైళ్ళ దూరంలో ఎర్రగుడి ఉంది. ముఖ్య, గౌణ శిలాశాసనాలు రెండూ ఉన్నందున ఎర్రగుడి చాల ప్రాముఖ్యం ఉన్న ప్రాంతమని స్పష్టమౌతున్నది. కాని ఇచట పట్టణ శిథిలాలేమీ ఇంతవరకు బయల్పడలేదు. సరిహద్దునగరం ఇచట ఉండి, ఇచటి నుండి దాక్షిణాత్య రాజ్యాలకు రహదారి ఉండి ఉండవలె.

నాలుగో అనుబంధం

# మౌర్యయుగ మృణ్మయ పాత్రలు - నాణేలు

పురావస్తు తవ్వకాల్లో అంతర్భుల కాలం నిర్ణయించడానికి అక్కడ లభించిన మృణ్మయ పాత్రలను పరీక్షించడం ఒక పద్ధతి. అదేవిధంగా తవ్వకాలలో ఒకేరకమైన వస్తువులు, మృణ్మయ పాత్రలు లభించడం వల్ల మౌర్యయుగానికి చెందిన అంతరువులను నిర్ణయించడం సులభమౌతుంది. సాధారణంగా కాలనిర్ణయం జరిపే సందర్భంలో కుండల ఆకారము, వాటిని తయారుచేయడానికి వాడిన పదార్థ గుణము పరిశీలిస్తారు. తవ్వకాలలో బయల్పడే అవశేషాలు పూర్తికుండలుగా దొరకవచ్చు. కుండపెంకులుగానైనా ఉండవచ్చు.

మౌర్యయుగానికి చెందిన మృణ్మయ పాత్రలు అనేకరకాలున్నాయి. ఉత్తరాది నల్లమెరుగు గల కుండలలో చాల పరిపూర్ణమైన సాంకేతిక పద్ధతి కనిపిస్తున్నది. దీనినే N. B. P. (Northern black polished ware) అంటారు. వీటిలో వేర్వేరురకాలు అంటే ముతక ఎరుపు, ధూసరివర్ణం పాత్రలు సహితం లభిస్తున్నాయి. చాల మృదువైన బంకమట్టితో వీటిని తయారు చేసేవారు. పగులగొట్టినపుడు సాధారణంగా ధూసరవర్ణంగాని, ఎరుపురంగు గాని కనిపిస్తుంది. స్నిగ్ధ గుణం ఉన్న, కాంతిమంతమైన ఆచ్ఛాదనవంటి మెరుగు ఈ కుండలకు ఉంటుంది. అక్కడక్కడ కుండల ఉపరితలంమీద ఎరుపు ఊదారంగు మచ్చలు కనిపిస్తాయి. ప్రత్యేకమైన ఈ మెరుగువల్ల గ్రాఫైట్ పూతపూసిన ఎర్రని కుండలు మొదలైన ఇతర సామాగ్రి నుండి N. B. P. ని సులభంగా గుర్తించవచ్చు. పళ్ళేలు, చిన్న పాత్రలు ఈ సామాగ్రిలో ఎక్కువ.




















గంగానది లోయలో ఈ సామాగ్రి అధికంగా దొరికింది. కాని పెంకులలో చాల భాగం నీటితో కొట్టుకొని పోయినందున ఈ మృణ్మయ పాత్రలసాయంతో తవ్వకాల అంతరువుల కాలాన్ని నిర్ణయించడం కష్టం. ఈ పాత్ర సామగ్రి తయారుచేసిన ప్రాంతాన్ని ఇంతవరకు స్పష్టంగా నిర్ణయించడం జరుగలేదు. గంగానది మైదానంలో మధ్యగా ఉన్న కౌశాంబి–పాట్నా నగరాల పరిసరాలే ఈ పరిశ్రమకు కేంద్రమని ఇటీవల సూచిస్తున్నారు. ఈ సూచనకు కారణం ఈ ప్రాంతంలోనే ఈ సామగ్రి దట్టంగా పలుప్రాంతాలలో దొరకడమే. తూర్పు రాజస్తాన్, తూర్పు, పశ్చిమ, మధ్య భారత ప్రాంతాలు ఈ సామగ్రిని గంగానది లోయనుండి వర్తకుల ద్వారా దిగుమతి చేసుకొన్నవని కొందరి సూచన. పెద్ద ఎత్తున మృణ్మయ సామగ్రిని తయారుచేసి ఎగుమతి చేయడాన్ని ఒక జైన గ్రంథం ప్రస్తావిస్తున్నది. ఈ అంశం మౌర్య యుగానికే చెంది ఉండవచ్చు. ఈ సామగ్రిని ఎగుమతి చేయడానికి కౌశాంబి ప్రాంతం చాల అనుకూలమైనది. అక్కడ కూడ రాగితీగెలతో అతుకులు పెట్టిన N. B. P. సామగ్రి దొరికింది. అందుచే ఆ రోజులలో N. B. P. దుర్లభం కాకపోయినప్పటికీ దాని ఖరీదు మాత్రం ఎక్కువని, పగిలిన పాత్రలను సయితం అపురూపంగా చూచుకొనేవారని తెలుస్తున్నది.

ఈ సామగ్రిని ఉత్పత్తి చేయడంలో ఉన్న సాంకేతిక పద్ధతి వివరంగా పరిశీలించడం జరుగలేదు. ఈ పద్ధతి భారతదేశానికి ఎలా వచ్చిందో తెలియదు. దీనిని గ్రీకులనుండి భారతీయులు నేర్చుకొన్నారా లేదా గ్రీకుల రాకకు పూర్వమే భారతీయులకు తెలుసునా అనే అంశాలు స్పష్టంగా లేవు. గ్రీకుల కాంతిమంతమైన నల్లని పాత్ర సామగ్రి N. B. P. కి ఏమంత భిన్నమైనదికాదు. ఈ సామగ్రి తక్షశిలలో దొరికిందని మార్షల్ చెబుతున్నాడు. తక్షశిలలోని 'భిర్' దిబ్బలో పెంకుల రూపంలో దొరికిన N. B. P. సామగ్రి క్రీ.పూ. 300 నాటిది. అందుచేత గ్రీకులు రాక పూర్వమే N. B. P.సామగ్రి తక్షశిల ప్రాంతంలో వాడుకలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇటీవలి తవ్వకాలలో 'భిర్' దిబ్బలోని గ్రీకుల అంతరువునుండి అలెగ్జాండరు నాణెమొకటి లభించింది. ఆ అంతరువుకు దిగువన N. B. P. సామగ్రి దొరికింది. ఇది అలెగ్జాండరు దండయాత్రకు పూర్వమే N. B. P. వాడుకలో ఉన్నట్లు సూచిస్తున్నది. కాని పై అంతరువుల నుండి N. B. P. పెంకులు కిందికి జారడం కూడ సంభవమే. తక్షశిలలో ఇంకా విస్తృతంగా తవ్వకాలు జరిగితేగాని ఈవిషయం పూర్తిగా తేలదు. ఇంతకంటె ముఖ్యమైన సమస్య మరొకటి ఉంది. అది గంగానది లోయలో దొరికినంత ఎక్కువగా తక్షశిలపై అంతరువులలో N. B. P. దొరకకపోవడం.

రాజ్‌గర్‌లో మౌర్యయుగ అంతరువు అంతటా సాధారమైన నల్లని పాత్ర సామగ్రితో

కలిసి దొరికింది. రెంటి ఆకారాలు సయితమూ ఒకే విధంగా ఉన్నాయి. N. B. P. లో కాంతికి కారణమైన పూత నల్లని పాత్రలో లేదు. అది ఒక్కటే రెంటికీ భేదం. ఇచట దొరికిన సామగ్రిలో అంచులున్న పళ్ళేలు, చిన్న పాత్రలు మాత్రమే ఉన్నాయి.

మౌర్య అంతరువులలో దొరికిన ఇతర మృణ్మయ సామగ్రి చాల వరకు గోధుమ, ఎరుపు రంగులలో ఉంది. శిశుపాల్ ఘర్‌లో ఇటీవలి తవ్వకాల్లో దొరికిన మృణ్మయ సామగ్రి సాదా గోధుమ, ఎర్రరంగుది. ఈ దశ క్రీ. పూ. 300–200 నాటిది. అక్కడక్కడ మెరుగు పెట్టినసామగ్రి, N. B. P. పెంకుల ముక్కలు కూడ దొరికినాయి. తరువాతి దశకు అంటే క్రీ. పూ. 300 క్రీ. శ. 100గా నిర్ణయించిన అంతరువులో కొంత పరిణతి చెందిన మృద్భాండ సామగ్రి దొరికింది. వీటిలో కొన్నింటికి చేతలోనే అలంకారాలు వచ్చినాయి. మరి కొన్నింటి మీద చేతితో గీచిన అలంకారాలున్నాయి. ఈ అంతరువులో N. B. P. కూడ విశేషంగా దొరికింది.

అహిచ్ఛత్రి తవ్వకాలలో మౌర్య అంతరువులో చాల రకాల మృణ్మయ సామగ్రి దొరికింది. క్రీ. పూ. 300–200కు చెందిన ఏడో తరంలో గోధుమ, ఎరుపు రంగులలో మామూలు సామగ్రి, అలంకారాలున్న సామగ్రి దొరికింది. ఈ మామూలు సామగ్రిని అంతకు పూర్వపు సామగ్రి నుండి వేరుచేయవచ్చు. ఇది తేలిక రంగు సామగ్రి. అక్కడక్కడ కొన్ని పెంకులు మెరుగుపెట్టడాన్ని సూచిస్తున్నాయి. ఎర్రరంగు సామగ్రిలో చాలా భాగం కూజా రూపంలో ఉన్న పాత్రలు. ఈ కూజా మందం తక్కువ. పాత్ర శరీరం తేలికగా ఉంటుంది. నాటికి సాంకేతిక విద్యా ప్రమాణం పెరిగినట్లు ఇవి సూచిస్తున్నాయి. ఈ కూజాలకు స్పష్టమైన మెడలు లేవు. బూడిదరంగు వచ్చేవరకు కాల్చడం ఈ యుగంలో మరొక లక్షణం. ఈ యుగం పాత్రలలో రెండు రకాలున్నాయి. అందొకటి కూజా. బుజాల నుండి పెరిగిన మెడ, చదునుగా సమంగా ఉన్న అంచులు వీని లక్షణాలు. మరొకటి ఆకారంలో నేటి హుండీ వలె ఉంటుంది. దీనికి అంచు ఉండదు. లేదా చిన్న అంచు ఉంటుంది. ఇది వంట పాత్ర అనేది స్పష్టం. ఈ తరంలో అహిచ్ఛత్రలో దొరికిన కుండలలో అసాధారణమైనవి అలంకారాలున్న పాత్రలు. తరువాతి యుగంలో ఈ అలంకారం సర్వసామాన్యమైంది. మధ్య త్రిశూలంతో కలిసిన నాల్గు తాబేళ్ళ చిత్రం. ఈ యుగ విద్ధాంక నాణేలమీద, అదే అంతరువులో దొరికిన జేగురు మట్టి బొమ్మల మీద సయితం ఈ చిత్రం కనిపిస్తుంది. ఇదే చిహ్నాలను గూర్చి చెప్పేటప్పుడు దీన్ని విపులంగా చర్చిద్దాము.

దక్షిణ భారతంలో (ద్రావిడ దేశం) ఇప్పటికి జరిగిన తవ్వకాలను బట్టి N. B. P. సామాగ్రి చిహ్నాలు బయల్పడకపోవడం గమనించదగిన విశేషం. ఇతర ప్రదేశాలలోకంటె

గంగానది లోయలోనే ఈ సామగ్రిని ఎక్కువగా వాడినట్లు కనిపిస్తుంది. పురావస్తు పరిశోధనలలో N. B. P. విద్ధాంక నాణేలు దొరకడం ఆధారంగా మౌర్యయుగంలో నివాస ప్రాంతాలని విశ్వసిస్తున్న కొన్ని ప్రదేశాల పేర్ల పట్టికను ఈ అనుబంధం చివర్లో ఇవ్వడం జరిగింది. కాని ఇదే స్పష్టమైన సాక్ష్యం కాదని నాకు తెలుసు. N. B. P. వాడకం మౌర్యయుగానికి మాత్రమే పరిమితం కాదు. బహుశా అంతకు పూర్వం కూడ వాడుకలో ఉంది. తరువాతి యుగంలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తున్నది. దీన్ని ఎక్కువగా వాడడం మౌర్యయుగ లక్షణమని మాత్రం చెప్పవచ్చు. అంతేకాక మౌర్యయుగం అంతరువులలోనే N. B. P. ఎక్కువగా లభిస్తున్నది.

**విద్ధాంక నాణేలు**

విద్ధాంక నాణేలనే మాట సాధారణంగా ప్రాచీన భారతీయ నాణేలకు వర్తిస్తుంది. వీనిలో చాలా భాగం వెండివి కొన్ని రాగివికూడ ఉన్నవి. వాస్తవానికి వేరు వేరు ఆకారాలలో, ప్రమాణాలలో, బరువులలో ఉండి ఒకటి గాని, ఎక్కువ గాని చిహ్నాల నొక్కులున్న లోహపు ముక్కలే ఈ విద్ధాంక నాణేలు. వెండి విద్ధాంక నాణేలతోపాటు, ముద్రించిన రాగి నాణేలు కూడ దొరికినాయి. వాటిపై కూడ వ్రాతలుండవు. ఏనుగు, ప్రాకారావృత వృక్షము, పర్వతము విద్ధాంక నాణేలపై సర్వసాధారణంగా కన్పించే చిహ్నాలు. భారతీయ విద్ధాంక నాణేలను పరిశీలించే ముందు భారతదేశంలో దొరికిన విదేశీ నాణేలలోని రకాలను గురించి క్లుప్తంగా చెప్పడం అవసరం. దరయస్ ఇచ్చిన సిగ్లాయ్ అనే పారశీక నాణేలు క్రీ.పూ. 500 – 331 మధ్య పంజాబులో వాడుకలో ఉన్నట్లు చెబుతారు. కొన్ని వెండి సిగ్లాయ్ నాణేలపై భారతీయ విద్ధాంక నాణేలపై కన్పించే చిహ్నాలలో పాటు, బ్రాహ్మీ, ఖరోష్ఠీ అక్షరాలు సయితం ఉన్నాయి. ఈ అంశం సిగ్లాయ్ నాణేలు, విద్ధాంక నాణేలు ఒకే కాలంలో వాడుకలో ఉన్నట్లు సూచిస్తుంది. అలెగ్జాండరు నాణేలలో భారతదేశంలో ప్రథమంగా దొరికింది చదరపు రాగి నాణెము. దాని మీద A⋀EEAN△POY అనే పేరు ఉంది. తక్షశిల 'భిర' దిబ్బలో టెట్రా డాఖ్మమ్ అనబడే రెండు అలెగ్జాండరు వెండి నాణేలను మార్షల్ కనుగొన్నాడు. ఈ రెండు నాణేలు క్రీ. పూ. 4, 3 శతాబ్దాలకు చెందిన అంతరువులో దొరికినాయి. అది అంతరువు నుండి ఫిలిప్ అరిడేయస్ వెండి నాణెం కూడ దొరికింది. ఇది క్రీ. పూ. 317 నాటి నాణెంగా లెక్క కట్టినారు. ఈ మూడు నాణేలు నాణేల నిధులలో దొరికినాయి. వీటిలో భారతీయ విద్ధాంక నాణేలు, పారశీక సిగ్లాయ్ కూడా ఉన్నాయి.

క్రీ.పూ. నాలుగో శతాబ్దంలో వాయవ్య భారతంలోని నాణేలను ప్రభావితం చేసిన మరొక గ్రీకు నాణెం ఎథీనియాకు చెందిన ఔల్ (గుడ్లగూబ). ఇవి వెండి నాణేలు.

సాధారణంగా ద్రాక్షేమ్మును పోలినవి. కాని భిన్నమైన విలువలున్నవి. నగరాధి దేవత అయిన  పల్లాస్ ఎథీనీకి పవిత్రమైంది. గుడ్లగూబ. "ఏథెన్సు సారాయము" అని సూచించే నిమిత్తం సారాయి కూజాలపై కూడ ఈ చిహ్నాన్ని ఉపయోగించేవారు. ఈ కూజాలకు పిడులుండవు. మధ్యధరా ప్రాంత సీమలలోని ఇంకా తూర్పు ప్రాంతాలలోను జరిగే వాణిజ్యానికి ఈ నాణేలు చాల ముఖ్యం. వాణిజ్యాభివృద్ధిని ఆశించే వాయవ్య భారతంలోని వారు ఔలును అనుకరిస్తూ నాణేలను వేయించినారని విశ్వసిస్తున్నాను. భారతీయ నాణేలలో కొన్ని పూర్తి అనుకరణలు. మరికొన్నింటిపై గుడ్లగూబకు బదులు గద్ధను ముద్రించినారు.

గ్రీకు నాణేలతో ప్రభావితమైన మరొక వెండి నాణేల వర్గం సొఫైట్సుకు చెందింది. వీటిని భారతదేశంలోనే ముద్రించినారని భావిస్తున్నారు. "సొఫిఇతిస్" అని ఏరియన్. స్ట్రాబోలు పేర్కొన్న రాజే సొఫైట్సు అని గుర్తిస్తున్నారు. అలెగ్జాండరు దండయాత్ర సమయంలో పంజాబులోని సాల్టురేంజ్ ప్రాంతాన్ని ఈతడు పాలిస్తున్నాడని భావిస్తున్నారు. కాని ఈ గుర్తింపును యధార్థమని అంగీకరించలేము. ఈ నాణేలపై  అనే పేరు ఉంది. దురదృష్టవశాత్తు ఈ నాణేలలో ఒక్కటి కూడ భారతీయ ప్రదేశాలలో దొరకలేదు. ఎథీనియన్ ఔలును చాల దగ్గరగా అనుకరిస్తున్నందున భారతీయరాజైన సొఫైట్సు వాణిజ్యాభివృద్ధి నాశించి ఈ నాణేలను ఇవ్వడం సంభవమే. సొఫైట్సు నాణేలు కొన్నింటికి సెల్యూకిడ్ నాణేలకు సంబంధం సూచిస్తారు. ఇది ఈ నాణేల పరస్పర ప్రభావానికి నిదర్శనం. సెల్యూకిడ్ నాణేల కొన్నింటిపై ఏనుగు చిహ్నం కనిపిస్తుంది. మౌర్యులనుండి సెల్యూకిడ్‌లు 500 ఏనుగులను సంపాదించినారు.

విదేశీ నాణేల, విదేశీ ప్రభావితమైన నాణేల నేపథ్యంలో విద్ధాంక నాణేలు వాడుకలోనికి వచ్చినాయి. లోహపు రేకును చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి వాటిపై చిహ్నాలు నొక్కటమే ఈ నాణేలు తయారుచేసే పద్ధతి. ఈ నాణేలు కొన్నింటిలో సగంచిహ్నం నాణేనికి వెలుపలే ఉండిపోయింది. చిహ్నాలు నొక్కిన తరువాతనే రేకును నాణేలుగా  కత్తిరించినందున ఈ విధంగా జరిగిందని లేదా చిహ్నాలు నొక్కటం అజాగ్రత్తగా జరిగిందని ఈ అంశం సూచిస్తున్నది. ఈ నాణేలు కొన్నింటిలో రెండోవైపు చిహ్నం ఉంది. మొదటి వైపు చిహ్నం మాత్రం అసంపూర్తిగా ఉంది. సర్వత్ర సంపూర్తిగా ఉన్న చిహ్నం కేంద్రాధికారాన్ని అక్కడక్కడ అసంపూర్తిగా కనిపించే చిహ్నం నాణేలను చెలామణిలో ఉంచే సామంత అధికార వర్గాన్ని సూచిస్తున్నదని భావిస్తున్నారు.

విద్ధాంక నాణేలను ఆలన్ సవిమర్శకంగా పరిశీలించినాడు. నందరాజులే ప్రథమంగా విద్ధాంక నాణేలను పెద్ద ఎత్తున ఇచ్చినందున వారి ఐశ్వర్యాన్ని గురించిన సంప్రదాయం ప్రచారమైందని సూచించినాడు. మొట్టమొదటి నాణేలలో చాల భాగం పైలా, సెట్‌మాహెట్,

గోరఖ్‌పూర్‌లలో దొరికినాయి. అందుచేత విద్ధాంకనాణేల జన్మభూమి ఆ ప్రాంతమే అని చెప్పవచ్చు. క్రీ. పూ. రెండో శతాబ్దిలో విద్ధాంక నాణేలు పోయి ముద్రిక నాణేలు వచ్చినందున విద్ధాంక నాణేలు చిరకాలం అమలులో లేవని ఆలన్ సూచన. క్రీ.పూ. అయిదో శతాబ్ది చివరలో, నాల్గో శతాబ్ది మొదట్లో వాడుకలోకి వచ్చిన పారశీక సిగ్లాయ్ నాణేలు భారతదేశంలో నాణేలను ముద్రించాలనే భావానికి కారణమై ఉండవచ్చు. ఈ ముద్రిత నాణేలు ఒక క్రమంలో ఉన్నందున వాటిని ప్రభుత్వమే ఇచ్చిందని ఆలన్ విశ్వాసం. ఉదాహరణకు ఈ నాణేలపై సూర్య, షడ్భుజ చిహ్నాలు తప్పనిసరిగా ఉన్నాయి. ఇవి రాజును, ఉన్నతాధికారిని సూచింపవచ్చు. ఇక రెండోవైపు చిహ్నాలలో వ్యత్యాసాలున్నాయి. అందుకు కారణం అవి మండల, లేదా స్థానిక అధికారి చిహ్నాలై ఉండవచ్చు. రెండోవైపు ఉన్న అయిదు చిహ్నాలు బహుశా ద్రవ్యాన్ని అదుపులో ఉంచే అయిదు సంస్థల చిహ్నాలై ఉండవచ్చు. ఇవి మెగస్తనీస్ పేర్కొన్న అయిదు సంఘాలను పోలి ఉండవచ్చు. ఆలన్ చేసిన ఈ సూచన మంచి ఉపజ్ఞతో కూడిన సూచన. వీటిలో కొన్ని నాణేలపై ప్రతి చిహ్నాలున్నాయి. వీటిని కోశాధికారి గుర్తులంటారు. వీటి సమస్యను గూర్చి చర్చిస్తూ ఇవి చాల ప్రాచీన నాణేలని, వీటిని తిరిగి ముద్రించినారని ఆలన్ సూచించినాడు.

వెల్ష్ పండితుడు కూడ ఈ నాణేలను గూర్చి వివరంగా పరిశీలించినాడు. మొహెంజొదారో ముద్రలపై ఉన్న చిహ్నాల కొనసాగింపే విద్ధాంక నాటనేలపై చిహ్నాలని అతని అభిప్రాయం. ఈ అనుక్రమణిక కేవలం భావనలోనే కాని వాస్తవ చిత్రాలలో కనిపించదు. కాని మొహెంజొదారో నుండి మౌర్య యుగం వరకు చిత్ర సంప్రదాయం అవిచ్ఛిన్నంగా వచ్చిందని, ముద్రలపై చిత్రాలు విద్ధాంక నాణేలపైని చిత్రాలకు ప్రాచీన రూపాలని చెప్పడానికి తగిన ఆధారం లేదు. విద్ధాంక నాణేలు క్రీ.పూ. నాల్గో శతాబ్దికి చాల ముందు యుగానికి చెందినవంటూ భిన్న అభిప్రాయాలు వెలిబుచ్చటం జరిగింది.

క్రింది అంశాలవల్ల ఈ నాణేలు మౌర్య యుగానివని దుర్గాప్రసాద్ అభిప్రాయం. చిహ్నం ఉన్న నాణేలను రసాయినిక పరీక్ష చేయగా వాటిలోని లోహ నిష్పత్తి అర్థశాస్త్రంలో సూచించిన దానికి సరిపోతుంది. అంతేకాక సొహ్‌గౌరా తామ్ర శాసనం మీద



సయితం పై చిహ్నమే ఉంది. ఈ శాసనం మౌర్య యుగానిదని సాధారణంగా అంగీకరిస్తున్నారు. వీటిపై గుర్తులు కోశాధికారి గుర్తులు కావని అర్థశాస్త్రంవల్ల తెలుస్తున్నది. రెండు లక్ష్యాలలో అంటే ధనాగారంలో నిల్వచేయడానికి, వాణిజ్య లావాదేవీలకు రాజ్యం నాణేలను ముద్రిస్తుందని అర్థశాస్త్ర మూలంలో ఒక భాగం చెబుతున్నది. అందుచేత రాజ్యమే నాణేలపై చిహ్నాలుంచుతుంది కాని, కోశాధికారి చిహ్నాలకు వాటిపై అవకాశం లేదు.

తక్షశిల తవ్వకాలలో విద్ధాంక నాణేల నిధి దొరికింది. విడివిడిగా కూడ తక్షశిలలో విద్ధాంక నాణేలు దొరికినాయి. వీటన్నింటిని మార్షల్ పండితుడు చర్చించినాడు. వీటిపై చిహ్నాలను హరప్పా సంస్కృతికి చెందిన ముద్రలతో ముడిపెట్టే విషయంలో మార్షల్ పండితుడు వెల్ష్ పండితునితో ఏకీభవిస్తున్నాడు. ఇక రాగి నాణేలు సిర్‌కాప్ అంతరువులలో ఎక్కువగా దొరికినాయి. వాటితో పోలిస్తే భిర్ దిబ్బలలో చాలా తక్కువ దొరికినాయి. అందుచే రాగి నాణేలు తక్షశిల ముద్రణమే అని మార్షల్ అభిప్రాయం. ఈ స్థానిక నాణేల ముద్రణ గ్రీకు దండయాత్ర అనంతరం ప్రారంభమై బహుశా శక దండయాత్ర అనంతరం కూడా కొనసాగింది. వీటిపై చిహ్నాలను వ్యాఖ్యానించడంలో గుర్తు ధర్మ రాజిక స్థూపంగాను U చిహ్నాన్ని దివ్య శృంగాలుగాను పేర్కొన్నాడు. ఈ చిహ్నం అతి చారిత్రక ముద్రలపై సయితం కనిపిస్తుంది. మార్షల్ చేసినది కేవలం భావనా పరమైన




వ్యాఖ్యానమే. అది స్థూపాన్ని ఉద్దేశించినదే అయితే మరింత సంప్రదాయసిద్ధమైన చిహ్నాన్ని వాడేవారు. ఇక వీటి కాలాన్ని గురించి; వీటిలో దీర్ఘ చతురస్రాలైన నాణేలు గుండ్రని కుంభాకార నాణేలు మూడు నాలుగు అంతరువులలో దొరికినాయి. అందుచే వాటి కాలం క్రీ. పూ. నాల్గయిదు శతాబ్దాలుగా సూచిస్తున్నారు. దీన్నిబట్టి క్రీ. పూ. నాల్గువందల ప్రాంతంలో విద్ధాంక నాణేలను ఇవ్వడం జరిగింది. ఈ నాణేలు స్వల్ప సంఖ్యలో సిర్‌కాప్ అంతరువులలో కూడ దొరికినాయి. అందుచే మౌర్య సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తరువాత కూడ ఇవి వాడుకలో ఉన్నట్లు తెలుస్తున్నది. భిర్ దిబ్బలో రెండు నాణెక నిధులు దొరికినాయి. వాటిలో ప్రధానంగా వెండి విద్ధాంక నాణేలున్నాయి. దీన్నిబట్టి మౌర్య యుగంలో తక్షశిల ప్రాంతంలో మొదట అధికంగా వెండి నాణేలు చెలామణిలో ఉన్నట్లు కన్పిస్తున్నది.

ఇటీవల కోశాంబి పండితుడు విద్ధాంక నాణేలపై కృషిచేసినాడు. కొన్నిరకాల నాణేలను పరిశీలించి వాటిలోని లోహ ప్రమాణాన్ని విశ్లేషించినాడు. నాణేన్ని వాడడం వల్ల అందులోని లోహ ప్రమాణం తగ్గుతుందని, తత్ఫలితంగా బరువు తగ్గుతుందనే అభిప్రాయం మీద అతని పరిశోధన ఆధారపడి ఉంది. తగిన బరువు ప్రమాణాన్ని లెక్కకట్టినప్పుడు నాణేమిచ్చిన కాలాన్ని నిర్ణయించడం సాధ్యమవుతుంది. కాని అసలు బరువు తెలిసినప్పుడే ఈ పద్ధతివల్ల ప్రయోజనముంది. విద్ధాంక నాణేల అసలు బరువు నిశ్చితంగా తెలియదు. అదీకాక ఆ రోజులలో నాణేలను దాచుకొనే అలవాటు సర్వ సాధారణంగా ఉండేది. అందుచే వాడకంద్వారా తగ్గిపోయిన లోహాన్నిబట్టి కాలాన్ని నిర్ణయించే పద్ధతి సర్వదా విశ్వాసయోగ్యం కాదు. ఈ పద్ధతివల్ల నాణేము ఎన్ని సంవత్సరాలు వాడుకలో ఉన్నదీ చెప్పవచ్చు. కాని నాణేల కాలాన్ని నిర్ణయించలేము. ఏమైనప్పటికీ లోహ విశ్లేషణం ద్వారా నాణేల పరిశీలన

ఆసక్తిదాయకమైన పద్ధతే. కాని నాణేల కాలాన్ని నిర్ణయించే ప్రయత్నంలో సాధ్యమైనన్ని భిన్న మార్గాలను సమ్మేళనం చేసి ఆలోచించవలె.

చిహ్నాలను వ్యాఖ్యానిస్తూ సౌర చిహ్నము, షడాకార చక్రము, సార్వభౌమాధికార చిహ్నాలని కోశాంబీ సూచించినాడు. కమానులపై అర్ధచంద్రుడు మౌర్య చిహ్నము. తరచుగా ఇది షడాకార చక్రంతో కలిసి ఉండేది. ఒక్కొక్క చిహ్నం ఒక వంశంతో ముడిపడిందని



కోశాంబి అభిప్రాయం. చిహ్న సముదాయంలో తొమ్మిది గుర్తులున్నందున నాలుగో గుర్తు రాజు వ్యక్తిగత చిహ్నము. ఐదో గుర్తు నాణేలను ముద్రించే మంత్రిది. చక్ర చిహ్నంగాని, మనిషి బొమ్మలున్నవిగానీ కతిపయ సామ్యం



అమలులో ఉన్న గణరాజ్య నాణేలు. చిహ్నాలలో ఏదీ కూడ టంకసాల గుర్తని కోశాంబి అంగీకరించడు. తక్షశిల దిబ్బలో దొరికిన తొలి మౌర్య నాణేలతో పోలిస్తే తరువాతి మౌర్య నాణేలు అపకర్షకు గురి అయినవని అతని విశ్వాసం. ఈ అంశాన్ని అతడొక విధంగా సమన్వయిస్తున్నాడు. కొత్తగా జయించిన ప్రాంతాలలో అపకర్ష ద్రవ్యం అమలులో ఉండేదని, ఆ నాణేలను మౌర్యులు తమ సామ్రాజ్యంలో చెలామణి కానిచ్చినారని అతని సూచన. మూడు అండాకార వృత్తాల మధ్య గీత ఉన్న చిహ్నం అశోక చిహ్నమని, తరచుగా కన్పించే ఆ చిహ్నం సుదీర్ఘ పాలనకాలాన్ని సూచిస్తుందని కోశాంబి చెబుతాడు.



బిందుసారుని నాణేలు కొన్నింటిపై కూడ ఈ చిహ్నం కనిపిస్తుందని అతని వాదం. కమానులపై నెమలిగుర్తు బిందుసారునిదని, దీనికి, మౌర్యుల గణ చిహ్నానికి సంబంధం ఉన్నదని కోశాంబి సూచన.

తక్షశిలలో కనిపించిన రెండు నాణెక నిధులమీద దానీ పండితుడు మరింత నిశితమైన పరిశోధన సాగించినాడు. మార్షల్ నిర్ణయాలను ఈతడు చాలవరకు ఖండించినాడు. భిర్ దిబ్బలో దొరికిన పెద్దనిధి కాలాన్ని అందులోని బంగారు నాణేల సహాయంతో నిర్ణయించవచ్చు. వీటిలో ఒకటి అలెగ్జాండరు నాణెం. రెండోది ఫిలిప్ అరిడేయస్‌ది. దీన్నిబట్టి పైన సూచించినట్లు ఆ నిధి సుమారు క్రీ.పూ. 317 నాటిది. చిన్న నిధిలో ఉన్న డియోడోటస్ నాణెంవల్ల ఆనిధి క్రీ. పూ. 248 నాటిదని నిర్ణయిస్తున్నారు. భిర్ దిబ్బలో ఒక అంతస్థుకు 'B దశ' అని దానీ పేరు పెట్టినాడు. ఈ అంతస్తులో హెలెనిక్ వస్తువులు దొరకడం మౌర్య యుగాంతానికి తక్షశిల ప్రాంతంపై ఇండో బాక్ట్రియనుల ప్రభావాన్ని సూచిస్తున్నది. ఇదే కాలంలో స్థానికమైన తక్షశిల నాణేలు అధిక సంఖ్యలో రాసాగినాయి. వీటిలో కొన్ని శలాకా నాణేలున్నాయి. కాని శలాకా నాణేలు ఈ ప్రాంతంలో మరెక్కడా

దొరకలేదు. అందుచే అవి గంగా యమునా ప్రాంతం నుండి వచ్చినవని దానీ సూచిస్తున్నాడు. పెద్దనిధిలో దొరికిన కంఠాభరణం సిర్‌కాప్‌లో దొరికిన పూసలకు అనుగుణంగా ఉంది. అందుచే ఆ నిధి మౌర్య యుగానికి పూర్వపుది అంటే క్రీ.పూ. 317కు పూర్వపు నిధికాదు; చాల తరువాతిది అయిఉండవచ్చు. బహుశా గ్రీకు నాణేలను కూడ చేర్చి దాచి ఉంటారు. పెద్ద నిధిని చిన్న నిధికంటె చాల ముందుగా నిక్షేపం చేసినారని మార్షల్ గట్టిగా చెబుతున్నాడు గాని, అలా జరిగి ఉండదు. రెండు నాణెక నిధులు భిర్ దిబ్బ రెండో దశలోనే దొరికినాయి. వాటితో కలిసి దొరికిన వస్తువులనుబట్టి రెండు నిధులను నిక్షేపించడంలో పెద్ద కాలవ్యత్యాసం ఉండదు. కాబట్టి రెండు నిధులు మౌర్యయుగం తరువాతివే అయినట్లు కనిపిస్తుంది. ఈ కారణాలవల్ల విద్ధాంక నాణేలు మౌర్యయుగానికి పూర్వమే వాడుకలో ఉన్నట్లు చెప్పడానికి తక్షశిలలో లభించే సాక్ష్యం రుజువుగా అంగీకరించలేము. తక్షశిలలో స్థానిక నాణేలు, శలాకలు, భిర్ దిబ్బలో దానీ A దశ అని పేరు పెట్టిన అంతరువులో దొరికినాయి. ఈ పరిశీలనను బట్టి విద్ధాంక నాణేలను ప్రథమంగా ఇచ్చినవారు మౌర్యులని తేలుతుంది. బహుశా మౌర్యులకు పూర్వం శలాకలు వాడుకలో ఉండి ఉంటాయి.

వెండి విద్ధాంక నాణేలేకాక, వెండి వక్ర శలాకా నాణేలున్నట్లు నిదర్శనలున్నాయి. వక్రశలాకలను పారశీక ప్రమాణాలకు అనుగుణంగా రెండు సిగ్లాయిలకు సమంగా ముద్రించి ఉంటారు. తరువాతి మౌర్య యుగానికి చెందిన తక్షశిల చిన్ననిధిలో ఇవి లేనందున వక్రశలాకలు విద్ధాంక నాణేల కంటే ప్రాచీనములని భావిస్తున్నారు. ఈ భావనకు క్రీ. పూ. 248 కి చెందిన డియోడోటస్ నాణెం ఆ నిధిలో దొరకడం ఒక కారణం. అలెగ్జాండరుకు ఒంఫిస్ 200 టాలెంటుల బంగారాన్ని ఇచ్చినాడు. ఆ బంగారాన్ని నాణేల రూపంలో ఇచ్చి ఉంటాడని ఆలన్ విశ్వాసము. వెండి నాణేలకంటె రాగి విద్ధాంక నాణేలు చాల అరుదు. ఈ నాణేలలో చాలా వాటిపై ముందువైపు ఐదు చిహ్నాలు, వెనుకవైపు నాలుగు చిహ్నాలు ఉన్నాయి. వెండి నాణేలపై ముందు వైపు ఒకటి, వెనుక వైపు ఐదు చిహ్నాలు సాధారణంగా ఉంటాయి.

మౌర్యులకు బౌద్ధ మతానికి సన్నిహితమైన సంబంధం ఉన్నందున ఏదో ఒక దశలో ఈ గుర్తులు బౌద్ధ చిహ్నాలు అయి ఉండవచ్చునని ఊహింపవచ్చు. ఫౌచర్ ఈ అభిప్రాయాన్నే వ్యక్తపరచినాడు. ఈ నాణేలపై కనిపించే ఏనుగు, ఎద్దు చిహ్నాలు బుద్ధుడు మాయాదేవి కడుపున పడటాన్ని, ఆతని జన్మను సూచించే జ్యోతిశ్చక్రరాశికి సంప్రదాయక చిహ్నములని ఆతని వ్యాఖ్యానం. కాని చాల సందేహాస్పదమైన వ్యాఖ్యానం. నాడు పన్నెండురాశుల చిహ్నాలు భారతదేశంలో వాడుకలో ఉన్నవనడానికి నిదర్శనలేదు. బౌద్ధ మతానికి ఇతర

సంప్రదాయక చిహ్నాలు అశ్వము, సింహము. అవి ఉన్న నాణేలు ఇంతవరకు దొరకలేదు. షడారచక్రం పద్మానికి మరొక రూపమని ఫౌచర్ అభిప్రాయము. పద్మం బుద్ధుని జననానికి ఒక సూచన. జన్మించిన వెంటనే బుద్ధుడు ఏడడుగులు వేసినాడట. అడుగడుగున పద్మం ఉద్భవించిందట. ప్రాకార చిహ్నము సంబోదికి చిహ్నము. కమానులు స్థూపానికి మారు



రూపమని లేదా సమాధికి చిహ్నమని ఆతడు గ్రహిస్తున్నాడు. స్థూపానికి మారుగా స్థూపానికి మధ్యగా యష్టి, ఛత్రంతో కూడిన యష్టి మధ్యనున్న స్థూపము మొదలైన చిహ్నాలున్నాయి. ఈ నాణేలపై పేర్లు లేనందున వాటి కాలాన్ని నిర్ణయించటానికి, వాటిపై ఉన్న చిహ్నాల ప్రాముఖ్యము, శాస్త్రీయ పరిశీలన ద్వారా లభించే పరిజ్ఞానము మాత్రమే ఆధారం. మౌర్యయుగానికి పూర్వం నాణేలు వాడుకలో ఉన్నవని మా విశ్వాసం. బహుశా ప్రాచీనమైన నాణేలు వక్రశలాకలై ఉంటాయి. మౌర్యుల కాలంలో విద్ధాంక నాణేలు వాడుకలోనికి వచ్చినాయి. మారక మధ్యమంగాను, అధికారిక ద్రవ్యంగాను విద్ధాంక నాణేలను విశేషంగా వాడినారు. అర్థశాస్త్రం కూడ ద్రవ్యానికి పై రెండు ప్రయోజనాలను పేర్కొంటున్నది. అర్థశాస్త్రమే నాణేలలో రెండు రకాలను చెబుతున్నది. మొదటిది పణ అనే వెండి నాణెము. పణాలలో 1, 1/2, 1/4, 1/8 అనే వర్గాలున్నాయి. రెండోది మాషక అనే రాగి నాణెము. దీనిలో సయితం పైవర్గక్రమం ఉంది. మాషకంలో నాలుగోవంతు నాణేన్ని కాకణి అనేవారు. బంగారు నాణేల ప్రసక్తికూడ ఉంది కాని వాటిని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే ముద్రించేవారు. అవి చెలామణిలో ఉండేవికావు. వర్తకాలావాదేవీలు, జీతాలు చెల్లించడం వెండి ద్రవ్యంలోనే పణాలలోనే జరిగేది. వరిష్ఠోద్యోగుల పెద్ద మొత్తం జీతాలు సయితం పణాలలోనే చెల్లించేవారు కాని బంగారు నాణేలలో కాదు. విద్ధాంక నాణేలు వెండి, రాగిలోనే ఉన్నాయి. రాగి నాణేలు అరుదు. వెండినాణేలే మనకు నిధుల రూపంలో దొరకడం చాల సహజం. విలువలో తక్కువైనందున వాడుకలో రాగి నాణేలే విస్తారంగా ఉండేవి. విలువ అధికమై నందున వెండి నాణేలను దాచేవారు. ముందు ముందు ఏ ప్రదేశంలోనైనా తవ్వకాలలో రాగి నాణేలు చాలినన్ని లభ్యమైతే కోశాంబి లోహ విశ్లేషణ సిద్ధాంతం వాటికి అనువర్తించినపుడు ఆసక్తికరమైన ఫలితాలు కలుగవచ్చు.

అర్థశాస్త్రాన్ని బట్టి సుస్థాపితమైన టంకసాల ఉన్నట్లు తెలుస్తుంది. నాణేలలోని లోహ నిష్పత్తిని జాగ్రత్తగా పర్యవేక్షణ చేసేవారు. వీటి వివరాలు అర్థశాస్త్రంలో ఉన్నాయి. కృత్రిమ నాణేల ముద్రణకు గల అవకాశాలన్నింటిపట్ల జాగ్రత్త వహించేవారు. వాణిజ్యపు లావాదేవీలు, జరిమానాలు, రాజ్యస్వం మొదలైన వాటి వర్ణన, వాటిపై ఉన్న సూచనలవల్ల మౌర్యయుగంలో ద్రవ్య ఆర్థిక విధానం సుపరిచితమనీ, ద్రవ్యాన్ని చాల జాగ్రత్తగా వాడినారనీ

తెలుస్తుంది. ఈ వివరణలన్నీ విద్ధాంక నాణేలే మొట్ట మొదటి రకం నాణేలు కావని సూచిస్తున్నాయి. వక్రశలాక నాణేలు విద్ధాంక నాణేలకు ముందు అంటే మౌర్యయుగానికి పూర్వమే వాడుకలో ఉన్నవన్న ఆలన్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాము. ఈ అంశాన్ని తక్షశిలలో దొరికిన రెండు నిధులు రుజువు చేస్తున్నాయి. క్రీ. పూ. 317 నాటి ఫిలిప్ అండేయస్ నాణెమున్న మొదటి నిధిలో వక్రశీలాక నాణేలు కూడ ఉన్నాయి. క్రీ.పూ. 248 నాటి డియోడొడస్ నాణెం ఉండి మౌర్యయుగాంతంలో బహుశా నిక్షిప్తమైన చిన్న నిధిలో వక్రశలాకలు లేవు. కాబట్టి క్రీ. పూ. 248 నాటికి వక్రశలాకలు చెలామణిలో లేనట్లు తెలుస్తున్నది. విద్ధాంక నాణేల వాడకం సులభం. అందుచే మౌర్యయుగారంభంలో శలాకల స్థానంలో విద్ధాంక నాణేలు వాడుకలోనికి వచ్చినాయి.

కేంద్రాధికారం నాణేలను జారీ చేస్తున్నది. బహుశా సామ్రాజ్యంలోని ప్రధాన నగరాలైదింటిలోను ఉన్న సామ్రాజ్య టంకసాలలో వీటిని ముద్రించేవారు. ఈ నాణేలు మొదట్లో వర్తకుల సంకేతాలుగా ఉండి క్రమంగా జాతీయ ద్రవ్యంగా చెలామణి అయినవనే అభిప్రాయంతో మేము ఏకీభవించము. స్థానిక వాణిజ్యంతో కాని, స్థానిక పాలనతో కాని ఈ చిహ్నాలకు సంబంధం ఉండి ఉంటుంది. టంకసాలకు చేరి వాటిపై గుర్తులు రాజాధికార చిహ్నాలతో కలిసి పోయి ఉంటాయి. వాణిజ్యం చాల బాల్యదశలో ఉన్నందున వర్తకులు స్థానిక చిహ్నాలకే మొగ్గు చూపి ఉండవచ్చు.

స్థానిక చిహ్నాలున్నపుడు తమ ప్రాంతంలో నాణేలను, ఇతర ప్రాంతాల నాణేలను గుర్తించడం సులభమౌతుంది. కాబట్టి రాజ టంకశాలే నాణేలను ముద్రించినప్పటికీ నాణేలపై రాజు లేదా రాజవవంశ చిహ్నాలతోపాటు వాటిలో శ్రేణులవంటి సంస్థలకు, రాష్ట్రాలవంటి పాలన ప్రమాణాలకు కూడ ప్రాతినిధ్యం లభించేది.

విద్ధాంక నాణేలపై ఉన్న చిహ్నాల అర్థాన్ని కనుగొనడం చాల క్లిష్టమైన సమస్య.



కమానులపై నెమలి మౌర్యవంశ చిహ్నా మనడంలో కొంత సత్యమున్నది. కమానులపై అర్ధచంద్రునకు, చంద్రగుప్తునకు సంబంధం ఇంతకు పూర్వమే సూచితమైంది. చంద్రగుప్త అనే మాటకు "చంద్రరక్షితుడ"ని అర్థం. కొండల మాటున అర్ధచంద్రుడీ అర్థాన్నే సూచిస్తాడు. అనే చిహ్నం బిందుసారునకు వాడినారు. ఈ చిహ్నంలో కనిపించే బిందు వ్యాప్తివల్ల బిందుసార మాటలోని పదానికి, అర్థానికి, ఈ చిహ్నానికి ముడిపెట్టడం జరిగింది. అదేవిధంగా సూర్యచిహ్నం, షడారచక్రం కూడ బిందుసార చిహ్నానికి మార్పులే. ప్రాకారంలో వృక్షం అశోక చిహ్నామై ఉంటుంది. అది అశోక వృక్షమై ఉండవచ్చు. ఇతర చిహ్నాల కంటె తరచుగా కన్పించే చిహ్నం కోశాంబి అశోకునదని చెప్పినాడు. ఈ చిహ్నం కొన్ని నాణేలమీద షడార చక్రం బిందుసారుని

చిహ్నమని అంగీకరిస్తే అశోకుని కాలంలో బిందుసారుని నాణేలని తిరిగి ముద్రించినారని ఆ నాణేలు సూచిస్తున్నాయి. లేదా బిందుసారుని కాలంలో ఉజ్జయిని రాజ్యపాలకుడుగా ఉన్నపుడు అశోకుడీ నాణేలను ఇచ్చి ఉండవలె.

తవ్వకాల్లో N. B. P. పాత్రలు, విద్ధాంక నాణేలు దొరికిన స్థలాల పట్టికతో ఈ అనుబంధాన్ని పూర్తి చేద్దాము. ఇది మౌర్యయుగంలో ఆ స్థలాలన్నీ జన నివాసాలని సూచిస్తుంది. ఆ స్థలాలు : అమరావతి, అహిచ్ఛత్ర, అత్రం జిఖేడా, బహల్, బైరాట్, బాన్‌ఘర్, బనరా, భిటా, బక్సార్, గిరియక్, హస్తినాపూర్, ఝూస్సీ కస్రవాధ్ కౌశాంబీ, మధురా, మసవాన్, నాసిక్, పిప్రావా, పాట్నా, రాజఘాట్, రాజ్‌గీర్, రైర్, రూపార్, సంభర్, సాంచీ, సారనాథ్, తక్షశిల, త్రిపురి.

**విద్ధాంక నాణెములపై చిహ్నాలు**

1. పర్వతం లేదా స్థూపం
2. పర్వతం – మృగం
3. పర్వతం – వృక్షం
4. వృక్షాలు – శాఖలు
5. ఆయుధాలు – ఉపకరణాలు
6. నిగూఢ చిహ్నాలు
7. మనిషి బొమ్మలు
8. జంతువుల బొమ్మలు
9. కుందేలును పట్టిన కుక్క
10. మత్స్యాలు
11. చెవులపిల్లి
12. వృశ్చికం
13. సర్పం
14. సూర్యుడు
15. షడారచక్రం



అయిదో అనుబంధం

# అశోకుని శాసనాలకు ఒక అనువాదం

హూల్ట్జ్, బ్లాష్ పండితుల ప్రామాణిక అనువాదాలలో పరిచయంలేని శాసన మూలాలు అందుబాటులో ఉండని పాఠకుని మనస్సులో ఉంచుకొని ఈ అనువాదం తయారు చేయడమైంది. అందుచేత ఇది అక్షరతః చేసిన తర్జుమా కాదు. భిన్న వ్యాఖ్యానాలను గురించిన సుదీర్ఘ వివరణలతో అధోజ్ఞాపికలను ఇందు చేర్చలేదు. మూల శాసనాలను సులభంగా చదువటానికి వీలైనపాఠాన్ని అందివ్వడమే ప్రధానం.

శాసనాలను క్రిందిరీతిగా విభజింపవచ్చు.

| | | | |
|---|---|---|---|
| 1. | ముఖ్య శిలాశాసనాలు | : | 14 శాసనాలు. కళింగలో రెండుచోట్ల కనిపించే రెండు ప్రత్యేక శాసనాలు |
| 2. | గౌణశిలా లేఖనాలు | : | గౌణ శిలాశాసనం, మహారాణి శాసనం, బరాబర్ గుహా శాసనాలు, కాందహార్ ద్విభాషా శాసనం. ఈ విభాగంలో రెండవ తరగతి శాసనాలు పూర్తిగా బౌద్ధ సమాజానికి, బౌద్ధులకు సంబంధించినవి. ఇవి : భబ్రు శాసనం, రుమ్మిందై స్తంభ శాసనం, నిగలీ సాగర్ స్తంభశాసనం, విభేదశాసనం. |
| 3. | స్తంభ శాసనాలు | : | ఏడు స్తంభ శాసనాలు ఈ అనువాదంతో నాకు ఎంతో సాయపడిన ఆచార్య ఎ.యల్, భాషామ్‌కు నేను చాలా రుణపడి ఉన్నాను. |

## ముఖ్య శిలాశాసనాలు

**ప్రథమ ముఖ్య శిలాశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఈ ధర్మలిపిని వ్రాయించినాడు. ఇక్కడ జంతువును వధించి బలిచేయడం నిషేధించడమైంది. సమాజాలు సయితం నిషిద్ధములే. కొన్ని సమాజాలను మాత్రం దేవానాం ప్రియ, ప్రియదర్శిరాజు అనుమతించినాడు. దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు దృష్టిలో సమాజాలవల్ల చాల నష్టం ఉంది.

పూర్వం దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు పాకశాలలో భోజనార్థం నిత్యం వేలకొలది జంతువులను వధించేవారు. కాని ప్రస్తుతం ఈ ధర్మలిపులు వేయించేనాటికి మూడు జీవాలను అంటే రెండు నెమళ్ళను, ఒక జింకను మాత్రమే వధిస్తున్నారు. జింకను కూడ అప్పుడప్పుడు మాత్రమే చంపుతున్నారు. ముందు ముందు ఈ మూడు జీవాలను కూడ చంపరు.

**రెండో ముఖ్య శిలాశాసనం :**


దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు సామ్రాజ్యంలో సర్వత్ర, సరిహద్దు రాజ్యాలలో సయితం తామ్రపర్ణి వరకు చోళ, పాండ్య, సతియపుత్ర, కేరళ పుత్రుల రాజ్యాలలోను, యాంటియోకస్ నాముడైన గ్రీకురాజు రాజ్యంలోను, యాంటియోకస్ పొరుగు రాజ్యాలలోను సర్వత్ర దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు రెండు రకాల ఔషధ సేవలను సమకూర్చినాడు. ఒకటి మానవుల చికిత్సకు, రెండోది జంతువుల చికిత్సకు, ఔషధ మూలికలు లేనిచోట జంతువులకు, మానవులకు అవసరమైన మూలికలు నాటడం జరిగింది. అదే విధంగా పండ్లు, దుంపలు లేనిచోట వాటిని నాటినారు. బాటల ప్రక్కన మానవులకు, పశువులకు ఉపయోగార్థం బావులు తవ్వినారు. చెట్లు నాటినారు.

**మూడో ముఖ్య శిలాశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు ద్వాదశ వర్షాభిషిక్తుడై ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నాడు. ప్రజలకు ధర్మబోధ చేయడానికి, ఇతర కార్యక్రమాలు నిర్వహించడానికి రాజుకులతో, ప్రాదేశికులతోపాటు యుక్తులు అయిదేండ్లకొకమారు దేశాటనం చేయవలె. తల్లిదండ్రుల యెడ, బంధు మిత్రులపట్ల విధేయులై వర్తించడం, బ్రాహ్మణ శ్రమణుల పట్ల ఔదార్యం వహించడం, జీవహత్య విరమించడం, మితంగా ఖర్చు చేయడం, తగుమాత్రం ఆస్తిని సంపాదించడం, చాల మంచిది. పైన చెప్పినది నమోదుచేసి ప్రజానీకానికి స్పష్టంగా వివరించవలసిందిగా ఉద్యోగులను పరిషత్తు ఆదేశిస్తుంది.











**నాలుగో ముఖ్య శిలాశాసనం:**

గతంలో జంతువధ, జీవహింస, పెద్దలపట్ల బ్రాహ్మణ శ్రమణులపట్ల అవిధేయత పెరిగిపోయినాయి. కాని నేడు దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు ధర్మాన్ని అనుసరించడం వల్ల భేరీఘోష ధర్మఘోష అయింది. విమాన, హస్తి, అగ్నిఖండాలు ఇతర దివ్యదృశ్యాలు ప్రజలకు ప్రదర్శితమౌతున్నాయి. ధర్మాను శాసనంవల్ల జంతువధ మానడం జరుగుతున్నది. జీవికల పట్ల అహింస బంధు బ్రాహ్మణ శ్రమణులపట్ల సంప్రతిపత్తి, మాతా పితృశుశ్రూష, పెద్దల యెడవిధేయత పూర్వం కొన్ని శతాబ్దాల పాటు ఎన్నడూ లేనంతగా పెరిగినాయి. ఇతర మార్గాలలోకూడ ధర్మాచరణ వృద్ధిచెందింది. వృద్ధి చెందుతుంది.

దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు, అతని పుత్రులు పౌత్రులు, ప్రపౌత్రులు కల్పాంతం వరకు ధర్మశీలురై ధర్మాచరణను వృద్ధిగావిస్తారు. ధర్మానుశాసనం ఉత్తమోత్తమమైన కృషి. కాని మంచిలేనిచో ధర్మాచరణ లేదు. ఈ విషయాలలో తిరోగమనం కూడదు. ప్రగతియే శ్రేష్టమైనది. ఆ లక్ష్యంతోనే ఈ లిపులు వేయడమైంది. వీటిలోని లోపాలను లక్ష్యపెట్ట కూడదు. దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు ద్వాదశ వర్షాభిషిక్తుడైనపుడు ఈ లిపి వేయడం జరిగింది.

**ఐదో ముఖ్య శిలాశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు ఇట్లు పలుకుతున్నాడు. మంచిచేయడం కష్టం. మంచిచేసేవాడు కష్టాన్ని సాధించేవాడే. నేను చాల కల్యాణకరమైన కృషి చేసినాను. నా పుత్రులు, పౌత్రులు, తరువాతి నా ఉత్తరాధికారులు కల్పాంతం వరకు నన్ను అనుసరించి కల్యాణకరమైన పనులు చేస్తారు. నా సంస్కరణలలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా దుష్కృత్యాన్ని చేసిన వారౌతారు. పాపం చేయడం సులభం.

గతంలో ధర్మమహామాత్తులు లేరు. నా పదమూడో పట్టాభిషేక సంవత్సరంలో వారిని మొట్టమొదటిసారిగా నేనే నియమించినాను. యవన, కాంభోజ, గాంధార, ఋసిక, పిటినికాది పాశ్చాత్య ప్రజలలో సర్వమత శాఖలలోను ధర్మ స్థాపనలో, ధర్మాభివృద్ధిలో, ధర్మపరుల సుఖశ్రేయోభి వృద్ధిలో ధర్మ మహామాత్తులు కార్యాతురులై ఉన్నారు. ప్రభువులు, భృత్యులు, బ్రాహ్మణులు, ధనిక గృహస్థులు, పేద, వృద్ధజనులలో ధర్మపరులైనవారి సుఖశ్రేయోభివృద్ధి కోసం వారి కష్ట విమోచనకై ధర్మమహామాత్తులు కృషిచేస్తున్నారు. బందీల యోగక్షేమాలకై పాటుపడతారు. లేనిచో బాధ్యతారహితంగా వ్యవహరించిన వారౌతారు. ఖైదీలలో బిడ్డలున్నవారిని, వ్యాధిగ్రస్తులను, వృద్ధులను విడిపింపడానికి కృషి చేస్తారు. ఇక్కడ పాటలీపుత్రంలో నావిగాని, సోదరీ సోదరులవిగాని, బంధులవిగాని

స్త్రీజన నివాసాలలో కార్యాతురులై ఉంటారు. నా సామ్రాజ్యమంతటా ధర్మానికి సంబంధించిన అన్ని విషయాలలో ధర్మస్థాపనలో ధర్మపరులపట్ల దానధర్మాల నిర్వహణలో శ్రద్ధగా కృషి చేస్తారు. ఆ ఆశయంతోనే ఈ ధర్మ లిపి వ్రాయడం జరిగింది. ఇది చిరకాలం వర్థిల్లుగాక! నా తరువాతి వారు దీని కనుగుణంగా వర్తింతురుగాక!

**ఆరో ముఖ్య శిలాశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు ఇట్లు పలుకుతున్నాడు. గతంలో నివేదికలను గ్రహించడంగాని, వ్యవహార నిర్వహణగాని సర్వదా చురుకుగా జరిగేది కాదు.కాబట్టి ఇపుడు నేనీ ఏర్పాటు చేస్తున్నాను. అన్ని వేళల – నేను భోజనం చేస్తున్నా, అంత:పురంలో ఉన్నా, గర్భాగారంలో ఉన్నా, గోశాలలో ఉన్నా, వాహనం మీద ఉన్నా ఉద్యానవనంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా రాజ్యవ్యవహారాలు నిర్వహించడానికి సంసిద్ధుడను. దానాన్ని గూర్చి నా ముఖత: చెప్పి శాసనాన్ని గురించి, ఉద్యోగుల కప్పగించిన జరూరు విషయాలను గురించి, వాటిపై  పరిషత్తులో వచ్చిన వివాదాలను, చర్చలను గురించి నేను ఎక్కడ ఉన్నప్పటికీ నాకు వెంటనే నివేదించవలె.

ఇది నా అనుశాసనం. కేవలం సత్వర కార్య నిర్వహణలోగాని, అధిక శ్రమలోగాని నాకు తృప్తి లేదు. సర్వ ప్రపంచ యోగ క్షేమాభివృద్ధి పట్లనే నా శ్రద్ధ. అందుకు అధిక శ్రమ, సత్వర కార్య నిర్వహణ సాధనాలు మాత్రమే. విశ్వకల్యాణ సాధనను మించిన మంచిలేదు. నేను చేసిన ఘనకార్యాలేమైనా అవి ప్రజలకు నా ఋణాన్ని తీర్చుకొనడానికి చేసినవే. వారి ఇహలోక సుఖానికి, అనంతర స్వర్గప్రాప్తికి శ్రమిస్తాను. అందుకోసమే ఈ ధర్మ లిపిని వేయించడమైంది. ఇది చిరకాలం నిలుచుగాక! నా పుత్ర పౌత్ర, ప్రపౌత్రులు విశ్వ కల్యాణానికై శ్రమింతురుగాక! అధిక శ్రమ చేయనిదే అది సాధించడం కష్టం.

**ఏడో ముఖ్య శిలా శాసనం :**

సర్వమతాలు కాంక్షించేది చిత్తశుద్ధి, ఆత్మసంయమనం. కాబట్టి సర్వ మత శాఖలు అన్నిచోట్ల కలిసి నివసించాలని దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు వాంఛిస్తున్నాడు. కాని మనుషులకు భిన్న స్వభావాలు, విభిన్న వాంఛలు ఉంటాయి. అందుచేత మానవులలో కొందరు దేనినైనా పూర్తిగా ఆచరించగలరు. సంయమనం, భావశుద్ధి, కృతజ్ఞత, దృఢ భక్తి లేకపోతే ఉదారబుద్ధి కల వానిని కూడ నీచునిగా పరిగణిస్తారు.

**ఎనిమిదో ముఖ్య శిలాశాసనం :**

గతంలో రాజులు మృగయా విహారాల వంటి వినోదాలతో కూడిన విహారయాత్రలు సాగించినారు, దశవర్షాభిషిక్తుడైనపుడు దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు బోధివృక్షాన్ని

దర్శించినాడు. నాటి నుండి ధర్మ యాత్రల ఆచారం ప్రారంభమైంది. ఈయాత్రలలో శ్రమణులను, బ్రాహ్మణులను దర్శించి వారికి దానధర్మాలు చేసినాడు. వృద్ధులను దర్శించి వారికి సువర్ణ పారితోషికా లిచ్చినాడు. గ్రామ ప్రజలను దర్శించడం, ధర్మాన్ని ప్రబోధించడం, ధర్మాన్ని గూర్చిన ప్రశ్నలకు సమాధానాలివ్వడం జరిగింది. ఇతర వినోదాలకంటె వీటివల్లనే దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు ఎక్కువ ఆనందం పొందుతాడు.

**తొమ్మిదో ముఖ్య శిలాశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు ఇట్లు పలుకుతున్నాడు: ప్రజలు వివిధములైన ఉత్సవాలు చేస్తున్నారు. వ్యాధులు, పుత్రపుత్రికా వివాహాలు, శిశూధయము, ప్రయాణాలు మొదలైన సమయాలలో అనేక కర్మలు చేస్తున్నారు. ముఖ్యంగా స్త్రీలు, క్షుద్ర, నిరర్థక కర్మలాచరిస్తున్నారు. అట్టి కర్మల వల్ల ఫలం స్వల్పం. ధర్మం ఒక్కటే అమూల్యమైన మంగళం. దాసులపట్ల, భృత్యులపట్ల ఆదరణ, గురువులయందు భక్తి, జీవకోటి పట్ల సంయమనం, శ్రమణులకు, బ్రాహ్మణులకు దానధర్మాలు మొదలైన కార్యాలు ధర్మమంగళ నామంతో వ్యవహృతమౌతాయి. అందుచేత తండ్రి, కొడుకు, సోదరుడు, యజమాని, మిత్రుడు, పరిచయస్తుడు, సమీపవాసి “ఇది పుణ్యం, ఇది మంగళం, నా ఆశయం నెరవేరేవరకు ఇదే నా కర్తవ్యం” అని ఆలోచించవలె.

(కాల్సీ ప్రతి) : లేకపోతే తమలో తాము ఈ విధంగా ఆలోచించవలె. ఇతర మంగళాల ప్రయోజనం సందేహాస్పదం. వాటివల్ల ఆశయాలు నెరవేరవచ్చు, నెరవేరకపోవచ్చు. అవి కేవలం ఐహిక విషయములందే ఫలప్రదాలు. ధర్మ మంగళము సర్వదా ఫలప్రదం. ఇహజన్మలో దాని ఫలము లభించకపోయినా పరజన్మలో అనంతమైన పుణ్యం ప్రాప్తిస్తుంది. ఇహజన్మలో కూడ ఫలం ప్రాప్తిస్తే రెండు విధాల లాభం. ఇహజన్మలో ఫలం ప్రాప్తించింది. పరజన్మలో ధర్మ మంగళం ద్వారా అనంత పుణ్యం లభిస్తుంది.

(గిర్నార్ ప్రతి) : ఇంకా వారీవిధంగా అంటారు. దానం మంచిది. కాని ధర్మ దానాన్ని పోలిన దానం లేదు. కాబట్టి మిత్రుడు, బంధువు, సుహృదయుడు, సహచరుడు ఈ విధంగా సలహా ఇవ్వవలె. “ఇది ఆచరించవలె; తద్వారా స్వర్ణ ప్రాప్తి కలుగుతుంది.” స్వర్గ ప్రాప్తికంటె ముఖ్యమైనదేది?

**పదో ముఖ్య శిలాశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు పేరు ప్రతిష్ఠల నాశించడు. కాని తన ప్రజలు ధర్మవిధేయులై ధర్మ మార్గాన్ని అనుసరించగలందులకై ఇహపరాలలో పేరు ప్రతిష్ఠలను కాంక్షిస్తాడు. దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు చేసే కృషి సమస్తమూ పరలోక జీవితాన్ని

ఉద్దేశించినదే. ప్రజలను పాప ప్రవృత్తి నుండి తప్పించడమే అతని కృషి. పాప ప్రవృత్తిలో పుణ్యం ఉండదు. ఉన్నతులు, హీనులు కూడ సర్వమూ త్యజించి సాధన చేస్తేనే కాని ఇది సాధ్యం కాదు. ఉన్నతులైనవారికి ముఖ్యంగా ఇది చాల కష్టం.

**పదకొండో ముఖ్య శిలాశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు ఈ విధంగా పలుకుతున్నాడు : ధర్మదానాన్ని పోలిన దానం లేదు. ధర్మ సంస్తవాన్ని, ధర్మ అనుభవాన్ని, ధర్మ సంబంధాన్ని పోలినవి లేవు. అనగా దాసుల పట్ల, భృతకుల పట్ల సద్వర్తనము, మాతా పితృశుశ్రూష, మిత్రులపట్ల వితరణ, బంధు, శ్రమణ, బ్రాహ్మణులపట్ల ఔదార్యం, జంతువధ మానడం. తండ్రి, కొడుకు, సోదరుడు, యజమాని, మిత్రుడు, బంధువు, పరిచయస్తుడు, సమీపవాసి, “ఇది సాధువు,. ఇది మన కర్తవ్యము” అని ఆలోచించవలె. ఈ విధంగా చేయడంవల్ల, ధర్మదానం వల్ల ఇహలోకంలో లాభం ఉంది. అనంత పుణ్యం లభిస్తుంది.

**పన్నెండో ముఖ్య శిలాశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు సర్వ మతాలను ప్రవ్రజితులను, గృహస్థులను దానాలచేత, ఇతర విధాలచేత పూజిస్తాడు. కాని సర్వ మతాలలో ఉన్న మూల సిద్ధాంతాల అభివృద్ధి అంతటి ముఖ్యమైనవిగా దానాలను, పూజలను పరిగణించడు. మూల సిద్ధాంత వికాసం బహు ముఖంగా జరుగుతుంది. పరమత గర్హణం సమయా సమయాలలో స్వమతోత్కర్ష మానడం, అవసర సందర్భాలలో చాల మామూలు మాటలలో స్వమత ప్రశంస చేయగల వాక్ సంయమనం అలవరచుకోవలె. ఇది మూల సిద్ధాంత వికాసానికి ఆధారమైనది. అనుక్షణం అన్యమతాన్ని గౌరవించవలె. ఆ విధంగా చేయడంవల్ల స్వమత ప్రభావాన్ని ఇనుమడించుకొంటూ పరమతానికి లాభం చేకూర్చుతాడు. అందుకు భిన్నంగా ప్రవర్తిస్తే స్వమత ప్రభావాన్ని క్షీణింపజేసికొని, పర మతానికి హాని కలిగించిన వాడౌతాడు. అంతేకాక తన మతం పట్ల గాఢ భక్తితో, అనుకూలంగా తన మతాన్ని శ్లాఘిస్తూ, ఇతర మతాలను గర్హిస్తే తన మతానికీ అపకారం చేసిన వాడౌతాడు. అందుచేత పరస్పర సిద్ధాంతాలను విని పాటించగలందులకై సామరస్యాన్ని ప్రోత్సహించవలె. ఈ లక్ష్యంతోనే దేవానాం ప్రియుడు సర్వ మతాలవారికి మంచినే బోధించవలె. “సర్వ మత సారాభివృద్ధిని గణించినంతగా దేవానాం ప్రియుడు పూజలను, దానాలను ముఖ్యంగా పరిగణించడు. ఈ కృషిలో అనేకులు ధమ్మ మహామాత్తులు, ఇథీజ్ఝక్క మహామాత్తులు వ్యాపృతులు, ప్రజభూమికులు మొదలుగాగల ఉద్యోగులు నిమగ్నులై ఉన్నారు. దీని ఫలితంగా ప్రతివాని మత ప్రభావము పెరుగుతుంది. ధర్మోద్దీపనం జరుగుతుంది.” అంటూ అన్ని మతాల వారికీ చెప్పవలె.

**పదమూడో ముఖ్య శిలాశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు అష్ట వర్షాభిషిక్తుడైనపుడు కళింగను జయించినాడు. అందు లక్ష ఏభైవేల మంది ప్రజలను దేశాంతరాలకు పంపడం జరిగింది. లక్షమంది నిహతులైనారు. అంతకు పెక్కు రెట్లు ప్రజలు నశించినారు. అనంతరం కళింగను తన సామ్రాజ్యంలో కలుపుకొనడం జరిగింది. దానితో దేవానాం ప్రియుడు శ్రద్ధగా ధర్మ కర్ముడైనాడు; ధర్మ కాముడైనాడు; ధర్మ ప్రచారం సాగిస్తున్నాడు. కళింగను జయించిన తరువాత దేవానాం ప్రియుడు పశ్చాత్తప్తుడైనాడు. ఒక స్వతంత్ర రాజ్యాన్ని జయించడంలో కలిగిన జన నష్టానికి, ప్రజల దేశాంతర గమనానికి చాల విచారం కలిగింది. మనస్సు వేదనతో నిండిపోయింది. అచట నివసించే సాధారణ ప్రజలు, బ్రాహ్మణ శ్రమణులు, ఇతర మతాలవారు, ఉన్నతులు, మాతా పితృ గురు శుశ్రూష చేస్తూ బంధు, మిత్ర, సహచర, దాస, భృతకాదులపట్ల వాత్సల్యంతో ప్రవర్తించే గృహస్థులు సయితం హింసకు, దుర్మరణానికి గురికావడం దేవానాం ప్రియునకు మరింత శోచనీయంగా కనిపించింది. వారందరు బంధు, మిత్ర వియోగానికి గురి అయినారు. పైశాచికమైన యుద్ధ ప్రభావాన్ని తప్పించుకొన్న అదృష్టవంతులలో సయితం ప్రేమాభిమానాలు క్షీణించినాయి. మిత్రులకు, పరిచయస్థులకు, సహచరులకు, బంధువులకు కలిగిన బాధలకు వారుకూడ దు:ఖిస్తున్నారు. ఈ విధంగా ప్రజలంతా అనుభవిస్తున్న దు:ఖం దేవానాం ప్రియుని మనోవేదనా భారాన్ని పెంచింది. గ్రీకు రాజ్యాన్ని మినహాయించి బ్రాహ్మణ శ్రమణ సంఘాలు లేని రాజ్యం లేదు; ప్రజలు ఏదో ఒక మతాన్ని అనుసరించని రాజ్యం కూడా లేదు. కళింగ రాజ్యాక్రమణలో చనిపోయిన లేదా నిహతులైన లేదా దేశాంతవాసం పొందిన ప్రజలలో శతాంశం లేదా సహస్రాంశమైనా నేడుకూడా ఆ విధంగా బాధలకు గురి అయితే దేవానాం ప్రియుడు వేదనా భారాన్ని అనుభవిస్తాడు.

తప్పు చేసినవాడు క్షమార్హుడైనంత వరకు క్షమించవలెనని దేవానాం ప్రియుని విశ్వాసం. దేవానాం ప్రియుడు ఆటవిక జాతులతో సమాధానపడుతున్నాడు. కాని పశ్చాత్తాపంతో సయితం దేవానాం ప్రియుడు బలవంతుడేనని తమ తమ దుశ్చర్యలకు లజ్జించి వాటిని విరమించకపోతే, వారికి మరణం తథ్యమని హెచ్చరిస్తున్నాడు. సర్వభూతాలపట్ల అహింసను అవలంబించవలెనని, సంయమనం, నిదానం ప్రదర్శించ వలెనని దేవానాం ప్రియుని కోరిక.

దేవానాం ప్రియుడు ధర్మవిజయాన్ని ఉత్కృష్ట విజయంగా పరిగణిస్తాడు. అంతేకాక సరిహద్దులకావల ఆరువందల యోజనాల (1500 మైళ్ళు) పర్యంతం, అంతియోకనాముడైన

యవనరాజు పాలించేచోట, అంతియోకుని రాజ్యానికావల తురమయ (టాలెమీ), అంతికిని (యాంటిగోనస్), మకా (మాగస్), అలిక సుందర (అలెగ్జాండరు) నామాంకితులైన రాజుల రాజ్యాలలోను, దక్షిణాన తంబపన్ని వరకు నున్న చోళ, పాండ్య ప్రజలమీద దేవానాం ప్రియుడు ధర్మ విజయాన్ని సాధించినాడు. అదే విధంగా ఇక్కడ రాజ విషయంలో యవన, కాంభోజ, నాభక్త, నాభ పంతి, భోజ, పిటినిక, ఆంధ్ర, పారింద ప్రజలు సర్వత్ర దేవానాం ప్రియుని ధర్మాను శాసనాలను అనువర్తిస్తున్నారు. దేవానాం ప్రియుని దూతలు వెళ్ళని రాజ్యాలు సయితం అతని ధర్మవృత్తాన్ని, ధర్మబోధలను, ధర్మానుశాసనాలను విని ధర్మాన్ని అనుసరిస్తున్నారు. ఇక ముందు అనుసరిస్తారు.

ఈ విధంగా లభించిందే సర్వత్ర విజయం. సర్వత్ర విజయం చాల ఆనందదాయకం. కాని ధర్మ విజయం ద్వారా లభించినప్పటికీ ఈ ఆనందాన్ని దేవానాం ప్రియుడు స్వల్పంగానే భావిస్తాడు. అందుకు కారణం దేవానాం ప్రియుని దృష్టి అంతా ఆ విజయం పారలౌకికంగా చేకూర్చే ఫలితాలపైనే ఉంది.

నా పుత్రులగాని, నా ప్రపౌత్రులుగాని కొత్త విజయాలను సాధించడానికి ఆలోచించ కూడదని ఈ ధర్మలిపులను వ్రాయించినాను. వారు ఏ విజయాలు సాధించినప్పటికీ ఓర్పుతో తృప్తి వహించవలె. శిక్షలు తేలికగా ఉండవలె. ధర్మవిజయాన్ని కూడా యధార్థ విజయంగా పరిగణించరాదు. ఇహ పరలోకాలలో విలువైనది కావున ధర్మంలో ఆహ్లాదమే వారి ఏకైక ఆహ్లాదంకావలె.

**పదునాల్గో ముఖ్య శిలాశాసనం :**

దేవానం ప్రియ ప్రియదర్శిరాజు ఆజ్ఞ ప్రకారం ఈ శాసనం చెక్కడమైంది. ఇది సంక్షిప్త రూపంలోను, సామాన్య విస్తరణతోను ఉంది. సర్వత్ర విస్తృత పాఠాలను వేయించలేదు. సామ్రాజ్యం పెద్దదైనందున చాల శాసనాలు వ్రాయించడమైంది. కొన్ని విషయాలలో మాధుర్యంవల్ల ప్రజలు వాటికనుగుణంగా నడుచుకొంటారని, వాటిని పునః పునః వ్రాయడమైంది. లేఖకుని పొరపాటువల్లకాని, పరధ్యానం వల్లగాని కొన్ని వాక్యాలు లుప్తమై ఈ లేఖనాలలో తప్పులు దొర్లి ఉండవచ్చు.

**మొదటి ప్రత్యేక శాసనం : (ధౌళి, జౌగడ)**

దేవానాం ప్రియుడు తన మాటలలో తోసలి సమాపలలోని మహామాత్తులను, గనర వ్యవహారికులను ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నాడు : నాకు సమ్మతమైన దానిని కార్యశూరతతో సమర్థమైన సాధనాల ద్వారా సాధించవలె. ఈ విషయంలో ముఖ్య సాధనమని భావించిన దానిని గురించి నా ఆజ్ఞలు : బహు సహస్ర జీవులు మా పాలనలో ఉన్నాయి. ప్రజలందరు

నా బిడ్డలు. నా బిడ్డలకు ఇహ పరలోకాలలో సుఖ సంతోషాలను కాంక్షించినట్లే ప్రజలందరికీ కాంక్షిస్తున్నాను. ఈ సూత్ర ప్రాధాన్యాన్ని మీరు గుర్తించకపోవచ్చు. మీలో ఏ ఒక్కరో గుర్తించనూ వచ్చు. అతడుకూడ సూత్ర ప్రాధాన్యాన్ని పూర్తిగా కాక ఏ ఒక అంశాన్ని మాత్రమో గ్రహింపవచ్చు. మీలో సుస్థిరులైన వారందరు ఈ విషయాన్ని గూర్చి శ్రద్ధగా ఆలోచింపవలె. నిష్కారణంగా ఒక మనిషిని నిర్బంధిస్తారు; చిత్రహింసకు గురిచేస్తారు; తరువాత ఆతణ్ణి విడిచి పెడతారు. ఇతరులనేకులు ఇంకా నిర్బంధంలో బాధలు పడుతూనే ఉంటారు. నిష్పక్షపాత బుద్ధితో వ్యవహరించడానికి మీరందరు ప్రయత్నించవలె. అసూయ, చిరాకు, కాఠిన్యం, తొందరపాటు, మూర్ఖత్వం, అలసత్వం, మాంద్యం మొదలైన దుర్గుణాలలో ఏ ఒక్కటి ఉన్నా నిష్పక్షపాతంగా వ్యవహరించలేరు. ఈ దుర్గుణాలు లేకుండా ప్రయత్నించవలె. సాధుస్వభావులై పనిలో తొందరపాటు లేకుండా ఉండడమే దీనికంతకు సాధనము. అలసత్వం ఉన్నవాడు తన విధిని నిర్వహించడు. ప్రయత్న పూర్వకమైన కృషి ద్వారా మీ విధి నిర్వహించవలె. ఈ విషయాలు ఆమోదించిన వారు మిమ్ము ఈ విధంగా హెచ్చరించవలె. "దేవానాం ప్రియుడు మిమ్ము ఇట్లు అనుశాసిస్తున్నాడు. పై విధంగా మీ రుణాన్ని తీర్చుకోవడానికి ఆలోచించండి. ఈ అనుశాసనానికి అనుగుణంగా వర్తించడంలో లాభం ఉంది. లేనిచో నష్టముంది. దీన్ని నిర్లక్ష్యం చేయడంవల్ల స్వర్గాన్ని పొందలేరు". రాజాభిమానాన్ని సయితం పొందలేరు. దీన్ని గురించి ఇంతదూరం నేనెందుకు ఆలోచిస్తున్నాను? ఎందుకంటే నా అను శాసనాన్ని అనుసరించినందు వలన మీరు నా రుణం తీర్చుకొంటారు. స్వర్గాన్ని పొందుతారు.

తిష్యా నక్షత్రం అష్టమదినాన ఈ శాసనం ప్రకటించవలె. తిష్యా నక్షత్రాల మధ్య రోజులలో సయితం అపుడపుడు ఈ శాసనాన్ని ఒక్క మనిషి ఉన్నప్పటికీ పెద్దగా చదువవలె. ఈ విధంగా చేయడంవల్ల నా అనుశాసనాలకు అనుగుణంగా ఉన్నవారౌతారు. ఈ శాసనాన్ని ఇక్కడ చెక్కించడానికి కారణం సర్వదా దీన్ని చూస్తూ నగర వ్యవహారికులు నిష్కారణంగా ప్రజలను ఖైదు చేయరు; హింసించరు. ఈ లక్ష్యంతోనే అయిదు సంవత్సరాలకొకమారు సాధువర్తనుడైన ఒక మహామాత్తుని దేశాటనం పంపుతాను. నా అనుశాసనాలను మన్నిస్తున్నారో లేదో పరిశీలిస్తాడు. అదేవిధంగా మూడు సంవత్సరాల కాలవ్యవధి మీరకుండా ఉజ్జయినిలోని రాకుమారుడు ఇటువంటి ఉద్యోగి బృందాన్ని పర్యటనకు పంపవలె. తక్షశిల నుండి కూడ ఉద్యోగులు పర్యటన సాగిస్తూ తమతమ విధులను నిర్లక్ష్యం చేయకుండ దీన్ని పరిశీలిస్తారు. నా అను శాసనాలను అనుసరిస్తారు.

**రెండో ప్రత్యేక శాసనము :**

ఇది దేవానాం ప్రియుని అనుశాసనం. రాజానుశాసనాలను ప్రకటించే బాధ్యత ఉన్న తోసలిలోని రాకుమారుడు, మహామాత్తులు, సమాపలోని మహామాత్తులు ఈ విధంగా ఆజ్ఞాపించవలె. నేను సమ్మతించింది ఏదైనా మంచి కృషితో సమర్థములైన సాధనలద్వారా సాధించవలె. ఈ విషయంలో ఇదే మంచి పద్ధతి అని భావిస్తున్నాను. ఇవి మీకు నా సూచనలు : ప్రజలందరు నా బిడ్డలు. ఇహపర లోకాలలో నా బిడ్డలకు సుఖసంతోషాలు కాంక్షించినట్లే ప్రజలందరికి కాంక్షిస్తున్నాను. సరిహద్దులలో నేను జయించక విడిచిన ప్రజలు నా ఆశయాన్ని తెలుసుకో గోరినట్లయితే నా కోరికగా వారికి ఈ విధంగా తెలియజేయండి "తనవల్ల వారికి ఏ ఇబ్బందీ కలుగరాదని రాజు కోరిక. అతనిలో వారు పూర్తి విశ్వాసం ఉంచవలె. అతనితోడి సంబంధాలలో వారికి సుఖమే కాని విచారం ఉండదు. క్షమించదగినంతవరకు వారినాతడు క్షమిస్తాడని వారు గ్రహించవలె. అతని ద్వారా వారు ధర్మాన్ని అనుసరించి ఇహపరాలను సాధించవలె."

ఈ ఉద్దేశంతోనే మిమ్ములను నేను అనుశాసిస్తున్నాను. వారి ఋణాన్ని తీర్చుకొనడానికే ఈ విధంగా నా కోరికను, నా నిర్ణయాన్ని దృఢ వాగ్ధానాన్ని వ్యక్తం చేస్తున్నాను. ఈ చర్యలద్వారా నా కృషి పురోగమిస్తుంది. వారికి మరింత నమ్మిక కలిగి, రాజు తమ తండ్రివంటివాడని, వారాతనికి సొంత బిడ్డలవంటివారని, వారిని తన వలెనే భావిస్తాడని గుర్తిస్తారు. నా దూతలు, ప్రత్యేక ఉద్యోగులు మిమ్ము కలుసుకొని నా నిర్ణయాన్ని దృఢ వాగ్ధానాన్ని మీకు తెలిపి మీకు సూచనలిస్తారు. సరిహద్దు ప్రజలలో విశ్వాసాన్ని కలిగించే వారికి ఇహపర లోకాలలో సుఖశ్రేయస్సులు కలిగించే సామర్థ్యం మీకుంది. ఈ విధంగా చేయడంవల్ల ప్రజలకు నా ఋణాన్ని తీర్చుకొనడానికి నాకు తోడ్పడమేకాక స్వర్గాన్ని పొందగలుగుతారు.

ఈ ఉద్దేశంతోనే ఈ లిపిని ఇక్కడ వ్రాయడం జరిగింది. ఉద్యోగులు సర్వదా సరిహద్దు ప్రజలను సమాధానపరచి వారిలో ధర్మాభివృద్ధిని సాధించగలరు. నాల్గుమాసాల కొకమారు తిష్యా నక్షత్రం రోజున ఈ శాసనం ప్రకటించవలె. తిష్యానక్షత్రం రోజుల మధ్య అప్పుడప్పుడూ ప్రకటిస్తూ ఉండవలె. ప్రత్యేక సందర్భాలలో ఒక్క వ్యక్తికైనా ప్రకటించవలె. ఈ విధంగా చేయడం వల్ల నా ఆజ్ఞలకు అనుగుణంగా వర్తించిన వారౌతారు.

**గౌణశిలా లేఖనాలు**

**గౌణ శిలాశాసనం : (భిన్న ప్రతుల సమన్వయ పాఠము)**

సువర్ణగిరి నుండి కుమార మహామాత్తుని మహామాత్తుల ఆజ్ఞగా ఇసిల మహామాత్తులకు

ఆరోగ్యము. వారిని ఈ విధంగా అనుశాసించవలె. దేవానాం ప్రియ అశోకుడు ఇట్లు పలుకుతున్నాడు; రెండున్నర సంవత్సరాలకు పైగా నేను ఉపాసకుడుగా ఉన్నాను. కాని మంచి అభివృద్ధిని సాధించలేక పోయినాను. ఒక సంవత్సరం పైగా సంఘానికి అత్యంత సన్నిహితుడనై దృఢ విశ్వాసినైనాను. జంబూద్వీపంలో నేటివరకు దేవతలు మానవులతో కలిసి తిరగడం లేదు. కాని ఇప్పుడు కలిసి తిరుగుతున్నారు. ఇది నా కృషి ఫలితమే. అయితే ఇది సాధించగలిగింది గొప్పవారు మాత్రమే కాదు. సామాన్యులకు కూడ ఇది అందుబాటులో ఉంది. అయితే వారు శ్రద్ధాళువులుకావలె. అయితే వారికి స్వర్గం కూడ సులభసాధ్యమే. ఈ అనుశాసనం ఇవ్వడానికి ఒక్క కారణం ఉంది: గొప్పవారు, సామాన్యులు సయితం అభివృద్ధిని సాధించవలె. ఆ అభివృద్ధి శాశ్వతమని పొరుగువారు చూచి గ్రహించవలె. ఈ మదుపు నిరంతరంగా అధికంగా పెరుగుతుంది. ఈ విషయాన్ని ఇక్కడ ప్రతిచోటా గుట్టల మీద, శిలాస్తంభాలు లభ్యమైనచోట వాటి మీద వ్రాయవలె. మీమీ విషయాలలో ఈ లేఖనాన్ని తీసుకొని సర్వత్ర పర్యటించవలె. పర్యటనలో ఉంటూ 256 రాత్రులు గడిపిన పిమ్మట ఆ ప్రకటన ఇవ్వడం జరిగింది.

దేవానాం ప్రియుడు ఇట్లు పలుకుతున్నాడు. దేవానాం ప్రియుడు అనుశాసించినది తు. చ తప్పక జరుగవలె. ఆ విధంగా రాజులకు ఆజ్ఞాపించవలె. వారు భేరీ ఘోషతో గ్రామీణ ప్రజలను సమావేశపరచి “తల్లిదండ్రులకు, గురువులకు విధేయులు కండి. జీవులపై దయచూపండి. సత్యం పలకండి. ఈ ధర్మ గుణాలను అనుసరించండి” అంటూ బోధిస్తారు. అదే విధంగా స్థానికోద్యోగులు చేస్తారు.

దేవానాం ప్రియుని ఆజ్ఞగా పై విధంగా బోధించండి. అదే విధంగా మావటి వాండ్రు, లేఖకులు, దైవజ్ఞులు, బ్రాహ్మణులు, ప్రాచీన సంప్రదాయాన్ని అనుసరించి తమ శిష్యులకు బోధిస్తారు. తమతమ యజమానులను గౌరవించవలె. ఒక కుటుంబంలోని బంధువులు పరస్పరం మర్యాదతో ప్రవర్తించవలె. ఇది ప్రాచీన సంప్రదాయం. ఇందువల్ల దీర్ఘాయువులౌతారు. అందుచే దాన్ని అనుసరించవలె. చెపడ లేఖకుడు దీన్ని చెక్కినాడు.

**మహారాణి శాసనం :**

దేవానాం ప్రియుని మాటలుగా సర్వత్రా మహామాత్తులకాజ్ఞ. ద్వితీయ దేవి చేసిన ఏ దానమైనా అది ఆమ్ర వాటిక కాని, ఆరామ కాని, దాన గృహం కాని, మరియే యితర దానం గాని ఆ మహారాణి చేసిన దానంగానే పరిగణించవలె. ద్వితీయదేవి తీవరుని తల్లి కారువాకీ.

**బరాబర్ గుహ శాసనాలు :**

1) ప్రియదర్శి రాజు ద్వాదశ వర్షాభిషిక్తుడుగా ఆజీవికులకు నిగ్రోధ గుహను దానం చేసినాడు.

2) ప్రియదర్శి రాజు ద్వాదశ వర్షాభిషిక్తుడుగా ఖలటిక పర్వతంపై ఈ గుహను ఆజీవికులకు దానం చేసినాడు.

3) ప్రియదర్శి రాజు ఏకోనవిశంతి వర్షాభిషిక్తుడై ... ... ...

**కాందహార్ ద్విభాషాశాసనం :**

(గ్రీకు పాఠము): దశ వర్షాభిషిక్తుడైనపుడు ప్రియదర్శి రాజు ప్రజ్ఞలపట్ల ధమ్మం వహించినాడు. అప్పటి నుండి ప్రజలను అధిక ధర్మ తత్పరులుగా చేసినాడు. ప్రపంచంలో సర్వత్ర అభివృద్ధి కన్పించింది రాజు జంతువులను (మాంసాహారం) మానినాడు. ఇతరులు కూడ వేటకాండ్రు వేటాడటం, బెస్తలు చేపలు పట్టడం–మానినారు. ఆత్మ సంయమనం లేనివారు అది అలవరచుకొని ఇంతకు ముందు లేనంతగా మాతాపితలకు, గురువులకు విధేయులైనారు. ముందు ముందు కూడ ఈ విధంగానే వర్తిస్తూ ప్రేమ పాత్రులౌతారు.

**అరమిక్ పాఠం :**

దశవర్షాభిషిక్తుడై మన ప్రభువు ప్రియదర్శిరాజు ప్రజలకు ధర్మాన్ని బోధించడానికి నిర్ణయించినాడు. ప్రజలలో బాధలు అంతరించినాయి. ప్రపంచమంతటా శాంతి, ఆనందం వెల్లి విరిసింది. భోజన విషయంలో కూడ మన ప్రభువైన రాజు జీవుల్ని చాల స్వల్పంగా వధిస్తాడు. ఇది చూచి ఇతర ప్రజలు కూడ జంతువధ మానినారు. చేపలు పట్టేవారి వృత్తిని కూడ నిషేధించినారు. విశృంఖలంగా ప్రవర్తించేవారు సంయమనం నేర్చుకొన్నారు. తల్లిదండ్రులపట్ల, పెద్దలపట్ల విధేయత వహిస్తున్నారు. ఇందులోని బాధ్యతలను గుర్తించి ప్రవర్తిస్తున్నారు. ధర్మపరులకు బాధలు ఇక ముందు లేవు. ప్రజలందరికి ధర్మచరణ చాల ముఖ్యమైంది. ఇకముందు కూడా ఇదే విధంగా ఉంటుంది.

**గౌణలేఖ శాసనాలు : (బౌద్ధమతంలో అశోకుని ఆసక్తిని గురించినవి)**

**భబ్రశాసనం :**

మగధరాజైన ప్రియదర్శి సంఘానికి అభివాదం చేసి సర్వబాధా నివారణను, సంఘాభివృద్ధిని కాంక్షిస్తున్నాడు. బుద్ధ, ధర్మ సంఘములలో నాకు ఉన్న గాఢ భక్తి తాత్పర్యాలుమీకు తెలిసినవే. భగవాన్ బుద్ధుడు భాషించినదంతా సుభాషితమే. ఈ సుభాషితాలు : వినయ సము కసె (Excellence of dicipline), ఆలియ విసాణి (the lineage of the noble one), అనాగత భయాని, (The future fears), మునిగాథా

(The verses of the sage), మోనెయ సూతె (The sutras of silence), ఉపాసిత పసినె (The question of Upatissa), లాఘులోవాదే ముసావాదమ్ (The admonitions spoken by the Lord Buddha to Rahula on the subject of false speech). భిక్షుకీ భిక్షువులు అనేకులు వీటిని వినవలె. వీటిని గురించి ధ్యానించవలె. అదే విధంగా ఉపాసకీ ఉపాసకులు. ఆర్యులారా! నా కోర్కెను మీరందరు గ్రహించగలందులకై దీన్ని ఇక్కడ వ్రాయిస్తున్నాను.

**రుమ్మిండైస్తంభశాసనం :**

దేవానాం ప్రియుడు వింశతి వర్షాభిషిక్తుడైనపుడు స్వయంగా వచ్చి బుద్ధ శాక్యముని జన్మించిన ఈ ప్రదేశాన్ని దర్శించినాడు. శిలా ప్రాకారాన్ని నిర్మించి శిలా స్తంభాన్ని నిలిపినాడు. ఇచ్చట ఈ గ్రామంలో భగవానుడు జన్మించిన లుంబినీ గ్రామంలో పన్ను మినహాయింపునిచ్చి అష్టాంశంగా నిర్ణయించినాడు.

**నిగలీసాగర్ స్తంభశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు చతుర్దశ వర్షాభిషిక్తుడైనపుడు కనకముని బుద్ధుని స్థూపాన్ని రెండింతలు పెంచినాడు ... ... ... వర్షాభిషిక్తుడైనపుడు స్వయంగా వచ్చి ... ... ... పూజించినాడు.

**విభేదశాసనం : (భిన్న ప్రతుల సమన్వయ పాఠం)**

దేవానాం ప్రియుడు కౌశాంబి/పాటలీపుత్ర మహామాత్తులను ఆజ్ఞాపిస్తున్నాడు. భిక్షుకీ భిక్షుక సంఘం సమైక్యమైంది. ఈ సమైక్యం పుత్ర పౌత్ర ప్రపౌత్ర పర్యంతము సూర్యచంద్రులున్నంతవరకు విలసిల్లుగాక! సంఘంలో విభేదాన్ని సృష్టించినవారు పరివ్రాజకుడైనా భిక్షుణి అయినా శ్వేతాంబరాలు ధరించి విహారాల వెలుపల నివసించవలసిందే. అందుకు కారణం చిరకాలం సంఘం సమైక్యంగా వర్ధిల్లవలెననే నాకోరికయే. భిక్షుకీ భిక్షుక సంఘాలకిది బోధపరచవలె. దేవానాం ప్రియుడిట్లు పలుకుతున్నాడు. ఈ శాసన ప్రతినొకటి మీ సమావేశ మందిరంలో నిలుపుకొనవలె. ఉపాసకులకొక ప్రతినీయవలె. ఉపాసకులు ఉపోసధకు వచ్చి శాసనాన్ని ఆమోదించవలె. అదే విధంగా ఉపోసధకు సర్వదా హాజరయ్యే మహామాత్తులు శాసనాన్ని ఆమోదించి బహిరంగపరచవలె. ఈ ప్రతి ననుసరించి తు. చ తప్పక మీ మీ మండలాలలో ప్రచారం చేయవలె. ఈ శాసనానికి నిర్దుష్ట పాఠాన్ని దుర్గ విషయాలలో (సైనికుల క్రిందనున్న రాష్ట్రాలలో) సయితం ప్రచారం చేయవలె.

# స్తంభ శాసనాలు

**మొదటి స్తంభశాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శిరాజు ఇట్లు పలుకుతున్నాడు. షడ్వింశతి వర్షాభిషిక్తుడనై ఈ ధర్మ లిపిని వ్రాయించితిని. అపార ధర్మాపేక్ష, శ్రద్ధ, విధేయత, పాపభీతి, సామర్థ్యము లేకపోతే ఇహ పరలోక సుఖాలను పొందడం కష్టం. నా ప్రబోధంవల్ల ధర్మాపేక్ష, ధర్మ కామన దినదినాభివృద్ధి చెందింది. చెందుతూ ఉంటుంది. ఉన్నత, మధ్యమ, అధమ వర్గాలకు చెందిన నా ఉద్యోగులు ధర్మాన్ని ఆచరిస్తూ చపలచిత్తులకు నచ్చచెప్పగలరు. అదే విధంగా సరిహద్దులలోని మహామాత్తులు. ఇది నా సిద్ధాంతం : ధర్మం ద్వారా రక్షణ. ధర్మ పరిపాలన. ధర్మం ద్వారా ప్రజా సుఖం. ధర్మం ద్వారా సామ్రాజ్య పరిరక్షణ.

**రెండో స్తంభ శాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. ధర్మం శ్రేష్ఠమైంది. ధర్మం అంటే ఏమిటి? తక్కువ దోషాలు, ఎక్కువ సాధుకార్యాలు. దయ, దాన, సత్య, శౌచాలు. నేను బహు విధాలుగా అంతర దృష్టి ప్రదానం చేసినాను. ద్విపాద, చతుష్పాద, విహంగ, వారిచరాదులపై వివిధ రూపాలలో అనుగ్రహం ప్రసాదించినాను. వాటి ప్రాణరక్షణ చేసినాను. ఈ ధర్మ లిపిని లిఖించడానికి కారణం ప్రజలు దీన్ని అనుసరించి సుకృతులౌతారని.

**మూడో స్తంభ శాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. మానవుడు తాను సత్కార్యాలనే దర్శిస్తాడు. "నేను మంచి చేసినాను." అని భావిస్తాడు. "నేను పాపం చేశాను; ఇది నిజంగా పాపం" అని ఎన్నడూ భావించడు; తన పాప కార్యాలను గుర్తించడు. ఈ విధమైన గుర్తింపు కలగడం వాస్తవానికి చాల కష్టం. అయినప్పటికీ మానవుడావిధంగా గుర్తించవలె. "క్రూరత్వం, కాఠిన్యం, ఆగ్రహం, గర్వం, అసూయలు పాప హేతువులు. ఇవి నా పతనానికి కారణాలు కారాదు." అని ఆలోచించవలె. "ఇది ఇహలోక సౌఖ్యానికి చాలముఖ్యం" ఇది పరలోక సౌఖ్యానికి ముఖ్యం అని గుర్తింపు, ఆలోచన చాల అవసరం.

**నాలుగో స్తంభ శాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. షోడశవింశతి వర్షాభిషిక్తుడనైనప్పుడు ఈ ధర్మ లిపిని వేయించినాను. అనేక శత సహస్ర ప్రజానీకంపై రాజుకులు నియుక్తులైనారు. ప్రశాంతంగా, నిర్భయంగా తమ విధులు నిర్వహించగలరని,

ప్రజల సుఖ శ్రేయస్సులను పెంపొందించగలరని, లాభం చేకూర్చగలరని ఆశయంతో నేర విచారణ జరిపి శిక్షించడంలో రాజుకులకు స్వతంత్రాధికారం ఇచ్చినాను. సుఖ దు:ఖాలకు కారణాలను గ్రహించి, ధర్మపరులతో కలిసి ఇహ పర సుఖాలు పొందగలందులకై గ్రామ ప్రజలను వారు ప్రబోధిస్తారు. నన్ను, నా కోర్కెలెరిగిన దూతలను మన్నించడానికి ప్రజలు ఉత్సాహంతో ఉన్నారు. పొరపాటు చేసే రాజుకులను నా దూతలు శాసించి నాకు తృప్తి కలిగే విధంగా వ్యవహరింప చేస్తారు. అనుభవం ఉన్న దాదికి తన బిడ్డను అప్పగించి, ఆ దాది తన బిడ్డయందు తృప్తికరంగా శ్రద్ధ వహిస్తుందని విశ్వసించినట్లే దేశ ప్రజల సుఖ శ్రేయస్సుల నిమిత్తం రాజుకులు నియుక్తులైనారు. నిర్భయంగా ఆత్మ విశ్వాసంతో తమ విధులు నిర్వహింపగలందులకై నేర విచారణలోను, శిక్షలు విధించడంలోను రాజుకులకు స్వతంత్రాధికారం ఇచ్చినాను.

ఇది మొదలు నా ప్రబోధం: బందీ అయినవారికి గాని, మరణశిక్ష విధించిన వారికి గాని మూడు రోజుల వ్యవధి నివ్వవలె. వారి బంధువులు, వారి ప్రాణాలకోసం ప్రార్ధనలు జరుపవచ్చు. ప్రార్ధనలు జరుపడానికి బంధువులెవ్వరు లేకపోతే ముందు జన్మలో ఉత్తమగతి పొందడానికి నేరస్థులే దాన ధర్మాలు చేయవచ్చు. ఉపవాసాలుండవచ్చు. వారు పరలోకం సాధించవలెనని నా కోరిక. ప్రజలలో దానం, సంయమనం, మొదలైన ధర్మ ఆచారములు పెరుగుతున్నాయి.

**ఐదో స్తంభ శాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. షోడశ వింశతి వర్షాభిషిక్తుడనైనపుడు ఈ క్రింది జంతు సముదాయ వధను నిషేదించినాను: చిలుకలు, మైనాలు, అరుణాలు, చక్రవాకాలు, హంసలు, నందీ ముఖాలు (వరి పొలాలలో కన్పించే పక్షులు), పావురాలు, గబ్బిలాలు, చీమలు, తాబేళ్ళు, అనధిక మత్స్యములు, వెదవేయకములు, గాంగాపు పుటములు, సంకుజ మత్స్యములు, శలలములు, ఉడతలు, దుప్పులు, బల్లులు, పెంపుడు జంతువులు, ఖడ్గమృగాలు, తెల్ల పావురాలు, పెంపుడు పావురాలు, ప్రయోజనం లేని సర్వ చతుష్పాదాలు, పిల్లలున్న మేకలను, గొర్రెలను, పందులను చంపరాదు. వీటిలో పాలిచ్చువాటిని చంపరాదు. వాటి పిల్లలను ఆరు మాసాలు వచ్చేవరకు చంపరాదు. బీజచ్ఛేదం చేయరాదు. జీవాలున్న ఊకను తగులబెట్టకూడదు. నిష్కారణంగా గాని, జంతువులను చంపడానికి గాని అడవులను కాల్చరాదు. ఏ జీవమైనా మరొక జీవాన్ని భక్షించరాదు.

మూడు చాతుర్మాస్య పూర్ణిమా దినాలలో, తిష్యా నక్షత్ర పూర్ణిమా దినాలు మూడింటిలో, కృష్ణపక్ష పాడ్యమీ దినాలలో, ఉపవాసదినాలన్నింటిలో చేపలు పట్టరాదు; విక్రయించరాదు. పైరోజులలో గజ వనాలలోను, మత్స్య కేంద్రాలలోను ఏ జంతువును వధించకూడదు; అష్టమ పక్షంలో చతుర్దశి, పంచదశి రోజులలోను, తిష్య, పునర్వసు నక్షత్రాల రోజులలోను చాతుర్మాస్యంలో మొదటి మూడు పూర్ణిమలలోను, పర్వదినాలలోను వృషభాలను, పొట్టేళ్ళను, మేకపోతులను, పందులను, మామూలుగా బీజచ్ఛేదం చేసే ఇతర జంతువులను బీజచ్ఛేదం చేయరాదు. తిష్య, పునర్వసు నక్షత్రాలలోను, చాతుర్మాస్యాలలో, మొదటి పూర్ణిమలోను వాటి అనంతర పక్షాలలోను పశువులకు, గుర్రాలకు ముద్రలు వేయరాదు.

పట్టాభిషేకం ఇరవై ఆరో జయంతి నాటికి ఇరవై అయిదు మారులు నిర్బంధితుల బంధ మోక్షణం జరిగింది.

**ఆరో స్తంభ శాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. ద్వాదశ వర్షాభిషిక్తుడనైనపుడు ప్రపంచ సుఖశ్రేయస్సుల కొరకై ధర్మ లిపిని వేయించినాను. దానిని అనుసరించినవారు ధర్మంలో బహు విధాల అభివృద్ధి చెందుతారు. ఆ విధంగా ప్రపంచ సుఖ శ్రేయస్సులకు అవకాశం కల్పిస్తున్నాను. సన్నిహితులైన, దూరస్థులైన బంధువు లందరికి సౌభాగ్యాన్ని చేకూర్చిన విధంగానే అన్ని వర్గాలవారికి సౌఖ్యం చేకూరుస్తాను. అన్ని మతాలను వివిధ మర్యాదలతో గౌరవిస్తాను. ఆ మతాల వారిని స్వయంగా దర్శించడం ముఖ్యమని నా అభిప్రాయం. షడ్వింశతి వర్షాభిషిక్తుడ నైనపుడు ఈ ధర్మ లిపిని వ్రాయించినాను.

**ఏడో స్తంభ శాసనం :**

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. గతంలో ప్రజలలో ధర్మాసక్తి పెంచగల సాధనాలను రాజులు అన్వేషించినారు. కాని అందు కనుగుణంగా ప్రజలలో ధర్మాసక్తి పెంపొందలేదు. అందుచేత దేవానాం ప్రియుడిట్లు పలుకుతున్నాడు. నాకు ఈ భావం కలిగింది. గతంలో రాజులు ప్రజల ప్రగతికి ప్రయత్నించినారు. కాని ప్రజలు వికాసం పొందడం జరుగలేదు. ప్రజలలో ఏ విధంగా ధర్మాసక్తిని పెంచవలె? ఏ విధంగా వారిచే ధర్మాన్ని అనుసరింప జేయవలె? ప్రజలు ధర్మానుశాసనాలను వినేటట్లు వారికి ధర్మ పరిజ్ఞానం ప్రబోధించేటట్లు చేస్తాను. ధర్మం విన్న ప్రజలు దాన్ని ఆమోదిస్తారు . ఉన్నతిని పొందుతారు. ధర్మంలో అధిక ప్రగతిని సాధిస్తారు. ఇది కారణంగానే ధర్మ ప్రకటనలు జరిగినాయి. ధర్మ ప్రబోధనను అనుశాసించినాను. ప్రజలలో ధర్మ మహామాత్తులను నియమించినాను. వీరు ప్రజలను హెచ్చరిస్తూ వారికి ధర్మాన్ని వివరిస్తారు.

శత సహస్ర ప్రజానీకంపై రాజుకులను నియమించినాను. ధర్మపరులైన ప్రజలను ప్రోత్సహించవలసిందిగా వీనిని శాసించినాను.

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. అదే ఆశయంతో ధర్మ స్తంభాలు నిలిపినాను. ధర్మమహామాత్తులను నియమించినాను. ధర్మ శాసనాలు వేయించినాను.

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. బాటలపై మానవులకు, జంతువులకు నీడనిచ్చే మర్రిచెట్లు నాటించినాను. మామిడితోపులు పెంచినాను. బావులు తవ్వించినాను. ఎనిమిదికోసుల కొకటి చొప్పున సత్రాలు కట్టించినాను. మానవులకు జంతువులకు చలివేందిరలు నెలకొల్పినాను. ఈ విషయాలలో గతంలో కూడ ప్రపంచ మహారాజులు శ్రద్ధ వహించినారు. కాని నేనాశించిన ప్రయోజనం చాల ముఖ్యమైనది. నా ప్రజలు ధర్మాని కనుగుణంగా వర్తిస్తారని నేనీ పనులన్నీ చేసినాను.

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. నా ధర్మమహామాత్తులు సర్వమత శాఖలలో, గృహస్థులలో, పరివ్రాజకులలో, బహువిధ ప్రజాహితంలో కార్యాతురు లౌతున్నారు. బౌద్ధమత సంఘానికి, బ్రాహ్మణులకు, ఆజీవికులకు, జైనులకు, ఇతర మతశాఖలకు కృషి చేయడానికై మహామాత్తులను నియమించినాను. ఈ మతాలపట్ల ఇతర మతశాఖల వ్యవహారాలు నిర్వహించడానికి వివిధములైన విధులతో అనేక వర్గాల ధర్మ మహామాత్తులున్నారు.

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. అనేక రూపాలలో నేను చేసిన దానాలను, రాణులు చేసిన దానాలను, అంత:పురం చేసిన దానాలను అమలు జరుపడంలో ధర్మ మహామాత్తులు, ఇతర ముఖ్యోద్యోగులు కార్యాతురులౌతున్నారు. ఇక్కడ, ఇతర ప్రాంతాలన్నింటిలోను వీరు పుణ్యకార్యాలకు గుర్తింపు కలిగిస్తారు. నా కుమారులు ఇతర రాకుమారులు ధర్మానువర్తనులై ధర్మంలో కీర్తిమంతులౌతారనే, ధర్మ ప్రతిష్ఠ పెంచుతారనే ఆశయంతో వారిపక్షాన దానాలు చేయవలసిందిగా మహామాత్తులను ఆజ్ఞాపిస్తున్నాను. ఈ విధంగా ప్రపంచమంతటా ధర్మ ప్రతిష్ఠ పెరిగి దయ, దాన, సత్య, శౌచ, మార్దవ, సాధుత్వాదుల రూపంలో ధర్మం ఆమోదం పొందుతుంది.

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. నేను ఏ మంచి పనులు చేసినా ప్రపంచం అంగీకరించి, అనుసరించింది. మాతాపితల శుశ్రూష, గురుభక్తి, వృద్ధసంరక్షణ, బ్రాహ్మణ శ్రమణ గౌరవం, నిర్ధన, అనాథ, దాస, భృతక ఆదరణ పెరిగినాయి; పెరుగుతాయి.

దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు. ప్రజలలో రెండు సాధనాలద్వారా ధర్మాభివృద్ధి జరిగింది. అందు మొదటిది శాసనం, రెండోది ప్రోత్సాహం. ఉదాహరణకు శాసనాల ద్వారా కొన్నిరకాల జంతువులను చంపరాదు అన్నటువంటి భావాలను ప్రకటించినాను. కాని దీనికంటె జంతువధ, జీవహింస కూడదని చేసిన ప్రోత్సాహం ద్వారానే ప్రజలలో ధర్మానువర్తనం పెరిగింది.

నా పుత్ర పౌత్రులతో పాటు ఆచంద్రార్కం ప్రజలు ధర్మాన్ని అనుసరిస్తారనే లక్ష్యంతో ఈ కృషి అంతా చేసినాను. ధర్మాన్ని అనుసరించడం ద్వారా మానవుడు ఇహపరలోకాలను సాధించగలడు. సప్తవింశతి వర్షాభిషిక్తుడనై ఈ ధర్మలిపిని వ్రాయించినాను. దేవానాం ప్రియ ప్రియదర్శి రాజు ఇట్లు పలుకుతున్నాడు : శిలా స్తంభాలు, శిలా ఫలకాలు లభించిన చోటనెల్లా చిరకాలం మనగలందులకై ఈ ధర్మలిపిని వ్రాయవలె.

ఆరో అనుబంధం

# మౌర్యయుగం నాటి కళ

మౌర్యయుగం నాటి కళావశేషాలు శైలిలో పారశీక చరిత్రలోని అఖమీనిడ్ యుగంనాటి కళావశేషాలను దగ్గరగా పోలుతున్నాయి. ఈ సాన్నిహిత్యం వల్ల మౌర్య కళాఖండాలు మరుగున పడిపోయి కళా చరిత్రకారుల మధ్య తీవ్ర యుద్ధానికి దారితీసి, వారికి ఆయుధాలను సమకూర్చడమైంది. వీరిలో ఒక వర్గంవారు మౌర్య కళాఖండాలన్నీ పారశీక కళాకారుల నిర్మాణాలుగా పరిగణించేవారు. వీరి ప్రత్యర్థులు ఆ కళాఖండాలన్నీ కేవలం స్వదేశీయాలని భావించేవారు. ఈ అనుబంధంలో మేమీ వాదనలోకి దిగబోవడం లేదు. ఈ వాదం కేవలం రసదృష్టిపై ఆధారపడింది. రసదృష్టి పరిశీలనకు గ్రీక్, అఖమీనిడ్ కళలు రెంటిని ఆలోచించవలె. కాని మౌర్యయుగ సమాజానికి సంబంధించినంత వరకు మౌర్య కళకు ప్రస్తుతమైన అంశాలు మాత్రం పరిశీలించడం మా ఆశయం.

అశోకయుగ కళావశేషాలు శాసనాలతో కలిసి దొరుకుతున్నాయి. శాసనాలు పవిత్ర ప్రాకారాలలోను లేదా పట్టణాల సమీపంలోను నెలకొల్పేవారు. సర్వసాధారణంగా కన్పించే శిల్పాలు స్తంభాలపైనుండే జంతు కిరీటాలు, స్తంభాల ప్రాముఖ్యం నిర్ణయించడం కష్టం కాదు. నిర్మాణాలుగా స్తంభాల ఉత్పత్తి అతి చారిత్రక యుగంనాటి ఏకశిలా ఖండాలలోనే కన్పిస్తుంది. పెద్ద పెద్ద బండరాళ్ళనుండి వేర్పరచి, స్తంభాన్ని మలిచి ప్రాకారంలో స్థాపించేవారు. ఈ ప్రాకారాన్ని పరమ పవిత్రంగా భావించేవారు. ఒక్కొక్కప్పుడీ స్తంభాన్ని లింగమని పూజించేవారు. అట్టి స్తంభాలపై శాసనాలు వ్రాయడంలో ఒక మంచి ప్రయోజనం ఉంది. అందువల్ల నాటికే ముఖ్యమైన ఒక ప్రదేశంలో శాసనానికి ప్రయోజనం కలిగింది. స్మిత్ సూచించినట్లు శిలాఫలకాలపైన, శిలా స్తంభాలపైన శాసనాలు వ్రాయవలెనని సాసరామ్ శాసనము చాటుతున్నది. ఈ వాక్యం కనీసం కొన్ని స్తంభాలు అశోకుని కాలానికి

ముందువని సూచిస్తున్నది. లేఖనాలు లేని స్తంభాలకు నాడు పూజా ప్రాముఖ్యం ఉండి ఉంటుంది.

కుమారస్వామి పండితుడు మౌర్యయుగం నాటి కళను ఆస్థాన కళ అని, లోక సమ్మతకళ అని రెండు విభాగాలు చేసినాడు. ఆస్థాన కళాభాగానికి స్తంభాలు, స్తంభ కిరీటాలు ప్రతినిధులు. వీటిలో రాతికి మంచి మెరుగుంటుంది. చెక్కుడులో సాంకేతిక నైపుణ్యం కన్పిస్తుంది. చైతన్యం తొణికసలాడే వాస్తవిక మూర్తి నిర్మాణం ప్రతిఫలిస్తూ మంచి అభివృద్ధికరమైన తరువాతి రీతికి చెందిన కళ అని కుమారస్వామి వర్ణిస్తాడు. మౌర్యుల రాతిపనికి పూర్వం దారువులోనో సులభంగా నశించిపోయే ఇతర పదార్థంలోను శిల్ప సంప్రదాయం ఉండే దనడంలో సందేహం లేదు. నగర నిర్మాణంలో పెద్ద ఎత్తున దారువును వాడినారు కావున శిల్పానికి, అలంకారాలకు దారువును వాడడం సర్వసాధారణం. శిశుపాల్ ఘర్ తవ్వకాలలో మౌర్యయుగ అంతరువులలో దొరికిన కలప సామగ్రిని పరిశీలిస్తే అది నేడు ఒరిస్సాలో దొరికే కలపకు చెందిందని తెలుస్తున్నది. క్రమంగా దారువు నుపయోగించడం తగ్గిపోవడానికి కారణం అఖీమీనిడ్ పర్షియాతోటి పరిచయ ప్రభావం అయి ఉండవచ్చు. కాని గంగా మైదానంలో అడవుల నెక్కువుగా ఛేదించడం అంతకంటె సబబైన కారణమై ఉంటుంది.

స్తంభాలను రెండు రకాల రాతితో చేసినారు. కొన్ని ఎరుపు, తెలుపు మచ్చలున్న తెల్లని ఇసుక రాతివి. ఈ రాయి మధుర ప్రాంతంలో లభిస్తుంది. మరికొన్ని నల్లని మచ్చలుండి పాండు వర్ణంలో అందంగా మలచబడినట్టి ఇసుకరాతివి. ఈ రాయి వారణాసి దగ్గర చూనార్ గనులలో లభిస్తుంది. వాయవ్య సరిహద్దు రాష్ట్రానికి అఖమీనిడ్ కేంద్రాలతో సన్నిహిత సంబంధం ఉంది. అందుచేత ఆ ప్రాంతాలలో అలంకరణకై రాతిని వాడే వారనడంలో సందేహంలేదు. భిర్ దిబ్బలో అలంకరణార్థం ఉపయోగించిన రాతి వస్తువులు దొరికినాయి. అందుచే తక్షశిలలో రాతి చెక్కుడు పనివారు ఉన్నట్లు తెలుస్తుంది. మౌర్య సామ్రాజ్యం సుస్థాపితమై రవాణా సౌకర్యాలు పెంపొందినందున ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి పెద్ద పెద్ద రాతి బండలను రవాణా చేయడం, చెక్కుడు పని వారిని పంపడం సాధ్యమయింది. స్తంభకిరీటాలలో కనిపించే సామ్యం అవి అన్నీ ఒకే ప్రాంతం పనివారు చెక్కినట్లు సూచిస్తున్నది. అదే విధంగా శిల కూడ పై పేర్కొన్న రెండు రకాలకు చెందిందే. కాబట్టి చూనార్, మధుర ప్రాంతాల నుండి ప్రస్తుతం స్తంభాలున్న ప్రదేశాలను శిలలను రవాణా చేసినారు. ఆయా ప్రదేశాలలోని శిల్పులు బండలను చెక్కి స్తంభాలను మలచినారు. ఈ శిల్పులు బహుశా తక్షశిల నుండి తెచ్చి ఉంటారు. వీరు శిలలు చెక్కడంలో

సుశిక్షితులై మంచి అనుభవం గడించినవారు. తక్షశిలలో కన్పించిన రాతి చెక్కుడు ముక్కల వల్ల స్థానికంగా శిల్పులు శిల్పాలు తయారుచేసినట్లు తెలుస్తున్నది.

ధౌళి చెంత ఉన్న రాతి ఏనుగు మృగకిరీటాల సంప్రదాయానికి చెందినట్లు కనిపించదు. దీనిని బహుశా మృగ కిరీటాలను మలచిన ప్రత్యేక శిల్పులుకాక, స్థానిక శిల్పులే చెక్కి ఉంటారు. గండ శిల నుండి బహిర్గత మౌతున్నట్లున్న ఈ యేసుగురూపం చాల గంభీరంగా ఉంది. సమీపంలోని శాసనంపై దృష్టి మరల్చడమే ఈ శిల్పం ఉద్దేశమై ఉంటుంది.

స్థానిక శిల్పుల ఈ కృషియే మౌర్యయుగం నాటి లోక సమ్మత కళకు ఉదాహరణ. ఇది బహుశా చక్రవర్తి నియోగించిన శిల్పంలో భాగం కాదు. స్థానిక రాష్ట్ర పాలకులు, ధనిక పౌరులు లోక సమ్మత కళకు పోషకులు. బేస్‌నగర్ యక్షిణీశిల్పము, పర్ఖ్‌న్ యక్షశిల్పము, దీదర్ గంజ్ చామర థారిశిల్పము లోక సమ్మత శిల్పానికి ప్రతినిధులు. ప్రత్యేకంగా ఈ శిల్పులు మౌర్యయుగానికి ముందువి అయినా కాకపోయినా కళాత్మకంగా ఈ ధౌళి రాతి ఏనుగు వర్గానికి చెందినవి. స్తంభ కిరీటాలను మలచటంలో ఉన్న సాంకేతిక నైపుణ్యం ఈ శిల్పాలలో కన్పట్టదు. ఇవి కేవలం భౌతికత్వాన్ని, అపార జీవన శక్తిని ప్రతిఫలిస్తున్నాయి.

మౌర్య రాజ్యం నియమించిన పనివాండ్రు బహుశా బారతదేశంలో స్థిరపడిన పారశీక నిరుద్యోగులై ఉంటారని  వీలర్ సూచన. పశ్చిమ, వాయవ్య రాష్ట్రాలలో తుషాస్ప రాష్ట్ర పాలకుని వంటి పారశీకులను లేదా పారశీక భారతీయులను మౌర్యులు ఉద్యోగాలలో నియమించడం చేత వీలర్ సూచన సంభావ్యమే అయి ఉండవచ్చు. పై ప్రాంతాలలో పారశీక పనివాండ్రు అధిక సంఖ్యలో స్థిరపడినప్పటికీ అచట అఖమీనిడ్ సంబంధమైన వస్తువులు పెద్ద ఎత్తున కన్పించక పోవడం చాల ఆశ్చర్యం. మౌర్యయుగ ఆస్థాన కళను చర్చించే సందర్భంలో మరొక విషయాన్ని మనసులో ఉంచుకోవడం మంచిది. సామ్రాజ్య భవనాలలో వ్యక్తమయ్యే కళా విష్కరణలో కేవల జాతీయత అరుదుగా కన్పిస్తున్నది. అందుకు కారణం చిన్న రాజ్యాలకంటె ఒక సామ్రాజ్యం సహజసిద్ధంగా సర్వజాతి సమ్మతమై ఉండడమే. సామ్రాజ్య స్థాపనకు పూర్వం అందలి ప్రాంతాలు ఒకదానికొకటి పరరాజ్యాలు.

సారనాథ్ సింహ కిరీటం తరువాత ఒక శతాబ్దానికి సాంచీ ద్వార తోరణం మీద అదేరకమైన శిల్ప సృష్టికై చేసిన ప్రయత్నం విఫలమైంది కాబట్టి సారనాథ్ సింహకిరీటం విదేశీ కళాకారుల పని అని స్మిత్ పండితుడు సూచిస్తాడు. భారతీయ శిల్పులు స్వయంగా అటువంటి కళాఖండాన్ని సృష్టించలేరనేదే స్మిత్ పండితుని వాదం. కాని ఈ సందర్భంలో ఒక విషయం గుర్తుంచుకోవలె. భావించిన ప్రయోజనం ఫలించిందా లేదా విఫలమైనదా

అనే అంశానికీ శిల్ప ప్రయోజనానికీ సంబంధం ఉంది. సాంచీ స్థూప దక్షిణ ద్వారం పైని శిల్పాన్ని ఒక్కదాన్నే ఆలోచించి సారనాథ్ సింహకిరీటంతో పోల్చినపుడు సాంచీ శిల్పం అంత ఉదాత్తంగా, గంభీరంగా ఉండని మాట వాస్తవమే. కాని సింహకిరీట రీతిలోని శిల్పంతోనే సాంచీద్వారాన్ని పూర్తిగా అలంకరిస్తే కళాత్మకంగా అది పెద్ద లోపం అయి ఉండేది. సార్వభౌమ సందేశాన్ని వహించిన స్తంభ సర్వాంగ సౌందర్యానికి ప్రతీక సారనాథ్ కిరీటం. అందుచేత అది వివిక్తత్వానికీ సార్వభౌమత్వానికీ అనుగుణంగా ఉంది. ఇక సాంచీ శిల్పం మరొక భావాన్ని ప్రతిబింబిస్తున్నది. అందుచే దాని జాతియే వేరు. తాము పవిత్రంగా భావించే స్థూపాన్ని గౌరవించాలని కోరే ఒక వర్గం భావ వ్యక్తీకరణమే సాంచీశిల్పం.

మౌర్య యుగానికి చెందిన ప్రదేశాలలో వివిధ పరిణామాలలో ఉన్న జేగురు మట్టి వస్తువులు దొరికినాయి. మట్టితో 'అమ్మతల్లి'ని తయారుచేసే అతి చారిత్రక యుగ సంప్రదాయానికి అనుక్రమణమే ఇది అని చెప్పవచ్చు. ఇందుకు ఆహిచ్ఛత్రలో మౌర్యయుగ అంతరువులలో జేగురు మట్టి వస్తువులు దొరకడమే నిదర్శనం. పాటలీపుత్రం నుండి తక్షశిల వరకు విస్తరించిన ప్రదేశాలలో ఈ వస్తువులు సర్వసాధారణంగా కనిపిస్తున్నాయి. వీటిలో చాల వరకు నిర్ణీతమైన మూర్తులను సంతరించుకొన్నాయి. నిర్దుష్టమైన ఆకృతులతో, విస్పష్టమైన అలంకరణతో, పరిపుష్టమైన సాంకేతిక నైపుణ్యం ప్రదర్శిస్తున్నాయి. వీటిలో కొన్నింటిని దిమ్మలలో చేసినట్లు కన్పిస్తుంది. అయినప్పటికీ ఒక దాని కొకటి ప్రతిరూపం కాదు. తక్షశిలలో దొరికిన జేగురు మట్టి వస్తువులలో అతి చారిత్రక ప్రతిమలు, ఉద్దేశిక దేవతా శిల్పాలు, ఆటవస్తువులు, ఆభరణాలు, పాచికలు, పూసలు ముఖ్యమైనవి. ఆట వస్తువులలో అధిక భాగం చక్రాలున్న జంతువులు. వీటిలో ఏనుగుపట్ల ప్రత్యేకాభిమానం కనిపిస్తుంది. ఆభరణాలలో రోమన్ బాలురు ధరిస్తుండే పతకాన్ని (bullea) పోలిన గుండ్రని పతకాలు ముఖ్యం. వీటిని ధరిస్తే దృష్టిదోషం తగులదని వారి విశ్వాసం.

ఏడో అనుబంధం

# ఆధారాలను గురించి మరోమాట

1963 నుండి కొత్తగా దొరికిన రెండు శాసనాలు ముఖ్య ఆధారాలలోనివి. వీనిలో బహాపూర్ శాసనం 1963లో ఢిల్లీ పొలిమేరల్లో దొరికింది. తొలిరచనలలో దీనిని ఘడి శాసనం అని పేర్కొన్నారు. ఈ శాసనం చివరిభాగం విరిగిపోయింది. లేకపోయినట్లయితే దీన్ని గౌణ శిలాశాసన ప్రతి అని చెప్పవచ్చు. ఇతర గౌణ శాసన ప్రతులలో ఉదాహృతమైన రెండు వందలయాభయి ఆరు రాత్రుల ప్రస్తావన ఇందులో ఉన్నదా లేదా అనే అనుమానం ఉంది.

ఇంతకంటె ముఖ్యమయింది 1963 లో కాందహార్‌లో కన్పించిన శాసనం. తరువాత దీన్ని అశోక శాసనంగా గుర్తించినారు. ఇది పన్నెండో ముఖ్య శిలా శాసనం చివరి భాగానికి పదమూడో శిలా శాసనం మొదటి భాగానికి గ్రీకు ప్రతి. కాని ప్రాకృత భాష నుండి అక్షరత: గ్రీకు అనువాదం కాదు. కేవలం గ్రీకు రచన మాత్రమే. మూలంలో వివాద గ్రస్తములైన ప్రాకృత పద గుచ్ఛాలకు గ్రీకు పదాలను వాడినందున ఈ శాసనం చాల ముఖ్యమయింది.. 'ధమ్మ' పదానికి 'పవిత్రత' అని అర్థం వచ్చే 'ఇసూబితూ' పదం వాడినారు. ఈ శాసనంలో బుద్ధుని బోధనలను గురించిన ప్రసక్తి లేకపోవడం మరొక ఆసక్తికరమైన అంశం. బౌద్ధంతో పరిచయంలేని ప్రాంతాలకు ఉద్దేశించి ఉంటే ఈ శాసనంలో బుద్ధుని ప్రసక్తి ఉండడం సహజం. అశోకుని ధమ్మాన్ని శాసనం (Law) అని అనువదిస్తే నోమోస్ (nomos) అనే గ్రీకుపదం వాడవలసింది. పాషండ పదానికి వాడిన గ్రీకు పదం డియోట్రైబ్ (diatribe) కాని డియాట్రైబ్ అనే మాట పాషండ లేదా పాషండ

మతశాఖలు అనే పూర్తి అర్థాన్ని ఇవ్వదు; సిద్ధాంత పూర్వకములైన మత శాఖలనుగాక సాధారణ దార్శనిక శాఖలనుగాని విశ్వాసాన్ని గాని సూచించేటట్లు కన్పిస్తుంది. ఈ శాసనంలోని పదజాలము శైలి క్రీస్తు పూర్వం మూడో దశాబ్దికి చెందినదే. వీనిలో ప్లేటో, పైథానొరన్‌ల భావాల ప్రతిధ్వనులున్నాయి. ఆరకోష్ఠియాలో కనీసం కాందహార్‌లో నాడు తగినంత గ్రీకు జనాభా ఉన్నట్లు ఈ శాసనాలు సూచిస్తున్నాయి.

చిరకాలంగా పరిచయం ఉన్న ఆధారాలలో సైతం కొత్తగా కృషి జరిగింది. ముఖ్యంగా ఇటీవల అర్థశాస్త్రంలో ఇనుమడించింది. అర్థశాస్త్రంమీద ఆర్. పి. కంగ్లే జరిపిన కృషి మూడు సంపుటాలలో వెలువడింది. ప్రస్తుతం ఈ గ్రంథమే అర్థశాస్త్రంమీద ప్రామాణికంగా ఉంది. శుద్ధ ప్రతి, అనువాదము, మూలానికి విశ్లేషణాత్మక ఉపోద్ఘాతము అనే మూడుభాగాలుగా ఈ గ్రంథాన్ని 1960, 1963, 1965 సంవత్సరాలలో ప్రచురించినారు. మౌర్య యుగచరిత్రకు ఆధారంగా అర్థశాస్త్రం ప్రయోజనకారి అనే అభిప్రాయంతో కంగ్లే ఏకీభవిస్తాడు.

“కౌటిల్యుడు - అర్థశాస్త్రము” అనే శీర్షికతో ట్రౌట్‌మన్ రచన మరింత ఇటీవలి ప్రచురణ (1970). ఇది గణాంక విధానంద్వారా మూలంలోని విభాగాలను తేదీలవారీగా పునర్నిర్మించడానికి చేసిన ప్రయత్నం. అంటే సాధారణంగా ప్రయోగించే ఏవమ్, చ, తత్ర, వ పదాలనుబట్టి రచయితలను వేరుచేసి సరిగా గుర్తించే విధానం. శైలినిబట్టి రచయితలను గుర్తించడంలో ఈ విధానం ఉపకరిస్తుంది. పై పద్ధతిలో విశ్లేషణాత్మకంగా పరిశీలన చేసి అర్థశాస్త్రంలో మూడు విశిష్టములైన గ్రంథాలున్నాయనీ, అవి ద్వితీయ, తృతీయ, సప్తమ అధికరణలనీ, అవి అర్థశాస్త్రానికి పూర్వమే ఉన్నాయని ట్రౌట్ మన్ సూచించినాడు. ఇక ఇతర అధికరణాల రచన కర్తృత్వం మాత్రం స్పష్టంగా లేదు. కాని బహుశా ప్రథమ, అష్టమ అధికరణాలు ద్వితీయాధికరణానికి; చతుర్థ పంచమాధికరణాలు తృతీయధికరణానికి సంబంధించి ఉండవచ్చు. ఆరో అధికరణం ఏడో అధికరణానికి ఆముఖంగా కనిపిస్తుంది. నవమ, దశమాధికరణాలు సయితం సప్తమాధికరణానికి చెందినవే. ఐతే ద్వాదశ త్రయోదశాధికరణాలను పై మూడు గ్రంథాలలో దేనితోనూ సరిపుచ్చడం కష్టం. అర్థశాస్త్రం భిన్న గ్రంథాల సంకలనమనీ, అధ్యక్షప్రచార అనే శీర్షిక ఉన్న ద్వితీయాధికరణమే అన్నింటిలో ప్రథమ గ్రంథమనీ సూచన ఉంది. ఈ విధంగా ఉన్న భిన్న గ్రంథాలను క్రీ.శ. 250 ప్రాంతంలో సంకలనం చేసినారనీ, గ్రంధస్థంగా

ఉన్న సాక్ష్యం ఆధారంగా ద్వితీయాధికరణం క్రీ.శ.150 నాటిదనీ అతని వాదము. తృతీయ చతుర్థ అధికరణాలలోని విషయానికి ధర్మస్మృతులలోని విషయానికీ సంబంధం ఉంది. అందుచేత అవి బహుశా యాజ్ఞవల్క్య స్మృతికంటె పూర్వకాలానివి. సప్తమాధి వీరణంలో విపులంగా చెప్పిన సిద్ధాంతాలు క్రీస్తు పూర్వకాలాన్ని సూచించవు. ప్రస్తుతం లభ్యమవుతున్న అర్థశాస్త్రం అతి ప్రాచీనం కాకపోయినా అందలి శాస్త్ర సంప్రదాయం మాత్రం ధర్మస్మృతి వాఙ్మయం కంటె ముందుది అని ట్రౌట్‌మన్ వాదం. ఉదాహరణకు మనుధర్మశాస్త్రంలోని రాజధర్మ విభాగం సాధారణంగా సూత్ర వాఙ్మయంలో కన్పించదు. బహుశా ఆ విభాగాన్ని ప్రాచీన అర్థశాస్త్రం నుండి మనుధర్మశాస్త్రం గ్రహించి ఉంటుంది.

## ASHOKA AND THE DECLINE OF THE MAURYAS

***Dr. Romilla Thapar,*** *Translated by : Dr. B.S.L. Hanumantharao*



'**అ**శోకుడు - మౌర్యవంశ క్షీణత' గ్రంథాన్ని డా॥ రోమిల్లా థాపర్ రచించారు. వీరు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ప్రాచీన చరిత్రశాఖకు మాజీ అధ్యక్షురాలు. భారతదేశ చరిత్ర రచనలో కొత్త ఒరవడిని దిద్దిన ప్రముఖులలో వీరు ప్రథమశ్రేణిలో ఉన్నారు. జె.ఎన్.యు.లో ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

క్రీ.పూ. 3,4 శతాబ్దాలనాటి మౌర్యుల నాగరికత నేపథ్యాన్ని, దాని సమగ్రచరిత్రను ఈ గ్రంథం విశ్లేషిస్తుంది. అశోకుని శిలాశాసనాలు, మౌర్యుల నాణేలు, వాఙ్మయాధారాలు, భౌతికావశేషాల ఆధారంగా ఆనాటి చరిత్రను వివరించింది. బౌద్ధమత ప్రభావంవల్ల అశోకుని పాలనలో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా, పాలనాపరంగా ఏఏ మార్పులు జరిగాయో ఈ గ్రంథం విశ్లేషించింది. ప్రాచీన భారతదేశం తదనంతర పరిణామాలకు గల సంబంధాలను ఈ గ్రంథం కొత్త కోణంలో వ్యాఖ్యానించింది.

₹ 220/-


విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004